దానికేం వర్షం తగ్గనీయండి. వెళ్దురుగాని అయితే గురువు గారికింకా ఈ జాతకాల పిచ్చి వదల్లేదన్నమాట" అంటూ ఓ గుమాస్తాకి చెప్పి పోలీసుల ద్వారా నాకో టాక్సీని ఏర్పాటు చెయ్యమన్నారు.

ఏదో మాట్లాడుతున్నా – నా ధ్యానమంతా ఆ కేసుల మీదే ఉంది. ఆ కేసులేవీ, నాకు నిజమనిపించలేదు.

ఎంత చెడిపోయిన ఆడదైనా పైటజార్చి పదిమందిలోనూ ఎవర్నీ రమ్మని అడగదు. ఆ మాటే బైటకనేశాను కూడా.

ఈ సుశీలలూ, మేరీలు, సుల్తానాలు వీళ్ళంతా ప్రాస్టిట్యూట్స్. అయితే ఆ కేసులు మాత్రం అబద్ధం. ఇలాంటి కేసులు సంవత్సరానికి యిన్ని పెట్టాలని పోలీసుల రూల్స్ అంచేత మూడ్నెల్లకోసారి ఇలాంటి ప్రాస్టిట్యూట్స్‌ని పట్టుకొని తప్పుడు కేసులు పెడుతూనే ఉంటారు. వాళ్ళు నేరం ఒప్పుకుంటేనే ఉంటారు. మేము శిక్షలు వేస్తూనే ఉంటాం. సూర్యుడు ఉదయిస్తూనే ఉంటాడు. అని ఆగేడు అతను.

"అబద్ధం కేసు అని నువ్వు నమ్మినప్పుడు ఎందుకు కొట్టే కూడదూ?" అడిగేను.

"మిలియన్ డాలర్ ప్రశ్న"

ఎందొక్కొట్టేకూడదూ? మహారాజులా కొట్టేయవచ్చు. కాని చూడండి బీనాదేవి గారు, ఈ కేసులు కొట్టేసినా – శిక్షవేసినా ఈ సుశీలలూ, సుగుణలు – వాళ్ళలా వొళ్ళమ్ముకొనే బతికేస్తారు.

"వాళ్ళమీద అవసరం అయితే తప్పుడు సాక్ష్యం చెప్పే ఈ రిక్షా రావుళ్ళు – వళ్లువంచి బతికేస్తారు".

నేను న్యాయాధికారినే, కాదన్ను

నేను అబద్ధమనుకున్నా – ముద్దాయి వొప్పేసుకున్న కేసు – వొగ్గేస్తే నా ఉద్యోగం ఊడిపోతుంది. అప్పుడు నన్నేం డూటీ జేసుకొని బతకమంటారు?

అయితే మీ కోర్టులో నమ్మిన నిజాన్ని....!"

**(1.12.1980)**

# పుణ్యభూమీ - కళ్ళు తెరు

## 1

"మిసిజ్ రాజమ్మా! హౌ దు యు దూ?" (శ్రీమతి రాజమ్మా! నువ్వు ఎలా ఉన్నావ్?)

"బాగానే వున్నాను." ('ఐయామ్ ఆల్ రైట్')

"మిసిజ్ రాజమ్మా! ఐ హావ్ కం ఫ్రం అమెరికా"

(శ్రీమతి రాజమ్మా! నేను అమెరికా నుండి వచ్చి యుంటిని.) ఐ రిప్రెజంట్ ది 'అమెరికన్ ఏజ్' వన్ ఆఫ్ ది బిగ్గెస్ట్ ఆఫ్ ఆవర్ వీక్లీస్, (అమెరికాలో అత్యంత ప్రసిద్ధి కెక్కిన వార పత్రిక–అమెరికన్ యుగమునకు నేను ప్రతినిధిని.)

"ఊ" (యెస్)

"ఐ హావ్ కమ్ టు మేక్ యు యాన్ ఆఫర్" (నేను నీకు ఒక ప్రతిపాదన యిచ్చుటకు వచ్చినాను.)

"ఏమిటది?" (వాటీజ్ దట్?)

## 2

ఆ చల్లని ఉదయం.

సూర్యుడు ఉదయిస్తూనే బంగారు లేసుతెర కప్పేడు ప్రపంచానికి.

ఆ ఇంట్లోంచి చూస్తే దడిమీద పాదు ఆ తెరలో ఆకుల్లా వుంది.

ఆ వెల్తుర్లో గడ్డిమేటు బంగారు దిబ్బలా ఉంది.

ఇంటి పక్కన ఆవు 'అంబా' అని ఎలుగెత్తి పలికింది.

ఇంటి ముందు కోడిపెట్ట రెక్కలు టప టప లాడించింది. ఆ గాలికి పిల్లలు దొర్లినట్టు పారిపోయాయి.

దూరంగా గాజులు గల గల లాడిస్తున్న ప్రౌఢ స్త్రీలా భారంగా పారుతోంది ఏరు.

ఆవలి గట్టు సరుగుడు తోట గంధర్వుల ఈలలా పాడుతోంది.

ఏట్లో తెరచాప నడిచి వస్తున్న తెలి మబ్బులా వుంది.

దూరాన నీలికొండ నిద్రలేవని పట్టపు రాణిలా వుంది.

దాని మీదున్న తెల్లమబ్బు, దేవతలు వేసిన దోమతెరలా వుంది.

ప్రకృతి అంతా దేవుడు వేసిన బొమ్మలా మనోహరంగా వుంది.

కాని,

ఆ ఇంట్లో,

ఒక మూలని నులక మంచంలో కనలేక-మెలికలు తిరిగి పోతున్న తల్లి పక్కన-ఆమె తల్లి మెదడులో కార్క్ స్క్రూలు తిరుగు తున్నట్లు, తన కడుపులోంచి ఏవో చీలి వెళ్ళిపోతున్నట్టు, యీ జీవితానికి యిక 'రేపు' లేదు అన్నట్టు, చింకి ఆశతో, మాసిన మనసుతో బాధపడుతోంది.

నేలని కూర్చునే కునికిపాట్లు పడుతున్న జిడ్డు మంత్రసాని "ఏటి సేస్తాం? కాలం కాని కాలంలో కడుపు" అంటూ గొణుగు తోంది.

ఇంతలో తనచుట్టూ వున్న ప్రపంచం అంతా ఒక్కసారి మండి భగ్గుమన్నట్టు, తన కడుపులో పేగులు విషసర్పాలై కరి చేస్తున్నట్టు, తను చనిపోతుంటే దేవతకి బదులు దెయ్యం తన కోసం కాచుకొని కూర్చున్నట్టూ, తన తల్లే తన పీక నొక్కినట్టూ, మంచంమీద మనిషి ఇల్లు కదిలి పోయేటట్టూ ఒక్క కేక పెట్టింది.

"అయ్యో నా తల్లే, ఎలాగే? యింకొచ్చేసినాది ఒక్క ఊపియ్యి. ఒక్క చెణం" అంటూ కూతురి తల చేత్తో రాస్తూన్న ముసలమ్మ "నా కూతుర్ని కాపాడు నూకాల్తల్లీ! నీకు సంబరం జేయిస్తాను. ఏట పోతు నేయిస్తాను. నీకు గరగని కట్టిస్తాను. అబం శుబం ఎరుగని ఆ గుంటని తీసికెల్తే నీ ఆకలి తీరదు. ఎయ్యేళ్ళు బతి కిన దాన్ని, ఎనకా ముందూ చూయిప్పినదాన్ని-నన్ను తీసికెళ్ళిపో తల్లీ" అంటూ నూకాల్తల్లిని ప్రార్థించింది.

ఆ తల్లి గుడిలోంచి నడిచి వచ్చేసి రక్తం నాలికతో తనని నాకుతున్నట్టు, ఒక్క తల్లి తప్ప ప్రపంచం అంతా తనని వదిలి వెళ్ళిపోతున్నట్టూ, తన కడుపు తానే చించుకొని చచ్చిపోదామన్న కోరికతో ఊపిరి బిగబట్టి 'అమ్మా' అని కొండలు కదిలి పోయే టట్టు ఒక్క కేకపెట్టి తల పక్కకి వాల్చేసింది మంచంమీది మనిషి.

"ఆడకూతురు" మంత్రసాని అంది.

ఆడకూతుర్ని ఆ అమ్మమ్మ చూడలేదు.

"నా బొట్టికేటై పోనాద్దేఁవుఁడో. నన్ను నట్టేట్లో ముంచీకు నా తల్లో" అంటూ మంచంమీదకు వంగింది.

ఆ మంచంలోని మనిషి కళ్ళు మూసుకుపోయేయి. ఊపిరి ఆగి పోయింది. కళ్ళనుండి బొట బొట కారిన కన్నీరు నల్లని జుత్తుని యింకా నలుపు చేసింది.

"నా కొంప ముంచేసినావే మాలచ్చీ" అంటూ మంచంమీద పడిపోయింది ఆమె తల్లి.

కొన్ని సెకండ్ల తర్వాత....

"ఎలాగుందే పిల్ల" అడిగింది మహలక్ష్మి.

ఆవిడ తల్లి గప్పున లేచి నిల్చుంది.

నిల్చొని, మంచంలో దేవుడు కనిపించినట్టు చూసింది.

మంచంలో మహలక్ష్మి, తలదగ్గర నిల్చున్న తల్లి కళ్ళల్లోకి చూసింది.

తల్లి కంటినుండి రాలిన నీటిముత్యం ఆమె నుదుటి కుంకు మలో పడింది.

కుంకుమ పొంగి కెంపుల పువ్వులా మెరిసింది.

"ఎలా వుందమ్మా పిల్ల?"

"అబ్బ నా తల్లే. అప్పుడే కూతురి మీదికి పోనాదే మనసు!" అంటూ ఆమె తల్లి మంచానికి రెండో పక్క పరిగెత్తి మంత్రసాని వళ్ళో వున్న పిల్లని చూసింది.

"ఎలాగుందంటావా నీ కూతురు? దేవుడికాడ దీపం నాగుంది."

"తెల్లగా వుందా?" ఆశతో అడిగిన తల్లి తన నల్ల గుండెల్ని చూసుకుంది.

"అంతా నీ మొగుడి పోల్తే. దవ్వముక్క నాగుంది".

నీళ్ళుపోసిన పిల్లని తల్లి పక్కలో వేసేరు.

పిల్లవేపు తిరిగింది మహలక్ష్మి.

ఎలక పిల్లలా అమాయకంగా నోరు తెరిచింది పిల్ల.

కడివెడు దుఃఖం కడుపులో దాచుకున్నట్లయింది మహలక్ష్మికి.

"అమ్మా, పిల్లకి ఆకలే."

"యీ పొద్దే పాలిచ్చేద్దావఁనుకుంటున్నా వేటమ్మా? అంతేలే. పదేళ్ళ పంట, నీ కూతురి సంగతి నే చూసుకుంటాగాని, నా కూతురి సంగతి చూసుకోనీ, ముందు యీ కాఫీనీళ్ళు తాగు, నీ కూతురి పాలకో గేదని కొంటాన్లే" అంటూ కాఫీ గ్లాసు అందించి పిల్లని తీసుకుంది ముసలమ్మ.

"అబ్బ ఎంతందంగా వుందే, నీ కూతురు-తాఁవర పువ్వు నాగ. ఏం పేరెడతావే? నీ యత్తపేరెట్టుకో. పెద్దముత్త యిదు - సల్లగెల్లి పోనాది.

# 3

పిల్ల పేరు రాజమ్మ.

రాజమ్మని చూసుకోవడానికి పెళ్ళివారొచ్చారు.

పెళ్ళి కొడుకు సింహాచలం.

రాజమ్మకి మేనత్త కొడుకు.

ఇంటి ఎదురుగా వున్న రావిచెట్టు చప్టామీద కూర్చున్నారు అందరూ.

ఆకుల సందుల్లోంచి ఎండ, పసుపు కళ్ళాపు జల్లినట్టు చపటా చుట్టూ పడుతోంది.

పెళ్ళికొడుకు తల్లి అన్నమ్మకి, కట్టుకున్న కొత్త కోక లొంగడం లేదు. ఆమె భర్త నాగన్న చుట్టకొన కొరికి "ఏటీ ఆలిస్సెం? బస్సుకి టైమైపోతున్నా" అని తొందర చేసేడు.

"మాట్లాడ్డాని కేటుంది? మా లచ్చి మొదిన నెల తప్పిన్నాడను కున్న సమ్మందం" అని అన్నమ్మ "అలాగని కట్నాలెగ్గొట్టడాని కీల్లేదొదినో!" అని కలిపింది.

"ఏటిమ్మంటావ్!"

"ఏటిస్తావో నువ్ సెప్పు' పెళ్ళికొడుకు పారిటీ వోళ్ళం, మమ్మల్ని సెప్మంటావేటి?"

"కొండమీద పెళ్ళి జేస్తాం. కరుసులన్నీ బెట్టుకుంటాం."

"నయ్యం! పెళ్ళికూతుర్నిస్తా మన్నావు గాదు-నీ దరమవాఁ అని"

"ఇంతకీ నా కూతురు నచ్చినాదా?"

"నాకు నచ్చుతే మాత్తరం నా కొడుక్కి నచ్చొద్దేటి? నువ్వెలా సింవంచలం. ఎల్లి పెల్లాన్ని జూసుకొచ్చి. అక్కడ ఊసులాడుతూ కూకోక."

సింహాచలం లేచేడు.

సిగ్గువల్ల వెనక్కి చూడకుండా తల వంచుకొని యింటి వేపు నడిచి వెళ్ళి తలుపు తెరిచాడు.

కిర్రుమన్న తలుపు చప్పుడు అతనికి పిడుగుల చప్పుడులా వినిపించింది.

ఊపిరి బిగబెట్టి అతను లోపలకి తొంగి చూసేడు.

పెళ్ళికూతురు రాజమ్మ పూర్తిగా బట్టలు లేకుండా మంచం మీద పడుకొని గుండెలమీద గొలుసుతో ఆడుకుంటోంది.

ఆమె తొడలు తెల్లగా నున్నగా వున్నాయి.

ఆమె వంటిరంగు పాళా బంగారంలా వుంది.

కిటికీలో నుండి పడిన ఎండ, ఆమె గుండెల పాళా బంగారాన్ని కాసు బంగారంగా మార్చింది.

సింహాచలం దగ్గేడు.

రాజమ్మ అతని వేపు తిరిగింది.

తిరిగి మధురంగా నవ్వింది. నవ్వి రమ్మని కళ్ళతో పిల్చింది.

అతనికి రాజమ్మ నచ్చింది. పూర్తిగా నచ్చింది. అప్పుడే ఆమెని అలాగే చేతుల్లోకి తీసుకొని గుండెలకి గాఢంగా హత్తు కోవాలనిపించింది.

కాని సిగ్గు, కాళ్ళని యింటి యివతలే కట్టేసింది.

అప్పుడు రాజమ్మకి రెండేళ్ళు!

# 4

"ఈ పొద్దు పంట నూరుపుకి పోతున్నాను. తిరిగొచ్చీ సరికి పొద్దుపోద్ది. ఈ సాయంకాలం బుగతగోరి పన్లోకి నువ్వే ఎల్లు రాజమ్మా" అంది మహాలక్ష్మి.

కూర్చుని కోళ్ళకి మేత పెడ్తున్న రాజమ్మ, తవుడు తలకి తగలకుండా ముంజేత్తో జుత్తు సవరించుకుంటూ లేచి నిల్చుంది.

అప్పుడు అతి నల్లని ఆమె జుత్తు గాలికి రేగి చంద్రుడ్ని మింగె య్యడానికి వచ్చిన కారు మేఘంలా ఆమె మొహాన్ని చుట్టు కుంది.

ఎవరో చెక్కిన సుందర విగ్రహం ప్రాణం వచ్చి నడచి వచ్చేసినట్టు వుందామె.

జాకెట్టు లేని ఆమె రెండు గుండెలూ ఒక్కసారి చూస్తే లోకం తట్టుకోలేదన్నట్టు ఆమె పైట ఒక వైపు మాత్రం కప్పింది.

మోకాళ్ళ వరకూ ఎగకట్టిన ఆమె చీర దిగువన కాళ్ళు, దంతానికి వెన్న రాసినట్టు మెరిసిపోతున్నాయి.

నవ్విన ఆమె పళ్ళలో బంగారు సూర్యకాంతి మెరిసింది.

"ఏటలా జూస్తున్నావ్, ఇచిత్తరంగా! నువ్వెల్తావా? నన్నే సవ్వమంటావా?" రెట్టించింది మహాలక్ష్మి.

"ఎక్కడికి?"

"అయ్యో మాలోకవాఁ? ఎక్కడుందే నీ మనసు?"

"నాకాడే" అన్లేదు రాజమ్మ.

"ఏటో ఆ మారాజుంటే అన్నీ సూసుకునీవోడు. పోతూ పోతూ యీలంపటాలన్నీ నా కంటగట్టి పోనాడు" చచ్చిపోయిన భర్తని మహలక్ష్మి సాధించింది.

"ఇపుడేటైంది గనక?" విసుక్కుంది రాజమ్మ.

మహలక్ష్మి మాట్లాడలేదు. ఒక్కసారి రాజమ్మ అత్తవారింటికి వెళ్ళి పోతే తను ఒక్కర్తే ఎలా ఉండగలను అన్న ఆలోచన వేయిపడగల పాములా తల ఎత్తింది.

ఆ ఆలోచన రాగానే ప్రపంచం అంతా ఒక్కసారిగా భగ్గుమని మండిపోయినట్టనిపించింది ఆమెకు. ఎవరో తనని వెనకనుండి నిప్పుల నూతిలోకి తోసేస్తున్నట్టే ఆమె భయపడింది.

ఏదో అనబోతే ఆమె నోట మాట రాలేదు. ఆమె పెదవుల వణుకు చూసి రాజమ్మ ఆత్రంగా "ఏటైందమ్మా" అంది.

"ఎల్నాళ్ళుంచుకునీది?" కలలో మాటాడుతున్న మనిషిలా అంది మహలక్ష్మి.

"ఎవర్ని?"

"నిన్నే!"

"ఎక్కడికి అంపించేస్తావు?"

"నీ బావ కాడికి."

"ఎందుకూ?"

"ఎందుకా? కిందటోరం సింవంచలం నిన్ను గడ్డిమేటు ఎనక్కి...."

బజార్లో బట్టలు విప్పి తనని సింహాచలం పబ్లిగ్గా ముద్దు పెట్టుకుంటున్నట్టు సిగ్గుపడి "సీ! పో!" అంది రాజమ్మ.

దూది బొమ్మల్లాంటి కోడిపిల్లలు ఆమె కాళ్ళకి కితకితలు పెట్టాయి. వాటి తల్లి ఆకాశంలో గెద్ద కోసం చూసింది. దాన్ని ఒక పుంజు గెద్దలా వెంట తరిమింది.

కడుపు నిండా పాలు తాగిన ఆవు దూడ తోక ఎత్తి గెంతులు వేస్తోంది.

రాజమ్మ గుండెల్లో యేదో భారంగా కదిలింది.

"నువ్వే పోతావో-నేనే పోతానో!" వేదాంతిలా అంది మహలక్ష్మి.

"...."

"ఒచ్చే నెల మూర్తం ఎట్టమను బుగతని."

"సి స్సీ"

"పోనీ నేనే అడుగుతాను గాని యీపూట బుగతగోరి పన్లో కన్నా ఎల్లు."

"ఎల్తాలే"

# 5

శీతాకాలం, సాయంత్రం నాలుగైంది.

ఎండలో వెచ్చదనం లేదు.

బుగత వెంకన్న పంతులు ఇంటిముందున్న అరుగుమీద కూర్చుని కదురుతో జంధ్యాలు వడుక్కుంటున్నాడు.

పండుగ అతని యింటికి పట్టుబట్టలు కట్టుకొని వచ్చినట్టు-ఇల్లంతా పచ్చగా-అప్పుడే వచ్చిన కూతుళ్ళూ, అల్లుళ్ళూ, మనవలతో సందడిగా వుంది. అతని ఎదురుగా అతని భార్య శ్రీలక్ష్మి కూర్చుని వుంది. పండినదంతా కోసుకోగలిగిన మనిషి మొహంలా ఆమె మొహం సంతుష్టిగా వుంది.

బంధువులకి పెట్టవలసిన బట్టల గురించి భర్తతోనూ, ఆరోగ్యం కోసం తీసుకోవలసిన జాగ్రత్తల గురించి కొడుకు నరసింహమూర్తితోనూ ఆమె ఒక్క గుక్కలో చెప్తోంది. "ఆఖరి దానికి యిదే మొదటి పండుగ. అంచేత దానికి కనీసం కంచి పట్టుచీరన్నా పట్రండి. ఏఁవిఁట్రా నాన్నా, యిది బుర్రే? సన్నాసిలా ఏఁవిఁటా జులపాలు? రేప్పొద్దునే మీరు పట్నం మొదటి బస్సుకే వెళ్ళండి. రేప్పొద్దున్నే లేవరా నాన్నా, నీకు తలంటేస్తా, రేపొద్దులే. ఎల్లుండి అంటుతా. రేపు ఆవదంపడతా. పట్నంలో నువ్వెప్పుడైనా ఆవఁదం తాగేవుట్రా! ఆఖరి అల్లుడు రేపొస్తాట్ట."

మూడొంతులు కళ్ళు మూసుకున్న నరసింహమూర్తికి ఇంటి ముందు బంగారం మెరిసి నట్టనిపించింది.

"పెద్దల్లుడికి సెలవు యివ్వరుట. అతగాడు రేపు కూడా రాట్ట. పండగ క్కూడా సెలవివ్వనిది అదేం ఉద్యోగమో? ఏవేఁ రాణీగారూ! మీ అమ్మేదీ?" అంటూ ఆగింది శ్రీదేవి.

ఆమె ఎదురుగా సరదాకి బీదవేషం వేసుకున్న రాజు కూతురిలా నిలబడింది రాజమ్మ.

సిగ్గుకి పొంగిన ఆమె బుగ్గలు మూతిని మరీ చిన్నవి చేసేయి.

భయంవల్ల ఆమె కళ్ళు మరీ పెద్దవి అయ్యేయి. యేదో వరం వల్ల ఒక్కసారి ఎదిగిపోయిన పసిపిల్లలా చాలా అమాయకంగా నిలబడింది ఆమె.

"మాటాడవేమే నంగనాచీ మీ యమ్మేదీ?"

"పన్లోకెల్లినాది."

"నువ్వెక్కడ దొరికేవే తల్లీ నాకూ, గుండెలు తీసిన బంటువి? పన్లోకెందుకు రాలేదే మీ అమ్మా అంటే–చిన్నా పెద్దా–భయం భక్తీ లేకుండా–రంచన్‌గా నిలబడి పన్లోకి వెళ్ళిందంటావా? మరైతే నువ్వెందుకొచ్చేవ్? మాట చెప్పడానికా?"

నరసింహమూర్తిలో మాతృద్రోహం తలెత్తింది.

తనకి తల్లంటే అంతవరకూ గౌరవమే కాని, ఆమె నీ చక్కదనాల చుక్కనీ, అందాల భరిణనీ, పట్టుకొని ఇలా కడిగెయ్యడం అతనికి నచ్చలేదు.

"నాను జేస్తాను పని" నిలబడింది రాజమ్మ.

"మరామాట ముందు చెప్పి చావ్వేమే నీ యమ్మకడుపు బంగారం గానూ! పద! పద!!

ఇంటినిండా చుట్టాలూ, చేతినిండా పనీ వున్నాయి. గవర్నమెంటు సర్వీసులో వుంటే యేనాడో రిటైరైపోయేదాన్ని. ఈ గుండంలో పడ్డాక యిహ చచ్చిన్నాడే తీరుబడి. ముందు అంట్లు అఘోరిద్దుగాని, పెరట్లోకి నడు. మీరు ఉడాయించేకండి పేకాటకి, ఈ రెండ్రోజులూ అల్లుళ్ళున్నారని గ్రహించి తిరగండి. అంటే తిరక్కండి" అంటూ లేచింది శ్రీలక్ష్మి.

ఆమె వెళ్ళిపోయాక గాలివాన ఒక్కసారి వెలసినట్లయింది బుగతకి.

కాని....

అప్పుడే గాలివాన మొదలు పెట్టి నట్లనిపించింది నరసింహమూర్తికి. అతనికి అప్పటికి ఇరవయ్యో ఏడు. ఇరవయ్యో ఏట కలిగే కోరిక అతనిలో రెండేళ్ళ క్రిందటే ప్రవేశించింది. అది, సినిమాలలో మైథున నృత్యాలూ, బూతు పుస్తకాలూ మేసి వయసొచ్చిన ఏనుగు పిల్లలా తయారైంది.

# 6

భోగిపళ్ళు పోసుకున్న పసిపిల్లలా, భోగిపండుగ వుంటే పట్టు చీర కట్టుకున్న పడుచులా వుంది సంక్రాంతి? పండుగ రెండు రోజులూ మహలక్ష్మి బుగతగారి పనిలోకి వెళ్ళలేక పోయింది. అందుచేత రాజమ్మే చేసింది పని అంతా.

సంక్రాంతి ఉదయం పని పూర్తి చేసిన రాజమ్మపోతూ వుంటే బుగతగారి భార్య పిలిచి అన్నం, కూరలూ ఇచ్చింది. ఆవిడ కూతుళ్ళూ, కోడళ్ళూ తలో అణా ఇచ్చేరు.

రాజమ్మ తల గిర్రుమని తిరిగింది. ఆమె చేతిలో ఆరణాలూ ఆరు బాంబులు అయినట్టూ, తనకి ఏనుగుబలం వచ్చినట్టూ అనిపించింది. అంత వరకూ ఆమె ఆస్తి ఏనాడూ దమ్మిడీ దాటలేదు. ఆరణాలు రాగానే బీడీ దుకాణంవాడు బిర్లా కంపెనీ డైరెక్టరు అయితే ఎలా ఫీలౌతాడో అలా ఫీలయింది.

ఈ ఆరణాలూ అమ్మకి ఇచ్చేస్తే ఎంత బాగుంటుంది!

పాల సముద్రంలోంచి దేవుడు లేచి చిరునవ్వు నవ్వి నట్టుంటుంది.

నడచి వెళ్తున్న రాజమ్మ అరచెయ్యి విప్పింది. చేతిలో అణాలు ఎర్రటి ఎండలో బంగారు పువ్వుల్లా మెరిసేయి, అవి అమ్మకు ఇచ్చేస్తే?

రంగుల రాట్నం–నల్లగాజులు–పంచదార చిలకా వుండవు. తను వెళ్ళబోయే తీర్థం ఎండిపోయిన ఏరులా వుంటుంది.

కాని అమ్మకి ఇవ్వకపోతే–పాపం అమ్మ! పాపం! పాపం!!

ఇస్తే–ఇచ్చేస్తే?

రాట్నం రంగులు కళ్ళలో తిరిగేయి.

ఆమె చెవిలో వెయ్యి అణాలు ఏవో చెప్తున్నాయి.

"రాజమ్మా...."

తుళ్ళిపడింది రాజమ్మ. ఆమెకి ఎదురుగుండా నరసిమ్మూర్తి సిల్లీగా నవ్వుతూ నిలబడ్డాడు.

"ఎక్కడికి వెళ్తున్నావే?"

"కళ్ళం కాడికి."

మాట తోచలేదు నరసింహమ్మూర్తికి. అందుచేత మరి కొంచెం సిల్లీగా నవ్వేడు. రాయబారం ఎలా మొదలు పెట్టాలో తెలియని ఎంబాసిడరులా ఫీలయేడు అతను.

"సాయంత్రం పన్లోకి వస్తావా?"

"అమ్మొస్తాది."

"నువ్వో?"

"తీర్థాని కెళ్తా."

"మరయితే పండుగ దబ్బులడగవేం?"

"ఇచ్చినారు."

'ఎంత?"

"ఆరణాలు."

"ఓస్ ఇంతేనా!" అంటూ జేబులోంచి అర్ధరూపాయి తీసేడు. అతని కళ్ళు వెండి రూపాయల్లా మెరిసేయి.

"ఇంద."

"నాకొద్దు."

"ఏం?"

"....."

"ఇంట్లో ఇస్తే పుచ్చుకున్నావుగా" లాజిక్కు బాగుంది.

"తీసుకో."

# 7

చుర్రుమన్న శీతాకాలం ఎండ మలుపు తిరిగింది. తీర్థం దుమ్ము-దూరానికి సాయంత్రం ఎర్రని ఎండలో, భూమి మీదికి దిగిన కుంకుమ మేఘంలా వుంది. పడమటి కొండలు ఊదా ముసుగులు కప్పుకున్నాయి.

తీర్థం చాలా హుషారుగా వుంది. చెమటకి తడిసిన జాకెట్ల రంగుల చిక్కదనం-గలగల్లాడే గాజుల మీద ధూళి-కోడికాలి నెత్తుటి వెచ్చదనం-వండుతున్న కొత్త బెల్లం కమ్మటి వాసన - పంచదార చిలకల మూగతనం-గిర్రున తిరిగే రంగులరాట్నం రంగుల తెలుపూ....

పొలాల అడ్డుతోవని వచ్చేస్తున్న రాజమ్మ, పొలం గట్టున పూసిన పిచ్చి పువ్వుని కాలితో తన్నింది. పువ్వు గాలిలో ఊగింది. గట్టున ఆగిన రాజమ్మ వెనక్కి తిరిగి చూసింది.

ప్రకృతి చూలాలుగా నిండుగా ఉంది.

ఆమె సీమంతానికి అన్నీ ఎర్రగాజులే తొడుగుతున్నాడు అస్తమిస్తున్న సూర్యుడు.

వెనక్కి చూసిన రాజమ్మకి దూరంగా ఉన్నారు ప్రజ, తనని ఏ రౌడీ వెధవో అడ్డుకొని తన దగ్గరున్న అర్ధరూపాయి (నరసి మ్మూరితి బాబిచ్చింది) లాక్కుంటే!

అడుగు రెట్టించింది రాజమ్మ.

'ఇంకేటుంది. అదిగో కరణంగోరి తోట మలుపు తిరిగితే అరకోసుంటాది తనూరు.'

తోట మలుపులో కనిపించేదు నరసింహమూర్తి.

"తీర్థం అయిపోయిందా?"

"రచ్చించినావ్ దేఁవుఁడు నాగ. ఒక్కర్తి దాన్నీ - భయపడి పోనాను."

క్షణంలో మాయమయ్యే సూర్యుడు కొండ నెత్తిని యెక్కి కూర్చున్నాడు.

రాజమ్మా, నరసింహమూర్తి ఏమీ మాటాడకుండానే నడు స్తున్నారు.

బుగతగారి లేత కొబ్బరి తోట వచ్చేసింది. లేత చెట్టు పెళ్ళీడు పిల్లల్లా కళకళలాడుతున్నాయి.

పాకవార వేసిన గడ్డిమేట్లు గమ్మత్తయిన వాసన వేస్తున్నాయి. పాలు పితికిన బుగతగారి పాలికాపు పాలు పట్టుకు వెళ్ళి పోతు న్నాడు. తోట అంతా కాళీగా ఉంది.

"ఇక్కడ కూర్చుందామా?"

"సీకటడిపోనాది"

"ఫర్వాలేదు".

"అలిసెం అయితే అమ్మ తంతాది."

ఏం చెయ్యడమో తెలియని నరసింహమూర్తి అకస్మాత్తుగా రాజమ్మని పట్టుకొని గాఢంగా అదుముకున్నాడు. అందమైన అతని మొహం ఆవేశంతో వంకర్లు పోతూంది.

రాజమ్మకి ఏమిటి అవుతూందో తెలియడం లేదు.

ఆమె ఎముకల్లో ఏదో-పలుచని నీళ్ళు కదలినట్టు అయింది.

ఆమె మనసుకు మల్లెవాసన వేసింది.

ఆమె గుండెల్లో ఏదో అకస్మాత్తుగా పుట్టి క్షణం క్షణం పెద్దదై గుండెల్ని బద్దలు చేస్తున్నట్టనిపించింది.

కాని అంతలోనే తన కదుపులో చచ్చిపోతున్న పిల్ల మూలిగి నట్టూ, తన కళ్ళెదుటే అమ్మ శవం తగలబడిపోతున్నట్టూ-తను

ఏదో కొండమీద నుంచి యెన్నో గంటల నుండీ పడుతున్నట్టూ – రాజమ్మకి అనిపించింది.

ఆమె చేతులు కూడదీసుకునే లోగా, పళ్ళు గాటుపడేటట్టు అతను కరిచేడు...రాజమ్మ ఒక్క తోపుతో విసిరేసింది అతన్ని.

"రాజమ్మా–"

"సిస్సీ! నా నెవరనుకున్నావ్! ఇంద నీ ఎదవ అర్థ రూపాయి"

# 8

"ఎక్కడివే ఈ గాజులు" అన్నం పెడుతున్న మహలక్ష్మి ఆదరంగా అడిగింది.

"నరిసిమ్మూర్తి బాబు" ...... మాట తడబడిపోయింది రాజమ్మకి.

నరసింహమూర్తి బాబుగారి ఆడవాళ్ళు ఇచ్చేరన్న నిజం కలుపుదామనుకుంది కాని కలపలేక పోయింది.

అన్నం తింటున్న రాజమ్మ పక్కని కూర్చున్నది మహలక్ష్మి.

తెల్లపురుగుల్లా అన్నం కనిపిస్తోంది రాజమ్మకి.

"ఈ పొద్దేటొచ్చిందే నీకు?"

"ఏవ్నేదు!"

"ఎంత బాగున్నాయి నల్లగాజులు."

బాగా చూడమన్నట్టు ఎడమ చెయ్యి చాపింది రాజమ్మ. నల్లగాజులు తొడుక్కున్న దంతంబొమ్మ చెయ్యిలా అతి అందంగా ఉంది ఆ చెయ్యి.

"ఏదా దీపం ఇటెట్టు, నాకు సూపు ఆన్నేదు" అంది మహలక్ష్మి.

గాజులు దీపం దగ్గరగా పెట్టి చూసింది మహలక్ష్మి.

గాజుకో ఎఱ్రపొడి పొదిగినట్టు గాజుల్లో మెరిసింది దీపం.

కూతురిచేతిన కెంపుల గాజులు చూసినట్టు సంతోషిస్తున్న మహలక్ష్మికి రాజమ్మ చెంప అకస్మాత్తుగా కనిపించింది.

"ఏటే బుగ్గమీద...."

"నరిసిమ్మూర్తి బాబు.....?"

చెంప పగిలింది.

తల్లికి తన కడుపు పగిలినట్లనిపించింది.

"ఒచ్చీ వోరం సివంచలానికి కబురంపుతా."

"నా మాట నమ్ము."

"నిన్నాడికాడికి అంపేస్తేగాని...."

# 9

పట్నంలో సినిమా చూసి వచ్చిన రాజమ్మా, సింహాచలం తమ కళ్ళం చేరేరు. నిండుగా పండిన వరిచేను అలసిపోయిన గర్భవతిలా వాలి పోయింది.

తుమ్మల ముళ్ళలో చిక్కుకున్న చంద్రుడు ముళ్ళు వదిలించుకొని బయటపడ్డాడు.

గడ్డిమేటు వాసన కడుపు నింపుతున్నాది.

వెన్నెల నీడలో గడ్డిమేటు వార సింహాచలం కూర్చున్నాడు. అతని పక్కని కూర్చున్న రాజమ్మకి, ఇందాక చూసిన సినిమాలో హీరో, హీరోయిన్ని తన ఒడిలోకి లాక్కున్నట్టు సింహాచలం లాక్కుంటే బాగుండుననిపించింది. కాని సింహాచలానికి అలా అనిపించలేదు. ఇందాక సినీమా హాలు దగ్గర కొన్న పకోడీలు తినాలనిపించి పొట్లాం విప్పేడు.

పొట్లాం విప్పిన సింహాచలం పకోడీ నోట్లో పెట్టుకుని నమలడం ఆరంభించేడు.

"ఇందాక సినీమాలో హీరో పాలు సగం తాగి...."

సింహాచలానికి సినీమా సరదా లేదు. సినీమాలలో మనిషిలా ఉండాలన్న కోరిక అసలే లేదు. కాని రాజమ్మకి సినీమాల సరదా! అందులోనూ ఇందాక సినీమాలో హీరోయిన్ ఆమెను దెయ్యంలా పట్టుకుంది. ఆ హీరోయిన్ లాగే ఆమె సింహాచలంతో తను కడుపుతో ఉన్నానని చెప్పాలని అనిపించింది. హీరోయిన్ మేజోళ్ళు అల్లి హీరోకీ, నిమ్మకాయ తిని అత్తకీ తన గర్భం సంగతి తెలియ చెప్పింది.

మేజోళ్ళు ఊలుతో అల్లుతారు. గడ్డితో అల్లరు. రాజమ్మ దగ్గర గడ్డే ఉంది. ఐనా రెండు గడ్డి పరకలు నిట్టింగ్ నీడిల్స్‌లా పట్టుకుంది ఆమె.

సింహాచలానికి పకోడీలు బాగున్నాయి. అతను ఆమె కేసే చూడలేదు.

గడ్డిపుల్లలు పారేసిన రాజమ్మ, సింహాచలానికి దగ్గరగా జరిగింది.

"మాంవాం!"

"పకోడీలు గావాలా?"

"…………"

"ఇంద."

"సింతకాయ కోస్తావా?"

"అర్థరేత్తి రేటీ ఎఱ్ఱిబుద్ధి?"

ఛి! ఛీ!! తన మావంకేవీ! తెలీదు. ఎలా అతనికి సినిమా టిక్‌గా చెప్పడం.

"నువ్వు త్వరలో తండ్రివి కాబోతున్నావ్' అని చెప్తే! అలా అలా అనడానికి నోరాడలేదు ఆమెకు. అంచేత "మావా! నాను కడుపుతో వున్నాను".

"ఏటీ?" పకోడీలు పడేసిన సింహాచలం ఒక్కసారి లేచి నిల్చుని అమాంతం రాజమ్మని ఎత్తుకుని గిర్రున తిరిగేడు.

# 10

అలసిపోయిన రాజమ్మ, సింహాచలం గుండెలమీద తల పెట్టుకుని కళ్ళు మూసుకుంది.

పాకలో తల్లి గుర్తుకు వచ్చిన ఆవుపెయ్య, అమ్మని పిలిచింది.

గడ్డిమేటుమీంచి రాజమ్మని తొంగిచూసిన చంద్రుడు సిగ్గు పడి, మబ్బులో దూరిపోయేడు.

విడిపోయిన రాజమ్మ కొప్పులోంచి వాడిపోయిన మల్లెదండ, భక్తుడు సమర్పించిన మల్లెదండలా సింహాచలం గుండెలమీద పడింది.

"మాంవాం!"

"హు."

"మనం ఎప్పుడూ ఇలా గుండిపోతే!"

"పొద్దున్నయ్యాసరికి పేడకుప్ప పిలుస్తాది."

# 11

"అప్పుడే ఎలా గొచ్చేసినావ్?" మొగలి పువ్వు కిలకిల నవ్వినట్లు అయింది–చెరుకుతోట మలుపు తిరిగిన సింహా చలానికి రాజమ్మ మాట.

ఒంటరిగా చెరుకు ఆకు చుదుతున్న ఆమె అతనికి ఎదురుగా భూమిలోంచి పుట్టుకు వచ్చిన దంతపు మొక్కలా నిలబడి ఉంది.

ఆమె మీద నుండి వచ్చిన గాలికి గులాబీ వాసన వచ్చినట్టు అనిపించిందతనికి.

అంతలోనే అతను తను పూజజేస్తున్న దేవత వెనక, పది తలల రాక్షసుడ్ని చూసినట్టు జడుసుకొని "అమ్మ కెలావుంది?" అన్నాడు.

"పేన భయం నేదుగాని బేగి పెద్దాసుపత్తిరికి తీసుకు పొమ్మన్నారు డాట్రుబాబు."

"మాటొచ్చినాదా?"

"కుసింతొచ్చినాదిగాని–సూపు ఎఱ్ఱి సూపు పడిపోనాది."

"సర్లే." చేతకానివాడి నిర్లక్ష్యంలా కనిపించే నిరాశ అతని కంఠంలో కనిపించింది.

ఇద్దరూ కళ్ళంలో పాక దగ్గరికి నడిచి వెళ్ళేరు. కాళ్ళూ, చేతులూ కడుక్కొని నులక మంచంమీద పడుకున్న సింహాచలం మొహం, అతని పెంపుడుకుక్క దుర్యోధనుడి వళ్ళు గాందారి తడిమినట్టు అతిప్రేమగా నాకుతోంది.

బాదం చెట్టుకింద బండమీద కూర్చున్న రాజమ్మ గిన్నెలో అన్నం వడ్డిస్తూ "వణ్ణానికి నెగు" అంది.

"సిస్సీ ఎదమ్ముండా" అంటూ సింహాచలం కుక్క కడుపులో ఒక్క తాపు తన్నేడు.

ఉలిక్కిపడిన రాజమ్మ "సేతకానోడు సంటిదాన్ని కొట్టేడని, దాన్ని తంతావెందుకూ నోరులేని ముండని?" అని సణుక్కుంది.

పడుకున్న సింహాచలం లేచి బద్ధకంగా మంచంమీద కూర్చున్నాడు.

అతను మంచి కాలంలో వున్నా, సర్కస్ జంతువులా సగం చిక్కి వున్నాడు.

జబ్బుకు సగం లొంగిపోతున్న ఆరోగ్యవంతుడిలా వుంటాడు కాని, ఆరోగ్యం కోలుకుంటున్న రోగిలా వుండదు అతను.

దురద గోక్కున్నప్పుడు తప్ప సుఖం ఎరగని జీవిలా అతి దీనంగా వుంది అతడి మొహం.

"నా కాకలి నేదే."

"అలిగిన ఆడదన్నాగా వణ్ణం మానీసి ఏట్నాబం? నెగు నెగు" తొందరచేసింది రాజమ్మ.

గిన్నెడు లేహ్యం తినవలసి వచ్చిన రోగిలా వెళ్ళేడు చెట్టుకింద బండమీదకి అతను.

అతని చుట్టూ ఆకుల సందుల్లోంచి పడుతున్న పసుపు పచ్చని ఎండ పెద్ద పులి మచ్చల్లా వుంది.

చాలాచోట్ల తాటాకులు ఎగిరిపోయిన పక్కనున్న పశువుల పాక నక్కలు తిని వదిలేసిన ఏనుగు కళేబరంలా వుంది.

దుఃఖం కడుపున పుట్టిన నిరాశలా నిలబడ్డాది తల్లిపక్కన ఆవుపెయ్య.

గిన్నెలో పచ్చడి వెయ్యబోతున్న రాజమ్మ అపరాధిలా "బాప నమ్మ ఎట్టినాది" అని పచ్చడి తెచ్చిన తప్పుకి సంజాయిషీ చెప్పి ఎప్రూవల్ కోసం అన్నట్టు అతని కళ్ళల్లోకి చూసింది.

అతను వీక్‌గా నవ్వేడు. పిడకలు అమ్మి చదివించిన తల్లితో పరీక్ష పోయిందని చెప్పే కుర్రాడి వెర్రినవ్వు అది.

పచ్చడిలో చెయ్యి పెట్టిన రాజమ్మ తేలు కుట్టినట్టు చెయ్యి లాగేసుకొని, వెనక్కి పెట్టి "అమ్మా" అనబోయి మానేసింది.

తను చెక్కిన మార్బుల్ బొమ్మ కళ్ళల్లో నీళ్ళు తిరగడం చూసిన శిల్పిలా ఫీలయ్యేడు సింహాచలం.

బలవంతంగా ఆమె చెయ్యి ముందుకు లాగేడు అతను. ఆమె అరచెయ్యి గట్టిగా బిగించేసింది.

"సెయ్యి సూడ్నీ"

చూపించింది.

పురుగులు తినేసిన గులాబీలా వుంది ఆమె అరచెయ్యి.

చెరుకుతోట ఆకు చుట్టడంలో ఆమె చెయ్యి అంతా చీరుకు పోయింది.

"రేపుటికి పోతాదిలే" సముదాయించింది.

"దెబ్బన్నా పోతాది, లేకపోతే మనవంన్నా పోతాం."

"సిస్సీ! ఏటామాట్లు! ఇప్పుడేటై పోనాదని? పెతి యేడూ తోట సుదుతూనే వున్నాంగదా, పెతి ఏడూ తెగుతూనే వుంది గదా?"

"అదే నా నసీదీన్నీ. ఏన్నేళ్ళు మనం యిలా సేతులు తెగ్గోసు కోవాలా అని?"

"అంటే ఏటి సువ్వనేది?"

"నాను గోసీ ఎట్టిన కాడ్నించీ యీ గట్టుని గడ్డి కోస్తూనే వున్నాను. ఈ "బీటిని పశువుల్ని మేపుతూనే వున్నాను. ఈ సెక్కకి నీరెట్టి దున్నుతూనే వున్నాను. పెతీ యేడూ దాన్యవోం, సెరుకో ఏస్తూనే ఉన్నాను.

ఆఖరికి మనకి యేటి మిగుల్తున్నాది? సెరుకు పిప్పీ, యెండుగడ్డీ తప్ప.

మా తాతకి ఆరెకరాలుండీయట.

మా అయ్యకి మూడెకరాలు మిగిల్నాయి.

నాకేటి మిగిల్నాది? ఆరెకరా సెక్కా తీరసలేని అప్పు తప్ప." మానసికంగా అలసిపోయి ఆగి "నా కొడుక్కి యేటి మిగులుద్ది? సేతికి సిప్పా కర్రా తప్పిస్తే" అని ఆపేడు.

"నేదులే మాంమాం. మనోడిది మంచి నచ్చితరవేంనట – పంతులు సెప్పినాడు."

"సుక్కల్నీ, సూరీణ్నీ నమ్ముకోవాలి మనం. అంతకు మించి ఏటి ఆశ మనలాటోళ్ళకి?"

"పెపంచికం దరమవే అంత గదయ్యా! మనలాటోళ్ళం కష్టపడ్డానికే పుడతాం."

"అని ఎవురన్నారు? ఎక్కడుందీ శాత్తరం? మనం కడుపు మాడుసుకోడానికే భగవంతుడు మనల్ని పుట్టించినాడని ఎందు కనుకోవాలి? అనుకుంటే మాత్తరం ఎందుకూరుకోవాలి?"

"ఈ లీడరు కబుర్లకేం గాని సావుకోరు ఏటన్నాడు? డబ్బిచ్చి నాడా?"

"పెపంచికంలో అందరు సావుకోర్లూ ఏటంటారో అదే అన్నాడు. పాత బాకీ ముందు కక్కు అన్నాడు. నేకపోతే కొత్త సరుకు దుకాణానికి అట్టుకురా, అప్పుడు గాని–సేత కాణీ సూడవ్ – అన్నాడు"

"బెల్లాలాడేసరికి నెలవుద్దే. ఇప్పుడు సరుకెలా గొస్తాదని అడగ నేక పోనావా?"

"అడగనేదు. సచ్చిన సెట్టునీ, గుళ్ళో బొమ్మనీ అడిగినా నాబం వుండొచ్చుగాని, ఆ సావుకోరు నడిగి నాబం నేదు."

"మరి మీ యమ్మని...."

"పట్నం ఆసుపత్రికి తీసుకెళ్ళాలి. తీసికెళ్ళకపోతే అది సస్తాది. డబ్బడిగితే సావుకోరు సస్తాడు. ఈళ్ళిద్దరి మద్దెనా నానుసస్తన్నాను."

"ఇప్పుడేటి సేద్దారి?"

"సావుకోర్ని సంపెయ్యాల, నేకపోతే మనం సచ్చిపోవాలి."

"ఈ అసుకు కబుర్లకేం గాని."

"రేత్తిరి గవంర్రాజు మాఁవకాడి కెల్దారనుకుంటున్నాను."

# 12

సింహాచలం పాటల్లో నాయుడు బావలా వుండడు.

అతను సింహంలా కూడా వుండడు.

అచలంలా అసలే వుండడు.

పులిలా కూడా వుండడు.

డబుల్ టైఫాయిడ్ పడిన నక్కలా ఉంటాడు.

అతనికి ఏళ్ళు ముప్పై వుండవు.

అతని తాతకి ఆరెకరాలుండేవిట.

అతనికి అరెకరా మిగిలింది.

అతని కుటుంబంలో-బంగారపు బొమ్మగా భార్యా, దిష్టి బొమ్మలా తల్లీ, ఒక కొడుకూ, తరతరాల వేదాంతం వున్నాయి.

"దేవుడు మనుషుల్ని రెండు రకాలుగా పుట్టించేడు" అని అతని వేదాంతం.

మంచివాళ్ళూ-చెడ్డవాళ్ళూ.

ఆరోగ్యవంతులూ-రోగిష్టులూ.

ఆడా - మగా.

చిన్నా - పెద్దా.

పుణ్యాత్ములూ-పాపాత్ములూ,

కమ్యూనిస్టులూ-ఇంపీరియలిస్టులూ,

ఇలాక్కాదు

మరి...........

సుఖపడవలసిన వాళ్ళు-కష్టపడ్డా ఫలం దక్కని వాళ్ళూ,

అంతే.

దేఁవుఁడే లేకపోతే?

నోటికాడ కొచ్చిన పంటని పెతి ఏడూ దొంగేరు ఎందుకు కబళించేస్తాది?

క్రేను మీంచి జారిపడిన రాయి బ్రిడ్జి కట్టుబడిలో పనిచేస్తున్న తన తండ్రి నెత్తినే సరిగ్గా ఎందుకు పడతాది?

ఇంత మంది వూళ్ళో వుండగా, సరిగా తన తల్లికే పచ్చ వాతం ఎందుకొస్తాది?

సెరుకు తోట ఎయ్యటానికి అప్పిచ్చిన సావుకారు, తల్లి వొయిజ్యానికి ఎందుకు అప్పు యివ్వడు?

ఆ బాబే నేకపోతే సుక్కల్లో పువ్వు-పువ్వుల్లో సుక్కా అయిన రాజమ్మ తననే ఎందుకు పెళ్ళి చేసుకుంటాది? సేసుకున్నా వొగ్గేకుండా సీతమ్మోర్లా ఎందుకుండిపోద్ది?

ఇంత వేదాంతం తరతరాలుగా వంటబట్టిన వాళ్ల యిళ్లల్లో పిల్లలు ముసిలి మనసుతో పుట్టినట్టే సింహాచలం కూడా పుట్టేడు.

పుట్టినోడు సచ్చీదయిర్యం నేక సావులాంటి బతుకు బతుకు తున్నాడు.

అతని గులాబీ కలలూ-పన్నీటి వానలూ-పూల జల్లులూ - వేణుగానం- వీణానాదం-ఏమీ వుండవు.

అతనికి నిద్ర పోతున్నప్పుడూ, మెలకువగా వున్నప్పుడూ కనిపించేవి-పులికోర, షావుకారి పంజా-దొంగ ఏరు పాము మెలికా-మంచంలో నీడలా నిస్సహాయంగా సగం చచ్చిపడి వున్న తల్లి గొంతులోంచి బయట పడిన దగ్గూ-పశువుల మందలో పిల్ల పశువులా కలసిపోయిన తన కొడుకూ.

"ఎనక జనమలో ఏ పుచ్చిన పువ్వుల పూజలు సేఁసినాఁవోఁ, ఏ నిప్పుల నయివేజ్యం ఎట్టినాఁవోఁ" అన్న రాజమ్మ వేదాంతం అతనికి ఎప్పుడూ వినిపిస్తూ వుంటుంది.

# 13

గవర్రాజు "గవర్రాజుగోడు" అవతారంతో ఉన్నప్పుడు ..

అయిదో క్లాసు చదివేడు.

ఆరు చదవ లేదు,

అతని ఊరు పెద్ద పల్లె కాదు. చిన్నపట్నం. ఆ పట్టణ ప్రముఖుల్లో అతను ఒకడుగా చాలా గమ్మత్తుగా అయేడు. అతను యౌవనంలో వున్నప్పుడు ఎంటర్ప్రైజింగ్ యంగ్ మేన్ అనాలి. అతను చిన్నప్పుడే డబ్బు విలువ కనిపెట్టేడు.

పదేళ్ళు తపస్సు చేయడం కన్న పదివేలు సంపాదించడం కష్టమనీ, భగవంతుడిది భాగ్యవంతుల పార్టీ అనీ, న్యాయం

ధర్మం అనేవి డబ్బు తాలూకు కవల పిల్లలనీ, "ముందటేడు సీతాకాలం, సింతచెట్టు కింద సచ్చిన ముసల్ది సలికి సావనేదనీ, వణ్ణంనేక కునికీసి నాదనీ" ఆమె కోసం భగవంతుడు స్వర్గ ద్వారాలు తెరుచుకొని కూర్చుని వుంటే వుండొచ్చుగాని ఆమెకు "పండుగ పున్నె కాలంలో కూడా పది గింజలుముష్టి దొరకలేదనీ" చచ్చేక నరకం కన్నా, చావక ముందు దరిద్రం అనుభవించడం కష్టమనీ, డబ్బు లేని వాడికి డబ్బు మంత్రాలు రావనీ, అలాటి వాడు ధన వంతుడు కావాలంటే ఓ చిన్న "పిల్లఖూనీ" చేసిగాని, లేక డబ్బూ, కొవ్వూ వున్న ఏ ఆడముండనో పట్టిగాని పెట్టుబడి సంపాదించాలనీ చిరుప్రాయముననే గ్రహించినవాడై, తన మేనమామ అతని చిన్నతనం లోనే చేరదీసిన కొండమ్మని ప్రేమించి, ప్రేమించబడి, పట్టుబడి, తన్నులుతిని, రాత్రికి రాత్రే కొండమ్మని వదిలేసి, తనమేనమామ కూతురితోన ఆమె నగలతో సహా పరారీ అయి ఆ ఊరు వచ్చి మొదట పప్పుల దుకాణం పెట్టేడు.

దరిద్రుడు పప్పుల దుకాణం పెడితే పప్పులు పాసి ఎక్కి పోతాయి. ఆ దుకాణానిక్కూడా సెక్స్ అపీలూ, స్టార్ ఎట్రాక్షనూ వుంటే మంచిదని గ్రహించి, దుకాణం వెనుక నున్న తన ప్రేయసి కనకాన్ని దుకాణంలో పెట్టేడు.

కనకానికి కాటుక కొప్పుంది.

చుక్కల్లా మెరిసే కళ్ళున్నాయి.

ఆమెవి యింకేవో యింకెలాగో వున్నాయి.

ఆరెకరా వీపుంది ఆమెకి.

జయంట్ విగ్రహం వుంది.

ఏనిమల్ ఎట్రాక్షను వుంది.

పోతుల్లాంటి మొగాళ్ళకి ఆమె కాలంలో వున్న కర్రి గేదెలా అతి బలంగా, నున్నగా, నల్లగా మెరుస్తూ బహు సెక్సీగా కని పిస్తుంది. ఆమెని చూసిన ఏ మొగాడికైనా పందిరి మంచాలూ, పట్టు పరుపులూ గుర్తొస్తాయి. కాని తల్లీ చెల్లీ గుర్తుకు రారు. ఆ సంగతి ఆమెకు తెలుసు.

ఆమె దుకాణం మొదటి నెలలోనే పాపులర్ అయి పోయింది. పెరుగుతున్న పప్పుల దుకాణం, మొదట్లో చుట్ట, పొగాకు అడిగి ఆ తర్వాత సిగరెట్లు, అగ్గిపెట్టెలూ, అరటి పళ్ళూ, చెక్కెర బిళ్ళలూ అడిగింది.

మేనమామ కూతుర్ని కొట్టుకొచ్చిన గవర్రాజు కేవలం కిళ్లీల కొట్టు పరిధిలో సంతృప్తి చెందలేకపోయాడు. వ్యాపారం పెంచు దామంటే కనకం దగ్గర నగలూ, తనదగ్గర ఆశా తప్ప యింకేం లేవు. కొత్త వ్యాపారం ప్రారంభించడానికి తగిన అనుభవం కూడా నేదు. తను చేస్తున్న కౌలు వ్యవసాయం కూడా అంతంత మాత్రంగానే వుంది. తిండి గింజలూ, గేదెకి గడ్డి తప్ప – ఏం మిగలడం లేదు. కిళ్ళీ దుకాణం బాగుంది అంతే.

ఎంత బాగున్నా కిల్లీ దుకాణం కెంపుల దుకాణం అవదు.

కొత్తగా ఏం చెయ్యడమో తోచలేదు గవర్రాజుకి. కాని ఎలాగో ఓలాగ అవరమైతే పది పీకలు కోసయినా సరే తను పెద్దవాడు అవడానికే నిర్ణయించుకున్నాడు.

పీకలు కోసయినా సరే పెద్దవాడు కావడానికి నిశ్చ యించుకున్న (పీకలు కోయనివారు పెద్దవారగుదురే? పేదవారు గాక!) యెవరికైనా మంచి మంచి పీకలు ఎదురౌతాయి. వారికి వాటిని యాక్చువల్‌గా కొయ్యవలసిన అవసరం కూడా రాకపోవచ్చును.

చాలా సంవత్సరాల క్రింద .....

ఆ రాత్రి మొహంలేని మనిషిలా భయంకరంగా వుంది.

కాలనాగు విషపు బుసలా చీకటి వుంది.

తడి ఆరిపోయిన కళ్ళలా అక్కడా అక్కడా హరికేన్ లాంతర్లు మండుతున్నాయి.

ఆ రాత్రి–దువ్వని జుత్తుతో–గుండీలు లేని చొక్కాతో – వెలిగించని బీడీతో–కళ్ళల్లో ఖూనీ పెట్టుకొని బయలు దేరేడు గవర్రాజు.

పీక కోసీడానికే బైల్దేరేడు.

పీకలు కొయ్యడం కూరల బేరం కాదు. దానిలో పెద్ద చాయిస్ వుండదు.

"ఏ పీక కొయ్యడం?

గజ్జెల పెట్టెదదా–

ముత్యాల హారాలదా–

లేతదా–ముదరదా

స్త్రీదా–పురుషుడిదా

నల్లదా–తెల్లదా"

అనేది గవర్రాజు ఆలోచన కాదు.

అతను ఒకే ఒక పీక కొయ్యడానికి బైల్దేరేడు. ఆ సమయంలో ఆ పీక ఒక తలకీ ఒక మొండేనికీ అతుక్కొని హాయిగా వుంది. అది తలా మొండెంతో సహా ప్రస్తుతం మున్సిపల్ గుమాస్తా రాఘవరావుది.

గవర్రాజు యిల్లు బైల్దేరకముందు-

అతని ఒంటిగది తాటాకు యింట్లో నవారు మంచంమీద గుమ్మటంలా నవనవ లాడుతూ కూర్చుని వుంది కనకం. మామూలు రోజుల్లో అయితే ఆ టైముకి అలా నవనవలాడే కన కాన్ని గవర్రాజు యేం చేసే వాడో కాని, ఆ రోజు ఆమె దరిజేర డానికి యముడిక్కాని, కనీసం ఆయన దున్నపోతుక్కాని వీల్లేదు. ఒకవేళ తెగించి వస్తే ఆ దున్న కొమ్ముల్ని విరిచి, వాటితోనే ఆ దున్ననీ దాని యజమాన్నీ హతమార్చేసి వుండును కనకం.

అప్పు డామె ఎలా వుంది?

ఆమె మంచంలో పెడమఠం వేసుక్కూర్చుని కుడిచెయ్యి దండికి ఆనించి, మొహం దించుకొని, నీళ్ళు నిండిన కళ్ళుయెత్తి గవ ర్రాజుని చూస్తూ, తన మానభంగం భీముడితో చెప్పుకుంటున్న ద్రౌపదిలా వుంది. ద్రౌపది జుట్టులాగే ఆమె జుట్టు కొంత విడి, పిల్ల కొండచిలువలా ఆమె భుజాన్ని చుట్టుకుంది.

సహగమనానికి తయారవుతున్న పతివ్రతలా ఆమె అతి దీనంగా ఉన్నప్పటికీ ఆమె మొహం ఎర్రగా తోమిన రాగిసిబ్బిలా మండిపోతోంది.

పైటతప్పిన ఆమె నల్లని ఒంటి గుండెలో హరికెన్ లాంతరు వెల్తురు కెంపులా మెరుస్తోంది. అంటే అబద్ధం కాదుకాని, గవ ర్రాజును దహించడానికి పుట్టిన దావాగ్ని బీజకణం అంటే నిజానికి దగ్గరగా వుంటుంది.

అప్పటి కప్పుడే ఆమె గవర్రాజుతో-చెప్పవలసింది అనాలో, చెప్పకూడనిది అనాలో-చాలా చెప్పేసింది.

"అప్పు డేటన్నాడో ఎరికా ఆ ఎదవ సచ్చినోడూ? రేటెంతలో వుందన్నాడు. అప్పు డేటాలోచిస్తన్నానో ఏటోగాని ఆదమరుపు నుండి "దేని రేటూ" అన్నాను.

అప్పుడాడు "తెలకడుగుతున్నావా? తెలిసడుగుతున్నావా పిల్లా? గడుసుదానివే. సెప్పరా అప్పల్సామీ మనరేటు. ఇంతకీ....."

కీచకుడు కల్లోకి వచ్చిన భీముడిలా అరిచేడు గవర్రాజు "మరింక సెప్పకుసెప్పకంతే మరి. ఇంకీ ఇంజనాగదంతే" అని బైల్దేరేడు.

రేటు బేరం చేసిన రాఘవరావు మున్సిపల్ గుమస్తా. అప్పల స్వామి. మున్సిపల్ జవాను.

రాఘవరావు యిల్లు తెలియని గవర్రాజు అప్పలస్వామి యింటికి వెళ్ళి యింటిముందు నిద్రపోతున్న ఆకారాన్ని "లేవరా కుక్కా" అని కడుపులో ఒక్క తాపు తన్నేడు.

కుక్క లేచింది. కాని కరవలేదు, అరవలేదు.

బతిమాలింది. భయపెట్టింది.

రాఘవరావు రాములోరు అంది.

కనకం సీతమ్మోరంది.

"ఏట్రా కూసేవ్? దొంగనంజికొడకా! నా కనకం సీతమ్మోరైతే ఆ గుమాస్తా నంజికొడుకు రాములోరా?" అని అప్పల స్వామి పీక పట్టుకున్నాడు గవర్రాజు.

"నువ్వెప్పుడూ యింతే గురూ. తొందర జాస్తీ. నా మాటిను."

తర్వాత చాలా మాట్లాడేడు అప్పలస్వామి. మాటలు ఆపి రాఘవరావు దగ్గరకి వెళ్ళివచ్చి యింకా మాట్లాడేడు.

బలవంతుడైన దుర్యోధనుడు సంధికి ఒప్పుకోకే చెడిపోయేడు.

సంధికి వప్పుకోని చిన్న రాజ్యాలని హిట్లరు హోమియోపతీ మాత్రలని మింగినట్టు మింగేసేడు.

సంధి (చచ్చిపోయేముందు వచ్చేదికాదు!) సర్వత్రా వాంఛ నీయము.

ఆ రాత్రి ఏం జరిగిందీ ముగ్గురికే తెలుసు. ఏం జరిగిందీ ముగ్గురూ మూడు రకాలుగా చెప్తారు.

కాని ఆ తర్వాత జరిగిన దాని గురించి ఎవరికీ ఎటువంటి సందేహం లేదు.

గవర్రాజు మున్సిపల్ కాంట్రాక్టరయ్యేడు.

# 14

చిన్న కాంట్రాక్టులు మాత్రం దొరికిన గవర్రాజు-బాగా ఆక లిగా వున్నవాడు బిస్కట్లు తిన్నట్టు ఫీలయ్యేడు. ఆ బిస్కట్ కాంట్రా క్టులు అతని కాంట్రాక్టు ఆకలిని తీర్చలేదు సరిగదా పెంచేయి.

పోనీ "యథాప్రాప్తం" అని సంతృప్తి పడదామంటే, మున్సిపల్ ఇంజినీరూ, అతని స్టేఫూ, కన్సర్న్డ్ గుమాస్తా, అన్‌కన్సర్న్డ్ గుమాస్తా చీకిన విస్తట్లో-మిగిలేది ఏం లేదు.

మున్సిపల్ కాంట్రాక్టులు పీ డబ్ల్యూ డీ కాంట్రాక్టులంత లాభసాటివి కావు గాని, మిగిలినదంతా దక్కుతే బాగానే వుంటుం దని గ్రహించేడు గవర్రాజు. పైగా నేటి బాలుడే రేపటి పౌరుడు అన్నట్లు, నేటి మున్సిపల్ కాంట్రాక్టరే, రేపటి పీ డబ్ల్యూడీ కాంట్రాక్టరు! (ఎల్లుండి ఎమ్మెల్యే అగునా?)

మున్సిపల్ కాంట్రాక్టుల్లో మినహాయింపులు లేకుండా చెయ్యాలంటే ఆ కాంట్రాక్టరు చెయిర్మన్ బావో, చప్రాసీ మాఁవోఁ కావాలి. ఆ ఛాన్సులు గవర్రాజుకి లేవు.

"మరిగంచేత నానే మునిసిపల్ నంబర్నవ్వాలి" అని నిశ్చయించుకున్నవాడై గవర్రాజు లక్ష్య సాధనకు లక్ష విధముల ప్రయత్నించ దొడగె. ఆ ఆలోచన వచ్చిన అతనికి అన్నీ శుభ సూచనలే కన్పించేయి. తన వార్డులో తన కులానిదే మెజారిటీ. అప్పటి తన వార్డు మెంబరు నెత్తిమీద రూపాయి పెడితే పావలాకి యెవరూ కొనరు.

ప్రజలని లేక ఓటర్లని వశపర్చుకోవడం యెలా? అందరికీ కావలసిందేది?

ఆసుపత్రి–ఆలయం

ఆసుపత్రి కట్టగలిగితే మున్సిపాలిటీ మెంబరేం కర్మం – హైదరాబాదు మినిష్టరే అవొచ్చు.

కావున ఆలయం మినహా శరణం నాస్తి.

సర్వ ప్రజలకూ దేహ జాడ్యములకు ఆసుపత్రి ఎట్లు అవసరమో, మనో జాడ్యములకు ఆలయమట్లే అగత్యము.

ప్రజకు భక్తి మెండు (చూ॥ బస్ డిపోలలో వెంకటేశ్వరస్వామి డబ్బీలు)

నీవు యోగ మార్గమున నేది సాధించలేవో, దానిని భక్తి మార్గమున అత్యంత లఘువుగా సాధించగలవు.

దేముడి యందు నమ్మకము కలవారు–ఎంచేతో యింట్లో ప్రార్థించడానికి యిష్టపడరు.

అంచేత రామాలయమనబడే భజన మందిర నిర్మాణానికి పూనుకున్నాడు గవర్రాజు. మందిరం పూర్తి చేసి "గవర్రాజు బాబు" అయ్యేడు.

"ప్రజల కష్ట సుఖాలతో పాలు పంచుకోలేని వాడు వారి నాయకుడు కాలేడు" అనే గాంధీ నియమావళి ననుసరించి వారి మంచి చెడ్డలకు సాయం చేసేడు గవర్రాజు.

మూలు నాయుడు భార్యకి జబ్బు చేసినప్పుడు ఆమెను పట్నం తీసికెళ్ళి అస్పత్రిలో చేర్పించి ఎవరు? గవర్రాజే.

సూర్యనారాయణ కూతుర్ని మొగుడొదిలేస్తే ఆ మొగుడ్నీ, వాడి ముండనీ, కోర్టుకీ, రచ్చకీ ఈడ్చి మనోవర్తి కక్కించిందీ ఆతనే.

ఆ తర్వాత పాముకి పొరవచ్చినట్టు, గవర్రాజుకి అతి సహజంగా మున్సిపల్ సభ్యత్వం–యింకేవో పదవులూ (యితరుల పేర్లమీద) కాంట్రాక్టులూ వచ్చేయి.

అతని వార్డులో అత్తా కోడళ్ళ తగవుల దగ్గర్నుండి, అమ్మవారి కొలువుల తగువుల వరకూ అన్నీ అతనే తీర్చాలి.

అతని వార్డులోకి కొత్త కుక్క వస్తే (నన్నో కుక్క అనుకుంటారో ఏటోగాని!) ప్రజ అతనికే ముందుగా తెలియజేస్తారు.

ఇప్పుడు గవర్రాజుకు పదెకరాల పొలం, అంటు మామిడి తోటా, మేడ కట్టని డాబా యిల్లు, పట్నంలో చదువుతున్న కొడుకుతో కలిపి ఐదుగురు పిల్లలూ, జీవితంలో యింకా ముందుకు పోతానన్న నమ్మకం వున్నాయి. అతను స్వతహాగా చెడ్డవాడు కాకపోవచ్చును. కాని రాజకీయాల్లోకి దిగేక మడి కట్టుకొని వుండటానికి వీలేదు. పదవులు సంపాదించడానికి చెయ్యవలసిన పాపాల కంటె, అవి నిలబెట్టుకోడానికి రెట్టింపు పాపాలు చెయ్యాలి. రాజకీయాల్లోకి దిగినవాడికి ప్రజలంతా ఒకటి కాదు.

"సర్వేజనాః సుఖినో భవంతు" అన్నది అతని ప్రార్థన కాదు. తనకి పనికి వచ్చే వాళ్ళనే అతను పెంచాలి. అంటే శత్రువులని నిర్ధూమధామం చేసెయ్యాలి.

మారణాయుధాలు చాలా రకాలు. కర్రలు–కత్తులు – విల్లులు – బాణాలు – తుపాకులు – ఫిరంగులు – బాంబులు – ఇవి అందరికీ తెలిసిన ఆయుధాలు.

గవర్రాజు కనుక్కున్న మరొక ఆయుధం కోర్టు.

"కోర్టులు న్యాయాన్ని నిలబెట్టడానికి పుట్టేయి. సత్యానికి మనుషులు కట్టిన ఆలయాలు ఇవి."

"నిజానికి కట్టిన గోరీలు" అని కూడా కొంతమంది అంటారు.

అక్కడ నిజాన్ని మూడు నిలువులు పాతెయ్యొచ్చు. అక్కడ జన్మానికో సివరేత్తి రన్నట్టు ఒక్కోసారి నాయం గెలవొచ్చు.

అక్కడ పోయినోడు పబ్లిగ్గా ఏడుస్తాడు; గెలిసినోడు యింట్లో ఏడుస్తాడు.

అందుకే కోరటు ఎక్కినోడూ గాడిద ఎక్కినోడూ ఒక్కటే అన్నారు మనోళ్ళు.

అక్కడ బాబులుకి కళ్ళుండవు.

అక్కడ నిజానికి నోరు లేదు.

అక్కడ అబద్ధానిదే ఆట.

అక్కడ బాబులు చదివే పుస్తకాల్లో ఏటుంటాదని నీ యభిప్రాయం?

న్యాయానికి కాళ్ళు ఎలా యిరిసెయ్యాలో, సత్తెం పీక ఎలాగ నొక్కెయ్యాలో, దరమం పేనం ఎలా తీసెయ్యాలో పేజీకి పది మారగాలు రాసుంటాయందులో.

నిజానికి కోరటంటే ఏటి?

అదో పెద్ద బోను. అందులో కెల్లడం ఎత సులువో, బయట పడ్డం అంత కష్టం.

అక్కడ అంత మందిరీ ఒక్కటే–డబ్బుంటే.

అక్కడ బీదోడూ, గొప్పోడూ ఒకటే–పెద్ద ఫీజు లిచ్చుకుంటే.

అక్కడ అన్నేయం దాని పన్జేసుకున్నాగ్గాని సావదు.

అక్కడ ఎప్పుడన్నా సత్తెం నిలబడొచ్చు–అది సచ్చిందా, బతికిందా అన్న సింతలేనప్పుడు.

అక్కడ బీరువాల్లో వుండేవి కేసు కట్టలుకావు. పాపాల కట్టలు.

అసలు పద్ధతంటే ఏటి? అది అన్నేయం సేసినోడ్ని పట్టుకో డాని కేసిన వల. కానందులో సెవుల పిల్లులే పట్టుబడతాయి. తోడేళ్ళు వల కొరుక్కెల్లి పోతాయి.

నా నోరసలే మంచిది కాదు. నన్ను కదిలించక అంటాడు గవర్రాజు కోర్టుల గురించి.

మొదట్లో అతను ఒక చిన్న ప్రొహిబిషన్ కేసు పట్టుకొని కోర్టుకెళ్ళాడు.

ఆ తర్వాత తన వార్డు ప్రజలకి కోర్టులో సహాయం చెయ్యడానికి వెళ్ళాడు. ఆ తర్వాత తన శత్రు నాశనానికి వెళ్ళేడు.

అతను మొదట్లో జరీ పాగాల ప్లీడర్లనే పట్టేడు. కాని అనుభవం వచ్చినకొద్దీ తనే ఒక కుర్ర ప్లీడర్ని పెంచి పోషిస్తే లాభదాయ కమని గ్రహించి కోర్టుకి వెళ్ళేడు.

అలా వెళ్ళిన గవర్రాజుకి వెంకట్రావు కనిపించేడు.

# 15

వెంకట్రావు ప్రాక్టీసు పెట్టిన కొత్తరోజులు, ఏ వృత్తిలోనయినా కొత్తగా కాలు పెట్టిన వాడికి చాలా కొత్త విషయాలు తెలుస్తాయి. వాటిల్లో ఏవీ కూడా సుఖసంతోషాలను పెంపొందించేవి కావు.

వృత్తిలో ప్రవేశించిన వెంటనే, ప్లీడరు గుమాస్తాలు పార్టీల డబ్బుతినేస్తారని తెలుసుకొని ఆశ్చర్యపోయేడు వెంకట్రావు.

ఈ మధ్య చచ్చిపోయిన తన "ప్లీడరు గుమస్తా" తండ్రి కూడా డబ్బు తినేసేడని తెలుసుకొని బాధపడ్డాడు. తినేసిన మనిషి తిరిగి కక్కకుండా చచ్చిపోయాడని తెలుసుకొని ఆ డబ్బంతా అణాపైసలతో కట్టినప్పుడు కుంగిపోయేడు. ఊబిలో కూరుకుపోతున్న జంతువులా తనమీద తాను జాలిపడే అవ కాశం కూడా లేక, చుట్టూ సహాయం కోసం చూసి, గట్టున వున్న బంధుమిత్రులు తనవేపు చెయ్యికూడా చాపక పోవడం చూసి "ఓహో ప్రపంచం అంటే ఇదే కాబోలు" అనుకొని, తన పెళ్ళాన్ని కాసుల పేరు అడిగి (మానాన్న పెట్టేడు. దానిమీద మీకేం అధికారం లేదు) లేదనిపించుకుని, ఆవిడ యిష్టాయిష్టాల్ని నిర్లక్ష్య పెట్టి (ఛి, ఛీ ఆడదాని సొమ్ము అమ్ముకు తినడం కన్నా అడుక్కు...) కాసుల పేరుని అమ్మేసి గట్టున చేరి యింకా మరి కొన్ని కొత్త విషయాలు తెలుసుకొని యింకా బాధపడ్డాడు.

అతను 'లా' కాలేజీలో చదువుతున్నప్పుడు సివిల్ సైడ్ ప్రాక్టీసు చేసి గవర్నమెంటు ప్లీడరవడమో, క్రిమినల్ సైడు చేసి పబ్లిక్ ప్రాసిక్యూటర్ అవడమో తేల్చుకోలేక యిబ్బంది పడ్డాడు. కాని ప్రాక్టీసు పెట్టేక "మానవునికి మోక్ష మార్గము కనుగొనుట" కన్న, కొత్త ప్లీడరుకు ఒక్క కేసు సంపాదించడం ఇంకా కష్టమనీ, జూనియర్ ప్లీడర్ని ఎవరూ లక్ష్యపెట్టరనీ, ఆఖరికి జడ్జీ కూడా జూనియర్లని ముసలి డాక్టరు జబ్బు పిల్లల్ని చూసినట్టు చూస్తా డనీ, ప్రాక్టీసులేని ప్లీడరు దండం పెడితే పార్టీగాడు కూడా అందుకోడనీ, తన సీనియర్ చచ్చేలోపున (అతనో! తనో) తనని కోర్టులో వాయిదా కూడా అడగ నివ్వడనీ గ్రహించి ఎడారి మధ్య ఒంటె చచ్చిపోయిన యాత్రికుడిలా చాలా హెల్ప్‌లెస్‌గా ఫీలయ్యేడు.

అతనికి అదివరకున్న "వెస్టెడ్ ఇంటరెస్ట్స్" అన్న మాటకు అర్థం ఇప్పుడిప్పుడే బోధపడుతూంది.

వెంకట్రావు కోర్టుకి వెళుతున్నాడు, వస్తున్నాడు. కాని ఒక్క పార్టీ రాలేదు–అతని దగ్గరికి.

వెంకట్రావు సీనియర్ ఆఫీసుకి వెళుతున్నాడు. వస్తున్నాడు. కాని ఒక్క కానీ రాలేదు అతనికి.

జీవితం గడపలో అడుగు పెట్టగానే కాలు రబ్బరు "డోర్ మాట్" మీద కాకుండా, నిప్పుల ముళ్ళమీద పడ్డ ప్రతి ఒక్కరూ ఎలా 'ఫీల్' ఔతారో అతనూ అలాగే ఫీలయ్యేడు. కొద్దికాలంలోనే అతనికి 'తన' గురించి తప్ప ఇతరుల గురించి ఆలోచించే శక్తి పోయింది. మంచితనం, జాలీ, దయా, సానుభూతీ వగైరా సుగుణాలు అతనికి తను ఎప్పుడో చూసిన సుందర విగ్రహాల తాలూకు నల్ల నీడల్లా మాత్రం ఐపోయాయి.

అతనికి మానెడు గింజలు పండేభూమి మిగలకపోయినా గరిసెడు సంసారం వుంది.

అతని తల్లికి తలలో నిండుకున్న పువ్వులు కళ్ళల్లో పూసేయి. కాటరాక్ట్ల వల్ల ఆమెకు మనుషులు మధ్యాహ్నం నీడల్లా కనిపిస్తారు.

అతనికి, కమల కొనుక్కున్న జరీ అంచు తెల్ల సిల్కుచీర పాల సంద్రపు అంచున బాలభానుడి వెలుగులా కన్పించేది. కొనుక్కుందామన్న కోరిక ఉన్న పార్వతి అనే చెల్లెల్లుంది. "ఛీ, ఛీ. ఆ చీర నాకెందుకూ? మనిషికి మంచి మనస్సుండాలి కాని మానం కప్పుకుందికే గుడ్డయితేనేం" అన్న ఆత్మవంచన ఆమె చాలా సక్సెస్ఫుల్గా చేసుకుంటుంది. కాని "పెళ్ళీడు దాటి పోయిందన్నయ్యా ... ఎక్కడేనా మేష్టరు పనన్నా..." అనే ధైర్యం లేదు.

ఆ తర్వాత కిష్టిగాడు పి యూ సి చదువుతున్నాడు. మెడికల్ సీటు తప్పకుండా తెచ్చుకుంటాడు. కాని మెడిసిన్ చదివించక పోతే గొప్పింటి వాళ్ళ రంగుల చిచ్చుబుడ్డివేపు అ ప్రయత్నంగా నడిచివెళ్ళి కాలిపోయి చావక మిగిలిన బీదపిల్లాడిలా....

ఆ తర్వాత నరసు-మొగ్గ తొడిగిన కొత్త మొక్కలా వుంటుంది. ఎస్సెల్సీ చదువుతోంది. దానికి పెళ్ళీ-చదువూ రెండూ సాధ్య పడవని యింకా తెలీదు.

తర్వాత మరో యిద్దరు.

నిద్రపట్టని రాత్రి జబ్బు మనసుతో వీళ్ళని చూసిన వెంకట్రావుకి "వీళ్ళంతా రాత్రికి రాత్రే యిలాగే..." అనే ఆలోచన వచ్చినప్పుడు తన రాక్షసత్వాన్ని గుర్తించుకొని, తనకి ఓ మందు లేని జబ్బు వచ్చిందని తెలుసుకున్న డాక్టర్లా వణికిపోయి "ఈ రాత్రికి రాత్రే నన్నూ, వీళ్ళనీ, ఈ ఊరినీ, ఈ మనుషుల్నీ-భూమి బద్దలు చేసో, ఉప్పెన పుట్టించో ఎలాగో-నీ యిష్టం వచ్చినట్టు చంపేకూడదా ప్రభూ" అని భగవంతుడ్ని ప్రార్థిస్తాడు.

# 16

వెంకట్రావు ప్రాక్టీసు పెట్టి కొన్ని సంవత్సరాలయింది. కాని అతని భార్య పాతికేళ్ళ శకుంతల-నలభై ఏళ్ళ మనిషిలా అయి పోయింది. ఒకప్పుడు ఆమెకీ జలతారు కలలు ఉండేవి.

ఒకప్పుడు-అల్లప్పుడెప్పుడో ఆమె నవ్వినప్పుడు బుగ్గలు సొట్టపడి పళ్ళు మిలమిల మెరిసేవి.

ఇప్పుడామె నవ్వు మరిచిపోయిన మనిషిలా-రేపు అంటే భయపడే అభాగినిలా-ఈవేళ బతికి ఉన్నందుకు బాధగా, దిగులుగా, "ఎపోలెజెటిక్"గా ఉంటుంది.

ఆవేళ సాయంత్రం-

వెంకట్రావు కోర్టు నుంచి వచ్చేటప్పటికి ఎండ తగ్గినా వేడి యింకా తగ్గలేదు. అతన్ని చూసి వీధరుగుమీద కుక్కి మంచంలో పడుకున్న తల్లి లేచి కూర్చుంది. ఆమె పక్కనే చేటలో, బియ్యంలో రాళ్ళు యేరుతున్న శకుంతల అతన్ని చూసి చేట పట్టుకొని వంటింట్లోకి వెళ్ళిపోవడం అతనికి వింతగా అనిపించింది.

"అబ్బాయొచ్చేడు, కాఫీ పెట్టు శకుంతలా" అని కేకేసింది అతని తల్లి.

"ఇదిగో-పెడ్తున్నానత్తయ్యా" అన్న జవాబు వంటింట్లోంచి చెప్పింది శకుంతల. వెంకట్రావు తన గదిలోకి వెళ్ళేడు బట్టలు మార్చుకోవడానికి.

ఆ గదిలో తాతలనాటి గిలకల పందిరి మంచం వుంది. దానిమీద పీచుపరుపు వుంది. ఆ పీచుపరుపుమీద చారల పరుపు వుంది. ఆ చారల పరుపు మీద బాబిగాడు పెరిగిన మరకలున్నాయి. తలవేపున జిడ్డు పట్టిన దిళ్ళకి జిడ్డుపట్టిన సైను గలేబులు ఉన్నాయి. వాటిపైన శకుంతల కుట్టిన పువ్వులు అందంగా లేవు.

ఆ మంచం మీద అతని పెద్దచెల్లి పార్వతి మూసిన కన్ను విప్ప కుండా పడుకుంది. ఆమె ఆ మంచం మీద ఎప్పుడూ పడుకోదు.

ఆ గది గోడలు బాగా మాసి ఉన్నాయి. వాటి మూలల్లో పంది కొక్కులు పెట్టిన కన్నాలకి బిగించిన రాళ్ళు బైటకు కనిపిస్తున్నాయి. నేలని గచ్చుపోయిన గోతుల్లోంచి యెంత తుడి

చినా దుమ్ము వస్తూనే ఉంటుంది. తపస్సు చేస్తున్న మార్కండేయుడూ, విష్ణుమూర్తీ, శివుడూ మూడు గోడలకి వేలాడుతున్నారు. అద్దాలు పగలక పూర్వం అనేక పటాలు వేలాడి వుండేవని చెప్పడానికి ఆ గోడలకి చాలా కన్నాలున్నాయి. ఆ కన్నాల్లో యిప్పుడు నల్లులు ఉన్నాయని చెప్పడానికన్నట్టు ఎప్పుడైనా ఒక నల్లి గోడ మీద పాకుతుంది. గోడనివున్న పాగాకొయ్యకీ, మేకులకీ గదిలో అడ్డంగా కట్టిన తాడుమీద మాసిన బట్టలు వేలాడుతున్నాయి. గదంతా మాసిన బట్టల బుట్టలా మెతక వాసన వేస్తోంది.

కోటువిప్పి పాగా కొయ్యకు తగిలించి కాలరూ బేండ్సు ఎడంచేత్తో విప్పుకుంటూ పందిరి మంచంమీద అంచున కూర్చుని పార్వతి నుదిటిమీద కుడి అరిచెయ్యి వేశాడు వెంకట్రావు. కాలిపోతున్న నుదిటిమీద మంచునీళ్ళు జల్లినట్టు అనిపించింది పార్వతికి.

తుళ్ళిపడిన పార్వతి కళ్ళు విప్పింది.

జ్వరానికి ఆమె నల్లని మొహం కాస్త ఎరుపెక్కి కాస్త కాల్చిన యినుప పెనంలా ఉంది. ఆ పెనంలో నిప్పులు చెరుగుతున్నట్టున్నాయి ఆమె కళ్ళు.

"జ్వరం వచ్చిందా?" అంత బిగ్గరగా మాట్లాడినందుకు గిల్టీగా ఫీలయ్యేడు వెంకట్రావు.

"నువు అటు కోర్టుకి వెళ్ళగానే పడవలా పడిపోయింది పిల్ల" అంటూ కిటికీ అవతల తల్లి ఏదో గొణుక్కుంది.

జ్వరం రావడం తన తప్పే అని వప్పుకుంటున్నట్టు తల నిలువుగా ఆడించింది పార్వతి.

"రేపటికి పోతుందిలే" అంది–పోయేది ప్రాణమే అన్నంత నీరసంగా.

పెరట్లో పడిపోయిన మట్టిగోడమీద ఎక్కిన మేకపిల్ల వెనక్కాళ్ళ మీద నిలబడి అందని కొమ్మకోసం తాపత్రయ పడుతోంది.

చీకటి అడవిలో తోడేలు ఏడిచినట్టు దూరంగా సైరన్ కూసింది.

ఆరేసిన బట్టలు మడతపెట్టి వెంకట్రావుకి లుంగీ అందించిన శకుంతల తల యెత్తలేదు. జీవితాంతం తల వంచుకుని బతక వలసిన మనిషిలా ఒకప్పుడు అనుభవించిన సిరులు జ్ఞాపకం వుంచుకొని కుమిలిపోవడం తన శాపంలోని ఒక భాగం అని నమ్మకం కలిగిన మనిషిలా–అతి దీనంగా "కాఫీ పట్రానా" అని అడిగింది.

"పట్రా" అని కాళ్ళూ చేతులూ కడుక్కోవడానికి పెరట్లోకి వెళ్ళేడతను.

నీళ్ళగోలెం చుట్టూ వున్న బురదలో ఒక ప్రక్క వేసిన బండ మీద నిలబడి చెంబుకోసం చుట్టూ చూసేడు. నీళ్ళలో తేలిన చంటిపిల్ల శవంలా, గోలెం నీళ్ళలో సిలవరిచెంబు తేల్తూ గాలికి గిరగిరా తిరుగుతోంది.

కాళ్ళు కడుక్కొని తన గదిలోకి వచ్చిన వెంకట్రావుకి కంచు గ్లాసుతో కాఫీ అందించింది శకుంతల.

"దానిక్కూడా కాఫీ యివ్వకపోయేవా శకుంతలా. పొద్దుట్నుంచీ పచ్చి మంచినీళ్ళు నోట్లో పొయ్యలేదు పిల్ల" వరండా నుంచి తల్లిమాట వినిపించింది.

"ఇస్తా నత్తయ్యా" అంటూ నేరం వప్పుకుంటున్న ముద్దాయి జైల్లోకి వెళ్ళినట్లు ఆత్రంగా వంటింట్లోకి వెళ్ళిన శకుంతల మళ్ళీ బైటకు రాలేదు.

"నువ్వు తీసుకో" గ్లాసు అందించేడు పార్వతికి వెంకట్రావు.

"వద్దులే అన్నయ్యా! నువ్వు తాగు" అంది పార్వతి.

"కాస్తల్లీ నువ్వు తాగు."

"వదినె తెస్తుందిలే అన్నయ్యా నాకు"

వదిన తేదు.

వదిన కాఫీ తేలేదు.

వాళ్ళింట్లో వెంకట్రావు తప్ప మిగిలిన వారంతా రెండోపూట కాఫీ మానేసేరని అందరికీ తెలుసు. కానీ ఎవరూ వప్పుకోదలుచుకోలేదు.

"నే నిప్పుడే కోర్టులో తాగాను. నువ్వు తాగమ్మా" వెంకట్రావు గ్లాసు ఆమెకు అందించేడు.

చెయ్యి వణికి కాఫీ కొంచెం పరుపుమీద వొలికింది. భుజం మీద తువ్వాలతో పక్కమీద కాఫీ తుడుస్తూ "తమ్ముడ్ని నాయుడు గారింటి నుంచి థర్మామీటరు తెమ్మనమ్మా" అన్నాడు తల్లితో.

థర్మామీటరు చూస్తే జ్వరం నూటమూడు దగ్గరుంది.

"నే వెళ్ళి మందు తెస్తాను. చలేమైనా వుందా?" అడిగేడు వెంకట్రావు.

"లేదు" అన్నట్టు తలూపింది పార్వతి.

బట్టలు వేసుకొని బైల్దేరాడు అతను.

# 17

రోడ్డు మీద అంతా నిస్సత్తువుగా, నిస్సారంగా తోలు మనుషుల్ని చూసి భయపడినట్టు జోరుగా నడిచి వెళ్ళిపోతున్నారు. రిక్షాలూ, కార్లూ ఎక్కిన వాళ్ళు యింకా భయపడిన వాళ్ళలా వున్నారు.

పేవ్‌మెంటుమీద ఎర్రదూదుల ముష్టివాళ్ళు మొండి చేతుల్తో లయవేస్తూ ఏడుపులా పాడుతున్నారు.

వాళ్ళకి దూరంగా గుడ్డి ముష్టివాడి సినిమా పాటలకి కాళ్ళు లేని మరోడు డాల్డా డబ్బామీద మద్దెల కొడుతున్నాడు.

నిలబడిన సోడాబండి గడ్డిలోంచి కారిన చల్లని నీళ్ళలో పడుకుంది చర్మం పోతున్న కుళ్ళు కుక్క.

ఎవరో ఆడతార ఎవరో ముసిలినటుడి ప్రేయసి అని కొట్టులోని ఒక పత్రిక తాటికాయంత అక్షరాలతో చాటుతోంది.

డాక్టరు ధర్మారావుగారింటికి వెళుతున్న వెంకట్రావుకి ఇవేవీ కనిపించలేదు. డాక్టరుగారి యింటి యినపగేటు తియ్యగానే సిమెంటు దారికి యిటూ అటూ అప్పుడే ఎయిర్ కండిషన్ గదుల్లోంచి ముస్తాబై వచ్చిన ముదర ఆడవాళ్ళలా కనిపిస్తాయి పూలమొక్కలు.

ఆ మొక్కల మధ్య గుండ్రని మెట్లు ఎక్కి బట్టలు విప్పుకొని తైతక్కలాడుతోంది ఒక తెల్ల సిమెంటు సుందరి.

వరండాలో ఒక బెంచీ వుంది.

గోడని డాక్టర్‌గారి నేమ్ ప్లేట్ పక్కన కాలింగ్ బెల్ ఉంది.

వరండాలో చెప్పులు విప్పిన వెంకట్రావు కాళ్ళకి అప్పుడే కడిగిన గచ్చు తెగిన పాదాలకి ఏటి నీరులా చల్లగా హాయిగా తగిలింది.

తడిసిన మొక్కల నుంచి వస్తున్న గాలి ఇంకా చల్లగా వుంది.

వెంకట్రావుకి ఆ యిల్లు, దాని పరిసరాలు మరేదో దేశం యీ దేశంలో కొనుక్కున్న భాగాల్లా అనిపించేయి.

ఆ వరండా ఎక్కిన వెంటనే అతనికి తన తల్లినీ, పెళ్ళాన్నీ, పిల్లల్నీ అందర్నీ వదిలేసి, తన బరువులన్నీ మరచిపోయి, తన బాధ్యతలను వదిలించుకొని ఒక్క గంట ఆ బెంచీమీద హాయిగా నిద్రపోవాలనిపించింది.

అతను కాలింగ్ బెల్ నొక్కేలోగానే ఎవరో వృద్ధ స్త్రీ మొగ చిలకలా బొంగురు గొంతుతో "ఎవరూ" అంది.

"డాక్టరుగారున్నారాండి?"

"ఉన్నారు."

కాని వస్తారో, రారో చెప్పలేదు ఆ చిలక. అతన్ని కూర్చోమని కూడా అనలేదు.

వరండలో స్తంభానికి ఆనుకొని నిలబడి రోడ్డుమీదికి చూసేడు వెంకట్రావు.

ఒక "జెర్కిన్" కుర్రాడి భుజం మీద తల ఆనించి అతని నడుముకి చెయ్యిచుట్టి నడవలేకపోతోంది ఒక ఎర్ర రవిక పిల్ల.

"రావోయ్, వీధిలో నిలబడ్డావేఁవిఁటి?" వరండాలోకి వస్తున్న ధర్మారావు అన్నాడు.

కృష్ణుడి దగ్గరకి అటుకులు కూడా తీసుకొని వెళ్ళలేని కుచేలుడిలా నిలబడిన వెంకట్రావు "ఇప్పుడే వచ్చా" అని మాత్రం అనగలిగేడు.

"రా, లోపలికి, ఏఁవిఁటి విశేషాలు? అంతా కులాసాయనా? షీలా! కాఫీ పంపించు. అమ్మకి ఎప్పుడు ఆపరేషను చేస్తానంటాడు రఘు? కేటరాక్టు యింకా ముదర్లేదా? ఎలా ఉంది నీ ప్రాక్టీసు. మీ ఆవిడ మళ్ళీ ఏఁవేఁనా అనుకుంటోందా?" గ్లాసు టాప్ టేబిలుమీద చిందర వందరగా పడున్న మేగజీన్లు సర్దుతూ ఊపిరి సలపనివ్వకుండా అడిగేస్తున్నాడు డాక్టరు.

ఆ గది పచ్చని గోడలు చీకటిని చిక్కన చేస్తున్నా, ఆ చీకటి రాతి గుహ చీకటిలా భయంకరంగా లేక, సరస్సు మధ్య ఒంటి స్తంభం మేడగదిలో కావాలని దీపం ఆర్పి కలిగించుకున్న చీకటిలా ఆహ్లాదకరంగా వుంది.

"ఆస్పత్రికి వెళ్ళేను" ఇంటి కొచ్చినందుకు సంజాయిషీ చెప్పుకున్నాడు వెంకట్రావు.

"ఈవేళ చవితి కాదూ, ఆపరేషన్లేంలేవు. అంచేత షీలా సినిమా కెళదామంటే వేగం వచ్చేసేను. నిలబడే వున్నా వేఁవిఁటి" అంటూ కూర్చున్నాడు ధర్మారావు.

షీలా సినీమాకి అడ్డు రాదల్చుకోలేదు వెంకట్రావు. చిన్ననాటి ధర్మారావు స్నేహం బహు జాగ్రత్తలు తీసుకుంటేగాని నిలబడక పోవచ్చు అంచేత.

"పార్వతికి జ్వరంగా వుంది" అన్నాడు. డాక్టరు ధర్మామీటరు తీసి వెంకట్రావుకి యిచ్చేడు.

"జ్వరం నాక్కాదు" అన్నాడు వెంకట్రావు.

"తెలుసులేవయ్యా. ముందు నువ్వు ధర్మామీటరు పెట్టుకో" బలవంతం చేసేడు డాక్టరు.

వెంకట్రావు పెట్టుకున్నాడు.

ధర్మామీటరు పుచ్చుకుని చూస్తూ "థేంక్ గాడ్, నార్మల్, కాని నీకే జబ్బుంది అన్నా నమ్ముతాను. ఇప్పుడు చెప్పు. యెప్పు డొచ్చింది జ్వరం పార్వతికి" అన్నాడు డాక్టరు.

"పొద్దున్న."

"ఎంతుంది?"

"నూట మూడు దగ్గర."

"తలనొప్పుందా? ఇప్పుడు రమ్మంటావా? పొద్దున్నొస్తే చాలా? మొహమాటపడకు. వెధవ సినిమాకేంవుంది? మరొక ప్పుడు వెళ్ళవచ్చు. ఉట్టప్పుడు నువ్వొస్తావా? నీ మంచితనంకొద్దీ నువ్వొస్తే మాత్రం నాకు తీరికుంటుందా?" అని టేబిల్‌మీద పేడ్ తీసుకొని మందులు రాస్తూ, "బుద్ధి గడ్డితిని చదివేననుకో యీ మెడిసిన్. చద్దామంటే కూడా తీరికుండదు. మీకేం రాజాలు. ఇష్టముంటే కోర్టు కెళతారు, లేకపోతే పార్టీ వెధవని పొమ్మం టారు" అన్నాడు ధర్మారావు.

రాత పూర్తయింది.

లోపలనుంచి కాఫీ వచ్చింది.

"నువ్వు తీసుకో. నే కాఫీ మానేసేను" అంటూ కాఫీ వెంకట్రా వుకి అందించేడు.

అతను కాఫీ తాగడం అయేక "అఫ్‌కోర్సు, సిగరెట్లు మాన్లే దనుకో" అంటూ జేబులోంచి కేస్ తీసి వెంకట్రావుకి ఒక సిగరె ట్టిచ్చి తనొకటి నోట్లో పెట్టుకుని లైటర్‌తో తన సిగరెట్ వెలిగిం చేడు ధర్మారావు. లైటరుకోసం అతని దగ్గరకెళ్ళి సిగరెట్ అంటిం చుకున్న వెంకట్రావుకి తల తిరిగి మొహం తిరిగినవాడిలా సోఫాలో కూర్చుండి పోయాడు.

"అదేమిటలా ఐపోయేవ్, ఎప్పుడూ సిగరెట్ కాల్చని వాడిలా?"

"ఇరవై రోజులై సిగరెట్లు మానేసేను" అన్లేకపోయేడు వెంకట్రావు. అంటే తన దైన్యం అంతా బైటపెట్టుకున్నట్టే. అంచేత "అబ్బెబే ఏం లేదు" అని మాత్రం అనగలిగాడు.

"రేపొకసారి హాస్పిటల్‌కి రా. బీ. పీ. చూస్తాను. యెందుకేనా మంచిది" అన్న డాక్టరులో ఎందుకో హుషారు తగ్గిపోయింది.

"మీకు సినిమాకి టైమైపోతోంది."

"సర్లే దానికేం" అంటూ పరధ్యానంలోంచి బైటపడి వెంక ట్రావు వేపు పరీక్షగా చూసేడు డాక్టరు. అతనికి ఆ మొహంలో యేం కన్పించిందో కాని తను రాసిన కాయితం మడత పెట్టి జేబులో పెట్టుకొని లోపలికి వెళ్ళేడు.

కొంతసేపటికి మళ్ళీ గదిలోకి వస్తూ "ఇంద ఈ టేబ్లెట్లు పార్వతికి సిక్స్ అవర్లీ. ఇదిగో ఇది తల్నొప్పుంటే వేసుకోమను. ఈ టానిక్ నువ్వు వాడి చూడు, రేపొస్తా" అని మందులు అందించేడు డాక్టరు.

వెంకట్రావు లేచేడు.

డాక్టరు లేవలేదు. అతను లేవలేకపోయేడు. వాళ్ళు పీయూసి కలిసి చదువుకున్నప్పుడు మంచి స్నేహితులు. అప్పటి వెంక ట్రావుకి ఇప్పటి వెంకటరావు ఏమీ కాడు. దె ఆర్ స్ట్రేంజర్సు. ఆ ఇద్దరూ కేవలం అపరిచితులు.

"థాంక్యూ వెరీమచ్ అని తప్ప కేవలం "థాంక్స్" అనలేని మనిషి వెంకట్రావు" అనుకున్నాడు డాక్టరు.

# 18

వెంకట్రావు మందులు యింటి దగ్గర యిచ్చి తన సీనియరు అఫీసుకి వెళ్ళి, తిరిగి వచ్చేసరికి తొమ్మిది దగ్గరైంది.

సొజ్జి తినేసి మంచం మీద పడుకొని ఏదో భజన పాటలు పాడుకుంటున్న తల్లి అతన్ని చూసి పాట ఆపేసింది.

పిల్లలంతా వీధి వరండాలో చాపమీద చదువుకుంటు న్నారు. లోపల వరండాలో గోడవేపుకు తిరిగి పడుకుంది పార్వతి.

అతను తన గదిలోకి వెళ్ళేసరికి పందిరి మంచంమీద మూడేళ్ళ పిల్లడ్ని పక్కలో వేసుకొని బోర్లాపడుకుని వుంది శకుం తల. అతను లోపలికి వచ్చినప్పుడు గాని, బట్టలు మార్చుకు న్నప్పుడు గాని ఆమె లేవలేదు.

'ఈవిడ క్కూడా జ్వరమా ప్రభూ!"

"నిద్రపోతున్నావా?" పలకరించేడు.

"అబ్బే లేదండీ, యెప్పుడొచ్చేరు?" అంటూ తుళ్ళిపడి లేచి నిల్చుంది.

పుట్టిన దగ్గర్నుంచీ యేడుస్తున్న మనిషి కళ్ళలా ఆమె కళ్ళు ఎర్రగా పొంగి వున్నాయి.

గదిలో మాసిన గోడలు మింగగా బల్బు కాంతి కొంచెమే మిగిలింది.

ఆ గుడ్డి వెల్తురులో ఆమె కట్టుకున్న ముతక చీర యింకా ముతకగా కనిపిస్తోంది.

ఆమె తన చిన్నప్పటి ఫోటోలా జబ్బుగా కనిపిస్తోంది.

"ఏం చేస్తున్నావ్?"

"అబ్బే ఏం లేదూ–ఏదో ఆలోచిస్తూ...పరధ్యానంగా..."

"ఏఁవిటాలోచిస్తున్నావ్?" అని అడక్కపోతే బాగుండి వుండే దనిపించింది అతనికి.

"బాబిగాడ్ని ఏం చదివిద్దామా అని..."

అబద్ధం అని అతనికి తెలుసు. అబద్ధం కాబట్టే అతను వినగలిగేడు.

"నా గురించీ ఆలోచిస్తున్నాను. మన బాబిగాడి గురించీ ఆలోచిస్తున్నాను. మన గురించీ ఆలోచిస్తున్నాను. పిచ్చెక్కి పోయేటట్లు ఆలోచిస్తున్నాను. ముఖ్యంగా...నీ గురించి ... అణాకాని ఆర్జించలేని వాడివి, ఉంటుందన్న ఆశ లేని వాడివి నన్నెందుకు కట్టుకున్నావ్? కట్టుకున్న వాడివి....అదిగో ఆ మంచం మీద ... ప్రపంచంలో మంచుకొండలే కాక అగ్ని పర్వతాలు కూడా ఉంటాయనీ, మేకపిల్లలే కాక పెద్దపులులు కూడా ఉంటాయనీ, ఆకలుంటుందికాని అన్నం వుండదనీ, స్కూళ్ళూ కాలేజీలూ ఉంటాయని గానీ వాటిలో చదువుకోడానికి డబ్బుండదనీ తెలీని ఆ పిల్లాణ్ని...భగవాన్ నన్ను మాట్లాడించ కండి. నేనేం మాట్లాడుతున్నానో నాకు తెలీదు. నాకు పిచ్చెక్కి పోతున్నది. నాకు అన్నం పెట్టలేని వాడివి. నాకొడుక్కి చొక్కా కొనలేని వాడివి, మమ్మల్నెందుకిలా ఆకలికి మాడ్చి–చలికి వదిలి ఇలా కొంచెం కొంచెంగా చంపుతావ్.

ఈ వేళ బాబిగాడికి అన్నం లేక గంజే పోసేనని నీతో యెలా చెప్పను? నాకా గంజి కూడా...ఒకప్పుడు నన్ను తొడ మీద పడుకోపెట్టుకని నా కళ్ళలో చీకటి రాత్రి చుక్కల ప్రతి బింబాలు చూసుకుని "ఈ రాత్రీ, నువ్వూ నేనూ, ఎప్పుడూ ఇలా వుండిపోతే" అని మురిసిపోయిన నీతో, నాకు తాగ డానికి ... ఎప్పటికీ తెల్లారని యీ కాళరాత్రి–ఆ గంజి కూడా లేదని ఎలా చెప్పను? నువ్వు యీ పూట అన్నం మారు అడక్కూడదని ఎన్నిసార్లు ఎంతమంది దేవుళ్ళని ఎంతగా ప్రార్థిస్తున్నానో ఎలా చెప్పను?

ఎన్నాళ్ళీ చావులాంటి బ్రతుకు నాకు?

ఎన్నాళ్ళీ అంతులేని చావు?

నువ్వు మొగాడివి కావా?

నువ్వు మొగుడివన్న భయం, మొగాడివన్న గౌరవం నాకు ఎప్పుడో పోయేయి.

నీకు చేతనైతే మమ్మల్ని పోషించు, లేకపోతే మమ్మల్నొదిలీ, మా దారిని మేం పోతాం. ఎలాగో బతుకుతాం. ఎలాగ బతికినా ఇంతకంటె బాగానే బతుకుతాం. మూడూళ్ళూ ముష్టెత్తి పోషి స్తాను పిల్లాడ్ని. నాలుగిళ్ళు ఊడిచి పోషిస్తాను. వళ్ళు అమ్ము కొనైనా..." అన్న నిజం బయటపెడితే అతను భరించ గలిగే వాడా?"

"కాళ్ళు కడుక్కొని రండి."

కాళ్ళు కడుక్కున్నాడు.

"భోజనానికి రండి."

భోంచేసేడు. గడాకలికి తిండి సయించలేదు.

"తల్లీ లోకమాతా! నా మానం కాపాడావమ్మా. ఆయన అన్నం మారు అడగలేదు. అమ్మా ఆదిశక్తిః నీ ఋణం ఎలా తీర్చుకోను తల్లీ..."

భోంచేసిన వెంకట్రావు పందిరి మంచంమీద వెల్లకిలా పడు కున్నాడు.

గోడకీ చూరుకి మధ్య ఖాళీలోంచి రెండు ఎలుకలు అతని వేపు భయం భయంగా చూసేయి.

మంచం దోమతెర కర్రలకి పట్టిన సాలెగూడు ఎలక్ట్రిక్ లైటు కాంతిలో వెండి ముగ్గులా వుంది. కాని అందులో చచ్చిపోయిన పురుగు చచ్చిన పురుగులాగే అసహ్యంగా వుంది.

ఆలోచిస్తూ కళ్ళు మూసుకున్న వెంకట్రావు శకుంతల వచ్చి మంచం దగ్గర నిలబడ్డం చూడలేదు. చూసిన తర్వాత ఆశ్చర్య పోయేడు.

చీరకూ, జాకెట్టుకూ మధ్య ఆమె కడుపు తెల్లగా మెరిసింది.

"ఎప్పుడొచ్చావ్?" అంటూ ఆమె వీపుని చుట్టేడు తన చేత్తో. అతని నల్లని చెయ్యి ఆమె కడుపుని చుట్టుకుంటున్న కొండ చిలువలా ఉంది.

"ఇప్పుడే?"

"భోంచేసేవా?"

"ఊఁ."

భోజనానికి వ్యవధి ఏదీ? అనే ఆలోచన అతనికి మొదట రాలేదు. వచ్చేక ఎదురుగా దయ్యాన్ని చూసిన మనిషిలా దిగ్గున లేచి కూర్చున్నాడు.

"నిజం చెప్పు, భోంచేసేవా?

"మజ్జిగ తాగేను."

ఏం అడక్కపోతే ఎంత బాగుండేది.

"ఈ వేళ నుండి శనివారాలు చేదామని."

తను ఎంత తెలివి తక్కువ వాడు! ఇవేళ యెందుకు అన్నం తినలేదని రొక్కించకపోతే వచ్చే శనివారమైనా తినేది. పౌరుషం రెచ్చగొట్టి–ఆత్మాభిమానాన్ని దారుణంగా పెంచి – అవమానకరమైన నిజాన్ని పవిత్రమైన అబద్ధంగా మార్పించేందుకు ఆమెని ప్రపంచం అంచులకి తరుముతున్నాడు.

ఇందుకా తను కోర్టు నుండి వస్తున్నప్పుడు ఆమె చేటలోని రెండు పిడికళ్ళ బియ్యం కనిపించకుండా వంటింట్లోకి పారిపోయింది.

"నేను మనిషిని కాను. చెడ్డ మనిషినీ, దుర్మార్గుణ్ని కూడా కాను. మృగాన్ని అసలే కాను. మృగమైనా తన పిల్లల్ని అది పోషిస్తుంది. ఆఖరికి పంది కూడా తన పిల్లల్ని కాపాడు కోవడానికి అవసరమైతే పులితోనైనా పోరాడుతుంది. ఆ పోరాటంలో అది చంపడానికి, చావడానికి కూడా వెనుదియ్యదు. నేను పశువు కంటే నీచుణ్ని.

మనిషినీ, పశువునీ కాకపోయినా కనీసం రాక్షసుణ్ని కూడా కాదు. ఏ రాక్షసుడూ తన పెళ్ళాం పిల్లల్ని పస్తులు పెట్టలేదు. రాక్షసుడిలో అధమం ఒక్క మంచి గుణమైనా ఉంటుంది. లక్ష్య సాధనకి అతను యేహత్య అయినా చేస్తాడు.

ఈ వేళ నుండి నేను మనిషిగా కాకపోయినా రాక్షసుడిగానైనా బతుకుతాను. బతుకంటే యిప్పటి చావులాంటి చేతకాని బతుక్కాదు, నిజమయిన బతుకు.

నిండు బతుకు.

రెండు పూట్లా నాకూ నా వాళ్ళకీ తిండి వున్న బతుకు.

ఒంటినిండా గుడ్డ ఉన్న బతుకు.

నాకు ఏదీ అడ్డురాదు. ఈ వేళ నుండీ నాకు నీతీ – అవినీతీ, పుణ్యం–పాపం, దేవుడు – దెయ్యం, నిజం – అబద్ధం, స్వర్గం–నరకం, మంచీ – చెడ్డా చెయ్యకూడనివీ – చేయవలసినవీ ఏవీ లేవు.

నేను దేనికీ వెరవను. ఎవరడ్డు వచ్చినా – ఆఖరికి దేవుడైనా సరే.... పీక పిసికి చంపేస్తాను. ఈ వేళతో నాలో మానవత్వం చచ్చిపోయింది. ఈ వేళ నా కళ్ళకి పెరిగిన పొలుసులు రాలిపోయేయి.

ఈ వేళ నుండి దొంగతనానికీ, దోపిడీలకీ, కుట్రకీ, కుతంత్రానికీ, హత్యకీ దేనికీ వెరవను. పది ఊళ్ళు కొట్టయినా, పది పీకలు కోసైనా నా పెళ్ళాం పిల్లల్ని పోషిస్తాను.

చచ్చేక ఏ దేవుఁడో కనిపించి ఎందుకిలా కిరాతకుడవైపోయేవని అడిగితే "నాకు తమ్ముళ్ళని, చెల్లెళ్ళని, తల్లిని, పెళ్ళాన్ని, పిల్లడ్నీ, యిచ్చి, వాళ్ళని పోషించడానికి ఏవిఁచ్చేవు? ఎవరో సంసారాల్లేని వాళ్ళు చేసిన నీతులతో, కడుపు నిండిన వాళ్ళు చేసిన శాసనాలతో, నా కాళ్ళు చేతులు కట్టేసి, నన్ను తోలు కొరడాతో కొట్టి, పరిగెత్తి నా వాళ్ళకి తిండి సంపాదించమన్నావు. నీకొరడా దెబ్బకితెగిన వీపు మరింక దెబ్బలు తినలేక. కాళ్ళకి వేసిన బంధాలు అడుగు ముందుకు వెయ్యనివ్వక–మాడుతున్న నా వాళ్ళ ఆకలి కేకలు వినలేక – బంధాలు తెంచుకుని నీ చేతిలో కొరడా లాక్కుంటే నీ కెందుకంత కసి? నా స్థానంలో నువ్వుంటే ఆ కొరడా తిరగేసేవాడివి. నేన్నీకన్నా మంచివాణ్నే కాబట్టి వూరుకున్నాను. నేను చేసింది రైటని నేను అప్పుడూ ఇప్పుడూ కూడా నమ్ముతాను. నేను కాదు ఏ మంచివాడైనా అలాగే నమ్ముతాడు.

ఇప్పటికైనా మించిపోయింది లేదు. నీ మనసు మార్చుకో, నీ పద్ధతులు బదలాయించు. నీ కాపీ పుస్తకాల నీతులు తిప్పి రాయి. నువ్వు సృష్టించిన ఈ ప్రపంచంలో ఎన్ని లక్షల ఏళ్ళ నుండో కోట్లకొలదీ నాలాంటి వాళ్ళు, నీ పేరు చెప్పుకొని–నీ మహిమలు ఊహించుకొని–నీ నీడ చూసి ఝుడుసుకుని భగ్గున కాలిపోతూనే ఉన్నారు. కాని నీ సృష్టి ఆగలేదు. ఇప్పటివరకూ నశించిన వాళ్ళకంటే యిటుపైన నశించవలసిన వాళ్ళే ఎక్కువ. జరిగిన దానికంటె జరగవలసిన కాలమే జాస్తీ.

కాబట్టి నీ మనసు మార్చుకో. నువ్వు మంచివాడివికా అని చెప్పేస్తా. నా మాట వినక, లేక నచ్చక నన్ను రౌరవాది నరకాలకి తోసేదా, "ఆ బాధ నేను యిప్పుడు పడుతున్న దానికంటే పెద్ద దేమీ కాదు" అని తీర్మానించుకున్నాక వెంకట్రావు దిగ్గున లేచి గోడమేకుకున్న బనీను తీసి తొడుక్కున్నాడు.

"ఈ అర్థరాత్రెక్కడికి?"

"ఎక్కడికీలేదు. ఇక్కడ గాలిలేదు. వీధరుగుమీద కొంతసేపు కూర్చుందామని, నువ్వు పడుకో" అంటూ బైటకు వచ్చేడు.

అప్పటికప్పుడే పిల్లలు చదువు ఆపేసి లోపల పడుకున్నారు. వీథి అరుగుమీద చిరిగిపోగా మిగిలిన తుంగ చాపమీద వీధి కుక్క పడుకుంది. అది వెంకట్రావుని చూసి యింకొకడికి డ్యూటీ అప్పగించేసిన పోలీసులా మెట్లుదిగి రోడ్డుమీద పడుకుంది. దాని రాకకి కుళ్ళు కాలవలో దోమలు కదిలేయి.

ఊరు మాటు మణిగింది.

ఆకాశంలో చుక్కలు చలికి వణికిపోతున్నాయి.

వెంకట్రావు యింటి పైకప్పు ముసలిగేదె నడుంలా మధ్య వంగి పోయింది. దాని జారిపోని పెంకులు పగిలిపోయేయి.

చెక్క సున్నం పోయిన వీథి గోడలకి చర్మవ్యాధి వచ్చినట్టుంది.

అరుగు ముందు పడుకున్న వీధి కుక్క ఆకలివల్ల అరవలేక పోతోంది.

అరుగుమీద కూర్చున్న వెంకట్రావుకి గుండెల్లో ఆకలిలాంటి దిగులువల్ల బరువుగా వుంది. అతనికి యింకా ముప్ఫై ఏళ్ళు నిండలేదనీ అతని తల్లి ఒక్కర్తె మాత్రం అనగలదు. అతని ముఖం ముడతలుపడి, ముసలిదైపోయి, అతనికున్న అతి నల్లని జుత్తు తగిలించుకున్న విగ్గులా వుంది.

అతనికి చదువుకునే రోజుల్లో మంచి మార్కులే వచ్చేవి. అతనికి మాట నైపుణ్యం వుంది. మిగతా వకీళ్ళకంటే మంచి ఇంగ్లీషే మాట్లాడగలడు. నాలుగు కేసులు వస్తే మంచి ప్లీడరే అవగలడు. కాని ఆ నాలుగు కేసులూ ఎలా సంపాదించడం? అంటే ఎలా సంపాదించాలో అతనికి తెలియకకాదు. నక్కలు శ్మశానాన్ని నమ్ముకున్నట్టు ఒక్క మేస్ట్రీటు కోర్టునే నమ్ముకొని రవంణగాడూ, రాఘవరావు బతుకుతున్నారు. వాళ్ళూ బారులోకి నిన్నగాక మొన్నవచ్చిన వాళ్ళే. మేస్ట్రీటు కోర్టు జవాన్లనీ, గుమస్తాలనీ పట్టుకుని బతుకుతున్నారు. మేస్ట్రీటు కుళ్ళు జోకులకి నవ్వి బతుకుతున్నారు. మేస్ట్రీటుతో పేకాట ఆడి బతుకుతున్నారు. దళారీ ఇచ్చి బతుకుతున్నారు. తను అలా చెయ్యగలడా?

సబ్ జడ్జీది తన కులమేనని, తనకి దూరపు బంధువనీ, అతని కోర్టులో తనమాటే చెల్లుతుందనీ మూర్తిగాడిలా డబ్బా కొట్టగలడా? అధమం మెస్ట్రీట్ కోర్టు స్టాఫ్‌తో "రవంణా రాఘవ రావు ఏ షరతులకి వప్పుకున్నారో నేనూ వప్పుకుంటాను" అని అనగలడా! లేకపోతే పోలీసు వాళ్ళతో చేరి వాళ్ళ ప్రాపకంతో నారాయణగాడిలా వర్కు సంపాదించగలడా? ఆలోచనలలో అంతు దొరకక సతమతమవుతున్న వెంకట్రావు "ఏం చేస్తున్నావ్?" అన్న శివరావు మాటలకి తుళ్ళిపడ్డాడు.

క్లబ్‌లో పేకాడి యింటికి పోతున్న శివరావుకి వీధి అరుగు మీద కూర్చున్న వెంకట్రావు కనిపించేడు. అంత రాత్రివేళ అక్కడ వెంకట్రావు ఎందుకు కూర్చున్నాడో, యింట్లో ఎందుకు నిద్ర పోలేదో అంచనా వేసేడు శివరావు.

పట్టె మంచాన్నీ, పట్టు పెళ్ళాన్నీ వదలి వెంకట్రావులాంటి వాడు వీధరుగుమీద కూర్చుంటే అతగాడు ఖూనీకైనా సిద్ధపడాలి. లేదా ఆత్మహత్యకయినా సిద్ధపడాలి. రెండు రెళ్ళు నాలుగే!

"జరుగు బ్రదర్" అంటూ వెంకట్రావు పక్కన చాపమీద చేరేడు శివరావు. చేరి ఆ కబురూ ఈ కబురూ చెప్పి సిగరెట్టు యివ్వబోయేడు. వెంకట్రావు తీసుకోలేదు.

"కొంపతీసి సిగరెట్లు మానేసేవేవింటి? వెనకటి కెవడో సిగరెట్టు మానీడం చాలా సుళువు. 'నేను లక్షసార్లు మానీసేను' అన్నాట్ట నన్ను తపస్సు చేయమన్నా చేస్తాను. కాని సిగరెట్టు మాత్రం మాన్లేను సుమీ. అసలు నాకు సిగరెట్ ఎప్పుడూ కాల్చని వాళ్ళంటే చాలా భయం. దేరీజ్ సమ్‌థింగ్ అన్‌నాచురల్ యిన్ దెమ్. ఇది కలియుగం మొగాడన్నాక ఒక సిగరెట్ అయినా కాల్చాలి. ఆడదన్నాక ఒక లవ్‌లెటరన్నా రాయాలి. లేకపోతే యుగ ధర్మానికి ఎగెనెస్టు. నాకో మేనమాంవున్నాడు. ఎలా గుంటాడను కుంటావేంవింటి? సడన్‌గా ముసిలై పోయిన బాల బుద్ధుడిలా ఉంటాడు. అతను కాఫీతాగడు. సిగరెట్ వాసన కూడా చూడడు. సినిమాహాలు ఎటుందో తెలీదు. మనలో ఎంత చిన్న తప్పైనా సరే క్షమించలేడు". అంటూ తనొక సిగరెట్ అంటించుకుని వెంకట్రావు కొకటిచ్చి "అసలు సిగరెట్ కాల్చని వాడంటే కన్నా సిగరెట్ మానేసిన వాడ్ని చూస్తే నాకు వణుకు. వాడు ఋషి అయి పోయిన రౌడీ. మామూలు ఋషులకుండే మంచితనం వాడికుండదు.

ఇంతకీ నువ్వు సిగరెట్టెందుకు మానెయ్యాలి? మానేసి మిగిల్చిన రూపాయితో నువ్వు గేరేజి కట్టేసి ఫారిన్ కారు కొనేసి ఊరేగుతావా? మీ ఆవిడకి ఏడంతస్తుల మేడ కట్టేసి ఏడు వారాల నగలు చేయించి బంగారు తూగుటుయ్యాలలో ఊపు తావా? నీ కొడుకుని పబ్లిక్ స్కూల్లో చదివించుతావా?

ఇక నువ్వు సిగరెట్ మానీయడంవల్ల నష్టాలు నీ కన్నా మీ ఆవిడకి బాగా తెలుస్తాయి. నీ కోపం నీకు తెలీదు. పక్కవాళ్ళా – మర్చిపోలేరు. నీ పవిత్రతలో నీకు నమ్మకం ముదిరిపోతుంది. అంటే నీ చుట్టూ వున్న వాళ్ళంతా నీ పాదాలకి మొక్కాలనుకుం టావ్. నువ్వు బోడి సిగరెట్లు మానేసినంత మాత్రాన వాళ్ళెందుకు సాష్టాంగ పడాలన్న విచక్షణ నీ కుండదు. నువ్వు చేసిన ప్రతి పనీ నీకు నచ్చడం మొదలు పెడుతుంది. నువ్వొక త్యాగమూర్తి వన్న నిశ్చయం నీకు కలుగుతుంది. పైవాడు చేసిన ప్రతి పనీ ఎంత మంచిదయినా సరే నీకు బొక్కిగా కనిపిస్తుంది. నీలో శాంతం చచ్చిపోయి కోపం జాస్తీ అయిపోతుంది. పిల్లలు ఏడిస్తే ఓర్చలేవు. స్నానం ఆలస్యమయితే భరించలేవు. ఆఖరికి నిన్ను నువ్వే ప్రేమించుకునే దరిద్రగొట్టు స్థితికి వచ్చి చేసిన తప్పుకో చెయ్యని తప్పుకో ఈ వేళ నీ కొడుకుని కొడతావు. పెళ్ళాం, పిల్లడూ కూడా వూరుకుంటారు. రేపు కూడా కొడతావు. మళ్ళీ వూరుకుంటారు. ఎల్లుండీ పెళ్ళాన్ని కొడతావు. నా పెళ్ళాం లాంటిదైతే మూడు రిజిష్టరీ నోటీసులిచ్చి, మూడు కోర్టులూ తిప్పి మనోవర్తి కక్కించి, జైలుక్కట్టిస్తుంది. కాస్త మంచిదైతే కొన్నాళ్ళాగుతుంది" అని ఆగేడు.

వెంకట్రావు మాట్లాడలేదు.

అంచేత మళ్ళీ శివరావే "నా పెళ్ళాం నన్నెందుకు జైలు క్కట్టించేస్తుందన్నానూ?" అని ఆగేడు.

"సిగరెట్ మానేస్తే" వెంకట్రావు జవాబు చెప్పేడు.

"రైట్ యూ ఆర్. మా ఆవిడ నేను ఏం చేసినా వొప్పుకుం టుంది. కాని, సిగరెట్ మాననివ్వదు. ఆ మధ్య 'తల్లీ, డాక్టరు మానీమన్నాడే మానేస్తాను' అని బతిమాలేను. కాని 'బతికిన న్నాళ్ళు నన్ను సుఖపడనివ్వండి. సిగరెట్ మానేసిన మీకు మీ కోపం తెలీదు. నాకు మరుపురాదు' అని 'ఇన్ లిమినీ' కొట్టిపారే సింది" శివరావు ఆగిపోయేడు.

కాని వెంకట్రావు మాట కలపలేదు. వెంకట్రావు పరిస్థితులు శివరావుకి బాగా తెలుసు. అంచేత మాట్లాడుతున్నప్పటికీ వెంక ట్రావు మౌనానికి ఒంటరితనానికి కారణాలు ఆలోచిస్తూనే ఉన్నాడు. చివరికి అసలు విషయం పసికట్టగలిగేడు. అంచేత మళ్ళీ తనే అందుకున్నాడు.

"నువ్వేం అనుకోకు బ్రదర్. నీ బాధ నాకు తెలుసు.

చీకట్లో కూర్చుని చుక్కలు లెక్కపెడితే పార్టీలు రారు గురూ!

నల్లకోటుని చూసి దుక్క పువ్వుకి తుమ్మెద లెగబడ్డట్టు పార్టీలు ఎగబడే రోజులు పోయాయి.

మా తాత ఈ వూళ్ళో బండి దిగి పంచ మార్చుకునే లోపున పది మంది పార్టీలు కాళ్ళమీద పడ్డారట. అతగాడు వాది దగ్గరా ప్రతివాది దగ్గరా ఒక్కలా స్టాంపు ఖర్చులు పుచ్చుకుని మేడలు కట్టేసేడు. అఫ్‌కోర్సు అతగాడు ఆ పాపం చెయ్యకపోతే నేనే ఆ పాపాలు చేస్తూ ఉండేవాడిననుకో. ఇంతకీ పాపం చేద్దామని మనం అనుకున్నా అవకాశం యేదీ? మా తాత రోజులు వేరూ, మన్రోజులు వేరూ. అతను కత్తిపట్టుకొని నిలబడితే పది వెర్రి గొర్రెలొచ్చీ పీకలిచ్చేసేవి ఇప్పుడు మనుషులు తెలివి మీరి పోయేరు. ఇంక మన ప్రొఫెషనంటావా? నీకూ నాకూ తెలీదు గాని ప్రతి లిటిగెంటు వెధవకీ ఖర్చుల లిస్టు కంఠతా అనుకో. ఆఖరికి గమాస్తాగాడి మామూళ్ళు కూడా మనం అబద్ధం ఆడ్డా నికి వీల్లేదు.

మొన్నేం జరిగిందో తెలుసా? తల మాసిన వెధవొకడు రెండొందలకి ప్రోనోటు పట్టుకొచ్చేడు. బోడిగుండు బంగారప్ప ళ్ళతో వెధవ పంపర పనాస పండులా యెలా ఉన్నాడనుకున్నావ్? రాసిన వాడిమీదా కొడుకు మీదా దావా పడేమన్నాడు. దావా రాశాను. మనకి గుమాస్తా వెధవంటూ చావలేదుగా. అంచేత ప్రతివాది సమన్ల దగ్గర్నుంచీ నింపేను. ఖర్చుల లిస్టు రాసేను. ఖర్చులన్నీ న్యాయంగానే రాశేను. కాని వాడాలిస్టు చదివేడు. చదివిన వెధవ చదివి ఊరుకోవాలా? 'బాబూ కళ్ళజోడు మర్చి పోనాను. మసక మసగ్గుంది. నువ్వే సదివిపెట్టు' అన్నాడు. ఆఖరి అయిటం ప్రతివాదుల సమన్ల ఖర్చు కొచ్చేవరకూ బాగానే ఉన్నాడొరే. ప్రతివాదుల సమన్ల ఖర్చు ఒక్కొక్కరికి రెండు రూపా యల చొప్పున వెరశి యిద్దరికి నాలుగు రూపాయలని చదివేనో లేదో పాము కరిచిన వాడిలా లేచేడొరే. లేచి 'సమను కరుసు నీకు తెల్సో, తెల్దో, నాకు తెల్దుగాని బాబూ నీలాటోడు నాకు వకీలుగాస్సరిగదా ఒళ్ళు తోవడాని క్కూడా పనికిరాడు. నానోటు నా మొకాన్ని కొట్టు' అని బల్లమీద నోటు లాక్కుని పోయేడు.

ఆ వెధవకీ యెందుకంత కోపం వచ్చిందో నా కప్పుడర్థం కాలేదు.

ఆ మర్నాడు మా సీనియరుగాడి గుమాస్తాని అడిగేను.

ఒక ప్రతివాదికి సమను ఖర్చు నేను అనుకున్నట్టు రెండ్రూపాయలేనట. కాని యిద్దరు ప్రతివాది వెధవలు ఒక్క వూళ్ళో ఛస్తే మాత్రం యిద్దరికీ నాలుగు రూపాయలు కాదుట. మూడేనట. వెధవది పదేళ్లు ప్రాక్టీసు చేస్తున్న నాకు తెలిసి చావలే దీ విషయం. మూడుసార్లు కోర్టు కొచ్చేడో లేదో ఆ పార్టీ వెధవకి తెలుసు.

ఇంతకీ చెప్పొచ్చే దేవిఁటంటే పార్టీలు తెలివిమీరి పోయేరు. రోజుల్తో పాటు మనవూఁ మారాలి.

ఐదేళ్ళయి చూస్తున్నాను. సీనియర్ దగ్గర కెడతావు. అతగాడికి అరవచాకిరీ చేస్తావు. కోర్టు కొస్తావు. సర్ అల్లాడి అల్లుడిలా కూర్చుంటావు. నీ దగ్గర కెవరొస్తారు? ఎవరైనా వస్తారనుకుంటూ ఉన్నావేమో? నేను చెపుతున్నా విను, ఎవరూ రారు. అంచేత నువ్వే వాళ్ళ దగ్గరికి వెళ్ళాలి. ఎలా అని నన్నడక్కు.

ప్రతి వృత్తికీ నీతి మార్గాలూ, అవినీతి మార్గాలూ ఉంటాయి. నీతి మార్గంలో ఫెయిలైపోయేవు. అంచేత రెండోతోవ పట్టు. నేనేదో పతివ్రతలాగా కబుర్లు చెబుతున్నాననుకోకు. ప్రతి సీనియరూ యెంతో కొంత ఆ తోవన నడిచినవాడే. పాపిళ్ళు నెరిసి ఇప్పుడు పతివ్రతలై పోయేరు.

నన్నేం చెయ్యమంటావని అడక్కు. పడుకోదలచుకున్న ముండ 'నన్నేం చెయ్యమంటావ్' అని అడిగితే ముందేం చెయ్యకూడదో చెప్పాలి. 'పసుపు రాసుకుని పట్టుచీర కట్టుకుని పతివ్రతల కథలు చదువుతూ కూర్చోకేతల్లీ" అని మాత్రం చెపుతాను.

ఆ రవంఁగాడూ రాఘవరావుగాడూ ఏం చేస్తే–నువ్వూ అదే చెయ్యి. రేపొద్దున్నొకసారి మా యింటికిరా. ఇద్దర్రో, ముగ్గురో దళారీ వెధవల్ని అప్పగిస్తాను. వస్తే వచ్చేవు లేకపోతే పోయేవు గాని నేనేదో నీ పాతివ్రత్యాన్ని చెడిపేస్తున్నానని మాత్రం అనుకోకు. మరి వస్తాను. గుడ్‌నైట్" అంటూ లేచేడు శివరావు.

"రేపొస్తానులే బ్రదర్" అనగలిగేడు వెంకట్రావు.

# 19

ఆ మర్నాడు వెంకట్రావుకి, శివరావు చూపించిన దళారీలతో పరిచయం, పార్ట్నరుషిప్పూ ఏర్పడ్డాయి. మరి కొన్నాళ్ళకి యెవరయినా కుర్రప్లీడరుని తెలివీ, మంచితనం ఉన్న వాడిని పెంచుదామని అనుకుంటున్న గవర్రాజు దృష్టి వెంకట్రావుమీద పడింది. ప్రపంచంలో ముందుకి పోతున్న గవర్రాజుకి చాకులాంటి ప్లీడరూ, కృతజ్ఞతగల మనిషీ అయిన వెంకట్రావు చాలా ఉపయోగపడ్డాడు.

అతను ఏ కేసులో యెంతయిస్తే అంతే పుచ్చుకున్నాడు. ఇంకా యిమ్మని అడగలేదు. యింతే ఎందుకిచ్చేవనీ అడగలేదు. గవర్రాజు తెచ్చిన కేసుల్లో మంచి చెడ్డలతో, న్యాయాన్యాయాలతో అతనికి నిమిత్తం లేకుండా శాయశక్తులా పనిచేసేడు. మొదట్లో బలంలేని కేసు తెచ్చినప్పుడు మాత్రం 'యీ కేసు వాదించడం ఖర్చుల దండుగ" అని పార్టీతో చెప్పలేక పోతున్నానే అనే బాధ అతనికి వుండేది. అవి అతని అంతరాత్మకి జబ్బుచేసిన రోజులు. ఆ తర్వాత అది చచ్చిపోయింది.

# 20

రాత్రిపూట భోంచేసిన తరువాత చాలామందికి చాలా రకాలుగా చెయ్యడం అలవాట్లు వుంటాయి.

కొందరు షికారుకెళ్తారు–కొందరు సెకండుషో కెళతారు. మరి కొందరు నైట్ డ్యూటీల కెళతారు–కొంతమంది నైట్ క్వీనుల దగ్గరకు వెళతారు–చదువుకుంటూ రేడియో వింటారు కొందరు. రేడియో వింటూ చదువుకుంటారు–మరికొంతమంది. ఏ అలవాటూ లేనివాళ్ళు వెంటనే పక్క ఎక్కేసి బోర్లా పడుకుని నిద్రపోతారు.

ఎవరేం చేసినా గవర్రాజు మాత్రం రోజు రాత్రి భోంచేసిన తర్వాత కొంతసేపు వీధరుగుమీద కూర్చుంటాడు. ఎవరయినా వెర్రి ఋషి రంభా ఊర్వశీ తిలోత్తమా స్ట్రిప్ టీజ్ కాదని తపస్సు చేసి ఇంద్రుడ్ని ఐరావతం మీద నుండి లాగవచ్చు కాని, గవర్రాజుని మాత్రం మున్సిపాలిటీ మెంబరు షిప్పు నుంచీ, వీధరుగు సీటునుండీ లాగలేరు. ఆ టైంలో అతను తన వార్డు ప్రజల కష్ట సుఖాలు, ముసిలితగువు మొదలు, ముండతగువు వరకూ అన్ని రకాల సమస్యలూ–పెంచడం నేర్చుకోక పూర్వం– పరిష్కరించేవాడు.

ఆ టైములో అతను పెళ్ళిళ్లు కుదురుస్తాడు. మనువులు తెగ్గొడతాడు. ఇళ్ళు కట్టడానికీ, కొంపలు తీసేడానికి సలహాలిస్తాడు. అతని సలహాలు పాటించిన సంసారాలు కొన్ని పచ్చగా ఉంటే, పాటించని అన్ని సంసారాలూ భగ్గుమంటాయి.

అలవాటు ప్రకారం ఆ రాత్రికూడా భోంచేసి, వీధరుగుమీద కూర్చున్నాడు గవర్రాజు. ఆవేళ అంతవరకూ ఎవరూ రాలేదు. అతని దగ్గరికి. అంచేత తన వార్డులోని సర్వజనులూ సుఖులే మోనన్న దిగులు లాంటిది కలిగింది గవర్రాజుకి. కాని ఆ దిగులు యెక్కువసేపు లేదు. కారణం – సింహాచలం ఆ రాత్రికి ఎందుకో వస్తాని కబురుపెట్టేడని అతనికి జ్ఞాపకం వచ్చింది. ఎందుకు చెప్మా అని ఆలోచించడం ప్రారంభించేడు గవర్రాజు.

తలదగ్గర కూర్చున్న సుయోధుడ్ని చూసిన శ్రీకృష్ణుడు ఏమను కున్నాడు? ఆ విషయం గవర్రాజుకు తెలీదు. కారణం భారతం చదవలేదు. మరొకరు చదవగా వినలేదు. అయితే సింహాచలం లాంటివాళ్ళు తనలాంటి వాళ్ళ దగ్గర కెందుకొస్తారో తెలుసు కోవాలంటే భారతాలు చదవక్కర్లేదు. భాగవతాలు వినక్కర్లేదు.

గవర్రాజు కళ్ళు "ఎక్సురే" కళ్ళు.

అతని మనసు "రాడారు" లాటిది.

ఎదుటి మనిషి కడుపులో యెంత కుళ్ళుందో అతను క్షణంలో కనిపెట్టగలడు.

ఎవడి కంట్లో యెంత కసివుందో, వాడి నవ్వు విరుపుల వెనక ఎంత ఏడుపుందో, అది ఏ రకం ఏడుపో – అతను అర క్షణంలో గ్రహించగలడు.

మనిషినీ, మాటనీ నమ్మకపోవడం అతని నైజం.

తన దగ్గరికి సింహాచలంగాడు ఎందుకు వస్తానన్నట్టు? ఎందుకేటి? ఎపుడూ మరోడికాడికి ఏఁవీఁ ఔసరంలేందే యెల్లడు. ఏ పనీ నేకుండా సింహాచలంగాడు తన కాడికి రాడా నికి తనేం నాగేసర్రావా? ఎన్టీవోడా? ఉట్టినే సూసిపోడానికి.

పేషెంటు దగ్గరికి డాక్టరు యెందు కెళతాడు? పారిటీగాడి దగ్గరికి వకీలు యెందుకెల్తాడు? బాబాలకాడికి బక్తులెందు కెల్తారు?

ఆడదైనా మొగుడికాడి కెందుకెల్తాది? కూడుకోసం ఎల్తాది, కొంప కోసం ఎలతాది, కామరం యెక్కి ఎలతాది.

ఆఖరికి విష్ణుమూరితి కాడికి వొసిష్టుడు లాటోళ్ళు ఎందు కల్తారు? ఈ రాజుని సంపు, ఆ రాచ్చసుడ్ని సంపు అని అడగ దాని కెలతారు? ఆ యిష్టుమూరితైనా పాంమీద సల్లగా తొంగో కుండా బూలోకాని కెందుకొస్తాడు? అలా రాకపోతే ఏ రాచ్చ సుడో తన పాం పక్కనీ, పెళ్ళాన్నీ ఎత్తుకు పోతాడని భయం.

ఇంతకీ ఈ సివంచలం గాడెందుకొస్తున్నట్టు. అన్నట్టు మొన్నెవడో ఆడి తల్లికి పక్షవాతం వొచ్చిందన్నాడు. ముసలి ముండకి పక్షవాతాలురాక వేవిళ్ళు వస్తాయా? పక్షవాతం వచ్చి నాడు–చుట్టూ వున్నోళ్ళందర్నీ సంపిగాని యెల్లదు. వస్తూ వస్తూ ఆ ముసల్దానికి పక్షవాతమే రావాలా?

ఈ కుష్టురోగాలూ, పక్షవాతాలూ పూటగతిలేని ఎదవలకే వస్తాయి. గొప్పోళ్ళకయితే "అర్టెటాక్" లొస్తాయి. ఆకరికి నెహ్రూ ఐనా చెణంలో ఔతారం చాలించేసి కళ్ళు మూసేసినాడు. మనిషి బతుకు ఇలువ ఆడి సావులో తెలిసిపోతాది.

ఈ సివంచలంగాడే బతకలేక సస్తూవుంటే–యీడి కో శవం లాంటి తల్లొకర్తె. ఇన్నాళ్ళూ బాగున్న ముండ–సడీసప్పుడూ లేకుండా – కునికీ కూడదూ? కునికీదు. ఎందుక్కునికీస్తాది? కొడుకునీ, కోడల్నీ, మందిచ్చిన డాట్టర్నీ, తెలిసిన్నన్నూ సంపిగాని సావదు. అది బతికి దానికేం సుకం? మిగిలినోళ్ళకేం సుకం. నాలో గనక పవరుంటే గొప్పా–బీదా, ఆడా–మగా భేదం నేకుండా అరవై ఏళ్ళు నిండినోళ్ళందర్నీ హిట్లరు ఆళ్ళనెవర్నోగాని కాలిపించినట్లు కాల్చిమని ఆర్డరేమందును. ఇంతకీ గవర్నమెం టుకు బుద్ధిలేదు. ఇద్దరు పిల్లలు సాలని ఏడుస్తారేగాని ముసిలోళ్ళ నందర్నీ పైకి అంపించీమని ఎందుకనరు. ఎందుకేటి–పీత బుర్రలకి తట్టక. ఈ పార్లమెంటు మెంబర్ల కాన్నా పంచాయితీ మెంబర్లవేఁనయ్యం. పూజా పునస్కారం లేక బూజుపట్టిపోనాను గాని నయివేజ్యం ఎట్టుమరి. నా మహిమ సూపిస్తానన్నాట్ట యెనకటికో దేఁవుడు. కాస్త ఛాన్సు తగలగ్గాని–ఢిల్లీలో వుండాల్సి నోణ్ని, ఈ డిప్ప కత్తిరింపు యెదవల్తో తిరుగుతున్నాను.

ఇంతకీ ఈడు యెందుకొస్తున్నట్టు? నాకు దణ్ణవెట్టడాని క్కాదు. నా దీవనకోసం అసలే కాదు, ఆడి తల్లికి మందివ్వమనీ కాదు. నాకు కాకరకాయకీ, కరక్కాయకీ, భేదంతెల్దని ఆడికీ తెల్సు.

మరింక మిగిలిందేటి? డబ్బు. ఆడికొక తల్లుంది. ఆ తల్లి ముండకొక జబ్బుంది. ఆ జబ్బుకి మందుకూడా వుంది. కానైతే ఆ మందుకి డబ్బు నేనియ్యాల.

ఊళ్ళో ఎవడి తల్లికి జబ్బు చేసినా, ఎవడి పెళ్ళానికి పురుడొచ్చినా, ఎవరి ముండకి కడుపు పోయినా నా దగ్గరకే వస్తారు డబ్బుకి. నేను మున్సిపల్ మెంబర నుకుంటున్నారో, స్టేటుబేంకు ఏజంటుని అనుకుంటున్నారో ఎదవలు? తనకి కొంచెం డబ్బు, మరి కొంచెం పవరూవున్న మాట నిజమేఁ కాని

నా నిక్కడ కూకున్నది, ఆళ్ళకి మదుపు ఎట్టడా నికేనా అని ఒక్క నంజకొడుకూ ఆలోచించడు.

దేఁవుఁడు అగపడితే వరం అడగటానికైనా ఆలోచిస్తారు గాని డబ్బున్నోడు అగుపడితే అప్పడగడానికి మాత్తరం అలీస్యెం సెయ్యరు. డబ్బులో వుందా మహత్యం.

అడుక్కుతినే ఎదవను అడుగు

అమెరికా పెసిడెంటు నడుగు

"నీకేటి కావాల?" అని.

వెంటనే "డబ్బు" అంటారు.

పోనీ బుద్ధి గడ్డితిని–ఔసరంలో వున్నవాడ్ని ఆదుకున్నామా అంటే–పట్టుకెళ్ళిన పేనం యముడు తిరిగిచ్చేస్తే యిచ్చీవచ్చుగాని అప్పు పుచ్చుకున్నవాడు మాత్తరం తిరిగియ్యడు. తల్లికి మందు కిస్తే అది బతకాల. పెళ్ళాం పురిటికిస్తే ఆ పుట్టినపిల్ల డాక్ట రవ్వాల. ఆళ్ళచుట్టూ తిరగడానికి మనం మరో మూడు జన్మలెత్తాల.

మళ్ళీ డబ్బు ఒక్కొక్కడు ఎలా అడుగుతాడు? ఇనప్పే గులుంటే తప్ప కడుపు తరుక్కు పొయ్యే టట్టడుగుతారు.

"నానోటీ నువ్వోటీ కా" దంటారు.

అలాగని ఆడి కాకలేస్తే నాను అన్నంతింటే ఊరుకుంటాడా?

"బాబ్బాబూ నా తల్లొకటీ నీ తల్లొకటీ కాదంటాడు. ఈ జబ్బు నీ తల్లికే సేసిందనుకోమంటాడు. ఎదవ పెపంచకంలో నేయం నేదు. ఆడి తల్లి నా తల్లెలాగవుద్ది? ఆడి తల్లిని నా తల్లి అనుకోమంటాడే కానీ ఆడి పెళ్ళాన్ని నా పెళ్ళాం అనుకోని స్తాడా? ఎదవలకి తల్లి నేయం వేరు. పెళ్ళా నేయం వేరూను. లోకంలో ప్రతివాడికీ పక్కింటోడి పెళ్ళాం రంభలాగే అగుపడ్తాది. కాని ఈ ఎదవ సివంచలంగాడి పెళ్ళాం నిజంగా రంభే. ఆ పక్షవాతం యీడికొచ్చినా బాగుండేది" అని ఆలోచిస్తున్న గవరా జుకి వీధి చివర వస్తున్న సింహాచలం కనిపించేడు.

సింహాచలం ఎలా వస్తున్నాడు?

తనముందు దెయ్యాలగుంపు నడుస్తున్నట్టు భయం భయంగా, తన వెనక పిశాచాలు వెంబడిస్తున్నట్టు పిరికి పిరికిగా, జబ్బులో నడిచిపోతున్న మనిషిలా వస్తున్నాడు.

వీధిలైటుకీ లైటుకీ మధ్య చీకటిలోకి అతను వచ్చినప్పుడు అతన్ని భూమి మింగేసిందా అన్నట్టు కనిపించకుండా పోతున్నాడు.

గవరాజు దగ్గరకు రాగానే అతను కృష్ణుడి ముందు కుచేలు డిలా దీనంగా "దణ్ణం మాఁవాఁ" అని చేతులు కట్టుకుని నిల బడ్డాడు.

"రారా! అలాగ నిలబడిపోనా వేటి? కూకో అరుగుమీద. సుట్ట ముక్క ఉందా, యిమ్మంటావా? ఇంద తీసుకో" చుట్ట అందించేడు గవరాజు.

సింహాచలం ఒదిగి కూర్చుని చుట్ట అంటించి యేదో అన బోయేడు. కాని అన్నం వడ్డిస్తున్న అమ్మ అకస్మాత్తుగా చచ్చిపోతే ఏడుపు రాని కొడుకులా అతనికి మాట పెగల్లేదు.

ఆ సంగతి కనిపెట్టిన గవరాజే మళ్ళీ అందుకున్నాడు. "ఏటి సంగతి? వస్తానని కబురెట్టినావు? మీ యమ్మకి జబ్బు జేసిందని యిన్నాక నానే వద్దామనుకున్నాను. కాని నా బతుకు నీకు తెలీంది కాదు. అణా ఆర్జన లేదు, చెణం తీరుబడి నేదు – అన్నట్టుంది నా పని. ఆ విశ్వనాదం బాబు పార్టీ బదలాయిం చేస్తాట్ట. "ఈ పొద్దు మీటింగుకి నువ్వుండకపోతే రేపు నా కాడకి నువ్వు రాకు. ఈ రాత్రే ఊరొగ్గెయ్యాల నేను"అంటూ కబురం పేడు సెయిర్మను బాబు. ఇంతకీ ఎలా వుంది ముసల్ది!" అంటూ మూగపిల్లకి మాటలు నేర్పుతున్న తల్లిలా అడిగేడు.

"పచ్చువాతం–పడవలా పడిపోనాది" మూగపిల్లడిలాగే మాట్లాడగలిగేడు.

"ఈ పక్షవాతాలూ, పచ్చ కాఁవెఁర్లూ మన్లాటోళ్ళకి రాకూడ దొరే. ఆ దేవుడు సెలవే ఎట్టేసినాడో, రాజీనామానే యిచ్చేసినాడో – ఏటో గాని యిలాంటి అన్యాయం నీలాటోడికి జరక్కూడదొరె. మా సెయిర్మన్ పెళ్ళాన్ని సూడు –ఆర్నెల్ల కిందట టీ.బీ. అన్నారు. యింక దాని పని క్లోజన్నారు. మదనపల్లో, ఏ వూరో ఎల్లింది. ఆర్నెల్లుంది. అంతే. ఆర్నెల్ల కడుపుతో వున్నట్టు – గుమ్మటంలా తిరిగొచ్చింది. ఇంతకీ ఆ యమ్మ వూసు మనికెందుగ్గాని – డాట్టరుకు సూపెట్టేవా ముసల్దాన్ని?"

"సూపెట్టినాను."

"మరైతే–ఏటంటాడు డాట్రు? వందో రెండొందలో తెమ్మని ఉంటాడు. డబ్బు సూపించకపోతే డాట్రు, గుళ్ళో బొమ్మతో సమానమనుకో. గుళ్ళో బొమ్మయినా భక్తికిమెచ్చి వరం యిచ్చి నట్టు కథలు యిన్నాంగాని డబ్బుచ్చుకోకుండా పన్జేసిన డాట్రు కత–నీ సంగతి నాకు తెల్దుగాని–నాను మాత్తరం విన్లేదు. ఇంతకీ ఏటంటాడు డాట్రు?"

"పట్నం తీసికెళ్ళమన్నాడు."

"అంటా దంటాడు. అనకపోతే ఆదు గవర్నమెంటు డాౖటెలా అవుతాడు? నిన్ను చూసి, నీ జేబీలో సుట్టముక్కా, యింట్లో నీ పెళ్ళాం యిప్పీసిన కోకా తప్పిస్తే – నీకాడ యింకేటేన్నదని కనిపెట్టే సుంటాడు. నీ యమ్మకి వొయిజ్యం జేసినా, నీకు గెడ్డం గీసినా ఒకటే. అణా డబ్బులకంటే రాలవని తెలిసి పట్నం అట్టుకు పొమ్మన్నాడు".

"ఆ బాబు డబ్బడగనేదు."

"ఎందు కడుగుతాడేటి? యమదరమరాజుని పేనాలడిగితే ఎంతో, నిన్ను డబ్బడిగినా అంతే. కాపోతే యముడు పేనాలుం చుకునే యియ్యడు. నీ దగ్గర డబ్బులేక యియ్యవు. అదే తేడా. ఆ బాబేం ఎఱ్ఱిగొర్రె అనుకున్నావేటి?"

"అమ్మని పట్నం తీసుకెళ్ళాల."

"అవును మరి తీసుకెళ్ళాల. తప్పదు. జబ్బుతో వున్న ఎవుడి నన్నా ఇషం పెట్టి సంపీసినా తప్పునేదుగానీ. మందిప్పించకపోతే మహా పాపం. మరొకరూ మరొకరూకాదు. సొంత తల్లి. నువ్వు గాకపోతే ఎవరు జేస్తారు? నీకు తెల్దుగాని, దాని కాలంలో యిచ్చ రూపాయ కాసంత బొట్టెట్టుకొని కుండంత కొప్పెట్టుకొని, పూల కోక కట్టుకొని, నెత్తిమీద గడ్డిబుంగా, సేతులో కొడవలితో పొలం నుంచి వస్తూ వుంటే సాక్షాత్తూ లచ్చిందేవే కొడవలట్టుకొని వస్తు న్నాదా అన్నట్టుండేది. ఆ వూసెందుగ్గాని–ఎప్పుడు తీసికెళ్దా మనుకుంటున్నావ్?"

"....................."

"ఒయసొస్తున్న కొద్దీ తెలివితక్కువ లావై పోతుందొరే నాకు. లేక పోతే తీసికెళ్ళడానికి డబ్బుందా అనడక్కుండా ఎప్పుడు తీసికెళతావని అడుగుతానా? డబ్బు కోసం వచ్చేవు. ఔనా?

"ఔను అన్నట్టు తల ఊపేడు సింహాచలం.

"వరసకి అల్లుడవవుతావ్, నాకాడికి రాక యింకెక్కడి కెళతావు నువ్వు మాత్తరం...నువ్వే కాదు. నీలాటి ప్రెతీవోడూ అంతే. మీ తప్పేటుందిలే. 'ఇంతవలం (లావు) ఉన్నావు. పామ్ముం త్రం రాదా' అన్నాట్ట వెనకటి కెవడో. మునిసిపల్ మెంబర్నీ, కంట్రాక్టర్నీ, నాకాడ డబ్బులేదంటే ఎవడు నమ్ముతాడు? చెప్పుకుంటే సిగ్గొరే–ఇదిగో! సేతిలో యీ సుట్టా, జేబులో అగి పెట్టేతప్ప నాకాడ కానీలేదంటే నువ్వు మాత్తరం నమ్ముతావా? నమ్మవు. ఎందుకు నమ్మాలి? కాని ఊరందరి బాదలూ యిన డమే గాని నా బాదలెవడితో సెప్పుకోను? ఎంత సెట్టుకంత గాలన్నారేగాని నాది రెట్టింపు గాలి సెట్టు–నన్ను వేళ్ళతో నా పిల్లలు కుదిపేస్తున్నారంటే నమ్మొరే?

నెలయ్యాసరికి పాతికో పరకో వస్తున్నమాట నిజమే కాని నెలయ్యాసరికి–సిగ్గు సిగ్గు–సుట్టముక్క ఎవడిస్తాడా అని సూడ్డమే. నాకు మూడు బిల్లులు రావాలి. నిజవేఁకాని, శవం ఆచారి గాడున్నాడే, ఆడుతిన్న మామ్మూలు చాల్దని నొక్కీసినాడు. నా బిల్లేటి? తల్లి పీక నొక్కేస్తాడు మామ్మూలు ముట్టకపోతే, ఆకరికి, ఆ బాబు ఒళ్ళు పిసికీ, కాళ్ళు పట్టుకునీ, యెలాగైతేనేం ఐదొం దలు పాసు చేయించుకొని ఇలా ఇంటికి అట్టుకొచ్చినానో – లేదో–అదుగో–ఆడు – ఎవడనుకున్నావు – కాకినాడలో వొయి జ్యం సదువుతున్నాడే నా సుపుత్తురుడు–ఆడు అర్జంటుగా ఐదొందలు అంపితే ఎలాగో ఒక వారం సర్దుకుంటానని టెలిగ్రాం యిచ్చేడు. డాౖటుసదివి ఏటి ఆర్జిస్తాడో గానీ–ఈడికి పంపిన డబ్బు, మనార్డరు కమీషనుతో మూడిళ్ళు కట్టవచ్చు.

ఇంక తర్వాత ఎదవల గురించి నీకు తెలియన్ది కాదు. కొడుకులు నేను బతికుండగానే నెత్తిని కొరివి పెట్టేస్తున్నారు. పోనీ అల్లుడేనా కాస్త నయమా అంటే అతగాడు "పెళ్ళినాడెడ తానన్న సెంద్రహారం యిప్పుడెడతావా? నేకపోతే అమ్మల్ని అంపించీ మంటావా? అంటూ ఉత్తరం వేసినాడు. ఆడినీ ఈడినీ అట్టుకొని ఉద్యోగం ఏయించేనన్న యిదికూడా నేదు అతగోడికి, ఇంతకీ పుట్టెడు దుఃఖంలో వున్నావు, నా బాదల్తో నిన్నెందుకు సంపాల? యిప్పుడేటి సేద్దారి?"

"ఏటీ తెల్దం లేదు."

"ఔను.పాపం, నీకేటి తెలుసుద్ది. నీకో సావుకోరుండా లొరే. ఆడ్ని కదపనేకపోనావా? అబ్బో, ఆడ్ని కదపడం నీ తరం కాద్సరి కదా అదేదో కొండ ఎత్తేడే–ఆ సీకుష్ణుణ్ని మీ సావుకోర్ని కదిపి సూడమను. అరయించీ కదపలేడు. శివరేత్తిరికి సరుకిస్తే సంకు రేత్తిరికి–డబ్బిచ్చీ రకం. బజారుముండన్నా ఒకరేత్తిరి ఆరువుం టాదేటో గానీ మీవోడు అరపూట అరువుండడు. జాగర్తొరే. యెప్పుడోనాడు నీ బెల్లంతోపాటు నిన్నుకూడా పులుసులో యేసు కుని తినేస్తాడు. అవునుగాని అసలాడి దగ్గరకెళ్ళేవా?"

"ఎళ్లేను."

"ఏటన్నాడు?"

"కొత్త బెల్లం అట్టుకు రమ్మన్నాడు."

"బెల్లాలు యింకో నెలగ్గాని ఆడరని తెల్దేటి అతగోడికి? యిప్పుడు బెల్లం అట్టుకురా అంటే నువ్వేం సావుంలోరివేటి? మంత్రించి బెల్లం దిమ్మలు తియ్యడానికి? యిప్పుడు బెల్లం కావాలంటే ఆడికాడే కొనాల పాత సరుకు. అసలు యేం చేసినా యివ్వననీసేడా?"

"పాత బాకీ కడితే యిస్తానన్నాడు."

"ఎనకటి కెవర్తో–చాదస్తముండ 'మా ఆయన బతికున్నా బాగుణ్ను యీ కడుపు తీయించేసును' అందట. పాత బాకీ కట్ట డానికి డబ్బేవుంటే అసలు కొత్త బాకీ ఎందుకు? సర్లే. డబ్బు కావాల అంతేనా? అంతే, అడగడానికొచ్చేవ్. రైటేనా? రైటే కాన్నాకాడ కానీ లేదే! ఏం చేద్దారి?"

"..............."

"నానివ్వలేను. గాని యిప్పించగల్ను. రేప్పొద్దుటే రా. మా సావుకోరి కాడికెల్దాం. ఆడేం దరమరాజు కాదు. కాని మీవోడంత దగుల్బాజీ మాత్తరం కాదు. అడికాడ డబ్బుంది. నీ భూమ్మీద సెరకు నిలవుంది. ఆడి డబ్బు నీక్కావాల. నీ బెల్లం అడిక్కావాల. యిప్పించడానికి నేనున్నాను. అయితే ఒక్క సంగతి. నువ్వు బెల్లం అడగానే అతని కొట్టుకే ఏస్తానని ఒక్క కాయితమ్ముక్క రాయాల. ఏటలా చూస్తున్నావు. మీ సావుకారే టంటాడోననా? టయముకి సొమ్ము సేతిలో – ఎట్టకపోతే కట్టుకున్న పెళ్ళావేం లేచిపోద్దిరోజుల్లో. నువ్వింక పతివ్రొతనాగ మీవోడ్నే పట్టుకుని కూకుంటే మీ యమ్మ – అయ్యకాడి కెళ్ళిపోద్ది. రేప్పొద్దున్నరా. యేటంటావు?" అని ఆగేడు గవర్రాజు.

అనడానికి సింహాచలాని కేంలేదు. ఉన్నా అతను యేమీ అనలేడు. కాని "నీ రుణం ఈ జనమలో తీరసలేను మాంవా" అని మాత్రం అనగలిగేడు.

"నాది తీరసొద్దుగాని – మా సావుకోరుది మాత్తరం యీ జనమలోనే తీర్చు. లేకపోతే వడ్డీ నా కాతాలో రాసేస్తాడు. యికపో, అర్ధరేత్తిరై పోనాది. నీ పెళ్ళాం ఎలాగుంది? పాపం మహా బుద్ధిమంతురాల్లే నీ అదురుష్టం కొద్దీ దొరికినాది. రేవు పొద్దునే రా. డబ్బిప్పిస్తాను" అన్నాడు గవర్రాజు. "నువ్వు అమ్మే బెల్లమ్మీద నాకు కమీషను ముడుతుంది" అని మాత్రం అన్లేదు.

సింహాచలం లేచేడు. లేచి వెనక్కి వెనక్కి చూసుకుంటూ వెళ్ళి పోయేడు.

# 21

గవర్రాజు తన షావుకారిచేత సింహాచలానికి ఐదువందల రూపాయలు అప్పు యిప్పించేడు. ఆ డబ్బుకి సింహాచలంచేత ప్రోనోటు రాయించేడు. మరో ఎగ్రిమెంటు కూడ రాయించేడు. ఆ ఎగ్రిమెంటు ప్రకారం షావుకారు దుకాణానికి ఒక బండి ప్రశస్తమైన బెల్లం వెయ్యడానికి సింహాచలం ఒప్పుకున్నాడు.

షావుకారు దుకాణం దాటి బైటికి వస్తున్నప్పుడు గవర్రాజు సింహాచలం వేపు, రాక్షస సంహారానంతరం విష్ణుమూర్తి మునుల గుంపును 'నేను లేకపోతే మీ గడ్డాలకి ఆ రాక్షస వెధవ నిప్పే ట్టేసును' అన్న అర్థం వచ్చే చూపును చూసినట్టు, చూసేడు. ఆ చూపుకి మునులు కృతజ్ఞతతో చూసినట్టు సింహాచలం అతనివేపు చూసి "రచ్చించినావు" అన్నాడు.

"రచ్చించడానికి నీకేటొచ్చిందనీ?" ముందు మీ యమ్మ నెప్పుడు తీసకెళ్తావు?" అన్నాడు గవర్రాజు.

పుట్టెడు రోగంలో వున్న పసిపిల్ల వైద్యానికి అప్పు పుట్టించ డానికి బైల్దేరి, ఆ అప్పు పుట్టించే కష్టంలో, పిల్ల జబ్బుని మరిచి పోయిన రిటైర్డు గుమాస్తాలా. సింహాచలం అంతవరకు తన తల్లి జబ్బు మరిచి పోయేడు. అంచేత గవర్రాజు అలా అడగ్గానే అతని కళ్ళల్లో కృతజ్ఞతని భయం నెట్టివేసింది. పరీక్ష పోతుందని తెలిసిన పిల్లడిలా అతను మాట్లాడలేకపోయేడు.

"మధ్యాహ్నం బండిమీదేసుకొని తీసుకురా. బస్సుమీద పట్నం తీసికెళదాం. అక్కడ నీకేటెరిక? నాను సాయం వస్తా". అన్నాడు గవర్రాజు.

పరమ శివుని కాళ్ళు మార్కండేయుడు పట్టుకున్నట్టు, గవ ర్రాజు కాళ్ళు నడివీధిలో పట్టుకుందామనిపించింది సింహా చలానికి. ఆ తర్వాత వెంటనే పేగులు తెగిపోయేవరకు ఏడవాల నిపించింది.

# 22

ఆ మధ్యాహ్నం ఎండలో తన ఇంటిముందు బండి వెనుక నిలబడి వున్నాడు సింహాచలం. బండిలో కర్రలా పడి ఉంది అతని తల్లి. బండిలో కాకుండా, ఆమె రోడ్డు మీద పడుకొని ఉంటే చచ్చిపోయిందనుకోవచ్చు. తను బతికుండి ఆస్పత్రికి వెళ్తోందో, చచ్చిపోయి శ్మశానానికే వెళ్తోందో గ్రహించలేనంత

నీరసంగా వుంది ఆమె మనస్సు. తన చిన్నప్పుడెప్పుడో ఏదో తీర్థంలో చూసిన మనిషిలా కనిపిస్తున్నాడు – ఆమెకి, బండి వెనక నిల్చున్న సింహాచలం.

ముడతలు పడిన ఆమె చర్మం మాంసం లేకపోవడంవల్ల ఎముకలకు వేలాడుతూ, ఎవరో సగం చేసి పారేసిన బొమ్మలా వుంది.

ఆమె ఎముకల చివర చర్మం సాగి ఏ క్షణానైనా ఎముకలు బైటకు వచ్చెయ్యొచ్చు అన్నట్టుంది.

ఆమె కళ్ళు చవకరకం చిమ్నీల్లా వెలవెలబోతున్నాయి.

ఆమె ముఖం సగం కాలి ఆరిపోయిన పిడకలా వుంది.

ఆమె వక్షం ముసలి మొగాడి గుండెల్లా వుంది.

మొత్తం మీద ఆమె చచ్చిపోయిన ముష్టిదాన్లా వుంది.

బండి వెనుకనున్న సింహాచలం, తల్లిని తగలబెట్టడానికి వెళుతున్న వాడిలా వున్నాడు.

ఎండలో అతని పక్కనే నిలబడిన రాజమ్మ మాత్రం వెన్నెట్లో వెండి పళ్ళెంలా మిలమిల్లాడుతోంది.

ఆమె పక్కనున్న ఆమె కొడుకు, అక్షరాభ్యాసం నాడు స్కూలుకి వెళుతున్న పిల్లడిలా, ఏం జరుగుతుందో తెలుసుకోలేక–గాబరా పడుతున్నాడు.

బండి వెనుకనున్న సింహాచలం బండి ముందుకి నడిచేడు. అప్రయత్నంగా అతన్ని అనుసరించింది రాజమ్మ. సింహాచలం బండి ఎక్కేడు.

చేత్తో పిల్లడ్ని గట్టిగా పట్టుకుంది రాజమ్మ.

"బొట్టెడు జాగరత్త" అన్నాడు సింహాచలం.

"......................."

కొరడా ఎత్తేడు సింహాచలం.

'బేగొచ్చీ" అంది రాజమ్మ.

నెత్తిమీద నీళ్ళ కుండతోనూ, నొసట కుంకుమతోనూ యెదురొచ్చింది పక్కింటామె.

వెన్నుమీద కొరడా దెబ్బకి ముసలి ఎద్దు ముందుకాలు ఎత్తింది. ఆకాశం మీద నుండి ఏదో రాక్షసపాదం తమ అందరి మీద పడుతున్నట్టు వణికిపోతూ బండివెనక వీధి సివరవరకూ పిల్లడి చెయ్యి పట్టుకుని నడిచింది రాజమ్మ. ఆమెకు అత్తతో ఆస్పత్రికి వెళ్ళాలని యెంతగానో వుంది. కాని "మనిషికి మనిషి కరుచు." అంచేత కొడుకు పనీ. కూతురు పనీ సింహాచలానికే వదిలి ఉండిపోవలసి వచ్చింది ఆమెకు.

"మర్నువ్వు దిగబడు" వీధి చివర రావిచెట్టు కిందకి వచ్చేక అన్నాడు సింహాచలం.

శిల అయిపోయినట్టు నిలబడిపోయింది రాజమ్మ. పెను పాము పడగ నీడలా పడింది ఆమె మీద ఆ రావిచెట్టు నీడ.

వెళ్ళిపోతున్న బండివేపు–అది పిల్లలు ఆడుకునే బండి అంత చిన్నదిగా కనిపించేవరకూ. ఆమె రెప్ప ఆర్పకుండా చూస్తూ ఉండిపోయింది.

"మామ్మెప్పు దొస్తాదే?" కుర్రాడు అడిగాడు.

"రోజులు బావున్నప్పుడు."

# 23

గవర్రాజు బస్సు కండక్టరుతో మాట్లాడి ముసలిదాన్ని బస్సు బాడీలో పడుకో పెట్టించేడు. తోలు లగేజిలా కన్పిస్తున్నా–ఆమెకు ఎక్స్‌ట్రా చార్జీ అడగలేదు కండక్టరు.

పట్నం చేరుకుంది బస్సు.

ఆ ఊళ్ళో పెద్దాసుపత్రి ఉంది.

అందులో పెద్ద పెద్ద డాక్టర్లున్నారు.

మంచి మంచి మందులున్నాయి.

పిటపిట లాడే నర్సులున్నారు.

అద్దాల మేడలావున్న ఆ ఆస్పత్రికి చేర్చేడు సింహాచలం తల్లిని.

డాక్టరుగారితో మాట్లాడివచ్చి సింహాచలాన్ని డబ్బు అడిగేడు గవర్రాజు.

డాక్టరుగారు పరీక్షచేసి "అడ్మిట్" చెయ్యమన్నారు.

సింహాచలాన్ని డబ్బు అడిగేడు గవర్రాజు.

డాక్టరు మందులు కొనమన్నాడు.

గవర్రాజు డబ్బు అడిగేడు.

రాత్రి అయింది.

ముసల్దానికి జబ్బు పెరిగింది.

సింహాచలాన్ని హోటలుకి సినిమాకీ డబ్బు అడిగేడు గవర్రాజు.

మర్నాడు తెల్లవారింది.

సింహాచలాన్ని కాఫీకి డబ్బు లడిగేరు గవర్రాజూ–తోటీలూ.

అతన్ని అలా అందరూ సూర్యుడు పొడిచినా, చంద్రుడు వచ్చినా అతని తల్లికి జబ్బు పెరిగినా, తరిగినా డబ్బు అడుగుతూనే ఉన్నారు. "ఈ ముసల్ది పోయివరకూ అడుగుతూనే ఉంటారు కాబోలు" అనుకున్నాడు సింహాచలం.

కాని అతని అంచనా తప్పు.

ముసల్ది పోయేక కూడా అడిగేరు. ఒక్క గవర్రాజూ, తోటీలే కాదు కర్రలమ్మేవాళ్లు – కుండలమ్మేవాళ్ళూ – పిడకలమ్మేవాళ్ళు – పాడికట్టేవాళ్ళు. శవాన్ని మోసిన వాళ్ళు – శవాన్ని తగలబెట్ట నిచ్చినవాళ్ళు.

# 24

సాయంత్రం లేత చీకటి ప్రపంచానికి నీలితెర కప్పింది.

ఆ తెరని తొలగించి ఒక చుక్క నిక్కి నిక్కి చూస్తోంది.

గూళ్ళకి చేరిన పిట్టలు కొత్త పాటలు నేర్చుకుంటున్నాయి.

అక్కడవున్న ఊడలమర్రి, జడలు బారిన మహర్షిలా అతి గంభీరంగా వుంది.

దాని ప్రక్కనున్న చెరువులో నీరు–చీకటీ, వెలుతురూ లేని ఆ వింతకాంతిలో కడిగిన గాజుముక్కలా ఉంది.

ఆ చెరువులో చంద్రుడు రాకుండానే విచ్చుకుంటున్న కలువల సిగ్గులేనితనానికి తామరలు సిగ్గుతో ఎర్రగా ముడుచుకుపోతున్నాయి.

నీటి పైకి తేలిన ఒక చేపకళ్ళను చూసి మరో చేప ముందుకు వచ్చింది.

ఇదంతా ఆ జడల మర్రికి ఒక పక్క.

రెండోవేపు...

తన పిల్లని తనే పాతుకోవలసి వచ్చిన ముష్టితల్లి గుండె మంటలా ఒక మంటమండుతోంది. ఆ మంటకు కాస్త దూరంగా ముడుచుకు పడుకున్న అడవి జంతువుల్లా కొన్ని రాతిబండలున్నాయి. ఒక బండమీద కూర్చున్న సింహాచలం, మోకాళ్ళమీద మోచేతులు ఆనించి అరిచేతుల్తో మొహాన్ని మూసుకున్నాడు – తను చేసిన పాపం చూడలేనట్టు.

అతని కడుపులో పేగులు ఒకే బుట్టలో పెట్టిన పాముల్లా కిరకిర చుట్టుకుపోతున్నాయి. అతని కళ్ళు ఆ మంట దాటి చూడక పోవడంవల్ల ప్రపంచం అంతా మండిపోతున్నట్టు అనిపిస్తోంది అతనికి.

అతని ప్రక్కనే నిలబడిన గవర్రాజు కాలుస్తున్న చుట్టని పెదవుల తోటే దూరంగా ఉమ్మి "యింకేటుంది! అయిదు నిమిషాల్లో కర్పూరబ్బొమ్మలా కాలిపోనాది. లెగు, లెగు" అంటూ సింహాచలాన్ని లేవదీసేడు.

# 25

ఏ పేరు పెట్టినా గులాబీ గులాబీయే అన్నారు ఒక కవి. అతను అలా అని చాలా కాలం అయింది. పైగా అతను "దొర" కవి. అంచేత అతని సూత్రం భారతదేశానికి వర్తించదు? ఈ దేశం ప్రజల "క్లాస్" (ఒక్కొక్కప్పుడు కులం, వృత్తీ కూడా) వారి పేర్లని బట్టి చెప్పుకోవచ్చును.

సత్యశ్రీ, కమలశ్రీ, విమలశ్రీ. ఇవి కవులు సాధారణంగా తమకి తాము పెట్టుకునే పేర్లు.

మల్లమ్మ, నూకాలమ్మ, నరసమ్మ వగైరా పేర్లు సినిమా తారలవి కావు.

సదానంద, నిత్యానంద, బ్రహ్మానంద–జాతి సన్యాసులు పెట్టుకునే పేర్లు.

షీలా, నీలూ, మిల్లీ వగైరాలు తెలుగు ఆడతారలు పెట్టుకోవచ్చు.

(మొగతారలు కాంపిటీషను లేకో ఇంకెంచేతో కాని ఫాషన్ పేర్లకి యెగబడరు.)

వెంకట్రావులూ, అప్పల నరసింహంలూ గుమస్తాలు కాగలరు.

మరి సురేంద్ర ఎవరు? ఎవరు? చిత్రకారుడా? కాదు. కొత్తనటుడా! కాదు కాదు. బిజినెస్ మన్నా? ఔనౌను!

అతడు బెల్లం వ్యాపారి. లేటు గు॥ భీమలింగంగారి సన్యాశ్శెటిగారి ఏకైక పుత్రుడూ, వారసుడూను. అతనిది గవర్రాజుగారి ఊరే. వాళ్ళది తరతరాల వ్యాపారం. వాళ్ళ కుటుంబాన్ని చుట్టుపక్కల రైతులకే కాకుండా వాళ్ళ పశువులకీ, పొలాలకీ కూడా తెలుసు. చివరి రెండూ అప్పుడప్పుడు అతని కుటుంబం ఆధీనంలో వుంటూ వుంటాయి.

సురేంద్ర "లేక" సూరయ్య-లేకలేక పుట్టేడు. అతను పుట్టగానే "మా కడుపు పంట, మా నోముల ఫలం. మా పూజల పుణ్యం" అని మురిసిపోయేరు. అతని తల్లిదండ్రులు. కాని వారు అతని చిన్నతనందాటి బతుకుతే "మా కడుపు మంట, మా పూర్వజన్మల పాపం. మేం చేసుకున్న కర్మ" అని విచారించవలసి వస్తుందేమో నన్నట్టు అతని చిన్నతనంలోనే కర్మ చేయించేసుకున్నారు. వారి తదనంతరం సూరయ్య ఆస్తీ, వ్యాపారం మేనమామ సీతా రామయ్య గార్డియన్ షిప్పులోకి వచ్చేయి. గార్డియన్ షిప్పులో (కంసాలి చిట్టెమ్మ కాకుండా) యింకా చాలా పెద్ద సంసారం వుంది. ఆ సంసారానికి సరిపోని ఆస్తి కూడా వుంది. అంచేత అతను సకుటుంబంగా, సూరయ్య ఇంట్లోనే ఉంటూ వచ్చేడు. సూరయ్యని తన చెప్పుచేతల్లో పెర్మనెంటుగా పెట్టుకుంటే తప్ప-తన సంసారం వెళ్ళదని గ్రహించి అతను తన పెళ్ళికెదిగిన రెండో కూతురు మంగని సూరయ్య మీదికి ఉసి గొల్పేడు పెళ్ళాం ద్వారా.

సూరయ్య స్కూల్ ఫైనల్ వచ్చేసరికే అతని-ఫేక్ట్స్ ఆఫ్ లైఫ్ తెలిసిపోయేయి. అతనికి స్కూల్ ఫైనల్ పరీక్ష పోయింది. వెంటనే అతనికి మంగనిచ్చి పెళ్ళి చేసేసేడు సీతారామయ్య.

మంగ ఊర్వశి కాదు. తిలోత్తమా కాదు. "అయినింటి కోతి." ఆ సంగతి పెళ్ళి మెరుపులు తగ్గగానే సూరయ్యకి తెలిసిపోతుం దన్న విషయం సీతారామయ్యకి తెలుసు.

పెళ్ళయిన ఏడాదికే మంగ కొడుకుని కన్నాది. కొడుకు నల్ల ఎలక పిల్లలా వున్నాడు. మంగ పందికొక్కులా లేదు. ఆరో గ్యంగా వున్న తల్లి ఎలకలా కూడా లేదు. ఆమెని ఎలకతో పోల్చక తప్పకపోతే, పిల్లితో కాపరం చెయ్యవలసి వచ్చిన ఎలకలా ఉందనాలి.

ఆమె పల్చని జుత్తు పురుటికి యింకా పల్చబడింది. ఆమె నల్లని శరీరం కొరకంచులా అయిపోయింది. పెళ్ళి బుగ్గలు తీసిపోయి ఆమె నవ్వినప్పుడు నల్లటి పంటి చిగుళ్ళు అసహ్యంగా కనిపిస్తాయి. ఆమె కనుబొమ్మలు చాలా వెంట్రుక లూడిపోయిన గొంగళి పురుగుల్లా ఉంటాయి. ఆమెతో హాయిగా కాపురం చేయలేకపోతున్నాడు సూరయ్య.

సూరయ్య శ్రీరాముడు కాదు. అతని ఏకపత్నీవ్రతం యింకె న్నాళ్ళో నిలవదని గ్రహించిన సీతారామయ్య, ఒక మొగుడు చచ్చిన పిటపిట లాడుతున్న ఆడమనిషిని పనిమనిషిగా పెట్టేడు. అతని ఆశయం సూరయ్య యాక్టివిటీ పడకగది దాటినా కాం పౌండు గోడ దాటకూడదని, ఈ విషయంలో సూరయ్య యాక్టి విటీ అవసరమని ఈ చరిత్రకారిణీ భావన.

సూరయ్యకి స్కూల్ ఫైనల్ మళ్ళీ కట్టవలసిన అవసరం కనిపించలేదు. చిన్నప్పుడు చాలామందికి చదువుకోవాలని ఉండదు. న్యూటనూ, ఐన్‌స్టీనూ కూడా చిన్నప్పుడు బడికి వెళ్ళ డానికి ఏడిచే వుంటారు. కాని వాళ్ళు చిన్నప్పుడు బాగా చదువు కొని వుండకపోతే పెద్దయ్యాక చాలా విచారించి ఉందురు. అక్కడే ఉంది-సూరయ్యకీ-వాళ్ళకీ బ్రహ్మాండమైన తేడా. పెద్దయ్యేక కూడా అతని ఉద్దేశంలో మొగాడికి మోసం చెయ్య డానికీ-ఆడదానికి చాకలిపద్దు వెయ్యడానికీ - సరి పోయే చదువు వస్తే చాలు అని. అతను చదివిన స్కూల్ ఫైనల్ అతనికి పేరు మార్చుకోడానికీ, తీరిక సమయాల్లో తెలుగు బూతు పుస్తకాలు చదువుకోడానికీ ఉపయోగ పడింది. (ఇంగ్లీషులో ఘాటైన శృంగార పుస్తకాలుంటాయని అతనికి తెలీదు.)

సూరయ్య ఉరఫ్ సురేంద్ర బెల్లం వ్యాపారి. బెల్లానికి చెరుకు కావలసినట్టే వ్యాపారానికి డబ్బు అవసరం.

బెల్లం పండించే రైతుల్లో బుగ్గమీసాల రైతులకంటే బక్కచిక్కిన రైతులే ఎక్కువ. చెరుకుముక్క పాత్తే బెల్లంరాదు. అది పాతే ముందూ, పాతిన తర్వాతా చాలా పెట్టుబడి కావాలి. పెట్టుబడి లేని రైతులకి సురేంద్ర వగైరాలు అప్పులిచ్చి పెట్టుబడి పెడతారు. ఏడుకొండలవాడికి కూడా వడ్డీలేందే అప్పు దొరకలేదు. అతను వడ్డీ కడితేనే కుబేరుడు ఊరుకున్నాడు. అతనికి అంటే కుబేరుడికి బెల్లం వ్యాపారం లేదు. సురేంద్రకి వడ్డీ వ్యాపారం ఉంది. కాని అతను ఉట్టి వడ్డీ కడితే ఊరుకోడు. అతనికి వడ్డీ కంటే ముఖ్యం - తన బాకీదారు తన ద్వారా బెల్లం అమ్మడం. అతను అమ్మిన బెల్లం మీద కొన్నవాడి దగ్గరా కమీషన్ తీసుకుంటాడు. అమ్మిన రైతు దగ్గర కన్యకాపరమేశ్వరి ధర్మం, తన వర్తక సంఘానికి చందా, తన గుమస్తాలకీ కళాసీలకీ ఇవ్వవలసిన జీతాలకింద రుసుం అనబడే చందా వగైరా చాలా చాలా చందాలు వసూలు చేస్తాడు. వడ్డీలు పంచాంగం ప్రకారం-అధిక మాసాలకి కూడా కట్టబడతాయి. అంచేత బెల్లం వ్యాపారం స్వీట్ బిజినెస్సూ, హాట్ బిజినెస్సూ కూడా!

నష్టం అంటే ఏఁవిఁటి?

వ్యాపారంలో పెట్టిన పెట్టుబడి విలువ తగ్గడం. ఇది సామా న్యుడి భావం. రావలసిన లాభం రాకపోవడం పెద్ద నష్టం.

వ్యాపారి ఊహలో అప్పు తీసుకున్న అందరూ తన ద్వారా సరుకు అమ్మితేనే వ్యాపారికి ఆశించిన లాభం వస్తుంది. అలా కాకపోతే పైన చెప్పిన నష్టం వస్తుంది.

అమాయకపు గొర్రెల గుంపు సాధారణంగా చెదరదు. కాని ఏ ఒక్క వెర్రిగొర్రో పెడదారి పడితే, దాని వెనక మందలో జీవాలు చాలా వెళ్ళిపోతాయి.

సన్నకారు రైతులకీ వెర్రిగొర్రెలకీ చాలా పోలికలున్నాయి. రెండూ కసాయిని నమ్ముతాయి. బికారి రైతులు అవసరమయినా లేక పోయినా "మంద" గానే ఉంటారు. బెల్లం అమ్మగానే షావుకారు డబ్బు యివ్వకపోయినా, తమ బాకీకి పదింతల బెల్లం తమ దగ్గర ఉన్నా, ఒక అరవీశ కూడా పై వర్తకుడికి అమ్మరు. అలా వాళ్ళలో ఒక్కడూ "మంద" దాటకుండా సురేంద్ర వగైరాలు తగు జాగ్రత్తలు తీసుకుంటారు. ఒక గొర్రెను వేటాడడానికి–పది తోడేళ్ళను పెంచడానిక్కూడా వాళ్ళు సందేహించరు.

## 26

ఆ మేడ చాలా పాతదయినా–చాలా కొత్త రంగులు వేయబడి చాలా స్ట్రాంగ్‌గా కనిపిస్తుంది. దాని వీధి మెట్లు చాలా విశాలంగా వున్న రోడ్డుమీదకే వున్నాయి. దాని వీధి సిమెంట్ వరండా శుభ్రంగా వున్నా దానిలో ఎలాంటి ఫర్నిచరూ లేదు. సిమెంటు వరండాలో మధ్య పెద్ద తామరపువ్వు మార్బుల్ స్లాబ్ వుంది. ఆ పువ్వులో వుండవలసిన లక్ష్మీదేవి గదిలో వుంది.

ఆ వరండాలోకి మూడు ద్వారాలు వున్నాయి. వాటిలో ఎడమ ద్వారం ఒక పడక గదిది. అది ఎప్పుడూ తెరవరు. మధ్యది ఒక నడవది. ఆ నడవలోంచే నివాసంవుండే భాగానికి త్రోవ. కాని ఆ ద్వారం ఎప్పుడూ చేరవేసే ఉంటుంది. కుడి ద్వారం ఆఫీసు గదిది. అది పగటిపూట తెరిచే వుంటుంది.

ఆ వరండా బైట "భీమలింగంగారి సన్యాశ్శెట్టి సన్ బేంకర్ అండ్ కమీషన్ మర్చంట్" అని ఇంగ్లీషులోనూ తెలుగులోనూ రాసిన బోర్డు వేలాడుతూ వుంది.

వరండాలో నిలబడి ఆఫీసు గదిలోకి చూస్తే ఎదురు గోడ మధ్యని మూడడుగుల గజలక్ష్మి పటం వేలాడుతూ వుంటుంది. ఆ లక్ష్మీదేవి అందమైన ఆడదానిలా వున్నా, మనిషి కాకపోవడం వల్లనో మరి ఎంచేతో మొహంలో ఎటువంటి మానవ సహజ మయిన భావమూ లేకుండా ఒక పెద్ద సైజు తామర పువ్వులో నిలబడివుంది. ఆ పువ్వు పక్కని, పువ్వుకన్నా చిన్నవి రెండు ఏనుగులు తొండాలతో పూలదండలు పట్టుకొని లక్ష్మీభక్తులు, మానవుల్లోనే కాకుండా జంతువుల్లో కూడా ఉన్నాయని తెలియ చెయ్యడానికే అన్నట్లు భక్తితో, నీటిలో నిలబడి ఉన్నాయి. ఆ పటానికి ఎదురు గోడని రెండు పెద్ద సైజు ఎన్లార్జెడ్ ఫోటోలు తగిలించి ఉన్నాయి. ఆ ఫోటోల్లో వున్న యిద్దరూ పాతకాలం జరీపాగాలూ, జరీవాణీలూ, రంగు కోట్లూ, రంగు దుద్దులూ, తెల్లనామాలతో బహు భీకరంగా ఉన్నారు. అందులో ఒకరు లేటు భీమలింగంగారు. రెండోవారు వారి దత్తతపుత్రులు లేటు సన్యాశ్శెట్టిగారు.

మూడో గోడకి నున్నటి గుండూ, ఎర్రటి మొహం, మెడ నుంచి ముణుకుల వరకూ–ఊలుదో, సిల్కుదో శాలువా – కప్పుకొని, చేతిలో చెయ్యి వేసుకున్న గాంధీగారి పాత బొమ్మ వేలాడుతోంది. మరో గోడకి ఏదో ఎరువుల కంపెనీ "రూపా యల పంట" కేలండరుంది.

గదినేల అంతా "లినొలియమ్" పరచి ఉంది. ఆ గదిలో కుర్చీలూ బెంచీలూ లేవు. షావుకారు కూర్చోడానికి వీలుగా నేలని ఒక తెల్ల గలీబు వేసిన పరుపు గోడకి ఆనించి వేసి వుంది. దానిపక్కన షావుకారి సందుగ పెట్టె వుంది. దాని మూత అతి వాడికవల్ల బాగా నునుపెక్కి పాలీష్ చేసిన దానికంటె బాగా మెరుస్తోంది. దానిమీద గుత్తిలో దాని తాళాలు, స్టెయిన్‌లెస్ స్టీలు తాళాల్లా మెరుస్తున్నాయి. దాని పక్కన ఒక చిన్న బల్లమీద ఒక టెలీఫోనూ, ముందువైపు అద్దం వున్న చెక్కపెట్టెలో చాలా పాతదయినా చాలా కొత్తగా కనిపించే అలారం టైంపీసూ వున్నాయి. షావుకారు సీటు పక్కన గోడకి బిగించిన ఐరన్ సేఫుంది. షావుకారు పరుపు పక్కనే మరొక పరుపు వి.ఐ.పీ. ల కోసం వేసి వుంది.

షావుకారి సీటుకి ఎదురుగా నేలని కూర్చుని రాసుకోవడానికి వీలుగా రెండు బల్లలున్నాయి. ఆ బల్లల పక్కని తోలుబైండ్లవీ, గుడ్డబైండ్లవీ–ఎకౌంటు పుస్తకాలు చాలా ఉన్నాయి. వాటి అట్టల మీద విఘ్నేశ్వరుడు మొదలు కన్యకా పరమేశ్వరి వరకు ఎందరో దేముళ్ళకీ దేవతలకీ విన్నపాలున్నాయి. ఆ బల్లల వెనక పీక వరకూ గుండీలు పెట్టుకొని కాలర్లులేని మాసిన లాల్చీలు తొడుక్కున్న యిద్దరు గుమాస్తాలున్నారు. ఇద్దరికీ కళ్ళజోళ్ళున్నాయి. తల వంచుకొని బతకవలసిన మనుషుల్లా ఇద్దరూ ఎదుటి వారిని

(తలలు ఎత్తకుండా) కళ్ళజోళ్ళమీంచే చూస్తారు. ఆ గదిలో జరిగే యే పనికీ తమ నైతిక బాధ్యత లేదన్నట్టు వారి ముఖాల్లో ఆనందంగాని, దుఃఖంగాని మరి యే ఇతర భావంగాని లేదు. వీళ్ళ తద్దినాలకి ఎకౌంటు పుస్తకాలు పంచి పెట్టాలా అనిపించే టంత యింటరెస్టుతో వాళ్ళు ఆ పుస్తకాల్లో మునిగిపోయి ఉంటారు. ఆ యిద్దర్లో యే ఒక్కరూ లావుగా లేరు. ఆరోగ్యంగా లేరు. ఆనందంగా లేరు. ఇంకా బతికే వున్నందుకు సిగ్గుపడు తున్నట్టు వారి తలలు కొంచెం ఒక పక్కకి వాలి ఉన్నాయి.

షావుకారి సీట్లో సురేంద్ర కూర్చొని ఉన్నాడు. అతని వయస్సు ముప్ఫై ఉండొచ్చు. అతని కళ్ళలో యెప్పుడూ ఒక ప్రసన్నత కనిపిస్తుంది. అది భగవంతుడ్ని కనుగొన్న భక్తుని ప్రసన్నత కాదు. ప్రపంచం కీలకం కనిపెట్టిన లౌక్యుని ప్రసన్నత, అప్పుడతను ఆవేళ దినపత్రికలో బంజరు భూముల ఆక్రమణ, జీతాలు పెంచమన్న అలజడి వగైరా కలవరపరిచే వార్తలూ, బతకలేని ఒక తల్లి తన నలుగురి పిల్లలకీ విషం పెట్టి చంపి మరీ చచ్చిందన్న వార్తలాంటి ఇతర వార్తలూ చదువుతున్నాడు. ఇంతలో టెలిఫోను మోగింది. అతను టెలిఫోను యెత్తినప్పుడూ, తర్వాత కొంతసేపూ నవ్వుతూనే వున్నాడు. కాని అంతలో చంద్రుడ్ని విషపు మేఘాలు చుట్టుకొన్నట్టు–అతని నవ్వుల వెన్నెల మాయ మైపోయింది. కళ్ళల్లోకి గరళం దిగినట్టు కళ్ళు ధూమ్ర వర్ణ మయ్యేయి.

“హమ్మ! హమ్మ! ఎంత పన్జేసేడెంత పన్జేసేడూ, వెధవ..... బద్మాష్...రాస్కెల్” అని వివిధ భాషల్లో తిట్టేడు. అతనికి కోపం, అతి కోపం. మహాకోపం వచ్చినప్పుడు వరసగా తెలుగు, ఉర్దూ, ఇంగ్లీషులో తిడతాడు. “ఆ బద్మాష్‌గాడ్ని భూస్థాపితం చేసేస్తా మావఁయ్యా” అని టెలిఫోన్ పెట్టేసి “చూడండి, ఆ వెధవ ఎకౌంటు తియ్యండి” అన్నాడు.

“ఏ వెధవ ఎకౌంటు?” అన్నట్టు రెండు జతల గుమాస్తా కళ్ళూ బానిస చూపులు చూసేయి.

“ఆ వెధవేనండీ. వాళ్ళేడూ! ఆ సింహాచలంగాడు! వాడిది. మనకు వెయ్యవలసిన బెల్లం మరో దుకాణానికి వేసేసేడట!” అన్నాడు సురేంద్ర. అతనికి ఆ వార్త టెలిఫోనులో వినగానే తన ముండని సింహాచలంగాడు లేవదీసుకొని పోయినంత కోపం వచ్చింది. క్షణాలు గడుస్తున్న కొద్దీ అతనికి ఆ ఇమేజినరీ ముండ ఎదుటే వాడ్ని పాతేస్తేగాని పోనంత కోపంగా పెరిగిపోయింది.

చిత్రగుప్తుళ్ళు సింహాచలం ఎకౌంటు తీసేరు. తీసి యమ ధర్మరాజుకి యిచ్చేరు. యమధర్మరాజు ఇనప్పెట్టె తాళాలు వేసి తలుపు ఒకసారి గట్టిగా లాగి పోతులాంటి నల్లకారు ఎక్కి ప్లీడరుగారి దగ్గరికి వెళ్ళేడు.

ప్లీడరు దగ్గరకెళ్ళి తిరిగి వచ్చిన సురేంద్ర–తన ఆఫీసులో కూర్చున్నాడు. ఎండలో పట్టిన చవఁటకి తొడుక్కున్న బనియనూ, సిల్కు లాల్చీకి కలిపి ఫేనుగాలి చల్లగా తగులుతున్నా, అతని మనసు పెట్రోలు పోసి మంటపెట్టినట్టు మండిపోతోంది. అతను కూర్చుంటూనే, నల్లకళ్ళజోడు తీసి పక్కనున్న సందుగ పెట్టెమీద పెట్టి “యింకీ బైరాగి వెధవని ఈశ్వరుడు కూడా రక్షించలేడు” అన్నాడు. అప్పుడతని కంఠస్వరంలో ‘సూర్యుడు తూర్పున ఉద యించును’ అనే ఖండించరాని నిజాన్ని అంటున్న–ఆత్మ విశ్వాసం ఉంది.

“ఒరిజినల్ బైరాగి” అనిపించుకున్న ఈశ్వరుడు కూడా రక్షించలేని ఆ సన్యాసి ఎవడో గుమస్తాలకి తెలుసు. అంచేత వాళ్ళు సురేంద్ర అన్న మాటలకి తల ఎత్తి–ఎప్రూవల్‌గా అతి కొంచెం నవ్వి మళ్ళీ తలలుదించుకున్నారు.

కొన్ని నిమిషాలు గడిచేయి.

“ఫేన్ శబ్దం ఆగని పాము బుసలా వుంది.

గుమస్తాలు స్వాతంత్ర్యం వద్దనే మంచి బానిసల్లా పట్టుదలతో పని చేస్తున్నారు.

సురేంద్ర కోపం గుండెల్లోంచి కడుపులోకి దిగి కుతకుత లాడుతోంది. కాని అతని ఓపిక పూర్తిగా పోయిందనలేం. ఆ టైములో అక్కడికి యముడూ, సింహాచలం తప్ప ఎవరు వచ్చినా అతను చిరునవ్వుతోనే ఆహ్వానించి ఉండును.

యముడు సర్వ సాధారణంగా అంతో యింతో వార్నింగు యివ్వందే రాడు. కాని సింహాచలంలాంటి దురదృష్టవంతులు ఎప్పుడు ఏ పని చెయ్యకూడదో అప్పుడే ఆ పని చేస్తారు. కన్నం దగ్గర పిల్లి ఉన్నప్పుడే ఎలక పిల్లకి షికారెళ్ళాలనిపిస్తుంది.

ఆ టైములో సింహాచలాన్ని చూసిన సురేంద్రకి ఏమనిపిం చింది! కూతుర్ని లేవదీసుకుని పోయినవాడు అకస్మాత్తుగా పెళ్ళికి ముహూర్తం పెట్టించమని అడగడానికి వచ్చినట్టనిపించింది. అప్పుడు అతని బ్లడ్ ప్రెషరు చూసిన ఏ డాక్టరైనా షాక్‌కి చచ్చిపోతాడు. ఆ క్షణంలో అతను దోమ దగ్గితే తుళ్ళిపడే స్థితిలో ఉన్నాడు.

ఆ పరిస్థితి కొంతసేపే ఉంది.

ఆ తర్వాత – సింహాచలాన్ని బూడిద చేసి నీళ్ళల్లో కలుపుకొని తాగెయ్యాలనిపించింది. ఈ మెంటల్ ఏటిట్యూడ్ అతన్ని ఎప్పటికీ వదల్లేదు.

అమాయకంగా వచ్చేడు సింహాచలం ఆ గదిలోకి. సురేంద్ర అతన్ని పలకరించలేదు. గుమస్తాలు సింహాచలం పాదాలు మాత్రం చూసేరు. ఆ పాదాలు త్వరలోనే గాలిలో వేళ్ళాడు తాయని వాళ్ళకి తెలుసు.

"దండం బాబయా" అనడమే కాకుండా దండం పెట్టేడు సింహాచలం.

"ఏఁవిఁటి నాయుడుగా రిలా దయచేసేరు?" సంభాషణ తుంచకుండా అన్నాడు సురేంద్ర.

"బెల్లాల దరలెలాగున్నాయి బాబు!"

"నీ గోత్రవేఁవిఁటి పిల్లా అనడిగేట్ట–వెనకటి కెవడో నీలాటి పురోహితుడే పెళ్ళాన్ని."

"బాబుగారేదో ఆసికాలాడుతున్నారు."

"సరసానికి సానుల్లేరని నీతో ఆడుతున్నాను."

"ఏటో యిచిత్తరంగా వుంది బాబుగారి ధోరణి."

"పీకలు కోసేవాడికి–ప్రతి పీకా–యిచిత్తరంగానే ఉంటుంది."

"ఇప్పుడు పీకలెవరు కోస్తారు బాబూ?"

"నువ్వురా! నువ్వు!! నువ్వే పీకలు కోస్తావ్. చల్లగా కోసేసి ఆ శవం వెధవ తన పీక తనే కోసేసుకుని–తర్వాత నిన్ను కత్తి పట్టుకోమన్నాడంటావ్."

"నాకేం అరదం గావటం లేదు బాబూ."

"అరదం ఆవంది నాకూ, నాలాటి వాజమ్మలకీన్రా! నీకు అన్నీ తెలుసు. నీకు తాతబాకీ, తండ్రిబాకీ కట్టకుండా–కొత్తబాకీ, నా దగ్గర పుచ్చుకోవడం తెలుసు. ఈ మూడు బాకీలూ తీరుస్తానని చెప్పి నా కళ్ళెదుటే బెల్లం ఆడ్డం తెలుసు. ఆ తర్వాత నా కళ్ళు కప్పేకుండా–నా కళ్ళెదుటె ఎదుటి దుకాణానికి ఆ బెల్లం అమ్మేడం తెలుసు. క్షణం ఊరుకున్నానంటే నాకు గుండు గీసేసి బూడిదగుడ్డలు తొడిగేసి, బైరాగిని చేసేడం తెలుసు."

"బాబయా...తఁవఁరు..."

"నన్నాపకు. నువ్వు...నువ్వెలాటివాడివి? షావుకారు కళ్ళకి సుర్మాపెడుతున్నానని కలికం పెట్టేగలవు. నీకు అవకాశం, అధికారం యిస్తే, నా యింట్లో నన్నే నౌఖర్ని చేసేస్తావ్. అక్షరం ముక్క రాదుగానీ–లేక పోతే అమెరికాకీ, ఇంగ్లండుకీ దెబ్బలాట పెట్టేసి వుందువు. గాంధీకీ, నెహ్రూకీ యుద్ధం పెట్టేసే వాడివి..."

"నా మాట–..."

"వినను. నాకు నామం పెట్టేవాడి మాటలు–నేను చస్తే వినను. నా పీక కోసేవాడి 'జుబా' మంత్రం నేను విన్ను. లేకపోతే నిన్న బెల్లం అమ్మేసి–ఈ వేళ చల్లగా సానిముండలా వచ్చి 'బెల్లాల ధర లెలాగున్నాయ్ బాబయా' అంటావా? నిన్నేం చేస్తే పాపం ఉంది?"

"బాబూ తఁవఁరు గోరు..."

"షటప్. బానిస వెధవా. ముందు నీ బాకీ కట్టు, అణా పైసల్తో కట్టు. తర్వాత నీ తండ్రి బాకీ కక్కు."

"బాకీ తీరసగలిగితే..."

"ఎందుకు చేస్తానంటావ్? ఎందుకిన్ని మాటలు పడతానంటావ్? సూర్యవంశపు రాజువి కదూ. పౌరుషం జాస్తీ..."

"తమరి మాట....."

"తిన్నగా రానిమ్మంటావ్. అంతేనా?"

"అన్నారని నానేం అనుకోను."

"బాకీ కట్టమంటేనే అనుకుంటున్నావు. మా షావుకారికి గుండె ఉంది కాని దయలేదనీ, వట్టి కిరాతకుడనీ!"

"నా మాటిన్రు బాబుగోరు" అంటూ గుమస్తాలకి కంప్లయిన్టు చేసేడు సింహాచలం.

"నీ మాట వినడం పరమ పాపం" అన్నట్టే చూసేరు వాళ్ళు,

"ఇంతకీ నువ్వనే దేవిఁటి?"

"బెల్లం తోలమంటారా బాబూ!"

"తోల్రా తోలు. నీ బెల్లాన్ని వల్లకాటికి తోలు. నీ పెళ్ళాన్ని వశెంపురానికి తోలు. నువ్వు గంగలో దిగు. నా కక్కరలేదు. నీ బెల్లం వద్దు. నీ కిష్టం వుంటే అమ్ముకో, లేకపోతే నువ్వూ నీ పెళ్ళాం కూర్చుని తినేయండి. నీ యిష్టం వచ్చినట్టు చేసుకో, నీ యిష్టం. నాకొద్దు. నీ కష్టం నాకక్కరలేదు. నా క్కావలసింది డబ్బు. నేను యిచ్చిన డబ్బు. నువ్వు పట్టుకెళ్ళిన కరుకు రూపాయలు, నీ బాబు, నీ తాత తీసుకున్న సొమ్ము, అంతే. నాకింకేం

వద్దు. నీ కష్టం నాకక్కరలేదు. నాక్కావలసింది డబ్బు. నేను యిచ్చిన డబ్బు. నువ్వు పట్టుకెళ్ళిన కరుకు రూపాయలు. నీ బాబు, నీ తాత తీసుకున్న సొమ్ము, అంతే. నాకింకేం వద్దు."

"త వఁరు ఆగ్రయించకండి బాబయా."

"నా కెందుకురా కోపం?"

"బాబూ కష్టంలో ఉన్నా."

"నీకు కష్టవేఁరా! నీక్కాకపోతే మరెవరికీ? నా దగ్గిర డబ్బు పట్టుకెళ్ళేవు. అది కష్టం కాదూ? ఆ ముండమోసిన దాని భూఁ విఁకాణి ఎడ్వాన్సు కట్టకుండా కౌలుకి పుచ్చుకున్నావు. అది కష్టమే మరి! సొసైటీలో ఎరువులు కొన్నావు. అది కష్టం కాదూ? చెరుకు వేసి బెల్లం ఆడి, బెల్లం పొయ్యి మసి నా కళ్ళల్లో కొట్టి సరుకు నా ఎదుటే ఎదుటి దుకాణానికి అమ్మేసేవు. అది కష్టం కాదూ? అమ్మిన బెల్లం డబ్బుతో పెళ్ళానికి కోకలుకొని కోడిని కోసి పలావు వండించుకుని తిని పెళ్ళాంతో కులకడం కష్టం కాదూ?"

"బాబు నా మాట....."

"ఛీ! నోర్మూయ్! ఫకీరు వెధవా, కష్టాలన్నీ నీవేరా! ఇంక సుఖాలో అవి నావి. నీకు ప్రోనోటు రాయించుకుని డబ్బిస్తే నాకు దురద గోక్కుంటున్నట్టు సుఖంగా ఉంటుంది. ఏం? నువ్వూ, నీ బాబూ రాసిన ప్రోనోట్లు పకోడి పొట్లాలక్కూడా పనికి రాకుండా పోతుంటే ఇంకా హాయిగా ఉంటుంది, ఏం? నీకు నా బాకీ రాబట్టుకోడానికి ఈ ప్లీడరు కాళ్ళూ, ఆ వకీలు కాళ్ళూ పిసికి నీ మీద దావా వేస్తే మరీ హాయిగా ఉంటుంది. హాయిగా నా యింట్లో నేను ఫేనుకింద చల్లగా ఉండాల్సినవాడ్ని ఆ దిక్కుమాలిన కోర్టులో–ఎండలో వడదెబ్బ తిన్న పిట్టలా – చెట్టు కింద అఘోరిస్తూ ఉంటే యింకా బావుంటుంది. నువ్వో అణా కానీ ప్లీడర్ని పెట్టి–బేడా పరక ప్రశ్నలడిగిస్తూ ఉంటే నా సుఖం ఆ కాళిదాసు కూడా వర్ణించలేడంటావు."

"నా కష్టం ఎవరికి తెలుస్తాది బాబూ. నాను పడిన కష్టం అమ్మున్న వాళ్ళకే తెలుస్తాది బాబూ. నిన్ను కన్నతల్లి కాలూ, చేయీ ఆడక పడవలా పడిపోయి ఎఱ్ఱిసూపులు సూస్తుంటే తెలుస్తాది బాబూ నా బాధ. అదివణ్ణం అడగడానికి మాటరాక, సేత్తో అడగడానికి–ఇంట్లో పిడికెడు గింజలున్నాయో లేవోనని భయపడి అడగడం మానేస్తే – అప్పుడు తెలుస్తాది నా కష్టం. దాన్ని యములోళ్ళు లాక్కెళ్ళుతూంటే వొయిజ్యానికి–భూమ్మీద పంట లచ్చింతల్లిలా నిల బడి –సేతల కానీ లేకపోతే తెలుస్తాది. సీజన్లో బెల్లం ఏస్తాను–వొయిజ్యానికి డబ్బిమ్మని అడిగి నప్పుడు – నీ షావుకోరు నిన్ను బైటకి నడవమంటే అప్పుడు తెలుస్తాది బాబూ నా కష్టం. నీ పంట తాకట్టెట్టి, డబ్బుతెచ్చి అమ్మని ఆసుపత్తిరికి తీసికెల్తే, అక్కడ డాట్రుబాబు అలీసెం అయిపోనాది నాబం నేదని అంటే–అప్పుడు బాబూ తెలుస్తాది నా కష్టఁ. ఊరు కానూర్లో నీ యమ్మ దిక్కుమాలిన సావుసస్తే అప్పుడు బాబూ తెలుస్తాది నాకష్టం. అది సచ్చేక దాన్నెత్తికి నిప్పెట్టినప్పుడు తెలుస్తాది బాబూ నా కష్టవూఁ, డబ్బు యిలువాను" వూపిరి తీసుకోవడానికి ఆగేడు సింహాచలం. అప్పుడతను నరాలు మండుతున్న మనిషిలా, పిచ్చెక్కి పోతున్నాడని తెలుసుకున్న మనిషిలా భయంకరంగా ఉన్నాడు.

అతని ఆవేశానికి సురేంద్ర వెనక్కి తగ్గేడు.

"బాబూ నాయమ్మ సచ్చిపోనాది. దానికి నీ తప్పులేదు. నాలాటి సేతకానోడ్ని కనడవేఁ దాని తప్పు. కన్నాక బతికుండడం ఇంకా తప్పు. మాలాటోళ్ళం ఏం చేసినా తప్పే బాబూ. నాను మరోకాడ అప్పు తీసుకోవడం తప్పే. అక్కడ బెల్లం ఎయ్యడం కూడా తప్పే. నా నొప్పుకుంటా. నాను సేసింది రైటన్ను.

కాని సూడు బాబూ, సూడు–నా మొకంలోకి సూడు. నా నెవడ్ని? నీ ఎద్దులు తినకుండా పారేసిన గడ్డిపరక లాటోడ్ని. నువ్వు తొడిగి పారేసిన సెప్పు లాటోడ్ని. నానూ, నాలాటి ఎయ్యి మంది ఎయ్యి తప్పులేసినా నీ కాలిమీద పండు వెంట్రుక తెగదు. బాబూ నిన్ను కాదని మేం అడుగుముందు కెళ్ళలేం. నువ్వు కన్నిప్పి సూస్తే బుగ్గి అయిపోతాం.

నాను లెచ్చరిస్తున్నాననుకోకు. లెచ్చర్లివ్వడానికి అచ్చరమ్ముక్క రాదు నాకు. నా నడిగిందొకటే, ఈ తప్పు కాయి. మూడు తరాలై నీయిల్లే నమ్ముకున్నాం. నీ గుమ్మం దిగి మరోకాడ బత కలేం. నన్ను చెమించు బాబూ. నీ కాళ్ళకి మొక్కుతా, నీ ఇంట్లో కుక్కనై పుడతా. మావేం పదిమందివి లేం. అసల్ది పోనాది. తల్లీ పిల్లాతో ముగ్గురం మిగిల్నాం. రోజుకో పూటతిన్నా సాలు మాకు."

"అసలు నువ్వనే దేమిటి?"

"నాననేది ఒక్కటే. నీ బాకీ ఎక్కడికీపోదు. ఈ ఏడు నా బూఁవిఁబంగారం పండినాది. బెల్లంకాదు పచ్చ బంగారం ముద్ద. మిగిలింది నీ కొట్టు కేసుకో. ఈ ఏటి బాకీ తీరిపోద్ది. యింకా పదో పరకో యెక్కువే మిగులుద్ది."

"మరి పాత బాకీ నీ బాబు కడతాడా?"

"మిగిలింది దానికి జమేసుకో. ఇంకా మిగిలింది వచ్చే ఏటి పంటలో తీరుస్తా. తీరవనేకపోతే నీ పొలాల్లో ఎద్దయి దున్ని తీరుస్తా. నీ అంట్లు తోవిఁ నా పెళ్ళాం తీరుస్తాది. నీ సెప్పులు తుడిసి నా కొడుకు తీరుస్తాడు? కాదనకు బాబూ. మమ్మల్ని కాపాడు బాబూ. నేకపోతే బూడిదైపోతాం." తన కళ్ళ నుండి నీరు కారుతున్నట్లు కూడా తెలియలేదు సింహాచలానికి.

వాడి కన్నీరు సురేంద్రకి టానిక్కులా పనిచేసింది.

"వినండయ్యా వినండి–నీతులు చెప్పొచ్చేడు శంకరాచారి. వాడు తప్పులు చేస్తాట్ట. ఆఖర్ని ఒక దండం పెడతాట్ట. నేను క్షమించకపోతే వాడు హీరో, నేను విలన్నీ అట. నీలాంటి స్కౌండ్రలే దేఁవుఁడితో 'నేను మనిషిని, నువ్వు దేఁవుఁడివి. తప్పులు చెయ్యడం నా వంతు. వాటిని క్షమించడం నీ వంతు. నాలాటివాళ్ళ తప్పులు క్షమించడం తప్పిస్తే నీకున్న పనేఁవిఁటి? అరటిపళ్ళు తినడం–హారతులు పుచ్చుకోటం–తప్ప' అన్నాట్ట.

నీతో మాట్లాడ్డం పాపం. నీలాటి స్కౌండ్రల్‌తో వాదించడం పరమ పాపం. నిన్ను క్షమించడం పంచమహాపాతకం. ముందు నా గుమ్మం దిగు. ఈ రోగ్‌ని ముందిక్కణ్నించి యీడ్చెయ్యండి. ఈ పింజారీ వెధవ వెళ్ళగానే గది ఫినైల్ వేయించి కడిగించ దయ్యా, లేకపోతే పోదు ఈ పాపం" ఆగేడు సురేంద్ర.

సింహాచలాన్ని యీడ్చెయ్యడానికో–ఫినైలు తేవడానికో – తెలీకుండా లేచేరు గుమాస్తాలు.

తల వంచుకొని గుమ్మందిగి కొంత దూరం వెళ్ళి, మేడవేపు వెనక్కు తిరిగి చూసేడు సింహాచలం. సవతితల్లి వచ్చిన తర్వాత ఇంటినుండి తండ్రి తగిలేసిన పిల్లడు పోతూ పోతూ తన యింటి వేపు ఆఖరిసారి చూసిన చూపు అది.

# 28

సింహాచలం కళ్ళంలో – ఎర్ర ఆకుల బాదంచెట్టు, ఓట్లు అడగడానికి–మాల గూడేనికి వచ్చిన మహారాణీలా వుంది. దానికి కాస్త దూరంలో వున్న రావిచెట్టు మహారాణిగారి మేనేజర్లా భక్తితోనూ, బలంగానూ వుంది.

వాటికి కొంచెం దూరంలో చింపిరిజుత్తు మాల ముసలమ్మల్లా దీనంగా గుంపుగా నిలబడ్డాయి. తుమ్మచెట్లు, వాటికీ మిగిలిన చెట్లకీ మధ్య నున్న పాక మధ్యాహ్నం సింహాచలం పడుక్కోడానికి, రాత్రి పశువులు పడుక్కోడానికి ఉపయోగ పడుతుంది.

రావిచెట్టు చల్లని నీడలో పడుకున్న పాలగేదె దేఁవుఁడి పిలుపుకి ఎదురు చూస్తున్న భక్తుల్లా కాకుండా–ఈ ప్రపంచంలో తను చెయ్యవలసిన పనంతా చేసేనన్న వేదాంతిలా–తృప్తినిండిన నీళ్ళకళ్ళతో చూస్తోంది. దానికి కొంచెం దూరంలో వున్న దూడ – స్కూలు ఎగ్గొట్టి శనగపప్పు తింటున్న చిన్న పిల్లాడిలా నెమరు వేస్తోంది.

రావిచెట్టు పక్కనే పెద్ద పెనంలో ఉడుకుతున్న బెల్లం జమీందార్ల యింట్లో పెళ్ళి విందుకి వండుతున్న హల్వాలా వుంది. దాని ఆవిరి గాజు ఆవిరిలా చెట్టును చుట్టుకుంటోంది. ఆ ఆవిరి తగిలిన చెట్టు లేత ఆకులు గాజు ఆకుల్లా ఐపోయాయి. పొయ్యిపక్కని చెరుకు పిప్పి దూది కర్రల్లా ఉంది. పొయ్యి పక్కని కుప్పగా పోసిన బూడిద విభూతి పోగులా వుంది. గానుగ తిప్పుతున్న ఎడ్లు పరుగు పందెంలోని కాలేజీ స్టూడెంట్స్‌లా ఉత్సాహంగా ఉన్నాయి. పెనానికి చేరవేసిన తెడ్డు ఒడ్డుకి చేరిన నావ తెడ్డులా ఉంది.

బెల్లం వండుతున్న బంగారిగాడు పాటల్లో నాయుడు బావలా ఉండి, కూలీ పైడమ్మకి – "సజెష్టివ్"గా కాకుండా "స్ట్రాంగ్"గా కన్ను కొడుతున్నాడు.

ఆ వాతావరణం అంతా బెల్లం వాసనతో తియ్యగా ఉంది.

అంతవరకూ బెల్లం పనిలోవున్న రాజమ్మా, సింహాచలం భోంచేసి పదినిమిషాలయింది. పాకలో నులకమంచం పక్కని బోర్లించిన బిందె బంగారు బంతిలా వుంది. దానిమీద కూర్చున్న రాజమ్మ సరదాకి కూలి వేషం వేసుకున్న రాజకుమార్తెలా ఉంది.

ఆమె పచ్చని మొహంలోని తెల్లటి కళ్ళు బంగారు నీటిలో సరదాకి పైకి తేలిన చేపల జతలా ఉన్నాయి.

"ఆమె చూసినచోట రంగుల పువ్వులు రాల్తాయి. ఆమె నడిచినచోట ముత్యాలముగ్గులు పుడతాయి. ఆమె విడిచిన గాలిలో బంగారు పువ్వులుంటాయి. ఆమె నవ్వితే రంగుల కాంతులు ప్రసరిస్తాయి.

ఆమెను చూసిన తాచు తల దించేసుకుంటుంది. ఆమెని చూసిన పులి పక్కకి తప్పుకుంటుంది. ఆమె తిట్లు శాపాలౌతాయి. ఆమె మాటలు దీవనలౌతాయి." అన్నట్టు ఉంది ఆమె.

సత్యభామలోని కొంటెతనం, రాధలోని ముగ్ధత్వం ఆమె అందంలో కరిగిపోయేయి.

ఆమె పక్కనే నులకమంచం వుంది.

ఆ మంచం తాళ్ళు తెగిన సరాల్లా వేలాడుతున్నాయి. ఆ సరాల ఓనర్లా మంచం మీద పడుకున్నాడు సింహాచలం. ఆ మంచం అతనికి చాలా చిన్నదవడంవల్ల, అతను సరదాకి బేబీ కాట్ మీద పడుకున్న "గుడ్ డాడీ" లా కాకుండా, సరిపోని పాడిమీద పారేసిన దిక్కుమాలిన శవంలా ఉన్నాడు..

అతని నోట్లో అంటించని చుట్ట వుంది. అతని తలలో అంతులేని ఆలోచనలున్నాయి. అతను మొదలులేని చివరలా – అసంపూర్తి మనిషిలా వున్నాడు. రెప్పవెయ్యని అతని కళ్ళల్లో చూపుకంటె నిస్పృహ ఎక్కువగా వుంది. అతను స్వతహాగా ఎత్తుమనుషుల్లోనే లెక్క. భారీమనుషుల్లోనే జమ. కాని తిండి తక్కువైన సర్కసు జంతువులా అతను చిక్కి ఉన్నాడు. అతని నల్లని మొహం, వేదన వేడికి యింకా ఎక్కువ నల్లబడింది. దాని మీద అతని యౌవన్నాన్ని కనిపించని కత్తితో ముక్కలు కోస్తున్నట్టు లేత గీతలు యిప్పుడిప్పుడే వస్తున్నాయి. అతని జుత్తు కాకి గూడులా చిందర వందరగా వుంది.

సింహాచలం చేతిలోని అగ్గిపెట్టె తీసి ఒక్క పుల్ల వెలిగించింది రాజమ్మ. ఆ పాక చీకట్లో ఆ పుల్ల బంగారు కాంతిలో ఆమె మొహం మిలమిల్లాడింది. ఆ వెలుతురికి ఆమె కంటిపాపల్లో కెంపులు పువ్వులు పూసేయి.

"అరగంటై నవుఁల్తున్నావ్ ఆ సుట్టముక్కని–అంటించూ"

సింహాచలానికి ఆమె మాట వినిపించలేదు.

"ఏటా ఎఁ్రాలోచన? రేత్తిరికి దీన్నెలా కొడదారా అనా?"

కొట్టడం మాట వినిపించి సింహాచలం తుళ్ళిపడి లేచి కూర్చున్నాడు.

రాజమ్మ చేతిలో అగ్గిపుల్ల కొసవరకూ కాలి ఆమె చెయ్యి చురికింది. "స్" అని ఆమె పుల్ల పారేసింది. ఆమె చేతిలో అగి పెట్టె తీసికొని చుట్ట వెలిగించేడు అతను.

"కొట్టుకున్నా, కోసుకున్నా–యీ వొళ్ళు నీది. కాని తాగుడు మానీ, నీకూ, బొట్టుడుకీ కూడా మంచిదికాదు."

సింహాచలం సిగ్గుతో మొహం తిప్పుకొని మంచంమీద వాలి కళ్ళు మూసుకున్నాడు.

"పిల్లని కొట్టని తల్లీ, పెళ్ళాన్ని కొట్టని మొగుడూ వుండడు" మళ్ళీ రాజమ్మే అంది.

సింహాచలం ఔననలేదు.

"నువ్వు కొట్టేవని నేనేడ్వు. సచ్చేక నీ సేతుల్లో బుగ్గి కావలసిన దాన్ని–నువ్వుకొడితే తప్పులేదు. కొప్పులో పువ్వులెట్టినోడు కఁ్రతో కొట్టక మాన్డట. పుస్తికట్టినోడివి. నువ్వుగాపోతే యింకెవరు కొడతారు నన్ను? కాని దేనికేనా ఒకటయాం అంటూ వుంటాది. పాలగేదెని పాలిమ్మని కొట్టు–ఏం అనదు. కాని ఒట్టి గేదెని కొట్టి సూడు–వళ్ళిరగతంతాది."

"నోర్మూసుకోయే."

"మూసుకుంటున్నాను కాబట్టే నీ మానం దక్కుతున్నాది. పెళ్ళయిన కాడ్నుంచీ అమాసుకో, పున్నానికో కొడుతూనే వున్నావు. నానేం మాటాడ్నేదు. కాని యీ మద్దెల నీకు సిరా కెక్కువై పోనాది. నిన్న రేతిరి నానేటి జేసినానని సావబాదినావ్? సుక్కురారం రేత్తిరి నీకు తాగడానికి సారా దొరుకొద్దిగాని – సేవలొండమంటే నాకు సేపలు దొర కొద్దూ?"

"అవన్నీ తవ్వక."

"తవ్వను. కావాలిస్తే యిప్పుడు కొట్టు, నోటమాట రానియ్యను. కంటసుక్క రానియ్యను. కాని యీ తాగుడు మానీ, నువ్వు సంకురేత్తిరికీ, శివరేత్తిరికీ–సుక్కేసుకుంటే నా నెప్పుడూ కాదన్లేదు. కాని వారవైఁసూస్తున్నా–తాగనిరోజు లేదు. తన్నని రోజూ లేదు. యిప్పుడేం కొంప మునిగిపోనాదని యీ తాగుడు. ఆ ముసిల్దిపోయి నెలైంది. అది పోవడవేఁ మంచిదైంది. నేపోతే నీ ఏఁ్రవసాలు సూసి కుళ్ళి కుళ్ళి సచ్చేది. లోకంలో నీ కొక్కడికే పోనాదా అమ్మ? నా యమ్మా పోనాది. నా అయ్యా పోనాడు. లోకం దరమవేఁ అంత."

సింహాచలానికి చేతకానితనంవల్ల విసుగొచ్చింది. "ఊరు కొమ్మంటుంటే" అన్నాడు.

"అది కాదయ్యా, నువ్వే ఆలోసించు. అమ్మపోతే కొడుకు మిగుల్తాడు. కాని కొడుకుపోతే అమ్మ మిగల్దు. నాన్నీకన్నా సిన్న దాన్నే – కాని నా మాటలో తప్పుందేమో నువ్వే సూడు. నిజవేఁ –నీ శక్తికి మించే–నీ యమ్మకి కరుసెట్టేవ్. కరుసే మిగిలింది. కాని కట్టె మిగల్నేదు. సేసిన అప్పు తీరవలేక సస్తన్నావు. నాను కాదన్ను. కాని నువ్వు తాగితే అప్పుతీరద్దా? నన్ను కొడితే

తరుగుద్దా? ఆ సావుకోరు బెల్లం కొనకపోతే మనకి మిగిలి పోద్దేటి? కాణీ ఎక్కువకో-తక్కువకో-యింకో కాడ అమ్ముకుంటాం...."

"నీకు తెల్దే ఆదు నాగుపాఁవు"

"ఆదు పాఁవుఁ అయితే చవితి విందు సేసుకొమ్మను."

"బుస్సుమన్న సోట కుట్టదు."

"కస్సుమన్నకాడా, అననికాడా కూడా కుట్టమను. మనలా టోళ్ళని కుడితే-ఆడికి ఇషం దందుగతప్ప నాబం లేదు"

"మనల్నికుడితే ఆడికోరల పీకుతీరుద్ది"

"కుడితే సద్దావఁయ్యా. మనవేం గాంధీలవాఁ నెహూ రూలవాఁ? మనం సస్తే పెపంచికం ఆగిపోదు. బతికుండి అనుబవించీసేదేటి? సావంటే బెదిరిపోడానికి?" ఠక్కున ఆగి పోయింది రాజమ్మ.

చింపాంజీలు పంచలు కట్టుకొని-లాల్చీలు తొడుక్కోవు. పంచా, లాల్చీలు వేసుకున్నా పైమీద వాణీలు వేసుకోవు. పంచ, లాల్చీ, పైమీద వాణీతోసహా తనున్న పాకలోకి ఏదైనా చింపాంజి తొంగిచూస్తే, పాకలో ఉన్నవాడు కంసుడైనా, కృష్ణుడైనా జడుసు కోక మానడు. అంచేత రాజమ్మ పాకలో ప్రవేశించిన చింపాంజీ లాంటి మనిషిని చూసి జడుసుకుంది.

చింపాంజీ నవ్వబోయి నోరు విప్పింది. దేవుఁడు దాని నోరు విప్పి నోట్లో రెండు వందల పళ్ళు అడ్డదిడ్డంగా గుచ్చేసినట్టు, దాని నోటినిండా పళ్ళున్నాయి.

"సింహాచలం యితనేనా?" సింహాచలానికి మాటలు రావేమో నన్నట్టు రాజమ్మని అడిగింది చింపాంజీ.

"సింహాచలవూఁ యితనే, మంచంకూడా యితనిదే" అన్నట్టు తలూపింది రాజమ్మ.

"నేను కోరటు జవాన్ని. నీమీద మీ సావుకారు కేసెట్టినాడు. ఇయిగో సమన్లు, ఇంద-బైటికిరా, వేలుముద్ర వేద్దువుగాని. రిసీవరు బాబూ, కరణం, మున్సబులూ కూడా వచ్చేరు. బైటి కిరా" అంటూ తన సందేశాన్ని దమయంతికి అందిస్తున్న హంసలా అతి సంతోషంగా కొన్ని కాయితాలు యిచ్చేదు జవాను సింహాచలానికి.

సింహాచలానికి లేవడానికి కాళ్ళు రాలేదు. అంచేత యింకా పడుక్కునే ఆ కాయితాల్ని పరీక్షించేదు. మామూలువాడికి మోడర్న్ పెయింటింగ్ ఆ ఆ కాగితాలు అతనికి అర్థం అవలేదు.

"ఆరాతే మన కరదం అయితే మన రాతలిలా గుండేయి కావు" అంటూ సణిగింది రాజమ్మ.

అంతా పాక బైటికి వచ్చారు.

హిట్లరూ, ముసోలినీ ఒకచోట చేరినట్టు నిలబడ్డారు కరణం. మున్సబూ, వాళ్ళ పక్కనే కొత్త ప్లీడరు చక్రవర్తి తెల్లపాంటులో తెల్ల షర్టు టక్ చేసి నిలబడ్డాడు. అతను కోర్టుకి వెళ్ళినా, కూరల బజారుకి వెళ్ళినా అదే డ్రస్సు వేసుకుంటాడు. అతనికి డాబు చెయ్యడం సరదా. కోర్టులో డాబు చేద్దామంటే ఒక్క కేసూ లేద తనికి. కాని అతనికి ఎప్పుడయినా ఒక కమీషనో, రిసీవరో వేస్తారు కోర్టువారు. అతను డాబు ప్రదర్శించగలిగే అవకాశం అదొక్కటే. అప్పుడైనా "రాజూ వెడలె" అంటూ అట్టకత్తీ-రంగుల రుమాలూ పట్టుకొని బైల్దేరలేదు. అంచేత అతను డాబు చిహ్నం కోసం చాలా ఆలోచించేదు.

హైకోర్టు జడ్జీలకి దర్జా చిహ్నంగా వెండి దుడ్లు ఉంటాయి. పోలీసు యిన్‌స్పెక్టర్లకీ, సూపరెంట్లకీ యూనిఫారాలూ, భుజ కీర్తులూ ఉంటాయి. డాక్టర్లకి స్టెతస్కోపులుంటాయి. కాని యివేవీ అతనికి పనికిరావు. అంచేత అతను షోకు చెయ్యడానికి నల్లద్దాల కళ్ళజోడు ఒకటి కొన్నాడు. తనేదైనా ముఖ్య విషయం చెప్పి నప్పుడు, ఆ కళ్ళజోడు తీసి చేత్తోపట్టుకొని, తన మాటల ప్రాము ఖ్యాన్ని దానితో నొక్కుతాడు.

అప్పుడతను ఆ కళ్ళజోడులోంచి సింహాచలాన్నీ, రాజమ్మనీ చూసేదు.

అతనికి సింహాచలం నచ్చలేదు.

రాజమ్మ నచ్చింది.

కళ్ళజోడు తీసి చూస్తే యింకా నచ్చింది.

చక్రవర్తి వెనుక నిల్చున్న నలుగురు కూలీలు ఖూనీకోరుల్లా వున్నారు.

"నేను రిసీవర్ని. ఆడిన బెల్లం, ఆడని చెరుకూ స్వాధీనం చేసుకోమన్నారు కోర్టువారు" అని, చక్రవర్తి కళ్ళజోడు పెట్టేసు కున్నాడు. నల్లకళ్ళజోడు పెట్టేసుకుంటే సింహాచలంతో మాట్లాడు తున్నా రాజమ్మ వేపు చూడొచ్చునని.

"తఁవఁరు గోరు ఏటంటున్నారో తెలడంలేదు" అన్నాదు సింహాచలం.

"మీ సావుకోరు నీమీద దావా ఏసినాడు. దావా తేలీలోగా కోరటు వోరు నీ యాస్తి–అంటే నీ పంట–సోదీనం చేసుకుం టున్నారు" జవాను భాష్యం చెప్పేడు.

సింహాచలానికి యింకా అర్థం కాలేదు. అతనప్పుడు ఏఁ వీఁ అర్థం చేసుకునే స్థితిలో లేడు. తన చుట్టూ వున్న మనుషులు తను బతికుండగా వచ్చిన కోర్టు మనుషులో, లేక తను చచ్చిపోతే వచ్చిన యమభటులో అతనికి అర్థం కావడంలేదు.

పరిస్థితి అర్థం చేసుకున్నాక అతనికి నోట మాటరాలేదు. కంటి నీరు ఆగలేదు.

బెల్లం స్వాధీనం చేసుకోవద్దని రాజమ్మే కడుపు తరుక్కు పోయేలా అడిగింది.

విన్నవాళ్ళ గుండెలు పగిలేలా అర్థించింది. ఎదుటివారు పిచ్చెత్తి పోయేటట్టు ప్రార్థించింది. పది జన్మల పాపాలు కడుక్కు పోయేటట్టు ఏడిచింది.

".....తీసుకుపోకు బాబూ! పంట తీసుకుపోకు. అవి బెల్లం దిమ్మలు కావు బాబూకావు. మా కష్టాల అచ్చులు. అది మామూలు పంటకాదు బాబూ. బూఁవిఁలో మన్నై, ఎద్దుల్లో ఎద్దులవైఁ, పగలు పస్తులుండి రేత్తిరి కునుకునేక మాఁవుఁ పడ్డ కష్టం... ఆ పెనంలో ఉడికేది బెల్లంకాదు బాబూ మా వంటి మాంసం. ఆ పొయ్యిలోని కర్రలు కావు బాబూ...కాల్తున్న మా ఎఁవిఁకలు...మా నోళ్ళల్లో మన్ను కొట్టకండి, మా కడుపుల్లో కూడు తీసుకుపోకండి నాయనలారా....

...ఆ సరుకక్కడ ఒగ్గీయండి. నన్ను తీసికెళ్ళండి. ఆడదాన్ని. అయినా నన్ను బజార్లో పెట్టి అమ్మీసి సావుకారి బాకీ కట్టీయండి.

మీ పాదాలు పట్టుకుంటాను. ఈ జనమలో మీ యింట్లో బానిసనై చాకిరీ చేస్తా. వచ్చీ జనమలో మీ కడుపున పుడతా...."

ఆమె మతిపోయిన మనిషిలా ఏడిచింది.

కళ్ళు కరిగిపోయేవరకూ ఏడిచింది.

వంట్లోని రక్తం అంతా కన్నీరై కారిపోతున్నదా అనిపించేటట్లు ఏడిచింది.

ఆమె కళ్ళ నుండి కారిన నీరు పైట తొలగిన ఆమె గుండెల మీద పడి...తుళ్ళి ఆ ఎర్రటి ఎండలో రక్తపుజల్లులా కనిపించింది.

తిరుగుతున్న చట్టపు పళ్ళ చక్రాలు కరకరమని తిరుగుతూనే ఉన్నాయి.

రిసీవరుగారు పంట అంతా స్వాధీనం చేసుకున్నారు.

ఆ తర్వాత సింహాచలం వెళ్ళి సురేంద్ర కాళ్ళమీద పడ్డాడు. అప్పుడు సురేంద్ర అతనితో చాలా మాట్లాడేడు. ఆ మాటల్లోంచి బూతులు తీసేసి చెప్పాలంటే...ఏవీఁలేదు.

# 29

"ఇప్పుడేటి సెయ్యాల?" సింహాచలం జనాంతికంగా అన్నాడు.

"పీకకి తాడు కట్టుకుని నూతిలోకి గెంతాల. నేకపోతే వకీలు కాడ కెళ్లాల" అంది రాజమ్మ.

"అదే–ఏ వొకీలు కాడికి అని?"

"మనకి ఏ వొకీలేనా తెలుస్తేగదా–యితగోడా, అతగోడా అనడానికి."

"నా ననేదీ అదే."

"మనకు తెల్దు కాబట్టి తెలిసినోడికాడి కెళ్ళు."

"ఎవుడా తెలిసినోడు?"

"గవర్రాజు బాబు. దేవుడ్ని కాడనుంచీ ఆ బాబుకి అందర్నీ తెలుసు."

"ఔను."

"సాఁవుఁ తప్ప సేతకాన్ది లేదు – ఆ బాబుకి"

"ఔనౌను."

"మరంచేత ఆ బాబు కాళ్ళట్టుకో."

"....................."

"అట్టుకున్నాక రచ్చిస్తానంటే గాని ఒగ్గక".

"ఒగ్గను" అంటూ లేచేడు సింహాచలం.

"లేడికి లేచిందే పెయాణవఁని యిప్పుడెక్కడికీ బయలెల్లి నావు? ఏటవ్వాలో అదే అవుద్ది. ఈ పూటకింత తిని తొంగో. పొద్దుటేసి ఎల్దువుగాని."

కూడు తిని తొంగున్నాడు సింహాచలం. కాని నిద్ర రాలేదు. అతని కడుపులో పేగులు మాయమైనట్లు ఏదో వెలితిగా గాభ రాగా వుంది. మంచం మీంచి లేచి కిందకి దిగితే అక్కడ భూమి ఉండదేమోనని భయపడుతున్న వాళ్ళా వున్నాడు.

చీకట్నే సింహాచలం లేచేడు. తర్వాత కోడి కూసింది.

పొద్దున్నే నాలుగుమైళ్ళు నడిచి గవర్రాజు యిల్లు చేరుకున్న సింహాచలం–తనకి వచ్చిన కోర్టు కాగితాలు అతనికి చూపించేడు. తనకు వచ్చిన విపత్తు విన్నవించేడు.

గవర్రాజు ఆ కాగితాల్ని చూసేడు. తర్వాత సింహాచలాన్ని చూసేడు. "అయితే దావా ఏసేడన్న మాట! కుట్టకపోతే తేలు కాదు. కరవకపోతే పాఁవుఁ కాదు. కోర్టు కీడవకపోతే సావుకారు కాదు. అందులోనూ మీ వాడున్నాడే అబ్బో–మామూలు వోడుకాదు. ఆడిసూప్పడితే కడుపులు పోతాయ్.

ఆడి మాటంటే మూడు తరాలు ముక్కలై పోతాయి. మొత్తానికి మా గొప్పోడ్నే సంపాయించేవ్‌లే" అని నిందించేడు.

"ఆడే నన్ను సంపాయించేడు" అన్లేదు సింహాచలం.

"మరింతకీ ఏటి సేద్దారనుకుంటున్నావ్?"

"నువ్వే సెప్పాలి."

"ఏటుందీ? ప్లీడరుకాడి కెళ్ళాల."

"ఎల్దాం."

"ఎవుడి దగ్గర కెళతావ్?"

"నువ్వే సెప్పాలి."

"ప్లీడర్లకి లోటు లేదీ వూర్లో. ఇంటికి ముగ్గురున్నారు. కాని అందర్నీ నమ్మడానికి వీల్లేదు. బుట్టపాగా లెట్టుకున్న ముసిలోళ్ళున్నారే, హమ్మ! ఆళ్ళు ప్లీడర్లు కారు. తల్లికి మొగుళ్ళు. ఆళ్ళు కేసులు గెలిచినా, ఆళ్ళ పార్టీలు గెలవరు. మరంచేత సిన్నోడైనా చాకులాటోడ్ని సంపాయించేను నేను. నా కోసంగాదు. నీలా టోళ్ళకోసం. పేరు ఎంకట్రావు."

"అయితే ఆ బాబుకాడికే ఎళదాం."

"డబ్బేమైఁనా తెచ్చినావా?"

"లేదు."

"మనవెఁళ్ళేది–మంతర్సాని కాడి కనుకున్నావేటి? యీ పురుడు పోసి పెట్టు–బారసాల్నాడు కట్న వెడతాఁవఁనడానికి? మనోళ్ళు తెలక పెద్దోళ్ళకాడికీ, పసివాళ్ళకాడకీ ఉట్టిచేతుల్తో ఎల్ల కూడదంటారు. కాని అది నిజం కాదు. మనం ఏవీఁ అట్టుకెల్లక పోయినా ఎందుకు తేలేదని పెద్దవాళ్ళు అడగరు. సిన్నోళ్ళు అడిగితే యీపు సీరీయొచ్చు. నన్నడిగితే ప్లీడరు కాడికీ, దేవుడి కాడికీ, వొయిజ్యుడి కాడికీ, వోటరు కాడికీ, ఉట్టి సేతుల్తో ఎళ్ళకూడ దంటాను."

"నిజవేఁ"

"మరైతే బేగి యింటికెళ్ళి డబ్బుపట్రా. నా నీలోగా వణ్ణం తినీసి సిద్ధంగుంటాను."

"అలాగే"

"ఎంత తెస్తావేటి?"

"అప్పు చేసిన డబ్బులో యాభై మిగిల్నాయి."

"అవట్టుకురా. వీలుంటే మీ పక్కింటోడ్ని భయపెట్టో, బతిమిలాడో ఓ పాతిక పీకు. ఈ ఎంకట్రావు బాబు–సూపుకే సిన్నగాని. పనికీ, ఫీజుకీ పెద్దే."

సింహాచలం డబ్బు తెచ్చేడు.

గవర్రాజు అతన్ని వెంకట్రావు ఇంటికి తీసుకెళ్ళేడు. అప్పటికి గవర్రాజుకి వెంకట్రావుతో అయిదారేళ్ళ పరిచయం ఉంది.

# 30

తన ఆఫీసు కమ్ లివింగ్ రూమ్ కమ్ గెస్టు రూమ్‌లో వెంకట్రావు ఉన్న ఒక్క కుర్చీలోనూ కూర్చున్నాడు. అతని ముందున్న టేబిల్ మీద పాత కాయితాలూ, పదిరోజుల దుమ్మూ–ఉన్నాయి. దానిమీదున్న రెండు కలాల్లోనూ ఒకదానికి పాళీ లేదు. పెన్సిలుకి ముల్లుంది. సిరాబుడ్డిలో వుండాల్సిన సిరాలో సగం బల్లమీదపడి అతని జీవితానికి మాయని మచ్చలా ఉంది. అతని వెనక గోడమీద ఏదో ఆయుర్వేదం కంపెనీ వర్జ్యాల కేలండరుంది.

అతనికి ఎదురుగా నేలని ఒక తుంగ చాప పరచి ఉంది. ఆ చాప యిప్పుడు చదరకన్నా పెద్దదిగానే ఉంది. ఆ చాప కొత్తగా కొన్నప్పుడు దానికీ అనేక రంగులు ఉండి ఉండవచ్చును. ఆ చాపవాడే వెంకట్రావు గుమాస్తా దాని పుల్లల్ని, వేళ్ళకి అందనిచోట వీపు గోక్కోడానికి ఉపయోగిస్తాడు. ఆ చాపమీద ఒక పాతరైటింగ్ డస్క్, కరక్కాయ సిరా మరకలతో సహా ఉంది. గుమాస్తా నేలని కూర్చుని ఆ డస్క్ రాసుకుందుకి ఉపయోగిస్తాడు. ఆ డస్క్ వెనకాల వుండాల్సిన గుమాస్తా యిప్పుడక్కడ లేడు. బహుశా అతను పార్టీల వేటలోగాని, చెడిపోయిన ఆడవాళ్ళ వేటలో గాని ఉండి ఉండవచ్చు. పార్టీలు అతనికీ, వెంకట్రావుకీ కూడా ఉపయోగిస్తారు. ఆడవాళ్ళు అతనికే ఉపయోగపడతారు. అంటే వాళ్ళు అతన్నే నమ్ముకుని ఉండిపోతారని కాదు. వెంకట్రావుకి ఉపయోగపడరని అర్థం.

వెంకట్రావు కుర్చీకి ఎదురు గోడని అనుకొని బొక్కి కఱ్ఱ బీరువా ఉంది. అందులో కొన్ని ముసిలి 'లా' పుస్తకాలూ, తెల్ల కాయితాలూ, సూదీ, దారం, వేలుముద్ర పెట్టే వెంకట్రావు గుమాస్తా కోర్టులో పెట్టుకునే నల్లటోపీ, రూళ్ళకర్రా, యింక్ పెన్సిలూ, కేసు కట్టలూ ఉన్నాయి. ఆ బీరువా మీద అయి పోయిన కేసు కట్టల గుడ్డ మూటలు ఉన్నాయి. ఆ గుడ్డలు కొత్తలో – నేరేడుపండు రంగువైనా ఎన్నడూ ధూళి దులపక పోవడం వల్ల బూడిద రంగు గుడ్డల్లా ఉన్నాయి.

వెంకట్రావు కుర్చీకి రెండు వైపులా ఉన్న గోడలకి ఆనించి రెండు బెంచీలు ఉన్నాయి. అందులో ఒకదాని మధ్య కాళ్ళు మిగతా కాళ్ళకన్నా పొడవు. అంచేత ఒకదానిమీద కూర్చున్న ఏ యిద్దరు మనుషుల్లోనయినా ఎవరు ఎక్కువ బరువో అది అడక్కుండానే తెలుపుతుంది.

వెంకట్రావు కుర్చీకి ఎడమవైపు గోడకి ఒక కేలండరూ, ఒక దేవుడి పటం ఉన్నాయి. ఆ కేలండరులో ఒక కరాచీ ఆవులాంటి ఆడదీ ఉంది. ఆమె వెనుక పచ్చటి చెట్టుకింద ఒక బావి ఉంది. ఆవిడ భుజం మీద మడత పెట్టిన రంగు గుడ్డలు ఉన్నాయి. ఆ గుడ్డలు ఆమె జాకెట్టూ, బాడీ అవొచ్చు. ఆమె చెంపమీద జుత్తులో ఒక పెద్ద సైజు మందార పువ్వుంది. ఆమె గుండెలు కరాచీ ఆవు పొదుగులా ఉన్నాయి. ఆమె కట్టుకున్న తెల్ల చీర ఆమె గుండెల మీద లేదా అన్నంత తడిసి ఉంది. అమె కుడిచేతిలో ఉన్న పూలసజ్జలో యేవో పోల్చుకోలేని పువ్వులున్నాయి. అంచేత ఆమె పూజకి వెళ్తోందని అనుకోవచ్చు. కాని ఆమె కళ్ళల్లో భక్తికంటె రక్తి ఎక్కువుంది. గోడనున్న దేవుడి బొమ్మ శ్రీరామ పట్టాభిషేకంపటం. (శ్రీరాముడి కారనేషన్ చిత్రంలో ఎంచేతో కాని–భరత శత్రుఘ్నులుండరు.)

వెంకట్రావు కుడివేపు ఉన్న గోడకి రెండు ఫోటోలున్నాయి. అందులో ఒకటి అతని చిన్ననాటి టెన్నిస్ ఛాంపియన్‌షిప్ ఫోటో. ఆ ఫోటోలో వెంకట్రావుకీ ఇప్పటి వెంకట్రావుకీ పేరు ఒక్కటే కామన్. ఆ రెండోఫోటో ఎవరో జడ్జీ "సెండాఫ్" ఫోటో. అందులో ట్రాన్స్‌ఫరైన జడ్జీ, కొత్తగా వచ్చిన జడ్జీ యిద్దరూ ఉన్నారు. ట్రాన్స్‌ఫరైన జడ్జీ మొహంలో "ఈ నా రాజ్యాన్నీ, ప్రియమైన ప్రజనీ నీలాంటి అప్రయోజకుడికి అప్పగించి వెళ్ళి పోవాల్సి వచ్చింది" అన్న రిటైరైపోయిన రాజు గారి భావం ఉంది. "ఏలడానికి యిన్నాళ్లుండగా యీ అరాచకపు ఊరే నా వంతుకు రావాలా?" అన్న భావం కొత్తగా వచ్చిన జడ్జీ మొహంలో ఉంది.

"చిన్న కోడలు మంచిదా? పెద్ద కోడలు మంచిదా?" అన్న భావం ప్లీడర్ల మొహాల్లో ఉంది.

ఆవేళ ఆదివారం.

మామూలు మనుషులకి హాలీడే.

గొప్పవాళ్ళకు జాలీడే.

బీదవాళ్ళ కష్టాలవారానికి అది మొదటిరోజు.

వెంకట్రావు ఏవో కాయితాలు దీక్షగా చదువుకుంటున్నాడు. ఆ టైములో ప్రవేశించేరు అతని ఆఫీసులోకి సింహాచలం, గవర్రాజూను.

"దండాలు బాబూ" దండం పెట్టకుండా బెంచీమీద కూర్చు న్నాడు గవర్రాజు.

"దండాలు" అనకుండా నమస్కారం చేసి నిలబడ్డాడు సింహాచలం.

"నువ్వూ కూకోరా" అన్నాడు గవర్రాజు. సింహాచలం గవ ర్రాజు పక్కనే బెంచీమీద కాస్త ఎడంగా కూర్చున్నాడు.

వెంకట్రావు వాళ్ళని చూసి "ఏఁవిఁటీ–గవర్రాజూ సంగతి?" అనడిగి మళ్ళీ కాగితాల మీదికి దృష్టి మళ్లించేడు.

"నువ్వు మంచి 'బిజీ'లో ఉన్నట్టున్నావు?" అడిగేడు గవర్రాజు.

"ఔనోయ్" జవాబిచ్చేడు వెంకట్రావు.

"మాకో యవ్వారం తగులుకుంది."

"రేపు రాకూడదూ!"

"ఎనకటికి ఎవర్తో బ్రెమిసి నీలాటి బాపనయ్యకి కబురెడితే యీ ఏల శుక్రవారం అన్నాట్ట–అలాగుంది నీతో తగువు."

"పోన్లే యిప్పుడే చెప్పు ఏఁవిఁటో?"

గవర్రాజు లేచి టేబిలుమీద సింహాచలం కేసు కాగితాలు పెట్టి "అవి సదివి సెప్పు" అని మళ్ళీ బెంచీమీద కూర్చున్నాడు.

సింహాచలం కంటే గవర్రాజే బరువని బెంచీ చెప్పింది.

వెంకట్రావు కాగితాలు చూసేలోపున గవర్రాజే ప్రారంభిం చేడు – "అన్నట్టు ఏటైంది బాబూ మొన్న నువ్వు వోదించిన కేసు" అంటూ.

"ఏ కేసు" అర్థం కానట్టు అడిగేడు వెంకట్రావు.

"ఆ కేసే-అక్కుపక్షిలాంటి ఆడకూతురిది."

"వదిలేసేరోయ్?"

"ఒగ్గేస్తారనే అనుకున్నాన్లే. నువ్వు వోదించినాక, ఒగ్గీకుండా ఉండడానికి జడిజీకి గుండే? చెరువా? అన్నట్టు-మేడకోరటు జడ్జీ మారిపోనాట్ట. నిజమేనా! అలాటోళ్ళు మారడవేఁ మంచి దిలే. మీ అందరితోనూ బంతాట ఆడుతూ బాగానే ఉండేవోడా? సీకటడేసరికి శివఁవెత్తిఁ పొయ్యీవోడు. రేత్తిరైతే ఆ బాబు కళ్ళకీ, ఫకీరు ముండకీ, పతివ్రతకీ తేడా తెలిసీది కాదు. ఆ బాబు కా ఉద్యోగవేఁ లేకపోతే, తెలకలి ఎంకమ్మ బడ్డీకొట్టుకాడే ఉండి పోయీవోడు. యింతకీ ఆ బాబు తప్పేటుందిలే? పెతీ వోడ్నీ జడ్జీ చేస్తే ఏటిజేస్తారు. నాకే పవరుంటే తీరుపుసెప్పీ ప్రెతీ వోడూ - ముందు పదేళ్ళు తపసు జెయ్యాల అని-ఆర్డరేసీసి ఉందును. లేపోతే, ఎళ్ళిపోయిన జడ్జి ఎలాటోడో తెలుసా? ఆడు సరదా తీరుసుకుందుకి ముండింటికెళ్ళినట్టు, పార్టీలు సరదాకి కోర్టు కొస్తారనుకుండీవోడు.

ఇంతకీ ఆ బాబూసు మనకెందుగ్గాని, నువ్వు నాకో సిన్న సాయం సెయ్యాల, యీడు వొరసకి నాకు అల్లుడౌతాడు. అయి నోడుకే సెయ్యని యీ రోజుల్లో వరసగాడో లెక్కా అనుకునేవ్? నా సంగతి నీకు తెల్సు, ఊరూ పేరూ లేనోడికన్నా సరే - ఊపిరున్నంత వరకూ సాయం జెయ్యక పోతే నాకు వణ్ణం సయించదు."

"ఏం జరిగింది?" అన్నాడు వెంకట్రావు-యేం జరిగినా పర్వాలేదన్నట్టు చూస్తూ.

జరగకూడనిదే జరిగిందన్నట్టు చూసేడు సింహాచలం.

మళ్ళీ గవర్రాజే ప్రారంభించేడు. "ఈడికి నోరూ, ఆ సావు కోరుకి నీతీ వుంటే-నీకాడికెందు కొస్తాది యవ్వారం! కథే టంటే-మామ్మూల్దే. నువ్వూ, నేనూ యీ పద్ధతీ, ఈ డబ్బూ, ఈ సావుకార్లూ పుట్టినకాడ్నించీ జరుగుతున్నదే. ఈడికో సావు కారున్నాడు. సావుకారంటే ఎవడనుకున్నా వేటి? ఎనకీది నల్ల బంగారమ్మ కూతుర్ని సెరిసీసి, నీళ్ళా డించేసి, దాని సేతుల్తోనే దాని కాపరంలో నీళ్ళోయిం చీసినాడే - అడుగో ఆడూ. ఆడికి యినప్పెట్టెలో యిరవై లక్షలున్నాయి. ఆ ఈదిలో సగం మేడలు ఆడివే. కాని ఏట్నాబం బుర్రకి బుద్ధీ-సేతకి నీతీ లేదు. ఇంతకీ ఎంత వరకూ సెప్పినాను కత?" అంటూ ఆగేడు గవర్రాజు.

"ఇతనికో సావుకారున్నాడన్నావు" అన్నాడు వెంకట్రావు.

"అన్నానా. ఈడికో రంబలాంటి పెళ్ళాం, బంతిలాంటి బొట్టెదూ కూడా ఉన్నారు. మొన్నటివరకూ తులసి కోటలాంటి తల్లి కూడా ఉండేది. సావుకారు పీకీసుకోకుండా ఉంటే - ఎకరావో, ముప్పాతికో - సెక్కకూడా ఉంటాది. కాని ఈడిసేతికి కష్టవేగాని - రేఖనేదు. యీడి తాత సావుకారి తాతకాడ అప్పు చ్చుకొని అడ్ని పెంచేడు. యీడి బాబు ఆడి బాబుకాడ అప్పు తీసుకొని తీర్చకుండా సచ్చేడు. అది తీర్చనేక ఈడు సస్తన్నాడు. ఈడి బాబు బాకీ ఈడూ ఈడి బాబూ తీర్చగా ఈడి భూమి మూడొంతులు బాకీకింద సావుకారు రాయిం చీసుకుని మిగిలినది నాలుగేళ్ళ క్రిందట మూడు వేలకి తాకట్టు రాయించీ సుకున్నాడు. అదిగాక-ఈడు పెతీ ఏడూ - సెరుకు ఎయ్యడానికి ప్రోనోటురాసి మూడొందలు తీసుకుంటాడు. ఈడు అమ్మిన బెల్లం డబ్బులో మొట్టమొదట ప్రోనోటు బాకీ కింద సావుకారు జమకట్టేసుకుంటాడు. మిగిలిన దాంట్లో ఈడు సంవత్సరం పొడుగునా సావకుండా ఉండడానికి కొంత యిచ్చి మిగతాది తాకట్టు బాకీకి జమ కట్టేసుకుంటాడు.

ఈ ఏడు కూడా ఈడు ప్రోనోటు మీద మూడొందలు పుచ్చు కున్నాడు. అదలా ఒగ్గీ. ఇకపోతే బాకీ కింద యీడు కట్టింది వడ్డీలు కాక రెండు వేలన్నా ఉంటది. ఈడు కట్టినట్టు సాచ్చికం లేదు. యీడు కట్టిన దానికి రసీదుల్లేవు. ఈడు యివ్వాల్సిన దానికి మాత్తరం యినప ముక్కలా ప్రోనోట్లూ, తనఖాలూ ఉన్నాయి.

అసలు మూడు వేలని సెప్పేనా? ఈడు కట్టింది రెండు వేలుంటుందనీ సెప్పేనా? సావుకారు కావాలంటున్నది ఐదువేల చిల్లర. ఈ లెక్క ఎలాగని నన్నడక్క. సానిముండన్నా సెప్తాది.

మరో సంగతి. సావుకారు ఈడి ప్రోనోటుమీద దావా తేలేదు. అలాగని మనం సంతోషించడానికి వీల్లేదు. ఆడెలాటోడో నీకు తెల్దు. అమ్మ కడుపులో ఉన్నప్పుడు ఆడికి పళ్ళులేవుగాని, ఉంటే అమ్మ కడుపు కొరికేసి ఉందును. అంచేత ఆడు ప్రోనోటు మీద దావా చెయ్యలేదంటే, ఆడికేదో ప్లానుండి ఉంటాది.

ఇదిలా ఉండగా ఈడి తల్లికి జబ్బుజేసింది. జబ్బు చేస్తే ఈడెళ్ళి...ఎవుడా దేవుడు గాడిద కాళ్ళట్టుకున్నాడు? అదిగో ఆ దేవుళ్ళాగ-ఈడెళ్ళి ఆ సావుకోరి కాళ్ళట్టుకున్నాడు. ఈడు దేవుడు కాదు. కాని సావుకారు గాడిదే! అంచేత ఫెడీమని

ఈడ్చి కాలితో తన్నేడు. తన్ని సేతిలో కానీ ఎట్టకుండా పాతబాకీ బేగి తీర్చమన్సెప్పి, బెల్లాలు ఆడగానే తన కొట్టుకే అట్టుకు రమ్మన్నాడు. బెల్లాలాడీ టయంవరకూ వూరుకుంటే వీడి అమ్మకి మూడు మాసికాలు ఎట్టేవొచ్చు. అంచేత ఈడొచ్చి నా కాళ్ళకి సుట్టుకున్నాడు. అసలు యిలాటోళ్ళని సేరదీసే నాను సెడి పోనాను. నాకున్నది నా కెక్కువే, నా బతుకు నన్ను బతక నియ్యండ్రా అంటే వూరుకోరే! నా కూతురు నెగసిపోనా దనొ కదూ, నా పెళ్ళానికి నొప్పులొస్తన్నాయ నొకదూ తయారౌతారు. మున్సిపాలిటీ నెంబరుకి మంతర్సాని పనిరాదా అనుకుంటారో ఏటో! అది సరేగాని కథ ఎంత వరకూ జెప్పేను?" అని ఆగేడు.

"వీడు నీ కాళ్ళకి చుట్టుకున్నాడన్నావు" వెంకట్రావు అందించేడు.

అన్నాగా మరి –రైటే. ఈడు ఈస్సెరుడి కాళ్ళకి మార్కండే యుడ ఉరిసుట్టుకున్నట్టు నన్ను సుట్టుకున్నాడు. నాను మాత్తరం ఏటిజేస్తాను? మన కావంరాజు బాబు కాళ్ళట్టుకున్నాను. 'ఈ అవుసరం ఈడిదికాదు–నాదీ' అన్నాను ఇప్పుడు నీ దగ్గరన్నట్లే. 'ఈ అప్పు పూసీ ఈడిది కాదు నాదే' అన్నాను. 'ఈడి తొలిబెల్లం నీదే' అన్నాను. ఐదొంద లిప్పించినాను. ఈడ్నీ, ముసిల్దాన్నీ పట్నం పెద్దాసుపత్తిరికి తీసికెల్లినాను. అక్కడ నేను పడ్డపాట్లు యిప్పుడనవసరం అనుకో?

ఈడి డబ్బు–ఈడి అమ్మకి అచ్చి రాలేదు. ఆస్పత్రిల్లో జేర్చిన వారానికో, పదిరోజులకో 'హరీ' మనిసినాది. ఈడు తిరిగొచ్చీ సరికి అమ్మా నేదు, డబ్బూ నేదు, కిందటోరం బెల్లం ఆడేడు. తొలిబండి కావంరాజు కొట్టుకే ఏసేడు. కావంరాజుకి ఈడు బెల్లం ఏస్తే–సావుకారుకి తనపెళ్ళాన్ని ఈడు లెగదీసుకొని పోయినట్టనిపించిందో ఏటో ఎంటనే దావా పడీసి, ఈడి బూవీం, పుట్రా జప్తు చేయించేసి, సెరుకుతోటకీ, పండిన బెల్లానికీ – 'రీసీవరు'ని ఏయించీసినాడు. తోటకాడికొస్తే సెరుకుగడ ఇరిసినట్ట ఈడి కాళ్ళిరిచీసి, ప్రాణాల్తోనే పాతేస్తానంటున్నాడు.

ఈడు కట్టినదేదీ సూపకుండా–అసలు మూడువేలూ, వడ్డీ రెండు వేలకీ దావా ఏసినాడు. అన్నేయం దావాలు ఏసీసి డాబాలు కట్టేద్దామనుకుంటున్నాడో ఏటో? ఈడ్ని, ఈడి పెళ్ళాన్నీ, ఈడి బూంవినీ అమ్మినా డాబామీద పిట్టగోడ కూడా రాదు. మరంచేత నువ్వేం సెక్రం అడ్డేస్తావో అడ్డేసి ఈడ్ని కాపాడు. ఇప్పు డాడి సేతిలో సుట్టముక్కన్నా లేదు. అలాగనీ–నీ కష్టం మేముంచుకోం. ఈ పొద్దుగాబోతే రేపైనా నీ సొమ్ము పువ్వుల్లో పెట్టి యిచ్చేస్తాం. కొంచెం ఎనకాముందూ అంతే. నీ డబ్బుకి నాను పూసీ. అన్నన్న...సుట్టముక్కలై పోనాయే. ఒరే బాబూ నువ్వెళ్ళి ..... అదుగో...ఆ దుకాణం కాడ...నాలుగు సుట్టముక్క లట్టు కురా ... నాకనిజెప్పు" అని ఆగి సింహాచలాన్ని చుట్టలకి పంపించి మళ్ళీ గవర్రాజు ప్రారంభించేడు.

"ఇప్పుడీడ్ని ఏటీ అడక్కు. అంతవరకూ స్టాంపు కరుసుకి యిదిగో–ఈ ఐదు–నీ ఫీజు ఈ పాతికా వుంచు. నీ గుమాస్తా సంగతి నే చూసుకుంటాలే. నాను సెప్పాల్సింది నాను సెప్పేను. నాయం, నువ్వూ యీడివైపున్నారు. పైన బగవంతుడున్నాడు" అంటూ జేబులోంచి మూడు పదిరూపాయలనోట్లు తీసి టేబిలు మీద పెట్టేడు.

ఈలోగా సింహాచలం చుట్టలు పట్టుకొచ్చేడు. గవర్రాజు చుట్టలు పుచ్చుకుంటూ "సూడు బాబోరే–నాను సెప్పిందంతా యిన్నావు కదా, అది రైటేనా?"అని అడిగేడు.

"రైటే" అన్నట్టు తలూపేడు సింహాచలం.

"సరే! స్టేట్‌మెంటు రాయించడానికి తొందరలేదు. పంట వదిలించమని ముందు పిటిషన్ పెడదాం. రేపు రండి" అన్నాడు వెంకట్రావు.

సింహాచలానికి అతని మాటలు అర్థం కాలేదు. డాక్టరు తను చేయబోయే ఆపరేషను గురించి పేషంటుకి చెప్పినట్టు అనిపించింది. సింహాచలానికి వెంకట్రావు మాట. ఆపరేషను మాత్రం చిన్నది కాదని అతనికి అర్థం అయింది.

మధ్యాహ్నం పన్నెండు దాటింది.

గవర్రాజూ, సింహాచలం వెంకట్రావు దగ్గర సెలవు తీసికొని బైల్దేరేరు. వెంకట్రావు ఇంటిముందు చెట్టుకింద ఒక మైనగోర నోరు తెరచి ఎండవేపు గాభరాగా చూస్తోంది. ఆ ఎదురింటి గోడ నీడని ఒక గాడిద నిలబడే నిద్రపోతోంది.

ఆ వీధి చివరివరకూ నడిస్తే కోర్టువస్తుంది. కోర్టు పక్కన వెంకటేశ్వర విలాస్ కాఫీ మరియు భోజన హోటల్ ఉంది. ఆ హోటలు గోడలూ, నేలా సిమెంటువైనా, పైకప్పు మాత్రం తాటాకుది.

ఆ హోటల్ దగ్గరకు రాగానే "రారా సివంచలం, పొద్దుట కూడు తిన్నావోలేదో" అంటూ హోటల్లోకి దారితీసేడు గవర్రాజు.

హోటల్‌కి ముందు వరండా వుంది. సాధారణంగా కోర్టు కొచ్చిన పార్టీలూ, సాక్షులూ, దస్తావేజులు రాసేవాళ్ళూ, రాయిం

చుకునేవాళ్ళూ, తగవులు పెంచేవాళ్ళూ, పుట్టించేవాళ్ళూ, రాజీలు చేసేవాళ్ళూ, చెడగొట్టేవాళ్ళూ, ప్లీడర్లు, గుమాస్తాలూ వగైరా అంతా ఆ హోటల్లో కాఫీ తాగిన తర్వాత. ఆ వరండా మీద కొంతసేపు కూర్చుంటారు. ఆ వేళ ఆదివారం అవడం వల్ల ఆ వరండా ఖాళీగా ఉంది. ఒక వీధికుక్క మాత్రం పిల్లలకు పాలిస్తూ ఒక మూల నిద్రపోతోంది. ఆ వరండాని ఆనుకొనివున్న కిళ్ళీకొట్టులో సిగరెట్లు, చుట్టలు, బీడీలే కాకుండా సోడాలూ, బూతు సారస్వతం వగైరాలు కూడా దొరుకుతాయి.

ఆ హోటల్ వరండా దాటి హాల్లోకి వెళ్ళితే గుమ్మం దగ్గరే ప్రొప్రైటరు బల్ల ఉంటుంది. ఆ బల్ల వెనక తన బావమరిది లేనప్పుడు ప్రొప్రయిటర్ ఆర్ముగం ఉంటాడు. ఇప్పుడతనే ఉన్నాడు. అతను మొదట్లో యింత దుర్దశలో ఉండేవాడు కాదు. పదేళ్ళ క్రితం వరకూ అతను పెద్ద పట్నంలో పెద్ద హోటలే నడిపాడు. ఆ హోటల్ పార్ట్నర్‌షిప్ దవడం వల్ల, అది నడుపు తున్నన్నాళ్ళూ అతనికి లాభాలే తెలిసేయి కాని, నష్టాలు తెలీ లేదు. అది మూసిన్నాడు అతని వంతుకి వచ్చినవి నెత్తిమీద గుడ్డా, చిన్న కాఫీహోటల్ నడుపుకోడానికి సరిపోయే పాత్రలూ, ప్లేట్లూ, గిన్నెలూ వగైరా. ఆ సామానుతో యీ ఊరొచ్చి బావ మరిదిని పార్ట్నర్‌గా కాక నౌకరుగా మాత్రం పెట్టుకొని ఈ హోటల్ నడుపుతున్నాడు.

హోటళ్ళకి పాలు కావాలి. ఆవులు పాలిస్తాయి. గేదెలు పాలిస్తాయి. కానీ అవి తమ పాలను అమ్మవు. పాలు-ఆడవాళ్లూ, మగవాళ్ళూ కూడా అమ్ముతారు. కాని ఆర్ముగం పల్లెటూరి ఆడ వాళ్ళ దగ్గరే పాలు కొంటాడు. ఎంచేతంటే పాలమ్మిన ఆడవాళ్ళు పప్పు రుబ్బడంలో సాయం చేసి పెడతారు. కాబట్టి అర్ముగానికి పాల ఆడవాళ్ళతో ఏ యితర ఇంటరెస్టూ లేదు. అతనికి ఆడ వాళ్ళు అచ్చిరాలేదు. అతని మొదటి పెళ్లాం మూడో పెళ్ళాం చచ్చి పోయేరు. రెండో పెళ్ళాం కాపరం చేస్తోంది యింకెవరి తోనో. అతని మొహాన మూడు మైళ్ళ విభూతి రేఖలూ, దాగరంత కుంకం బొట్టూ ఉన్నాయి. అతనికి ముందుకి గుండూ, వెనక్కి జుత్తూ ఉన్నాయి. వెనక జుత్తు వేలుముడి వేసి ఉంది. అతని కళ్ళు ఆడదానిచేత దెబ్బతిన్నవాడి కళ్ళల్లా అతి మెలకువగానే కాకుండా అతి ఎర్రగానూ, పెద్దవిగానూ ఉంటాయి. అతని చెవులకి అరవీశె తూగే రాళ్ళ దుద్దులు ఉన్నాయి. మొత్తంమ్మీద భూత వైద్యుడిలా ఉంటాడు అతను.

ఆర్ముగం కుర్చీ వెనకాల అనేక దేవుళ్ళ పటాలమధ్య వెంకటేశ్వర స్వామి పటం మీద "అరువు లేదు" అన్న బోర్డు ఉంది. ఆ పటం అద్దానికి అగరొత్తులు కాలిన పెద్ద మరకలు కింది రెండు మూలల్నీ ఉన్నాయి. ఆ మరకలు మేఘాల్లా కాకుండా, రెండు బండల్లా వున్నాయి. ఆ బండల వెనక మిలటరీ ప్రిజనర్‌లా వెంకట రమణమూర్తి "ఎటెన్షన్"లో సతీ సమేతంగా నిలబడి ఉన్నాడు. అతని సతిని స్త్రీగా పోల్చుకోవడం కష్టం.

ఆర్ముగం కుర్చీముందు టేబిలు మీద ఒక స్టేండుకి బిల్లులు గుచ్చిన ఇనపగజం, డ్రాయర్లో అనేక చిన్న గిన్నెల్లో చిల్లర నాణేలు ఉన్నాయి.

అతని బల్లకి కుడివైపు ఒక బల్లమీద ఒక గాజు బీరువా ఉంది? దాని తెరచివున్న రెండు తలుపుల్లోను ఒకదానిమీద లోపలివైపు ఒక బల్లి ఎప్పుడూ ఉంటుంది. ఆ బీరువాలో అడుగు అరలో తడిగుడ్డ కప్పిన సిలవరి బేసిన్ ఉంది. ఆ గుడ్డమీద పది ఈగలూ, గుడ్డకింద యిరవై యిడ్డెన్లూ ఉన్నాయి. ఆ బేసిన్ పక్క చట్నీ గిన్నెలు తప్పయింకేవీ లేవు!

సింహాచలం, గవర్రాజూ ఒక టేబిల్ దగ్గర కూర్చున్నారు. టేబిలు మీద ఎంగిలి కప్పులూ, కాఫీ ఒలికిన మరకలూ ఉన్నాయి.

ప్రొప్రైటరు ఆర్ముగం "టేబిల్ క్లీన్" అంటూ నరకంలో వార్డరులా ఒక పొలికేక పెట్టి-గవర్రాజు దగ్గరకు వెళ్ళి విన యంగా నిల్చున్నాడు. అతనికి మున్సిపాలిటి వాళ్ళన్నా, పోలీసు వాళ్ళన్నా, దేముడన్నా భక్తికంటే భయం ఎక్కువ.

"పొద్దున్నెప్పుడు తాగినావో గెంజినీళ్ళు-టిఫిన్ తింటావేటి?" అని అడిగేడు గవర్రాజు.

"వొద్దు" అన్నాడు సింహాచలం.

గవర్రాజు జేబులోంచి చుట్టతీసి "పోనీ కాఫీ తాగుతావా, టీ తాగుతావా? టీ తాగు-సలవ సేస్తాది" అని సింహాచలానితో చెప్పి ఆర్ముగంతో "ఏటిస్తావ్ అయ్యరూ! ఏటొద్దులే. బతుకు సూస్తే యీడికి కడుపు నిండి పోనాది. నాకలి నేదు. ముందు అగ్గిపెట్టె పంపు. ఆనక రెండు టీలు అంపు. ఏడిగుండాలని సెప్పు కుర్రాడితో. మంచినీళ్ళు కూడా తెమ్మను" అని చెప్పి మొహం కొన్ని క్షణాలు అరిచేతుల్లో దాచుకున్నాడు.

ఈలోగా "టీ"లు వచ్చేయి. "టీ" చప్పరిస్తున్న గవర్రాజు "సూడు సింహాచలం! మన వకీలు గురించి నువ్వు ఏటనుకుం

టున్నావ్?" అనడిగేడు. ఎలిమెంటరీ స్కూలు కుర్రాడ్ని E = M. C square కి అర్థం అడిగితే చూసినట్టు చూసేడు సింహాచలం.

అంచేత గవర్రాజే ప్రారంభించేడు. "పైకి యెర్రిగొర్రెలా అలా అగపడతాడు గాని చాకులాటోడు. ఆ బాబు కోర్టల్లో వోదిస్తుంటే పిల్లన గర్రకి పాంవుంలాడినట్టు ఆడతారు జెడిజీలు. మన కేసు చూసే జెడిజీ మన బాబుతో పేకాటా బంతాటా ఆడతాడ్లే. ఆటకు అలీసెం అయితే కబురు మీద కబురు వస్తాది మన బాబుకి. కేసు యిచారణలో తాసులో మొగ్గతులం మన ఏపే ఉంటాదిలే. నువ్వేం బెంగ పెట్టుకోక. నాను జేసేది నాను జేస్తాను. ఇదిగో యీ గంగమ్మ తల్లిమీదొట్టు. ఆ పైన అన్నిటికీ ఆ ఏడుకొండల వాడున్నాడు" అంటూ లేచి బిల్లు చెల్లించి బైటకొచ్చేసేడు సింహాచలంతో.

# 31

తర్వాత సింహాచలం దావాలో వాదన పెట్టేడు. తన పంట తనకు అర్జంటుగా యిప్పించమని కోర్టువారికి పిటీషను పెట్టేడు. పిటీషను ముందు విచారణ చేసేరు కోర్టువారు.

"వీడి పంట వీడికిప్పించేస్తే వీడి భూమ్మీద నాకేం వసూలౌతుంది మన్ను తప్ప! నా డబ్బు నాకు కట్టమనండి. వీడిపంట, చెరుకు పిప్పితో సహా వీడికిచ్చీవచ్చు. నా కభ్యంతరం లేదు" అన్నది షావుకారి వాదన.

"ఇతగాడు తన బాకీ ఏనాడో రాబట్టేసుకున్నాడు. పెతీ యేడూ బెల్లం డబ్బులో ఎంతో కొంత పాతబాకీ కింద తీసుకుంటూనే ఉన్నాడు. నా పొలం పంట, తీసేసుకుంటే నాను, నా పెళ్ళాం, పిల్లడూ పొలంలో మన్నే తినాలి" అన్నది సింహాచలం మొఱ.

"వీడు పాతబాకీ కట్టినట్టు రసీదు చూపించమనండి. లేకపోతే యింకేమయినా సాక్ష్యం చూపించమనండి" అని షావుకారు సవాలు.

పురాణాల్లో ఆపదల్లో ఉన్నవాళ్ళు తమ వాదనకి సాక్ష్యం లేని యిరుకు పరిస్థితుల్లో తమ నిజాయితీ నిరూపించుకోవడానికి "ఓ అష్టదిక్పాలకులారా! ఓ త్రిమూర్తులారా!! ఓ సూర్యచంద్రులారా!!!!..." అంటూ భూమ్మీద లేని సాక్ష్యుల్ని సమను చేసేవారు.

ఈనాడు సూర్యుడు సాక్ష్యం చెప్పడు, చంద్రుడూ చెప్పడు. అష్టదిక్పాలకులకి, త్రిమూర్తులకీ సమనులు కడితే "నాట్ ఫౌండ్" అని తిరిగొచ్చేస్తాయి.

సింహాచలం వాదనలోని ప్రతి అక్షరం నిజం. కాని ప్రతి ఏడూ షావుకారు సింహాచలం యిచ్చిన బెల్లం డబ్బులో చాలా భాగం పాత బాకీ కింద జమకట్టుకున్న సమయంలో ఎప్పుడో తప్ప యితరులు లేరు. అంచేత సాక్ష్యం లేదు. షావుకారు ఎకౌంటు పుస్తకాలకి తెలిసినా అవి చెప్పవు.

అంచేత పిటీషన్‌కి సంబంధించినంతవరకూ సింహాచలానికి వాదన లేదన్నారు కోర్టువారు. అతన్ని సకుటుంబంగా మన్ను తినమని సలహా యివ్వలేదుగానీ, రిసీవర్ని పంట అమ్మి డబ్బు డిపాజిట్ చెయ్యమని వేసిన ఆర్డరు పర్యవసానం అదే.

రిసీవరు వేలాలు జూదాలు కావు. అలా అని కాకపోవు. ఆ వేలాల్లో ఎప్పుడేనా అణా వస్తువు రూపాయకు అమ్ముడుపోవడమే కాకుండా రూపాయి వస్తువు ఎప్పుడేనా రూపాయికీ తరచూ అణాకీ అమ్ముడవుతూ ఉంటుంది.

నల్ల కళ్ళద్దాల చక్రవర్తి ఆడిన బెల్లాన్నీ, అడవి చెరుకునీ సింహాచలం పొలంలోనే వేలం పెట్టేడు. అప్పుడతను చాలా హడావిడి చేసేడు. హడావిడి చెయ్యడానికి చాలా బాధపడ్డాడు. అతని బాధ చంద్రమతిని వేలం వేస్తున్న హరిశ్చంద్రుడి బాధ కాదు. కృష్ణుని వేలం వేస్తున్న కయ్యాల నారదుడి కొంటెతనం కూడా అతనిలో లేదుకాని అతను "క్రౌన్ జూయల్స్" అమ్ముతున్న "అక్షనీర్"లా చాలా యింపార్టెంటుగా కనిపించేడు.

పంట వెల దగ్గర దగ్గర రెండువేలుంటుంది.

వేలం టైములో సింహాచలం నెత్తిమీద తొమ్మిది వందల తొంభై తొమ్మిది రూపాయలు పెడితే ఎవరూ వెయ్యి రూపాయలకి కొనరు.

సింహాచలాన్ని తెలిసిన వాళ్ళలో కొంతమందికి కొనే స్తోమత ఉంది కాని, వాళ్ళకి షావుకారుతో వైరం పెట్టుకునే ధైర్యం లేదు.

కోర్టువారి పాట ఆరు వందలు. షావుకారిపాట–అతను మరీ అంత సిగ్గులేని వాడు కాదు కాబట్టి–ఆరు వందల ఒకటి కాదు–ఏడు వందలు.

"సూరయ్య ఉరఫ్ సురేంద్రగారి పాట ఏడు వందలు – సూరయ్య ఉరఫ్ సురేంద్రగారి పాట ఏడు వందలు...సూరయ్య ఉరఫ్..." రిసీవరు నల్ల కళ్ళజోడు తుడుస్తూ పాడుతున్నాడు.

సింహాచలం చేసిన ఏడాది బానిస చాకిరీకి భూదేవి ఇచ్చిన కానుక యేడు వందలు.

"నా పేనం, రాజమ్మ మానం, బొట్టుడి బతుకు యిలువ ముస్టి ఏడు వందలు!"

సింహాచలానికి తాతలనాటినుంచీ వస్తున్న భూమికి ఉన్న అనుబంధం వెల ఏడు వందలు!

షావుకారి విషానికి విరుగుడు ఖరీదు ఏడు వందలు!

చచ్చిపోతున్న నిజానికి కావలసిన మందు కిమ్మత్తు ఏడు వందలు!

అబద్ధం వికటాట్టహాసం ధర ఏడు వందలు!

"ఆడ్నెత్తిని ఏడు వందల వెంట్రుకల్లేవు ఆడేటి కడతాడు?"

"ఔను. ఔనౌను."

సింహాచలం యేడు వందలు కట్టలేదు.

ఏడు వందలు కడితే, రెండువేలు వస్తాయన్నా కట్టలేదు. కట్టగలిగితే అతన్ని షావుకారు బూతులు తిట్టడు. కట్టగలిగితే కోర్టువారు అతని మాట అబద్ధమని ఉండేవారు కారు బహుశా.

ఒకటోసారి ఏడు వందలు....రెండోసారి...రిసీవరు పాట చరణంలోకి వచ్చింది.

నిల్చునే శక్తిలేక బాదంచెట్టు మొదట్లో కూలబడిపోయిన రాజమ్మకి చచ్చిపోయిన తల్లిదండ్రులు అప్రయత్నంగా జ్ఞాపకం వచ్చేరు. పక్కనున్న తన కొడుక్కి తనే చెయ్యకూడని ద్రోహం చేస్తున్నట్టు అనిపించి, కొడుకు తలమీద చెయ్యివేసిందామె.

తన కొడుకు చుట్టూ కనిపించని పాములు తిరుగుతున్నట్టూ, తన పొలం చుట్టూ భూమి పగిలి, విషం పొంగి, తన కొడుకుని ముంచెయ్యొచ్చునని భయపడుతున్నట్టు, ఆమె కొడుకుని ఒడిలోకి తీసుకొని, గట్టిగా గుండెలకి–కొడుకుని తిరిగి తన కడుపులో దాచుకోవాలని ప్రయత్నిస్తున్నదా–అనిపించేటంత గట్టిగా హత్తుకుంది.

ఆమె కంటినుండి రాలిన నీటిచుక్క గాలిలో మెరిసి పిల్లడి తల మీంచి మన్నులో పడి యింకిపోయింది.

'మూడోసారి–ఏడువందలు" రిసీవరు జనగణమన పాడేడు.

ఉరిశిక్ష వారంటుమీద సీలుకొట్టినట్లయింది.

"అప్పుడే అయిపోయిందనుకున్నావేఁటి? అబ్బో, యింకా సాలా ఉంది. ఆ ఏడొందలూ సావుకారుకిచ్చీరు. కోరటులో ఉంటాయి. నువ్వు గెలిస్తే నీకే యిచ్చేస్తారు." అంటూ గవఁరాజు సింహాచలానికి ధైర్యం చెప్పేడు. కాని "నువ్వు గెలవ్వు. ఆ డబ్బు నీకురాదు, నీ మాటలు కోరటు వారు నమ్మరు. అక్కడ షావుకారు మాటకే యిలువుంటుంది. నీ భూమి సావుకారుది అయిపోద్ది, నువ్వు ముష్టెత్తుకుంటావ్' అన్న భవిష్యత్తు అతనికి తెలిసినా, అతను సింహాచలానికి చెప్పలేదు.

అతనికి కంట్రాక్టులంత కాకపోయినా, పైవాళ్ళ కేసులు నడపడం వల్ల బాగానే లాభిస్తుంది. పార్టీ దగ్గర వంద రూపాయలు గుంజి, ప్లీడరు చేతిలో పది పెడతాడు అతను.

# 32

కావఁరాజు, సింహాచలం తనకి అమ్మిన బెల్లం డబ్బులో తన బాకీ కొట్టేసుకొని, మిగతా డబ్బు నాలుగువందల చిల్లర సింహాచలానికి ఇచ్చేడు. సింహాచలం ఆ డబ్బు పట్టుకొనెళ్ళి గవఁరాజుకి యివ్వలేదు. గవఁరాజే కేసుకి కావాలంటూ ఆ డబ్బు తీసుకున్నాడు. ఇంటిదగ్గర గింజలూ గడ్డీ కూడా అమ్మేసేడు సింహాచలం.

కేసు తాపీగా, దర్జాగా, ముసలిరాజుగార్లా నడుస్తోంది.

బంట్రోతులు మామ్మూళ్ళు అడుగుతూనే ఉన్నారు.

గుమాస్తాలు లంచాలు తింటూనే ఉన్నారు.

ప్లీడరు ఫీజు గుంజుతూనే ఉన్నాడు.

గవఁరాజు డబ్బు తీసుకుంటూనే ఉన్నాడు.

సింహాచలం కుటుంబం పూర్వం కంటె తరచూ తిండి లేకుండా ఉంటూనే ఉంది.

దొరికినప్పుడల్లా సింహాచలం సారా తాగుతూనే ఉన్నాడు. రాజమ్మని తంతూనే ఉన్నాడు.

# 33

ఆవేళ సింహాచలం కోర్టునుండి యింటికి వచ్చేసరికి సాయంత్రం ఆరు దగ్గరైంది. అప్పుడతని మనస్సు ఎలా వుందో అతనే చెప్పలేడు. ఏదో పెనుమర అతన్ని గిరగిరాతిప్పి దూరంగా విసిరేసినట్టు అతనికి అనిపిస్తోంది.

ఇంటి గుమ్మానికి ఆనుకొని నిల్చున్న రాజమ్మ వేవిళ్ళ మనిషిలా చిక్కిపోయి వుంది. సింహాచలం నీరసం కంటికి ఆమె ఎంతో దూరంగా ఎప్పుడో చూసిన మనిషిలా కనిపించింది.

ఎముకలు మెత్తబడి, శరీరభారం ఎక్కువైనట్టు అతని అడుగులు భారంగా ఉన్నాయి. అతను గుమ్మం దగ్గరికి వచ్చేడు. రాజమ్మ అడ్డు తొలగలేదు.

"అడ్డు నెగు" అన్నాడు సింహాచలం. తన కంఠం తనకే కొత్తగానూ, అసహ్యంగానూ వినిపించింది.

అడ్డు లేచింది రాజమ్మ. అతను లోపలికి వెళ్ళి నులక మంచం మీద కూర్చొని చుట్టతీసి అంటించేడు.

"బొట్టుడేడీ?" (పిల్లడేడి)

"గేదిని తోలుకెళ్ళినాడు"

ఇద్దరూ మాట్లాడలేదు కొంతసేపు.

కదల్లేని ముసలి పాము బుసలా నిట్టూర్చింది రాజమ్మ.

"ఏటలా బుస కొడుతున్నావ్?"

"కరవలేనోళ్ళం బుసకొట్టి ఏం నాబం"

సింహాచలం చుట్ట నోట్లోనుంచి తియ్యలేదు.

"పంటతోపాటు మనల్నీ సావుకోరు అమ్మించేస్తే బావుండిపోను."

సింహాచలం మాట్లాడలేదు. "ఆ బాబు అదమం ఆ గొడ్డుని తోలుకు పోయినా బావుండ్ను."

"...................."

"మనకి తిండానికి గింజలెలాగూ లేవు. ఆ గొడ్డుకైనా గడ్డి ఉంటే బాగుణ్ను. తెలక–ఏ పాపం సేసున్నావోఁగాని తెల్సి ఏ పాపం సేయొద్దు. ఆ గేదె గొడ్డును అమ్మీ."

తుళ్ళిపడిన సింహాచలం చుట్ట నోట్లోంచి తీసేడు.

"మన ఉసురు....అడికి తగలకపోవచ్చుగాని, ఆ నోర్లేని పసువు ఉసురు తగలకపోదు. అది రేత్తిళ్ళు నా వేపు సూసీ సూపుకి రాచ్చసముండను గాబట్టి నాను బతికున్నాను గాని మరోర్తి ఐతే నూతిలో గెంతేస్తాది" ఆగింది రాజమ్మ.

సింహాచలం చుట్టకొనని పరీక్షిస్తున్నాడు.

"మన గొడ్డు ఎప్పుడూ ఒకపక్కే తొంగుంటాది. మన కావడికి రెండు వేపులా కష్టాలే ఉంటాయని యిన్నాళ్ళూ తెలీక ఆ గేదిని ఉంచుకున్నాంగాని యిప్పుడిక వుంచుకోవద్దు. దాని వుసురు – రాచ్చసుడు గాబట్టి ఆ బాబుకి తగల్నేదుగాని – మనలాటోళ్ళకి తగలక మాందు, దాన్నమ్మేసి పారీ."

చుట్ట పరీక్ష పూర్తి కాలేదు సింహాచలానికి.

"పొద్దుటేళ పాలు పితుకుతే ఏటైందో తెల్సా? ఆకర్ని పాలు కాదు, రకతం పడ్డాది, రకతం ..... మొగోడివి నీకు తెల్దు ఆ కష్టం. పాలిచ్చినదాన్ని నాకు తెలుసు. సచ్చి నీ కడుపున పుడతా. ఆ గేదెని అమ్మీ" ఊపిరి అయిపోయిన దాన్లా ఆగిపోయింది రాజమ్మ.

చేతిలో చుట్టచివర రక్తం ఉన్నట్టు భయపడిన సింహాచలం "నీ గేదెనా?" అన్నాడు.

"నా దేటి? నీదేటి? వరదొస్తే అంతా తుడిసీదేటి?" ప్రశ్న తోనే సమాధానం చెప్పింది రాజమ్మ.

తాగినవాళ్ళా ఇంటి బైటికి వచ్చి నిలబడ్డాడు సింహాచలం.

పసుపు కుంకం రాసిన ముత్తయిదు శవం మొహంలా వుంది పడమటి ఆకాశం.

"ఈ వేళ ఎవరూ కాల్చెయ్యలేదు" అన్న నెగటివ్ సంతో షంతో పక్షులు గూళ్ళకి పోతున్నాయి.

పాలకోసం వచ్చిన పిల్లని తన్నింది తల్లి గాడిద.

ఇంటి బైట నిల్చున్న సింహాచలానికి ఎదురుగా వస్తున్న కొడుకు కనిపించేడు. వాడి చేతిలో బొరిగ ఉంది. వాడి నెత్తిన బుంగలో కొంచెమే గడ్డి ఉంది. వాడి ముందు నడుస్తున్న గేదెలో ఇనపగడ్డి తినెయ్యాలన్నంత ఆకలి వుంది. నూనె ఎరగని వాడి జుత్తు ఎర్రబడి గుర్రం వెంట్రుకల్లా ఉంది. ఒంటినిండా మన్నుతో, వాడు ఒకసారి పాతి తీసేసిన శవం పిల్లాడిలా ఉన్నాడు.

దారి తెలియని చీకటి అడవిలో కార్చిచ్చు మంటల వెల్తుర్లో నడుస్తున్న వాడిలా పిరికిగా ఉన్నాడు వాడు. జంతువులు పెంచిన పిల్లడిలా కూడా వున్నాడు.

తన కొడుకుని చూస్తున్న సింహాచలానికి వెంకట్రావు యింటి ఎదురుగా వున్న ఇంజనీరుగారి పిల్లడు గుర్తుకొచ్చేడు. ఆ పిల్లడు గాజు కృష్ణుళ్ళా ఉంటాడు.

.....ఆ తర్వాత ఏమవుతుందో అతనికి అర్థం కాలేదు. నల్లగా ఉన్నదా అనిపించేటంత ఎర్రచీకటి అతన్ని చుట్టుకుంది.

ఏదో పెనుగాలి....యిక్కడో మొక్కనీ, అక్కడో చెట్టునీ కూల్చే గాలి కాకుండా....సమస్త మనుషుల్నీ, జంతువుల్నీ, జీవరాసుల్నీ ఎత్తి కుదేసి చంపే పెనుగాలి–అతన్ని గిరగిరా తిప్పి పడేసింది. అతని తలలో ఏదో చిన్నదిగా పుట్టి పెరిగి తలను బద్దలు చేస్తు న్నట్టుంది.

అతని నీరసించిపోయిన జబ్బు మనసు–కొడుకు గురించి తప్ప, ఏ యితర విషయం గురించీ ఆలోచించలేక పోతోంది.

అతను యింటిముందు చీకట్లో అచేతనంగా మాంసపు కుప్పలా పడి ఉన్నాడు. అతను పిచ్చిగా అరుస్తున్నాడు. "నా కొడుకు తప్పేంవింటని."

కొంతసేపు ఎవరూ సమాధానం చెప్పలేదు.

తర్వాత "నీ కడుపున పుట్టడం" అని తన యింట్లోంచి ఎవరో అన్నట్టయ్యింది.

ఎవరు ఆ జవాబు యిచ్చింది?

రాజమ్మ కాదు!

తన కొడుకు కాదు.

ఎవరు? ఎవరు? ఎవరు???

సింహాచలానికి నడవడానికి కాళ్ళు రాలేదు. అంచేత అతను చేతుల్తో పాకుతూ గుమ్మంవరకూ శరీరాన్ని యీడ్చుకు వెళ్ళేడు. ఇంట్లో కుక్కి మంచంలో ఎవరో ముసలివాడు కూర్చుని దెయ్యంలా నవ్వుతున్నాడు.

ఎవరతను?

ఎక్కడో చూసినట్టుంది.!

ఎక్కడ?

గుడిసెలో కారుచీకటి. ఆ చీకట్లో పొయ్యి మంట ఎర్ర వెల్తురు ఆ ముసలివాడి ఎర్రకళ్ళని రక్తం ముద్దలా చేస్తున్నాది.

అతను ఏవో తోలుముక్కలు చుట్టుకొని, పచ్చి మాంసం తినే అడివి మనిషిలా, అతి అసహ్యంగానూ, భయంకరం గానూ ఉన్నాడు. ఆ మనిషి పొయ్యి పక్కన కూర్చున్న తన కొడుకుని చేతులతో పిలుస్తున్నాడు.

సింహాచలం రెండు అడుగుల్లో యింటికివెళ్ళి ఆ మనిషి పీక పట్టుకొని "ఎవర్నువ్వు?" అంటూ అతని మొహంలోకి చూశేడు.

ఆశ్చర్యం! ఆ ముసలివాడు తనే.

"నిన్ను చంపేస్తాను" సింహాచలం పులిలా అరిచేడు.

ఆ ముసలివాడు పిశాచంలా శబ్దం లేకుండా నవ్వుతూనే ఉన్నాడు...

"ఏటలాగై పోతున్నావ్? ఊష్ణం (జ్వరం) వొచ్చిందేటి?" అంటూ రాజమ్మ దగ్గరకు వచ్చి సింహాచలం చెయ్యి పట్టుకుంది. రాజమ్మ చెయ్యిపడగానే ఆ ముసలాడు మాయం అయిపోయేడు.

సింహాచలానికి జ్వరం ఎక్కువగా ఉంది. "ఈ పొద్దు ఏటి తినాలా అన్న బెంగలేకుండా పోనాదిలే" అని సణుక్కుంటూ రాజమ్మ అతన్ని నడిపించి మంచంమీద పడుకోపెట్టింది.

# 34

మంగళవారం సంతలో...

పకోడీల దుకాణం వాసనలో అత్తింటి కుండని విసిరేస్తున్నాది ఒక కోతి.

మొగాళ్ళ చేతుల్లో–ఆవు పొదుగు–ఆడదాని దొంగజబ్బ–కొట్టేసిన పర్సులో ఖాళీ–గీటిన కళ్ళపిల్ల – మొగుడిని చూసి నవ్విన నవ్వుల మువ్వలు–కర్రకి వేలాడు తున్న పంది చివరి మూలుగు – కొత్త తాటాకులో చుట్టిన మాంసం వింత రంగులు – దళారీల దగామాటలు – గోదానం ఆవుల నిట్టూర్పుల నీరసం.

ఇవేమీ సింహాచలంకు కనిపించలేదు. వినిపించలేదు. అతను అమ్మేసిన రాజమ్మ గేదె నడిచి వెళ్లిపోతుంటే, అతనిలోని మంచితనం అంతా వెళ్ళిపోతున్నట్టూ, తనకీ, రాజమ్మకూ మధ్య వున్న భూమి పగిలి, పగులు దాటలేనంత పెద్దదై పోతున్నట్టూ అనిపించింది అతనికి.

గేదె అమ్మగా వచ్చిన రెండువందల పాతికలోనూ పదిహేను రూపాయలు దళారీ తీసుకున్నాడు. నూటడెబ్భై ఐదు గవర్రాజు తీసుకున్నాడు.

ఆ రాత్రి చీకటి ఆకాశం–కడిగిన నల్లగాజు ముక్కలా ఉంది.

ఎన్నో చక్కని చుక్కలు చెరువులో ముఖాలు కడుక్కొని పొగడ గాలి పలుచని పిలుపుకి మత్తెక్కినట్టు వణుకుతున్నాయి.

తొందరగా రాని ప్రియుని మీద అలుకతో కలువ భామలు మొహాలు ముడుచుకునే వున్నాయి.

గర్భగుడిలో అగరొత్తుల నీలి పొగలా ఉన్న ఒక పల్చని మేఘం తాను సందేశం యివ్వవలసిన ప్రియుడు ఎక్కడున్నాడో వెదకడానికన్నట్లు జోరుజోరుగా వెళ్ళిపోతోంది.

మనుషుల శరీరాల వెచ్చదనంతో రాత్రి చలి హాయిగా ఉంది.

వీటన్నిటికీ వెక్కిరింతలా బోర్లించిన "దెయ్యం కొబ్బరి చిప్ప"లా ఉంది సింహాచలం యిల్లు.

బైటనుండి చూస్తే ఆ యింటి ద్వారంలోని చీకటి గుడ్డి కన్నులా ఉంది. మూలన ఉన్న కిరసనాయిలు బుడ్డి దీపం ఆ –కన్ను గుడ్డితనానికి కారణమైన పువ్వులా ఉంది.

ఇంట్లో నులక మంచం మీద పడుకొన్న సింహాచలం చేతి లోని వెలుగుతున్న చుట్ట దెయ్యం పాము ఒంటికన్నులా చీకటిలో అటూ ఇటూ కదుల్తోంది.

ఏవో కనిపించని పాముల్తో తనని ఆ మంచానికి వేసి కట్టేసినట్టు సింహాచలం నిస్సహాయంగా పడుకొని ఉన్నాడు. ఆ మంచానికి కాస్త దూరంగా నేలమీద చింకి దుప్పటి చుట్ట పెట్టుకొని, పడుకున్న అతని కొడుకు జబ్బు మూటలా ఉన్నాడు.

ఆ పిల్లడి పక్కన మోకాళ్ళమీద గెడ్డం ఆనించి కాళ్ళని చేతుల్తో చుట్టుకొని కూర్చున్న రాజమ్మ మంచి చీర కట్టుకొని వుంటే, చీరల 'ఎడ్వర్‌టైజ్‌మెంట్" బొమ్మలా ఉండేది.

కాళ్ళ ఒత్తిడికి ఆమె గుండెలు అడ్డుగా పొంగి, కట్టుకున్న చింకి చీర విప్పుకుని ఉంటే ఎవరో చిత్రకారుడు యెంతో శ్రద్ధగా పోజు అమర్చిన అందమైన "మోడల్"లా ఉండును. కాని ప్రస్తుతం ఆమె సింహాచలం పెళ్ళాంలా మాత్రం ఉంది.

రాజమ్మ సింహాచలం మొహాన్ని పరీక్షగా చూస్తోంది. ఆమెకు అతని మొహంలో, కడుపులో ఆకలికంటే గుండెల్లో గాభరానే ఎక్కువగా కనిపిస్తోంది. అతని భయంకర భవిష్యత్తు అంతా అతని మొహంలో చూసినట్టు ఆమె అతని మంచం దగ్గరికి నడిచి వెళ్ళింది.

సింహాచలం ఆమెని కూర్చోమన్లేదు.

ఆమె అతని పక్కని కూర్చుని, పనికిరాని అవిటి పిల్లడిమీదే ఎక్కువ ప్రేమ ఉన్న తల్లిలా అతని మెడచుట్టూ చెయ్యి వేసింది.

రంకు చెయ్యబోతున్న ఆడదానివేపు మొగుడు చూసినట్టు సింహాచలం ఆమె వేపు చూసేడు. కేసువచ్చిన దగ్గర్నుంచీ అతనికి తల్లీ, తండ్రీ, పెళ్ళాం, పిల్లా, చావూ, బతుకూ–అన్నీ కేసే.

"ఏటి కావాలి?" సింహాచలం కంఠంలో ఆదరణ లేదు.

"...................."

"పోయి తొంగో?"

"........................."

"తొంగోమంటుంటే?"

"ఒక మాట......"

"ఏటి?"

"................"

"ఏటంత అరిజెంటు? రేప్పొద్దున్న సెప్పకూడదేటి?"

"నాను రేపు కూలికెళుతున్నా" తప్పు పని చెయ్యక తప్పదన్న భయంకంటే మంచి పని చేస్తున్నానన్న ఆత్మ విశ్వాసమే ఆమె కంఠ స్వరంలో ఉంది.

"కూలికా?"

"కూలిక్కాకపోతే ఏలిక్కి ఎళ్తాననుకున్నావా? ఎల్తే నీతో సెబుతానా?"

"ఒద్దు."

"............."

"ఒద్దొద్దు."

"ఏం?"

"నీకు తెల్దు."

"ఏటి తెల్దు?"

"కూలి కెల్డం మన వొంశంలో నేదు."

"..............."

"నీ అత్త, దాని అత్త ఎవరూ ఎల్లలేదు."

"అందుకే నీ కొడుకు ముష్టోడైపోతున్నాడు."

"అవనివ్వను."

"అవనివ్వక–నువ్వేటి జేస్తావు? అసలు మనవేఁటి సెయ్య గలం? సావుకోరు అబద్ధం కేసెడితే ఏటి సేసేం? మనం పగ లంతా వొళ్ళు ముక్కలు జేసుకొని, నేత్తిరి పస్తులు పడుక్కొని, పండించిన బంగారంలాటి బెల్లం ఆడు అట్టుకుపోతుంటే అడ్డుకో గలిగేఁవా? ఆ రాచ్చసుడు లచ్చింతల్లిలా నిలబడున్న పంట నంతా కోసుకుపోతుంటే కాదనగలిగేఁవాఁ? మనం ఎవ్వరికీ ఏటీ ఇవ్వక్కరలేదు. లోకవేఁ మనకాడ బొందిలో పేనం కాడ్నించి అన్నీ లాక్కుపోద్ది. యమదరమరాజుకి పేనా లెవడూ ఇవ్వడు. అలాగని ఆ బాబూరుకోడు...."

"ఇప్పుడయన్నీ యెందుకే?"

"నువ్వు కానుకోవుగాని మనం కూలోళ్ళమై పోనాం. కూలైనా దొరికితే మనలాటోళ్ళకి అదురుష్టవేఁ."

"మన వొంశంలో నేదే!"

"వొంశం, వొంశం. ఈ మాటిన్లేక పోతున్నాను. మన వొంశంలో ఏటుంది? రోజుకి రెండు పొద్దులూ పస్తుండడం వుందేటి? సెంబూ, ముంతా అమ్ముకోడం ఉందేటి? ఆడదాని సొమ్ము (గేదె) లమ్ముకోడం వుందేటి? పుస్తె అమ్ముకొని పసుపు తాడు కట్టుకు తిరగడం వుందేటి? ఎదురింటి పిల్లడు వణ్ణం తింటుంటే మనవోడు అడుక్కోలేకా, ఆగలేకా యిదైపోతూ వుంటే సప్పుడు కాకుండా ఏడ్డం వుందేటి?"

"…………………"

"వొంశానికి ఏడిసేవోళ్ళు వొంశాన్ని నిలబెట్టడానికి పుట్టి నోడ్ని కొట్టుకుంటారేటి? కన్నాక పెంచాలి. పెంచలేక పోతే – పీకపిసికి పారెయ్యాల.

"………………"

"నానోటి అడుగుతా, ఏఁవఁనుకోకుండా సెప్పు. ఈ కేసొచ్చినాక నీకు సావూ, బతుకూ, పాటూ, పంటా అన్నీ అదే ఐపోనాది. నువ్వేటి సేస్తన్నావో నీకు తెల్దు. నువ్వేటి సెయ్యాలో నీకు తెల్దు. ఉంటే తాగు తావు. కోపం వస్తే కొడతావు. నన్ను కొడుతున్నావని నా నేడ్ను. నాకు తెలుసు–నువ్వుట్టి ఎఱ్రోడివై పోనావఁని. కాని ఎప్పటికైనా ఈ యిల్లు నీది, అదుగో అక్కడ తొంగున్నోడు నీ పిల్లడు."

"…………………"

"ఆడు ఆఖరిపాలి కడుపునిండా తిని ఎన్నాళ్ళయిందో నీకు తెలుసా–ఆడ్ని పిల్లడిలా పెంచుతున్నావాఁ? పశువులా పెంచు తున్నావాఁ? అనెప్పుడన్నా ఆలోచించినావా? ఆడికన్నా పశువే నయ్యం. ఆకలికి పశువు అరిస్తే దాన్ని మనం కొట్టం. వుంటే యిన్ని గడ్డిపరకలేస్తాం; లేకపోతే లేదు. ఈడికి ఆకలేసి ఏడిస్తే చితక తంతున్నాం."

"……………"

"ఇందాక ఆడ్ని సావబాదినావ్, మరిసిపోనావేటి? ఎందుక్కొట్టినావ్? అసల్నీకు తెలుసా ఎందుక్కొట్టినావో? నాన్నీతో సెప్పకూడదనే అనుకున్నాను. కాని ఆడి బతుకు తలుసుకుంటే కడుపుడికి పోతున్నాది. రేత్తిరెట్టిన కూడులో మెతుకులుకంటే సీఁవఁలే ఎక్కువున్నాయని అలిగి అన్నం మానీసినాడు. ఆడు వణ్ణం మానీసినంత మాత్తరాన ఆకలి ఎయ్యడం మానేస్తాదేటి? తిండిలేని ప్రెతీదీ ఏటి సేస్తాది? గట్టుమీన గడ్డేడుస్తాది, సెట్టు మీద పిట్టేడుస్తాది, అడవిలో పులేడుస్తాది. అలాగే యీడూ ఏడిసినాడు. అంతే ఆడితప్పు. నువ్వు యింటికొచ్చేసరికి ఏడుస్తున్నాడని సావబాదేవు. ఆడు ఏడవగలిగినంత సేపు ఏడిసి ఏడనేక తొంగున్నాడు. అదుగో సూడు, నిద్దర్లో ఎలా బెక్కుతున్నాడో."

"…………………"

"నాను అసలు మాటాడకూడదనే అనుకున్నాను. నోరు మూసుక్కూ కోవాలనే అనుకున్నాను. యిన్నాళ్ళూ మూసుకునే కూకున్నా కూడా. కాని యీ ఏల నా కడుపెందుకో మండి పోతున్నాది. ఇన్ని సెప్పినదాన్ని ఇంక దాచటం దేనికి?

నీ కొడుకు ఆకరిసారి కడుపునిండా తిని ఎన్నాళ్ళయిందో నీకు తెలుసా? జవాబు నీకు తెల్దు. నాకు తెలుసు.

మొన్న అమ్మోరి పండక్కి తిన్నాడు.

నానూ, నువ్వూ ఎడితే గాదు.

అమ్మోరొచ్చి ఎడితే కాదు.

లచ్చమ్మ పిన్ని యెడితే తిన్నాడు. అదెందు కెట్టినాది! మనకు లేదని ఎట్టినాది. పండగపూటా పిల్లడు పస్తుండకూడదని ఎట్టి నాది. మనం యెట్ట లేఁవఁని తెలిసి ఎట్టినాది.

ఇప్పుడు సెప్పు…మనం…..మనం కాకపోతే – నేనూ …. నేనెత్తింది ముష్టికాదేటి? ముష్టంటే ఇంటింటికి ఎల్లి అడుక్కో నక్కర్లేదు.

వొంశం…వొంశం అంటావు పెతీదానికీ. ఇప్పుడు సెప్పు. నీ వొంశంలో ముష్టెత్తుకోవడం వుందో, లేదో" ఆగిపోయింది రాజమ్మ. ఇంక మాట్లాడితే వేగంగా కొట్టుకునే గుండె ఆ వేగానికి తట్టుకోలేక ఆగిపోతుందేమోనని భయపడినదాన్లా ఆగి పోయిందామె.

ఆమె మాట్లాడకపోయినా, మాట్లాడుతున్నట్టే అనిపిస్తోంది. సింహాచలానికి, అప్పుడతనికి–తన పిల్లడ్ని ఎత్తుకొని, యీ ప్లీడర్లూ, డబ్బూ, అప్పులూ, వడ్డీలూ, భూమీ, పంటా–ఈ ప్రపంచానికీ, మనుషులకీ ఆఖరికి రాజమ్మకీ కూడా దూరంగా – ఏవో కొండగుహల్లోకి సముద్రాల సొరంగాల్లోకి, చీకటి అడవుల్లోకి పారిపోయి – అక్కడ బతుకుదామనిపించింది.

రాజమ్మ గుండె సర్దుకుంది. మళ్ళీ అంది. "నేన్నిన్ను దెప్పడం లేదు. నానోటీ నువ్వోటీ కాదు. తిట్లకి తిండిపుట్టదు. నాకు తెలుసు. నాను సెప్పేది వకటే. మఁ(రోజులు మారిపోనాయ్. ఈ కేసొచ్చి నాక నీకు పగలూ, రేత్తిరీ తెల్దం లేదు. ఒట్టి ఎఁ(రోడివైపోనావ్.

ఇప్పుడు సెప్పు. నాను కూలికెల్తే ఏటి తప్పు? నువ్వు మేడ కట్టిన్నాడు మేడలోనే కులుకుతాను. కాని నువ్వు కట్టేవరకూ నన్ను కూలికి పోనీ."

సింహాచలం ఏదో అనబోయేడు. కాని మాటరాలేదు. నిండు యౌవ్వనంలో అకస్మాత్తుగా చచ్చిపోతూ-భార్యతో "పిల్లదు జాగ్రత్త" అని చెప్పబోతే మాటరాని మనిషిలా అతను బాధపడ్డాడు.

రాజమ్మ అతని మొహం మీదికి వంగింది. అతని కన్నీరు మెత్తటి గుండెలకి చల్లగా తగిలింది. (అలాటి వారిళ్ళ కన్నీళ్ళు చల్లగానే ఉంటాయి).

"సిస్సీ..ఏటది ఆడదాన్లాగా? బూవి నేకపోతే బతకొచ్చు. కేసు నేకపోతే బతకొచ్చు. కాని దయిర్యం నేకపోతే బతకలేం .... జరుగు" అంటూ అతని పక్కని పడుకుంది. మంచంకోడుకి తగులుకొని ఆమె పైట తొలగింది.

చెట్ల సందుల్లోంచి పడిన వెన్నెల్లో ఆమె గుండెలు మార్బుల్ గుండెల్లా మెరిసేయి.

సింహాచలం ఆమెని దగ్గరకి తీసుకున్నాడు.

"అయితే, నువ్వూ మొగోడివేనన్నమాట! ఇన్నాళ్ళూ నేను మరిసిపోనాను."

చీకట్లో ఎఁ(ర కలువ మొగ్గలా వుంది కిరసనాయిలు బుడ్డి దీపం.

# 36

పన్లోకి పోవడానికి ముస్తాబైంది రాజమ్మ.

కాళ్ళ అందెలూ, కడియాలూ, చేతులకి గాజులూ, మురుగులూ, చెవులకి దిద్దులూ, ఎత్తు గొలుసులూ, మెళ్ళో జగినీ, కంటే, పట్టెడా, దండకి కడియం, కొప్పులో నాగరం, చేమంతి పువ్వు, ఏంవీ లేవు ఆమెకి.

నుదుటి బొట్టూ, కంటి కాటుకా ఆమె ఆభరణాలు.

మాపు ఆవిడ చీరదేకాని రూపుది కాదు.

ఆమె నడుస్తున్నప్పుడు రవికలేని వక్షం-ముతక చీరలో ముచ్చటగా కదుల్తోంది. తిండి తక్కువైనందువలన కలిగిన ఆరోగ్యం కళ్ళ అందంగా మారిపోయింది.

"నాను పన్లోకి పోతున్నా. నువ్వు ప్లీడరు కాడి కెళ్ళినప్పుడు బొట్టుడ్ని యింటికాడ ఒక్కణ్ణీ ఒగ్గీకు" అంది చద్దిమూట చేత్తో పట్టుకొని.

"ఎంతవరకు వచ్చినాది చలవఁయ్యగారిల్లు?"

"వాసాలకాడ కొచ్చినాది. పండక్కి గురఁ(పెవేఁసవై పోతాట్ట – పైన కప్పుపడినా – పడకపోయినా."

"గురఁ(పెవేశానికైనా పెళ్ళాం వొఁస్తాదా?"

"రాకపోతే ఆ బోగందాన్నే పీటలమీద కూకోపెడతాట్ట."

"అల్లు దూరుకోవద్దేటి?"

"ఎందుకూరుకుంటాడు? ఆ ముండని దెయ్యాన్ని పాతీసినట్టు పాతేస్తానంటున్నాడు."

"ఇన్నేళ్ళొచ్చి ఏటా పోయీకాలం?"

"అల్లుడికేం పోయీకాలం లేదు."

"అల్లుడిక్కాదు-మాఁవఁకి"

"పోయీకాలం కాదు, సచ్చీకాలం."

"అదే నానన్దీను. అరవై యేళ్ళెల్లిపోనాక ఆ బాబు కీ ముండెందుకని?

"అరవై యొచ్చేకే ముండ. అంతవరకూ పెళ్ళాంసాలు" నవ్వింది రాజమ్మ.

"ఏటా రగుడీసు మాటలు?"

"రగుడీసుపన్లు రగుడీసు మాటల్లో గాకపోతే, పేర్థన పజ్యాల్లో సెప్తారేటి?"

"సావెంతలకేటిగాని పన్లోకి బేగెల్లు, అసలే మేస్త్రీ మంచోడు కాదు."

# 37

ఆ హాలు టేబులు లైటు కాంతిపడిన స్థలం తప్ప. మిగతా భాగం అంతా చీకటిగా వుంది. పైన సీలింగ్ ఫేన్ కొత్తగా వున్నా ముసలి నౌకరులా నెమ్మదిగా నడుస్తోంది. హాలు గోడల్ని ఆనుకొని అనేక అద్దాల బీరువాలు ఉన్నాయి. బీరువాల మధ్య ఖాళీ స్థలంలో చుట్టిన తుంగచాపలు నిలబెట్టబడి వున్నాయి. బీరువాల

లోపల యెన్ని పుస్తకాలు వున్నాయో పైన అంత దుమ్ము ఉంది. ఆ పుస్తకాలలో పాతవి, ఎముకలు విరిగిన ముసలి వాళ్లలా ఏట వాలుగా వుంటే, ఆరోగ్యవంతులైన ఆటగాళ్ళలా నిట్ట నిలువుగా నిలబడి ఉన్నాయి కొత్తవి.

ఆ హాలు చాలా పెద్దదయినా బీరువాలూ, పెద్ద టేబిలూ, చిందర వందరగా ఉన్న కుర్చీలతో చాలా యిరుగ్గా కనిపిస్తుంది. హాలు గోడల్ని వున్న ఫోటోలు చీకట్లో కనిపించవు కాని, గోడకి వున్న గాంధీగారి ఆయిల్ పెయింటింగ్ మాత్రం అంత చీక ట్లోనూ స్పష్టంగా కనిపిస్తుంది. ఆ పెయింటింగ్ లోని గాంధీగారు బక్కచిక్కిన "మాల" గాంధీలా కాకుండా సరదాకి సన్యాసం పుచ్చుకున్న రాజయోగిలా ఉన్నారు.

ఆ హాలులో వున్న "పేరేడ్, రివాల్వింగ్" కుర్చీలో కూర్చు న్నారు లాయరు పురుషోత్తంగారు. అతని ముందు అర ఎకరా బల్ల వుంది. దాని మీద నాచుపట్టిన కొలనులా ఆకుపచ్చ బ్లేజరు గుడ్డ ఉంది. ఆ గుడ్డమీద అక్కడా అక్కడా పడిన యెర్రసిరా మరకలు-పడిన వెంటనే తామర పువ్వుల్లా ఉన్నాయేమో కాని - ఇప్పుడు మాత్రం నల్లమచ్చల్లాగే ఉన్నాయి. టేబుల్ మీద రంగు రంగుల పెన్సిళ్ళూ, గుండు సూదులూ, టేగ్స్, పంచింగ్ మెషీనూ ఉన్నాయి.

ఆ పంచింగ్ మెషిన్‌తోనే టేబుల్ క్లాత్ చివర రెండు కన్నాలు కొట్టేడు పురుషోత్తంగారి మనవడు. ఆ కన్నాల్లో ఒక దాన్లో ఇంకు పెన్సిలు పెడుతూ తీస్తూ కూర్చున్నారు పురుషోత్తంగారు.

కొందర్ని చూడగానే "కౌన్, కిస్కాహై" గాళ్ళు అని చెప్పె య్యొచ్చు. కొందర్ని చూడగానే వీళ్ళు యిప్పటికే ఊళ్ళు ఏలుతూ ఉండక పోతే...త్వరలోనే ఏలుతారనిపిస్తుంది. నలికెల పామూ పామే; నాగుపామూ పామే. మనుషుల్లో జరీ మనిషిలా ఉంటారు పురుషోత్తంగారు. అతను పచ్చగా, దబ్బపండులా ఉంటారు. వీరు పాతిక సంవత్సరాల ముందు పుట్టివుంటే "రావు బహ దూర్" అయివుండేవారని ఆయన్ని చూడగానే అనిపిస్తుంది. అతను చాలా ఆరోగ్యంగా వున్నా, అతని వయస్సు ఏభై అయిదు దాటకపోయినా చాలా పెద్దవాడులా కనిపిస్తారు. వారు గత పది పదిహేను సంవత్సరాలై అలాగే కనిపిస్తున్నారు. ముప్ఫయి ఏళ్ళకే కొంత ముసలి అయి, ఆ తర్వాత ఎంత వయసొచ్చినా మరి ముసలి అవని మనుషుల్లో పురుషోత్తంగారు ఒకరు. ఆయనది బట్టతల కాకపోయినా, జుత్తు చాలా భాగం ఊడిపోయి పలచబడిపోయింది. ఊడిపోని జుత్తు నెరసి, వెండి జుత్తులా మెరుస్తున్నాది. ఆ జుత్తు వెండిలా మెరిస్తే, దానిలోంచి కనిపించే తల "కాసు" బంగారంలా మెరుస్తున్నాది. వారు ఇంటిదగ్గరు న్నప్పుడు మిల్లుపంచ, మిల్లు లాల్చీ కట్టుకుంటారు. వారి లాల్చీ పాము పొరలా ఉంటే వారి పంచ ఉల్లి పొరలా ఉంటుంది. వారు బయటకు వెళ్ళినప్పుడు కూడా చాలా విలువైన బట్టలే వేసుకుంటారు. ఖరీదైన జోళ్ళే వేసుకుంటారు. స్వంత కార్లోనే వెళ్తారు.

కొంతమందిని కొన్ని బట్టల్లో తప్ప ఊహించుకోలేం. గాంధీ గారిని గావంచాలో తప్ప షేర్వాణిలో ఊహించలేం. బ్రిటిష్ రాణిని బేతింగ్ బ్యూటీగా ఊహించుకోలేం.

పురుషోత్తంగారిని చూడగానే, అతను ఏదో ఒక ఫీల్డులో గొప్పవాడై ఉంటాడని తడుతుంది. అతను డాక్టరైతే స్పెషలిస్టు అయివుంటాడనీ, ప్లీడరయితే పెద్ద సివిల్లాయరు అయివుం టాడనీ, వ్యాపారి అయితే పెద్ద కంపెనీ డైరెక్టరై వుంటాడనీ అనిపిస్తుంది. అయినా ఆయనకి చాలా పనులు చాతగావేమో అని కూడా అనిపిస్తుంది. అతనికి కారు నడపడంరాదనీ బహుశా ఈతకూడా చేతకాదనీ, వారు టెన్నీస్ వగైరా విగరశ్ గేమ్సు ఆడి వుంటే విద్యార్థి దశలోనే ఆడి ఉండవచ్చనీ అనిపిస్తుంది. అంతే కాకుండా అతను చిన్నప్పుడు మంచి బాలుడనీ, పెద్ద వాడయ్యాక పరస్త్రీనీ, పరుల సొత్తునీ తాకి వుండడనీ, ప్రభుభక్తి పరాయణుడనీ, దేవుడిలో నమ్మకం ఉన్నవాడినీ, ఉపకారం పొందడం, చెయ్యడం అతనికి అలవాటు లేదనీ, కోరి ఎవరికి అపకారం చెయ్యరనీ, వారికి చిన్నప్పుడే పెళ్ళయిపోయుం టుందనీ, బహుశా మేనరికం చేసుకొని ఉంటారనీ అనిపిస్తుంది.

ఇలా అనిపించినవన్నీ నిజమైనా కాకపోయినా అతనికి చిన్నప్పుడే పెళ్ళయిపోయిన మాటమాత్రం నిజం. చిన్నతనం లోనే ముగ్గురు కూతుళ్ళు పుట్టేసేరు. ముగ్గురుకీ పెళ్ళిళ్లుకూడా అయిపోయేయి. ఆఖరి కూతురూ, అల్లుడు ఆనందరావూ పురు షోత్తం దగ్గరే ఉంటున్నారు.

చిన్న పిట్‌ని బ్రిటిష్ ప్రధాని చెయ్యడానికే పెంచేడుట పెద్ద పిట్టు.

కెనడీని అమెరికా ప్రెసిడెంటు చెయ్యడానికే పెంచేడుట అతని తండ్రి.

పురుషోత్తంగార్ని ప్లీడర్ని చెయ్యడానికే పెంచేదు అతని తండ్రి వెంకట్రామయ్య.

పురుషోత్తంగారిక్కూడా "లా" అంటే చాలా సరదా. శ్రీరాముడు నీతినీ, శ్రీకృష్ణుడు ధర్మాన్నీ నిలబెట్టడానికి పుట్టినట్టు, పురుషోత్తం గారు 'లా' ప్రాక్టీసు చెయ్యడానికే పుట్టేరు. ఫస్టు క్లాసులో 'లా' పాసయ్యాక ప్రాక్టీసు పెట్టేరు ఆయన. ప్లీడర్లలో బుద్ధిమంతులుం డరని పురుషోత్తం గారిని చూసిన వారెవరూ అనలేరు. అతను "బార్" తాలూకు "మంచి బాలుడు"గా పెరిగేరు. పగలు "లా" పుస్తకాలు చదవడం, సాయంత్రం "లా" పుస్తకాలు చదవడం, రాత్రి "లా" పుస్తకాలు చదవడంతోనే అతని దినం గడుస్తుంది.

అతన్ని "లా పుస్తకాలు కావాలా? లండన్ వెళతావా?" అని ఎవరైనా అడిగితే లండన్ వెళ్ళననేస్తారు – ఆలోచించ కుండా, ముండ నుంచుకున్న భర్త నుండి హిందూ భార్య ఏ పరిస్థితుల్లో మనోవర్తి పొందలేదో అతను అన్ని హైకోర్టుల తీర్పులూ నిద్రలేపి అడిగితే పూర్తిగా లేవకుండానే చెప్పే స్తారు. ఆ పాయింట్‌మీద అస్సాం హైకోర్టు చెప్పినది ఆంధ్రా హైకోర్టు ఎందుకు అంగీకరించలేదో, యీ రెండు కోర్టులూ ఎందుకు పొరపడ్డాయో సకారణంగా వివరించగలరు అతను.

అతను ప్రాక్టీసు కేవలం ప్రాక్టీసు కోసమే చేస్తారు. డబ్బు కోసం కాదు. డబ్బు కేవలం యిన్సిడెంటల్, కానీ యివ్వక పోయినా, కోటి రూపాయలు పుచ్చుకున్నంత పట్టుదలతో అతను కేసు చెయ్యగలరు. అతను కేసులు చెయ్యడానికి కావలసిన బలం కోసమే భోజనం చేస్తారు. నిద్ర కూడా అంతే. అతని పార్టీలంతా స్ట్రయికుచేసి అతని దగ్గరకు వెళ్లకపోతే, అతను మూడు వారాలు తిరక్కుండా చచ్చిపోతారు.

అతనికి ఆడవాళ్ళంటే మోజులేదు.

ఒక వయసులో కళ్ళజోడు వస్తుంది. అంతకు ముందు వయసులో భార్య వస్తుంది. కళ్ళజోడు చదువుకోడానికి కావాలి. భార్య పిల్లలకోసం కావాలి. పిల్లలు ఎందుకు కావాలో అతను ఎప్పుడూ ఆలోచించలేదు. ఆడదాని పైట సెంటు వాసనకంటె, పాత పుస్తకాల తోలు వాసనే అతనికి యిష్టం.

కళ్ళజోళ్ళలో ఖరీదైనవీ, విలువైనవీ, అందమైనవీ ఉంటా యని ఆర్నెల్ల క్రితం వరకూ అతనికి తెలియలేదు.

ఒకవైపు కాడ విరిగిపోయి తాడు కట్టిన కళ్ళజోడు అతని భార్య అయితే, "రిమ్‌లెస్ ఫ్రేమ్" విమల.

విమల ఆర్నెల్ల క్రిందట అతని దగ్గర జూనియర్‌గా చేరింది. ఆమె వయస్సు పాతిక్కీ ముప్పైఐదుకీ మధ్య ఎంతైనా వుండొచ్చు. ఆమె చనిపోయే వరకూ ఆ లిమిట్స్‌లోనే వుండిపోయే రకం మనిషి. ఆమెకి సీరియల్ నవలలంటే యిష్టం. సినిమాలంటే యిష్టం. ఇంగ్లీషు సినిమాలంటే యింకా యిష్టం. కారులంటే యిష్టం. మేడలూ, ఖరీదైన తిండీ, విలువైన బట్టలూ అంటే మరీ యిష్టం. మొగాళ్ళంటే అపరిమితమైన యిష్టం ఉన్నట్టు కనిపిస్తుంది.

ఇరవైకీ, అరవైకీ మధ్య వయసులో ఉన్న ఏ మొగాడికైనా ఆవిడ పిచ్చెత్తించెయ్యగలదు. ఆ లిమిట్స్‌లో వున్న పురుషోత్తం, ఆనందరావూ ఒక్కలా పిచ్చెత్తిపోతున్నారు. ఆవిడ ఆఫీసులో జాయిన్ అయిన దగ్గర్నుంచీ.

ఏ మొగాడైనా తనుకోరే ఆడది సన్నగా ఉండాలన్నా, పొడుగ్గా ఉండాలన్నా, చురుగ్గా చలాకీగా చిలిపిగా ఉండాలన్నా, లేక ఈ గుణాలన్నీ వుండాలన్నా, అతనికి నచ్చీ ఆడది విమల. ఆమె కన్నూ, ముక్కూ, పెదవులూ, పళ్ళూ, బుగ్గలూ, గెడ్డం ఏ ఒక్కటీ విడిగా అందంగా లేక పోయినా, అన్నీ కలిపి చూస్తే ఆమె చాలా ఆకర్షణీయంగా కనిపిస్తుంది. ఆవిడకి ఏ సబ్జెక్టులోనూ ప్రత్యేక యింటరెస్టు లేదు. ఎదుటివారికి ఏ సబ్జెక్టు యిష్టమైతే ఆవిడకీ– అదే యిష్టం. ఎదుటి వారిని ఆవిడ ఎప్పుడూ ఖండించదు. కోరి కొత్తవాళ్ళతో పరిచయం చేసుకోకపోయినా, ఒకసారి కలు సుకున్న వ్యక్తికి ఆమె పాత స్నేహితురాల్లా కనిపించ గలదు.

ఆమె తిండిలేనంత బీదది కాదు, కాని, డబ్బిచ్చి మొగుణ్ని కొనుక్కునేటంత ధనవంతురాలూ కాదు. ఆమె తండ్రి –చని పోవడానికి చాలా కాలం క్రితం ఎలిమెంటరీ స్కూలు మేష్టరు గిరీ చేసేడు. రిటైరయ్యేక గూటిలాంటి తన ఇల్లు గూబల పాల వడం చూసేడు. తన మొదటి కూతుర్ని రెండో పెళ్ళివాడి కిచ్చే నన్న దుఃఖం తీరేలోగానే, ఆమె ముసిలి మొగుడ్ని సంతుష్టి పరచలేకా, నురగలు కక్కే కోరికలకి బిరడా పెట్టలేకా, తనచిన్న మరిదిని ప్రేమించి, ప్రేమించబడి, పట్టుబడి, నూతిలోపడి చచ్చి పోయి "దీన్ని కంతకీ కారణం నువ్వే నాన్నా" అన్న ఆమె చూపు కూడా అతను చూసేడు. తర్వాత యిద్దరు కొడుకులూ ఎలిమెం టరీ స్కూలు మేష్టర్లే. (మేష్టర్ల కొడుకులు మేష్టర్లేగాని మినిష్టర్ల వరు) ఆ తర్వాత యిద్దరాడ పిల్లలూ వాళ్ళ సంసారాలు వాళ్ళు ఈదలేకపోతున్నారు. ఆఖరిది విమల. ఆమె టైముకి రోజులు మారేయి. ఆమె వున్న ఊళ్ళో స్కూలు ఫైనలు పాసైయ్యేవరకూ ఆమెకు వివాహం ఎవరూ తల పెట్టలేదు. ఆ తర్వాత తలపెట్టినా లాభం లేకపోయింది. ఆమె టైముకి రెండో పెళ్ళి మొగాళ్ళు

చిన్న ఆడపిల్లల్ని (డబ్బిచ్చి కొనుక్కొనో, కొనుక్కోకుండానో) పెళ్ళిళ్ళు చేసుకోవడం మానేసేరు–వాళ్ళకి ముదర ఆడవాళ్ళు కావలసినంతమంది దొరకడంవల్ల, ఆడపిల్లల చదువులమీద ఆంక్షలు కూడా పోయేయి. ఆడది చెడిపోవడానికి చదువుకో నక్కర్లేదని గ్రహించగల్గినంత పురోగమించింది ప్రపంచం.

పెళ్ళిలేదు కాబట్టి కాలేజీలో చేరింది విమల. కాలేజీలో చేరింది కాబట్టి బుద్ధిగా చదువుకుంది. కష్టపడి చదివింది. స్కాలర్‌షిప్పులు సంపాదించి చదివింది. ముష్టెత్తి చదివింది. బి.ఏ. పాసైన తర్వాత ఆమె చాలా "విచిత్ర" పరిస్థితుల్లో "లా" చదవడం జరిగింది. బీదదవడంవల్ల ఎవరూ కాలేజీ ఫీజు అడగ లేదు. బీదది కాబట్టి ఎవరో దూరబ్బంధువు తిండి పెట్టేడు. చిల్లర ఖర్చులికి ఏదో స్కాలర్‌షిప్ వచ్చింది.

ఆవిడ 'లా" కాలేజీలో చేరిన కొన్నాళ్ళవరకూ ఆమెకు, తన భవిష్యత్తూ, వర్తమానం–చాలా కన్‌ఫ్యూజ్‌డ్‌గానూ, హేజీ గానూ ఉండేవి. కాని కొన్నాళ్ళకి ఆమె కొన్ని జీవిత సత్యాలని గ్రహించింది. అందులో మొదటిది; తనకి యింతవరకు పెళ్ళి కాలేదన్న విషయం. రెండోది : తనకి ఇక పెళ్ళికాదన్న విషయం.

పులి కోరల్లాంటి ఆ నిజాలు మొదట్లో ఆమెని బాధపెట్టినా, తర్వాత ఆమెచేత యితరులని బాధపెట్టించేయి. ఫ్రాయిడో ఎవరో అన్నారట–ప్రతి జీవికి మొదట ఆకలీ, తర్వాత సెక్సూ ముఖ్యాంశాలని! ఫ్రాయిడ్ చదవకుండానే ఆ విషయాలు విమల గ్రహించేసింది. ఆమె యింకా చాలా విషయాలు గ్రహించింది.

పువ్వులకి పరిమళం ఉంటుంది. రంగు లుంటాయి. సీతా కోక చిలకల రెక్కలకి వాసన లేకపోయినా రంగుల డిజైన్లు ఉంటాయి. నాగు పాము నెత్తిమీద పడగ వుంటుంది. పులి వంటిమీద చారలుంటాయి. హయినా గుండెలు ఆగిపోయేటట్టు నవ్వగలదు. కాని యీ రంగులూ, వాసనలూ, చారలూ వగైరా ఆ జీవరాసుల బతుక్కి ఎంత ముఖ్యమైనా, అవి ఏ పరిస్థితు ల్లోనూ వాటిని దాచుకోలేవు.

తనకున్న కంపునీ, చారలనీ, కోరలనీ దాచుకోగలిగిన జాతి మనుషులదేననీ, తన కొవ్వుని కవిత్వం అనీ, స్వార్థాన్ని పేట్రి యాటిజం అనీ, తన ఆకలి సంఘం ఆకలి అనీ, తన బాధ్యతలూ సంఘానివే అనీ, తన పిరికితనం అహింస అనీ, పోలీసు వాడంటే తనకున్న భయం తన అంతరాత్మ అనీ, తన పిసినిగొట్టుతనం నిరాడంబరత్వం అనీ, తాను మాంసం తిన్నా, సారా తాగినా శ్రీరాముడు చేసిందే తనూ చేస్తున్నాననీ, తాను అవి చెయ్యకపోతే శ్రీరాముడుకంటే గొప్పవాడననీ, తాను ఏ పని చేసినా దానికి ఒక దిట్టమయిన పునాది వేస్తాడనీ, తాను రాజుగారిని కొలిస్తే ప్రభుభక్తి పరాయణుడనీ, రాజుగారి పీక కోసేస్తే ప్రజాస్వామ్య వాదిననీ, తన మతం యితరులమీద రుద్దగలిగిననాడు తాను ఒక పవిత్ర మత ప్రచారకుడననీ, ఎదుటివాడి బలం ఎక్కువై, వాడే తన వాళ్ళకు తన మతం చుట్టబెడితే తను సర్వమత సామరస్యవాదిననీ, తను దేవుడ్ని కొలిస్తే పవిత్రమయిన ఆస్తికుడ ననీ, కొలవకపోతే యింకా పవిత్రమయిన నాస్తికుడననీ, తన కున్న ఎస్టేట్లు తన తాతలు ఎందర్నో పస్తులు పెట్టి ఆర్జించినవి కావనీ, తన పూర్వజన్మల పుణ్యాలనీ, ఎదుటివాడి దరిద్రం కూడా మన పాత జన్మల పాపమనీ, తన ఆస్తి రక్షించుకోవడానికి యితరుల సహాయం తనకు అక్కర్లేదనీ, కాని దిక్కుమాలిన వెధ వలు చెలరేగి పాడైపోకుండా వుండడానికే పోలీసులు కావాలనీ, తన చేతకాని తనం అమాయకత్వం అనీ–వగైరా ఆత్మపర వంచనలు ఒక్క మనిషే చెయ్యగలడనీ ఆమె గ్రహించింది.

అంచేత ఆమెకి మనుషుల మీద జనరల్‌గానూ, మొగాళ్ళ మీద స్పెషల్‌గానూ ఒక రకమయిన అసహ్యం పట్టుకుంది. కాని స్తోమత లేనందువల్ల ఆమె తన నమ్మకాల ప్రచారానికి ఏ సంస్థా పెట్టలేదు. ఏ వ్యాసాలూ రాయలేదు. కాని తనకు చేతనైన విధంగా తన కసి సాధించుకో సాగింది.

డబ్బున్న మొగాళ్ళకి డబ్బుకంటె సెక్సు ముఖ్యమనీ, యీ కాలంలో ఏకపత్నీ వ్రతులు చాలా అరుదుగా ఉంటారనీ, అలా వుండటానికి వ్రతాలు కారణం కావనీ గ్రహించిన ఆమె మొగా ళ్ళతో ఆడుకోవడం ప్రారంభించింది. తోటి మొగ స్టూడెంట్సుతో సినీమాలకీ, కేంటీన్లకీ వెళ్లినా ఆమె వాళ్ళతో కలిసి రిక్షా ఎక్క లేదు. కొంగు తగిలితే చాలనుకున్న "సుబ్బిశెట్టి" పాత కాలం వాడనీ, ఇప్పటి సుబ్బిశెట్లకి పైటగాలి పైరుగాలని తెలుసు కున్నదై–ఆమె మొగాడ్ని వెర్రెక్కించి వేడెక్కించడానికి మాత్రం దగ్గరకు రానిచ్చేది. తన జాగ్రత్తకి తగినంత దూరంలోనే వాళ్ళని ఉంచినా–వాళ్ళని అనేక విధాల ఉపయోగించుకుంటూ వచ్చింది. ఆమె 'లా' పాసయ్యాక హైదరాబాదులో ప్రాక్టీసు పెట్టింది. కాని అక్కడ పెళ్ళికాని ఆడవాళ్ళు–తనలా నిర్బంధాలు లేనివాళ్ళు చాలా మంది వున్నారు. అంచేత ఆమె త్వరగా ఎవరినీ ఆకర్షిం చలేకపోయింది. "స్వర్గంలో దేవత మామూలు మనిషే" అని

గ్రహించి తన స్వంత ఊరు వచ్చేసి పురుషోత్తంగారి ఆఫీసులో జూనియర్‌గా జాయినైంది. ఆమె రాక పూర్వం జూనియర్ ఫీజు తన అల్లుడికి యిమ్మని ఒత్తిడి చేయకపోయినా, ఆమె వచ్చేక మాత్రం జూనియర్ ఫీజు ఆమెకి ముట్టేకే తన ఫీజు వసూలు చేసుకుంటున్నారు పురుషోత్తంగారు.

పురుషోత్తంగారితో ఆవిడ ఎప్పుడూ "లా" పుస్తకాల గురించే మాట్లాడుతుంది. అల్లుడితో ఎప్పుడూ సీరియల్ నవలల గురించీ, ఇంగ్లీషు సినిమాల గురించే మాట్లాడుతుంది. మావఁతో ఎంత శ్రద్ధగానూ, భక్తిగానూ కోర్టుకి వెళుతుందో, అల్లుడితో అంత సరదాగానూ సినిమాలకి వెళ్ళగలదు.

దేర్ యీజ్ నో ఫూల్ లైక్ ఏన్ ఓల్డు ఫూల్. మామ ఓల్డు ఫూల్. ఆ సంగతి మామకి తెలీదు. అల్లుడికీ, విమలకీ తెలుసు.

"ఈ ముండ యిలా ఆడిస్తే ఈ ముసలాయన యింకెన్నాళ్ళో కేసులు చెయ్యడు" యిది పురుషోత్తంగారి భార్య భయం. ఆవిడకీ, పురుషోత్తంగారికీ రెండేళ్ళే వయసు తేడా.

పురుషోత్తంగారికి మొదటినుంచీ చిన్న మతిమరుపు వుంది. అది పూర్తిగా మతిమరుపు అని కూడా చెప్పలేం. అతనికి మనుషులూ, వారి పేర్లూ గుర్తుండవు. ఆయన తన వృత్తికి సంబంధమున్న ఏ వ్యక్తినైనా ఫలానా కేసులో పార్టీగానో, సాక్షిగానో మాత్రం చూడగలరు. కాని, ఫలానా పేరుగల వ్యక్తిగా చూడలేరు. అంచేత పదేళ్ళ కిందటిదయినా సరే కేసు నెంబరు చెప్తే, ఆ కేసులో సాక్షులవీ పార్టీలవీ జాతక చక్రాలు చదవగలరు. గాని, నిన్నటి కేసులో పార్టీని అతను పోల్చుకోలేరు.

ఆవేళ సాయంత్రం తనతో కారులో షికారు వస్తానన్న విమల అల్లుడితో సినిమాకి వెళ్ళిపోయింది.

అల్లుడు చెడిపోతున్నాడని అతని భయం కాదు.

తను చెడిపోడంలేదనే అతని బాధ!

మంచి పనులు చెయ్యడంలో కాంపిటీషన్లు తక్కువ. ప్రపంచానికి ఒక్కడే గాంఢి.

విమలలాంటి వాళ్ళ విషయంలో చెడిపోదామని నిశ్చయించుకున్నాక, చెడిపోయేవరకూ బాగుండదు ఎవరికైనా సరే. ఆవిడ "లా" పుస్తకాలు తనకి అందిస్తున్నప్పుడు, తన చెయ్యి అతనికి తగలనిచ్చినా, అది శుద్ధ పొరపాటు వల్లనే తగిలిందన్నట్లు, ఆ తాకుడులో ఎటువంటి ఆహ్వానం లేదన్నట్లు ఆ తర్వాత ప్రవర్తిస్తుంది ఆమె.

ఒక్కొక్క జబ్బు ఒక్కొక్క వయసులో వస్తేనే కుదురుతుంది. డైబిటీసు పెద్దవాళ్ళ జబ్బు. అలాగే మీజిల్స్, కోరింత దగ్గూ చిన్న పిల్లల జబ్బు. ప్రేమ యువకుల జబ్బు. ఆ జబ్బుకి దూకుడు మందు లేక విరుగుడు. ఆ జబ్బే వచ్చింది పురుషోత్తంగారికి. జబ్బు వచ్చింది. కాని దూకుడు చచ్చిపోయింది. అంచేత అతని బాధ అతనికీ, విమలకీ బాగా తెలుసు. ఈ జబ్బు వచ్చిన తర్వాత అతని మతిమరుపు ఎక్కువైంది.

మర్నాటి కేసుల గురించి ఆలోచిస్తూ చేతిలో పెన్సిలు టేబిలు మీద పడేసి, కిటికీలోంచి దూరంగా చూస్తూ కూర్చున్నారు పురుషోత్తం గారు.

అదే టైములో సురేంద్ర వచ్చి అతనికి నమస్కరించి ఎదురుగా కుర్చీలో కూర్చున్నాడు. పరాకుగా వున్న పురుషోత్తంగారు ఎదురుగా ఉన్న సురేంద్రని చాలాసేపు చూడలేదు. చూసేక–

"ఎప్పుడొచ్చావ్ సుందరం?" అన్నాడు.

"అరగంటైంది, నేను సుందరాన్ని కాను."

"అరగంటకి ముందు సుందరానివేనా?"

"అరగంట ముందూ కాను."

"అరగంటకి ముందు నువ్వు సుందరానివి కాకపోతే అరగంటైంది. సుందరాన్ని కానంటా వేవిఁటి?"

"అసలు నేను సుందరాన్ని కాను."

"కావని ఎవరన్నారు?"

"నేను!"

"ఎందుకంటావ్?"

"నేను సుందరాన్ని కాదు కాబట్టి."

ఈ చిక్కు పురుషోత్తంగారికి విడలేదు.

"మరైతే నువ్వెవరు?" అనడిగేడు.

"సురేంద్రని."

"కావని ఎవరన్నారు?"

"మీరు."

"నువ్వు ఎవరన్నాను."

"సుందరాన్నన్నారు."

"ఎందుకన్నాను?"

"నాకు తెలీదు."

"చూడబ్బాయ్, నువ్వు సుందరానివా?"

"కాదు."

"ఏంవింటి కాదు?"

"సుందరాన్ని కాదు."

"మరైతే ఎవరు నువ్వు?"

"సురేంద్రని."

'చూడు సురేంద్రా–నీ పేరు సురేంద్రేనా?"

"ఔను."

"ఏంవింటి ఔను?"

"నేను సురేంద్రని."

"కావని ఎవరన్నారు?"

"మీరు..........."

"చూడు బాబూ. నీ పేరు సురేంద్ర ఐతే సుందరం అని నేనెందుకంటాను?"

"నాకు తెలీదు."

"నే నన్లేదు."

"నాదే పొరపాటు అయివుండొచ్చు."

"నీదే పొరపాటు సుందరం."

సుందరానిదే పొరపాటని నిర్ణయించేసేక పురుషోత్తంగారికి మూడు ఆలోచనలు వచ్చేయి.

**మొదటిది :** అప్పుడు విమల తన అల్లుడితో ఏమంటూ ఉంటుంది?

**రెండవది :** తన అల్లుడు విమలతో ఏవింటంటూ ఉంటాడు?

**మూడవది :** వాళ్ళిద్దరూ ఏవింటనుకుంటూ ఉంటారు? అతని చేతిలో పుస్తకంలో పేజీ తిరిగింది.

అతని మనసులో ఆలోచన తిరగలేదు.

అతను సురేంద్రని పూర్తిగా మరచిపోయేడు. తర్వాత చాలా సేపటికి అతను సురేంద్రని చూసేడు. మొదట – అతను – తను ఎప్పుడో కలకత్తాలో చూసిన మనిషిలా కనిపించేడు. ఎప్పుడూ చూడని మనిషి కనిపిస్తే పురుషోత్తం గారు ఏ సంకోచం లేకుండా అతని పేరూ, వచ్చిన పనీ అడిగేసేవారు. పరిచయం వున్న మనిషిని పరిచయం లేనట్లు "నీ పేరు ఏంవింటి?" అని అడిగితే అతన్ని అవమానించినట్లే. మరంచేత అతను సురేంద్రని పేరు అడగలేదు.

గుర్తు తెచ్చుకోవడానికి అతను సురేంద్రవేపు తీక్షణంగా చూసేడు. డబ్బిచ్చి మాసికాల స్టేజిలోనే తద్దినం కొనుక్కున్నట్లు అనిపించిన సురేంద్ర–ఇబ్బందిగా ఉన్నట్టు కుర్చీలో కాస్త అటూ ఇటూ కదిలేడు.

పురుషోత్తంగారికి సురేంద్ర విమలలా కనిపించలేదు. పులిలా కనిపించలేదు.

ఒంటెలాగా కనిపించలేదు.

జోళ్ళషాపు వాడిలా కనిపించలేదు.

వంటమనిషిలా కూడా కనిపించలేదు.

అకస్మాత్తుగా అతనికి సురేంద్ర క్రిందటేడు తనచేత "చీటీ" కట్టించి పరారి అయిపోయిన "చిట్‌ఫండ్" చిన్నగాడిలా కనిపించేడు. అతను విమలని చూడాలని ఎంతగా కోరుకుంటాడో చిన్నగాడిని చూడాలని కూడా అంతగానూ కోరుకుంటాడు.

పురుషోత్తంగారిని ఇంతవరకూ జీవితంలో ఎవరూ మోసం చెయ్యలేదు–ఒక్క చిన్నగాడు తప్ప. అందుచేత వెంటనే అతన్ని పోలీసులకు పట్టివ్వడమా లేక మొలనున్న బెల్టుతీసి సురేంద్ర చమ్డాలు ఎక్కపీకెయ్యడమా అన్న సమస్య తేల్చుకొనేలోగానే పురుషోత్తంలోని వకీలు–పొరలోంచి పాములా–కదిలేడు.

పురుషోత్తంగారిలోని పురుషోత్తానికి మోసగాళ్ళంటే అసహ్యం. ఖూనీకోరులంటే జుగుప్స. పెళ్ళాన్ని కొట్టేవాడంటే రోత. ఫోర్జరీ చేసే వాడంటే అసహ్యం.

కాని పురుషోత్తంగారిలోని వకీలు కీ చిన్న గుణాలు ఏవీలేవు. అతనికి మోసగాడంటే దయ, ఖూనీకోరంటే జాలి, పెళ్ళాన్ని కొట్టే వాడంటే సింపతీ.

అతనిలోని "వకీలు" పురుషోత్తం చేతులు గట్టిగా పట్టుకొని, నాటకంలో ప్రాంప్టర్లా అతని చేత మాట్లాడించడం ప్రారంభించేడు. అంచేత "ఏంవింటి సంగతి?" అన్నారు ఆయన.

సగం ఆపరేషన్లో పేషెంటు లేచి కూర్చుని "ఏంవింటి సంగతి?" అని అడిగితే డాక్టరు ఎలా ఫీలౌతాడు? ఆ సంగతి సురేంద్ర అందరికన్నా బాగా చెప్పగలడు.

అప్పుడు సురేంద్ర గొంతులోంచి ఒక ధ్వని వచ్చింది. అది తెలుగు కాదు, ఇంగ్లీషు కాదు, ఏ భాషా కాదు. తుమ్ముకాదు,

దగ్గుకాదు, ఎక్కిళ్ళు కాదు, ఎలకపిల్ల ఏడుపు సగంలో ఆపుకున్న ట్టుంది ఆ ధ్వని.

పురుషోత్తంగారి మతిమరుపు గురించి సురేంద్ర విన్నాడు. కాని నమ్మలేదు. ఇప్పుడాయన తనను గుర్తించలేదన్న విషయం స్పష్టం. ఇంక తనెవరో స్పష్టం చెయ్యకపోతే, అతను మళ్ళీ "సుందరం" అని పిలుస్తారు.

"సుందరం" అని ఎవరేనా పొరపాటున పిలిస్తే, సురేంద్రకి ఎక్కువ అభ్యంతరం ఉండదు. కాని పురుషోత్తంగారితో వచ్చిన పేచీ ఏమిటంటే, అతను అలా పిల్చి పిలవలేదంటారు. అలాగే పిల్చే రని మొండికెత్తితే ఎందుకు పిలిచేనని దబాయిస్తారు. కేసు కొద్ది రోజుల్లో విచారణకు ఉంది–ఆ విషయం చర్చించడానికీ, తనకు ఎటువంటి సాక్షులు కావాలో తెలుసుకోవడానికీ, తను వచ్చేడు.

కేసు ఫలితం మీద తన "బిజినెస్ సక్సెస్" ఆధారపడి ఉంది. అది గెలిస్తే శత్రువులని మొలక స్టేజిలోనే నలిపివేసినట్టు. కేసు పోతే కంసుడి చుట్టూ చిన్న కృష్ణుళ్ళులా తన చుట్టూ తన అర్భ కపు బాకీదారు వెధవలు చెలరేగిపోతారు!

చీమలు "కో ఆపరేటివ్ ఫార్మింగ్" పెట్టి పాముని పామునే తినేస్తాయి.

"సింహాచలం"తన బిజినెస్‌కి చేస్తున్న క్రొత్త జబ్బు తాలూకు మొదటి లక్షణం. బాకీదారు తాను బానిసను కానని వేసే మొదటి రంకె. "బాకీదారు, వాడి పెళ్ళాం పిల్లాకూడా బానిసలే"నని తెలియ చెయ్యవలసిన తరుణం అది.

సరుకు చవగ్గా కొని ప్రియంగా అమ్మడం వ్యాపారం తాలూకు తొలి సిద్ధాంతం. కాని ప్రతి వ్యాపారంలోనూ ఈ సిద్ధాంతం వర్తిం చదు. తన జోడు నాడాకింద బాకీదారు విలవిల్లాడిన్నాడే తన వ్యాపారం సుస్థిరం.

అప్పు యిచ్చినవాడికి వడ్డీ ఆశ ఉంటుంది. ముస్లిములు యిచ్చిన అప్పుమీద వడ్డీ తీసుకోకూడదట. ఆ సిద్ధాంతం అతి క్రమించకుండా ఉండడానికి వారు చేసిన పద్ధతుల ప్రకారం బాకీదారు వడ్డీ కట్టక్కర్లేదు. అసలుతో ప్రాణాలు యిచ్చేస్తే చాలు.

గవర్నమెంటు అయినా, గడ్డి అమ్ముకునేవాడైనా అప్పుమీద వడ్డీకి ఆశపడడంలో తప్పులేదు. కాని సురేంద్రలాంటి షావుకార్లు కమీషన్‌కి కూడా ఆశపడతారు. వాళ్ళకి వడ్డీకంటే కమీషన్ ముఖ్యం. సింహాచలంలా ఇతర కొట్లకి బెల్లం వేసిన ఖాతాదార్లని చెరుకు గానుగలో పెట్టి ఆడేసి, ఆ పిప్పిని బెల్లం పొయ్యిలో పడె య్యడం యింకా ముఖ్యం.

ఈ విషయాలన్నీ సురేంద్ర పురుషోత్తంగారితో చెప్పలేదు. ప్రతి విషయం విడమర్చి చెప్పవలసిన అవసరం ఉండదనే – ఖరీదైన అతనినే షావుకార్లందరూ ప్లీడరుగా పెట్టుకుంటారు.

సింహాచలాన్ని తలుచుకుంటే గుండె మండిపోతోంది సురేంద్రకి.

పురుషోత్తం వైఖరి చూస్తే ఒళ్ళంతా మండిపోతోంది.

అంచేత "యీ మధ్య నా కేసుంది." అని తన కేసు నెంబరు చెప్పేడు అతను.

కేసు నెంబరు వినగానే కోడ్ మెసేజ్ విన్న సీక్రెట్ ఏజంటులా విజృంభించేరు పురుషోత్తంగారు. ఆయనకి అంతా అర్థం అయి పోయింది. తన ఎదురుగా వున్నది చిట్‌ఫండ్ చిన్నారావు కాదు. భీమలింగంగారి సన్యాశ్శెట్టిగారి కొడుకు సురేంద్ర. అతను సింహా చలం మీద బాకీ రాబట్టుకోవడానికి దావా వేసేడు. "బెల్లం డబ్బులో ప్రతీ ఏడూ మూడొంతులు సొమ్ము షాహుకారు మిగుల్చు కుంటూనే వున్నాడు. మరంచేత బాకీ తీరిపోయినట్టే" అంటాడు సింహాచలం. "బాకీ కానీ కూడా తీర్చలేదు. పైగా వడ్డీతో కలిసి మోపిడైంది" అన్నది సురేంద్ర వాదన. నిజా నిజాలతో తనకి నిమిత్తంలేదు. అతని కేసు నిరూపించడం తన వృత్తి ధర్మం. ఆ తెలివితేటలు తన దగ్గరున్నాయి.

"మరింతసేపూ చెప్పవేం ఆ భోగట్టా?" అన్నారు పురుషోత్తం గారు.

"ఈ ఫిడేల్ ఆట నేను మొదలు పెట్టలేదు" అందామనుకొని మానేసేడు సురేంద్ర.

"కేసు వాయిదా వేయిద్దామా, విచారణ చేయిద్దామా?" అనడిగేడు పురుషోత్తంగారు.

ఎలకని తాపీగా, నెమ్మదిగా బాధపెట్టి చంపుతుంది పిల్లి.

సురేంద్ర పిల్లికాదు. పంజాతో ఒకే దెబ్బకొట్టే పులిజాతి మనిషి.

"విచారణ చేయించాలి" అన్నాడు.

"అలాగే" అన్నారు పురుషోత్తంగారు. ఎలాగో విశదీకరిం చలేదు.

"వాడు వాయిదా కోరతాట్ట."

"మనం యివ్వొద్దు అందాం".

"ఇదివరకు రెండు వాయిదాలకీ అలా అన్లేదు మీరు."

"ఇప్పుడు అనటానికే, అప్పుడు మానేసేను".

తర్వాత ఇద్దరూ కేసు గురించి చాలా చర్చించేరు.

"రేపొద్దున ఎకౌంట్లు పట్టుకురా." అని సురేంద్రని పంపిం చేసేరు పురుషోత్తంగారు.

# 38

అ దే టైముకి.......

వెంకట్రావు ఆఫీసులో–

వీలునామా వ్రాయిస్తున్న రోగిలా ఉన్నాడు సింహాచలం. వీలు రాస్తున్న ప్లీడరులా ఉన్నాడు వెంకట్రావు. సాక్షి సంతకం చేయవలసిన వాడిలా వున్నాడు గవర్రాజు. రోగికి బతకాలని ఉంది.

ఆ ఆశ ప్లీడరుకీ, సాక్షికీ లేదు. అలా అని వాళ్ళు రోగితో చెప్పలేదు.

"మన సాక్ష్యం మాటేఁవిఁటి?" వెంకట్రావు అడిగేడు.

విషపు వరదలో కొట్టుకుపోతున్నవాడు పాము దొరికినా పట్టుకుంటాడు.

అంచేత "అన్నిటికీ గవర్రాజు మాఁవేఁ ఉన్నాడు." అన్నాడు సింహాచలం.

పడగ విప్పింది పాము. "ఏటీ, నాను కోరట్లో సాచ్చీకం జెప్పాలా? నయ్యం. సరసం జెయ్యమన్లేదు–పబ్లిక్కోర్టులో!"

"నువ్వలా గనీస్తే...."

"అలా గనకపోతే అబద్ధం సెప్పమంటావేటి? రాజుగారి దెయ్యాల నూతిలోకి గెంతీమంటే ఎవుడేనా గెంతేస్తాడేటో గాని, సురేందర బాబు మీద సూసిందైనా ఎవుడూ సెప్పడు. పోయినేడు ఏటైందో తెల్సా? ఆ బాబు తన ముంద యింకెవడ్నీ పిలిసినాదని పబ్లిక్ నాలుగురోడ్ల మద్దెన టమటమా ఏసి మరీ దాని కొప్పు కత్తిరించీసినాడు.

అప్పుడదేటందంటే 'నా నెవర్నీ పిల్నేదు' అంది.

'నాను పిలవకుండానే వచ్చినావా?' అని ఆ బాబు తెగ్గోసిన కొప్పు పట్టుకొని మరీ అడిగినాడు.

'నిన్నే నమ్ముకున్నా' నని ఏడిసిందా గుంట.

'అలాగైతే నీ క్కొప్పూ, కోకా అనవసరం' అన్నాడా బాబు. అన్నాడేగాని ఆ తర్వాత ఆ గుంట మొహమ్మీద ఉమ్మనైనాలేదు. నీలాంటి నాలోటోళ్ళ మాటిని ఆ గుంట మేస్ట్రీటు కేసెట్టినాది. పెట్టి, సూసినోళ్ళనీ, సూడనోళ్ళనీ, సాచ్చీకం ఏసింది. కాని కొసకి ఎవుడూ నిలబడ్నేదు. తోటి సాన్లే ఎగస్పార్టీ ఐపోనారు. కొసకీ మిగిల్నోడు ఒక్క మేళం మద్దిలగోడే. కాని ఆడు సాచ్చికం చెప్పిన పొద్దు ఆ కబురూ ఈ కబురూ సెప్పి ఇచారణ పూర్తిగా కుండా పురుషోత్తం పంతులు వాయిదా వేయించేసినాడు. వోయిదా పడ్డాక, సురేందరబాబు ఆ మద్దిలగోడికి కబురెట్టి నాడు. ఏటని? "ఈసారి గాని నువ్వు యిచారణలో నా మీద ఒక్క మాటగాని సాచ్చీకం సెప్పినావా, నీ మద్దిల తోలు తెగ్గోసి–నీ డొక్క సీరేసి దాని గ్గట్టి దరువు వోయించేస్తాను. జాగరత్త నీమద్దిలతోలు వుంచు కోవాలంటే–యిదిగో ఈ ఎయ్యీవుంచుకో, కోరట్లో అగపడు" అని.

"మరిప్పటికప్పుడే సాచ్చీకం కొంత సెప్పీసినానే" అని ఏడిసి నాడు మద్దిలగోడు!

"అదంతా నాకు తెల్దు. నా మాట మాత్తరం గురుతుం చుకో" అన్నాడు ఆ బాబు. ఆ మర్నాడు ఆ మద్దిలగోడ్ని కోరట్లో సూస్తే కడుపు తరుక్కుపోతాది. ఆడు కోర్టువోరిని సూడ్డు, ముద్దా యిని సూడ్డు, అసలప్పుడు ఆడి కంటికి సూపేనేదు.

నిద్దర్లేచిన పెద్దపులిలా నిలబడ్డాడు పురుషోత్తంబాబు. ఆ బాబు మూడే పెస్నెలు ఏసేడు.

"సులోచన (పిర్యాది) కొప్పు తెగడం నువ్ సూసేవా?"

"సూసినాను."

"తెగిపోయిన జుత్తు ఎవరి సేతిలో వుంది?"

"సురేందరబాబు సేతిలో"

"కత్తెర ఎవరి సేతిలో వుంది?"

"సులోచన సేతిలో."

"మరంతే, కూకుండీ పోనాడు పురుషోత్తంబాబు. సురేందర బాబుని బాజాల్తో ఒగ్గీసేరు. కేసెట్టిన గుంట–కాటికలోకి మిగ ల్నేదు. పెద్ద పెద్దవాళ్ళంతా "క్యూ" లో నిలబడి పొయ్యీ వారు దాని కోసరం. అలాటిది ఇప్పుడది రాజమండ్రి ప్లాటుఫారం మీమ్మద పడుకుంటున్నాది."

పురుషోత్తం ప్రతాపానికి జడిసిపోయేడు సింహాచలం. రేపు తనకు రాబోయే మందులేనిజబ్బు వివరాలు ఇప్పుడే తెలుసు

కున్నట్టు బాధపడ్డాడు.అతని దుస్థితిని చూసిన వెంకట్రావు జాలిగా "ఇప్పుడవన్నీ ఎందుకు?" అన్నాడు.

"ఇయ్యాల గాకపోతే యింకెప్పుడు సెప్పేది సాచ్చీకం ఉండ నని" అన్నాడు గవర్రాజు.

తన తొందరపాటుకు నాలిక కొరుక్కున్నాడు వెంకట్రావు. సింహాచలం కాళీ చాక్లెట్ కాగితం. అందులో మళ్ళీ ఎవరూ చాక్లెట్టు చుట్టరు. అతడు నొచ్చుకున్నా, మెచ్చుకున్నా వెంకట్రావుకి ఒకటే. కాని గవర్రాజు తన పాలిట కామధేనువు, బంగారు గుడ్ల బాతు. దాన్ని బెదరగొట్టగూడదు అంచేత.....

"నువ్వన్నదీ నిజమేననుకో, చూడనిది నిన్ను చెప్పమని ఎవరంటారు?" అని బుజ్జగించేడు.

"అదీ వొరసఁ అలాగ రా తోవలోకి. నన్ను మోమాటపెట్టక, నా మానాన నన్ను ఒగ్గీ. ఇకపోతే ఇదుగో యీడున్నాడు" అని సింహాచలాన్ని చూపిస్తూ ఆగేడు గవర్రాజు.

"ఇంకా చచ్చిపోలేదు" అన్నట్టు తల ఆడించేడు సింహాచలం.

గవర్రాజే మళ్ళీ అందుకున్నాడు. "ఈడికో కేసుంది. ఈడి పక్క నాయం వుంది. నాయం పక్కని సాచ్చీకం ఉండాల–దేవుఁడి పక్కన ఉత్సవ విగ్రహం వున్నట్టు. దేవుడు ఊళ్ళో ఊరేగడు. నాను యింకా బతికున్నాను అని సెప్పడానికి ఊళ్ళోకి ఉత్సవ యిగ్రహాన్ని అంపిస్తాడు. ఆ ఇగ్రహానికే పళ్ళూ ఫలాలూ, హారతులూనూ.

నాయం కూడా అంతే. దానంతట అది కోరటుకెళ్ళి "నానిటున్నాను. అట్లేను" అని సెప్పదు. అలాగని దాని ఉత్సవ ఇగ్రహం అది సూసుకోలేదు. మనవేఁ జూడాల" అని ఆగాడు.

"సూడాలి" ఆశగా అన్నాడు సింహాచలం.

"ఔనౌను, చూడాల్సూడాలి" అన్నాడు ఏమనాలో తెలియని వెంకట్రావు.

గవర్రాజు మళ్ళీ ప్రారంభించేడు. "ఈ యవ్వారం నా కొగ్గీ. అర్జునుడితో కిష్టమూర్తుల వారన్నట్టు–ఒకడు గాడు, తొంభై మంది ఇగ్రహాల్ని ఏరుపాటు జేస్తాను. ఒరే సివంచలం! నువ్వు ఇంటికెళ్ళినప్పుడు ఆ కనకంగాడ్నీ, అడి జట్టునీ ఓసారి అగపడమన్నానని సెప్పు. ఎప్పుడోగాదు, ఈ రేత్తిరికే, నాను. మరి యీ రేత్తిరి–నిద్దరికి నోసుకో లేదులే.

నువ్వు సూడు, ప్లీడరుబాబూ! ఆ సాచ్చికులు ఏటి సెప్పాలోసెప్పు. రేత్తిరి ఏగినంతకీ పాఠం జెప్పి తెల్లారి నీకాడకి అట్టుకొస్తాను. నువ్వూ ఓ వూపు ఊపి సూద్దువుగాని."

తర్వాత మాటలు చాలా బిజినెస్ లైక్‌గా జరిగిపోయేయి.

వెంకట్రావు దగ్గర శలవు తీసుకొని బయలుదేరేరు ఇద్దరూ.

# 39

కడిగిన ఇంటిలో పెట్టిన ముగ్గుల చుక్కల్లా ఉన్నాయి ఆకాశంలో నక్షత్రాలు. రెండో ఆట సినీమాకి వెళ్ళదలచుకున్న వాళ్ళు ముస్తాబు అవుతున్నారు.

భోంచేసిన వాళ్ళని ముష్టివాళ్ళు అన్నం అడుక్కుంటున్నారు.

బజారుముండ "పకోడీల నవ్వు" నవ్వుతూ దుకాణాల పక్కని కన్ను కొట్టింది.

రిక్షా చక్రాల్లోనూ, కుళ్ళు కాలువల్లోనూ, ముష్టివాళ్ళ కళ్ళల్లోనూ వీధి లైట్లు మెరిసి మాయమై పోతున్నాయి.

చీకటి సందుల్లో పడుకున్న పందుల్ని తప్పించుకొని నడుస్తున్నారు సింహాచలం, గవర్రాజూ.

"ఒరే బాబూ! మళ్ళీ సెప్పలేదనుకునేవ్, అంచేత ముందల కాడే సెప్తున్నా, ఇను. ఆ కనకంగాడూ, ఆడిజట్టూతప్ప మన కింకెవడూ దిక్కులేరు. ఆళ్ళేనా తక్కువోళ్ళనుకునేవ్? మర్డరుకేసు మొదలు మునిసిపాలిటి కేసువొరకూ ఆళ్ళు సాచ్చీకం యివ్వని కేసు లేదు."

అంత అనుభవశాలులని సాక్షులుగా పొందబోతున్న భాగ్యానికి చాలా సంతోషించేడు సింహాచలం.

"కాని ఒక్కమాట–ఆళ్ళకి సాచ్చీకం సెప్పడం సరదాకాదు. మరెందుకు సెప్తారని అడుగు?"

అడిగేడు సింహాచలం.

"మన ప్లీడరుబాబు పదయ్యాసరికి–వణ్ణమైఁనా సరిగ్గా తినకుండా ఎందుకు కోరటుకి పరిగెడతాడు? పెళ్ళాం–పిల్లా, రేత్తిరీ–పగలూ ఆనకుండా జెడిజీలూ, మునసబులూ ఎందుకు పన్జేస్తారు–దొంగోడు అన్నిటికీ తెగించి రేత్తిరిపూట ఎందుకు బయలెల్తాడు? ఆడ్ని పట్టుకోడానికి పెళ్ళాన్ని కూడా ఒగ్గేసి పోలీసోడు ఎందుకు తిరుగుతాడు? డాట్రుబాబు నరుసుముండ నొగ్గేసి సలి అనక, వోసనక సచ్చేవోడి పక్కని ఎందుకుంటాడు? మన మైనర్రాజు గోరు పంచదార పేక్టరీ ఎందుక్కట్టినాడు? మన సెయిర్మను బాబు సినిమాహాలెందుక్కట్టేడు? సదువుకు

న్నోళ్ళు అంతంత పుస్తకాలు ఎందుకు రాస్తారు? కూలోడు రాళ్ళెందుకు మోస్తాడు? దొంగతనాలూ, దోపిడీలూ, దెబ్బ లాటలూ, మోసాలూ, దగాలూ, ఏడుపులూ, ఎక్కిరింతలూ, ఆసికాలూ, పరాసికాలూ, బూతులూ, కూనీలూ యివన్నీ ఎందుకు పుట్టేయి?

డబ్బుకోసరం, మనం అడక్కుండా, సెయ్యి జాపకుండా – సూరీడు నెగొచ్చు, సెట్లు పుయ్యొచ్చు, నూతుల్లో నీళ్లూరొచ్చు, పొలాలు పండొచ్చు. గేదగొడ్డు పాలియ్యొచ్చు.

కాని మనిషి అన్నోడు–ఆడు ప్లీడరే అవనీ, పార్టీనే అవనీ, పోలీసోడు గానీ, పుండాకోరుగానీ, డాట్రుగానీ, కంపౌండరుగానీ, ఆకరికి అడుక్కుతినేవాడన్నా గానీ–డబ్బాశ లేందే కాలుకాదు సరికదా–వేలు కూడా కదపడు, నోరుమెదపడు. సేతకాదు కాని, లేపోతే మనిషి ఊపిరి కూడా పీలవడం మానీసును డబ్బు ముట్టకపోతే.”

ప్రపంచ కీలకం యిదివరకు అర్థం అయిందో లేదోకాని ఇప్పుడు మాత్రం కాగితం వలిచి చాక్లెట్ చేతిలో పెట్టినట్టు అర్థం అవుతోంది సింహాచలానికి.

“కాబట్టి ఈ రేత్తిరి ఎలా తెస్తావో నాకు తెల్దు. కన్నమే ఏస్తావో ఖూనీయే సేస్తావో! కాని మూడొందలు పట్రా. మనిషికో వంద. అంటే నా కోటీ, నీ కోటీ, కనకంగాడి కోటీ అనుకునేవ్. మనకి ఆదమం ముగ్గురు సాచ్చులుండాల. మనిషికో వందిస్తే యింకా వెయ్యి బాకీ వుంటాం. ఆళ్ళు సేసిన ఉపకారానికి, అంచేత ముందు కనకంగోడి నంపు. తర్వాత ఏ రేత్తిరికన్నా డబ్బు పట్రా.”

“నా సేతగాదు.”

“ఏటీ, కబురు సెప్పడవాఁ?”

“కాదు. డబ్బు అట్రావడం.”

“ఏం?”

“నేదు.”

“ఏట్నేదు?”

“డబ్బునేదు.”

“అయితే నీ పెళ్ళాన్నడిగి వస్తువులట్టుకురా. ఉన్న యిల్లు నీ పెత్తాత కొడుక్కి తాకట్టు పెట్టు. ఇప్పుడు ఎనకాముందూ సూసి నాబంలేదు. నీలాటోడు సావుకారుతో భేటీ ఎట్టుకోక ముందే ఆలోచించుకోవాలి. ఇంత ఎనకడుగు ఏసినోడివి యుద్ధాని కెందుకు దిగేవ్? అందులోనూ, అలాటిలాటోడి తోనా? దుర్యోధనుడు లాటోడితో–అప్పుడు అమాయకపు కాలంగాబట్టి దరమ రాజుకి దేవుఁడు సాయవెల్లినాడు. ఇలాటలాటి సాయవాఁ? సెక్కరం అడ్డెట్టినాడు. అవుసరం పడ్డప్పుడు గుర్రాల్తోలినాడు.

నీకెవడున్నాడు?

అందుచేత బేగిల్లి సెప్పినట్టు సెయ్యి” అంటూ సందు మలుపు దగ్గర గవర్రాజు సింహాచలాన్ని వదిలేసేడు.

ఒంటి ద్వీపంలో సాయం ఉన్న ఒక్కడూ తనని వదిలి వెళ్ళిపోతున్నట్టనిపించింది సింహాచలానికి.

# 40

ఉదయం పదకొండు దాటింది.

చలమయ్యగారి ఇంటి కట్టుబడి పని చురుగ్గా సాగుతోంది. ఇంకో నెలలో మూఢం వస్తుంది. అంచేత వచ్చే పంచమికి పైకప్పు పడినా, పడకపోయినా ఒక గదికి పైన రేకులు వేసైనా సరే గృహప్రవేశం అయిపోతానంటున్నాడు చలమయ్య.

కడుతున్న ఇంటికి దూలాలు మాత్రమే పడ్డాయి. ఇంకా వాసాలు వెయ్యాలి. పైకప్పు పడాలి! తలుపులు బిగించాలి. గోడకి సున్నంవెయ్యాలి. నేల సిమెంటు చెయ్యాలి. ఇవన్నీ గృహప్రవేశం లోగా అయిపోవాలి. ఆ తర్వాత కట్టుకోవచ్చు–పెరట్లో తవ్విన నేల బావికి రాతి కట్టు. ఆ తర్వాత వేసుకోవచ్చు రంగుల తోటా ముత్యాల ముగ్గులూ.

కాని అప్పుడే వేసేసేరు–కొన్ని నిమ్మా, నారింజా, దబ్బా, కొబ్బరి చెట్లు. అవి చిన్న పిల్లల్లా అల్లరిగా పెరుగుతున్నాయి.

దబ్బచెట్టు మొదట్లో పడుకున్న రెండు పంది పిల్లలు ఆట బొమ్మల్లా ముద్దుగా ఉన్నాయి. కడుతున్న ఇంటి ఒక గది అల మరల్లో కూలీల “చల్ది” సిలవరి గిన్నెలు ఎండలో చౌకపౌడరు రాసుకున్న వీధి డాన్సర్లులా తళతళ మెరుస్తున్నాయి.

ఆ యింటి పక్కనే తాత్కాలికంగా వేసిన పాకలో స్టోర్ చేసిన కఱ్ఱ సామాన్లకి తాపీమేస్త్రీల లాల్చీలు వేలాడుతున్నాయి. ఆ పాకలోనే మేస్త్రీల భోజనం కేరియర్లూ గునపాలూ, తాపీలూ, బకెట్లూ వగైరా సామాన్లు చిందరవందరంగా ఉన్నాయి. పాకలో మధ్యనున్న నులక మంచం చేరుకోవడం అంత సుళువు కాదు. డైబిటీసు నీరసం, చలమయ్యలోని పని పూర్తి చేయిద్దామనే ఉత్సాహాన్ని జయించినప్పుడు అతను ఆ మంచం మీద విశ్రమిస్తాడు.

ఆ యింటి పనిలో తాపీ మేస్త్రీలు పదిమంది ఉన్నారు. వాళ్ళ ముఠాకి యజమాని జగన్నాథం మేస్త్రీ.

మేస్త్రీల ముఠాలు ట్రేడ్ యూనియనులు కావు. ఆ ముఠాలకు చట్టాలూ, రూల్సూ, లాస్, బైలాస్ ఏంవీ ఉండవు. అవి చాలా ప్రిమిటివ్ పద్ధతుల్లో పని చేస్తాయి. కాబట్టి యజమాని మేస్త్రీ లేక ముఠా మేస్త్రీకి మామూలు మేస్త్రీకన్నా సదుపాయాలూ, సౌకర్యాలూ, హక్కులూ ఎక్కువగానూ, పని తక్కువగానూ వుంటుంది. ముఠా తేనెతుట్టకి అతను 'క్వీన్ బీ". అతను మామూలు మేస్త్రీలు చేసే పని సూపర్‌వైజ్ చేస్తాడు. అంటే వాళ్ళలో తప్పులు పట్టే అత్తగారి పని అతనిది. అంతేకాకుండా అతను కొత్త కోడల్లా యజమాని మీద అలగగలడు. అతను అలిగితే యజమానికి రెండే మార్గాలున్నాయి. ఒకటి : అతని అలక తీర్చడం. రెండు : కొత్త ముఠా తెచ్చుకోవడం. కొత్త ముఠా తెచ్చుకోవడం అంటే కట్టడం పనిమానుకోవడం ఉత్తమం. కొత్త ముఠా వాళ్ళు గనకవస్తే, వాళ్ళు అప్పటి వరకూ అయిన పనిని కొత్త మేష్టర్ని డి.ఇ.వో. చూసినట్లు చూస్తారు. ఆ ముఠా యజమాని మొదట మీద పంటితో కింది పెదవి నొక్కుతాడు. తల ముందు నిలువుగా ఆడిస్తాడు. ఇంటి యజమానిలో ఆశ రేగుతుంది. కాని వెంటనే ఆ ముఠా లీడరు తల అడ్డంగా తిప్పుతాడు. తర్వాత తనముఠాతో కలిసి సీక్రెట్ కన్సల్టేషన్ను పెడతాడు. ఆ కన్సల్టేషన్స్ ఎక్స్‌పర్ట్ డాక్టర్స్ సంప్రదింపుల్లా వుంటే, తన భవిష్యత్తు వాటిమీద ఆధారపడిన రోగిలా యజమాని విలవిల్లాడిపోతాడు.

సంప్రదింపులు అయిపోతాయి. టీ.బీ. బ్లడ్‌ప్రెషరూ కలిసి ఒక్కసారి వచ్చినట్టుంటుంది ఇంటి యజమానికి మేస్త్రీల ప్రవర్తన. అతని అనుమానం నిజం అన్నట్టూ, కాని, ప్రాణం మీద పూర్తిగా ఆశ వదులుకో నక్కర్లేదన్నట్టూ కాస్త ఎంకరేజింగ్‌గా నవ్వుతాడు ముఠా లీడరు. నవ్వేక మేస్త్రీలంతా జమిలిగానూ, విడివిడిగానూ తమ అభిప్రాయం వ్యక్తపరుస్తారు. పాతమేస్త్రీకి బహుశా పునాది గోతులు తవ్వడం వచ్చి ఉండొచ్చునని ఆ అభిప్రాయం. పాతవాళ్ళకి పునాదులు కట్టడం, గోడలు కట్టడం వగైరా తాపీపని రాదనీ, వాళ్ళు కేవలం మేస్త్రీ వేషాలు వేసుకున్న కూలీలనీ వాళ్ళు కట్టినదంతా పీకేసి కట్టాలనీ, అదృష్టం వుంటే పునాదులు పనికి రావచ్చనీ-విడమర్చి చెబుతాడు.

అంచేత పాత ముఠా నాయకుడి అలకతీర్చటం వినా శరణంనాస్తి.

ముఠా మేస్త్రీ మిగిలిన స్త్రీల పనులు నిర్ణయిస్తాడు. గవర్నమెంటు సర్వెంట్సు కాండక్ట్ రూల్స్ అన్నీ తన గేంగ్‌లో అమలు పరుస్తాడు. వాళ్ళలో ప్రొబేషనర్సు-అప్రూవ్డ్ ప్రొబేషనర్సు - టెంపరరీ కేండిడేట్సు-మొగ కూలీల్లోంచి మేస్త్రీల రిక్రూట్‌మెంట్ కూడా అతనే చేస్తాడు. (ఆడ మేస్త్రీలు ఎక్కువగా ఉండరు ఎందువల్లనో) వాళ్ళకి ఇంక్రిమెంట్లు ఇస్తాడు. తీసేస్తాడు. వాళ్ళ కూలి డబ్బంతా ఫ్లాట్ రేట్‌ని యజమాని దగ్గర వసూలు చేసి, అంత కన్నా తక్కువ రేటున వారికి యిస్తాడు.

ఆడ కూలీలను అతగాడే రిక్రూట్ చేస్తాడు. ప్రతి మేస్త్రీకి ఒక ఆడకూలీ అసిస్టెంటుగా వుంటుంది. అతని పక్కన మండిగలో సున్నం చిక్కగా వుంటే నీళ్ళుపోసేదీ ఆవిడే. నీళ్ళు ఎక్కువైతే మళ్ళీ సున్నం వేసేదీ ఆవిడే. మేస్త్రీ బీడీకి అగ్గిపుల్ల కొట్టేదీ ఆవిడే. అతని మూడ్ బాగాలేకపోతే సరసంగా సరిచేసేదీ ఆవిడే. అంచేత అందమయిన ఆడ కూలీలు అలాంటి ప్రివిలిజ్‌డ్ పనులకి సెలక్టు చెయ్యబడతారు. అందరిలోనూ అందాల భామని మేస్త్రీ నాయకుడు తనకు అసిస్టెంటుగా తీసుకుంటాడు.

జగన్నాథం మేస్త్రీ తన అసిస్టెంటుగా రాజమ్మని తీసుకున్నాడు. కాని తీసుకున్నాక అతను ఎక్కువ ఆనందించ లేకపోతున్నాడు. రాజమ్మ అందరి తోవా తొక్కడంలేదు. సరదాగానే ఉన్నా-ఎడంగా ఉంటోంది. చనువుగానే ఉన్నా చేతికి దూరంగా ఉంటోంది. ఆమె మాటల్లో ఆహ్వానం లేదు. చేతల్లో విసర్జనా లేదు. ఆమె అతనితో రెండు నెలలై పనిచేస్తున్నా మొదటిరోజు ఎక్కడున్నాడో ఇప్పుడూ అక్కడే ఉన్నాడు అతను. ఈ వేళ అక్కడే ఉండదల్చుకోలేదు అతను. రాజమ్మకి దగ్గరగా వెళ్ళాలి. లేకపోతే ఆమెను పనిలోంచి పంపించెయ్యాలి.

వెడల్పులేని వెదుళ్ళ పరంజామీద పనిచేస్తున్నారు వాళ్ళిద్దరూ.

తాపీతో రాసినదే రాస్తూ అతను మాట్లాడుతున్నాడు.

"సినిమాకెళ్తావేటి. మంచాట ఉంది ఊళ్ళో."

"ఎల్లను."

"అసలెప్పుడూ ఎల్లవా?"

"ఎల్ను".

ఆమె సినిమాలకి వెళ్తే చాలా మాట్లాడదామనుకున్నాడు అతను. దారం తెగిపోయింది.

కొత్త దారం పేనాలి.

"సుట్ట ముక్కారిపోనాది. జోబిలో అగ్గిపెట్టుంది తియ్యి."

రాజమ్మ అతని జేబులో అగ్గిపెట్టె తియ్యలేదు. పక్కనే పని చేస్తున్న మరొక మేస్త్రీ పక్కనే ఉన్న అగ్గిపెట్టె తెచ్చి పుల్లగీసి వంగింది.

కాలంలో వున్న ఆడది కూర్చున్న మొగాడి వెనకనుండి వంగి వెలిగించిన అగ్గిపుల్ల అతని నోట్లో చుట్టదగ్గర పెడితే, అతను శ్రీరాముడు కాకపోతే ఎలా ఉంటుంది? అలా ఉంది జగన్నాధానికి.

కాని ఈ దారం కూడా తెగిపోయింది.

అప్పుడే జగన్నాథం పక్కనున్న మేస్త్రీ ముందుకు వంగవలసి వచ్చింది. ఆధారం లేకుండా ఒంగడం కష్టం. అంచేత అతను తన పక్కనిలబడ్డ అసిస్టెంటు కూలీని రమారమీ తొడదగ్గర కాలుపట్టుకుని ముందుకు వంగేడు. ఆమె చీర వెనక్కి ఎగ్గట్టడం వలన ఆమె తొడలు కనిపిస్తున్నాయి. మేస్త్రీ ఆమె కాళ్ళు పట్టుకున్నప్పుడు ఆ తొడలు జవజవలాడేయి. ఆమె కిచకిచలాడింది.

"ఎప్పుడూ ఏమీ ఎరగని దాన్లాగ అలా గిజగిజలాడతావేటి? ఒల్లకుందు" అన్నాడతను. ఆమె "ఒల్లకుంది" గాని కిచకిచ లాడుతూనే ఉంది.

జగన్నాథం వెంటనే "క్యా" అందుకున్నాడు. అతనూ ముందుకు వంగేడు. అతనూ మొగలిరేకులా మెరుస్తున్న రాజమ్మ కాలు పట్టుకున్నాడు.

రాజమ్మ కిచకిచలాడలేదు. గిజగిజలాడలేదు. కొర కొర చూసింది. చూసి "కాలొగ్గి" అంది. అతను కాలు ఒగ్గేసేడు.

ఆ సాయంత్రమే ఆమెని పని "ఒగ్గీ" మన్నాడు అతను.

ఈ విషయం రాజమ్మ సింహాచలంతో చెప్పలేదు. ఆవిడకి మళ్ళీ పని దొరకడానికి కొంత టైమ్ పట్టింది. అంతవరకూ తనకు ఒంట్లో బాగుండక పన్లోకి వెళ్ళడంలేదని సింహాచలంతో అబద్ధం చెప్పింది.

# 41

ఉదయం ఎండ ఎర్ర రగ్గులోంచి అయిష్టంగా బైటికి వచ్చింది ప్రపంచం.

లేవబోతున్న పెళ్ళాన్ని లేవనివ్వని టైము అది.

కోవెల పక్కన కోనేరులో తామర మొగ్గలు, కలువలను చూసి సిగ్గుతో ఇంకా ముడుచుకునే ఉన్నాయి.

ఈలోగా ఎక్కడనుంచో వచ్చిన గండు తుమ్మెద–పడుచు పెళ్ళాం కంటె ముసలి ప్రియురాలే మేలు అన్నట్టు తామర మొగ్గని కాలదన్ని కలువ కన్ను గీటినట్టు అయి, అటు వెళ్ళిపోయింది.

నెత్తిమీద పాలతట్టల భారంతో చేతులు గుండ్రంగా తిప్పుకుంటూ వెళ్ళిపోతున్నారు పల్లె పడుచులు.

మరో మంచిరోజుని పాటల్తో పొగుడుతున్నాయి పిట్టలు.

చలి చెరువులోంచి బైటపడిన సింహాచలం, కొంకర్లు పోయిన మనసుతో ప్రవేశించేడు శివాలయం.

శివాలయంలో గర్భగుడిలా కనిపించేది గర్భగుడే.

దానిముందు నందిలా కనిపించేది నందే.

గంటలా కనిపించేది గంటే.

శివలింగంలా కనిపించేది మాత్రం శివుడు కాదు.

నంది పక్కనే పశు భక్తితో సాష్టాంగపడ్డాడు సింహాచలం.

"నాకు మణులొద్దు, మాన్యాలొద్దు, భాగ్యమొద్దు, బంగార మొద్దు, పట్టుబట్టలొద్దు, పంచబచ్చ పరమాన్నాలొద్దు.

నాకు కొత్తగా ఏటీ ఇవ్వొద్దు.

నువ్విచ్చిన సెక్క–సావుకోరు లాక్కోకుండా సూడు.

ఆ సెక్క నా కొడుక్కి మిగుల్చు బాబూ" అని గుండె పగిలేట్టు ప్రార్థించేడు.

తర్వాత పులిపాలు తాగి పెరిగిన మనిషిలా ఇంటికి వచ్చేడు సింహాచలం. అప్పుడే నిద్రలేచిన కొడుకుని ఎత్తుకొని గుండెలకి హత్తుకున్నాడు.

ఒంటికి సబ్బు రాసుకున్నట్టు పిల్లడిని ఒళ్ళంతా రాసుకున్నాడు.

కిచకిచ లాడేడు పిల్లడు.

కిలకిల్లాడింది రాజమ్మ.

"ఇయ్యాలేటీ ఇంతానందంగున్నావ్?" అంది.

"నిన్ను చూసి...." నవ్వేడు.

అబ్బో నువ్వూ నవ్వగలవే! నవ్వులకేంగాని గిన్నెలో గెంజినీళ్ళున్నాయి. బుట్టలో ఉల్లిపాయుంది. నువ్వు గెంజి తాగి ఆడికీపొయ్యి. నాన్నీళ్ళకెళతాను. పన్లోకి బేగెల్లాల" అంటూ కుండ పట్టుకుని వెళ్ళిపోయింది రాజమ్మ.

# 42

సింహాచలం తన యింట్లో ఉన్న బిందెలూ, చెంబులూ, ముంతలూ, గిన్నెలూ, గింజలూ, గడ్డీ, గేదే, పెళ్ళాం మెళ్ళో పుస్తెలూ వగైరా అన్నీ అదివరకే అమ్మేసేడు.

అంచేత యిప్పుడు అమ్మడానికి రాజమ్మ కాకుండా, ఆమె చెవి దిద్దులు మిగిలేయి. అవి అమ్మితే రూ.50/–లు వచ్చేయి. ఆమె కొడుకు చెవులకున్న బంగారం కాడలమ్మితే మరో పది వచ్చేయి. తన యిల్లు పెద తాత కొడుకు జోగులుకి రు. 600/–లుకి అమ్ముతానని ఎగ్రిమెంటు రాసి రు. 300/–లు ఎడ్వాన్సు పుచ్చుకున్నాడు సింహాచలం. మూడువందలు గవర్రాజుకి ఇచ్చి మిగతాది కేసుపై ఖర్చులకి ఉంచేడు.

కేసు విచారణ ఆరంభమైంది.

పిటిషన్లకని మూడు రూపాయలు పుచ్చుకున్నాడు ప్లీడరు గుమాస్తా.

కేసు విచారణ జరుగుతోంది.

సాయంత్రం వరకూ విచారణ అయి కేసు వాయిదా పడింది.

"ముగ్గురం వున్నాం కాఫీకి" కోర్టు జవాన్లు మూడు రూపాయలు పుచ్చుకున్నారు.

ఏ కారణం చెప్పకుండా మూడు రూపాయలు పుచ్చుకున్నాడు బెంచి గుమస్తా.

కేసులో మొదటే సింహాచలం సాక్ష్యం చెప్పాలి.

అతను కోర్టు హాల్లోకి వెళ్ళేసరికి...

గాలి వేడెక్కి పల్చబడి ఎంత పీల్చినా చాలడం లేదు.

కోర్టులో ఉన్న వాళ్ళంతా చావు పందిట్లో మాట్లాడు కుంటున్నట్టు అతి నెమ్మదిగా మాట్లాడుకుంటున్నారు.

గోడనున్న వాచీ కొట్టిన గంటలు "ఉరి చూడ్డానికి ఊరి ప్రజలంతా రావచ్చునహో" అని కొడుతున్న కోట గంటల్లా ఉన్నాయి.

ఎటున్నా తగుల్తాయి నా సమ్మెటపోట్లు అన్నట్టు చప్పుడు చేస్తూ ఆడుతోంది దాని పెండ్యులం.

జెడ్జిగారి ముందున్న బెంచి గుమస్తా జీవంలేని మరమనిషిలా ఉన్నాడు.

జెడ్జీగారి డయాస్‌కి చుట్టిన ఎర్రగుడ్డ మంటపొరలా వుంది.

హాలు మధ్యనున్న బార్ టేబిల్ ఆపరేషన్ బల్లలా వుంది. దాని చుట్టూ ఉన్న ప్లీడర్లు–పేషెంటుకి మత్తుమందు ఇవ్వకుండా ఆపరేషన్ చేసే డాక్టర్లలా ఉన్నారు. వారి వెనకనున్న గుమస్తాలు–కత్తులు అందించే అసిస్టెంట్లలా ఉన్నారు.

కోర్టులో ఉన్న ఇతర ప్రజ పేషెంటు ఎలా చచ్చిపోతాడో చూడ్డానికి వచ్చిన ప్రేక్షకుల్లా ఉన్నారు.

సింహాచలం ఆ ఆపరేషను చేయించుకునే పేషెంటులా ఉన్నాడు.

కోటూ, పంచా, నామాల్తో ద్వారం దగ్గర నిల్చున్న డవాలు బంట్రోతు మాట్లాడకుండా పీక పిసికేసే మూగ ఖూనీకోర్లా ఉన్నాడు.

ఆఫీసులో బల్లమీదకు వంగి పనిచేయుచున్న గుమాస్తాలు వెన్నెముకల్లేని మనుషుల్లా ఉన్నారు.

కోర్టు కాంపౌండులో....

కిందటేడు జూదంలో బేకరీ పోయిన వాళ్ళా ఉన్నాడు బిస్కట్లు అమ్ముకుంటున్న ముసలాడు.

కొబ్బరిబొండాలు అమ్ముకుంటున్న వాడు చేతిలో కత్తితో కసాయి వాళ్ళా ఉన్నాడు.

వచ్చే ఏడు ఈ సోడాలు కూడా అమ్ముకోలేనేమోనని భయపడుతున్నట్టున్నాడు – సోడాలు అమ్ముకునేవాడు.

అడుక్కుంటున్న ముష్టివాడు–ఈ కోర్టు చేసిన పకీర్నే అన్నట్టు అధికారంతో అడుక్కుంటున్నాడు.

అక్కడున్న మొగాళ్ళలో చాలామంది మంచు పులుల్లా మెత్తగా ఉన్నా భయంకరంగా ఉన్నారు. కొంతమంది కబేళాకి వచ్చిన మేకపిల్లలా ఉన్నారు. మిగిలినవాళ్ళు–"నువ్వు కాలు కదపొద్దు. మేం, మేకని తెస్తాం" అని పులికి ప్రామీస్ చేస్తున్న పులి పూజార్లలా ఉన్నారు.

సింహాచలం పేరు మూడుసార్లు పిలిచేడు కోర్టు జవాను. తను చస్తాడో బతుకుతాడో తెలియక ఆపరేషనుకి వెళుతున్న పేషెంటులా కాకుండా తాను నిశ్చయంగా చచ్చిపోతానని నమ్మిన పేషెంటులా నడిచి వెళ్ళేడు సింహాచలం.

"బోనెక్కు" అన్నాడు జవాను.

బోనెక్కేడు సింహాచలం. అతనికి వెంటనే "నాకు కేసొద్దు, భూ మొద్దు, ఏంవీంవద్దు" అని గట్టిగా అరిచి పారిపోదామని

పించింది. ఆ సంగతి కనిపెట్టినవాడిలా కోర్టు జవాను బోను తలుపులు వేసేడు.

అతని కెదురుగా ఉన్న పురుషోత్తంగారు అతనివైపు చూడనైనా లేదు. తనని కనీసం శత్రువును చూసినట్టు చూసినా అతనంత బాధపడి ఉండేవాడు కాదు. కాని తాను రావణాసురుడు అయినట్టు–ఈ "ఓ తృణమా!" ప్రవర్తన అతన్ని మరీ నీరసపెట్టింది.

విచారణ జరుగుతున్నంతసేపూ ఏం జరుగుతుందో తెలియలేదు సింహాచలానికి. వెంకట్రావు తనని అడిగిన ప్రశ్నలకి జ్వరంలో పలవరిస్తున్న మనిషిలా జవాబు చెప్పేడు.

తర్వాత పురుషోత్తంగారు లేచేరు.

సింహాచలానికి ఒక్కసారి కూర్చోవాలనీ, మంచినీళ్ళు తాగాలనీ అనిపించింది. అంతవరకు తలదించుకున్న పురుషోత్తంగారు అతన్ని కళ్ళజోడుమీది అద్దాలలోంచి ఒకసారీ, అడుగు అద్దాలలోంచి ఒకసారీ చూసేరు.

సింహాచలానికి గొంతుక ఎండిపోయింది. కడుపూ, గుండెలూ పొడిగా అయిపోయేయి.

పురుషోత్తంగారు ఆ వేళ మంచి హుషారుగా ఉన్నారు. ఆ ఉదయం ఆయన పని చేసుకుంటున్నప్పుడు తన టేబిలుకి అవతలవేపు పని చేసుకుంటున్న విమల పాదలమీద తన ఆకు చెప్పుతో ఉన్న పాదం ఉంచేరు. విమల తన చెప్పుతోనే తన పళ్ళు రాలగొట్టలేదు. ఆమె పాదం చాలా సేపు చాలా విషయాలు మాట్లాడింది–టెలీఫోన్ ఆకు చెప్పు.

పురుషోత్తంగారు జెడ్జీగారివేపు చూసి కొంచెం నవ్వేరు.

జెడ్జీగారు నవ్వలేదు.

సింహాచలానికి పీక ఎండిపోతోంది.

"చూడూ" అన్నారు పురుషోత్తంగారు–మృదువుగా. ఐనా అతని టోన్ గండుపిల్లి ఎలక పిల్లని మృదువుగా "చూడూ" అన్నట్టుంది.

ఎలకపిల్ల చూసింది.

చూడమన్న గండుపిల్లి–ఎలక పిల్లకి ఏమీ చూపించలేదు.

"ఊఁ! నీ పేరేవిఁటన్నావ్?"

"................"

"సింహాచలవేఁకదూ?"

"............. (నువ్వు నువ్వేనా?? మరోడివా? అన్న ప్రశ్నకి ఎవరు మాత్రం ఏం జవాబు చెప్తారు?)

"ఏవిఁటలా వెర్రిచూపులు చూస్తున్నావ్? ఏం కావాలి నీకు?"

"మంచినీళ్ళు"

"మంచినీళ్ళా" మూర్ఛవచ్చినంత ఆశ్చర్యపోయేరు పురుషోత్తంగారు.

"ఊఁ"

"ఏవిఁటీ నీకు మంచినీళ్ళు కావాలా?" ప్రాణం పోయేటంత ఆశ్చర్యపోయేరు పురుషోత్తంగారు. అతనితోపాటు అతని జూనియర్లూ, గుమస్తా, ఇతర ప్లీడర్లూ, కోర్టు జవానులూ, బెంచి గుమస్తా, ఇంకా కోర్టులో వున్నవాళ్ళూ అందరూ "పబ్లిక్ కోర్టులో అతను కల్లు తాగుతానన్నంత" ఆశ్చర్యపోయేరు. వాళ్లందర్నీ చూసిన సింహాచలం పెద్దలముందు పచ్చి బూతులు ఆడినవాళ్ళా సిగ్గుపడ్డాడు.

"పాపం, అతనికి మంచినీళ్ళియ్యి" అన్నారు జడ్జీగారు జవానుతో. జవాను సింహాచలాన్ని వరండాలోకి తీసుకెళ్ళి మంచినీళ్ళు ఇచ్చేడు. సింహాచలానికి ఆ నీళ్ళు జ్వరం నోటికి కాలకూటవిషంలా రుచించేయి. అవి నిజంగా కాలకూట విషం అయితే బాగుండుననీ, తాను అవి తాగి చచ్చి పోతే యింకా బాగుండుననీ అనిపించిందతనికి.

మంచినీళ్ళు తాగేక అతన్ని మళ్ళీ బోనెక్కించేరు. అతనిచేత మళ్ళీ ప్రమాణం చేయించేరు. అతనికి ముందు సిగ్గూ, తర్వాత భయం వేసేయి. ఆ తర్వాత యింకా భయం వేసింది. పురుషోత్తంగారు అడిగిన ప్రశ్నలకి అతను "సంధి" వచ్చిన వాళ్ళా ఏవో సమాధానాలు చెప్పేడు.

అతని గొంతు ఎండిపోతున్నాది. కంఠస్వరం బొంగురుగా, పొడిగా చచ్చిపోయినవాడు మాట్లాడుతున్నట్టు, తనకే అసహ్యం వేస్తున్నాది. కాని–అతను మళ్ళీ మంచినీళ్ళు అడగలేదు.

క్రాస్ ఎగ్జామినేషన్ మధ్యలో ఏదో హింట్ యివ్వడానికి విమల పురుషోత్తంగారి చెయ్యి పట్టుకొని లాగింది. ఆ తర్వాత పది మంది సింహాచలాల్ని పకోడీలు నమిలినట్టు నమిలీ గలిగిన బలం పురుషోత్తంగారికి వచ్చింది.

"నువ్వు ప్రతి ఏడూ షావుకారు సురేంద్ర కొట్టుకే బెల్లం వేస్తావ్ కదూ?"

"సిత్తం"

"ప్రతి ఏడూ ఎంత బెల్లం వేస్తావు?"

"తెల్దు"

"అంటే తూకం కాదు. ధర."

"తెల్దు"

"పోనీ తూకం చెప్పగలవా?"

"తెల్దు"

"పోనీ యీ తనఖా పెట్టేక, ఏ సంవత్సరంలోనయినా ఎంత బెల్లం వేసేవో – తూకంగాని, ధరగాని చెప్పగలవా?"

"సెప్పలేను."

"అసలు ఏ సంవత్సరమయినా ప్రోనోటుమీద ఎంత బదులు పుచ్చుకున్నావో తెలుసా?"

"తెల్దు"

"బెల్లం డబ్బుతో ఆ ప్రోనోటు బాకీ షావుకారు తీసుకుంటాడు. నిజమేనా?"

"నిజమే."

"అదిగాక తనఖా బాకీ కింద ఏ సంవత్సరమయినా ఎంత తీసుకున్నావో తెలుసా?"

"తెల్దు"

"పోనీ అలా డబ్బు అతను తీసుకున్నట్టు రశీదులు పుచ్చుకున్నావా?"

"లేదు."

"అలా డబ్బు తీసుకున్నప్పుడు సాక్షు లెవరయినా ఉన్నారా?"

"తెల్దు"

"పోనీ ప్రతి ఏడూ బెల్లం డబ్బు నీకు ఎంతో కొంత యిస్తాడా?"

"ఇస్తాడు."

"తనఖా తర్వాత ఏ సంవత్సరమయినా నీకు బెల్లం డబ్బు ఎంతిచ్చాడో చెప్పగలవా?"

"తెల్దు"

"నీకు డబ్బులు యిచ్చినప్పుడూ, నీ దగ్గర డబ్బు పుచ్చుకున్నప్పుడూ, షావుకారో, అతని గుమాస్తాలో, ఎకౌంటులో రాసుకుంటారా?

"రాసుకుంటారు."

"అలాగే నీవు బెల్లం తోలినప్పుడు కూడా…"

"సిత్తం."

"షావుకారి ఎకౌంట్లో తప్పేమయినా ఉందేమో చెప్పగలవా?"

"తెల్దు"

"నువ్వు తనఖా బాకీ కింద ఎంత కట్టేనంటావ్?"

"తెల్దు"

"అసలు కింద ఎంత కట్టేవ్?"

"తెల్దు"

"వడ్డీకింద ఎంత కట్టేవ్?"

"తెల్దు"

"అసల్నువ్వు కానీ కూడా కట్టలేదంటాను."

"తెల్దు"

ఒక్కదెబ్బకే గేదిగొడ్డుని ఎగరేసేసిన పులిలా కూర్చున్నారు పురుషోత్తంగారు. ఆ తర్వాత కనకం, మరొకడూ, సింహాచలం తరపున సాక్ష్యం చెప్పేరు. ఆ తర్వాత షావుకారూ, అతని గుమాస్తాలూ తోలు బైండ్ల ఎకౌంటు పుస్తకాలతో సాక్ష్యం చెప్పేరు. కాని వాళ్ళు తమ దగ్గర మూడు రకాల ఎకౌంటు పుస్తకాలు ఉంటాయని చెప్పలేదు.

ప్లీడర్లు ఆర్గ్యుమెంట్లు చెప్పేరు. ఇది "నాకు తెల్దు కేసు" అన్నారు పురుషోత్తంగారు ఎగతాళిగా.

తీర్పు షావుకారి పక్షం అయింది. తర్వాత సింహాచలా నికి ఉన్న ఒక్క ఇల్లూ జప్తు చేయించేడు సురేంద్ర. "ఈ ఇల్లు నేను కొనుక్కున్నాను" వాదించాడు జోగులు.

"నువ్వు సింహాచలం గాడి పెత్తాత కొడుకువి. అంచేత సింహాచలం దగ్గర కొనుక్కొని ఉండవు. ఒక వేళ కొన్నానామ్ కే వాస్తే ఎగ్రిమెంటు రాయించుకొని ఉంటావ్ గాని డబ్బిచ్చి ఉండవు. ఇచ్చినా నీ ఎగ్రిమెంటు చెల్లదు" అన్నారు కోర్టువారు.

సింహాచలం ఇల్లు కోర్టు వేలంలో నూరు రూపాయలకి భూమి తనఖా బాకీ కిందకొనేసేడు షావుకారు. ఆ తర్వాత స్వాధీనం చెయ్యమని కోర్టులో అర్జీపెట్టేడు. రేపో, ఎల్లుండో సింహాచలాన్ని గెంటేసి ఆ ఇల్లూ, భూమీ, షావుకారుకి యిచ్చేస్తారు.

# 43

రాత్రి చాలా చీకటిగా ఉంది.

ఊరి మధ్యనున్న సింహాచలం మిద్దెయిల్లు, ఊరి అవతల ఉన్నట్టు చాలా హెల్ఫ్‌లెస్‌గా, ఒంటరితనంతో కుళ్ళిపోతున్న జబ్బు మనిషిలా ఉంది.

బైట చీకటి గాలి, చనిపోతున్న ఏనుగ నిట్టూర్పులా బరువుగా ఉంది.

గుడిసెలో చీకటి కాళరాత్రి పెనుచీకటిగా ఉంది.

ఆ యింట్లో గుడ్డిదీపం రక్తపు బిందువులా ఉంది.

ఆ పక్కనే ఉన్న గిన్నెలూ, పళ్ళేలూ చాలా రోజుల్నుండి అన్నం మొహం ఎరగనట్టు ఉన్నాయి.

గోడల్ని వేలాడుతున్న మాసిన గుడ్డలు చింకితోళ్లులా ఉన్నాయి. గోడని చేరబడి మోకాళ్ళమీద మొహం పెట్టుకొని కూర్చున్న సింహాచలం జబ్బుపడిన అడవి మనిషిలా ఉన్నాడు.

అతని కెదురుగా మోకాళ్ళమీద గెడ్డం ఆనించి కూర్చున్న రాజమ్మ యౌవనవతిలా లేదు. వృద్ధురాల్లా కూడా లేదు. అప్పు డామెలో "స్త్రీత్వం" లేదు.

దీపం ఎర్రకాంతిలో కెంపుల్లామెరుస్తున్న ఆమె కంటికోసం కన్నీటి చుక్కలు రక్తపు బిందువుల్లా ఉన్నాయి.

ఆమె, ప్రాణంలేని బొమ్మలా కాకుండా ప్రాణం పోయిన అందకత్తెలా ఉంది.

ఆమె మొహంలోని ప్రశాంతత–వెయ్యేళ్ళు తపస్సు చేసి సాధించిన శాంతికి ప్రతిబింబమైనా కావచ్చు, లేక తన ఒక్క కొడుకునీ తనే పూడ్చవలసి వచ్చిన ఒక ముష్టితల్లి ఏడవలేని నిస్సత్తువా కావచ్చు.

తెల్లవారితే ఉరితీయబడే ఖైదీల్లా వాళ్ళు ఒకరితో ఒకరు మాట్లాడుకోలేక పోతున్నారు. రేపు లేని మనుషుల్లా – మరువతగ్గ "నిన్న"ను మరువలేని అభాగ్యుల్లా–నిజాన్ని నమ్మలేని దౌర్భా గ్యుల్లా విలవిల్లాడి పోతున్నారు.

తలదించి తాము పూజచేస్తున్న దేవుడు తల ఎత్తేసరికి రాక్ష సుడై పోయినట్టు వారినోట మాటలేదు. బతుకు బరువు మోయ లేని వాళ్ళల్లా–చావు కోరుకుంటున్న వాళ్ళల్లా –మానసికంగా ముసలైపోయేరు వాళ్ళు.

"రేపేం చెయ్యాలి" అన్న ప్రశ్న తలచుకుంటేనే భయమేసి పైకి అనలేకపోతున్నారు.

మొదటిసారి ముద్దు పెట్టుకున్న ఆ చెట్టు వెన్నెల నీడా – తొలి సారి సరిగంగ స్నానాలు చేసిన ఆ కలువల చెరువూ–తమ ఒక్క కొడుకూ పుట్టిన యీ చల్లని యిల్లూ, కన్నతల్లిలాంటి పుట్టిన ఊరూ–అక్కలూ, అన్నలూ అయిన స్నేహితులూ–యివన్నీ ఎలా వదలడం.

తమ రంగులకలలు కరిగి కల్లలై పోయేయి. తమ బంగారు కాపురం బుగ్గి అయిపోయింది.. మంచితనపు వెన్నెట్లో వెండి గిన్నెలా కనిపించిన తమ జీవితం పగటి వెలుగులో సత్తుగిన్నెలా మారిపోయింది. ఎదుటి వారి మంచితనంలో నమ్మకం "విస్కీ" మత్తు వదిలినట్లు వారిని వదిలేసింది.

# 44

ఆ మర్నాడు–

సరుగుడు తోట పాటలో ఎండవేడి తెలియడం లేదు. ఏట్లో ఎండ వెండిముక్కల్లా తేలుతోంది.

ఏట్లో ఎగురుతున్న చేపలు–వెన్నెల చేపల్లా ఉన్నాయి.

ఏటి అంచు ఇసుక రేణువులు కన్నీటితో కడిగిన ఆణి ముత్యాల్లా ఉన్నాయి.

గట్టున చేరిన గులకరాళ్ళు రుద్రాక్షపోగుల్లా ఉన్నాయి.

ఏటి మధ్య తీర్థపురాళ్ళు స్నానం చేస్తున్న అడవి ఏనుగుల్లా ఉన్నాయి.

గట్టునున్న పొగడచెట్టు పువ్వుల చాటు పెళ్ళి కూతురిలా ఉంది.

ఊరికి దూరంగా ఏటిగట్టున బస్సాగుతుంది. సింహాచలాన్నీ, రాజమ్మనీ, కొడుకునీ బస్సుకి దిగబెట్టడానికి వాళ్ళ స్నేహితులు వచ్చేరు.

బస్సు వచ్చేస్తోంది.

"వెళ్ళొస్తానాదినే?"

"ఈ తోవనే కాపరానికి తీసుకొచ్చేను. ఈ తోవనే అంపకం ఎట్టేస్తున్నాను. దిక్కుమాలినదాన్ని" ఒక ముసల్ది ఏడ్చింది.

"ఉత్తరం ముక్క ఏస్తూ వుండు" ఒకమ్మ ఏడుపును మాటగా మార్చింది.

"జాగర్తొరే బాబు" తమ్ముడు వయసువాడు తండ్రిలా జాగర్త చెప్పేడు.

"ఇయ్యేళ మీరూ, రేపు మేవూం..... ఛీ-ఛీ-ఎదవ బతుకులు" ఉడుకుతున్న రక్తం అకస్మాత్తుగా నీరై పోయింది.

"రాములోరిలాంటివాడ్ని అంపేసినాడు బాగుపడ్డు" ఒక ముసలి వాడు శపించేడు.

"బూఁవిఁ పోనాదికాని మానం పోనేదు. గురుతుంచుకోండి. ఎప్పుడన్నా వస్తూ వుండండొరే."

"ఛ ఛ. ఏడక రాజమ్మా, సీతమ్మోర్లాంటి దానివి నీకేటి! కష్ట కాలం వొచ్చినాదంతే– వనవోసానికెల్తున్నావ్. పట్టాభిషేకానికే మళ్ళీ రాడం."

"నువ్వున్న కాడ బంగారం పండుద్ది."

"బాబొరె బొట్టుడు జాగర్త."

తను కట్టుకున్న వెండి తీగలలేసు గూట్లో గండుపిల్లి దాక్కున్నట్టూ, తను ఎగిరెగిరి అందుకున్న వింత పువ్వులో విషపు పురుగులున్నట్లూ తన కాళ్ళ కింద భూమి తనని సగం మాత్రమే మింగినట్టూ, తను ప్రతిష్టించిన దేవుడు దెయ్యం అయిపోయినట్టూ, తను నాటిన చేలో పాములు పండినట్లూ అనిపించింది సింహాచలానికి.

బస్సు ఆగింది. దాని యంత్రపు గుండె కొట్టుకుంటూనే వుంది.

"బాబూ తల్లికాక యిద్దరు. నేలని నిలబడతాను బాబూ? కాళీలేదనీకు. ఈళ్ళకి కన్నకడుపులాంటి ఉన్న ఊళ్ళోనే కాళీ లేకపోనాది బాబ్బాబు. రచ్చించు."

సాగనంపడానికి వచ్చిన చేతులు గాల్లోకి లేచి దీవించేయి.

"నువ్వెళ్ళే తోవ సల్లగా ఉండాలి తల్లీ."

ప్రపంచం అంతా ఏడుస్తున్న చేతుల్తో నిండిపోయినట్టనిపించింది.

"కడుపున పుట్టినదాన్ని పంపినప్పుడు కూడా నాకిలా అనిపించలేదే తల్లీ."

"ఇలాంటి సూడ్డానికే ఇంకా బతికున్నాను."

"డబ్బు జాగర్తొరే."

బస్సు కదిలిపోయింది.

"తల్లి పేగు" తెగిపోయినట్లయింది రాజమ్మకి.

# 45

ఆ హాల్లో గ్లాస్ టాప్ టేబిలుమీద అతి పల్చని "డ్రింక్" గ్లాసులు తేనె నిండిన గాజు పువ్వుల్లా ఉన్నాయి. ఆ టేబిలు మీదున్న ఏష్ ట్రే ఒక వివస్త్ర అయినదీ యౌవనవతి ఆకారంలో ఉంది. ఆ యువతి ఒక పాలరాయిలాంటి గాజు దిమ్మమీద కూర్చుని వెనక్కి కాస్త వంగి నేలమీద చేతులు ఆనుకొని ఉంది. ఆమె కాళ్ళు పూర్తిగా కాక, అతికొంచెం చాపుకొని మాన రక్షణ చేసుకుంటూంది.

ఆ హాలు గోడలు గులాబీల రసం రాసినట్టున్నాయి. ఆ హాల్లో ఎక్కడా ఎలక్ట్రిక్ లైట్లు కనపడకపోయినా, పై కప్పులోంచి వెన్నెల మూటలు విప్పి గుమ్మరిస్తున్నట్టు "కన్‌సీల్డు లైటింగు" ఉంది. హాల్లో ఒకవార కరడుకట్టిన వెన్నముద్దలా రిఫ్రిజిరేటర్ ఉంది. దాని పక్కన పడుకున్న కుక్క దూది బొమ్మలా ఉంది.

ఆ హాల్లో సోఫాలు నిద్రపోతున్న అడివి జంతువుల్లా ఉన్నాయి. తూర్పుగోడని ఉన్న రెండు ఆయిలు పెయింటింగులోనూ ఒకటి జాలరులు సముద్రంలోంచి చేపలవల పట్టుకొని వస్తున్న దృశ్యం. కాని ఆ దృశ్యం కేవలం బేక్ గ్రౌండుగా మాత్రం ఉపయోగపడుతోంది. ఫోర్ గ్రౌండులో ఒక చేపకళ్ళ చిన్నది మినీ శారీ కట్టుకొని నెత్తిమీద చేపల గంపతో జాలరి వాళ్ళవేపు కాకుండా ప్రేక్షకులవేపు బెదురు చూపులు చూస్తోంది. రెండో పెయింటింగ్ ఒక పాశ్చాత్య యువకుడిది.

".................. ఇదీ నా కథ" అంటూ జాన్ జాన్సన్ సిగరెట్టు వెలిగించి అగ్గిపుల్ల కొంచెంసేపు చేత్తో పట్టుకొని దాని మంటను చూస్తూ నిలబడ్డాడు. ఆ తర్వాత యాష్ ట్రే పిల్ల బ్రెస్టు ఒకటి నొక్కేడు. రెండో బ్రెస్టు మూతలా విడింది. అందులో అగ్గిపుల్ల పారేసేడు అతను. గాజు పిల్లలో అగ్గిపుల్ల వెలుగున్నంతసేపూ ఆ అమ్మాయి ఎర్రటి బేథింగ్ డ్రస్ వేసుకున్నట్టు కనిపించింది. అగ్గిపుల్ల అరగానే అమ్మాయి డ్రస్ విప్పేసుకుంది.

"ఐ యామ్ సారీ....టెరిబ్లీ సారీ, జే.జే." అన్నాడు కథవిన్న రిచర్డ్.

కథ చెప్పిన జే.జే. కి నలభైఐదు సంవత్సరాలు ఉండొచ్చు. అతని శరీరం పాతికేళ్ళ శాండో శరీరంలా కండలు తిరిగి ఉన్నా, మొహం మాత్రం అరవై ఏళ్ళ మనిషి మొహంలా మడతలు పడి ఉంది. అతని బ్రౌన్ జుత్తు దువ్వినా దువ్వనట్టే ఉంది.

అతని ఎత్తు ఆరడుగులు దాటి ఉండబట్టి అతను యెక్కువ లావు కనిపించడు. అతని తెల్లని అతి పొట్టి నిక్కర్లోంచి మాంసం స్తంభాల్లా తొడలు కనిపిస్తున్నాయి. అతని పువ్వుల "స్లేక్" చేతులు ఆడవాళ్ళ జాకెట్ చేతుల్లా అతి పొట్టిగానూ, అతి బిగువుగానూ ఉన్నాయి. అతని గుండెలమీద అతి దట్టంగా ఉన్న వెంట్రుకలు "స్లేక్" మెడలోంచి కనిపిస్తున్నాయి. అతను ఎప్పుడూ కళ్ళజోడు వాడనట్టు ముక్కుమీద నొక్కులు లేవు. అతని కళ్ళు అతి మెరక గానూ, ఆరోగ్యంగానూ ఉన్నా, అతని మనసులో ఏదో చెప్పలేని చిరాకు ఉన్నట్టు, అతను గుడ్డివాడిలా-ఎప్పుడూ ఎదురుగానే చూస్తున్నాడు. అతను అందగాళ్ళల్లోనే జమ. అతను బాగా సక్సీడ్ అయిన బిజినెస్‌మన్‌లా కనిపిస్తాడు. అతన్ని చూడగానే మంచి వాడనీ, ఒకవేళ చెడ్డవాడయితే తాను చెడ్డవాడయినందుకు గర్వపడడనీ అనిపిస్తుంది. అంతేకాకుండా అతను పులితో యెదురుగా వెళ్ళి దెబ్బలాడే వాడిలా ధైర్యంగా ఉన్నా, ఏదో వెనక దెబ్బకు జడుస్తున్నవాడిలా ఉన్నాడు. అతన్ని హీరోగా చూడదలుచుకుంటే కష్టాలలో ఉన్న హీరోలాగా, విలన్‌గా చూడదలుచుకుంటే కేవలం పరిస్థితులు చేసిన విలన్‌లాగా కనిపిస్తాడు.

అతని ఎదురుగా ఉన్న రిచర్డ్‌మాత్రం యుద్ధాలు నడపడానికే పుట్టిన మనిషిలా అతి చలాకీగానూ, అతి ఆరోగ్యంగానూ ఉన్నా, అతను ప్రాణం పుచ్చుకున్నా, పోగొట్టుకున్నా అది తన దిన చర్యలో ఒక సామాన్య భాగంగా పరిగణించే మనిషిలా యెప్పుడూ నవ్వుతూ ఉన్నా, అతని కళ్ళు అవసరమయితే నిప్పులు కురిపించగలవు. అతనికి ఏ బట్టలైనా అతి సహజంగా వుంటాయి అని చెప్పడానికే అన్నట్టు అతను పాశ్చాత్యుడైనా ప్రస్తుతం తెల్ల పైజామా, సిల్కు లాల్చీ మాత్రం వేసుకున్నాడు. అతను తొడుక్కున్న స్లిప్పర్లు కార్లలో తిరిగేవారి కోసం ప్రత్యేకంగా తయారు చేసినట్టు అతి పల్చగా ఉన్నాయి. ఎదుటివారు చెప్పింది శ్రద్ధగా వినడం అతని అలవాటు అవడంవల్ల అతను అతి తక్కువ మాట్లాడేవాడిగా కనిపించినా, అవసరం ఐతే గంటల తరబడీ మాట్లాడగలడు. అతను జే.జే. గ్లాసులో ఉన్నది వంపేసి, కొంచెం విస్కీపోసి, అందులో ఏమీ కలపకుండా "డ్రింక్ దిస్" అంటూ గ్లాసు అందించేడు. జే.జే. గ్లాసులో ఉన్నది అంతా తాగేసి, గ్లాసు టేబిలుమీద పెట్టి, గొంతుక ఎడమచేత్తో రాసుకున్నాడు.

వారి సంభాషణ ఇంగ్లీషులోనే జరుగుతోంది.

"ఐతే ఏం చేద్దామనుకుంటున్నావ్?" అడిగేడు రిచర్డు తన అభిప్రాయం దాచుకునే మనిషిలా కాకుండా ఎదుటివాడి అభిప్రాయం తెలుసుకునే ఆతృతతో.

"ఏంవీం ఆలోచించలేదు. లేకపోయేను. ముందు ఎవరికీ తెలీకుండా మన దేశం వదిలెయ్యాలనిపించింది."

"పాపం...."

"............"

"మంచిపని చేసేవు ఈ దేశం రావటం. ఇది విచిత్రమయిన దేశం. ఇక్కడ మామూలు వాళ్ళకి పిచ్చి ఎక్కిపోతున్నట్టు అనిపించినా, పిచ్చివాళ్ళకి మనశ్శాంతి దొరుకుతుంది.

"నీ సలహా ఏంవింటి?"

"ఇక్కడ కొన్నాళ్ళుండు."

"ఉంటే ఏంవింటి లాభం?"

"నువ్వు ఆశించినదాన్ని బట్టి ఉంటుంది లాభం! దేవుడితో ఇంటర్వ్యూ కావాలంటే నీకు దొరక్కపోవచ్చు. కాని మనల్ని బాధించే విషయాల్ని మనసులోంచి నెట్టెయ్యడానికి అనేక మార్గాలు."

"ఏంవింటవి?"

"గేటుతీసి బైట కాలు పెట్టు. కాలుపెట్టి కళ్ళుతెరు. నీగురించి నువ్వు ఆలోచించలేవు. నీ బాధలు దుర్భరం కావచ్చు. నీ కష్టాలు నీ శత్రువుకి కూడా రాకూడదని కోరుకునేటన్ని ఉండొచ్చు. కాని అన్నీ మరిచిపోతావు వీళ్ళని చూస్తే."

"అదెలా సాధ్యం?"

"నే నిక్కడ ఆరేళ్ళయి ఉంటున్నాను. వీళ్ళ భాషలు కూడా కాస్తో కూస్తో మాట్లాడగలను. వీళ్ళ బట్టలు కట్టుకోగలను. వీళ్ళ తిండి తిని ఉండగలను. కాని ఒక్కనాడూ వీళ్ళని అర్థం చేసుకోలేకపోయేను."

"వీళ్ళని అర్థం చేసుకోడానికి నేనిక్కడికి రాలేదు."

"నేనూ రాలేదు. మనం ఏ పనిమీద ఇక్కడికి వచ్చినా వీళ్ళ సమస్యలు మనల్ని తురకదయ్యాల్లా పట్టుకుంటాయి. కళ్ళు ముసుకున్నా-తెరచినా-వీళ్ళే నన్ను వెంటాడుతారు."

"ఏంచేత?"

"చూసేవా, అప్పుడే నీలో కుతూహలం పుట్టుకొచ్చిందీ. వీళ్ళు ఇలా ఉండడానికి కారణాలు వెదుకు. నీకో జీవితం చాలదు

రిసెర్చికి. ప్రతిదేశంలోనూ ఉన్నట్టే వీళ్ళలోనూ అతి మంచి వాళ్ళున్నారు. అతి చెడ్డవాళ్ళు ఉన్నారు. ఋషులున్నారు. రౌడీలున్నారు. తపస్వులున్నారు. తంగరాపుళ్ళ వెధవలున్నారు. ప్రజా సేవకులున్నారు. ప్రజలచేత సేవ చేయించుకునే వాళ్ళున్నారు. కొవ్వెక్కిన ధనవంతులున్నారు. తిండి మొహం చూడని దరిద్రులున్నారు. కాని మిగతా దేశాలకీ, ఈ దేశానికీ చాలా భేదం వుంది. ఎక్కువ తారతమ్యం వుంది."

జే.జే. ఆతృతతో చూసేడు.

"ఆ వ్యత్యాసం ఏమిటంటే–ఇక్కడ మంచివాళ్ళ మంచి, వారికీ ఎదుటి వారికీ కూడా ఉపయోగపడదు. కాని చెడ్డవాళ్ళ చెడుపు దేశాన్నంతా విషపు పొగలా చుట్టేస్తుంది. ఇక్కడవాళ్ళ అభిప్రాయాలకీ– నమ్మకాలకీ–నడవడికీ– ఆదర్శాలకీ – ఆంతర్యాలకీ– మాటలకీ– చేతలకీ–ఎక్కడా సంబంధం వుండదు.

వీళ్ళకి ప్రజాస్వామ్యంలో నమ్మకం వుంది. కాని ప్రజాస్వామ్యం పునాదులు దొలిచే కులతత్వం వీళ్ళని తురకదయ్యంలా పట్టుకుంది. కొత్తవాడు యెవడైనా రాగానే వీళ్ళడిగేది "నువ్వు హిందువ్వా? సాయిబువా? సాయిబువైతే, షియావా? సున్నీవా? హిందువ్వైతే బ్రాహ్మడివా? ఆ బ్రాహ్మడివే? బ్రాహ్మడైతే వైదికివా? నియోగివా? కాకపోతే కమ్మవా? రెడ్డివా? రాజువా? కొంపతీసి హరిజనుడివా?" అని.

వీళ్ళు మనుషుల్ని మనుషులుగా చూళ్ళేరు. ఈ జాతివాడుగానో, ఆ కులంవాడుగానో–మాత్రం చూడగలరు. ఆ సంగతి వీళ్ళకీ తెలుసు. వీళ్ళ వ్యాధులు వీళ్ళకి తెలియకపోవు. వాటి మందులు కూడా వీళ్ళకి తెలిసి ఉండాలి. వీళ్ళ కులతత్వ వ్యాధికి, ప్రజాస్వామ్యం ఆపత్యం. తెలుసుండే కావాలనే చేస్తారు. ఆపథ్యం వల్ల వ్యాధి ముదురుతుందని తెలిసే చేస్తారు. ఎంచేత? ఆలోచించు. జవాబు దొరకదు.

నా ప్రైవేట్ థీయరీ ఏంవిఁటంటే వీళ్ళు బానిసలుగా ఎక్కువ కాలం బతికేరు. బానిసకి నీతుల మీద మోజు జాస్తీ. బానిసత్వం ఒక భయంకరమయిన వ్యాధి. ఘోరమయిన జాడ్యం. ఆ రోగి తన రోగం గురించి తప్ప ఆలోచించలేడు. నాకే ఆరోగ్యం ఉంటే ఇది చేద్దును. అది చేద్దును. ఈ కొండ ఎక్కేస్తాను. ఆ సముద్రం ఈదేస్తాను. ఇలా ఏవో వెర్రివెర్రి ఆశయాలు – పెట్టుక్కూర్చుంటాడు. తీరా వ్యాధిపోగానే వ్యాధితోపాటు ఆదర్శాలు కూడా పోతాయి. నీతి నిందుకుంటుంది. అవినీతి అందంగా కనబడుతుంది. దాని ఫలితం ఏంవిఁటి? హిపోక్రసీ.

వీళ్ళుచేసే ప్రతి పనిలోనూ అదే. అదే ప్రతి మాటలోనూ, వేసే ప్రతి పథకంలోనూ. నీకు కనిపించేది హిపోక్రసీ! హిపోక్రసీ!! హిపోక్రసీ!!!

వీళ్ళలో ప్రతివాడికీ అహింస, ఆదర్శం. కాని పోలీసువాడు లేందే పిల్లల్ని బడికి కూడా పంపరు. వీళ్ళకి ఇండస్ట్రియలైజేషన్–జాతీయత ఆదర్శం. కాని ప్రొఫెసరు మొదలు ఫకీరు వెధవవరకూ వీళ్ళకి ఫారిన్ బ్లేడ్లు కావాలి. ఫారిన్ రేడియోలు కావాలి. ఫారిన్ వాచీలూ–ఫారిన్ కెమేరాలూ–ఫారిన్ కార్లూ, ఫారిన్ పెళ్ళాలూ కావాలి. వీధిలోకెళ్లు. వెళ్ళి, ఒక జత అమెరికన్ "సాక్సు" చేత్తో పట్టుకుని ఆడించు; తిరుపతి కొండమీద ముష్టివాళ్ళలా ఎంతమంది నిన్ను చుట్టేస్తారో చూడు. వాళ్ళెవరూ ముష్టివాళ్ళు కారు. ప్రొఫెసర్లు, స్టూడెంట్లు, డబ్బున్నవాళ్ళూ, చాలా డబ్బున్న వాళ్ళూ, డాక్టర్లు, పేషెంట్లు, లాయర్లు, పార్టీలు – ఒకరేవింఁటి. అన్ని రకాలవాళ్ళూ, అన్ని ముఠాలవాళ్ళూ, అన్ని వర్గాలవాళ్ళూ, అన్ని మతాలవాళ్ళూ నిన్ను పట్టుకుంటారు. వాళ్ళు ముష్టివాళ్ళు కాదనడం పొరపాటు. వాళ్ళు ఇంటలెక్చువల్ బెగ్గర్సు. ప్రతివాడూ ముందు నువ్వు ఉట్టినే ఇస్తావేమోనని చూస్తాడు. లేకపోతే చవగ్గా ఇస్తావేమోనని చూస్తాడు. నువ్వు పరాగ్గా ఉంటావేమోనని చూస్తాడు. నీ దగ్గర్నుంచి అవి కొట్టెయ్యడానికి ఇంకే మార్గము లేకపోతే నీ దగ్గర కొంటాడు. ఐదు రూపాయల వస్తువు పదిచ్చి కొంటాడు."

"అంత హిపోక్రట్సా?"

"హిపోక్రసీ వీళ్ళ తిండి, వీళ్ళ ఊపిరి, వీళ్ళ గమ్యం, వీళ్ళ రోగం, వీళ్ళ మందు, వీళ్ళ తనువు, వీళ్ళ ఆత్మ. హిపోక్రసీలోనే పుడతారు. హిపోక్రసీలోనే పెరుగుతారు. హిపోక్రసీలోనే బతుకుతారు. హిపోక్రసీలోనే చస్తారు.

వీళ్ళకి కలర్ బార్ లేదంటారు. వీళ్ళు యు.ఎన్.ఒ. లో ఇచ్చే స్పీచెస్ చదువు. అవి చదివితే అబ్రహం లింకన్ కూడా అసూయపడతాడు. కాని వీళ్ళలో ఉన్నంత "కలర్ బార్" నేను సౌత్ ఆఫ్రికాలో కూడా చూడలేదు. మన నీగ్రో తెల్లదాన్ని పెళ్ళాడతానని కూర్చోడు. కాని యిక్కడ నల్లదాని మొగుడూ నల్లవాడి పెళ్ళాం తెల్లగానే ఉండాలి.

వీళ్ళలో హిపోక్రసీ ఎంతుందో, తెలివి తక్కువ కూడా అంతుంది. వీళ్ళని చూస్తే అసహ్యం, జాలీ రెండూ కలుగుతాయి.

ఈ జిల్లా చీల్చమనీ, ఆ కులం వాళ్ళకి ఉద్యోగాలివ్వవద్దనీ, వీళ్ళు నిరాహారదీక్ష చేస్తారు. చచ్చేవరకూ చెయ్యమన్నా చేస్తారు. కాని మామూలుగా ఆకలేస్తున్న ముష్టి వెధవకి అన్నం మెతుకు పడెయ్యరు. డాబుకి పదిలక్షలు యిచ్చి ఆస్పత్రి కట్టించినవాడు, పేవ్‌మెంటుమీద చస్తున్న ముష్టివాడి వేపు మరోసారి చూడడు.

వీళ్ళకు దేశం అంటే ప్రేమలేదు. మనుషులంటే సానుభూతి లేదు. వీళ్ళకున్నంత స్వార్థం అడవి జంతువుల్లోనే చూసేను. పులి తన పిల్లల్ని తినేస్తుందట. పాము తన గుడ్లని తినేస్తుందట. వీళ్ళూ అంతే. వీళ్ళలో పదేళ్ళయి గాలి పీల్చకుండా బతుకుతున్న వాళ్ళున్నారు. ముప్పై ఏళ్ళయి మంచినీళ్ళన్నా తాగకుండా బతుకుతున్న వాళ్ళున్నారు. మీ సీక్రెట్స్ ఏఁవిటంటే చస్తే చెప్పరు.

వీళ్ళలో ఫిక్స్‌డ్ ప్రిన్సిపల్స్ కూడా నా కెప్పుడూ కనిపించ లేదు. అమెరికాలో సెటిల్ అవుతావా, రష్యాలో సెటిల్ అవుతావా అంటే "ఎక్కడైనా ఫర్వాలేదు. ఈ దేశం వదుల్తే చాలు" అంటారు.

వీళ్ళు దొరల్ని పొమ్మన్నారు. గాని వీళ్ళకింకా దొరసాన్లు కావాలి. దొరల సామానులు కావాలి. దొరసాని పిలుస్తే గవర్నమెంటు సీక్రెట్సు కూడా అమ్మేస్తారు ఆఫీసర్లు. ఫారిన్ సెంట్లకే వగలుపోతారు వీళ్ళ ఆడవాళ్ళు....."

"వీళ్ళంటే నీకు బొత్తిగా గౌరవం ఉన్నట్టులేదే" అడిగేడు జేజే.

"ఉంది. గౌరవంకాదు, జాలి నే నింతసేపూ మాట్లాడింది వీళ్ళలో చదువుకున్న వాళ్ళ గురించి, వీళ్ళలో ముందుకొచ్చేం అనేవాళ్ళ గురించి. కాని, వీళ్ళది మైనారిటీ. మెజారిటీకి అక్షర మ్ముక్కరాదు. అన్నంముద్ద ఎరగరు. అడవుల్లో ఉండడం చేతకాక ఊళ్ళో ఉంటున్న జంతువుల్లా కనిపిస్తారు వాళ్ళు నాకు.

పల్లెటూరు వెళ్ళు. గడ్డి తక్కువ కోసేదని తండ్రిచేత చీకట్లో చావుదెబ్బలు తింటున్న పిల్లడి కళ్ళలో భయం చూడు. జబ్బు మొగుడి పక్కన కూర్చున్న ఆడదాని కళ్ళలోని నిరాశచూడు. కుష్టు ముష్టివాడి కురుపుల మీద ముసురుతున్న ఈగల కాళ్ళ రక్తం చూడు. పసిపిల్లడి చేత చదివించకుండా గడ్డి గోకిస్తున్నం దుకు సిగ్గుపడాలని ఆ తండ్రికి తెలీదు. మొగుడి జబ్బుకి మంది ప్పించవలసిన బాధ్యత గవర్నమెంటుదని ఆ పెళ్ళానికి తెలీదు. తనూ మనిషినేనని ఆ కుష్టువాడు ఎప్పుడో మరచిపోయేడు.

రేపురా నాతో-నా కంపెనీలో పనిచేస్తున్న ఆఫీసర్ల ఇళ్ళకి తీసికెళతాను. ఐదు నిముషాల్లో తన కొడుక్కి అమెరికాలో ఉద్యోగం చూడమని నిన్ను అడిగేస్తుంది ఆఫీసరు పెళ్ళాం. ప్రస్తుతానికి పార్కర్ పెన్....."

'నా బాధలు నాకున్నాయి. నాకు వీళ్ళని కలుసుకోవాలని లేదు."

"నేను ఉట్టినే లెక్చరివ్వడం లేదు. నీ వ్యథ మరిచిపోవ డానికి ఇక్కడ ఎన్ని మార్గాలున్నాయో చెప్పడానికే ఇవన్నీ చెబుతున్నాను."

"నా బాధ అంత సుళువుగా పోయేది కాదు. ఇంతకీ సంఘ సేవ నాకు చేతకాదు."

"అయితే నీకు మిగిలినవి- రెండే మార్గాలు, మొదటిది సన్యాసం."

"రెండోది?"

"ఒక గీతని చిన్నదిచెయ్యాలంటే దానిపక్కన పెద్దగీత గియ్యడం ఒక మార్గం."

"అంటే?"

"అర్థం అయ్యేటట్టు చెప్తాను. ఏ దేశంలో అయినా, ఏ కాలంలో అయినా బాధలు మరిచిపోవడానికి పువ్వుల బాటలూ – రాజ మార్గాలూ–మధిర–మదవతి–వాటికి హషిష్–మారిజు అనా – కూడా కలిపితే రేపు నీకు ఉరితీస్తారన్న విషయం కూడా మరిచి పోగలవు."

"నాకు వాటిమీద మనసులేదు."

"సహజమే. పాపిననుకుంటున్నావు. అంచేత పవిత్రమైన నాన్సెన్సు నచ్చడంలో ఆశ్చర్యంలేదు."

"ఎప్పుడూ పాపాలు చెయ్యని పసివాడినని అన్లేదు. కాని ప్రస్తుతం...."

"ఆదదంటే నీ ఉద్దేశం ఏవిఁటి?"

"ప్రత్యేకం ఏం లేదు."

"మామ్ చదివేవా?"

"ఎక్కువ చదవలేదు. అతని రెయిన్ కథ బాగా నచ్చింది."

"ఆడది దేవుఁడ్ని కూడా పక్కలోకి లాగేసుకోగలదనే కదూ ఆ కథ!"

"ఔను కాని అదొక్కటే కాదు. ఆత్మహత్యలో కూడా రకాలున్నాయని చెప్తుంది ఆ కథ."

"అంటే?"

"అంటే" జే.జే. ఆగేడు సిగరెట్ వెలిగించటానికి. "ఆత్మహత్యల్లో కూడా సాహసమైనవి. పిరికివీ ఉన్నాయని చెప్తుంది ఆ కథ. నీకు గుర్తుందో లేవో ఆ కథలో...ఆ ఫాదర్ ... మిషనరీ ఒక బజారు ఆడదానికి లొంగిపోతాడు. లొంగి పోయేక తన పాపాన్ని తెలుసుకుంటాడు. తెలుసుకున్నాక బతక దల్చుకోడు. తన పీక తన చేత్తోనే కోసేసుకుంటాడు. అతని చావులో అతని దర్జా, అతని ఔన్నత్యం కనిపిస్తాయి. అతను సముద్రంలోకి గెంతిచావొచ్చు. నిద్రమాత్రలు మింగి చావొచ్చు. తుపాకీతో పేల్చుకొని చావొచ్చు. కాని అలా చావడు. దర్జాగా, హుందాగా, సాహసంగా మనోబలంతో తన పీక తనే కోసేసు కుంటాడు–అంటే బతుక్కి భయపడి చావటం లేదని మనకి చెబుతాడు."

"నాకు గుర్తులేదు!"

"ఇందాక దేవుడ్ని పక్కలోకి లాక్కునే ఆడదాని గురించేనా అని ఎలా అడగ్గలిగేవు?"

"మామ్ కథలన్నీ అలాటివే కాబట్టి."

"బాగుంది నీ వాదన."

"నా వాదన గురించి తర్వాత చూసుకోవచ్చుగాని నువ్వేం చెయ్యదల్చుకున్నావో చెప్పు."

"నీ సలహా కావాలి. నేను నీకు చిన్నప్పటినుంచీ తెలుసు".

"నువ్వు పిచ్చి ఎత్తిపోయే పరిస్థితుల్లో ఉన్నావు. ఔనా?"

"నిజం".

"నీకు సంఘసేవ మీద మోజు లేదు."

"కరెక్ట్."

"ఆడది వగైరా పెయిన్ కిల్లర్స్ కూడా వద్దు నీకు."

"ఒద్దు."

"మరైతే మిగిలింది ఒకటే."

"ఏఁవిఁటి!"

"సన్యాసం. మతం దేవుఁడ్ని చూపిస్తుందో లేదో తెలీదు కాని చిన్న బాధల్ని పోగొడ్తుంది. అందుకే దాన్ని నల్లమందంటారు."

"నా ఉద్దేశం కూడా అదే. ఏదైనా ఆశ్రమంలో చేరాలని ఉంది."

"ఉంటుంది. ఉండడంలో ఆశ్చర్యం లేదు. ఏ ఆశ్రమవాఁ అన్నదే ప్రశ్న. నాకు ఆశ్రమాల్లో అనుభవం లేదు కాని యిక్కడ వాటిక్కూడా కొదవ లేదని చెప్పగలను. బైటికెళ్తే సంసార్ల కంటే సన్యాసులే ఎక్కువ ఉన్నారేమో అనిపిస్తుంది. రోడ్డుమీదికి వెళ్ళు. నీ మొహం చూసి నువ్వెవరో చెప్తాడొకడు. నీ చెయ్యిచూసి నీ తండ్రి గురించి చెప్తాడింకొకడు. మీ ఇద్దర్నీ చూడకుండా, మీ యిద్దరి గురించీ తన చిలకచేత చెప్పిస్తాడు మరొకడు.

ఈ సన్యాసులు నీళ్ళల్లో నిప్పు పుట్టిస్తారు–నిప్పు తినేస్తారు. వీళ్ళలో ఒకడు గాజు గ్లాసులే తిని బతుకుతాడు. ఇంకోడు నైట్రిక్ ఏసిడ్ మాత్రం తాగుతాడు. కొంతమంది ఎయిర్ కండిషన్డు బంగళాల్లో ఉంటే, కొందరు రాతి గుహల్లోంచి బైటికి రానేరారు. కొందరు కాలు కదపరు. కొందరు కారులో తప్ప కదలరు. నేను ఎప్పుడూ వీళ్ళని గురించి పట్టించుకోలేదు. అసలు నాకు దేవుళ్ళోనే నమ్మకం తక్కువ. వీళ్ళ ఆశ్రమాలు కూడా గమ్మత్తుగానే ఉంటాయి. కొంతమంది అడవుల్లో ఆకులు కప్పుకొని వుంటే, కొన్ని ఆశ్రమాల్లో "బార్లూ", "బ్రోతల్సూ" లేవని అనలేం.

ఈ మధ్య ఎవరో అన్నారు. ఇక్కడికి దగ్గర్లోనే అంటే నూరు మైళ్ళలో ఎవరో స్వామి ఉన్నాడట. రేపు వాకబు చేద్దాం. కాని మతం మందు వంటబట్టేవరకూ యీ మందు వదలకు. ఆ గ్లాసిలా యియ్యి" అంటూ అతని గ్లాసు నింపేడు రిచర్డు.

# 46

దబ్బపళ్ళూ, దానిమ్మ గింజలూ కలిపి చేసినట్టున్నారు స్వామి. అతని వంటికి స్త్రీల సౌకుమార్యం. శాండోల దార్ఢ్యం కూడా ఉన్నాయి. వారి శరీరం జిడ్డులేని వెన్న రాసినట్టు మెరిసి పోతోంది. బంగారం, వెండి కలిసిన వింత లోహంలా వుంది వారి శరీరపు మెరుపు. వారి మొహం మీద చిరునవ్వు గాలికి వూగే చిరు పూవులా తొణికిసలాడుతోంది. వారి కళ్ళల్లో పసివాడి అమాయకత్వం, 'వృద్ధుల అనుభవపూరిత ఔదార్యం – సమ పాళ్ళల్లో ఉన్నాయి. వారు కొన్ని ఫోజుల్లో పాతికేళ్ళ యువ కుడిలాగా, మరికొన్ని ఫోజుల్లో శతవృద్ధులాగా కనిపిస్తారు. వారి దుడుకు నడకను చూసి, వారికి పాతిక ఏళ్ళు ఉంటాయని ఊహించిన కొందరు వారి ఉపదేశాలు విన్నాక–భూమి వయస్సు లాగే వారి వయసు కూడా నిర్ణయించడం అసాధ్యం అని గ్రహించేరు.

స్వామివారి మతం ఎవరికీ తెలీదు! వారు క్రీస్తునీ, కృష్ణుడ్నీ ఒకే భక్తితో కొలుస్తారు. వారు ఇస్లాము సూక్తులనూ, గురు గ్రంథ్‌నీ, పార్శీమత గ్రంథాలనీ, భగవద్గీతనీ సమన్వయం చేసి బోధించగలరు. వారు క్రిష్టియన్లకి క్రీస్తులా కనిపిస్తే, హిందువులకి కృష్ణుడిలా కనిపిస్తారు. కాని ఈ మధ్యనే ఒక పెద్ద ముత్తయిదువకి వారు అచ్చం ఆదిశక్తిలా కనిపించేరట.

వారి ప్రయాణానికి విదేశీ కార్లు, సిటీస్‌లో ఉండటానికి ఎయిర్ కండిషన్లు బంగళాలు ఉన్నాయి. వారు చిన్నప్పుడు తపస్సు చేసినచోట కట్టిన ఆశ్రమంలో మాత్రం సంవత్సరంలో చాలా నెలలు విధిగా వుంటారు.

వారి ప్రత్యేకత–ఎవరివద్దా కానీ పుచ్చుకోక పోవడం, వారి పేరు మీదుగా ఏ ధర్మకార్యం ఎవరు జరిపినా అందుకు అయిన ఖర్చంతా సరికొత్త నోట్ల రూపంలో యివ్వడం. వారివద్ద నోట్లు అచ్చుకొట్టే యంత్రం ఉందని కొందరు అనడమే కాని, ఎవరూ ఋజువు చెయ్యలేదు. యంత్రాన్ని పట్టుకోడానికి వచ్చిన పోలీసు అధికార్లకి వారు కత్తనోట్లమీద "ఆటోగ్రాఫ్" చేసి యిచ్చి "శంకించో–స్తుతించో వచ్చేరు. రాక వృధాపోదు" అని ఆశీర్వదించేరుట. ఆ వెంటనే వాళ్ళలో పెద్దాఫీసరు కూతుర్ని ఎన్నేళ్ళ నుంచో వదిలేసిన మొగుడు తీసుకొనివెళ్ళి బుద్ధిగా కాపురం చేస్తున్నాట్ట. మరో యిద్దరు చిన్న ఆఫీసర్లకి అనుకోకుండా ప్రమోషన్లు వచ్చేయిుట.

వారి మహిమలు వారి అనుమతిలేకుండా ఒక భక్తుడు అచ్చువేసేడు. వారి పేరు తల్చుకుంటే ప్రాణాలు పోయినవారూ, పాము కరచినవాళ్ళూ అంతా లేచి కూర్చుంటారట. వారిని ఒక వారం కొలిచిన వారికి మెడికల్ సీట్లూ, మోటారుకార్లూ, నిధులూ, నిక్షేపాలూ, పెర్మిట్లూ, పద్మశ్రీలూ, పెళ్ళిళ్ళూ, విడాకులూ – ఏవి కావాలంటే అవి లభ్యమవుతాయట.

వారు మాత్రం తన భక్తులకు జరిగిన ఉపకారాలకి తన బాధ్యత లేదని స్పష్టంగా చెపుతూనే ఉంటారు.

వారిని పూజించిన వారికంటే దూషించిన వారికే కోర్కెలు వేగంగా తీరుతున్నాయని కూడా వినికిడి!

స్వామి ఎవరో–వారిది ఏ ఊరో ఎవరికీ తెలియదు. వారి మాతృభాష ఏదో ఎవరూ తెలుసుకోలేనంత ధారాళంగా వారు అన్ని దేశీయ భాషలూ మాట్లాడుతారు. వారికి ఇంగ్లీషులో కూడా మంచి ప్రవేశం ఉంది. ఇప్పటికి రమారమీ ముప్ఫై సంవత్సరాల క్రింద వారి ప్రస్తుత ఆశ్రమస్థానంలో వారు తపస్సు చేసుకుంటుండగా ఎవరో వేటకి వెళ్ళి అడవిలో దారి తప్పడిపోయిన కొంతమంది పెద్ద ఆఫీసర్లు చూసేరట. ఆ చూడ్డం కూడా చాలా గమ్మత్తుగా జరిగిందట. అరణ్యం చీకట్లో–లేనివారిని వెతుక్కుంటున్న ఆఫీసర్లకీ, చీకట్లో, గాల్లో–ఏదో మెరుస్తూ కనిపించిందట. వాళ్ళు దగ్గరికి వెళ్ళి అగ్గిపుల్ల వెలిగిస్తే ఆ వెల్తుర్లో అంతర్ముఖులైన స్వామీ, స్వామి మెడలో చుట్టుకున్న నల్లనాగూ, నాగు తలలో మణి కనిపించేయిుట. అప్పుడా నాగేంద్రుడే గాలి ఊది అగ్గిపుల్ల ఆర్పేడట. చీకట్లో మెరుస్తూ కనిపించింది ఆ పాము మణేనట. ఆ తర్వాత ఆ ఆఫీసర్లు పాముకు జడవకుండా, స్వామిని చూడ్డానికి సూర్యోదయం అయ్యేవరకూ కూర్చున్నారట. వారు కూర్చుని వుండగానే ఒక పులివచ్చి స్వామి పాదాలు నాకి వెళ్ళిపోవటం కూడా చూసేరట. తెల్లవారేక వారు స్వామి దర్శనం చేసుకొని తమ ఊళ్ళోకి తిరిగి వచ్చేసరికి వాళ్లల్లో ఒకరికి కలెక్టరుగా ప్రమోషన్ ఆర్డరు వచ్చి ఉందట. అంచేత వారు స్వామికి ఒక చిన్న ఆశ్రమం కట్టించి ఇచ్చేరట. తర్వాత క్రమేపీ ఆ ఆశ్రమం చుట్టూ ఒక ఊరు పెరిగింది.

స్వామి దగ్గర సమ్మోహనాస్త్రం ఉందని కొందరంటే, వారికి "మాస్ హిప్నోటిజం" వచ్చుని కొందరంటారు. ఏదైనా ఫలితం ఒక్కటే. వారిని పూజించడానికో, నిందించడానికో ఒక్కసారి వెళ్ళినవారు వారి భక్తపరమాణువులై పోతారు. వారి పర్సనాలిటీ కొంతమందిని ఆకర్షిస్తే వారి జీవిత వైఖరి ఇంకొంత మందిని ఆకర్షిస్తుంది. వారు ఎవరివేపూ తిన్నగా చూడరు. మైలుదారం దాటివున్న దేన్నో అశ్రద్ధగా చూస్తున్నట్టుంటుంది వారి చూపు...వారు సాధారణంగా ఎవరితోనూ కలిపించుకొని మాట్లాడరు. వారికి వృథా చర్చలు అంటే ఇష్టం ఉండదు.

"దేవుడు ఉన్నాడా" అని ఎవరేనా అడిగితే?

"ఉండాలని నీ కోరికా? ఉన్నాడని భయమా? ఆశా?" అని మాత్రం శలవిస్తారు.

"దేవుఁళ్ళేకపోతే పాపభీతి అక్కర్లేదుగా!" అని ప్రశ్నిస్తే...

"దేవుడు లేకపోతేనే తోటి మానవులపట్ల నీ బాధ్యత పెరుగుతుంది నాయనా!" అని సమాధానం ఇస్తారు.

"దేవుణ్ని నమ్మితే నమ్ము. నమ్మకపోతే తప్పులేదు. నీ అంతరాత్మని మించిన దేవుఁడు లేడు. ఏది మంచిదనితోస్తే అది చెయ్యి" అన్నదే వారి ఉపదేశం.

వారి దినచర్య చాలా సిస్టమేటిక్‌గా ఉంటుంది.

వారు తొలికోడితో లేచి స్నానధ్యానాలు పూర్తి చేస్తారు. ఆ తర్వాత తమ ఆవుపాలు తామే పితుకుతారు. తమ ఆశ్రమానికి అంటి ఉన్న భూమి తామే తమ అనుచరుల సహాయంతో సాగుచేస్తారు. వచ్చిన పంట తమ అనుచరులకి పంచి ఇచ్చేస్తారు. పండిన పళ్ళు మాత్రం భక్తులకి ప్రసాదంగా ఇస్తారు. వారు పాలు మినహా ఇతర ఏ ఆహారం పుచ్చుకోరు. నెలకో రెండు నెల్లకో తమంతట తాము ఒకసారి మాట్లాడతారు. కాని వారిని ఎప్పుడు ఎవరు ప్రశ్నించినా జవాబు చెబుతారు.

వారు ప్రతిమారూ కొత్త కరెన్సీ నోట్లు ఇవ్వడం తప్పిస్తే-ప్రత్యక్షంగా ఇతర మహిమలు చూపించరు.

# 47

ఆ సాయంత్రం చీకట్లో భక్తులమధ్య వేదికపై కూర్చున్న స్వామి చీకటి కొలనులో బంగారు తామరపువ్వులా మెరిసి పోతున్నారు.

వారి చుట్టూ ఉన్న భక్తులు-బతుకులోని మమకారాలనీ, చావులోని అంధకారాన్నీ ధిక్కరించిన వారిలా ఏదో వింత ఆనం దంలో ఉన్నారు. భక్తులలో ఆడా మగా అన్ని రాష్ట్రాలవారూ వున్నారు. కొద్ది సంవత్సరాలై విదేశీయులు కూడా వారి ఆశ్ర మంలో ఉంటున్నారు. విదేశీయుల సౌకర్యం కోసం వారి ఉపన్యా సాలూ-సంభాషణలూ ఎప్పటికప్పుడు తర్జుమా అవుతూ ఉంటాయి.

ఆవేళ స్వామి ఉపనిషత్తుల మీద ఉపన్యసించేరు. ఉపన్యాసా నంతరం స్వామి చర్చకు అనుమతిస్తారు.

శిష్యులూ, భక్తులూ, ఆధ్యాత్మిక సందేహాలు నివృత్తి చేసుకో వలసిన సమయం అది.

స్వామి కనువిప్పి ఎదురుగా ఉన్న యువకుడిని "ఏం కావాలి బాబు" అన్నారు.

యువకుడి కళ్ళు కారంపడ్డట్టు ఆవేశంతో మండి పోతు న్నాయి. దేవుడు కనిపిస్తే దుయ్యపట్టుకునేట్టు ఉన్నాడు.

"అసలు దేవుడున్నాడా స్వామీ" కుట్టబోయే నాగులా సందే హాన్ని బైట పెట్టేడు భక్తుడు కానివాడు.

స్వామి చిరునవ్వు నవ్వేరు.

బృందం నవ్వింది.

"నీ ఉద్దేశ్యం ఏఁవిఁటి బాబూ!" స్వామి ప్రేమగా అడిగేరు.

"లేదు. ముమ్మాటికీ లేదు. ఉంటే సత్యానికి సమాధి – పాపానికి పట్టం-ఈ ఆకలి చావులు-ఈ ఇంటలెక్ట్యువల్ ఎన్‌క్రొచ్‌మెంట్సు.... ఇవన్నీ చూస్తూ ఊరుకుంటాడా?" ఉక్కిరి బిక్కిరి అయిపోతున్నాడు అమాయకుడు.

"ఆవేశపడకు నాయనా! లేదు. నువ్వు భయపడే భగవంతుడు లేదు."

"మరి నన్ను ఇప్పుడు-నేను...." వాక్యం పూర్తి చేయలేక పోయేడు.

"భగవంతుడివి కా." ఆశీర్వదించేరు.

'వహ్వా' అన్నారు భక్తులు.

మరొక వృద్ధుడు అడిగేడు. "కిందటి జన్మలో ఎవర్ని స్వామీ నేను"

"ఈ జన్మలో ఎవరు బాబూ నువ్వు?"

"నేను....అంటే నేనే"

"నిన్ను నువ్వు తెలుసుకో గలిగేవు. చాలు బాబూ" అని ఆగిపోయేరు.

తర్వాత ఎవరూ ప్రశ్నించలేదు.

"ఇంకేమయినా సందేహాలు..."

"మీ సన్నిధిలో సందేహమా?"

"అయితే లేద్దాం" అని లేచేరు స్వామి. భక్తులు కూడా లేచేరు.

"కమాన్ జే.జే." అన్నారు స్వామి.

జే.జే. ముందుకు వచ్చేరు.

అతని మెడలో రుద్రాక్షలు ఉన్నాయి. నుదుట వీభూతి రేఖలు ఉన్నాయి. మొలని కాషాయ లుంగీ వుంది. భుజంమీద అదే రంగు గుడ్డ ఉంది. అతని శరీరచ్ఛాయ లేత రాగి రంగులో వుంది. అతని కళ్ళల్లో పశ్చాత్తాపమే కాకుండా-తను నైతికంగా బలాఢ్యుడౌతానన్న విశ్వాసం కూడా ఉంది. కాస్త గాలి తగ్గిన రబ్బరు బెలూన్‌లా అతని ముఖం ముడతలు పడి ఉన్నా-శరీరం కంచుకండలా దృఢంగా ఉంది. అతను తనకు తన దేశంలో దొరకని శాంతిని వెదుక్కుంటూ స్వామి ఆశ్రమంలో చేరి మూడు నెలలు అయ్యింది. అతన్ని వెన్నంటిన పాపాల పాములు, తనను

వదలని ధనకాంక్షా–ఆశ్రమం అవతలే నిలిచి పోయేయి. అతను మానసికంగా తనను తాను పోల్చుకో లేనంత మారిపోయేడు. తన మనసుని చుట్టిన అంధకారపు ఇనుపతెరలు తెగి, తొలగి తనలో జ్ఞానజ్యోతి వెలిగినట్టూ, తనలో మూడు తలల రాక్షసుడు చచ్చిపోయి నట్లూ అతను ఫీలవటం మొదలు పెట్టేడు.

"ఇప్పుడెలా ఉంటోంది?" ఇంగ్లీషులోనే అడిగేరు స్వామి.

ఆకలితో చచ్చిపోబోతున్న కుక్కపిల్ల తనకు పాలుపోసిన వాడిని చూసినట్టు కృతజ్ఞతతో చూసేడు జే.జే. స్వామివేపు.

ఇద్దరూ ఆశ్రమం విడిచి నడుస్తున్నారు.

"రెండుమూడు రోజుల్లో నేను పెద్ద ప్రయాణం చెయ్యవచ్చు" అన్నారు స్వామి.

"నేను కూడా రావచ్చా?"

స్వామి తన ముఖ్య శిష్యుడు రంగనాథాన్ని తప్ప ఇంకెవర్నీ ఎక్కడికీ తీసుకు వెళ్ళరు. వారు ఎప్పుడు ఏ ఊరు వెళతారో ఎన్నాళ్ళు ఎక్కడ ఉంటారో ఎవరికీ–అంటే రంగనాథానికి కూడా తెలియదు.

"వద్దు, నువ్వు ఆ అలసట తట్టుకోలేవు."

"మీరు లేకపోతే ఒంటరితనాన్ని భరించలేను."

"నీకు తెలియదు, నాతోవస్తే ఉన్న బాధలు."

అగరువత్తుల వాసనకి ఉక్కిరి బిక్కిరి అయిపోయిన వాడిలా అమాయకంగా చూసి "మీరు వద్దంటే సరే. నేను ఆ ఊసు ఇంక ఎత్తను" అన్నాడు జే.జే.

# 48

మర్నాడు ఉదయం బాలభానుడు ఆశ్రమవాసులని వెచ్చని చేతులతో తట్టేడు.

వారిని వాస్తవికంలోకి నెమ్మదిగా తీసుకు వెళ్తున్నాయి పక్షుల పాటలు. ఎక్కడో ఒక గోవు ఆదిశక్తిని తలచుకొని "అంబా" అని హృదయాంతరాళం నుండి పిలిచింది.

అలసిపోయిన దేవనర్తకి ఒళ్ళు విదిలించుకుంటే రాలిన పన్నీరులా చల్లగాలికి చెట్లు కదలి మంచుబొట్లు నేలనిపడ్డాయి.

దినచర్యలు దైవ సాంగత్యానికి అంతరాయంలా గబగబా పూర్తి చెయ్యబడ్డాయి ఆశ్రమంలో.

ప్రార్థన అనంతరం స్వామితో–జే.జే. వారి కుటీరానికి వెళ్ళేడు.

వట్టివేళ్ళతో బంగారు పిచ్చుకలు కట్టిన గూడులా చల్లగా, చక్కగా ఉంది ఆ కుటీరం.

కుటీరం మధ్య రంగు ముగ్గు, పగడాల పువ్వులా ఉంది. రాక్షసాన్ని జయించిన దైవ స్వరూపులులా ఒక వార స్వామి పులితోలు మీద కూర్చున్నాడు.

వారికి ఎదురుగా కూర్చున్న జే.జే. వారిని తన అజ్ఞానంతో విసిగించ లేకపోతున్నాడు.

"భగవంతుడు ఈ ప్రపంచాన్ని ఎందుకు సృష్టించేడు?"

"జవాబు భగవంతుడే చెప్పగలడు నాయనా."

"అడుగుదామంటే కనిపించడే?"

"ఉన్నాడనుకుంటే కనిపిస్తాడు."

"అతన్ని చూడ్డానికి ఏం చెయ్యాలి?"

"కోరిక ఉంటే చాలు."

"నాకు కోరిక ఉంది."

"దానికి బలం చాలదు."

"మీకు ఎలా తెలుసు?"

"నీకు భగవంతుడు కనిపించకపోవడం వల్లనే."

ఈలోగా దేవుడిలా కాకపోయినా దేవతలా వచ్చి ద్వారం దగ్గర నిలబడింది "రాణీ".

నెలవంక నిలువునా సాగి నడచి వచ్చినట్టు అయింది.

"లోపలికి రావచ్చా" పువ్వులా మధురంగా అడిగింది.

"నువ్వా! రా." అన్నారు స్వామి.

ఆమె నవ్వులో కూతురి చనువు మాత్రమే కనిపిస్తుంది. ఆమె స్వామి పాదాలకి నమస్కరించి జే.జే. కి ఎదురుగా కూర్చుంది.

"వీరు రాణి. ఇతను జాన్ జాన్సన్. అంతా జే.జే. అంటారు." పరిచయం చేసేరు స్వామి.

"ఉత్తరం రాయకుండానే వచ్చేవే?" స్వామి ఎవరినీ సూటిగా ప్రశ్నించరు.

"చూడాలనిపించింది."

"నేను ఇక్కడ లేకపోతే!"

"కన్న తండ్రి నీడ పుట్టింట ఎప్పుడు ఉంటుంది. దాని చల్లదనం ఉంటుందని వచ్చేను."

"మాటకారివే"

"సృష్టికారుల ముందు....."

"అంతా క్షేమమా?" పొగడ్తని మధ్యలో ఆపేసేరు స్వామి.

"మీ ఆశీర్వాదం వల్ల."

"నేను రేపు ఊరికెళుతున్నాను."

"నేను వచ్చిన వెంటనే మీరు వెళ్ళిపోతారన్న విచారంకన్నా మీరు వెళ్ళేలోగా నేను వచ్చేనన్న సంతోషమే జాస్తీగా ఉంది."

స్వామి చిరునవ్వు పెద్దదైంది.

కొంత సేపయ్యాక రాణి అంది! "మేం త్వరలో ఒక ఫేక్టరీ పెడదామనుకుంటున్నాం. దానికి శంకుస్థాపన తమరు తమరే ..... చెయ్యాలి."

"ఈ శంఖుస్థాపనలు, గృహప్రవేశాలు ... సన్యాసిని .... నాకు అలవాటు లేదు."

"మంచి అలవాట్లు ఆలస్యంగా అయినా చేసుకో వచ్చుగా" ఇంగ్లీషులో అంది రాణి. ఆవిడ చొరవ చూసి ఆశ్చర్య పోయేడు జే.జే.

"ఏ అలవాటైనా మంచిదో కాదో అంత త్వరగా తేల్చు కోలేను." స్వామి సందేహించేరు.

# 49

అదే రాత్రి స్వామి వెళ్ళిపోయేరు. ఎప్పుడు వెళ్ళేరో, ఎక్కడకు వెళ్ళేరో, ఎప్పుడొస్తారో ఎవరికీ తెలియదు.

మర్నాడు ఉదయం లేచిన జే.జే.కి స్వామి త్వరలో వెళ్ళి పోతారన్న ఆలోచన బాధించింది. కానీ స్వామి వెళ్ళిపోయేరని తెలిసేక తన తల్లే తనకు ద్రోహం చేసినట్టు ఫీలయ్యేడు.

ఆ ఉదయం అతను తన గది వదల్లేదు. ఆశ్రమానికి వచ్చేక అతని మాటలూ, అలవాట్లూ, అన్నీ మారిపోయేయి. కాఫీ, టీ, సిగరెట్లు, మాంసం, డ్రింక్స్ అన్నీ మానేసేడు. మానెయ్యడం అంత కష్టం కూడా అనిపించలేదు. ఆ ఉదయం అలవాటు ప్రకారం ఎవరో ఆశ్రమవాసి అతని గదిలో గ్లాసుతో పాలు పెట్టేడు. గ్లాసు నోటి దగ్గర పెట్టుకున్న జే.జే.కి పాలు హితవు కాలేదు. గ్లాసు టేబులు మీద పెట్టేసేడు. అనుకోకుండా స్వామి వెళ్ళిపోయిన దిగులువల్లే తనకి ఆకలి లేదనుకున్నాడు. ఆ మధ్యాహ్నం తిండి ఫర్వాలేదు. సయించింది.

సాయంత్రం గది వదిలి బైటకు వచ్చేడు జే.జే. అంతవరకూ తనదిగా కనిపించిన ఆశ్రమం ఎంతో కొత్తగా కనిపించింది. అక్కడ తిరుగుతున్న ఆశ్రమవాసులు అపరిచితుల్లా కనిపించేరు. తనది కాని దేశంలో ఉన్నానన్న విషయం మొదటిసారిగా గుర్తుకు వచ్చింది. స్వామి వచ్చేస్తే....మళ్ళీ తల్లి వొడిలో పిల్లడిలా ఎంతో తృప్తిగా ఉంటుంది.

అప్రయత్నంగా అతను ఆఫీసువేపు నడిచేడు. తోవలో మను షులు అతన్ని చూసి తప్పుకొని, అతని వేపు అవమాన కరంగా కాకపోయినా, అమెరికన్ అవడంవల్ల వింతగా చూసేరు. వాళ్ళలో ఒకరుగా తనని ఈ జన్మలో అంగీకరించరని అతనికి అనిపించింది. తనని వారు అభిమానించవచ్చు. గౌరవంగా చూడవచ్చు. భక్తి కూడా యివ్వవచ్చు. కాని తమ వాడ్నిగా మాత్రం అంగీకరించరని అతనికి అనిపించింది.

ఆఫీసులో మనుషులు, స్వామి యెక్కడికి వెళ్ళేరో తెలీదనీ, యెప్పుడు వస్తారో అసలే తెలీదనీ, వారు ఒక్కొక్కప్పుడు ఏడెనిమిది నెలలవరకూ తిరిగి రారనీ, యెప్పుడూ రెండు నెలలలోపున తిరిగి రాలేదనీ జే.జే.తో చెప్పేరు. ఆఫీసు నుండి ఏటివేపుకి షికారు వెళ్ళేడు అతను.

సూర్యాస్తమయం వెల్తుర్లో నది రక్తపు ఏరులా కనిపిస్తోంది.

అందులో కొట్టుకుపోతున్న గుడిసెల్లా ఉన్నాయి గూడు ఉన్న పడవలు.

ఏటిగట్టున ఇళ్ళకి పోతున్న కూలీలు మాతృభూమి నుంచి బహిష్కరించబడి ఏవో తెలీని కొత్త దేశాలకు పోతున్న మనుషుల్లా వంగి నడుస్తున్నారు.

ఏటి నీటిలో తన పాదాలు తడుపు కోవాలనిపించింది జే.జే.కి. ఏటిగట్టున ఉన్న రాతిమెట్టు అతను దిగుతూ వుంటే అతనికి యెదురుగా నెత్తిమీద నీళ్ళబిందె-వంటిని తడిచీరతో ఉన్న ఒక అమ్మాయి యెదురయ్యింది. అతను కళ్ళు దించేసు కున్నాడు. అతనికి ఎప్పుడో చచ్చిపోయిన తన తల్లి గుర్తు కొచ్చింది. ఆమె మళ్ళీ పుట్టి ఉంటుందా? ఒకవేళ ఆ నీళ్ళబిందె అమ్మాయే తన తల్లేమో? వెనక్కి తిరిగి చూసేడు అతను. పాతిక గజాల్లో ఉన్న ఆమె కూడా వెనక్కి తిరిగి చూసింది. ఒక్కసారి

పరిగెత్తుకొని వెళ్ళి ఆ అమ్మాయిని గుండెలకి హత్తుకోవాలని పించింది. అతని కోరిక నిష్కామ్యం. ఈ విషయం గుర్తుకు రాగానే తన మీద తనకే గౌరవం పెరిగింది. అతనికి పక్క మెట్టు మీద ఆ పిల్ల పాదాల తడి గుర్తులు కనిపించేయి. అవి యెండిపోయేవరకు చూస్తూ నిలబడిపోయేడు అతను. ఆ అమ్మాయి తన తల్లేనా? మనిషికి మారుజన్మ ఉండదంటాడే జీసస్! ఉంటేనే బావుంటుందేమో! తను చేసిన పుణ్యాలు కాక పోయినా, పాపాలు అనుభవించడానికైనా మనిషికి మళ్ళీ జన్మ ఉండాలి. ఛీ! తనెంత అల్పుడు! పాపం అనుభవించడానికి మళ్ళీ జన్మ ఉండాలని కోరుకోవడం తనలో క్షమ శూన్యం అని ఒప్పుకోవడమే కదా!

అతను జోడు విప్పుకొని నీట్లో పాదాలు ముంచుకొని కింద మెట్టు మీద కూర్చున్నాడు. చల్లదనం కాళ్ళకేకాక వంటికీ మన సుకీ కూడా వచ్చినట్టయింది.

అతని గుండె ఒక్కసారి అకస్మాత్తుగా ప్రశాంతతతో నిండి పోయింది. చీకటీ, వెలుగూ కాని ఆ వింత కాంతిలో తను యింకా బతికే ఉన్నానని చెప్పడానికే అన్నట్టు నది గలగల శబ్దం చేస్తోంది. కనుచూపు మేర ఎక్కడా కదలిక లేదు. ఇప్పుడు మార్గరెట్ ఏంచేస్తూ ఉంటుందో! అతని పాదాల పక్కని ఒక పాము బుసకొట్టింది. అతను కాలు కదపలేదు. ఆ పాము తనని కరిస్తే? తను ఏట్లోకి గెంతేస్తే? చచ్చిపోవాలన్న కోరిక మళ్ళీ అతన్లో కదిలింది.

అతను లేచి ఆశ్రమం తోవపట్టేడు. చచ్చిపోవడానికి కాదు తను ఇంతదూరం వచ్చింది! తను మళ్ళీ పుట్టి తన పాప ఫలితం అనుభవిస్తాడో లేదో తనకి తెలీదు.కాని తన తప్పుని తల్చు కుంటూ ప్రతిక్షణం తన ఆత్మ మరణవేదన అనుభవిస్తూ వుంటే – తను వెయ్యేళ్ళు బతకాలి. అప్పుడు కాని తన పాపం కడుక్కు పోదు. తన తప్పు స్వామితో చెప్పేస్తే స్వామి తనని లోలోపల అసహ్యించుకుంటారేమో! కాని భగవత్సమానుడైన అతను క్షమిస్తే దేఁవుఁడు క్షమించినట్టుకాదా!

చెట్ల సందుల్లోంచి చంద్రుడు తొంగిచూసేడు. దూరాన పడవ పాట శ్రావ్యంగా వినిపిస్తోంది. అబ్బా! ఎంత టైమై పోయింది! తొమ్మిది దగ్గరవుతోంది. ఆలోచనల్తో తనకి టైము తెలీలేదు.

అతను ఆశ్రమానికి తిరిగి వచ్చేసరికి గదిలో భోజనం ఉంది. అతనికి తిండి సయించలేదు. పాలు తాగి పడుకున్నాడు. గుండె లోని తృప్తివల్ల ఆకలి అనిపించలేదు. కాని సిగరెట్ కాల్చాలని పించింది. ఈ ఆశ్రమంలో చేరేక తనకి ఆ కోర్కె కలుగనేలేదు. ఇప్పుడెందుకు కలిగింది? స్వామీజీ వెళ్ళిపోయిన వెంటనే తన వేపు ప్రపంచపు బంధాలు తిరిగి బుసకొడతాయా? తను మళ్ళీ ఆ ఊబిలో కూరుకుపోక మానడా? తనకు కలిగిన వైరాగ్యం కేవలం క్షణికమా? అంటే స్వామి ఉన్నప్పుడు తనలో కలిగిన మార్పు పవిత్రత కాదన్నమాట. ఆ మార్పు కేవలం భయం తాలూకు మరొక రూపం.

అర్థంలేని ఆలోచనల్తో నిద్రపట్టలేదు అతనికి.

# 50

రెండు రోజుల తర్వాత....

గూటిలో పిట్టలా ఆశ్రమం నిద్రపోయింది. కాని దూరంగా ఎవరో తంబురా మీటుతూ ఏవో తరంగాలు పాడుతున్నారు. తన గదిలో నిద్రరాక ఆలోచిస్తున్న జే.జే.కి సాహిత్యం అర్థంకాక పోయినా, ఆ తరంగాలు అర్థంకాని మంత్రాల్లా చెవికి ఇంపుగా ఉన్నాయి. తంబురా శృతి ఆగని తుమ్మెద పాటలా ఉంది. పాట వింటూ ఏదో పుస్తకం తెరిచేడు జే.జే. పుస్తకం చాలా బాగుంది. ఎవరో పాశ్చాత్యుడు కర్మసిద్ధాంతాన్ని సమర్థిస్తూ రాసిన గ్రంథం అది. చదువులో మునిగిపోయిన అతనికి సిగ రెట్టు కాల్చాలన్న కోరిక చచ్చిపోయింది. ఆ కోరిక స్వామీజీ వెళ్ళిన దగ్గర్నుండి యెక్కువైంది.

తన గది తలుపు ఎవరో తట్టిన చప్పుడికి తుళ్ళిపడ్డాడు అతను. పక్క టేబిలుమీద రిస్టువాచ్ చూసేడు. రాత్రి రెండు దాటింది. ఇంతరాత్రి తనకోసం యెవరు వచ్చారు. అతను లేచి తలుపు తెరిచేడు.

ద్వారం చీకటిలో ప్రేమ కట్టిన అందమైన బొమ్మలా నిల బడింది రాణి. తడి పూర్తిగా ఆరని సన్ననూలు చీరలా ఉంది ఆమె కట్టుకున్న తెల్ల సిల్కుచీర. అందమైన అమ్మాయి కంటి కాటుకలా ఉంది ఆ చీర నల్లంచు. ఆ చీర తెల్లదనాన్ని హెచ్చు చేయ డానికే అన్నట్టు–ఆమె జాకెట్టు అతి నల్లగా ఉంది. ఆ కాంట్రాక్టు రంగు జాకెట్టు అప్రయత్నంగా అతని కళ్ళని ఆకర్షించింది. తప్పుచేసిన వాడిలా అతను కళ్ళు దించుకున్నాడు. మఖ్ మల్ దిండు మీద ఎర్ర ఆకులు పరిచినట్టున్నాయి వెల్వెట్ చెప్పు ల్లోని ఆమె పాదాలు.

"మీరా?" ఆశ్చర్యాన్ని అణుచుకోలేకపోయేడు.

"నేనే" చాలా సాధారణంగా అంది రాణి.

"………."

"ఆశ్చర్యపోయేరా?"

"లేదు."

"పోనీ జడుసుకోలేదు కదా?"

"అబ్బే"

"ఇంత రాత్రివరకూ చదివితే, చదివేది ఎంత వేదాంతమైనా ఆరోగ్యం చెడిపోతుందని చెప్పిపోదామని వచ్చేను? వెళతా."

వెనక్కి తిరిగింది రాణీ.

పువ్వు ఎటు తిప్పినా అందంగానే ఉంటుంది.

"అయ్యయ్యో! నా అనాగరికతను మన్నించండి. ఇంతవరకూ మిమ్మల్ని లోపలికి రమ్మనలేదు. రండి, రండి" అన్నాడు అతను.

సంభాషణ అంతా ఇంగ్లీషులోనే జరుగుతోంది.

"ఆహ్వానం త్రోసిపుచ్చడం అనాగరికం. ఇంత రాత్రి బాతాఖానీ అనారోగ్యం. అంచేత ఒక్కక్షణం మాత్రం కూర్చుంటా" అంటూ లోపలికి వచ్చింది ఆమె.

రంగుల జౌత్నానా నడిచి వచ్చినట్టయింది. "మీరు వెళ్ళిపోలేదా?" ఆశ్చర్యం ప్రకటించేడు.

"కారు చెడింది, రిపేరుకి పట్నం తీసుకొని వెళ్ళేడు డ్రైవర్."

"ఎప్పుడు వస్తాడు?"

"బాగైనప్పుడు."

"వచ్చిన వెంటనే వెళ్ళిపోతారా?"

"ఎవరికోసం ఉండేది?"

జవాబు దొరకలేదు జే.జే.కి.

బల్లమీద పెట్టిన హేండ్‌బాగ్ తీసింది రాణీ. ఆ బేగ్ మొసలి చర్మం మోటుదవడం వల్ల ఆమె వేళ్ళు సున్నితం ఎక్కువై మొరటు మానుమీద పండిన వింతపళ్ళలా ఉన్నాయి.

"వెళ్ళిపోతున్నారా!" అడిగేడు అతను.

"ఊఁ" కలలో మాటాడుతున్నట్టుంది. ఆమె బేగ్ తెరచి సిగరెట్ కేస్ తెరిచి ఒకటి తను తీసుకొని, కేస్ అతనివైపు చాపింది.

"సిగరెట్లు మానేసేను" క్షమించమని కోరుతున్నట్టు సంజాయిషీ చెప్పేడు.

"క్షమించండి. నాకు ఆ సంగతి తెలీదు". ఆమె సిగరెట్ లైటరుతో వెలిగించింది. లైటర్ సంగీతం వినిపించింది. నక్షత్రాల మీద "జలతరంగిణి" వాయించినట్టుంది ఆ పాట.

"మరివెళతా, పడుకోండి" వద్దనేలోగానే వెళ్ళిపోయింది ఆమె.

# 51

ఆ రాత్రి చాలాసేపు నిద్రపట్టలేదు జే.జే.కి రాత్రి చల్లగా ఉన్నా, అతిగా దొర్లడంవల్ల పరుపు వేడెక్కిపోయింది. కిటికీలు తెరిచి ఉన్నా గదిలో గాలి వేడెక్కి పల్చబడినట్టు ఉంది.

ఆకాశంలో చుక్కల మొహాలు వెలవెలపోయేయి.

గది బైట వరండాలోకి వచ్చేడు జే.జే. అతనికి మళ్ళీ సిగరెట్ కాల్చాలనిపించింది. ఇందాక రాణీ దగ్గర సిగరెట్ తీసుకుంటే బాగుండేది. సిగరెట్ మానేసేక అవి కాల్చాలన్న కోరిక ఇంత బలంగా ఎప్పుడూ కలుగలేదు. ఛీ ఛీ! తనే పవిత్రుడైనట్టూ, రాణీ పాపి అయినట్టు యిందాక ఆమె యిచ్చిన సిగరెట్ వద్దనేసేడు. ఆ విషయం తలుచుకుంటేనే తనకి అసహ్యం కలుగుతోంది.

అప్రయత్నంగా అతని కళ్ళు రాణీ కాటేజ్ వేపు తిరిగేయి. ఆ కాటేజ్ మేడమీద ఎగురుతున్న కిటికీ తెరలోంచి వెలుగుతున్న నీలిబల్బు కనిపించింది. రాణీ నిద్రపోతోందన్న మాట. అదృష్టవంతురాలు. అందం, ఆరోగ్యం, అదృష్టం అన్నీ ఆమెలో కలిసేయి. ఇందాక ఆమె నవ్వినప్పుడు ఆమె చక్కటి పలువరసమీద పడిన విద్యుత్కాంతి తుళ్ళినట్టయింది. ఏ భారతీయ స్త్రీకైనా ఎంత అందమైన పలువరస ఉంటుంది! ముఖ్యంగా రాణీ పళ్ళు, ఎర్రటి పెదిమల వెనక యింకా అందంగా ఉంటాయి. మారగ్రెట్‌వి కూడా అందమైన పళ్ళే. కాని ఆమెకు రాణికి ఉన్న ఫిగర్ లేదు. ఇప్పుడు మార్గరెట్ ఏం చేస్తుంటుందో, బహుశా టెన్నీస్ ఆడుతూ ఉంటుంది. టెన్నీస్ అంటే ఆమెకు ఎంత సరదా! తనంటే ఆమెకు మొదట్నుండీ ఎంత అవ్యాజమైన అనురాగం! ఆ అనురాగం ఎంత దారుణంగా పరిణమించింది?

ఆ విషపురాత్రి పైశాచిక సంఘటన తర్వాత ఆమె ఏమైందో? ఎలా ఉందో? కనీసం బతుకుందో లేదో కూడా తెలుసుకోలేని అవివేకి తను. తనది అవివేకమా? పిరికితనమా? రెండూ కాదు–రాక్షసత్వం. ఆ రాత్రి జరిగిన సంఘటనలో తనకి బాధ్యత

లేదనుకోవడం రాక్షసత్వం. మనిషి తను చేసిన తప్పులకు ఎన్ని సమర్థింపులు ఊహించు కుంటాడు. తన పాపాలకు ఎంత సాను భూతి కల్పించుకుంటాడు! తను చేసింది నేరమే కాకుండా పాపం కూడా. తనకే నిజాయితీ ఉంటే చేసిన నేరానికి శిక్షకోరు కొని ఉండేవాడు. మానవత వుంటే కలిసి చేసిన తప్పుకు మార్గరెట్‌ని క్షమించమని వేడుకొని ఉండేవాడు. రెడ్‌హేండెడ్‌గా తను దొరికినప్పటికి అభాగ్యుడు జార్జిని క్షమించమనైనా అడగ లేదు. ముఖస్తంగా క్షమ వేడుకోవటానికి సిగ్గయితే కనీసం ఉత్తరం వ్రాయవచ్చునే! కాని తను అది కూడా చెయ్యలేదు. చేతకాని వాడిలా దోషిలా స్నేహితులకీ, బంధువులకీ తెలియ కుండా తన దేశం వదలి పరారీ అయిపోయి కనిపించని దేవుడి కరుణకోసం ఇక్కడ ప్రాధేయపడుతున్నాడు. మనిషిని మనిషి అన్యాయం చేస్తే మొదట క్షమించవలసింది అన్యాయానికి గురి అయిన మనిషే కదా. అతనికి క్షమాపణ చెప్పుకోలేని దోషి దేవుడుని ఎంత ఆవేదనతో ప్రార్థిస్తే మాత్రం క్షమిస్తాడా?

తను చేసింది రైటా? ఇప్పుడు తన కర్తవ్యం ఏమిటి? తిరిగి తన దేశం వెళ్ళిపోయి జార్జి కాళ్ళమీద పడితే కాని అతని మొహం ఎలా చూడటం? పోనీ తన ఆస్తి అంతా అతనికి రాసి యిచ్చేస్తే? దానం తన ద్రోహాన్ని కడిగివెయ్యగలదా? తాను చేజేతులా పెంచు కున్న యీ కీకారాణ్యంలో ఏది స్వామీ సరైనమార్గం? ఈ విషపు చీకటిలో వెలుగు చూపవా ప్రభూ? తన కన్నీటి తుపానులోనే కొట్టుకుపోతున్న తనకు ఏది శరణ్యం?

పాపం? ఇప్పుడు మార్గరెట్ యెలా వుందో? భర్తకూ బిడ్డ లకూ దూరమై, తన ఉన్నత సాంఘిక అంతస్తునుండి జారి కింద పడి....యింక ఆలోచించలేకపోతున్నాడు జే.జే.

మరపుకు రాని ఆ కాళరాత్రి....గుర్తుకు వచ్చినప్పుడు తన మెదడులో ముళ్ళ మొగ్గ విడుతున్నట్టు బాధ పెడుతుంది. కడు పులో విషం కుతకుత ఉడుకుతున్నట్టూ...తన గుండె యెవరో రాక్షసుడు తీసి తన కళ్ళెదుటే ఎర్రటి నిప్పులమీద కాలుస్తున్నట్టూ అనిపిస్తుంది.

దూరంగా తాటితోపులో నడుస్తున్న హరికేన్ లాంతరు – నిద్రరాక తిరుగుతున్న దెయ్యం ఒంటి కన్నులా కనిపిస్తోంది.

ఎక్కడో....అరవలేని నక్క వెక్కి వెక్కి ఏడుస్తున్నట్టు అరచింది.

సమాధిలో చంటిపిల్లాడి శవం ఒత్తిగిలినట్టు అనిపించింది జే.జే.కి.

ఏమిటీ అంధకారం?

ఎన్నాళ్ళీ అశాంతి?

ఈ చావురాని మరణ వేదన యెన్నాళ్ళు? ఎన్నేళ్ళు?

చూపు తగ్గిన కళ్ళనీ అలసిపోయిన మొహాన్నీ అరచేతుల్లో రాచుకున్నాడు అతను. తనని తను క్షణం మరచిపోయి నట్ట యింది. యుగాల పుటలు వెనక్కి తిరుగుతున్నట్టూ – దేహాన్ని వదలి తన ఆత్మ ఏదో వింత నీలి వెలుగులో మూగ ఆనందం అనుభవిస్తున్నట్టు అనిపించింది.

వరండాలో స్తంభానికి చేరబడి అరచేతుల్లో మొహాన్ని కప్పుకొని అలా ఎంతసేపు నిలబడ్డాడో అతనికి గుర్తులేదు.

ఎవరో చేసిన "ఓం" కారం–పాప భారంతో వణికిపోతున్న భూదేవి పరమ శివుడికి చేసుకున్న ప్రార్థనలా వుంది.

గూళ్ళ బైటకు వచ్చిన పిట్టలు నిద్ర దుస్తులు విప్పుకుంటు న్నట్టు ఒళ్ళు విదిలించుకున్నాయి. ఆ విదిలింపులకే వణికి పోతు న్నట్లు చెట్లు కదిలేయి.

ఒక పువ్వునుంచి జారిన మంచుబొట్టు విడుతున్న మొగ్గలో పడి యింకిపోయింది. ఆ పువ్వు రేకు ఒకటి రాలిపోయింది.

అప్పటికే కాలకృత్యాలు తీర్చుకున్న ఒక బైరాగి తన పాటకి తంబూరా శ్రుతి చేస్తున్నాడు.

ఆశ్రమం కళ్ళు విప్పి కాళ్ళూ చేతులూ జాడించి మేలుకుంది.

రాణీ మేడమీద లైటు వెలిగింది. యాంత్రికంగా ఆ కాటేజ్ వేపు నడిచివెళ్ళి కాలింగ్ బెల్ నొక్కేడు జే.జే. రాణీ మేడ దిగివచ్చి కనపించని జవాన్లని సాధిస్తూ తలుపు తీసింది.

రేగిన ఆమె జుట్టు దువ్వుకున్నప్పటికంటే అందంగా వుంది.

నిద్రలో తాడులా పేనుకుపోయిన ఆమె సన్నని చీరపైట ఆమె గుండెల మధ్య ఉండిపోయింది.

కళ్ళదించుకున్నాడు జే.జే.

"మీరా?" అన్లేదు ఆమె.

"లోపలికి రండి" అంది ఆహ్వాన పూర్వకంగా.

హాల్లోకి వెళ్ళేడు అతను.

"నిద్ర పట్టలేదా అని అడగక్కర్లేదు మిమ్మల్ని చూస్తే" ఆమె పలకరించింది.

అతడు జవాబివ్వలేదు.

"మీ కాటేజ్‌లో బహుశా ఫేన్ పనిచెయ్యడం లేదేమో! నిద్ర పట్టి ఉండదు."

అతను మౌనంగా నిల్చున్నాడు.

"కూర్చోండి" అంది తనో కుర్చీలో కూర్చుంటూ.

శరీరం వంపులు సూచించడానికే అన్నట్లు వంటికి అంటుకు పోయింది, నలిగిన ఆమె తెల్లచీర.

ఆమె అందానికి నేతగాడు సమర్పించిన బంగారు కానుకలా పాదాల మీద చీరలో జరీ పువ్వుపడి ఉంది.

మనసులోని ఆలోచనలు తన పెద్ద కళ్ళలోంచి బైటపడ కుండా అన్నట్టు రాణీ తన కళ్ళు తెరచి టపటపలాడిస్తోంది.

అతను ఎందుకు వచ్చేడో ఆమె అడగలేదు. విడిపోయిన తన జుత్తును ఆమె తన చేతులు ఎత్తి ముడివేసుకున్నప్పుడు ముందుకు వచ్చిన జబ్బల వంపులూ, వక్షం కదలికా జే.జే.లో ఏదో పాత జ్ఞాపకాలు కెలికి బాధ కలిగించేయి.

అతను ఎందుకు వచ్చేడు?

"టూత్ పేస్టు ఐపోయింది" అన్నాడు.

"పేస్టు చాలా? బ్రష్ కూడా కావాలా? నా దగ్గర స్పేర్ బ్రష్ వుంది. మీరు బెడ్ కాఫీ మానేసేరనుకుంటాను. మొహం కడు క్కోండి. ఈలోగా కాఫీ తయారౌతుంది." అని రాణి మేడమీద నుండి కొత్త బ్రష్ తెచ్చి అతనికిచ్చి "ఆ బాత్రూమ్‌లో అన్నీ వున్నాయి" అంది.

"కాఫీ మానేసేను" అన్లేదు జే.జే. ఎంచేతో, అలా అనాలని పించలేదు. అలా అంటే రాణి బాధపడుతుందేమో అనిపించింది. ఎందుకు బాధ పడుతుంది అనడిగితే అతను వివరించలేడు.

మొహం కడుక్కుని తల చన్నీళ్ళలో తడుపుకున్నాక కొంత బాధ తగ్గినట్టనిపించింది అతనికి. అతను హాల్లోకి వచ్చేసరికి సోఫాలో రాణి కూర్చుని ఉంది. పక్కనే బల్లమీద ప్లేట్లో వెన్న రాసిన రొట్టె ముక్కలూ, "పాట్"లో కాఫీ ఉన్నాయి.

"రండి ఆలస్యం మీదే! నాది కాదు." అంది అతి కొంచెం నవ్వుతూ రాణీ. నవ్వడానికే పుట్టినట్టు ఆమె ఎప్పుడూ కొంచెం నవ్వుతూనే వున్నా విరగబడి ఎప్పుడూ నవ్వదు. ఆమెకు ఎదు రుగా సోఫాలో కూర్చున్న జే.జే. ఆమె వేపు నిదానంగా చూసేడు. ఆమె పొడగరి అని అతనికి మొదటిసారి స్ఫురించింది. ఆమె కాళ్ళు కూడా బాగా పొడుగేమో అనిపించింది.

వెంటనే మార్గరెట్ గుర్తుకువచ్చింది అతనికి. ఆమె కాళ్ళూ పొడుగే. కిటికీలోంచి బైటకు చూసేడు జే.జే.

బంగారు సరస్సులో తేలుతున్న బంగారు పళ్ళెంలా సూర్యుడు లేచేడు.

జే.జే. మనసులోని మూల మూలనున్న చీకట్లు పగటి వెల్తు రుకి మాయమైనట్లని పించింది.

రొట్టె పళ్ళెం చేత్తో పట్టుకుని "ఇది మా ఆచారం" అంటూ అతని వేపు చాపింది రాణి.

"మా ఆచారానికి మీ ఆచారం...."

"కలుస్తే బాగుంటుంది" అని "మా ఆచారం" అని కలిపింది.

అప్రయత్నంగా నవ్వేడు జే.జే. నవ్వేక తను నవ్వి చాలా రోజులైందని గ్రహించేడు. కాని వెంటనే అలా నవ్వడం తప్పు అన్నట్టు అనిపించింది.

అతను రొట్టె ముక్క తీసుకున్నాడు. ఆమె తీసుకోలేదు. "రాత్రి బాగా నిద్రపోయేను. ఆకలిలేదు. మీరు అనుమతిస్తే కాఫీ తీసుకుంటాను."

"తప్పకుండా."

కాఫీ కప్పు తీసుకుని ఆమె అతని కళ్ళల్లోకి సూటిగా చూసింది. ఆమె అలా చూడటం అదే ప్రథమం అని గ్రహించిన అతను కాస్త విస్తుపోయేడు.

"మీరు వెంటనే నిద్రపోండి."

"పోవాలి."

"మానసిక బలంకన్నా దేహ ఆరోగ్యం ముఖ్యం."

తనకు మనసు బాగులేదని ఆమె ఎలా గ్రహించిందో?

"మీ మనసు బాగులేదని నాకెలా తెలుసుననేగా మీరు ఆలోచిస్తున్నారు? మనసు బాగుంటే నిద్ర రాకపోదు. మీరు తింటున్న తిండికి–తినని తిండి–అంటే బాగుంటుం దేమో – నీరసానికైనా నిద్రవచ్చేస్తుంది." సంజాయిషీ చెప్పింది ఆమె.

"ఎంత తెలివైంది' అనుకున్నాడు.

అంతేకాని మానసిక ఆరోగ్యం ఉన్న ఏ అమెరికన్, ఆశ్ర మాలు పట్టిపోదన్న సత్యం ఆమెకు తెలిసి ఉంటుందని–అతను అనుకోలేదు.

"మీరు నిద్రలేచేసరికి నేను ఉండను."

"ఏం. ఎక్కడకు వెళ్తారు."

"నేను సన్యాసినికాను, పిల్లలూ, పాపలు, సంసారం, సుఖం, అప్పూ, ఆస్తీ అన్నీ ఉన్నాయి."

"మీ ఊరు వెళ్తారా?" ఏదో అడగాలి గదా అని అడిగేడు.

'ఔను, కారు యీవేళ బాగుచేయించి తెస్తానన్నాడు డ్రైవర్,"

కాఫీ తాగడం పూర్తిచేసి "మెనీ థేంక్స్ ఫర్ ది కాఫీ" అంటూ లేచేడు అతను. నాటెటాల్" అంటూ అమె కూడా లేచింది.

ఆమెను వదిలి వెళ్ళడం అంత బాధాకరంగా ఉంటుందని అంత వరకూ ఊహించలేకపోయేడు. అతను మానసికంగా ఆమె తనకు ఎందుచేత అంత సన్నిహితంగా వస్తోంది? కేవలం ఆమె పాశ్చాత్య అలవాట్లూ, జీవన విధానం మాత్రమే కార ణాలా? అంతే ఆయుంటుంది. లేకపోతే వారంకిందట తనెవరో? ఆమె ఎవరో? వారం రోజుల బంధం ఏమంతగట్టిది? కొన్ని నెలలై తను పెరిగిన వాతావరణానికి పూర్తిగా వ్యతిరేకమైన వాతావరణంలో జీవిస్తున్న తను ఎంత ప్రయత్నిస్తున్నా ఇక్కడ మనుషుల్లో ఒకడుగా కాలేకపోతున్నాడు. వీళ్ళు మనుషులు మంచివాళ్ళే అయినా, వారి అలవాట్లూ, ఆహారం, ఆచారాలూ ఎప్పటికీ వింతగానూ కొత్తగానూ ఉంటున్నాయి. ఆఖరికి వీరి ఇంగ్లీషు ఉచ్చారణకూడా, తన ఇంగ్లీషులా కాకుండా ఏదో అర్థంకాని భారతీయ భాషలా ఉంటుంది. ఈ పరిస్థితుల్లో ప్రవే శించిందిరాణీ తన జీవితంలోకి. ఆమె దుస్తుల్లోనూ, తల దువ్వు కోవడంలోనూ మినహా మిగిలిన అన్ని విషయాల్లోనూ పాశ్చాత్య స్త్రీయే. అంచేత ఆమె తనకు అంత సన్నిహితురాలయింది.

హాలుదాటుతూ "ఈ మధ్య ఇక్కడకు వస్తారా మళ్ళా?" అడిగేడు అతను.

"కోర్కె ఉంది. కాని సాధ్యపడకపోవచ్చు."

"ఎక్కువ శ్రమలేకపోతే తప్పకుండా రండి."

"వస్తానన్న అబద్ధం మర్యాదకోసం కూడా ఆడలేకపోతున్నాను."

"మరైతే శాశ్వతంగా శలవు. నమస్తే" అంటూ అతను మెట్ల మీద ఆమె వేపు తిరిగి చేతులు జోడించేడు. ఎందువల్లో ఆమె మొహం చూడలేక తలదించుకునే ఉండిపోయేడు.

"నమస్తే కూడా నేర్చేసుకున్నారన్నమాట" నవ్వుతూ అని "మా సాంప్రదాయం మీరు పాటించేరు కాబట్టి మీ సాంప్రదాయం నేను పాటిస్తాను. గుడ్‌బై అండ్ ది బెస్టు ఆఫ్ లక్" అంది.

అతను అలవాటు ప్రకారం కుడిచెయ్యి ముందుకు చాపేడు. ఇతర భారతీయ స్త్రీలలా వెనుదియ్యకుండా ఆమె తన కుడిచెయ్యి చాపింది. కొన్ని నెలలై స్త్రీని తాకని అతనికి ఆ స్పర్శ వింతగా తోచింది.

"వెళ్తా" అంటూ అతను తల ఎత్తకుండానే వెళ్ళిపోయేడు. పాతిక గజాలు వెళ్ళేసరికి సంతోషంతో తోక ఎత్తి తల్లి పొదుగుని పొడుస్తూ పాలు తాగుతున్న ఆవుదూడ కనిపించింది అతనికి. దాని తల్లి దాన్ని ప్రేమగా నాకు తోంది. ఆ ఆవుకే మాటలువస్తే తన పిల్లతో ఏమనేదో? అన్న ఊహ వచ్చింది అతనికి. పిల్లకి పాలిస్తున్న తల్లిలో కామంలేక పోలేదన్నాడు ఫ్రాయిడ్. జంతువుల క్కూడా ఆ సూత్రం వర్తిస్తుందా? తనకి పిల్లలు లేరు. పెళ్ళికూడా కాలేదు. తనకి స్త్రీ సౌఖ్యం కొత్తకాదు. మార్గరెట్ అప్పటివరకూ తన జీవితంలో ఆఖరి స్త్రీ, జీవితాంతం వరకూ ఆమె ఆఖరు స్త్రీగా ఉండాలని తన కోరిక. తను ఆమెతో గడిపింది ఒక్క రాత్రి మాత్రమే అయినా, తనని శ్మశానం చేరేవరకూ వెంబడిస్తోంది ఆమె. తను ఎప్పుడూ ఆమెని కోరుకోలేదు. పరిస్థితులు ఉండచుట్టుకొని మీద పడి తనని ఆమె మీదకు తోసేయి.

ఆలోచిస్తున్న అతను అప్రయత్నంగా వెనక్కి తిరిగేడు.

ఆరోగ్యానికి రూపం యిచ్చి, అందాన్ని పూతపూసినట్టు మెట్ల మీద నిలబడిన రాణీ తనవేపే చూస్తోంది. ఆమె కళ్ళల్లోకి సూటిగా చూసేడు అతను. ఆమె అతనికి "టాటా" చెప్తున్నట్టు చెయ్యి ఊపుతూ నవ్వింది. కాని ఆ నవ్వు వెనక బాధల దొంతర ఉన్నట్టు అనిపించింది అతనికి.

తనంటే ఆమె కెందుకో అంత వాత్సల్యం! పదిమందిలో ఉన్నా తను ఏకాకి అన్న విషయం ఆమె గుర్తించినట్టుంది. స్వామి ఉన్నప్పుడు తనకు ఎంతో ధైర్యంగా ఉండేది. అప్పుడు తనకీ ఒంటరితనం బాధ అనిపించదు.

ఇతర ఆశ్రమవాసులతో తను మానసికంగా దగ్గర కాలేక పోతున్నాడు. డాక్టరుని నమ్మి ఆస్పత్రిలో చేరేక డాక్టరు ఆస్పత్రి వదలి వెళ్ళి పోయినట్లుంది. తన పరిస్థితి, ఇతర ఆశ్రమవాసులు తోటి పేషంట్సులా కనిపిస్తున్నారు. కాని ఆధ్యాత్మికంగా తనకి దారి చూపగలిగే శక్తి వారికి లేదు.

కాటేజ్ చేరి స్నానం చేసి పడుకున్నాడు. జే.జే. తెలివి వచ్చే సరికి మధ్యాహ్నం అయిపోయింది. ఆ సాయంత్రం రాణీ కాటేజ్

వేపు షికారు వెళ్ళేడు అతను. కాటేజ్‌కి వేసివున్న తాళం పూల బావికి ముళ్ళగేటులా కనిపించింది.

ఆ రాత్రి ఆమె గురించే అతను చాలాసేపు ఆలోచించేడు.

# 52

రెండు రోజుల తర్వాత ...........

జే.జే. పొద్దుపోయి లేచేడు. ఈ మధ్య అతనికి బొత్తిగా నిద్ర పట్టడంలేదు. ఆ రోజు అతను లేచేసరికి రాణీ కాటేజ్ ముందు ఒక పెద్ద ఎర్రకారు ఆగివుంది. యూనిఫారమ్ వేసుకున్న డ్రైవరు సామాను కారులో పెడుతున్నాడు.

'ఎవరిదో ఆ కారు' అనుకున్నాడు. జే.జే. 'ఎవరిదైతే తనకేం' అనుకున్నాడు కాలకృత్యాలు పూర్తిచేస్తూ. అది రాణీది అయితే! ఐతే! ఆమెను మళ్ళీ చూడొచ్చు. మరొక్కసారి చూడవచ్చు! చూస్తే! బావుంటుంది. ఎందుచేత? తెలీదు. తెలియని ఆనందాన్ని కోరుకో వచ్చా? ఆనందం అంటే ఏమీ తెలియక పోవడమేకదా! కారు దగ్గరికి ఒక్కసారి వెళ్తే? వెళ్లకూడదన్న ఆంక్షలేదు.

వెళ్ళేడు అతను. కారు వెనక సీట్లో పెద్ద ఆల్సేషియను కుక్క ఉంది! ఆల్సేషియన్లంటే మార్గరెట్‌కి యెంతో సరదా. ఆమె దగ్గర అలాంటివి రెండు కుక్కలున్నాయి.

కారు యెవరిదో?

ఇండియన్ కారు కాదు. ఎవరో అపార భాగ్యవంతులదై ఉంటుంది.

అతను కారును సమీపిస్తూ ఉంటే "రండి, రండి" అంటూ రాణి పిల్చింది కాటేజ్‌లోంచి. ఆశ్చర్యపోతూ అతను అటువేపు చూసేడు.

కిటికీ వెనక చీకట్లో తెరమీంచి ఆమె కళ్ళు రెండు వింత పువ్వుల్లా కనిపించేయి.

"రండి, మీకు కాఫీ యివ్వడానికే నేను ఆగినట్టుంది. లేకపోతే అరగంటకింద వెళ్ళవలసిన దాన్ని," అంది నవ్వుతూ.

"మీరు....మీరు వెళ్ళిపోలేదా?"

"కనిపించని దేవుడు ఉన్నాడని నమ్మించవచ్చు గాని కనిపిస్తున్న దాన్ని లేదని యెలా అనగలను?"

వింత మనిషి, సూటిగా ఏదీ చెప్పదు. ఎందువల్ల? మాటా, మరుగూ ఆడదాని ఆయుధాలా? ఆభరణాలా?

"మీరు వెళ్ళిపోయేరనుకున్నాను" ఆమె చేతిలో కాఫీ కప్పు అందుకుంటూ అన్నాడు.

"వెళ్ళిపోదామనే అనుకున్నాను. కాని కారు రాలేదు. ఈలోగా పక్క ఊళ్ళో స్నేహితురాలు వాళ్ళింటికి తీసుకొనివెళ్ళింది. ఇక్కడ కాలం గడవడమే కష్టమైపోయింది.కారు బాగైంది యీవేళ."

"ఎప్పుడు ప్రయాణం?"

"కాఫీ పూర్తికాగానే?"

అతను ఆశ్రమంలో చేరేక కాఫీ తాగడం యిది రెండోసారి. మొదటి సారి మొన్న తాగినప్పుడు తను తప్పు చేస్తున్నట్టు బాధపడ్డాడు. ఇప్పుడు ఆ బాధ కలగలేదు. ఎంచేత? అసలు తను కాఫీ యెందుకు మానేసినట్టు? ఎవరూ తనని కాఫీ మానేయమన్లేదే? ఆశ్రమంలో చేరేక అది మానేయడం సహజం అనిపించింది అంతే. మానేసేడు.

"కాఫీ అయిపోయింది. మీరు బయలుదేరండి" అన్నాడు జే.జే.

రాణీ మేడమీదికి వెళ్ళింది.

ఎందుకు?

అతనికి జవాబు దొరకలేదు. సామాన్లు ఏవైనా మేడ మీద ఉండి పోయేయేమో! ఆ పనికి నౌకర్లు ఉన్నారే!

రాణీ మేడచివర మెట్టువరకూ వచ్చి నిలబడింది. మార్గరెట్‌కీ, ఆమెకీ యెంత పోలిక; ఆ ముక్కు వొంపూ, గెడ్డం మలుపూ అంతా ఆమె పోలికే. మార్గరెట్ కూడా ఇంతే. దేనికీ సూటిగా జవాబు చెప్పేది కాదు.

కలలో నడుస్తున్న మనిషిలా తేలికగా రాణీ మెట్లు దిగుతోంది.

ఎప్పుడో కలలో కనిపించిన అందమైన మనిషి ప్రత్యక్షమైనట్టు అనిపించింది అతనికి.

"అన్నట్టు అడగడం మరిచిపోయేను. మీ ప్రోగ్రాం ఏమిటి? స్వామి వచ్చేసరికి కొన్ని నెలలు అవుతుందేమో?" అడిగింది.

"ఏం చెయ్యాలో తెలియడం లేదు."

"ఇక్కడ మనుషులకు ఆధ్యాత్మిక చింత యెక్కువ. అంటే ఒక విధంగా వాళ్ళు "బేడ్ నైబర్స్" అన్నమాట."

"నిజమే?"

"కొన్నాళ్ళు ఎక్కడికైనా వెళ్ళిరండి."

"రిచర్డు ఊళ్ళో లేడు."

"పోనీ ఏదైనా "హాలిడే రిజార్టు"కి వెళ్ళండి. చొరవచేసి సలహా ఇస్తున్నందుకు క్షమించాలి."

"అబ్బే, మీ సలహా బాగుంది. ఎక్కడికైనా త్వరలోనే వెళతాను.

"పోనీ మీ కభ్యంతరం లేకపోతే నాతో మా ఊరు రండి. కొన్నాళ్ళుండి తర్వాత మీ కిష్టమైన చోటికి వెళ్ళవచ్చు."

"థాంక్స్" ఆలోచించకుండా ఆవేశంతో అన్నాడు.

# 53

జే.జే. సామాన్లు కూడా కారులో పెట్టేడు డ్రైవరు. రాణీ. జే.జే. డ్రైవరు, నౌకరు కారు దగ్గర కొచ్చేరు.

"మీరిద్దరూ వెనక యెక్కండి" అంది రాణి. డ్రైవరూ, నౌకరూ కుక్కతో సహా వెనక సీట్లో కూర్చున్నారు.

"కారు నడపడం అంటే నాకు సరదా" అంటూ రాణీ స్టీరింగ్ దగ్గర కూర్చుంది. జే.జే. ఆమె పక్కన కూర్చున్నాడు.

నీట్లో పడవలా, కారు కుదుపు లేకుండా, హాయిగా నున్నటి రోడ్డు మీద సాగిపోతోంది.

కారు చక్రాల క్రింద నలిగిన రోడ్డు నున్నబడి నల్లగా మెరుస్తోంది. సముద్రం దగ్గర్లోనే ఉందని వీస్తున్న చల్లగాలే కాకుండా, వినిపిస్తున్న "హోరు" కూడా చెపుతోంది.

వెనక సీట్లో కుక్క ముందు సీటుమీద మెడా, కాళ్ళూపెట్టి రాణీ మెడను నాకింది.

"ఉండు జిమ్మీ. నాకసలే చక్కిలిగింతలు యెక్కువ. ఇలా మారాం పెడితే యెలా? డ్రైవర్ జిమ్మీని పిలు!"

"ఈ కుక్కను యెక్కడ సంపాదించేరు?" అడిగేడు జే.జే.

"కొత్తది కాదు, ఆశ్రమానికి తెస్తే బాగుండదని పక్క ఊళ్ళో స్నేహితురాలి దగ్గర వదిలేసేను. నా దగ్గర చాలా కుక్కలున్నాయి. అయినా ఇదంటేనే నా కిష్టం. ఇది పుట్టిన వెంటనే దీని తల్లి చచ్చిపోయింది పాపం. ఆశ్రమంలో ఉన్నప్పుడు తప్పిస్తే ఎప్పుడూ నా దగ్గరే ఉంటుంది."

"కుక్క ఆశ్రమానికి వెళ్తుందా?" నవ్వేడు.

"దొరికిపోయేను నేనన్నది తప్పే" హాయిగా నవ్వుతూ ఒప్పుకుంది.

జే.జే. మనసుకి......ఏదో చల్లగాలి తగలినట్టు అయింది. ఇన్నాళ్ళూ తను ఇనుపతెరలమాటు వేడిగాలిలో ఉన్నట్టూ, యిప్పుడు చిక్కటి గాలి పూల పరిమళాన్నీ, మంచు చల్లదనాన్నీ తెచ్చినట్టూ ఫీలయ్యేడు.

"ఆశ్రమంలోకి కుక్కల్ని తీసుకొని రాకూడదా?" అడిగేడు అతను.

"తీసుకొస్తే బహుశా ఎవరూ అడ్డుపెట్టక పోవచ్చు. కాని అక్కడ అంత సహజంగా ప్రవర్తించలేం. ఎన్నిసార్లు వెళ్ళినా యెప్పుడూ 'జిమ్మీని' తీసికొని వెళ్ళలేదు."

"ఏం?"

"చెప్పేను కదా, అక్కడి అందరి ప్రవర్తనా–నాది కూడా – అసహజంగా ఉంటుందని."

"మరైతే యెందుకు వెళతారు?"

"చెప్పలేను, క్షణికంగా నేను పెట్టుకున్న నిర్బంధాలే నాకు ఆనందం ఇస్తాయేమో! కాని శాశ్వతంగా అక్కడ బతకలేను. "జిమ్మీ"ని యెందుకు తీసుకొని వెళ్లననే గదా మీ ప్రశ్న?"

"ఔను."

"సూటిగా జవాబు చెప్పలేను. మీరు సిగరెట్టు యెందుకు మానేసేరు? మిమ్మల్ని యెవరూ మానెయ్యమని అడగలేదేమో!"

"నిజమే. ఎవరూ మానెయ్యమన్లేదు."

"అలాగే నేను కూడా. కుక్కని తీసుకుని వెళ్ళను. స్వామి ఆశ్రమంలో ఉంటే సిగరెట్లు కూడా కాల్చను."

"ఇన్ని నిర్బంధాలు పెట్టుకొని యెందుకు వెళ్ళడం?"

"దేముడ్ని మరిచిపోకుండా, కాని నిత్యం దైవసాన్నిధ్యంలో ఉండలేను. నాకు దేముడిగురించి కొన్ని ఊహలు ఉన్నాయి. నేను సిగరెట్ కాలుస్తేనే నన్ను నరకానికి పంపించేటంత క్రూరుడు దేముడని నేను అనుకోను. సిగరెట్ కాల్చడం కేవలం నా డబ్బుకీ, ఆరోగ్యానికీ సంబంధించిన విషయం. నాకు రెండూ కొదువ లేదు" అంటూ డేష్‌బోర్డులోంచి సిగరెట్ కేస్ ఒకచేత్తో తీసింది. తనొక సిగరెట్ తీసుకొని "మిమ్మల్ని కాల్చమని నిర్బంధించను గాని, కాల్చాలని ఉంటే కాల్చండి" అంటూ అతనికి అందించింది. జే.జే. సిగరెట్ తీసుకున్నాడు. తర్వాత డేష్‌బోర్డు పేనెల్ లోంచి సిగరెట్ లైటరు తీసి జే.జే. కి యిచ్చి, అతను వెలిగించ కున్న తర్వాత ఆమెకూడా సిగరెట్ వెలిగించింది.

మొదటిసారి సిగరెట్ పీల్చగానే అతని తలా, వళ్ళూ గిర్రున తిరిగేయి. కళ్ళల్లో నీళ్ళు తిరిగి యెదురుగా వున్న రోడ్డూ, దానిపక్కన యెత్తుగా పెరిగిన చెట్లూ, కరుగుతున్న గాజు ముక్క ల్లోంచి చూస్తున్నట్టు ఆకారాలు కోల్పోయేయి.

అతని కళ్ళనీళ్ళు చెక్కిళ్ళమీద పడ్డాయి. అతని కళ్ళకి ప్రపంచం వింతగానూ, కొత్తగానూ, కడిగిన గాజుముక్కలా శుభ్రంగానూ కనిపించింది. మనసు కూడా కడిగి ముగ్గుపెట్టి నట్టు అయింది.

తన రుమాలుతో కళ్ళు తుడుచుకోవడం రాణి చూడలేదనే ఆశించేడు.

కాని "బహుశా కళ్ళల్లో నలక పడినట్టుంది. కాసేపు సీటుకి చేరబడి కళ్ళు మూసుకోండి" అంది రాణి.

"అబ్బే నలుసు బైటకు వచ్చేసి ఉంటుంది లెండి."

"అయినా ఫర్వాలేదు. కాస్సేపు కళ్ళుమూసుకోండి."

అతను కళ్ళు మూసుకొని సీటుకి చేరబడ్డాడు. భవిష్యత్తు ఎన్ని వికృతమైన మలుపులు తిరుగుతుందో? తనెవరు? ఈమె ఎవరు? ఈమె వెంట తనెందుకు వెళుతున్నట్లు? ఎక్కడికీ అర్థరహితమైన ప్రయాణం? చుక్కానిలేని తన నావ యీ జీవితపు చీకటి సముద్రంలో ఇలా ఎన్నేళ్లు కొట్టుకుపోతుంది? చివరకు ఏ రేవు చేరుతుంది? అసలు చేరుతుందో? లేదో? ఆ రేవు అయినా ప్రశాంతంగా ఉంటే బావుణ్ను.

"డ్రైవర్! బాటిల్‌లో మంచి నీళ్ళున్నాయేమో చూడు" అన్న రాణీ మాటకు ఉలిక్కిపడ్డాడు జే.జే.

"దాహం వేస్తోందా?"

సిగరెట్ కొత్తగా మళ్ళీ కాలుస్తూ అతని గొంతు పొడిగా అయిపోయింది.!

"ఔను" అన్నప్పుడు అతని గొంతుక పొడిగా, బొంగురుగా వుంది. "నీళ్ళు పట్టడం మరిచిపోయేను. క్షమించండి" అన్నాడు బంట్రోతు.

"ఫర్వాలేదు. తోవలో దొరుకుతాయి."

కారు సాగుతూనే వుంది. దారిలో ఎక్కడా బావి కనిపించ లేదు. అరగంట దాటిపోయింది.

సాయంత్రం వాలు ఎండలో రోడ్డుపక్క నదిలో నీరు – దేవతలు భూమ్మీదకు దిగి కలుపుకున్న వసంతంలా వుంది.

ఆకాశంలో నీలి పసుపు రంగుల మధ్య ఎర్రదనానికి వింత శోభ వచ్చింది.

గాలికి ఆడుతున్న కొబ్బరిచెట్ల ఆకులు చిన్నపిల్లలు–చప్పట్లు కొడుతున్నట్లు–శబ్దం చేస్తున్నాయి.

రాణీ కోసం ప్రత్యేకంగా వేసినట్టు, రోడ్డు ఏకాంతంగా వుంది.

"సూర్యుడు కుంగేలోగా చంద్రోదయం అయితే?" అంది రాణీ.

"మీరు కవిత్వం రాస్తారా?"

"ఇప్పటివరకూ ఆ తప్పు చేయలేదు. యిటుపైన చేస్తానన్న భయం కూడా లేదు."

"ప్రార్థనంత మానసిక ప్రశాంతత పొయెట్రీయే యిస్తుంది."

"పొయెట్రీ పుస్తకాల్లోనే కాదు. ప్రతి వస్తువులోనూ, ప్రతి మనిషిలోనూ కనిపిస్తుంది నాకు."

"అంత రసాస్వాదనకి మనిషి చిత్రకారుడు కావాలేమో."

"చిత్రకారుడికీ, కవికీ భేదం ఏంటంటి? ఒకరు కుంచె ఉప యోగిస్తే, మరొకరు కలం ఉపయోగిస్తారు. ఇద్దరూ ఇచ్చే ఫలితం ఒకటే. ఫలితాల్లో భేదం నిరక్షరాస్యులను మాత్రం బాధిస్తుంది. వారు చదువలేరు. కాని మనలాటి వాళ్ళకి అది యిమ్మెటీరియల్."

"మీరు అతి చిన్న విషయాన్ని కూడా సునిశితంగా ఆలో చిస్తారు."

"థేంక్స్."

కారు ఏదో చిన్న నాలుగు రోడ్ల జంక్షను చేరేసరికి, అక్కడ ఉన్న ఒక్క దుకాణమూ, కట్టేస్తున్నాడు దాని యజమాని. అక్కడ చవకబారు సిగరెట్లూ, కొబ్బరిబొండాలూ మాత్రం దొరుకుతాయి.

దుకాణానికి ఏభై గజాల దూరంలో కారు ఆపి "డ్రైవర్, రెండు కొబ్బరిబొండాలు పట్టుకురా" అంది రాణి.

డ్రైవరు దుకాణానికి పరిగెత్తేడు.

"మీరు ఎప్పుడైనా కొబ్బరి నీళ్ళు తాగేరా?"

"తాగేను. గొంతు ఇసకపడినట్టు ఎండిపోయింది. ఇప్పుడా బొండాల వాడే మనపాలిటి భగవంతుడు.

డ్రైవరు ఒక బొండాం, రెండు "స్ట్రా"లు పట్టుకొచ్చి "బొండాలు అయిపోయేయట. యిదొక్కటే ఉంది" అన్నాడు.

"మీరు తీసుకోండి. ఏదైనా అతిథులకి ముందివ్వడం మా ఆచారం" అంది ఆమె.

"మా దేశంలో పిల్లలకీ, ఆడవాళ్ళకీ మొదట ఇస్తాం" అన్నాడు జే.జే.

"అలాక్కాదు, మీరు తీసుకోండి."

"ఓ మాట చెపుతాను. మీరు అపార్థం చేసుకోనంటే, మీ ఆచారాలు వేరని నాకు తెలుసు. ఇందాక 'నమస్తే, గుడ్‌బై'ల్లా యిప్పుడు కూడా మన సాంప్రదాయాలు రెండూ కలిపి యిద్దరం తాగుదాం."

ఆమె వద్దనలేదు. ఇద్దరూ ఒకేసారి "స్ట్రాస్" తో తాగేరు.

తర్వాత రాణీ కారు దిగింది. అతనూ ఆమె వెనకాలే వెళ్ళేడు. ఆమె అతని వేపు తిరిగి "దయచేసి వెంబడించకండి" అంటూ రోడ్డుపక్కన తోటలోకి వెళ్ళిపోయింది.

ఆమె తనని వదిలి ఎందుకు వెళ్ళిపోయిందో? జవాబు స్ఫురించగానే, అతని మొహం సిగ్గుతో ఎర్రబడింది.

రాణి తిరిగివచ్చి మెరుస్తున్న కళ్ళతో "రండి కాస్సేపు ఏటి ఇసకలో కూర్చుందాం" అంది.

ఇద్దరూ నడిచివెళ్ళి ఇసకలో కూర్చున్నారు.

ఇంకా చంద్రుడు రావడానికి చాలా టైముంది.

చీకటికి చుక్కలు ఎక్కువయ్యేయి.

ఏటినీరు, ఒడ్డున సుళ్ళు తిరుగుతున్నప్పుడు గలగల శబ్దం ఆపుతోంది.

చుట్టూ చీకటి ప్రపంచాన్ని మింగేసింది.

ఆ ఇసకమీదున్న వారిద్దరే సృష్టిలో మిగిలినట్టు ఫీలయ్యారు.

జే.జే. చెప్పలేని చోట్ల నరాల్లో మెల్లిగా కదిలినట్టయింది.

అతని గుండెల్లో బంగారు పిచ్చుక నిద్రలేచి వళ్ళు విదిలించుకున్నట్టయి వళ్ళు జలదరించింది.

"మీకు చీకటంటే అయిష్టమా?" చీకట్లోకి చూస్తూ అడిగింది రాణి.

"ప్రస్తుతం వెలుతురంటేనే భయం. ఎప్పుడూ చీకట్లోనే ఉండి పోవాలనుంటుంది."

"ఒంటరిగానా!"

"ఏమో?"

"ఎప్పుడేనా వెల్తురు చూస్తేనే కదా! చీకటిలోని ప్రశాంతత అనుభవించేది?"

"లేఽవండి బయల్దేరదాం."

ఇద్దరూలేచి నడుస్తున్నారు. పది అడుగులు వెయ్యగానే జె.జే. కాలు గోతిలోపడి, అతను పడిపోయేడు.

"నన్ను లేవదియ్యనివ్వండి" అంటూ చెయ్యి ముందుకు చాపింది ఆమె. అతనామె చెయ్యి పట్టుకున్నాడు. పట్టుపువ్వు పట్టుకున్నట్టయింది అతనికి. బలంగా ఆమెను తనమీదకు లాక్కొని గట్టిగా హృదయానికి హత్తుకోవాలనిపించింది.

తన హృదయంలో పాడే పిట్టను యిన్నాళ్ళూ ఎవరో గొంతుకి నొక్కిపట్టినట్టూ, యిప్పుడు పట్టు వదిలేసినట్టూ, తన కడుపులో ఏదో భారీ జంతువు అటునుండి యిటు వత్తిగిలినట్టూ అనిపించిందతనికి.

ఇంతలోనే అతని చెవులకి ఏదో శ్రావ్యమైన మంత్రం వినిపించింది. తన ఎదురుగా స్వామి అర్థపూరితంగా నవ్వుతున్నట్టయింది.

సిగ్గుపడి రాణీ ఊతతో అతను లేచేడు.

"దెబ్బ తగిలిందా?"

"లేదు."

"అదృష్టవంతులు, కాలు సరిచెయ్యనా?"

"అక్కర్లేదు, బాధ ఏం లేదు."

కారు చేరేరు ఇద్దరూ.

"నాకు కాళ్ళు కుంటుపడ్డాయి. డ్రైవర్ని నడపమందామా?" అంది

"అక్కర్లేదు. నేను నడుపుతాను."

స్టీరింగు దగ్గర కూర్చున్నాడు అతను. ప్రక్కనే ఆమె కూర్చుంది.

కారు స్టార్టు చేసేడు అతను. బైల్దేరేముందు కారు ఒక్క ఎగురు ఎగిరింది.

"అలవాటు తప్పింది. క్లచ్ ఒకసారి వదిలేసేను."

"పునః ప్రారంభంలో పట్టుతప్పడం సహజమే."

ఏమిటి ఆవిడ ఉద్దేశ్యం? ఆ మాటలకి రెండో అర్థం ఉందా? ఇందాక పడిపోయినప్పుడు తనలో కలిగిన ఆవేశం ఆమెకు తెలిసిపోయిందా?

"కారు నడుస్తున్నా ఈ చీకటి వలన ఒంటరితనం పోలేదు" ఆలోచనకి అడ్డు తగిలింది రాణీ!

"మీరు బొమ్మలు వేస్తారా?"

"ఇందాక కవిత్వం గురించి అడిగినప్పుడు అడగవలసిన ప్రశ్న యిది."

"అప్పుడు స్ఫురించలేదు."

"అయితే ఇప్పుడెందుకు వచ్చింది సందేహం?"

"మీ భావం అతి సున్నితంగా అంటే హైఫర్ సెన్సిటివ్‌గా కనిపించింది. అంచేత మీరు కవిత్వమయినా రాయాలి – బొమ్మలైనా వెయ్యాలి అనిపించింది."

"ఔను, బొమ్మలు వేస్తాను–అనడంకంటే వేసేదాన్ని అంటేనే నిజం."

"ఎగ్జిబిషన్ పెట్టేరా?"

"వన్ మేన్ షోలు జరిగేయి."

"ఇప్పుడు వెయ్యడంలేదా?"

"రెండేళ్ళయి మానేసేను."

"కారణం..."

"వేద్దామన్న కోరిక లేక."

"తిరిగి కలిగే అవకాశం లేదా?"

"చెప్పలేను. అసలు బొమ్మలు యెందుకు వేసేనో తెలీదు. ఒక్కొక్కప్పుడు ఏమి చేస్తున్నానో తెలిసేది కాదు. ఆ ఆవేశంలోనే కొన్ని మోడర్న్ పెయింటింగ్సు వేసేను."

"మీరు సాధారణంగా ఎప్పుడు వేస్తారు?"

"అంటే పొద్దున్నా? సాయం...?"

"కాదు. ఏ మూడ్‌లో ఉన్నప్పుడు?"

"మనసుకి తీవ్రమయిన అశాంతి కల్గినప్పుడు, పండు వెన్నెల్లో పువ్వుల పరుపుమీద కోరికలు తీరి పడుకున్నప్పుడు, నాలోని చిత్రకారిణి నిద్రపోతోంది. కాని బాధలు ఎక్కువైనప్పుడు – నేనుగాని, నా వారుగాని విడని చిక్కుల్లో యిరుక్కుపోయి నప్పుడు – బలమైన కోరిక చావకుండా, తీరకుండా ఉన్న ప్పుడు ..... మనసు దేనికోసమో పరితపించి పోతున్నప్పుడు.... నాలో దౌర్భల్యం, రసాస్వాదన రెండూ కలుగుతాయి. నేను బొమ్మలన్నీ అటువంటప్పుడే వేసేను."

"గాలికి యెగిరిన ఆమె సిల్కు పైట అతని మొహాన్ని కప్పింది. ఆమె సత్రున పైట లాక్కొని "అదృష్టవంతులం. ఇంకొంతసేపు నా పైట మీ కళ్ళు మూస్తే బొమ్మలు నేను కాదు, పత్రికలవాళ్ళు వేసేవారు." నవ్వుతూ అంది.

"రోడ్డు తిన్నగా ఉంటే ప్రమాదం రాదు. కాని యిక్కడే మలుపు ఉంది."

"ఇలాంటి ప్రమాదం వస్తేనే నాలోని ఆర్టిస్టు నిద్రలేస్తుంది."

"మీరు బొమ్మ వెయ్యాలంటే కారు గుద్దించెయ్యాలన్న మాట" అతను నవ్వేడు డేష్‌బోర్డులోంచి సిగరెట్ కేస్ తీస్తూ. తనొకటి తీసుకొని ఆమె కొకటి యిచ్చేడు!"

"అతను కారు నడిపి చాలా కాలమైంది. ఆ కారు స్టీరింగ్ మెత్తదనం అతనికి పాత జీవితపు మరిచిపోయిన సుఖాలు గుర్తుకు తెస్తున్నాది.

ఏదో పెద్ద ఊరు చేరేసరికి రాత్రి అయింది.

"ఇంక ఈ రాత్రి యిక్కడ ఆగుదాం" అంది రాణి.

"ఎక్కడ వుంటాం?"

"హోటల్లో. అలా కుడివేపు తిప్పండి."

కారు హోటల్ పోర్టికో చేరుకుంది. వారు కారు దిగ్గానే యూనిఫారంలో ఉన్న మనిషి కారు నడుపుకుపోయేడు.

"రెండు సూట్స్ ఎ.సి. ఉంటే మంచిది" అంది రాణి.

"పక్క పక్కన కావాలా?"

"ఎలా వున్నా ఫర్వాలేదు."

వాళ్ళ గదులు పక్క పక్కనే కుదిరేయి.

పంచె, లాల్చీ వదిలి, స్నానం చేసి సూటు వేసుకున్న జే.జే.కి కొత్త అవతారం యెత్తినట్టయింది. పాత పొర వదిలిన పాములా అతను ఉత్సాహంగా ఉన్నాడు.

హోటల్లో కనిపించే లైట్లకంటే కనిపించని లైట్లే ఎక్కువ కాంతినిస్తున్నాయి. కదిలే వెలుగు నీడల ఆటలో బాహ్య ప్రపంచ వైశాల్యం యింటి వెచ్చదనం ఆ హోటల్లో కలిసి ఉన్నాయి.

జే.జే. రాణీ గది తలుపు తట్టేడు. సమాధానం లేదు. కాని దూరంగా "షవర్" చప్పుడు వినిపించింది.

కొన్ని నిముషాలయ్యేక మళ్ళీ తట్టేడు.

"కమిన్" అంది రాణి.

అతను లోపలికి వెళ్ళేడు.

పాలిష్‌చేసిన మైనపు బొమ్మలా వుంది ఆమె. ప్రయాణ బడలికలేదు సరికదా అప్పుడే నిద్రలేచినంత ఫ్రెష్‌గా వుంది.

ఆవిడ మొహం మీద నీటిచుక్కలు...గులాబీమీద మల్లెల రసం–జల్లినట్టు ఉన్నాయి. ఆమె గులాబీ రంగు స్లీవ్‌లెస్ జాకెట్ ఆమె వంటి రంగులో కలిసిపోయింది.

ఆమె అతి సన్నని నూలు చీర అడుగున పరికిణీలేసు పాదాలకి వెండి లేసు గొలుసు తగిలించినట్టుంది.

"మిమ్మల్ని పోల్చుకోలేక పోయేను" అంది.

"ఏం?" ఆశ్చర్యపోతూ అడిగేడు. ఆమె అందం కాంతిలో అతని కళ్ళు మూతపడినట్టు అయింది.

"సూట్‌లో ఇదివరకు మిమ్మల్ని చూడలేదు."

"ఓహో! అదా?" తేలిగ్గా నవ్వేసేడు.

"ఇప్పుడో మనిషిలా ఉన్నారు. తన జాతివి కాని బట్టలు ఎవరికైనా కొంతసేపే బావుంటాయి."

"నిజమే. మిమ్మల్ని చీరలో తప్ప ఊహించలేం."

"అంటే!" ఆమె స్వరంలో కోపం కంటే ఆశ్చర్యమే యెక్కువుంది.

"అబ్బే, మిమ్మల్ని గౌనులో ఊహించలేమని అర్థం, అపార్థం చేసుకోకండి."

"మిమ్మల్ని ఏ పరిస్థితిల్లోనూ అపార్థం చేసుకోను."

"థేంక్స్."

"భోజనం ఇక్కడికే తెమ్మన్నాను. దయచేసి ఆ బెల్ నొక్కండి."

అతను బెల్ నొక్కేడు.

బేరర్ వచ్చేడు.

రాణి మెన్యూ కార్డు పరీక్షిస్తూ "ఇక్కడ రొట్టె, వెన్న తప్ప శాకాహారం ఏమీ ఉన్నట్టు లేదు. నాకు బాధలేదు. నేను మాంసాహారినే."

"ఆశ్రమంలో మాంసం తినడం మానేసేను."

"అక్కడ నేనూ తినను. మాంసం శాశ్వతంగా మానెయ్యమని మిమ్మల్ని స్వామి ఆదేశించకపోతే, నాతోపాటు భోంచెయ్యండి. పాపం మీరు బాగా భోంచేసి ఎన్నాళ్ళయిందో."

"అలాగే."

"మీరే డిన్నర్ ఆర్డర్ చెయ్యండి" అంటూ మెన్యూకార్డు అందించింది.

అతనా కార్డు చదువుతూంటే "ఎనీ డ్రింక్స్ సర్?" అన్నాడు బేరర్.

"నాకేం వద్దు. ఈవేళ వాటిమీద మనసులేదు. వారిని అడిగిపట్రా."

"యస్. మేడమ్" జవాబిచ్చేడు బేరర్.

"ఆరంభించాలంటే బీర్‌తో ఆరంభించండి. భోంచేసిన వెంటనే హాయిగా నిద్రపోవచ్చు."

"నేను–బీర్....."

"అంతకంటె స్ట్రాంగ్ డ్రింక్ కావాలంటారు."

"అబ్బెబ్బే..."

"ఐతే యీ పూటకి బీర్‌తో ఆపెయ్యండి. బీర్ పట్రా బోయ్."

బోయ్ వెళ్ళి బీర్ తెచ్చేడు మగ్‌లో.

"మీరు తీసుకోండి" అంది రాణి.

"మీ రెప్పుడయినా తాగేరా?"

"తాగుతాను కానీ, తాగుబోతును కాను."

"మీరు వీటికి ఇష్టపడతారా?"

"మూడ్ ఉంటే ఇష్టపడతాను. కాని అలవాటు పడను. అతి సన్నిహితుల కంపెనీలో తప్ప ముట్టను."

"బీర్ యెప్పుడేనా రుచి చూసేరా?"

"లేదు."

"ఇప్పుడు తాగి చూడండి."

"ఆడవాళ్ళు బీర్ తాగుతారా?"

"తాగకూడదన్న నిషేధం లేదు."

"ఇప్పుడు ఎంచేతో త్రాగాలని లేదు."

"మిమ్మల్ని నొప్పిస్తే క్షమించండి."

"అబ్బెబ్బే మీరు అపార్థం చేసుకోరని ఆశించేను. మిమ్మల్ని అపార్థం చేసుకోలేదని నమ్మించడానికైనా తీసుకుంటాను. సరేనా?"

ఆమె తన కోర్కెకు లొంగినందుకు అతను సంతోషించేడు.

భోజనం పూర్తి అయింది.

ఇద్దరూ కిటికీ దగ్గర నిల్చున్నారు.

సగం మరిచిపోయిన మధురానుభూతిలా అర్థ చంద్రుడు కిటికీలో నుండి కనిపించేడు.

కింద తోటలోని ఔత్‌ఖానా వెన్నెలని ధృవీకరించి పంపు కొడుతున్నట్టు ఉంది.

దూరంగా–ఏదో వెతుక్కుంటూ వెళ్తున్న వెండికళ్ళ మృగాల్లా – కార్లు వెళ్ళిపోతున్నాయి.

పార్కులో బెంచీమీద కూర్చున్న ప్రేమికుల జంటమీద ఔత్ ఖానా నీటితుంపర అమృత బిందువుల్లా పడుతోంది. ఆ యువ కుడి చెయ్యి తన ప్రియురాలి నడుంచుట్టూ వుంది. వారిద్దరూ ఏదో అతీతమైన పారవశ్యంలో మునిగిపోయినట్టు కళ్ళు మూసు కున్నారు. హఠాత్తుగా ఆ యువకుడు ఆమెను గుండెలకి హత్తు కున్నాడు.

ఆ దృశ్యం చూడగానే రాణి వెనక్కి వచ్చేసింది. ఆమె వెనకాలే జే.జే. కూడా వచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

అతని గుండెల్లో పాతబాంబు ఫ్యూజ్ అంటుకున్నట్టు అయింది. అతను కళ్ళు మూసుకున్నాడు.

"నిద్ర వస్తోందా?" లాలనగా అడిగింది.

"లేదు."

"అయినా అలిసిపోయి ఉన్నారు. పోయి పడుకోండి."

తనని చూసి ఆమె భయపడుతోందా? అంత పశు ప్రాయు డనని అనుకొంటోందా? ఈమె చదువూ, సంస్కారమూ చర్మందాటి లోపలికి వెళ్ళలేదా?"

అతను లేచి "గుడ్‌నైట్" అని నడవసాగేడు.

"గుడ్‌నైట్, స్లీప్‌వెల్" అంటూ ఆమె తలుపు వేసుకుంది.

ఆ రాత్రి–తన గుండెల్లోని మరలు ఏవో వెనక్కి తిరుగుతు న్నట్టు అనిపించి–అతనికి చాలా సేపు నిద్రపట్టలేదు.

## 54

"గుడ్‌మార్నింగ్! మిమ్మల్ని చూస్తే రాత్రి బాగా నిద్రపోయేరా అని అడగక్కర్లేదు" మర్నాడు ఉదయం ఫ్రెష్‌గా వున్న రాణీని పలకరించేడు జే.జే.

"గుడ్‌మార్నింగ్. ఆ ప్రశ్న మిమ్మల్ని కూడా అడగ క్కర్లేదు" నవ్వుతూ జవాబిచ్చింది రాణీ.

మాట మెలిపెట్టగలిగిన మనిషి అనుకున్నా డతను.

"హోటల్ చాలా బాగుంది" అన్నాడు.

"విదేశీయులు, మీకు నచ్చిందంటే నిజంగా బాగుందన్న మాట. మరో రోజు ఉందామంటే..."

"ఉందామని కాదు."

"ఇంటిదగ్గర పనులు నిలబడిపోయేయి."

తన వ్యక్తిత్వాన్ని నిలుపుకునే మనిషి అనుకున్నాడు.

"తొమ్మిది గంటలకి బైల్దేరితే సాయంత్రానికి చేరిపోతాం. మీరు సరే అంటే హోటల్ మేనేజర్ని మా యింటికి ట్రంక్‌కాల్ చెయ్యమంటాను మనం వస్తున్నట్టు".

"సరే."

ఉదయం తొమ్మిది గంటలకి బయలుదేరి సాయంత్రానికి ఆమె ఊరు చేరుకున్నారు.

రాణీగారి "వాణీ మహల్" రోడ్డుమీదకు కనిపించదు. అందుకు కారణాలు ఎత్తయిన ప్రహారీగోడా, దట్టంగా పెరిగిన చెట్లూ!

ఆ చెట్లకింద వెల్తురు పట్టపగలే ఆకుపచ్చని చీకటిలా ఉంటుంది. దాని ఆవరణలో పళ్ళచెట్లూ, పూలతోటలూ ఉన్నాయి. వాటి మధ్య పెంపుడు నెమళ్ళూ, లేళ్ళూ, కుందేళ్ళూ స్వేచ్ఛగానూ, చనువుగానూ తిరుగుతూ ఉంటాయి.

ఆ మహల్ వీధిమెట్లు అతి విశాలంగా ఉండి పాలగాజుతో చేసినట్టున్నాయి. ఆ మెట్లకు ఆ చివరా యీ చివరా దంతపు కుండీల్లాంటి కుండీల్లో ఏవో చిత్రమైన మొక్కలు పాలుపోసి పెంచినట్లు అతి తెల్లని పూలు పూసేయి.

మేడమీద నుండి వీధి మెట్లమీదకు జారిన పూలతీగ యింటికి వచ్చే వారిమీద ఆహ్వాన పూర్వకంగా పూలు జల్లుతుంది.

సామాన్యులకు ఆ యింటి వరండా దాటి ప్రవేశం లేదు అని పించేటట్టు ఆ యిల్లు అతి గంభీరంగానూ, ఎంతో దర్జాగానూ ఉంది.

కారు ఊరు చేరకముందే రాణీ నౌకర్నీ, డ్రైవర్నీ ముందు సీట్లోకి రమ్మని జే.జేతో సహా తను వెనుక సీటులోకి మారి పోయింది.

కారు కాంపౌండ్ చేరేసరికి గేటు దగ్గర ఖాకీ యూనిఫారంలో ఉన్న నౌకరు సలాంకొట్టి గేటు తీసేడు. కారు ఎన్నో ఎకరాల

తోటదాటి మెట్ల దగ్గరికి వచ్చేసరికి ఆరుగురు ఆడా, మగా నౌకర్లు బెరుకు నవ్వులు నవ్వుతూ పరుగెత్తుకొని వచ్చేరు.

మగ నౌకర్లకు తెల్లపాంట్లూ, తెల్లకోట్లూ, నడుముకు బెల్టులూ, తలలకి ఎత్తయిన చెమలాలూ ఉన్నాయి. ఆడ నౌకర్లకి అతి సన్నని తెల్లచీరెలూ, తెల్ల జాకెట్లూ ఉన్నాయి.

రాణీ వాళ్ళందరికీ కలిపి ఒకే ఒక చిరునవ్వు యిచ్చింది. ఆ ఒక్క నవ్వే మహద్భాగ్యమన్నట్టూ దానిక్కూడా తాము తగ మన్నట్టూ భయపడుతూ వాళ్ళు ప్రతిమందహాసం చేసేరు. ఈ లోగా చిన్నా పెద్ద కుక్కల మంద వచ్చి ఆమెను చుట్టేసింది. ఆ మందలో కుక్కలన్నీ ఒక్కసారే రాణీని కౌగిలించుకోవాలని ప్రయత్నించేయి. రాణి అన్నింటినీ తప్పించుకొని అడుగు ముందుకు వెయ్యడానికి ప్రయత్నించింది.

ఒక్కక్షణం–భూమి కుక్కలను ఈనిందా అన్నట్టు–ఆ ప్రదేశం అంతా చాపిన నాలుకల ఎర్రదనంతోనూ, ప్రేమపూరితమైన వాటికళ్ళ మెరుపులతోనూ మెరిసిపోయింది.

ఆఖరికి వాళ్ళంతా హాల్లోకి ప్రవేశించేరు. ఐశ్వర్యానికి అలవాటు పడిన జే.జే.క్కూడా ఒక్కసారి దిగ్భ్రాంతి కలిగింది ఆ హాలు. ఆ హాల్లో మధ్య–చిత్రమైన గాజు జూకాలా షాండి లీర్ వెలుగుతోంది! దానిలో బల్బులు యెక్కడ తయారు చేశారోకాని, వెలుగుతున్న కొవ్వొత్తుల్లా ఉన్నాయి. చిన్నపిట్ట యెగిరి పోయి నప్పుడు కొమ్మ కదిలినట్టు–గాలికి ఆ షాండిలీర్ కదిలి నప్పు డల్లా గదినిండా కదిలే రంగులా కాంతి పడి అక్కడున్న వారికి ఏ వింత సరస్సు అడుగునో ఉన్న అనుభూతి కలుగుతుంది.

ఆ పెద్దహాల్లో నేల ఇదేనా అనిపించేటంత పెద్ద నల్ల టేబులు ఉంది. ఆ టేబులు చుట్టూ ఎన్నో కుర్చీలు ఉన్నాయి. ఆ కుర్చీల కాళ్ళు మైనంతో చేశారా అని భ్రమ కలిగేటంత వంగి ఉన్నాయి. ఆ హాలు గోడలమీద ఎత్తుగా కొంతమంది స్త్రీ పురుషుల తైలవర్ణ చిత్రాలు ఉన్నాయి. వాటి మీద లైట్ల వెలుతురు పడకపోవడం వలన ఆ చిత్రాల్లోని మనుషులు పాత చీకట్ల తెరలమాటునుంచి తొంగి చూస్తున్న దయ్యం మనుషుల్లా ఉన్నారు.

ఆ హాల్లోంచి మేడమీదకు విశాలమయిన మెట్లున్నాయి. ఆ మెట్లు కొమ్ముతో చెయ్యబడినట్లు అతినల్లగానూ, నున్నగానూ ఉన్నాయి.

ఆ హాల్లో మధ్య పరచిన తివాసీ తామర పువ్వుల రసంతో నిండిన ఎర్ర సరస్సులా వుంది. ఆ హాల్లోకి వెళ్ళే సామాన్యులకు భయమూ, భక్తీ, ఒక్కసారి కలుగుతాయి. అక్కడ వారు మెల్లిగా రహస్యం చెబుతున్నట్టు మాత్రమే మాట్లాడగలుగుతారు.

అక్కడ గట్టిగా నవ్వడం ఘోర నేరంలా కనిపిస్తుంది. అక్కడ ఏడిచే ధైర్యం ఎవరికీ కలగదు. అక్కడ నౌకర్లు శబ్దరహితంగా – గాలిలో సాగిపోతున్న దయ్యాల్లానడుస్తారు. జవాబు చెప్ప డానికి మాత్రమే మాటలు నేర్చుకున్నట్టు ప్రవర్తిస్తారు.

మిగిలిన ఇల్లు కూడా హాలుకి తగినట్టే ఉంది.

"వీరికి బెడ్ రూమ్ము యివ్వండి" అంది రాణి.

ముగ్గురు నౌకర్లు సలాంచేసినట్టు ముందుకు వంగేరు. ఆ తర్వాత వారు జే.జే.ని రెండో అంతస్తు మీదికి తీసుకొని వెళ్ళేరు.

తన గదిలో కూర్చున్న జే.జే. టికెట్ లేకుండా ఫస్టుక్లాసులో ప్రయాణం చేస్తున్నట్టు ఫీలయ్యేడు. అతను స్నానం పూర్తిచేసిన వెంటనే భోజనానికి పిలుపు వచ్చింది.

టేబిలుకి–ఆ చివరా, యీ చివరా కూర్చున్నారు జే.జే. రాణీ. తమ యిద్దరి మధ్యా మైళ్ళదూరం ఉన్నట్లనిపించింది అతనికి.

భోజనం దగ్గర సామానంతా వెండిదే. అందులో ముప్పాతిక భాగం విదేశాలనుండి తెప్పించినదే.

"ఈవేళ శనివారం, అంచేత శాకాహారమే" క్షమాపణ చెప్పు కుంటున్నట్టు కాక "ఇది మా పద్ధతి" అని తెలియపరు స్తున్నట్టు అంది రాణి.

"మద్యపానం కూడా నిషేధిస్తారా ఈ రోజు?" సందేహంగా అడిగేడు జే.జే.

"మా ఇంట్లో యెవరూ యీ రోజు తీసుకోం. అతిధులకి అభ్యంతరం ఉండదు. కాని వారి గదుల్లో సర్వ్‌చేస్తాం."

జే.జే. మాటాళ్ళేదు.

"మీకు కావాలంటే మీ గదిలోకి వెళ్ళాల్సి ఉంటుంది."

ఎంత అధికారం ఉంది ఆమె గొంతులో అనిపించింది అతనికి. ఇంటికి చేరిన ఆమె మనఃప్రవృత్తే మారిపోయింది. అది వరకు ఆమె జే.జే.కి సమానురాలిగా ప్రవర్తించింది. కాని ఇక్కడ ఆజ్ఞలు యివ్వడానికే పుట్టిన నియంతలా ఉంది. పైగా ఆమె శాసనం అతి సహజంగా ఉండడం చేత ధిక్కరించాలని ఎవరికీ ఉండదు."

"తాగకుండా ఉండగలను."

"గుడ్. నియమంలేని ఆనందం దుఃఖానికి ముఖద్వారం. మా వంటలు మీకు నచ్చుతాయని ఆశిస్తాను."

భోజనం నిశ్శబ్దంగా సాగుతోంది. పని మనుషులు బాగా ఆయిలు వేసిన మనుషుల్లా నడుస్తున్నారు. వారి మొహాల్లో ఏ భావం లేదు. ఎవరేనా వాళ్ళందరినీ వరసగా వారం రోజులు చూసినా, వారిలో ఏ ఒక్కరినీ విడిగా ఎనిమిదవరోజు పోల్చుకోలేరు.

భోజనం పూర్తి అయింది.

"మీరు చాలా అలిసిపోయేరు. అంచేత ఇంక మేలుకోవడం మంచిది కాదు. హాయిగా పడుకోండి. గుడ్‌నైట్" అంటూ లేచింది ఆమె.

"గుడ్‌నైట్" అంటూ చెయ్యి ముందుకు చాపేడు అతను.

ఆమె చెయ్యి చాచడానికి క్షణం ఆలోచించినట్టు ఆలస్యం చేసింది. అతను ఆమె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. ఆ చేతిలో పట్టులేదు. అతను ఆమె చేతిని వదిలేసేడు.

ఆమె బలహీనంగా నవ్వింది.

# 55

మర్నాడు ఉదయం, ఫలహారం అయిన తర్వాత.

"మీరు వేసిన చిత్రాలు చూద్దామా? అడిగేడు జే.జే.

"నా స్టూడియో మూడో అంతస్తులో ఉంది. రండి వెళదాం."

అతన్ని స్వయంగా తీసుకొని వెళ్ళింది ఆమె.

ఇల్లు యెంత శుభ్రంగా ఉందో, స్టూడియో అంత అశుభ్రంగా ఉంది. అక్కడ ఉన్న ప్రతి వస్తువుమీదా కావాలని జల్లినట్టు సన్న ధూళి వుంది. కడగని బ్రష్‌లూ, తుడవని రంగు ముద్దలూ, పూర్తిచెయ్యని చిత్రాలూ, చిరిగిన స్కెచెస్–చాలా చోట్ల పడి ఉన్నాయి.

"చాలా రోజుల్నుంచీ ఈ స్టూడియో వాడడం లేదని అనుకుంటున్నారు కదూ?"

"ఔను."

"చాలా రోజుల్నుంచీ వాడనిమాట నిజమే. కాని నేను వాడేరోజుల్లో కూడా యింత అశుభ్రంగానే ఉంటుంది."

"ఏం?" అప్రయత్నంగా అడిగేడు.

"నాకు మనుషుల సాంగత్యం అయిష్టం కాదు. కాని నేను చిత్రిస్తున్నప్పుడు మాత్రం ఎవరినీ సహించలేను. ఎవరిదైనా పోర్ట్రేట్ వేస్తే వారిని మాత్రం ఉండనిస్తాను. అసలు నేను తరుచుగా పెయింట్ చెయ్యను. చేస్తే మాత్రం ఒక్కోసారి వారం రోజులు కూడా ఇక్కడే ఉండిపోతాను. అప్పుడు నాకు మామూలుగా ఏమీ తినాలన్న కోరిక ఉండదు. ఎప్పుడైనా తినాలన్న కోరిక–కలుగుతుంది. అంతేకాదు. నాకు స్టూడియో ధూళితో డర్టీగా ఉంటేనే యిష్టం. అతి క్లీన్‌గా ఉండి, ప్రతి వస్తువూ ఉండవలసిన స్థలంలో ఉంటే అసలు నాకు మూడ్ రాదు. చిత్రం మధ్యలో కావల్సిన రంగు కనిపించకుండా ఉంటేనే నాకు ఎన్ని రోజులైనా పని చెయ్యాలని ఉంటుంది."

ఆమె వేపు ఆశ్చర్యంగా చూసేడు జే.జే.

"నాకు పిచ్చి ఉందంటారా?" లేదని చెప్పమని ప్రాధేయ పడుతున్నట్టు అడిగింది. అప్పుడామె తన మోకాళ్ళవరకూ కృంగిపోయిన పిల్లలా కన్పించింది. జే.జే.కి–ఆమెని పసిపిల్లని తీసుకున్నట్టు చేతుల్లోకి తీసుకొని ఎత్తి ముద్దు పెట్టుకోవాలని పించింది. స్టూడియోలోకి వచ్చిన దగ్గర్నుండే ఆమెలోని మార్పు అతను కనిపెడుతూనే ఉన్నాడు. అంతవరకూ ఆమెలో వున్న రాజసం, ఠీవీ, గాంభీర్యం అన్నీ పోయి, నిస్సహాయురాలైన చిన్న పిల్లలా అయిపోయింది. తను అనే ప్రతి మాటకూ అతని ఆమోదం కోరుకుంటున్నట్టు కనిపిస్తుంది.

"ప్రతి కళాకారుడు అంతో యింతో పిచ్చివాడే! వాన్ గో కథ మీరు విన్లేదా? మొపాసాని పిచ్చాసుపత్రిలో కూడా పెట్టేరు."

"నాకు ఎప్పటికైనా పిచ్చి పడుతుందంటారా?"

"పిచ్చితోపాటు కళ కూడా పోయే ప్రమాదం వుంది."

ఆమె మొహంలో ఏదో భయంకరమైన మార్పు వచ్చింది. మొహం కళ్ళూ ఎర్రబడిపోయేయి. ఆమె వళ్ళు జోగడం ఆరంభించింది. ఆమె రెండుసార్లు తనలో తాను తిరిగి దగ్గర్లో ఉన్న కుర్చీలో కూలబడిపోయింది. ఆమె కళ్ళు మూతపడిపోయేయి. ఉచ్ఛ్వాస నిశ్వాసలు భారంగా వస్తున్నాయి. ఆమెను ఏదో భయ పెడుతున్నట్టు – అప్పుడప్పుడు మొహం వంకర్లు పోతున్నాది. ఆమెకు స్పృహ పోయిందని అతడు భయపడి ఆమెను ఎత్తుకొని పక్కనే వున్న సోఫాలో పడుకోబెట్టేడు. ఆమె ఊపిరి తీసుకోవడానికి పడే బాధ స్పష్టంగా కనిపిస్తున్నాది. ఆమె జాకెట్టు మెడవద్ద వెడల్పైన గట్టి బెండు ఆమె కంఠాన్ని నొక్కుతున్నది. సందేహించకుండా ఆ పట్టీ వదులు చేసేడు అతను. పట్టీ వదులుకాగానే

జాకెట్ తాలూకు రెండు ప్రెస్ బటన్స్ వాటంతటే అవి విడి ఆమె వక్షం బైటపడింది. అతడు ఆత్రంగా మూలనున్న "సింక్" దగ్గరకు పరిగెత్తి గ్లాసులో నీళ్ళుపట్టి ఆమె వేపు తిరిగేడు.

ఆమె వక్షం వంపూ, మెడ నునుపూ అతన్ని ఆకర్షించేయి. అంత నిస్సహాయంగా పడివున్న ఆమెను గాఢంగా గుండెలకు హత్తుకోవాలని తనలో గలిగిన కోర్కెకు అతను ఎంతో సిగ్గుపడి క్షణం కళ్ళు మూసుకున్నాడు. కళ్ళు విప్పేసరికి అతనికి పక్కనున్న స్టాండు మీదున్న అసంపూర్తి చిత్రం మీద అతని కళ్ళుపడ్డాయి. ఆ చిత్రం ఇంకా ప్రారంభ దశలోనే ఉంది. స్కెచ్‌లో ముఖ్యమైన రేఖలు మాత్రం ఉన్నాయి. ఆ స్కెచ్ ఎంతో పరిచయస్తుని ముఖంలా ఉంది. దానివేపు తీక్షణంగా చూసేడు. ఆ స్కెచ్‌లోంచి స్వామి నవ్వుతున్నట్టయి అతని వళ్ళు భయంతో వణికింది. దానివేపు మళ్ళీ చూడకుండా అతను రాణీవద్దకు వెళ్ళి ఆమె మొహంమీద నీళ్ళు జల్లేడు.

మంచు నీళ్ళకి ఆమె మొహం మల్లె మొగ్గలా విడింది. కాని వెంటనే ఆమె పెదవులు భయంతో వణికిపోయేయి. వంగి ఉన్న అతని కోటు కాలరు ఆమె గట్టిగా పట్టుకొని "చెప్పండి. నాకు పిచ్చి పట్టదని మీరు ఎందుకనలేదు?మా అమ్మకు పిచ్చి ఉంటే నాకు కూడా వస్తుందని మీ రెందుకనుకుంటారు? చెప్పండి నాకు పిచ్చెత్తదని చెప్పండి. మిమ్మల్ని బతిమాలు తున్నాను. ప్రార్థిస్తున్నా. మీ కాళ్ళు పట్టుకొని వేడుకుంటున్నాను. నాకు పిచ్చిలేదని చెప్పండి. చెప్పరూ? ప్లీజ్. నా పిల్లలు పిచ్చిదాని పిల్లలు కావడానికి వీల్లేదు. భగవాన్! ఏమిటి నాకీ పరీక్ష? మీ రెవరు నాకు పిచ్చెత్తించటానికి? అతనే పంపించి ఉంటారు. మీరు 'అతని' మనుషులు." పిచ్చిగా పేలుతూ అతని కంఠం పట్టుకుంది ఆమె.

"ఆవేశపడకండి. మీకు పిచ్చిలేదు. నా మాటలు నమ్మండి."

ఆ తర్వాత అంతా అతి త్వరగా జరిగిపోయింది. ఆమెని ఆమె గదిలోకి చేర్చేరు. డాక్టరు వచ్చి ఏదో ఇంజక్షను ఇచ్చి ఆమెకు ఎటువంటి ఆరాటమూ కలిగించకూడదని చెప్పి, జే.జే.ని "మీ రెవరు?" అని అడిగేడు.

"ఒక్క ముక్కలో చెప్పలేను."

"మీరు ఆమెకు ఎలాంటి ఆవేశమైనా కలిగించేరా?"

"అంటే..."

"ఏం లేదు. ఆమెకు ఇటువంటి ఆందోళన వచ్చి సంవత్సరం దాటి పోయింది. మరి రాదేమోనని ఆశించేం. నేను వారి ఫేమిలీ డాక్టరుని. కాని మిమ్మల్ని ఎప్పుడూ చూడలేదు. రాణీ గారు కూడా మీ గురించి నాతో ఎప్పుడూ చెప్పలేదు."

"నేను ఆమెకు కొత్త స్నేహితుడిని."

"నేను ఎటువంటి రిస్కు తీసుకోలేను. ఆమె పూర్తి మామూలు మనిషి అయ్యేవరకూ మీరు ఆమె దగ్గరకు వెళ్ళకండి. బహుశా రేపటికి ఆమె కోలుకోవచ్చును."

"అలాగే"

డాక్టరు వెళ్ళిపోయేడు.

ఆ రోజంతా జే.జే. రాణీ గురించే ఆలోచించేడు. ఆమెకు అంత మానసిక అలజడి ఎందుకు కలిగింది? ఆమె పట్ల తను ఏ విధంగానూ తప్పుగా ప్రవర్తించలేదే! కాని తనకి తెలిసినంత వరకు రాణీ ప్రవర్తనకి ఏ యితర కారణాలూ లేవంటాడే డాక్టర్? ఎక్కడుంది ఈ రహస్యం?

మామూలుగా నిశ్శబ్దంగా ప్రవర్తించే నౌకర్లు ఆ వేళ యింకా నిశ్శబ్దంగా గోడమీద కదిలే నీడల్లా సంచరించేరు.

ఆ మహలు మీద ఏదో విషపు నీడ పడినట్టు ఆ రోజంతా మరీ అసహజంగా వుంది.

## 56

మర్నాడు ఉదయం...........

డాక్టర్ రాణీని పరీక్షచేసిన తర్వాత బైటకువచ్చి జే.జే.తో "ఆమె ఆరోగ్యం పూర్తిగా కోలుకున్నారు. మిమ్మల్ని చూడాలంటు న్నారు. మీరు వెళ్ళవచ్చు" అన్నాడు.

మునివేళ్ళ మీద నడుస్తూ రాణి గదిలోకి వెళ్ళేడు జే.జే.!

చీకటీ, వెల్తురూ కాని ఒక వింత వెలుగులో ఒక ఎత్తయిన పందిరి మంచం మీద నిస్సహాయంగా జబ్బు పిల్లలా పడి ఉంది రాణీ. మంచం పక్కనే ఉన్న కుర్చీమీద కూర్చోబోతున్న జే.జే.ని తన మంచం మీద కూర్చోమని ఆమె చెయ్యి ఎత్తి నీరసంగా సౌంజ్ఞ చేసింది.

ఆమె ఆజ్ఞ మన్నించేడు అతను.

ఆ పరిస్థితిలో ఆమెని చూసిన అతనికి గుండెలో ఏదో వెల్తిగా అనిపించింది. నిన్నటి ఆమె రాజసం, ఠీవీ ఏమయ్యేయి?

ఇదివరకటి ఆరోగ్యమేమైంది? మొహం పాలిపోయి కుంచించుకు పోయింది. నీరసం వల్ల ఆమె కళ్ళు మరీ పెద్దవిగా కనిపిస్తున్నాయి. ఆమె పల్చటి పెదిమలు మరీ పల్చగా అయిపోయేయి. దువ్వని జుట్టు, మొహంలో నీరసాన్ని ఎక్కువ చేస్తోంది. ఆమె పాపం చేసినదానిలా బాధపడుతోంది.

"నిన్నటి నా ప్రవర్తనకు సిగ్గుపడుతున్నాను" తప్పు ధైర్యంగానే ఒప్పుకున్నా సిగ్గుతో తల గోడ పక్కకి తిప్పుకుంది. అప్పుడు అతను ఆమెను జబ్బుపిల్లగా కాక మరోరకంగా చూడలేక పోయేడు. ఆమెను ఒడిలోకి తీసుకొని బుజ్జగించాలనిపించింది. అతనామె చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. పాలిపోయిన ఆమె గోళ్ళు పల్చని దంతం ఆకుల్లా ఉన్నాయి.

"ఆ విషయం మరిచిపోండి" మాటలు తూస్తున్నట్లు నెమ్మదిగా అన్నాడు.

"నిన్న నేను ఏం మాట్లాడేనో గుర్తులేదు."

"మీరేం తప్పు మాటాళ్ళేదు."

"ఐతే నేనెందుకు అలా అయిపోయేను?"

"నేను సరిగా చెప్పలేను. బహుశా మీది అతి సున్నితమైన మనస్తత్వం కావచ్చు."

'పాపం నా చిత్రాలు చూడాలని ఎంతో కోరుకున్నారు! చూపించనేలేదు."

"ఫర్వాలేదు. మరోనాడు చూస్తాను."

"నేను చూపించే వరకూ దయచేసి వెళ్ళిపోకండి."

"మీరు తిరిగి మామూలుగా అయ్యేవరకూ మీకు తోడుగా ఉంటాను-అంటే-మీకు యితరత్రా అభ్యంతరం లేకపోతే...."

"ఆనందం అభ్యంతరాన్ని నెట్టేస్తుంది."

"ఇప్పుడెలా ఉంది మీ ఒంట్లో?"

"బాగానే ఉంది కాని డాక్టరుగారు వారం వరకూ గది దాటొద్దన్నారు. మరీ చాదస్తం."

"మన అజ్ఞానంవల్ల శాస్త్రమే చాదస్తంలా కనిపించవచ్చు. కాని వైద్యుడి సలహా అతిక్రమించడం అనర్థం."

"పాటిస్తాను. కాని ఒక కోరిక, మీరు రెండు పూటలూ నాతో ఇక్కడే భోంచెయ్యాలి."

"సంతోషంగా."

మరి కొంతసేపు రాణీ గదిలో ఉండి తిరిగి తన గదిలోకి వెళ్ళి పోయేడు జే.జే. తన గది చేరుకున్న అతనిలో విచిత్రమైన భావం కలిగింది. అతనికి అకస్మాత్తుగా తను ఏదో అపరిచిత హోటలు గదిలోకి వెళ్ళినట్టు అనిపించింది. రాణీ గదిలో ఉన్నంతసేపూ అతనికి తన స్వంత ఇంట్లో, ఎంతో ఆత్మీయురాలైన ఒక మంచి స్నేహితురాలితో ఉన్నట్లనిపించింది.

ఆ ఉదయం నుండీ తమిద్దరి పరిచయం మరీ బలపడింది. అందుకు కారణం బహుశా ఆమె అనారోగ్యంగా ఉండడమేమో? అంతే అయి ఉంటుంది. ఏమయితేనేం? రాణీ దగ్గర ఉన్నంతసేపూ తనకి ఆఖరికి తను పరాయి దేశంలో అపరిచిత వాతావరణంలో ఉన్నానన్న విషయం కూడా గుర్తురావడంలేదు.

ఆ సాయంత్రం "టీ"కి అతను ఆమె గదికి వెళ్ళేడు.

పడమటి కిటికీలోంచి పడే బంగారు కాంతిలో ఆమె వింతగా మిలమిల్లాడుతోంది.

అతను వచ్చేక ఆమె పక్కనున్న గాజుకుండీలో నుంచి ఒక గులాబీని తీసి, దువ్వని జుట్టులో పెట్టుకుంది. ఆ గులాబీ కూడా ఆమెలాగే కాస్త వాడి వుండడంవల్ల, ఆమెకు ఎంతో అందాన్నిచ్చింది.

"పువ్వులంటే నాకెంతో పిచ్చి" అకస్మాత్తుగా అంది.

"పువ్వులు ఇష్టంలేని వాళ్ళుంటారా?"

"నా పిల్లలు ఇష్టపడరు."

"మీ కెంతమంది పిల్లలు?" అడిగిన తర్వాత సభ్యత కాదేమో అనిపించింది అతనికి.

"ఇద్దరు. ఒక అబ్బాయీ, ఒక అమ్మాయీ. సిమ్లాలో చదువుకుంటున్నారు."

"మీ భర్త.." ఎన్నాళ్ళనుండో అణచుకున్న ప్రశ్న తెగించి అడిగేసేడు.

"ప్రస్తుతం మీ దేశంలో ఉంటున్నారు." కళ్ళు దించుకొని అని "మనస్తత్వాలు సరిపడక విడిగా ఉంటున్నాం" అని కలిపింది.

ఇంత మెత్తని మనస్తత్వంతో సరిపెట్టుకోలేని భర్త చాలా స్వార్థపరుడు అయి ఉండాలనిపించింది జే.జే.కి.

"నాకు పువ్వులంటే ఎంత ఇష్టమో, పక్షులంటే అంతకంటే ఎక్కువ ఇష్టం."

"పక్షులు స్వాతంత్ర్యానికి చిహ్నలేమో అనిపిస్తుంది."

"మీకు బంగారు పిచ్చుకలంటే యిష్టమేనా!"

"చాలా!"

"అయితే ఆ మందార పువ్వులమీద వాలిన ఆ జంటని చూడండి ఆ పువ్వు రేకులు వంగనంత తేలిగ్గా ఉన్నాయి అవి."

"వాటి అందానికి సరిపోయే గూళ్ళు కూడా కట్టుకుంటాయి అవి."

"అంతేకాదు. అవి గూడు కట్టేముందు ఆ సంవత్సరం వర్షాలు ఏ దిక్కు నుండి వస్తాయో తెలిసి దానికి ఎదురు దిక్కు వేపు గూటి ద్వారాలు పెడతాయట."

"నిజం?"

"నిజం.కాని అంత అందమైన వాటికి, ఎంత స్వార్థమో తెలుసా? వాటి గూళ్ళలో మట్టిముద్ద పెట్టి, ఆ ముద్దలో మిణుగురు పురుగుల్ని గుచ్చుతాయట. ఆ పురుగులు వాటికి రాత్రివేళ లైట్లలా ఉపయోగిస్తాయిట."

"సృష్టిలో అందం వెనక స్వార్థం ఉందేమో?"

"నాకు అందం ఉందో లేదో తెలీదు కాని స్వార్థం మాత్రం ప్రస్తుతం చాలా ఉంది. బాగా ఆకలి వేస్తోంది. 'టీ' తెమ్మంటాను" అని నవ్వుతూ పక్కనున్న బెల్ నొక్కింది.

నౌఖరు వచ్చి తలవంచుకొని నిల్చున్నాడు.

"'టీ' తెమ్మను".

తర్వాత 'టీ' వచ్చింది.

'టీ' తాగేక "నిన్నటి నుంచీ సిగరెట్ కాల్చలేదు." అంది ఆమె.

"నేనూ కాల్చలేదు" ఆశ్చర్యంగా అన్నాడు అతను.

"అయితే యిందండి" అంటూ సిగరెట్ అందించింది ఆమె.

# 57

రోజులు గడుస్తున్నాయి.

రాణీ బైటకు నవ్వుతూ కనిపిస్తున్నా, లోపల ఏదో తీవ్రమైన బాధకు గురి అయిన దానిలా, ఆమె రోజురోజుకూ చిక్కిపోతోంది.

ఆమె కళ్ళు ఎంతో నీరసంగా కనిపిస్తున్నాయి. వారం రోజుల్లో తిరగవచ్చును అన్న డాక్టర్ మరో వారం వరకూ గది దాటనివ్వలేదు.

జే.జే. ఎక్కువ కాలం రాణీ గదిలోనే గడుపుతున్నాడు. ఆమె దగ్గరున్నంతసేపూ తన పాపాల బాధలు మరిచిపోగలిగిన మనిషిలా ఎంతో ఉత్సాహంతో ఉంటున్నాడు. కాని తన గదికి తిరిగి రాగానే అతను వంటరిగా ఫీలవడమే కాకుండా, అతనికి తన పాత అశాంతి అంతా ఒక్కసారి వచ్చేస్తోంది.

# 58

కొన్ని రోజులు సెంటు వాసనల తెమ్మెర్లలా గడిచిపోయేయి.

ఆ రోజు ఆదివారం.

ఉదయం డాక్టరుగారు వచ్చినప్పుడు జే.జే.రాణీ గదిలోనే ఉన్నాడు. రాణీని డాక్టరు పరీక్ష చేస్తున్నప్పుడు అతను బైటకు వెళ్ళడానికి సోఫాలోంచి లేచేడు.

"ఫర్వాలేదు. మీరు ఉండొచ్చు" అన్న డాక్టర్ మాటలకు తిరిగి సోఫాలో కూర్చుని రాణీ ఎదురుగా ఉన్న కిటికీలోంచి దూరంగా కనిపిస్తున్న చేల పచ్చదనం చూడ నారంభించేడు.

ఆ గది నిశ్శబ్దంలో అతనికి రాణీ ఉచ్ఛ్వాస నిశ్వాసల శబ్దం స్పష్టంగా వినిపిస్తోంది. అతనికి ఎందువల్లనో-తనని చీకటి గదిలో ఎవరో బంధించేసినట్టూ, ఆ గదిలో యెంతో ఎత్తుగా వున్న కిటికీలో నుండి ఏదో రంగుల పిట్ట తాలూకు ఊడిపోయిన పంచ రంగుల వెంట్రుకలు అందంగా యెగురుతూ కనిపించి నట్లూ అయింది. అతని వెనక బట్టలు సవరిస్తున్న శబ్దం వినిపించింది.

"డాక్టర్! ఎల్లుండి పద్దెనిమిదో తారీఖు" అంది రాణీ.

"మరిచిపోలేదు" డాక్టరు జవాబు.

"గుర్తుంచుకున్నంత మాత్రాన ఏం లాభం?"

"ఇప్పటిలా మీరుంటే రేపటితో వైద్యం ఆపేస్తాను"

"అంటే..."

"మీ రివాజు ప్రకారం మీరు మీ ఫారెస్టు బంగళాలో పుట్టిన రోజు జరుపుకోవచ్చుని."

"థేంక్స్, థేంక్స్ ఎ లాట్ డాక్టర్."

"మీతో యెవరినైనా మాత్రం తీసుకొని వెళ్ళండి,"

"అలాగే."

"మీ దేహ పరిస్థితి ఏ మాత్రం మారినా మీరు మాత్రం అక్కడి నుండి కదలవద్దు, నాకు ఫోన్‌చేస్తే వెంటనే వస్తాను."

"అలాగే."

"పోనీ యీ సంవత్సరం ఇక్కడే వుంటే."

"దయచేసి అభ్యంతరం పెట్టకండి డాక్టర్."

"మీ యిష్టం.....జే.జే. గారికి వీలుంటే వారిని కూడా తీసుకొని వెళ్ళండి. స్నేహితులు లేందే వంటరిగా వెళ్ళవద్దు."

"ఎక్కడికి?" డాక్టరువేపు తిరిగి అడిగేడు జే.జే.

"రాణీగారు పుట్టినరోజు తను ఫారెస్టు బంగళాలో జరుపుకోవడం ఆచారం."

"ఆనందంగా వెళతాను."

# 59

ఆ రాత్రి....

ఫారెస్టు బంగాళా చీకట్లో చందమామలా వెయ్యి లైట్లతో వెలిగిపోతోంది.

తనని తప్ప ఇంకే స్నేహితులనీ రాణీ తీసుకురాకపోవడం మొదట ఆశ్చర్యం కలిగించింది జే.జే.కి. కాని కొన్ని గంటలు గడిచేక అది అంత వింతగా అనిపించలేదు. ఈ సంఘటన తనని రాణీకి మరింత దగ్గిరగా తీసుకొని వెళ్ళినట్లు అనిపించింది అతనికి.

"లైట్లు ఆర్పేస్తేనే బావుంటుందేమో?" తన మనసులోని కోరికను రాణీ బైట పెట్టినప్పుడు అతను యెక్కువ ఆశ్చర్యపోయేడు. విప్పిన పుస్తకంలా తనమనసుని ఆమె యెంత సుళువుగా చదవగలదు.

"ఆర్పేమనండి" అన్నాడు అతను.

నౌఖర్లు లైట్లు ఆర్పేసేరు. వారిని చుట్టుకున్న చీకటి నల్ల ముఖమల్ రగ్గులా మనోహరంగా వుంది.

దూరాన కొండమీద ఒక చక్కని చుక్క వారివేపు నిక్కి నిక్కి చూసింది. వారి మధ్య ఉన్న టేబిలుమీద గాజు కుండీలోవున్న పువ్వు మీద ఒక మిణుగురు పురుగు వాలింది.

ఆ డాబాపక్కనున్న రెండు కొబ్బరిచెట్లు ఆ డాబాకి ప్రకృతి పెట్టిన పెడెస్టల్ ఫేనుల్లా ఉన్నాయి.

ఆ రాత్రీ-ఆ సాన్నిహిత్యం-వారి మనసులోని ముడుల్ని విప్పేసేయి.

"మిమ్మల్ని అతిథిగా ఆహ్వానించి జవానులా వాడుకుంటున్నందుకు సిగ్గుపడుతున్నాను" ఆమె తలవంచుకొని అంది. ఆమె మొహంలో సిగ్గు కంటె బాధే యెక్కువ కనిపించింది అతనికి.

ఎంత సున్నితమైన మనసు ఆమెది!

"నా స్నేహం మీకు దుర్వినియోగం చేసుకోలేదు. నా మాట నమ్మండి. మీకు నిజంగా పనిమనిషిలా ఉపయోగపడివుంటే ఎంతో సంతోషించేవాడిని."

"మీరు యెంత మంచి స్నేహితులు."

"అనడంకన్నా మీదే యెంత మంచి హృదయమో ఆలోచించుకోండి."

"మీరు నన్ను పొగుడుతున్నారు!"

"దేవతల గురించీ నిజం అతిశయోక్తిగానే కనిపిస్తుంది."

ఆమె తలదించుకునే కళ్ళు యెత్తి అతన్ని చూసింది. అప్పుడామె కళ్ళు చీకట్లో వింత పూవుల్లా మెరిసేయి. జే.జే.కి అప్పుడామెను యెత్తుకొని అడవిలోకి పారిపోవాలనిపించింది. ఆమెతో పరిచయం ప్రారంభించినప్పటినుండీ తన మీద ఆమె ప్రభావం బాగా ఉందని అతను గ్రహించేడు. అంతేకాక స్వామి ప్రభావం తనమీద తగ్గిపోతున్నట్టు ఒక్కొక్కప్పుడు అనిపించినా, స్వామి గుర్తువచ్చినప్పుడు అతను ఇంకే విషయం ఆలోచించలేక పోయేవాడు.

కాని ఈ రాత్రి-తాగిన మైకంలో అతనికి స్వామీ-ఆశ్రమం, అన్నీ ఏదో పాతజన్మల స్మృతుల్లా-బలహీనంగానూ, అస్పష్టంగానూ గుర్తున్నాయి. తను మరిచిపోలేనిదీ, అణుచుకోలేనిదీ-తన ఎముకల్ని చుట్టుకున్న కోరికల కొండచిలువలు-తన గుండెల్లోని ఎర్రగా మండుతున్న శూన్యం, తను ఆకాశంలో యెంతో యెత్తున పట్టులేకుండా యెగిరి పోతున్నట్టూ, తన చుట్టూ మండే గోళాల వేడి తనని కాల్చివేస్తున్నట్టూ అతనికి అనిపించసాగింది. అంతేకాకుండా అంతవరకు తను చేసే నను కుంటున్న పాపంవల్ల, తను ఇన్నాళ్ళూ పడిన బాధవల్ల విముక్తుడైనట్టు కూడా అనిపించింది.

మళ్ళీ జీవితంలో తను నవ్వగలనని-అతనికి ఇప్పుడే తెలిసింది.

చిన్న పిల్లని కూర్చోపెట్టుకున్నట్టు రాణీని తన తొడమీద కూర్చోపెట్టుకొని ఆమెతో తన బాధల కథ చెప్పుకోవాలనిపించింది అతనికి.

"ఆ మిణుగురు పురుగు యెంతందంగా ఉందో చూడండి" అకస్మాత్తుగా రాణీ మాటలకు అతను ఉలిక్కిపడ్డాడు.

"క్షణానికోసారి ఆరిపోవడమే దాని అందమేమో?"

"ఆరని అందం తీరని బాధలాంటిదే! కొన్నాళ్ళకి రెండింటిని మరచి పోతాం."

"ముమ్మాటికీ నిజం" అన్నాడు అతను.

తనకి యిప్పుడిప్పుడే కొత్తగా మాటలాడటం వస్తున్నట్టు అనిపించింది అతనికి.

కొన్ని క్షణాల నిశ్శబ్దం అతనికి చీకటి పొరలు చుట్టింది. తన ఆత్మ దేహాన్ని వదిలి, పక్కని కూర్చుని క్షణం ఏడుస్తున్నట్టూ, క్షణం నవ్వుతున్నట్టూ అనిపించింది. అతనికి ఇప్పుడు తనకి ఉన్న భావం దుఃఖమో సంతోషమో కూడా తెలియడంలేదు. కాని ఆ భావాన్ని మాత్రం తను ఎక్కువసేపు భరించలేడు.

"మిమ్మల్ని ఒక విషయం అడగనా?" రాణీ మెత్తగా అంది.

"అడగండి" అని అన్నాక అతనికి విపరీతమయిన భయం పట్టుకుంది.

రాణీ అతనివైపు తీక్షణంగా చూసింది. పాపం చేసి దొరికి పోయిన మనిషివేపు దేవుడు చూసే చూపులా ఆమె చూపు అతన్ని బాధించింది. ధైర్యం కోసమే అన్నట్టు తన గ్లాసు ఖాళీచేసి, మళ్ళీ దాన్ని విస్కీతో నింపుకున్నాడు.

"ఈ చీర ఎలా ఉంది?"

"అది కట్టుకున్నా, విప్పుకున్నా మీరు ఎంతో అందంగా ఉంటారు" అన్నప్పుడు అతని మాట తోసుకుపోయింది.

ఇదేమాట ఆ మరపురాని రాత్రి తను మార్గరెట్‌తో కూడా అన్నాడు. అదే మాటకు పాపపు గుహలు తలుపులు తెరచుకొని తనని మింగేసేయి.

గ్లాసులో ఉన్నది సోడా కలపకుండానే-మింగేసేడు జే.జే. అతని గొంతు మండినా మనసులోని బాధ తగ్గినట్టనిపించింది. మరోసారి విస్కీ గ్లాసులో పోసుకొని "ఈ మాట అడగడానికేనా మీరు నా అనుమతి కోరేరు?" అని ప్రశ్నించేడు. తన మాటల్లోని అధికారం తనకే ఆశ్చర్యం కలిగింది.

"కాదు."

"మరైతే మాట ఎందుకు మార్చేరు?" రాణీమీద తనకి ఒక్కసారి అధికారం వచ్చినట్టు అనిపించింది అతనికి. అంత వరకూ తను ఆమె సాన్నిధ్యంలో ఎంతో హెల్ప్‌లెస్‌గా ఫీలయ్యే వాడు.....

ఆశ్చర్యం! మార్గరెట్‌తో కూడా తను సరిగ్గా ఇలాగే ఫీలయ్యే వాడు.

మార్గరెట్ పుట్టి ఉండకపోతే!

లేక ఆమె తనకు అపరిచితురాలిగానే ఉండిపోతే?

ఆమె తనకు చిన్నప్పటినుంచీ తెలుసు. ఆమె పుట్టుక కూడా తనకి గుర్తుంది. కొవ్వు బొమ్మలా పుట్టిన ఆమె గాజుబొమ్మలా ఎదిగింది. తనకు సన్నిహిత స్నేహితురాలైంది. తన విజయాలూ, ఓటమిలూ తన అంతర్యాలూ, ఆదర్శాలూ అన్నీ తనతో చెప్పు కునేది. కాని ఆమె తనను ప్రేమిస్తున్నదేమోనన్న అనుమానం తనకి ఎప్పుడూ రాలేదు. తనకంటే ఆమె ఎంతో చిన్నదవడం వల్ల, ఆమెకు పెళ్ళీడు వచ్చినా, చిన్నపిల్లలా మాత్రం చూడ గలిగేవాడు.

"నువ్వు పెళ్ళి చేసుకోవా?" ఒకనాడు ఆమె అడిగింది.

"పెళ్ళిమీద మోజులేదు. అవకపోవడం వల్ల నేను పడే ఇబ్బంది కూడా ఏమీలేదు" అనేసేడతను. తనకి స్త్రీ సుఖం కొత్త కాదు. చాలా సార్లు ఆ సుఖాన్ని డబ్బుపెట్టి కొనుక్కున్నాడు కూడా. ఆ విషయం మార్గరెట్ దగ్గర సూచా వాచాగా ఒప్పుకోవడానికి కూడా అతను బిడియపడలేదు.

"నీకు పెళ్ళిలో నమ్మకంలేదా!" ఓసారి అడిగింది.

"పెళ్ళిలో సుఖం ఉంటుందన్న నమ్మకం లేదు." నవ్వేడు అతను.

"ముసలివాడివై పోయేక బజారు స్త్రీల బంధాల్లో ఉండి పోతావు."

"వయసులో భార్య బంధాల్లో-ఉండిపోవడంకన్నా అది హీనం కాదు."

"నీ నమ్మకాలు మార్చలేం" అని ఆమె అన్నప్పుడు మాత్రం ఆమె తనను కోరుకుంటోందా-అన్న సందేహం వచ్చింది అతనికి. తనకి వచ్చిన పాపపు తలపుకి ఎంతో సిగ్గుపడ్డాడు కూడా.

తర్వాత ఆమె అతని తమ్ముడు జార్జిని పెళ్ళాడింది. వాళ్ళకి పుట్టిన మొదటి బిడ్డను చూపిస్తూ "ఎలా ఉంది?" అని అందమైన బిడ్డ తల్లికి గల గర్వంతో అడిగింది జే.జే.ని.

జీవితంలో ఏదో ముఖ్యమైనదాన్ని పోగొట్టుకున్న వాడిలా అతను అప్పుడు ఫీలై "ఈ పిల్ల నా పిల్లే అయితే. నా గర్వాన్ని దేముడు కూడా అణచలేకపోయేవాడు" అన్నాడు.

"అవకాశం ఒకసారే తలుపు తడుతుంది" అని ఆమె మొహం దించుకుంది.

"ఆకర్షణా, దుర్బుద్ధీ తలుపుమీద బాదుతూనే ఉంటాయి" అతను సామెత పూర్తి చేసేడు.

"నువ్వు పెళ్ళి చేసుకో."

"నీలాటి స్త్రీ లభిస్తే చేసుకోవాలన్న కోరిక యిప్పుడిప్పుడే కలుగుతోంది."

"నన్ను చూడమంటావా పెళ్ళికూతుర్ని?"

"నీమీద నాకు పూర్తి నమ్మకం ఉంది. నువ్వు పెళ్ళికూతుర్ని చూసే వరకూ నేను పెళ్ళాడను."

రోజులు గడిచిపోతున్నాయి. మార్గరెట్‌కి మరో యిద్దరు పిల్లలు పుట్టేరు. ఆమె ఇల్లు ఎంతో దూరం అయినా తను తరచూ అక్కడికి వెళ్ళేవాడు. ఆమె పిల్లల్ని తన పిల్లల్లాగే చూసుకునేవాడు. ఆమె భర్త జార్జికి యూనివర్సిటీలో ఉద్యోగం.

జార్జికి తన రిసెర్చి తప్ప వేరు జీవితం లేదు. తనకి ఒక భార్యా, ముగ్గురు బిడ్డలూ ఉన్నారన్న విషయం అతనికి ఎప్పుడైనా గుర్తుకు వస్తుంది. కాని తన ఆర్జన వాళ్ళకి చాలదన్న విషయం – అతనికి ఎప్పుడూ గుర్తుకురాదు. "ఇదిగో డార్లింగ్ జీతం" అని భార్యకు డబ్బు ఇచ్చేస్తే సర్వబాధ్యతలూ నిర్వర్తించినట్టేనని అతని భావం.

రెండో పిల్ల పుట్టిన తర్వాత ఒకనాడు మార్గరెట్ జే.జే.ని అడిగింది–'నిన్నొకటి అడగనా?"

"అనుమతి అడిగి అవమానించకు" గట్టిగానే అన్నాడు.

"నాకు అప్పు కావాలి!"

"ఇవ్వను."

"మొగాడ్ని నమ్మకూడదంటారు–అందుకే."

"తిరిగి యివ్వనంటే నీ క్కావలసినంత ఇస్తాను."

"జీవితాంతం కృతజ్ఞురాల్ని."

"నాక్కావల్సిన దానికంటే ఎక్కువే ఆర్జిస్తున్నాను. నా బిజినెస్ నా ఆశలు మించే పెరిగిపోయింది. నాకు మాత్రం ఎవరున్నారు మీరు తప్ప?"

మార్గరెట్ అతని దగ్గరకు వచ్చి అతని చేతిని తన చేతిలోకి తీసుకుంది. అప్పుడతనికి ఆమెని గుండెలకి గాఢంగా హత్తుకుని జుట్టు ముద్దుపెట్టుకోవాలనిపించింది.

"నేను నీకు తిరిగి ఏమివ్వగలను?"

"ప్రే...అభిమానం."

"కృతజ్ఞతకీ, ప్రేమకీ హద్దు నిర్ణయించుకోలేకపోతున్నాను."

"రెండింటికీ చాలా వ్యత్యాసం ఉంది."

"జార్జితో నువ్వు డబ్బు సంగతి సంప్రదిస్తే బాగుంటుంది."

"నేను ఏ పనైనా చేస్తాను కాని అది మాత్రం చెయ్యలేను. జార్జి నాకంటే పదేళ్ళు చిన్న. అయినా అతనికి ఇంకా పదేళ్ళ పిల్లాడి మనస్తత్వం పోలేదు. అతను రెండేళ్ళ క్రిందటి సూటుతో ప్రెసిడెంట్‌ని కలుసుకోవడానికి వెళ్ళమంటే వెళ్ళిపోతాడు. మూడు రోజులు అన్నం మానెయ్యమంటే 'ఎందుకు' అని అడక్కుండా మానేస్తాడు. అతనికి తన రీసెర్చే ధ్యానం – ధ్యేయం – జీవితం కూడా. అంచేత డబ్బు గొడవలతో అతన్ని బాధపెట్టటం నాకు యిష్టంలేదు" అన్నాడతను.

తర్వాత అతనికీ, మార్గరెట్‌కీ మధ్య ఉన్న సంబంధం అతి పవిత్రంగా ఆదర్శప్రాయంగా ఉండేది.

ఆవేళ డిసెంబరు ముప్పై ఒకటో తేదీ...రేపు రాబోయే కొత్త సంవత్సరానికి స్వాగతం చెపుతూ జే.జే. తన ఇంట్లోనే తన ముఖ్య స్నేహితులకి పార్టీ యిచ్చేడు. పార్టీకి వచ్చిన వాళ్ళు అందరూ మొగాళ్ళే కావడంచేత అచ్చంగా మొగాళ్ళ పార్టీలాగే జరిగింది. అతిగా తాగిన వాళ్ళందరికీ ప్రపంచం అస్పష్టంగా మాత్రం గుర్తుంది. పార్టీ జరుగుతున్న హాలు సిగరెట్టు పొగలో ఎగురుతున్న రబ్బరు బెలూన్లతోనూ, రంగుల రిబ్బన్లతోనూ నిండిపోయింది. గదిలో కుర్చీలమీదా, టేబిళ్ళమీదా విప్పేసిన కోట్లు పడి ఉన్నాయి.

ఇంతలో టెలిఫోను మోగింది. జే.జే. రిసీవరు ఎత్తేడు. టెలిఫోనులో ఎవరో మాట్లాడుతున్నారు.

"ఎవరు?" అడిగేడు జే.జే.

"నేనే."

"ఆడా? మగా?"

"మార్గరెట్‌ని."

పేరు వినగానే మత్తు కాస్త వదిలినట్టయింది అతనికి.

"నువ్వొకసారి రావాలి" మార్గరెట్ బతిమాలింది.

"పెళ్ళికూతురొచ్చిందా?"

"జార్జి ఇంకా రాలేదు. నాకు భయంగా వుంది."

"యూనివర్శిటీలో పార్టీ అవుతుందేమో?"

"ఒక్కసారి.. ఒక్కసారి నువ్వు రా."

"ఈ ముఠాని పంపించి వచ్చేస్తా" జే.జే. టెలిఫోను పెట్టేసేడు. కాని అతని స్నేహితులు అతన్ని చాలాసేపు వదల్లేదు.

మార్గరెట్ దగ్గరకు అతను వెళ్ళేసరికి రాత్రి పన్నెండు దాటిపోయింది. ఆ ఇంటి కాంపౌండులో అతని కారు ప్రవేశించేసరికి ఇంట్లో లైట్లు అన్నీ వెలుగుతూనే ఉన్నాయి. కారు శబ్దం విన్న మార్గరెట్ తలుపు తీసి అతనికి ఎదొరొచ్చింది. తడబడుతున్న మాటలతో ఆమెకి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పేడు అతను. తన మత్తులో ఆమె తాగి ఉందన్న సంగతి అతను గ్రహించలేకపోయేడు.

ఇద్దరూ యింట్లో ప్రవేశించిన తర్వాత ఒక చిన్న లైటు మినహా అన్ని లైట్లూ ఆర్పేసింది మార్గరెట్.

హాల్లో టేబిలుమీద కార్కు విప్పిన షాంపేన్ బాటిల్ ఉంది. దాన్ని చూపించి "జార్జి కోసం తెచ్చాను" అంది మార్గరెట్.

"జార్జికీ నాకూ భేదం లేదు." అతను ఏం మాట్లాడుతున్నాడో అతనికే తెలియటంలేదు.

బాటిల్ విప్పి రెండు గ్లాసుల్లో పోసి ఒక గ్లాస్ మార్గరెట్‌కి అందించేడు. ఇద్దరూ ఏదో పిచ్చిగా మాట్లాడుకుంటూ తాగటం మొదలు పెట్టేరు. జే.జే. కి మనసులో ఏవో బంగారు నక్షత్రాలు ఎగురుతున్నట్టు అనిపించింది. తను ఏం మాట్లాడుతున్నదీ అతను పట్టించుకోలేదు.

మధ్యలో మార్గరెట్ అడిగింది "ఈ గౌనులో ఎలా ఉన్నాను?"

"గౌనులో చాలా బావున్నావు. విప్పుకుంటే మరీ బావుంటావు"

"నేను మరీ బావున్నప్పుడు చూడాలని ఉందా?"

"చూస్తాను" అంటూ అతను గౌను విప్పేసేడు.

అతనికి తిరిగి పూర్తిగా తెలివి వచ్చేసరికి రాత్రి కటిక చీకటిగా ఉంది. తన పక్కనే మార్గరెట్ పడుకొని వుంది. ఇద్దరూ ఒకే రగ్గు కప్పుకొని ఉన్నారు. ఆమె తాగుడు మైకంలోనే తన వేపు తిరిగి తన మెడని చుట్టేసింది. ఆమెను అతను దగ్గరగా తీసుకున్నాడు. ఆమె తడబడుతూ అర్థరహితంగా ఏదో గొణుక్కుంటోంది.

ఇంతలో ఎవరో తలుపు తడితే మార్గరెట్ లేచివెళ్ళి తలుపు తీసి తూలుతూ నిలబడింది. అప్పుడామె పూర్తిగా వివస్త్ర.!

వచ్చినవాడు జార్జి.

"నా రిసెర్చి ఫలించింది డార్లింగ్. రేపు నా పేరు ప్రపంచం అంతా మారుమోగి పోతుంది." అంటూ జార్జి లోపలికి వచ్చి ఆమెను ముద్దుపెట్టుకొని నూతన సంవత్సరంలో ఆమె వెయ్యి సుఖాలు అనుభవించాలని దీవించేడు.

ఆమె అతనితో నవ్వుతూ ఎంతో ఉత్సాహంగా పిచ్చిగా మాట్లాడేస్తోంది. "నీ భార్యనైనందుకు నేను గర్విస్తున్నాను. నూతన సంవత్సరానికి నీకో కానుక తెచ్చాను. జే.జే. నీ దిండు కింద జార్జికి తెచ్చిన కానుక ఉంది ఇయ్యి" అంది. అంతవరకు పక్కమీదున్న జే.జే.ని జార్జి చూడలేదు. చూసిన వెంటనే అతను గిర్రున తిరిగి బైటకు వెళ్ళిపోయాడు. అతన్ని వెంబడిస్తూ ఆమె కూడా "ఎక్కడికి వెళుతున్నావు?"అంటూ బైటకి వెళ్ళిపోయింది.

తనూ, మార్గరెట్, జార్జి అందరూ ఉన్నపళంగా చచ్చిపోతే బావుండుననిపించింది. వెంటనే అతను మరో తోవని బైటకు వచ్చేసేడు.

తర్వాత యింక మార్గరెట్, జార్జిలకు దూరంగా ఉండాలని స్వదేశం వదిలి భారతదేశం వచ్చేసేడు–

"ఏమిటి ఆలోచిస్తున్నారు?" అడిగింది రాణీ.

"మీరు ఏమిటి అడగదల్చుకున్నారో అని ఆలోచిస్తున్నాను."

"సమాధానం దొరికిందా?"

"అడిగితే దొరుకుతుంది సందేహించక అడగండి" తన గురించి సర్వం ఆమెతో చెప్పుకోవాలన్న కోరిక అతను అణుచుకోలేక పోతున్నాడు.

"అడగనా?"

"తప్పక?"

"అపార్థం చేసుకోరుకదా?"

"చేసుకోను"

"నేను ప్రతి పుట్టినరోజూ ప్రపంచానికి దూరంగా ఈ బంగళాలో ఒక ముఖ్య స్నేహితుడితోగాని స్నేహితురాలితో గాని గడుపుతాను."

"మీరు ఏమిటి అడుగుదామనుకుంటున్నారు?"

"ఈ రోజు నాతో ఉన్నవాళ్ళు నాకు అత్యంత ముఖ్యులన్నమాట."

"వాళ్ళు ధన్యులు."

"వాళ్ళ దగ్గర నాకు రహస్యాలుండవు."

"రహస్యం స్నేహానికి విషం."

"మీ రెందుకు ఇండియా వచ్చేరు?"

జే.జే. తన కథంతా పూసగుచ్చినట్టు రాణీతో చెప్పేడు. ఇన్నాళ్ళూ బాధల పళ్ళచక్రాలలో తెగిపోయిన అతని హృదయం కవిత్వం చెప్పింది.

కథ విన్న రాణీ ముఖమల్ చీకటిని చీల్చుకొని వచ్చిన వెన్నెల రేఖలా అతని దగ్గరగా వెళ్ళి "మై పూర్ జే.జే" అంటూ అతని తలని సున్నితంగా నిమిరింది. అతని వెనక నిలబడిన ఆమె చుట్టూ చిరుగంటలు మోగినట్టూ, ఆమె నుండి వెలువడు తున్న రంగుల కాంతులు తనని చుట్టేస్తున్నట్లూ అతనికి అని పించింది. ఆమె అరిచేతుల్లో తన మొహం దాచుకున్నాడు అతను.

అంతలో అతని కడుపులో కోరికల మొసలి కదిలింది. అతని నరనరం పీకేయి. అతని ప్రతి కండ వణికి వణికి వాటి మీద పేరుకున్న వేదాంతపు పొరలను విదిలించుకున్నాడు. తర్వాత తనని పడక గదివేపు రాణీ నడిపించుకు వెళ్ళడం అతనికి లీలగా గుర్తుంది.

మర్నాడు తెల్లవారి లేచిన రాణీకి అతను కనబడక పోవడం ఆశ్చర్యం కలిగించలేదు.

# 60

"నేను ఏ పాపం నుండి తప్పుకోవాలని ప్రయత్నించేనో, అదే నన్ను పది నాలుకలతో చుట్టి మింగేసింది" దేనిమీదా దృష్టి నిలపకుండా కిటికీలోనుండి దూరంగా చూస్తున్న జే.జే. అన్నాడు.

"ఇదంతా చూస్తే, ఏదో 'విధి' అనే దుందేమో అనిపిస్తోంది" అన్నాడు రిచర్డు.

"ఇప్పుడు నేనేం చెయ్యాలి? నేనేం చెయ్యగలను?"

"మళ్ళీ స్వామి దగ్గరకే వెళ్తే."

"నరకానికి వెళ్ళమంటే సంతోషంగా వెళ్ళగలను. చేసిన పాపాలు మరువలేక, చెయ్యని పాపాలు ఊహించుకొని కుళ్ళిన మనసుతో ఎక్కడేనా బతగ్గలనేమోగాని స్వామిని మాత్రం ఒక్క సారి కూడా చూడలేను. చూస్తే వెంటనే చచ్చిపోతాను."

"అతని క్షమా హృదయం..."

"అతను క్షమించినా అతని సన్నిధిచేరి మళ్ళీ పాపపు గోతు ల్లోకి దిగజారిపోయిన నన్ను నేను క్షమించుకోలేను. నీకు అర్థం కాదు నా బాధ!"

"నీకు–ఇదివరకు నువ్వు వచ్చినప్పుడు రెండే తోవలున్నా యని చెప్పేను–గుర్తుందా?"

"మరిచిపోలేదు."

"మొదటిది మతం. నీకు అచ్చిరాలేదు."

"రెండోది..."

"పాము కాటుకి పాము విషమే ఇంజెక్షను యిస్తారు తెలుసా? ఆడదాని కాటు ఆడదే మరిపించగలదు. ఇన్నాళ్ళూ సాంఘికంగా ఉన్నత స్త్రీలే నీకు పరిచయం. ఫర్ ఎ ఛేంజ్. చౌకబారుని ప్రయత్నించు. నా మట్టుకు నాకు బజారు మనిషి నచ్చినట్టు బంగళా మహిళలు నచ్చరు."

# 61

కాలువలో పడవలా కారు, సిమెంటు రోడ్డుమీద సాగి పోతోంది. రేర్‌వ్యూ అద్దంలో నుండి యూనిఫారంలో డ్రైవరుకి, వెనకకార్ల లైట్లు కనిపిస్తున్నాయి కాని, వెనక సీట్లో ఉన్న స్త్రీ కనిపించడంలేదు.

వెనకసీట్లో చేరబడి కూర్చున్న రాజమ్మ కళ్ళు మూసుకుంది. ఆమె మొహంలో నిన్న తినలేదన్న విచారంకన్నా నేడు తిన్నానన్న తృప్తి వుంది. ఆమె మొహంలో నిన్నటి బాధల ముడతలు ఉన్నా, కళ్ళలో రేపటి ఆశల వెలుగే ఎక్కువ ఉంది. ఆమె తలమీద అందంగా కప్పుకున్న పల్చటి సిల్కు పైటలోంచి జుట్టుముడిలో వున్న మల్లెదండ మెరుస్తోంది.

కారు సిటీ అంచులకి చేరుకుంది. రోడ్డుపక్క సిమెంటు బంగళాలు పల్చబడిపోతున్నాయి. రాజమ్మ కళ్ళు విప్పేసరికి రోడ్డువార దీపాలు కనిపించేయి.

"ఈ దీపాల వెనక ఎంత చీకటి?" అన్న ఆమె ఆలోచన కొన్ని ఏళ్ళ కింద జీవితాన్ని దిష్టి బొమ్మలా ఆమె ఎదుట నిలబెట్టింది.

కొన్ని ఏళ్ళ కిందట.....

మొదటిసారి వణుకుతున్న కాలుపెట్టిన రాత్రి......

ఎంత భయంకరంగా ఉంది సిటీ?

వెయ్యి కళ్ళ వింత జంతువులా ముదుచుకున్న అవయవాలని భయంకరంగా ఝుళిపించింది ఆ చీకటి రాత్రి పట్టణం.

వానకి తడిసిన రోడ్లమీద రక్తం జల్లుతున్న కార్ల డేంజర్ లైట్లూ, జన సమూహంలోని మనుష్యులు కళ్ళ ఒంటరితనం – తడికీ, చీకటికీ బిగుసుకుపోయిన తోలు ఆకాశం–శరీరంలోని మనిషి ఏడుపులా సిటీ రొదా...పసిపిల్లాడిని తొక్కి తిరిగి చూడని క్రౌర్యం .... అడుగు ముందుకు వెయ్యని మనుషుల కెరటాలూ, చీకట్లో మెరిసే పోలీసు బెల్టు బకిల్.....జేబుదొంగ తిన్న దెబ్బలూ .... చూసి భయంతో వణికిపోయింది రాజమ్మ సిటీ చేరిన మొదటి రాత్రి.

ఆ రోజు–పట్టణం చేరిన మొదటినాడు...ఓ "అన్న" ఏదో గుడిసె అద్దెకు కుదిర్చేడు ఉండడానికి. అక్కడున్న గుడిసెల్లో ఇంకా ముష్టివాళ్ళు కానివాళ్ళు కాపుర ముంటారు. ఆ గుడిసెల్ల చుట్టూ బుడగలతో వున్న కుళ్ళు...ఏదో పెద్ద జంతువు కురుపుల చర్మం వొలిచి నేలనిపరచినట్టుంది. అందులో పుట్టిన పెద్దసైజు చెద పుట్టల్లా ఉంటాయి ఆ గుడిసెలు. అక్కడ ఎండకి వేడితప్ప వెన్నెలకి చల్లదనం ఉండదు.

అక్కడ నివసించే మనుషులు చావలేక బతుకుతున్న వాళ్ళల్లా నిరాశాతోనూ, దేముడి పిలుపుకోసం ఎదురుచూసే వాళ్ళలా ఆదుర్దాతోనూ ఉంటారు. అక్కడ ఆడవాళ్ళ అందం పురుగులు కొరికిన పువ్వు అందంలా భయంకరంగానూ, అసహ్యంగానూ ఉంటుంది. వాళ్ళంతా ఏదో విధంగా వొళ్ళు అమ్ముకొని బతుకు తారు. అక్కడ పసిపిల్లల నవ్వులు చప్పుడులేని చావునవ్వుల్లా ఉంటాయి. అక్కడ ఏడుపే సహజంగా ఉన్నట్టుంటుంది.

ఆవేళ రాత్రి వండిన అన్నం సింహాచలానికీ, రాజమ్మకీ సయించలేదు. రాజమ్మ కొడుకు మాత్రం అన్నంతిని గుడిసెలో నేలమీద బురదలో పందిపిల్లలా, బోర్లాపడుకున్నాడు. రాజమ్మ, సింహాచలం గుడిసెముందున్న పంచలో కూర్చున్నారు. ఏమాట మాట్లాడితే వాళ్ళ మనసుల్లోని భయం బైటపడుతుందోనని భయ పడుతున్న వాళ్ళలా ఇద్దరూ మౌనంగా ఉన్నారు.

సింహాచలం చుట్ట నోట్లోంచి తీసి "ఈ గడ్డమీద ఏ గడియలో కాలెట్టినామో! బతుకులెలా గెళ్లాలని రాసినాడో!" తనలో తను మాట్లాడుకుంటున్నట్టు అన్నాడు.

"గింజలు జల్లినోడు నీల్లు సల్లకపోడు" కష్టాల వేదాంతం ఒక్క ముక్కతో వల్లించింది రాజమ్మ.

"మొదట మనమీద జల్లినవి నీళ్ళచుక్కలు గావు. నిప్పుల బొగ్గులు."

"కష్టాలు మనుషులక్కాకపోతే మానుల కొస్తాయా?"

"మన కష్టాలకి మానులుకూడా మండిపోయావి."

"ఆ బాబు ఓ చల్లని చూపు జూస్తే వచ్చీ ఏడీపాటికి నిన్ను నువ్వే పోల్చుకోలేవు."

"నీ మాట చలవ"

ఇలాగే భవిష్యత్తు గురించి భయంకర భయాన్ని, వైరాగ్యపు మడతల్లోనూ, వేదాంతపు మర్మాల్లోనూ దాచుకొని చాలాసేపు మాటాడుకున్నారు.

ఇంతలో గూడెంలో కుక్కల మొరుగులతో కలకలం బయలు దేరింది. రాజమ్మ ఇంటిముందునుంచి ఒక బెదిరిపోయిన గాడిద జోరుగా పరుగెత్తింది. దాని డెక్కల చప్పుడికి బురదలో పందులు కదిలేయి. ఏమిటవుతున్నదో రాజమ్మ తెలుసుకునే లోగా ఎక్కడినుంచో పదిహేను చీకటి ఆకారాలు పరస్పరం కొట్టుకుంటూ ఆవిడ యింటి ముందుకు వచ్చేయి. వాళ్ళ చేతుల్లో సైకిలు చైన్లు వెన్నెల్లో వెండి కొరడాల్లా మెరుస్తున్నాయి. వాళ్ళు కర్రలతోనూ చైన్లతోనూ కొట్టుకుంటున్నారు.

రాజమ్మా, సింహాచలం గుడిసెలోకి పరిగెత్తి తడిక తలుపు వేసేసుకున్నారు. వాళ్ళకు తలలు పగులుతున్న చప్పుళ్ళూ ఎము కలు విరుగుతున్న చప్పుళ్ళూ వినిపిస్తూనే ఉన్నాయి. ఇంతలోనే బూతుల మధ్య ఒక పెనుకేక, ఒక మనిషి దబ్బున పడిన చప్పుడూ వినిపించేయి. ఆ తర్వాత పరుగులు వినిపించేయి.

ఆ తర్వాత నిశ్శబ్దానికి రాజమ్మ వణికిపోయింది. "ఛిఛీ! బయవేసి పోతున్నాది. మావా! రేపు మనూరెల్లి పోదాం. నా మాటిను. అక్కడ ఉన్న పూట తిందాం. లేనిపూట పస్తుందాం. ఈ ఖూనీల ఊళ్ళో బతకడం కన్నా ఆ సల్లటి ఊళ్ళో సావడమే మంచిది." అని ఇంతవరకూ దాచుకున్న తన దిగులు బైట పెట్టేసింది.

రాత్రి ఆమె ఇంటి ముందు చచ్చినవాడి శవాన్ని పగలు పదిగంటలకు పోలీసులు తీసుకుపోయేరు.

# 62

రాజమ్మా, సింహాచలం సిటీచేరిన మొదటి రోజుల్లో ఎలా బతికేరో తలుచుకుంటే వారికే భయం వేస్తుంది. ఆ రోజుల్లో వారు ఏమి తిని బతికేరో అన్న అంశం కంటే ఏమీ తినకుండా ఎలా బతికేరో అన్న విషయమే ఎక్కువ ఆశ్చర్యకరం. తర్వాత కొన్నాళ్ళకి రాజమ్మకి పాచిపనులు దొరికేయి. సింహాచలానికి గూడెంలో ఎవరో సహాయం చేస్తే తొక్కడానికి రిక్షా అద్దెకు దొరికింది. కాబట్టి వాళ్ళు మూడు పూటలా పస్తు పడుకోవలసిన అవసరం లేకపోయింది. వాళ్ళకి దేవుడు మంచితనంలోనూ కర్మ సిద్ధాంతంలోనూ తిరిగి నమ్మకం ఏర్పడింది.

సింహాచలానికి ఊరు కొత్తవడంవల్ల ఏ భాగం ఎక్కడుందో తెలియక పోవడంవల్లా, ఏ ప్రదేశానికి రిక్షాచార్జీ ఎంతో తెలియక పోవడంవల్లా మొదట్లో చాలా అన్యాయం జరిగింది. అతనికి రూపాయ ముట్టవలసినచోట చాలాసార్లు పావలానే ముట్టింది. రాజమ్మ పల్లెటూరి మనిషి అవడంవల్లా, పని శుభ్రం ఉండడం వల్లా మిగతా పనిమనుషుల్లా చాలా ఇళ్ళల్లో పనికి కుదురు కోలేదు. ఆమెకు జీతాలు ముట్టవలసిన దానికంటే తక్కువ ముట్టి మిగతా ప్రాప్తికి యజమానురాళ్ళ వద్ద నుంచి చీవాట్లు ముట్టేవి. ఎలాగయితేనేం వాళ్ళ కాపురం మొదటి వర్షానికి పండిన మొక్కలా మళ్ళీ కాస్త పచ్చబడింది. సిటీచేరిన మొదటి పండుగకే సింహాచలం తనకీ, పెళ్ళానికీ, కొడుక్కీ సెకెండ్‌హాండ్ బట్టలూ, జోళ్ళూ కొన్నాడు. ఆ అతుకుల చెప్పుల్తో నడుస్తున్న తన కొడు కుని యువరాజాని మహారాజుగారు చూసినట్టు గర్వంగానూ, ప్రేమగానూ చూసేడు.

పండుగనాడు రాజమ్మ యజమానురాలు యిచ్చిన పిండి వంటలతో భోజనం చేసేక, తన కొడుకు భవిష్యత్తు భర్తతో చర్చించింది.

"బొట్టుడికి ఐదేళ్ళు ఎళిపోనాయి."

"ఎప్పుడు?" అడిగేడు సింహాచలం.

"ఈ పండుక్కి ఏణ్నెల్లు ముందు పుట్టేడు."

"అలాగా!"

"ఇప్పుడాడ్ని ఏటి సేద్దాం?"

"ఇన్నాళ్ళూ ఏటి సేసేం?"

"అది కాదు. బళ్లో ఏద్దారా అని."

"మన వొంశంలో సదువు అచ్చిరాదు. మా తమ్ముడ్ని బళ్ళో ఏసిన ఏడాదికే సచ్చిపోనాడు. ఇంతకీ ఆడికి సదువుకోవా ల్నుందా? అడుగు."

"అయ్యోరే" అని కొడుకుని పిలిచింది రాజమ్మ. కొడుకు ఆమె దగ్గరికి వచ్చేడు.

"నీకు సదువుకోవాల్నుందా?" ఆమె లాలనగా అడిగింది.

"నేను "ఐస్‌ఫ్రూట్" అమ్ముతాను". కుర్రాడు ఆలోచించ కుండా అనేసేడు. వాడి నిర్ణయానికి రెండు సంఘటనలు ప్రబల కారణాలు. వాడు గూడెం కుర్రవాళ్ళతో ఒకసారి సరదాగా స్కూలుకి వెళ్ళేడు. సరదా అంతా అక్కడ మేష్టరు కుర్రాళ్ళని చితకకొట్టడం చూసేక చచ్చిపోయింది. మరోసారి గూడెం కుర్రాడు ఒకడు ఐస్‌ఫ్రూట్‌లు అమ్మడం చూసేడు. ఆ అమ్మిన కుర్రాడు ఐస్‌ఫ్రూట్ తనొకటి తీసుకొని, రాజమ్మ కొడుక్కొకటి ఇచ్చి తర్వాత తన అమ్మతో అబద్ధం చెప్పి అణా మిగుల్చుకొని బీడీలుకొని కాల్చడం చూసేడు. రాజమ్మ కొడుక్కి ఒకే ఒక ఆశయం ఉండేది. తను కూడా ఐస్‌ఫ్రూట్లు అమ్మి అవసరమైతే రాజమ్మతో అబద్ధం చెప్పి బీడీలు కాల్చాలని, అంచేత తను తడుము కోకుండా రాజమ్మ ప్రశ్నకి జవాబు చెప్పేసేడు.

"ఇంక సిక్కేలేకుండా పోనాది. సదువు ఆడికే ఇష్టంనేదు" తీర్పు చెప్పేడు సింహాచలం.

"సదువుకోడానికి ఈడు పోతన్నాదిగాని ఐస్‌ఫ్రూట్లమ్మ డాని కింకా ఉందిలే" కొడుకుని నిరుత్సాహపరిచింది ఆమె.

# 63

సెకండు షో మొదలుపెట్టి గంట పైనే అయింది. అప్పుడే వాన వెలిసింది. వాతావరణమంతా చలి చలిగా ఉంది. చెమ్మగా కూడా ఉంది.

ఆ సినిమాహాలు కెదురుగా రోడ్డుమీదున్న రిక్షాలు ఆకాశం లోంచి చూస్తే తడిసిన గొర్రెల్లా ఉంటాయి. వాన చినుకులు రిక్షా టాపుల మీద నుండి ముత్యాలకోవల్లా జారుతున్నాయి. ఆ సినీమా హాలు పక్కగా ఓపెన్ ఎయిర్ 'టీ' షాపులున్నాయి. ఆ దుకాణాల్లో నిరుడు చేసిన రొట్టెలూ, బిస్కట్‌లూ, ఈ ఏడు చేసిన కొబ్బరి ఉండలు, జంతికలు, బెల్లం జీళ్ళూ గాజు సీసాల్లో ఉన్నాయి. సోడా బండివాడు ప్రయాణం పూర్తిచేసి అలసిపోయిన ఎద్దులా పడుకున్నాడు. కిళ్ళీ షాపువాడు బూతు పుస్తకాల్ని తీసి

దాచేస్తున్నాడు. ముంతకింద పప్పువాడూ, వేరుశనగ బుట్టవాడూ ఒకరి సరుకు యింకోడు రుచి చూస్తున్నారు. బజారు ఆడవాళ్ళు బజార్లలో తిరుగుతున్నారు.

"ఇస్" అని అరిచేతులూ రెండు గట్టిగా రాసుకుంటూ బెంచీ దగ్గర చేరిన సింహాచలం "ఒక 'టీ' కలుపు గురూ" అని అరిచేడు.

"ఒకటి కాదు, రెండూ" అంటూ సింహాచలం పక్కనే చేరాడు అప్పలకొండ.

రెండు 'టీ'లు వచ్చేయి.

'ఈ హాలుకాడ కొచ్చీది సాడేతీన్, అందులో ముగ్గురు పోలీసోళ్ళూ, సానిటరీ వోళ్ళూ, ఇక్కడేం దొరుకుద్ది బేరం' ఎంకటే శరాకి పోదాం రారా సింవచలం" అన్నాడు 'టీ' చప్పరిస్తూ అప్పలకొండ.

'ఇంటరవల్లో పోయీ వోళ్ళూ యీ సినిమాకే ఎక్కువ ఉంటారు. ఇంటరవల్లు అయ్యేక పోదాం లే" జవాబిచ్చేడు సింహాచలం.

"నీ కొడుక్కెలాగున్నాది?" పరామర్శించేడు అప్పల కొండ.

"ఆడికేం, బాగానే ఉన్నాడు. బాగునేంది నేనే."

"నీ కేటైంది? దెయ్యం పట్టిందా? పాము కర్సిందా?"

"పాము కరిసినా బాగుండేది. సావో-బతుకో-ఎంటనే తేలి పోద్ది. కాటేసింది సావుకోరు. సావూ, బతుకూ గాకుండా అయి పోనాది. ఎలాగుండేవోడ్ని! మైసూరు మహారాజులా ఉండేవోడ్ని. కాని ఏట్నాబం? గోదారితల్లి సంద్రంలో కలిసిపోయినట్టు నా ఆస్తంతా మా సావుకారుకి కలిసిపోనాది. మరింకేటుంది. మెడ్రాసు ముష్టివాడిలా అయిపోనాను. మూటలు మోసేను. ముంతలు కడిగేను. ఆడ పనీ, మొగ పనీ చేసేను. అరువుకీ, రొక్కానికీ చేసేను. ఆఖరికి ఈ రిచ్చా తొక్కుతున్నాను."

"ఐతే నువ్వు ఒరిజినల్ రిక్సా వోడివి కాదన్న మాట."

"నన్ను నకిలీ అంటావురా నంజికొడకా!"

"బక్కనాగున్నావు అంత కోపవైంతే యెలాగ్గురూ? సిన్నప్పటి నుంచీ తొక్కడం లేదా అని."

"సిన్నప్పటి మాటెందుకు? కిందటేడు వొరకూ రిక్సా యెక్క డవేఁ గాని, తొక్కడ వెఁరగను. నాకా రోజులు పోనాయి. ఓడలు బళ్ళు అవుతాయిగాని, బళ్ళు ఎప్పుడూ ఓడలు అవవ్. అంచేత రిక్సాలో యెనకసీట్లో ఉండాలిసినవోణ్ని ముందుసీట్లో కొచ్చేసి నాను. సిన్నప్పుడు మూడుసెక్రాల సైకిలు తొక్కాలని మా సరదా పడివోడ్ని. ఆ సరదా ఇలా తీరుతుందనుకోలేదు. ఎప్పటికైనా భగవంతుడు కనిపిస్తే కాలరు అట్టుకొని అడిగేస్తాను. ఏవఁని? నాన్చేసిన పాపవేఁటి? నా షావుకారి పుణ్యవేఁటి? మా యిద్దరి యెనక జన్మ ఎకౌంట్ నీ కాడుందా? ఉంటే అది నువ్వే రాసివా? బద్దకించి మా సావుకారులా-గుమ్మస్తాలచేత రాయించేసినావా? లేకపోతే అక్కడి గుమాస్తా బాబులు కూడా మూడు రకాల ఎకౌంట్లు రాస్తారా? అసలేటి సంగతి? అసలు నువ్వున్నావెం దుకు? ప్రెసాదాలు ఆరగించడానికా? ఆ పని సెయ్యడానికి నువ్వే కావాలేటి? ఎవడన్నా జేస్తాడు. సావుకారి లాంటివోడ్ని నువ్వే కాపాడక్కర్లేదు. ఆడే నీలాంటివాళ్ళు పదిమందిని కాపాడతాడు. నువ్వేమన్నా సేస్తే-నాలాటోళ్ళకే సెయ్యాల. మరెం దుకు సెయ్యవు? సావుకారంటే నీక్కూడా యిష్టవా? భయవాఁ? కాదులే, నువ్వూ డబ్బు మనిషివే. నీకు-మాలాటి వాళ్ళం ఏటిస్తాం? ఏటివ్వగలం? అయితే ఐదు పైసలు, నేకపోతే పది పైసలు! కాని సావుకార్లు నోట్ల కట్టలు సినిమా పేపర్లలా పారే స్తారు. నీకు-నువ్వు కూడా డబ్బు పుచ్చుకొని ఆళ్ళకే న్యాయం సేస్తావు. కాని ఒక్కమాట-విను. ఇలాటన్నాయాలు చేస్తే నీ పేరు యెక్కువ కాలం నిలబడదు. నీ పాపం కూడా - యెప్పుడో నాడు సావుకార్ల పాపాల్తోపాటే పండిపోద్ది. ఎంత పెద్ద తాచు పామన్నా సరే కోటి చీవఁలకి లొంగక తప్పదు. నీ పని అంతే అని సెప్పేస్తాను - మొకం మీదే."

"ఇంత నీడర్ కబుర్లు సెప్పేవోడివి-నైటు సర్వీసులో జేరి నావేం?"

"నైటు సర్వీసుకాదు గురూ, ఇదింకా 'డే' సర్వీసే. అసలింకా యింటికెళ్ళనేదు. కాలేజీ పిల్లని రైలు కాడకి దిగబెట్టి - షెడ్డుకాడ కెల్లీ సరికి అరగంట ఆలిసవైఁపోనాది. నైటుకు అద్దె యివ్వందే రిక్షా పుచ్చుకోనన్నాడు ఓనరు. ఎలాగా అద్దె యిస్తన్నాం కదా యింకా రిక్షా ఎందుకియ్యాల - అన్జెప్పి ఒట్టుకొచ్చీసినానంతే. ఆరిజించి మేడలు కట్టిద్దావఁని కాదు. వున్న కొంప మిగుల్సుకోలే నెదవని. అయినా నాకేం బాధనేదు. బూవిఁపోయిందన్నా యిశారం లేదు. సొమ్ము పోనాదనీ ఏడను. కాని యింతకంటె హీనంగా బతగ్గూడదు. ఒంటిపూట వణ్ణవైనా వుండాల, సింకి గుడ్డలో నన్నా ఒళ్ళు కప్పుకోవాలి. అంతే నా కోరిక. ఈ నాగోదు - యెప్పుడూ వున్నదేగాని, ఈ ఆటకి ఇంటరవల్లు యివ్వన

ట్టుంది–జెనం పోతారన్న బయంతో. రెండో ఆట యిడిసేసి వేస్తింది. నువ్వు ఎంకటేశరాకి పో ఒరే. నాను ఇంటికిపోయి తొంగుం టాను" అంటూ రిక్షా తొక్కుకుంటూ వెళ్ళిపోయేడు సింహాచలం.

# 64

భూమి సూర్యుడి చుట్టూ మరో రెండుసార్లు తిరిగింది. ఈలోగా దేశంలో చాలా మార్పులు జరిగేయి.

ప్రజల్లో పలుకుబడి వున్న వాళ్ళు పంచాయితీ ప్రెసిడెంటుల యేరు. ఎలక్షనులు ఇంకెన్నాళ్ళోలేవు కాబోలు అనుకుంటున్నారు ప్రజలు. వాళ్ళు అలా అనుకోవడానికి కారణాలున్నాయి. మూల మూలలనున్న పల్లెటూళ్ళని వెదికి పిలక పట్టుకొని కరెంటు ఇచ్చేస్తున్నారు. రైతులకి విరివిగా ఋణాలు యిచ్చేస్తున్నారు. రోడ్లు బావున్నా బావులేకపోయినా సరే తవ్వేసి మళ్ళీ వేసేస్తు న్నారు. ప్రతి వీధిలోను కొళాయిలకి సిమెంటు దిమ్మలు కట్టేస్తు న్నారు. అందులోకి నీరు యెలా వస్తుందో తెలీకపోయినా.

లక్షాధికార్లు ఎడా పెడా పెర్మిట్లు సంపాదించి కోటీశ్వరులై పోతున్నారు. ఉప్పు, ఉల్లిపాయల ధరలు తగ్గించేరు. వరద బాధితులకు భారీ విరాళాలు ఇవ్వడమే గాకుండా, వాళ్ళకి అన్ని రకాల పన్నులూ మినహాయించేరు. ఆహా! ప్రతీ ఏడూ ఎలక్ష న్లుంటే యెంత బాగుంటుందో అనుకుంటున్నారు ప్రజ.

ఎక్కడ ఎన్ని రకాల మార్పులు జరిగినా సింహాచలం రిక్షా తొక్కడంలో మార్పేమీ రాలేదు. మార్పంతా ఇదివరకంత జోరుగా తొక్కలేక పోవడమే. రాజమ్మ పనిలో కూడా మార్పేమీ రాలేదు–ఆ రోజు వరకూ.

ఆ రోజేం జరిగిందంటే...

కొడుక్కీ, మొగుడుకీ చల్దన్నాలు పెట్టి, పన్లోకి బైల్దేరింది రాజమ్మ. అప్పటికి సూర్యోదయం అయి కొన్ని ఘడియలు మాత్రమే అయింది. రోజూ పొద్దున్నే ఆఫీసరు గారింట్లో పని చేసిన తర్వాత పక్కవీధిలోని స్టూడెంట్లకి కారేజీలూ, కాఫీలూ తెచ్చి మంచినీళ్ళు మోస్తుంది. ప్రస్తుతం ఈ రెండు పన్లే మిగిలేయి ఆవిడకి.

రాజమ్మ ఆఫీసరుగారిల్లు చేరేసరికి కొంచెం పొద్దెక్కింది. తన ఇంటినుంచి పరిగెత్తి వెళ్ళినా కనీసం పావుగంట పట్టు తుంది–ఆఫీసరు గారిల్లు చేసేసరికి. అప్పటికే ఆఫీసరుగారి భార్య నొప్పులు పడుతున్న ఖడ్గమృగంలా అరుస్తోంది. ఆవిడ గొంతుక మైకు లేకపోతే కనీసం మైలు దూరం వినిపిస్తుంది. మైకుంటే మూడు మైళ్ళు వినిపిస్తుంది. ఆవిడ చూడ్డానికి బుల్ డోజర్‌కి చీర కట్టినట్టుంది. ఆవిడ సాధారణంగా పొద్దెక్కే వరకూ లేవదు. అలవాటు లేనివాళ్ళు పొద్దున్నే లేస్తే తలనొప్పి వస్తుంది. ఆవిడకి మాత్రం ఒళ్లంతా నొప్పెడుతుంది.

గబగబా మెట్లెక్కుతున్న రాజమ్మని చూసి ఆవిడ శివాలెత్తి పోయింది "రండి! మహారాణీగారూ. దయచెయ్యండి. మీ కోసం ఈ దాసీలు కాసుక్కూర్చున్నారు. సిగ్గులేకపోతే సరి, ఆడజన్మ యెత్తలేదూ? అంత పొద్దెక్కే వరకూ పగలు పోయే దానివి – పన్లెందుకు చేస్తావు? మంచం మీద ముసుగేసుకొని పడుకోలేక పోయావా? నీ మొగుడేం కలక్టరనుకున్నావా? కమీషనరను కున్నావా? యింకా అడుగులో అడుగువేస్తూ అలా సినిమాలో పనిమనిషిలా నడవకపోతే గబగబా అడుగులెయ్యలేవూ? నీ కాళ్ళరిగిపోతాయా? గట్టిగా నడు. భూమికి నొప్పెట్టదులే. నీలాంటి వాళ్ళంతా ఇలా అఘోరించబట్టే కాలం యిలా మండి పోతోంది. తిండిలేక చస్తున్నా తిక్కకేం లోటుండదు. అసలు సంగతి చెప్పు–నిన్న యెందుకు రాలేదు?" మెషిన్ గన్ పేల్చినట్టు మాట్లాడేస్తు న్నాది.

"చూడూ..." ఏదో అనబోయేరు అంతవరకూ అక్కడే నిస్స హాయంగా నిల్చున్న ఆఫీసరుగారు.

"మీరు గడియ నోరు మూసుకోండి. అసలు, మీ అలుసు చూసుకునేకదూ యిదిలా ఆడుతోంది?"

ఆఫీసరుగారు నోరు మూసుకున్నారు.

రాజమ్మ గబగబా గదులు ఊడుస్తోంది. ఆఫీసరుగారి భార్యకి వళ్ళు తెలీడంలేదు.

"అలా నంగనాచిలా మాట్లాడవేం?"

"ఏం సెప్పనండమ్మగారూ?"

"అడిగినదానికి జవాబు!"

"ఏం సెప్పాలండి?"

"ఇప్పుడు నే నేవిటన్నాను."

"అయ్యగార్ని నోరు మూసుకొని కూర్చోమన్నారండి."

"హమ్మ ముండా! ఎంత తెగించేవే? ఎంతెంత మాటలం టున్నావ్? ఇక్కడ ఒక్క క్షణం కూడా పనిచెయ్యొద్దు. ముందా చీపురు అక్కడ పడేసి పో."

"ఇదిగో. నువ్వొకసారి యిలా..." పులి దగ్గరకెళ్తున్న మేక పిల్లలా అన్నారు ఆఫీసరుగారు.

"మీ రూరుకోండి. ఈ ముండ ఎంతెంత మాటలం టుందో మీకేం తెలుసు? నా ఎదురుగానే యింతంత మాటలంటోందే! యిక బైట ఏమంటోందో! మిమ్మల్ని నేను కొడ్తున్నానన్నా అంటుంది. అంటే దాని తప్పేంలేదు. ఇలాంటి నీతి తక్కువ ముండల్ని పన్లో పెట్టుకున్న నాదే తప్పు."

అంతవరకూ నోరెత్తని రాజమ్మకి ఒక్కసారి రక్తం ఉడికి పోయింది. అంచేత నిలువునా మండుతున్న మనిషిలా ఎర్రగా అయిపోయి "మాటలు సరీగా రానీయండి అమ్మగారూ. ముండా గిండా అంటే పడడానికి ఎవరూ లేరు. నాకు వున్నాడు మొగుడు. మీరేదో ఉట్టినే డబ్బు ఇస్తున్నారేటి? పనిచేస్తున్నాం, డబ్బిస్తారు. కష్టపడి పనిచేసేవోళ్ళకి ఏ పనైతే ఏటి? ఈ యిల్లు గాపోతే యింకోటి, కూడు నేకపోతే మాడిసస్తాం కాని మాటలు పడం. ఇదిగో సీపురు, మళ్లీ వొస్తాను. డబ్బు లెక్కజూసి వుంచండి" అంటూ రివ్వున వెళ్ళిపోయింది రాజమ్మ.

# 65

లవ్‌బర్డ్స్ లాడ్జిలో ఉన్నవి అయిదు పక్షులు. అయిదూ మొగవే. రవి, చంద్రం, రఘు వగైరా వాళ్ళు ఆడపిట్టల వేటలో లేనప్పుడు కాలేజీకి వెళ్తారు. ఆ లాడ్జిలో అయిదు మంచాలు తప్పితే కనీసం పిట్టన్నా లేదు. ఆ మంచాల మీదున్న దుప్పట్లు ఆర్నెల్లు ఒకవైపూ మరో ఆర్నెల్లు రెండో వైపూ వాడటం వల్ల అవి నేత దుప్పట్లలా కాకుండా మైనపు గుడ్డల్లా ఉన్నాయి. ఆ మైనపు గుడ్డల నిండా రాత్రి తిని పారేసిన పకోడి పొట్లాల కాయితాలున్నాయి.

ఆ గదిలో ఉన్న అలమర్లలో క్లాసు పుస్తకాలకంటే సినిమా పత్రికలే ఎక్కువ ఉన్నాయి. వాళ్ళ పరుపులకింద రకరకాల బూతుపుస్తకాలు, శృంగార పత్రికలూ ఉన్నాయి. ఆ పుస్తకాల్లో అతిరసవత్తరమైన ఘట్టాలు, ఎర్రసిరాతో మార్కు చేయబడి ఉన్నాయి. ఆ గది గోడలనిండా స్నానానికెళుతున్న వాళ్ళూ, స్నానం చేస్తున్నవాళ్ళూ, స్నానం పూర్తి చేసినవాళ్ళూ, బట్టలు కట్టుకొంటూ కొందరూ, విప్పుకొని కొందరూ, వశిష్టుడంతటి వాడ్ని కూడా వశపరచుకొనేటంత ప్రొవొకేటివ్ చూపుల ఆడ వాళ్ళు-కేలండర్ల మీదా, ఫ్రేముల్లోనూ ఉన్నారు.

అయిదుగురూ మంచాలమీదే వున్నారు. ఇద్దరుమాత్రం నిద్రలేచి మంచం దిగకుండానే కబుర్లు ప్రారంభించేరు. ఇంతలో ఏదో పీడకల వచ్చినట్లు మూడోవాడు గబుక్కున ముసుగులోంచి తలమాత్రం కన్నంలోంచి చూస్తున్న పీతలా, బైటికిపెట్టి "అబ్బబ్బ! ఏం చలిరా నాయనా? యీ ఇల్లు మన ఇంటివాడు ఇటికల్తో కట్టించేడా? లేకపోతే అయిసు ముక్కల్తో కట్టించేడా? యిప్పుడు ఎంచక్కా వేడి వేడి కాఫీ ఉంటే ఎంత హాయిగా ఉంటుంది!" అంటూ మళ్ళీ ముసుగు పెట్టేసుకున్నాడు.

వెంటనే కబుర్లు చెప్పుకుంటున్న ఇద్దరిలో చంద్రం అన్న చిన్న వాడు "వేడి వేడి కాఫీ ఇవ్వడానికి నీ వెచ్చటి ప్రియురాలు లేదురా బాబ్జీ. కాఫీ కావాల్ట కాఫీ. కాక్‌టేల్ వద్దురా నాన్నా, ముందు ముసుగు తియ్. వెధమ్ముండలా ముసుగేవింటిరా? సిలోన్‌వాడు అప్పుడే "ఏక్ హీ ఫిల్మ్" వేసేస్తున్నాడు. అంటే ఏడుం పావు దాటిందన్నమాట. ఇంక ఈ రాజమ్మ మహారాణీ రావడం ఎప్పుడు? మనం మొహాలు కడగడం ఎప్పుడు? లే లే. లేచి వీధిలో చూడు అదొస్తుందేమో" అంటూ ముసుగు లాగేసేడు.

"కాఫీ మాటకేంగాని అబ్బాయ్. రాజమ్మ చాలా బావుం టుంది కదూ. నిజంగా దానికే ముస్తాబు చేసి కాలేజీ గేటు దగ్గర నిలబెడితే మన సెట్టు అంతా దానికి మైలుదూరంలో కూడా నిల్చోలేరు" అంటూ తన అభిప్రాయం వెలిబుచ్చేడు సిగరెట్టు అంటిస్తూ రవి. అతని జుత్తులో పది పిచ్చికలు సునా యాసంగా గుడ్లు పెట్టుకోవచ్చు.

"ఒరే రవిగా, "రాజమ్మ-దాని అందచందములు" అన్న శీర్షిక మీద ఇవాళేదయినా లెక్చరుందోయ్ నీకూ? పరగడుపునే దాని అందందేనికోయ్! ముందు కాఫీ, తర్వాతే రాజమ్మ, దాని అమ్మాను, అమ్మమ్మ! యింక-నే తాళలేనే. చూడు నా కడుపు ఎలా ఏడుస్తోందో కాఫీ కాఫీ అంటూ" వాపోయేడు పీతబుర్ర వాడు.

"మీరెన్ని చెప్పండి, రాజమ్మ లాంటిది ఎదురుగా నిల్చుంట ే.... ఓహ్ ... కాఫీ ఏవింటిరా కాఫీగొట్టు మొహమా? స్వర్గం బారెడు దూరంలో ఉండదటోయ్. అందాన్ని అనుభవించడానికీ, చూసి ఆనందించడానికీ కావలసింది బానలాంటి కాఫీకడుపు కాదోయ్? కళాత్మకహృదయం ఉండాలి. ఆర్టిస్టిక్ సెన్స్ ఉండాలి. ఎవరైనా వచ్చి నీకిప్పుడు కాఫీ కావాలా! అందాలబొమ్మ రాజమ్మ కావాలా అనడిగితే? ఎంత సినీమాటిక్‌గా ఉంటుందీ?" అర మోడ్పు కన్నులతో సిగరెట్టుపొగనే మేఘాల్లాగా ఊహిస్తూ ఆ మేఘాల్లో రాజమ్మని చూస్తున్నాడు రవి.

"అంత సినీమాటిక్ గానూ నడ్డి విరిచీగల్డు దాని మొగుడు, కలలు మానేసి కాస్త ప్రపంచంలో పడి కాఫీ సంగతి చూడు."

"నాకేం పట్టిందోయ్ మీకు కాఫీలందించడానికి. నేనేం మీ ప్యూన్ని కాను. పెళ్ళాన్ని అంతకంటే కాను. మీకంత ఆకలిగా వుంటే "మధురానగరిలో" అంటూ భుజంమీద బిందెపెట్టుకొని నీళ్ళకొకదూ, ప్లాస్కూ పట్టుకొని మరోదూ పోండి వెధవగోల. కమ్మటి ఊహలని పాడుచేసేరు. యూ డర్టీ రోగ్స్."

"కాఫీ తాగకపోతే నాకు కాలు కాదు కదా వేలు కూడా కదలదే! మరిప్పుడెలాగరా బాబూ."

"కదపకు."

"ఏఁవిఁటి?"

"వేలు."

"వోధవ జోకు. కావాలంటే పత్రికలకు పంపించుకో గాని – ఒరేయ్ నా దగ్గర ఇలాటి కుళ్లు జోకు లేసేవంటే చర్మం ఒలి చేసి నా పుస్తకాలకి అట్టలు వేసేసుకుంటాను. జాగర్తరా ఫూల్."

"అక్కడికి నీకేదో పుస్తకాలు తగలడ్డట్టు."

"అవ్వ్రా నాకు పుస్తకాల్లేవు–ఏఁవిటంటావ్? నా ఇష్టం. నేను కొనను. ఏఁవుందా పుస్తకాల్లో. పుస్తకాల్లో చదివినది మనకు ఎందుకు పని కొస్తుందోయ్? సపోజ్, మాట వరసకి – నువ్వేం చదువుతున్నావ్ ఇప్పుడు?"

'ఏం చదవడంలేదు. పడుకున్నాను."

"అహ ఏం తెలివండీ, నీలాటివాడికి స్పెషల్ స్కాలర్ షిప్పు యిచ్చి అమెరికా పంపించాలి. చఁవటన్నర చఁవఁట. నువ్వు అఘోరించేది బి.ఏ. కదూ!"

"అవును."

"అందులోనూ లిటరేచర్‌లో."

"మరే!"

"లిటరేచర్‌లో నీకేం చెప్తారు? కాళిదాసో – షేక్స్ పియరో – అంతేనా."

"అంతేననుకుంటాను."

"బి.ఏ. అయ్యేక ఏం చేస్తావు?"

"ఇంకా ఆలోచించలేదు."

"ఆలోచించడానికి యిదేం కాశ్మీరు సమస్యా ఏఁవిటి? నువ్వు చదివే బోడి బి.ఏ.కి కలక్టరుద్యోగం యిస్తారుటోయ్? ఏ ఎల్డీసీవో అవుతావు. లేకపోతే కోమటికొట్లో పద్దులేస్తావు."

"అలాగే అవుతుంది మరి."

"లేకపోతే యింకోలాగ అవడానికి నువ్వేం మినిష్టరు బామ్మ ర్దివా? ఎమ్మెల్యే అల్లుడివా? అంచేత నువ్వుచేసే గుమాస్తా ఉద్యో గంలో ఎకౌంట్లు రాస్తావు, డ్రాఫ్టులు రాస్తావు. మెమోలు అందు కుంటావు. హెడ్ గుమాస్తా చేత చివాట్లు తింటావు. ఎందుకో తెల్సా? నీ కివేవీ లిటరేచర్లో చెప్పరు కాబట్టి. కాళిదాసు డ్రాఫ్టులు రాయలేదు. షేక్స్‌పియరు ఎకౌంట్లు వెయ్యలేదు. నువ్వు వాళ్ళనే చదివేవు. నీ చదువు ఏ ఉద్యోగానికీ పనికిరాదు. మరెందుకురా వెధవా అన్ని వేలు తగలేసి ఈ చదువు?"

"ఏదో ఒకటి చదవాలిగా మరి."

"అనెవడు చెప్పేడు–నువ్వు ఉద్యోగం చెయ్యవు. మీ నాన్న దగ్గర డబ్బు మలేరియా పేషెంటులా మూలుగుతూ ఉంటే–ఎమ్మే చదువుతావు. ఇంకా మూలుగుతే పి.హెచ్.డి. చేస్తావు. చేసి ఏం కనుక్కుంటావు? రాముడి గడ్డం నల్లగా ఉండేదా? పండి పోయిందా? లేకపోతే గురజాడ అప్పారావుగారు రాసిన నాటకాలు అతను రాయలేదు. మరో అప్పలకొండ రాసేడం టావు? ఎవరు రాసినా నాటకం మారిపోదు. దాని అర్థం మారి పోదు. మరలాటప్పుడు ఎవడ్రాస్తే నీకేవిఁటోయ్. ఈ విషయం కనుక్కోవడానికి అడ్డమైనవాళ్ళ కాళ్ళూ పట్టుకొని కొన్నేళ్ళు తిరుగుతావు. రాముడి గడ్డం పండితే నీ కెందుకు? అతను గుండు చేయించుకుంటే నీ కెందుకు? దాని బదులు ఓ గాడిద పిల్లని తెచ్చి పెంచుకుంటే ఆ మూడేళ్ళకి వందగాడిదలకి యజ మాని అయ్యుండే వాడివి. ఆ డబ్బుతో సినీమాహాలు దగ్గర సిగరెట్ల దుకాణం పెట్టుకుంటే లక్షాధికారివి అయ్యుండేవాడివి. ఎందుకోయ్ ఉపయోగంలేని చదువులు!"

"నాయనా చంద్రం! పరగడుపునే ఇంత లెక్చరివ్వడానికి నీకున్న ఓపికకి నేను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. ఇంకా వెధవ లెక్చరాపి కాఫీ, స్నానం, కాలేజీ వగైరాల సంగతి చూడు" అప్పుడే రాజమ్మ కలల్లోంచి తేరుకున్న రవి అన్నాడు.

"ఇంక రాజమ్మ ఈపూట రానట్టే. దాని మొగుడు యింకా ఒగ్గలేదేమో. చలికాలం కదూ?"

"ఒగ్గనివాడు మొగుడో? మరోడో?"

"తప్పురా అబ్బీ! ఎంత పనిమనిషైనా దానికీ మంచీ మర్యాదా ఉంటాయ్" రఘుకి ఆడవాళ్ళంటే సాఫ్టు కార్నర్ వుంది.

"అపర శరత్‌బాబు అవతరించేడోయ్. పనిమనిషికి పాతి వ్రత్యం నీ నోటినుంచే వింటున్నాను."

"ఏం అదిమాత్రం అందరిలాంటి ఆడదికాదా?"

"అన్లేదే?"

"దానికి మాత్రం మానాభిమానాలు ఉండవా?"

"ఉండవని అన్లేదే."

"మరెందుకా తప్పుడు కూతలు?"

"అవసరంరా చిట్టీ! అవసరాలు, పరిస్థితులు. అవసరాలు మనిషిని ఎంత నీచప్పనికైనా తీసికెళతాయి. దేశంలో యిన్ని దొంగతనాలెందుకు జరుగుతున్నాయి? నువ్వూ, నేనూ తీరిగ్గా కూర్చుని దొంగతనాలూ దోపిడీలూ చేస్తున్నామా? లేదే! తిండా నికి తిండిలేక పెళ్ళాం పిల్లలు మాడి చచ్చిపోతూ వుంటే దొంగత నాలైనా చేస్తాం. దోపిడీలైనా చేస్తాం. అక్కడ అవసరం అలా చేయిస్తుంది. ఇదీ అంతే. ఏ ఆడదీ తిని కూర్చుని తప్పుడు పన్లు చెయ్యదు. అలాటి వాళ్ళు కూడా లేరనను. కాని చాలా తక్కువ. మరీ వొళ్ళు కొవ్వినవాళ్ళు ఎక్కడో కాని ఉండరు."

"నువ్వు మరీ ఇదిగా మాట్లాడేస్తున్నావురా చంద్రం."

"ఇదేవింటోయ్? ఇదీ-అదీను నిజం. నూటికి నూట పది పాళ్ళు నిజం. ఎవరూ అమ్మ కడుపులోంచి పుడుతూనే దొంగలు కారు. పుడుతూనే చెడిపోరు. ఇప్పుడీ కంపెనీలు నడుపుతున్న వాళ్ళూ చిన్నప్పుడు పతివ్రతలే. కాని ఏదో అవసరం వాళ్ళని అలా మార్చేస్తుంది. తర్వాత అవసరాలు తీరినా అలవాటు ఉండి పోతుంది-అంతే."

"అయినా రాజమ్మ అలాటిది కాదోయ్."

"మధ్య నీ గ్యారంటీ ఏఁవింటి? దాని మొగుడేవఁన్నా కలక్టరా? కమీషనరా? ఆఫ్టరాల్ ఓ రిక్షావాడు. వాడు దీని సరదాలూ, అవసరాలూ ఏం తీరుస్తాడు? ఎవరితోవ వాళ్ళు చూసు కోవల్సిందే."

"తప్పురా చంద్రం! ఆడదాన్ని గురించి అంత తేలిగ్గా మాట్లా డకు. పాపం. ఈ రాజమ్మని చూస్తే చెయ్యెత్తి దండం పెట్టాలని పిస్తుంది."

"ఎంతమాట! కొబ్బరికాయ కొట్టి సాష్టాంగ నమస్కారం చెయ్యి. ఎవడొద్దన్నాడు? కాని ఈవేళ చెప్తున్నాను. విను ఎప్పుడో ఏదో కంపెనీలో దాన్ని నువ్వు చూస్తావు, తప్పదు."

"ఇన్ని పెద్ద కబుర్లు చెప్తున్నాడు గాని, వీడికి దాని చెయ్యి పట్టుకోవడానిక్కూడా ధైర్యం ఉండదురా. ఒరేయ్, అబ్బాయ్! కబుర్లు చెప్పడానికీ పనులు చెయ్యడానికీ చాలా తేడావుంది."

"అని నీలాటి చెవుల పిల్లిగాడు అంటాడు. చెప్పండిరా, ఏం చెయ్యాలో? పదిమందిలో ఒక ఆడపిల్లని ముద్దు పెట్టు కోవాలా? లేక పోతే..."

"అంత పెద్ద ఘనకార్యం ఇప్పుడొద్దుకాని-ప్రస్తుతం రాజమ్మ చెయ్యి పట్టుకో-చాలు."

"సరే ఫర్ ప్యూర్ సైంటిఫిక్ రీజన్స్ పట్టుకుంటాను. సరేనా. కాని దాని చెయ్యి నేనెలా పట్టుకోవాలి?"

"నూరేళ్ళు ఆయుష్షు, నీక్కాదూ, రాజమ్మకి. అదిగో ఆ వచ్చేది రాజమ్మలాగుంది చూడు."

"ఈ పొద్దు కుసింత ఆలీశం అయిపోనాది బాబూగారూ" అంటూ పరుగులాంటి నడకతో ప్రవేశించింది రాజమ్మ. ఆవిడ మొహంలో ఆఫీసరుగారింట్లో అంతకు ముందు జరిగిన సంఘటన తాలూకు గుర్తులు ఇంకా మాసిపోలేదు.

"అవును. అవుతుందిలే. చలికాలం కదూ. అవుతుంది మరి. మనవంటే బ్రహ్మచారి వెధవలం కాబట్టి కొక్కొరోకో అంటూ కోడి కంటే ముందే లేచి కూర్చుంటాం. దానికేం ఖర్మ, మర్రి చెట్టంత మొగుడుండగా."

"ఏటి బాబూ ఆ మాటలు?"

"మాటలు కాదు, నిజవేఁ. కావాలంటే మానుల్లా మేము లేమూ."

"మీలాటి సదువుకున్నోరు యిలాటి తక్కువ మాటలు అన కూడదు బాబూ."

"చదువుకున్న వాళ్ళం కాబట్టే సరసాలాడుతున్నాం. ఇదే మరో మోటువాడయితే ఇలా నీ చెయ్యి పట్టుకొని....." అంటూ రాజమ్మని చెయ్యి పట్టుకొని లాగబోయేడు రవి.

అంతే. ఆ తర్వాత అతనికి రాజమ్మ చెయ్యికానీ, రాజమ్మకానీ ఆ గదిలో మిగిలినవాళ్ళు కానీ కనిపించలేదు. మిగిలిన వాళ్ళకి

మాత్రం ఏదో ఠాప్‌మన్న శబ్దంతోపాటు రవి మంచంమీద పడ్డం–లాంగ్‌షాట్‌లో గుమ్మం దిగుతున్న రాజమ్మా–కనిపించేరు.

చంద్రానికొక నాన్న. ఒకే ఒక అన్న, మూడంతస్థుల మేడలు రెండు, పల్లపు భూమి పదెకరాలు, రెండు ట్రాక్టర్లు, పదిమంది పాలేర్లు వున్నారు. వాళ్ళ స్వంత ఊళ్ళో అన్న, నాన్న కలిసి వ్యవసాయం చేస్తున్నారు. వాళ్ల పూర్వులంతా వ్యవసాయమే చేసేరు. అంచేత చంద్రాన్ని చదివించి ఏ జిల్లా జడ్జినో, జిల్లా కలెక్టరో చేద్దామని వాళ్ళ ఆశ, ఆశయం. చంద్రానికి పూర్వుల పోలికలూ రాలేదు! అన్నా, నాన్నల ఆశయాలూ నచ్చలేదు! అతనికి చదువులమీద సదభిప్రాయంగాని, వ్యవసాయంమీద దురభిప్రాయం గాని లేదు. అంచేత చాలామందికి చదువు జీవనోపాధి అయితే చంద్రానికి హాబీ! అతనికి కాలేజీలో నచ్చినవి రెండే. ఒకటి కేంటీను, రెండోది లేడిస్ వెయిటింగ్ రూమ్. అతను కాలేజీకి వెళ్తే మొదటిదాని లోపలగాని, రెండో దాని బైటగాని ఉంటాడు. అతనికి ఆడపిల్లలని చూడడం, వాళ్ళతో మాట్లాడ్డం సరదాయేగాని, ఆ చొరవా, ధైర్యం తక్కువ. క్లాసు పుస్తకాలు తప్ప, ఇంక ఏ విషయం గురించి మాట్లాడ మన్నా అధమం ఆరుగంటలసేపు అనర్గళంగా మాట్లాడగలడు.

మాట్లాడడంకంటె కలలు కనడం ఎక్కువ యిష్టపడతాడు రవి. అన్నం, నీళ్ళూ లేకుండా సిగరెట్లు కాలుస్తూ, సిగరెట్టు పొగ రంగులలో తనకి కావలసిన కల కనగలడు అతడు. నిజ జీవితమయితే అది చెప్పినట్లు మనం నడుచుకోవాలిగాని, పగటి కలలయితే మనం చెప్పినట్టు అవి వింటాయి. ఏదైనా అనుభవిం చేది మనస్సే కదా. మరి ఆ అనుభవం నిజంగా అయితేనేం? కలగంటేనేం? అన్నది ఫిలాసఫీ. తల్లి కానీ, తండ్రికానీ, తోడ బుట్టిన వాళ్ళు కానీ ఎవరూ లేని అతను అందరినీ కలల్లోనే కలుసుకుంటాడు. ఐతే అతనికి బెంగలు లేవని కాదు. ఉన్నది ఒకే ఒక బెంగ. తన చదువు పూర్తి అయ్యే లోపున తన తల్లి తన కిచ్చిన ఆరెకరాలు హరించుకుపోతాయేమోనని. ఒకవేళ అలా హరించుకుపోతే తన గతి ఏవిఁటని? ఆ బెంగే లేకపోతే అతను చదువు మానేసి పూర్తిగా కలల్లోనే బతికి ఉండేవాడు. ఏనాడూ కాలేజీకి వెళ్లకపోయినా అతనికి ఏ పరీక్షా యెప్పుడూ పోలేదు. చంద్రంలాంటి వాళ్ళతో కలిసి ఒకే గదిలో ఉండడంవల్ల కలిగే లాభాలు అతనికి బాగా తెలుసు. ఎవరయినా తీసికెళ్ళితే అతను రోజూ సినిమాకి వెళ్ళగలడు. లేకపోతే నెలల తరబడీ మానేసి తన కలల సినిమాలు చూడగలడు. అతనికి యెవరన్నా భయం కాని భక్తి గాని లేవు. మరీ ఒంటరిగా పెరగడంవల్ల అలా అయిపోయేడని చంద్రం అభిప్రాయం కాని, పదిమంది మధ్యనున్నా సరే అతను ఒంటరిగానే ఫీలౌతాడు.

స్వతహాగా ఒంటరితనం అలవాటు లేకపోయినా బిడియం వల్లా, సిగ్గువల్లా రఘు యెప్పుడూ బితుగ్గానే ఉంటాడు. ఐతే అతనికి ప్రపంచంలో యెప్పుడూ మంచే కనిపిస్తుంది. "చెడ్డ" అతని డిక్షనరీలో లేదు. అతనికి మంచి ఉద్యోగం చేస్తున్న అతి మంచి నాన్నా, మంచి మొగుళ్ళున్న ఇద్దరు అక్కలూ, శ్రీరామచంద్రమూర్తిలాంటి అన్నా, సీతాదేవిలాంటి వదినా ఉన్నారు. అతనికి అన్ని కథలూ నచ్చుతాయి, అన్ని సినిమాలూ బావుంటాయి. అన్ని జోకులూ బావుంటాయి. ఎంత చచ్చు జోకుకయినా మనసారా నవ్వగలడు. చెడ్డ పత్రికలూ, బూతు పుస్తకాలూ వగైరా యెంత పెద్ద పుస్తకమయినా సరే అవలీలగా యెత్తి కిటికీలోంచి అవతలకు విసిరేస్తాడు. ఎంత కష్టమైన సబ్జెక్టు ఐనా సంతోషంగా చదువుతాడు. అతిచిన్నవాడుగా ఉన్న పుడే శరత్ సాహిత్యం అంతా నవిఁలేసేడు. అందువల్ల అతనికి ఆడ వాళ్ళంటే అపరిమితమయిన జాలీ, పిచ్చి గౌరవం. ఎంత యవ్వనవతినైనా సరే–అతను యెన్నడూ దురుద్దేశంతో చూడ లేదు. ఆడదానిపట్ల యెవరు తప్పుగా మాట్లాడినా, అతను సహిం చలేడు. కాని తిరగబడి యెదిరించే ధైర్య సాహసాలు లేవు.

ఈ ముగ్గురూ కాక ఆ గదిలో వుంటున్న మిగిలిన యిద్దరూ శాశ్వతంగా నిద్ర లేవకపోయినా సృష్టి కొచ్చిన లోపం ఏమీ ఉండదు. వాళ్ళ నాన్నలు లక్షాధికారులు. వాళ్ళ చదువులు విజ్ఞానం కోసంగాని ఉద్యోగం కోసం కాని యెంత మాత్రం కావు. కేవలం కట్నం రేటు పెగడంకోసమే వాళ్ళు చదువుతున్నారు. అంచేత చదువుతో సంబంధం లేకుండా వాళ్ళు ప్రతి క్లాసూ దాటేస్తున్నారు. ఎలా దాటేస్తున్నారో వాళ్ళకే అంతబాగా తెలీదు. దాటేయించటం కేవలం వాళ్ళ తండ్రుల స్వవిషయం. సిని మాలకి వెళ్ళనప్పుడూ, నిద్రపోనప్పుడూ, వాళ్ళు పేకాట ఆడు తారు. రూమ్‌మేట్స్ దగ్గర డబ్బు ఐపోతే వాళ్ళకి పెట్టుబడి పెట్టి పేకాట ఆడిస్తారు. ఐతే వాళ్ళ దగ్గర ఒక మంచి విషయం ఉందని వొప్పుకోక తప్పదు. ఎవరయినా చదువుకుంటున్నప్పుడు మాత్రం వాళ్ళ చదువు పాడుచెయ్యరు. కోరి యెవర్నీ చెడ గొట్టరు. కావాలని యెవరైనా చెడిపోతే వొద్దనరు.

ఆ గదిలో యింతకుముందు జరిగిన సంభాషణలుగాని, సంఘటనగాని వీళ్ళిద్దరికీ తెలీదు. తెలిసిన యిద్దరూ మాటరాక మంచాలమీదే అలా కూర్చుండిపోయేరు.

ఐతే ఆ షాక్ నుండి మొదట తేరుకున్నది రవే. తేరుకొని "ఒరే వెధవల్లారా ఏఁవిఁట్రా పెళ్ళాలు చచ్చిపోయిన వాళ్ళలా అలా ఉన్నారు? ఆఫ్టరాల్ ఒక వానపాముని చూసి నాగుపాముని చూసినట్టు అలా బెదిరిపోతే యెలా? ఒరే రఘూ! మనిద్దరం అలా ఏదైనా రిక్షాలోపోయి కాఫీ తాగొద్దాం. ఒరే చంద్రం! ఈ లోపున నువ్వా కుంభకర్ణుడ్నీ, వాడి తమ్ముడ్నీ లేపి మొహాలు కడిగించు. వస్తునప్పుడు మీక్కూడా కాఫీ పట్టుకొస్తాం. ఆ ఫ్లాస్కిలా తగలెయ్యి" అంటూ పైజమా మీదే యెదురుగా కనిపిస్తున్న షర్టు వేసుకొని రఘుని ఈడ్చుకొని వెళ్ళి రోడ్డుమీద యెదురుగా వస్తున్న రిక్షాలోకి గెంతి "పోనియ్యవోయ్, దగ్గరున్న కాఫీ హోటల్‌కి, రోజూ ఎక్కే వాళ్ళ దగ్గర బేరమాడక్కర్లేదులే. అంతగా కావలిస్తే నువ్వు ఇక్కడ కూర్చో, నేను తొక్కేస్తాను" అని రిక్షా వాడితో చెప్పి రఘుతో ప్రారంభించేడు. "ఏఁవిఁట్రా కుందేలూ, అంత గాబరా పడిపోయావు? ఛ.ఛ. మనం మొగాళ్ళంరా. ఇంత చిన్న విషయానికే మనం డిజప్పాయింట్ ఐపోతే యెలా? ఎన్ని ధక్కా ముక్కీలు తింటేగాని మనం పెద్దమనుషులం అవుతాం? ఇదేం డబ్బిచ్చి సరుకు కొనడంలాంటి దనుకున్నావా ఏఁవిఁటి? చిన్నప్పుడు "బ్రూసు-సాలీదు" కథ చదువుకోలేదూ? గజనీ మహమ్మదు గురించి చదువుకోలేదా? ఇదీ అంతే."

"నువ్వు తొందరపడ్డావేమోరా" రఘు మనసు ఈ సంఘటనతో చాలా బాధపడింది.

"ఛ. ఛ. నీ మొహం తొందరేఁవిటిరా. అసలిలాటి విషయాల్లో నిదానం పనికిరాదు. ఏం జరుగుతుందో అవతలివాడికి తెలిసేలోపున పనై పోవాలి. అవతలి వారికి ఆలోచించు కోవడానికి మనం టైమివ్వకూడదు. ఐనా ఈ రాజమ్మ ముండ ఆఫ్టరాల్ ఒక పనిమనిషికి అంత ఫోర్సుంటుందని నే ననుకోలేదు."

పరిచితమైన పేరు విన్న సింహాచలం రిక్షా తొక్కడం ఆపేడు ఒక్క క్షణం. రాజమ్మ అంటే తన రాజమ్మే. ఏవిటంటున్నారు ఈ కుర్రాళ్ళు? ఏం జరిగింది?

"అసలే మాకు తొందరగా ఉంటే మధ్య నీ ఆలస్యం ఏఁవిఁటోయ్! తొందరగా పోనీ."

యాంత్రికంగా కాళ్ళు రిక్షా తొక్కుతున్నా సింహాచలం మనసు వాళ్ళ మాటలమీదే ఉంది.

"ఎంత బజారు ముండైనా పిలవగానే వప్పుకుంటుందా? ఛస్తే వొప్పుకోదు. ఆఖరికి కట్టుకున్న పెళ్ళాం కూడా నలుగుర్లోనూ మొగుడు చెయ్యి పట్టుకుంటే ఫెడీమని తంతుంది. ఇవాళ లెంపకాయ కొట్టినంత మాత్రాన అది సీతా అనసూయల వంశంది అని మాత్రం అనుకోకు. అవేళ నన్ను కొట్టింది. రేపు నిన్ను కూడా కొట్టవచ్చు. ఆహాఁ చెయ్యిలాగితేనేలే - ఊరికే కాదు. ఎల్లుండి మరొకర్నీ తంతే తన్నవచ్చు. మానేస్తే మానెయ్యవచ్చు. కాని ఆ తర్వాత మాత్రం మరెవర్నీ కొట్టదు.

అదంతే, అందరూ మొదట నీతిగా బతుకుదామనే అనుకుంటారు. తీరి కూర్చుని నువ్వు అబద్ధం ఆడతావా? ఏదో అవసరం వస్తే ఆడతావు. అంతా, బాగా జరిగినన్నాళ్ళూ నువ్వు హరిశ్చంద్రుడివే.

కష్టాల్లో కూడా నీతిగా, నిజాయితీగా బతికే వాళ్ళు ఒకప్పుడు పురాణాల్లో ఉండేవారని చదివాం. కాని యీ కాలంలో ఎవ్వరూ లేరు. ఉండరు కూడా. ఒక వేళ ఎవరైనా మిలీయనుకి ఒకడు ఉన్నా, వాడ్ని మిగిలిన వాళ్ళు అలా ఎక్కువ కాలం ఉండనివ్వరు. ఇంతకీ అదీ మనిషే. దానికీ సరదాలూ ఉండకపోయినా కనీసపు అవసరాలుంటాయి. అవి కూడా తీరకపోతే మనిషి అన్నవాడెవడూ శాంతిగా బతకలేడు. అసంతృప్తి నిప్పులాంటిది. మనిషిని నిలువునా దహించేస్తూ ఉంటుంది.

అంచేత రాజమ్మ లాంటి వాళ్ళు నూటికి తొంభై మంది ఉంటారు. అవేళ కొట్టిందని ఏడవక్కర లేదు. రేపు ముద్దు పెట్టుకుంటే మురిసి పోనవసరం లేదు. టేకిట్ యీజీ బోయ్, ఇక్కడితో యీ విషయం మరిచిపో. నేనైనా ఏదో పంతానికి అలా చేసేను కాని ఆడ వాళ్ళందర్నీ చెడగొట్టడవే నా ఆశయం కాదు. ఆడవాళ్ళంటే మరీ అంత ఆరాధన పెంచుకోకు ఎప్పుడో దెబ్బతినగలవు."

"ఆపరా అబ్బీ ఆపు, మాకు తగ్గవాడివే దొరికేవు. హోటలు దాటి పోయినా ఆగవేం? అసల్నువ్వు యీ లోకంలో వున్నావా? పరగడుపునే చుక్కవేసుకున్నావా? చిల్లరుందా? లేదూ? అయితే అయిదు నిమిషాలాగు. హోటలు వాడి దగ్గర పట్టుకొస్తాను." అంటూ రిక్షాలోనుంచి గెంతి రఘుతో సహా ఎదురుగా ఉన్న హోటల్లోకి వెళ్ళిపోయాడు రవి.

# 66

అంతవరకూ రవీ, రఘూల సంభాషణ అంతా తలకట్లతో సహా అంతా విన్న సింహాచలానికి వాళ్ళు డబ్బులిచ్చే వరకూ ఆగాలన్న ఆలోచన రాలేదు. పరధ్యాన్నంగా కలలో తొక్కుతున్నట్లు రిక్షా తొక్కుతున్నాడే గాని అతని మనసంతా రాజమ్మ చుట్టూ తిరుగుతోంది. ఇంక ఆవేళ రిక్షా తొక్కాలని అనిపించ లేదు సింహాచలానికి. ఇంటి కెళ్ళిపోతే? అతని కాళ్ళు అప్రయత్నంగా ఇంటివేపు తొక్కుతున్నాయి. అతను మనసులో కోటి రిక్షాలుని సూపర్ స్పీడు తొక్కేస్తున్నాయి.

"సీ! సీ యియేళ ఎంత పాడురోజు, దేవతలాంటి తన రాజమ్మని ఆళ్ళు అన్ని రకాల అంటుంటే యినాల్సి వచ్చింది. ఆళ్ళ మాటలు ఇంటూ సేతకాని ఎదవలాగా ఊరుకోవల్సి వొచ్చింది. బావుంది–ఊరుకోక ఏటి సెయ్యగల్ను? ఏటన్నా సేస్తే ఆళ్ళూరుకుంటారేటి? నీ పెళ్ళాం నీ కంత ముద్దయితే ఇంట్లో కూకో పెట్టుకోక–పన్లో కెందుకు తోలినావ్? అనదుగుతారు. అసలిలాటి మాటలు యిన్నాక తనింకా ఎందుకు సావలేదు? ఈ రిచ్చాని ఏ లారీనో గుద్దీగూడదూ? ఎందుకు గుద్దతాది? ఇంకా ఇలాటివి ఎన్ని ఇనాలో! అసలు ఇలా అవడానికి కారణం ఎవరు? ఆ కుర్రాళ్ళా? ఆళ్ళ తప్పేటుంది? ఏ ఆడదాని గురించన్నా ఎవుడి ఇష్టం ఒచ్చినట్టు ఆడు అనుకుంటాడు. కాదనడానికీ, ఒద్దనడానికీ తనెవడు!? ఆళ్ళు ఒయసులో ఉన్నారు. ఆళ్ళ తప్పేటి? మరి! రాజమ్మదా? దాన్ననుకుంటే ఈ కాళ్ళు యిలాగే పడిపోతాయి. చన్నీళ్ళకి ఏన్నీళ్ళలా వుంటాయని ఎలాగో పన్లు జేస్తున్నాది. అది తప్పా? ఆడెవడో పెంకితనానికో, పోకిరీతనానికో సెయ్యట్టుకుంటే సెంపదెబ్బలు కొట్టడం తప్పా? మరెవరిది తప్పు? ఇంకెవరిది–తనదే.

తనలాటి సేతకానెదవ పెళ్ళిచేసుకోడం మొదటి తప్పు; సేసుకున్నాక ముష్టెత్తి అయినా పెళ్ళానికి కూడెట్టాలిగాని, దాని రెక్కల కష్టం మీద బతకడం రెండో తప్పు. తనదేదైనా మారాజుల వొంశమా ఏటి? ఇంత డబ్బూ, పేరూ, వొంశం నాశనం అయిపోతాయని బెంగెట్టుకోడానికి? తను పెళ్ళిచేసుకొని, పిల్లల్ని కనకపోతే పోయేదేటుంది? అంతగా ఆడది కావాలనుకుంటే పావలాడబ్బులు పారేస్తే వొస్తాది ఎవర్తో ఒకర్తి.

కట్టుకున్నాక దానిముద్దూ, ముచ్చటా తీరకపోయినా, అవుసరాలున్నా తీరస ఒద్దా! కడుపునిండా కాకపోయినా, ఒంటి పూటన్నా వణ్ణం ఎట్టాలి. ఎట్టలేనివోడు ఉరేసుకొని సావాలి గాని బతగ్గూడదు. ఇంత ఎదవ బతుకు ఎందుకు? ఇయ్యేళ అది నిప్పులాటిది కాబట్టిగాని లేకపోతే ఏం జరుగును? హుం. 'నిప్పు' మాత్తరం ఎంతకాలం ఏడిగా ఉంటాది? ఎప్పుడో అప్పుడు సల్లారిపోదూ? అసలింకా అది మంచిది కాబట్టి తన దగ్గర ఇన్నాళ్ళుందిగాని, మరో కిల్లాడీ ముండైతే ఎప్పుడో లెగిసిపోను ఎవడితోనో. ఎంత మొగుడైతే మాత్తరం ఎల్లకాలం ఏ సరదా లేకుండా ఎవరు ఊరుకుంటారు? అసలెందుకు ఊరుకోవాలి? ఎంత మంచిదన్నా దానికే ఎప్పుడో విసుగొచ్చేస్తాది. ఆళ్ళు సెప్పినట్టు ఒకసారి కాదంటాది. రెండుసార్లు కాదంటాది. తర్వాత సెడిపోదని ఏటి నమ్మకం? పదిమందిరిలోకి ఎల్లిన ఆడదానికి–అది పట్టపు రాణీ అయినాసరే, పనిమనిషైనా సరే – పరువుండదు. ఇంక దాన్ని పన్లోకి ఎల్లనివ్వకూడదు. కావలిస్తే రేతిరీ, పగలూ తనే పన్జేస్తాడు. కాని గబుక్కున పని మానెయ్యమంటే అది ఏటనుకుంటాదో? ఎలా చెప్పాలి?

ఆలోచిస్తున్న సింహాచలం ఇల్లుచేరేడు.

# 67

తను ఎలా ఇల్లుచేరిందో రాజమ్మకే తెలీదు. అనుకోకుండా జరిగిన సంఘటనలవల్ల ఆమె మనస్సు తెల్లకాగితంలా–ఖాళీగా అయిపోయింది. ఇంటికొచ్చి నులకమంచంమీద పడుకున్న ఆమెకి గతంగాని, వర్తమానం గాని ఏం జ్ఞాపకం రావడంలేదు. తన ఇంటిచుట్టూ వెయ్యిమంది స్టూడెంట్లో ఎవరోగాని స్పష్టంగా తెలీని మగవాళ్ళు రెండువేల చేతుల్తో తనని నిర్బంధిస్తున్నట్టు కనిపిస్తోంది. తను ఆ రోజు ఇల్లు బైల్దేరినది మొదలు ఇంత వరకు జరిగినది ఆమె గుర్తుకు తెచ్చుకోవాలని ప్రయత్నిస్తోంది. ఆఫీసరు గారింట్లో సంఘటన ఆమెని అంతగా బాధించలేదు. ఎంచేతంటే ఆఫీసరుగారి భార్యనోరు మంచిదికాదని చాలామంది చెప్పేరు ఆమెతో. అయితే మన నోరు మంచిదయితే ఊరు మంచిదౌతుందన్న నమ్మకంతోనో, ఏదైనా పని దొరక్కపోతే రోజులు గడవవని అవసరం వల్లా అక్కడ పన్లో చేరింది. అయితే ఒక్క మనం, మననోరూ మంచిదైనంత మాత్రాన సరిపోదనీ, అవతలివారి చెడ్డ మన మంచిని తుఫానువస్తే గుడిసెలు తుడుచుకుపోయినట్టు తుడిచేస్తుందనీ పాపం ఆవిడకి తెలీదు. అయితే మిగిలిన వాళ్ళు ఆఫీసరుగారింట్లో వారం రోజులు దాటి ఎవరూ ఉండలేకపోయినప్పటికీ రాజమ్మ–మంచి రాజమ్మని యింకో

వారం ఎక్కువ ఉండనివ్వగలిగింది. అంతే. పైగా వాళ్ళింట్లో పని-సముద్రంలో కాగితం పడవలా అతి కొద్ది కాలం మాత్రమే నిలుస్తుందని ముందుగా తెలిసినందువల్ల రాజమ్మకి ఎక్కువ బాధ అనిపించలేదు.

కాని యీ స్టూడెంట్లే....ఆ సంఘటన తల్చుకొంటేనే ఆమె మనస్సు మండిపోతోంది. "అమ్మో! ఎంత పన్జరిగిపోను! ఆ బాబు కుర్రోడైపొయ్యేడు కాబట్టి భయం వల్లో, సిగ్గుపడో ఒగ్గేసి నాడు గాని అదే ఇంకే మగోడైనా అయితే తననే రెండు తగ ల్నిచ్చి-ఇంకేటుంది? అసలీ మొగాళ్ళు సదువుకున్నోళ్ళయినా, సదువుకోని వాళ్ళయినా, ముసలాళ్ళయినా, కుర్రాళ్ళయినా - సరే - ఆడదాన్ని సూడ గానే ఎందుకలా ఎర్రెత్తిపోతారో? సీ, స్సీ. మొగోళ్ళంతా ఒకటే జాతి. ఆళ్ళల్లో తేడానేదు. గొప్పోళ్ళకి గొప్ప బుద్ధులుంటా యనుకుంది. కాని ఉండవు. ఎక్కడన్నా వుంటా యేమోగాని ఆడదాని దగ్గర మాత్తరం ఉండవు. ఆ మేస్త్రీగాడూ ఒకటే, ఈ కుర్రాడూ ఒకటే. అందరిదీ ఒకటే బుద్ధి, పాడుబుద్ధి. అందులోనూ తనలాటి బీదోళ్ళంటే అందరికీ అలుసే. అందుకే పుట్టేరు అనుకుంటారు. పావలా పరకకి లొంగిపోతారనుకుంటారు. ఇల్లుదాటిన ఆడదంటే అందరికీ లోకువే. కాని తన్లాంటి వాళ్ళకి గడపదాటకుండా కూకుంటే ఎలా గడుస్తాది? గొప్పోళ్ళకయితే సెల్లుతుంది కాని, రెక్కాడితే గాని డొక్కాడదే. ఒక్కడి సంపాదన మూడు నోళ్ళు నింపాలంటే ఎలా జరుగుతుంది? కాని-కాని ... ఎల్తే ఎక్కడ మాత్తరం తనని సరిగ్గాసూస్తారు? ఎంతకాలం తను ఈ గెద్దల నుంచి తప్పించుకోగలదు? అంత పెద్ద సీతమ్మోరికే దిక్కునేక పోనాది. ఇక లాబంనేదు. పన్లూ వొద్దు పాట్లూ వొద్దు. ఏదో ఆడు రిక్సా మీద తెచ్చిందే తింటాం. అంతగా సాలకపోతే ఓ పూట నీళ్ళు తాగి తొంగోవొచ్చు. కడుపుకి ఎంత పెడ్తే ఒద్దంటాది? యింక పన్లు ఒప్పుకోకూడదు" అనుకుంటూ మంచంమీద గోడవేపు నుండి ఇటువైపు వత్తిగిల్లిన రాజమ్మకి గుమ్మంలో సింహాచలం కనిపించేడు.

ఆ టైములో అనుకోకుండా వచ్చిన అతన్ని చూడగానే అప్పుడే పీడకలలాంటి ఆలోచనల్లో మునిగిపోవడంవల్లా ఆమె సింహాచలాన్ని చూడగానే ఒక్క అరక్షణం త్రుళ్ళిపడింది. ఆ త్రుళ్ళిపాటు ఆమెనే పరీక్షగా చూస్తున్న సింహాచలం చూపుని తప్పించుకోలేక పోయింది. ఇద్దరిలోనూ ఎవరూ మాటడలేదు. ఏం మాట్లాడాలో తెలియక పోవడంవల్ల ఎర్రగా మర్రిపళ్ళలా వున్న రాజమ్మ కళ్ళు, ఆమె చాలాసేపు ఏడిచిందని చెప్తున్నాయి అతనికి. కాని కళ్ళు అలా ఉన్నాయేమని అడిగి ఏదో అబద్ధం చెప్పించుకోవడం అసందర్భంగా అనిపించిన సింహాచలం ఏం మాట్లాడలేదు.

తర్వాత సింహాచలం కాళ్ళూ చేతులూ వాకిట్లో కడుక్కుని రావడం, రాజమ్మ అతనికి అన్నం పెట్టడం, అన్నీ నిశ్శబ్దంగా జరిగిపోయేయి. అన్నం పూర్తి అవుతందనగా మాత్రం రాజమ్మ! "నాకు ఒళ్ళు బాగానేదు. పన్లు మానేస్తాను" అంది ద్వారంలోంచి ఎదురుగా కనిపిస్తున్న రోడ్డుమీద పడుకున్న కుక్కపిల్లవేపు చూస్తూ.

'నీ యిష్టం" అంటూ కంచంలో చెయ్యి కడుక్కొని లేచి పోయేడు సింహాచలం.

ఏం జబ్బనిగాని, ఎలా ఉన్నావని గాని అడక్కుండా మానేస్తాను అనగానే ఒప్పుకున్న సింహాచలంవేపు ఆమె ఆశ్చర్యంగా చూసింది. చూసిన ఆమెకి తను ఇదివరకు ఎరిగున్న ఇన్ని ఏళ్ళనుండీ కాపురం చేస్తున్న సింహాచలం కాకుండా మరో కొత్త సింహాచలం కనిపించేడు. ఆమెకు ఆశ్చర్యంతోపాటు భయం కూడా వేసింది.. అకస్మాత్తుగా అతని కళ్ళలో దాచి పెట్టిన కోపంలాంటిదీ, అతని మాటల్లో నువ్వెలా పోయినా నాకు ఫర్వాలేదు అన్న నిర్లక్ష్యం కనిపించేయి ఆమెకి. ఏం జరిగిందో తెలీదు కాని ఏదో జరిగిం దన్న నమ్మకం మాత్రం కలిగింది ఆమెకి. తనకి పొద్దుననుండీ జరిగిన సంగతులూ, ఇప్పుడు సింహాచలం ప్రవర్తనా-ఆమెకు ఈ రోజుతో తమ జీవితాల్లో ఏదో పెద్ద మార్పు రాబోతుందన్న విషయం తెలియజేసేయి. అయితే ఈ మార్పు మంచికి మాత్రం కాదని ఆమె మనస్సుకి మరీ మరీ అనిపించింది.

# 68

నిర్మాతల అదృష్టం బాగుండి, వేసినతారల భవిష్యజీవితం బాగుండేయోగం ఉంటే వంద చిత్రాల్లో ఒకటో తప్పితే రెండో శతదినోత్సవం జరుపుకుంటాయి. మామూలు వాళ్ళకి పుట్టిన రోజులు ఏడాదికి ఒకసారి వస్తాయి. (గొప్పవాళ్ళకి ఎప్పుడు అనుకుంటే అప్పుడు వస్తాయి. ముష్టివాళ్ళకి పుట్టిన రోజులే ఉండవు!) నదులకు పుష్కరం అని పన్నెండేళ్ళ కొకసారి వస్తుంది. ప్రఖ్యాత పెర్సనాలిటీస్‌కి నూరేళ్ళ కొకసారి శతజయంతి అని జరుపుతారు. అలాగే దేశం మొత్తానికి విధిగా అయిదేళ్ళ

కొకసారి ఎలక్షన్లు వస్తాయి. వీటికి ప్రజల ఇష్టా యిష్టాలతో గాని, అదృష్ట దురదృష్టాలతోగాని నిమిత్తంలేదు.

ఈ ఎలక్షన్లు బహు కొద్దిమందికి బాగు. మెజారిటీకి నష్టం తెస్తాయి. కొందరికి జీవన్మరణ సమస్యా, చాలా మందికి కాల క్షేపం అవుతాయి. వీటి అర్థం ఎవరికి ఎంత మాత్రం తెలుసు అన్నది సందేహాస్పదం. అయితే బ్రాడ్‌గా చెప్పుకోవాలంటే ప్రజలు తమ బాగోగులు చూసి పెట్టడానికి (ఎవరి బాగోగులు వారికి తెలీవా?) తమ కష్టసుఖాల్ని కనిపెట్టి ఉండడానికి (ఎదుటి వారి సుఖం ఎవడూ కోరడు!) వగైరాలకి తమకి నాయకుల్ని ఎన్ను కుంటారు(ట). ప్రజలే కోరి వారిని ఎన్నుకుంటారా లేక నాయకులే కోరి ఎన్నిక చేయించుకుంటారా అన్నది తేలని విషయం.

ప్రజలు ఎవరి దగ్గరికయినా వెళ్ళి "బాబ్బాబు మా కష్ట సుఖాలూ, మంచి చెడ్డలూ మీరు చూడకపోతే మేమంతా చచ్చి పోతాం. అంచేత మీరు మాకు నాయకులై అడవిలో చీకట్లో వెళుతున్నవాడికి టార్చిలైటులా మాకు దారి చూపించండి" అని గడ్డం కడుపూ పట్టుకొని బతిమాలిన సంఘటనలు జరిగినట్లు విన్లేదు. నాయకులు కావాలను కున్నవారు ఇంకా ఎలక్షన్లు కనుచూపు మేరలో ఉన్నాయన గానే ప్రజల్లో పలుకుబడి సంపాది స్తారుట. పలుకుబడి కూడా కష్టపడి ఆర్జించవచ్చు. డబ్బిచ్చి కొనుక్కోవచ్చు. డబ్బు పారేస్తే వచ్చే దానికోసం బుద్ధివున్న వాడె వడూ కష్టపడడు. నీ కష్టం ఎవడిక్కావాలి నీ డబ్బు కావాలి కాని.

నువ్వు సారా తాగితే నీ లివరే దెబ్బతింటుంది. మహా అయితే నీ కుటుంబం అడుక్కుతింటుంది. అంతే. అలాగే నీకు సిగరెట్లు అలవాటుంటే నీకే కేన్సరొస్తుంది. అంతగా అయితే నీ వాళ్ళంతా బికారులౌతారు. తుఫాను వస్తే ఆ ప్రాంతమంతా తుడుచుకు పోతుంది. అయినా ఫర్వాలేదు. ఇళ్ళు పడిపోయిన వాళ్ళకి ఇళ్ళు కట్టుకోమని-తలో పది వెదురుళ్ళూ, మొత్తం తుడుచుకు పోయిన వాళ్ళకి తలొక చీరా, అది ఉంచుకోడానికి అయిదో, పదో రూపాయలూ శ్రీ గవర్నమెంటు వారో, మరొకరో ఇస్తారు. భూకంపం లాంటిది గట్టిగా వస్తే పూచీ ఉండదు. అప్పుడు ఇవ్వడానికి యెవరూ ఉండరు; పుచ్చుకోవడానికి ఉండరు. కాని ఎలక్షన్లలో ప్రజలు ఒక విధంగా శాశ్వతంగా నష్టపోతారు. సరైనవాడ్ని యెన్నుకోకపోతే తాత్కాలికంగా రూపాయి, అర్ధా దొరికినా పోటీకి నిల్చున్న వాళ్ళలో గెల్చుకున్న వాడికి తాత్కాలి కంగా కొన్ని లక్షలు పోయినా-తిరిగి రెట్టింపు వచ్చేస్తుందన్న ధీమా ఉంటుంది. ఓడిన వాడికి మాత్రం పదవిలేదు కదా, ప్రామిసరీ నోట్లు మిగులుతాయి తీర్చడానికి.

లక్ష్మీదేవి ఆడది, ఆడదాని బుద్ధి అయిదు నిమిషాలు కూడా స్థిరంగా ఉండదని పెద్దలు చెప్తారు. కాని లక్ష్మీదేవి దైవాంశం కలది కాబట్టి అయిదేళ్ళు మాత్రం ఒకచోట ఉండగలుగుతుంది. వెంటనే ఆవిడలో ఆడబుద్ధి తలెత్తుతుంది. ఎంత దైవాంశ ఉన్నా కూర్చుని కూర్చుని కాళ్ళుపట్టుకుపోయి రుమేటిక్ పెయిన్స్ వగైరా రాకుండా ఒక్కసారి అలా షికారు వెళ్ళాలని అనిపిస్తుంది ఆవి డకి. దానికి ఆవిడకి ఎలక్షన్లు మంచి ముహూర్తంగా తోస్తుంది. ఆ టైములో ఆవిడ చేతులు మారిపోతుంది. ఇళ్ళు, వీధులు, వీలుంటే ఊళ్ళుకూడా మారిపోతుంది. అదేవింటోగాని ఎప్పుడూ ఆవిడని అపురూపంగా చూసుకునే ప్రజలు ఆ టైములో చింకి కాయితం కంటే అధ్వాన్నంగా చూస్తారు. అయితే లక్ష్మీపుత్రులకి మాత్రం ఆవిడంటే ఎప్పుడూ చిన్నచూపు ఉండదు. తల్లంటే ఎవరు గౌరవించరు? అయితే వారికి తెలిసినదీ వెర్రి గొర్రెలకి తెలీందీ ఒక విషయం ఉంది. అదేవింటంటే జంతువుల్లో విశ్వాస పాత్రమైన కుక్కలాగా-పక్షుల్లో నమ్మదగ్గ పావురంలాగా - దేవుళ్ళలో లక్ష్మీదేవి చాలా విశ్వాసపాత్రమైనది. ఎక్కడెక్కడ తిరి గినా తిరిగి తన అసలు ఇంటికే-తనను పెంచిన వాడి దగ్గరికే వచ్చేస్తుంది. వస్తూ వస్తూ వట్టి చేతుల్తోగాని, వెళ్ళినట్టుగా గాని రాదు. కొంచెం వళ్ళుచేసి మరీ వస్తుంది. ఈ కిటుకు అందరికీ తెలీదు మరి.

ఎలక్షన్ల టైములో ప్రతివాడికీ చేతినిండా పనే. నోటినిండా మాటలే. జేబులనిండా డబ్బులు గలగల. కడుపులనిండా సారా, ప్రతి ఊరికీ పెళ్ళి కళ వచ్చేస్తుంది. మనం కలలో కూడా వినని పేర్లు గోడలమీదా, పేపర్లలోనూ చూస్తాం. పండుగనాడైనా నైవేద్యం ఎరగని దేవుఁడు ధూప దీప నైవేద్యాలతో ముహూర్తం పెళ్ళికొడుకులా వెలుగుతాడు. మైదానాలకీ, మైకులకీ విశ్రాంతి ఉండదు. నీ పెళ్ళానికి పురుడొస్తున్నా, నీ అమ్మకి హార్ట్ ఎటాక్ వచ్చి ఆస్పత్రికి తీసుకెళ్ళాలన్నా, డాక్టరు రావాలన్నా టాక్సీగాని, రిక్షాగాని, ఆఖరికి సైకిలుగాని దొరకదు. ఆఖరికి ఎవరైనా చచ్చిపోతే ఇంట్లో నలుగురు మనుషులుంటే తప్ప మొయ్యడానికి కూడా మనుషులు దొరకరు. పెరట్లో తగలెట్టాల్సిందే. అదీ పరిస్థితి.

సరిగ్గా అలాంటి పరిస్థితే దేశం అంతటా ఏర్పడింది. అసలు, ఎలక్షన్లు అంటువ్యాధిలాంటివి! నిముషాలమీద పాకేస్తాయి. సింహాచలం రాజమ్మా ఉంటున్న ఊరుకి కూడా ఈ అంటువ్యాధి సోకింది. అయితే యీ వ్యాధికి నివారణా, చికిత్సా రెండు లేవు కనుక దానికి హద్దు ఉండదు. ఈ ఎలక్షన్ల చలవవల్ల సింహాచలం ఇంట్లో తల్లీ ముగ్గురూ మూడు పూటలా కడుపునిండా భోజనం చేస్తున్నారు. రాజమ్మ రెండు చీరలు కూడా కొనుక్కుంది.

సింహాచలం రిక్షాని పోటీదారుల్లో ప్రముఖుడైన వీరస్వామి నాయుడు గారు ఎలక్షన్లు అయ్యేవరకు కుదుర్చుకున్నాడు.

వీరాస్వామి నాయుడుగారు నిక్కర్ల వయసులో వీరిగాడు గానూ పేంట్ల వయసులో వీరస్వామిగానూ, ప్రస్తుతం నాయుడు గారు గానూ ప్రజలకి తెలుసు. వారి తాతల సంగతి ఎవరికీ తెలీదు. తండ్రి కొన్నాళ్లు జైల్లో ఉండి బైటకి వచ్చేక పెరగటం ప్రారంభించేడు. ఎందుకు జైల్లో ఉన్నట్టు అన్న అంశంమీద చాలా కథలున్నాయి. ఆ కథలు ఈ కథకు అవసరంలేదు. నాయుడుగారు పెరగడం ప్రారంభించేక-యింక ఆగలేదు. వీరస్వామి నాయుడుగారికి తండ్రిగారిచ్చిన ఆస్తివైనం వందెకరాల మాగాణి, నాలుగు మేడలూ, నలభై గౌడు గేదెలూ, రెండు మిల్లులూ, మూడు సీమకుక్కలు, నాయుడుగారు తండ్రికి తగిన కొడుకు. వారా ఆస్తిని అన్ని అయిటమ్సుని మూడుపెట్టి గుణించేరు. కుక్కలు మాత్రం ముప్పయిచేత గుణించవలసి వచ్చింది. ఎంత ఆస్తి వుంటే మాత్రం ఇన్ని కుక్కలని ఎవరు పెంచగలరు? అందుకని వారు మూడింటిని మాత్రం ఉంచుకొని మిగిలినవి ఎప్పటి కప్పుడు అమ్మేసేవారు. అవి కూడా ధర బాగా పలకదంతో ఈ వ్యాపారాన్ని సైడ్ బిజినెస్‌గా చేస్తున్నారు. వయసులో ఉన్నప్పుడు వారికొక భార్య ఉండేది. ఆమె బహు చక్కనిదని చూసిన వాళ్ళు చెప్పుకుంటారు. ఇప్పుడావిడ లేదు. పెరుగుట తరుగుట కొరకే అన్న నానుడి నాయుడిగారి యవ్వనానికి గాని ఆస్తికి వర్తించదు. వారికి ఇరవైయేళ్ళ కూతురున్నప్పటికీ చూపుకి వారు మహా ఉంటే ముప్పయి ఉన్నట్టు కనిపిస్తారు. వారి మిల్లుల సంఖ్యా, మిల్లుల్లో కార్మికుల సంఖ్యా నానాటికీ పెరిగిపోతోంది. అయితే అన్నీ పెరిగిపోతున్నాయనడానికి వీల్లేదు. మాటవరసకి కార్మికుల జీతాలు పెరగటంలేదు. పాలేర్ల సంఖ్య పెరగలేదు. అలాగని కార్మికులుగాని, పాలేర్లుగాని ఆయన్ని పన్నెత్తి మాటన లేదు. అంటే అసలు పళ్ళూ, పనులూ, రెండూ ఉండవని నాయుడు గారికంటే కూడా వాళ్ళకే బాగా తెలుసు.

వారి ఆస్తి కంతటికీ ఏకైక వారసురాలు వారి అమ్మాయి అంజలి. అంజలికి తల్లి చక్కదనం రాలేదు. కాని తండ్రి గుణాలు వచ్చేయి. ఆడపిల్ల, తండ్రి పోలికైతే అదృష్టం. కాని ఆ అమ్మాయి తండ్రి పోలికే కాకుండా తల్లిని పోలినా, అదృష్టంలో పెద్ద మార్పు ఉండేదికాదు. ఆ అమ్మాయి ఆ ఊరి కాలేజీలో బియెస్సీ చదువుతోంది. నాయుడుగారు ఆ కాలేజీ కమిటీ ప్రెసిడెంటు కాబట్టి ఆ అమ్మాయి ఆ కాలేజీకి వైస్ ఛాన్సలర్ లాంటిది. అయినా ఆ అమ్మాయికి ఎవరిమీదా అధికారం చేసే తీరిక గాని, ఓపికగాని లేవు. వారానికి ఎనిమిదో, పదకొండో సినిమాలు చూడ్డం, అడ్డమైన పుస్తకాలూ అరడజనుసార్లు చదవడం, రోజుకి కనీసం నాలుగుసార్లు చీర, చీరతోపాటు జాకెట్లూ, జోళ్ళూ, గాజులూ, నగలూ వగైరా మార్చుకోవడంతో ఆవిడకి క్షణం తీరికుండదు. ఆమె తన చదువు భారమంతా తన తండ్రిమీదే వదిలేసింది.

ప్రస్తుతం నాయుడుగారు ఈ ఎలక్షను గొడవల్లో అన్నం, నీళ్ళూ కూడా మానేసి తిరుగుతున్నారు. తను తప్పకుండా గెలుస్తానన్న ఆత్మ విశ్వాసం అతనికుంది. అయినా ప్రయత్నం చెయ్యాలి కదా? అతనికి పోటీగా నిల్చున్న రమాపతిరావుగారిదీ ఆ ఊరే. వారి తాతలు బంగార పుళ్ళేల్లో భోంచేసేవారని వినికిడి. తండ్రుల కాలంలో వెండి ధర బంగారం కంటే మించిపోయింది కాబట్టి వారు వెండికంచాల్లో తిన్నారట. రమాపతి రావుగారి టైముకి వెండికి బదులు స్టీలు చోటు చేసుకుంది. వారికి ఎలక్షన్లు అంటే పెద్ద ఇష్టం లేదుకాని, నాయుడుగారంటే గిట్టనివాళ్ళు కొందరు కేవలం నాయుడుగారిమీద కసికొద్దీ వారిని నిలబెట్టేరు. నిలబెట్టడం వరకే కాకుండా ధన సహాయం, మాట సహాయం కూడా చేస్తామన్నారు. గెలిస్తే పదవి వస్తుంది. పోతే వాళ్ళ డబ్బే పోతుందన్న ఉద్దేశంతో రమాపతిరావు గారు కూడా వప్పుకున్నారు.

సన్నాహాలు జోరుగా సాగుతున్నాయి. కాలేజీ మైదానం లోనూ, కాన్వెంటు కాంపౌండులోనూ నాయుడుగారి గంభీరోపన్యాసాలు జరుగుతున్నాయి. హైస్కూలు గ్రౌండులోనూ ఊరవతల మైదానంలోనూ రమాపతిగారు ఉపన్యసించేరు. ఇద్దరూ బెంగపడుతున్నారు. బెదిరిపోతున్నారు. అలిసిపోతున్నారు. అర్థబలం, అంగబలం నాయుడుగారికి ఎక్కువగా వున్నా కార్మికులని నూనె వెయ్యకుండా కాల్చుకు తింటున్నందువల్లా, కాలేజీ నిండా తన వాళ్ళనే నింపుకోవడంవల్లా, ఊళ్ళోవాళ్ళ కడుపులు మండి ఉన్నందువల్లా ఈసారి రమాపతిరావుగారే నెగ్గుతారన్న

పుకారు బయలుదేరింది. నాయుడుగారు కాకుండా ఇంకెవ రయినా ఫర్వాలేదు అన్న ధోరణిలో వున్న ప్రజలు రమాపతిరావు గారిని బలపరచడం ప్రారంభించేరు.

అదిగో సరిగ్గా ఆ పరిస్థితిలో ఆ సంఘటన జరిగింది. అప్పటికి పోలింగు సరిగ్గా పదిరోజులే వుంది.

ఆ రాత్రి.....

ఆకాశం నల్లగాజులా తళతళలాడుతోంది. వీధిలైట్లు భూమి మీదికి షికారొచ్చిన నక్షత్రాల్లా ఉన్నాయి. ఎలక్షన్ల వత్తిడివలన గాలి బరువెక్కి పోయిందా అన్నట్లు యెక్కడా ఒక్క ఆకు కూడా కదలడంలేదు. చెట్లన్నీ ఫోటోకోసం నిల్చున్నట్టుగా ఆకు కదపడం లేదు. ఊళ్ళో వున్న అన్ని సినిమా హాలుల దగ్గరా జనం కొట్టుకు చస్తున్నారు. అంతకు నాలుగు రోజుల నుండీ రెండు హాల్సులో కొత్తగా రిలీజైన రెండు సినిమాలు నాయుడు గారు ప్రజలకు ఊరికే చూపిస్తున్నారు. అందులో ఒక హాలు నాయుడుగారు ఈ మధ్యనే కట్టించేరు. రెండోది యీ ఎలక్షన్లు మనసులో ఉంచుకొని ఏడాది క్రిందటే లీజుకి తీసుకున్నారు. డబ్బు ఖర్చు కాకుండా వస్తే విషం కూడా పుచ్చేసుకునే ప్రజలు సినిమాలకి విరగబడి పోతున్నారు.

ఆ రాత్రి ఉభయ పార్టీలు ఊరేగింపులు పెట్టేరు.

నాయుడుగారి ఊరేగింపు పెద్ద బజార్లో వుంది. రమాపతి రావు గారిది చిన్నబజార్లో వుంది. మధ్యలో నాలుగురోడ్ల జంక్షను వుంది. ఆ జంక్షనులో ఎత్తుగా వున్న సిమెంటు దిమ్మమీద రాతి గాంధీగారు గొడుగేసుకొని నిల్చున్నారు.

ఆ బజార్లలో బట్టల షాపులున్నాయి. బంగారం షాపు లున్నాయి, రెండింటిలోను ఆడవాళ్ళున్నారు.

మార్వాడీ షాపులున్నాయి. మంగలి షాపులున్నాయి. రెండిం టిలోనూ క్షవరం చేయబడును.

ఇటువైపు హోటల్ అజంతా ఉంది. అటువైపు హోటల్ అప్సరా వుంది. రెండింటిలోనూ పావలా పరక ఆడ సరుకుంది.

రెండు ఊరేగింపుల్లోనూ మొదట రౌడీలు కాల్బలంగానూ, వారి వెనక సైకిలు వాలాలు, అశ్వబలంగానూ, వారివెనక రిక్షాలు గజబలంగానూ, చివరనున్న లారీలు రథబలంగానూ ఉన్నాయి. ఆఖరు లారీల్లో నాయుడు, రమాపతిరావుగార్లు దుర్యో ధనుడు ద్విపాత్రాభినయం చేస్తున్నట్టు ఉన్నారు.

ఆ ఊరేగింపు అశ్వమేథ యాగానికి తరలివెళ్లే సైన్యంలా వుంది.

సైనికులు సారాకంపు కొడుతున్నారు.

ఉభయ ఊరేగింపులు గాంధీగారి ఆశీర్వాదం కోసం అన్నట్టు జంక్షను దగ్గర ఆగేయి.

ఆశీర్వదించడానికి గాంధీగారికి కుడిచెయ్యి లేదు. ఎడంచేత్తో గొడుగు పట్టుకున్నారాయె!

సైనికుల్ని ఉత్సాహ పూరితుల్ని చెయ్యడానికే అన్నట్టు రెండు ఊరేగింపుల్లోనూ రికార్డు డాన్సులు జరుగుతున్నాయి.

ఎల్లారీశ్వరి పాటకి వొంపులు విరుస్తోంది నాయుడుగారి నళినీ కుమారి.

నళిని ముక్కుచూస్తే పదిహేనేళ్ళదాన్లా వుంటుంది. కళ్ళు విడిగా చూసినా అంతే ఉంటుంది. నోరు ఒక్కటీ చూసినా అలాగే అనిపిస్తుంది. అన్నీ కలిపి చూస్తే నలభై ఏళ్ళకి తక్కు వుండవు. ఆవిడ చీరసగం వంటి మీదా మిగతా సగం స్టేజిమీదా ఉంది.

ఒక్కమాటలో చెప్పాలంటే ఆవిడ పువ్వుల గంగిరెద్దులా ఉంది.

ఆవిడ జాకెట్టునిండా మిలిటరీ మెడల్స్‌లా రూపాయినోట్లు పిన్నులకి గుచ్చి ఉన్నాయి.

ఎల్లారీశ్వరి పాట ఆపేసింది.

నళినీకుమారి నాట్యం ఆపేసింది.

కాని ఒగర్పు మానలేదు.

అదిగో, సరిగ్గా అప్పుడే జరిగింది ఒక దారుణమైన సంఘటన.

అప్పుడు.......

రమాపతిగారి ఊరేగింపులోంచి ఒక బొమ్మల లాల్చీ ముందుకు వచ్చింది.

ఆ లాల్చీ అడుగున పైజామా ఉంది?

లాల్చీలోనూ పైజామాలోనూ ఒక రసికుడు ఉన్నాడు.

అతని నోట్లో ఆరని బీడీ వుంది.

కడుపునిండా సారా వుంది.

ఒంటినిండా దుమ్ము వుంది.

మెడలో గళ్ళ రుమాలుంది.

నెత్తిన మూడుగజాల జుత్తుంది.

మూతిమీద మూడడుగుల మీసం వుంది.

ఆ మీసానికి "కునేగా" సెంటుంది.

గుండెల్లో కృష్ణదేవరాయలకున్నంత రసికత వుంది. అతను రమాపతిరావుగారి కాల్బలాధిపతి.

నళినీ కుమారి డాన్సు చూస్తున్న అతనిలోని రసికునికీ, కాన్వాసరుకీ భీకర సంగ్రామం జరిగింది.

కాన్వాసరు ఓడిపోయేడు.

రసికుడు ముందుకు నడిచి శత్రు రాజకుమారి అందాన్ని మెచ్చుకుంటున్న యువరాజులా నళినీకుమారి వేపు చూసేడు. చూసి ఆమె బండి మీదకు ఒక్క ఎగురు ఎగిరి, ఆమె జాకెట్టుకి పది రూపాయల నోటు గుచ్చేడు. ముత్యాలహారం అందుకుంటున్న రాజనర్తకిలా కృతజ్ఞతా పూర్వకంగా నవ్వింది నళిని.

ఈలోగా.......

ఘటోత్కచుడిలా బండి స్టేజీమీదికి గెంతేడు. ఓ మీసాలవాడు, ఆ మీసాలతో కనీసం గజం పొడవు సవరం కట్టించుకోవచ్చు. తన భుజం మీదున్న శశిరేఖ సగం తోవలో దబీమని గెంతేసి పారిపోతున్నప్పుడు ఘటోత్కచుడు ఆమె వేపు యెలా చూసి ఉంటాడో సరిగ్గా అలా చూసేడు అతను నళినివేపు. చూసి ఆవిడని జాకెట్టు పట్టుకొని లాగేడు. నళిని కదల్లేదు. కాని జాకెట్టు వచ్చేసింది చిరిగిపోయి.

ఆ జాకెట్టునీ దానిమీద ఉన్న నోట్లనీ రసికుని మొహాన కొట్టేడు ఘటోత్కచుడు.

ఆ తర్వాత అతని మొహం మీద కొట్టేడు.

కొట్టి "మా ఆర్టిస్టుని ముట్టుకోవడానికి నీ కెన్ని చేతులున్నాయిరా నంజికొడకా?" అని అరిచేడు.

"ముట్టుకోకపోతే ముద్దెట్టుకోమంటావేటిరా?" అన్నాడు నంజికొడుకు.

అంతవరకే చూసేవాళ్ళకి స్పష్టంగా కనిపించింది. తర్వాత ఏం జరిగిందీ ఎవరూ స్పష్టంగా చెప్పలేకపోయేరు.

రణభేరీలకి చెదిరిపోయిన సైన్యాలతో రెండు పక్షాలు ఢీకొన్నాయి.

గజ బలాలు గుద్దుకున్నాయి.

అశ్వబలాలు అరుచుకున్నాయి.

కాల్బలాలు కుమ్ముకున్నాయి.

తెలుగు తిట్లూ-ఉర్దూ బూతులు.

ఎముకలు విరిగేయి.

కర్రలు కొట్టేయి.

సోడాలు ఎగిరేయి.

యుద్ధం ముగిసింది.

యుద్ధ ప్రారంభం కాగానే రాజులూ, సైన్యాధిపతులూ శిబిరాలకి పారిపోయేరు.

సైన్యం సారా వాసన కలిపిన రక్తం వాసన వేస్తున్నారు. క్షతగాత్రులు ఆస్పత్రికి చేర్చబడ్డారు.

వీరస్వర్గం ఎవరూ అలంకరించలేదు.

సైనికుల్లో ఒకడైన సింహాచలం శిబిరానికి వెళ్ళలేదు.

ఇంటికి వెళ్ళలేదు.

అతనికి తల పగల్లేదు.

పళ్ళు విరగలేదు. ఎడమకాలు లేదు.

వంటిమీద తెలివి లేదు.

తెలివి వచ్చేసరికి ఆస్పత్రిలో ఉన్నాడు.

ఆ ఆస్పత్రికి అందమైన బిల్డింగుంది.

దాని పాలరంగు గోడలుచూస్తే కొరుక్కు తినెయ్యాలని వుంటుంది.

అక్కడ డాక్టర్లని చూస్తే షేక్‌హేండ్ యివ్వాలనుంటుంది.

నర్సులను చూస్తే ముద్దుపెట్టుకోవాలని ఉంటుంది.

కాంపౌండర్లను కావలించుకోవాలనుంటుంది. మంత్రసానుల్ని చూస్తే మొగాళ్ళక్కూడా పురుడు పోసుకోవాలని వుంటుంది.

ఆ ఆస్పత్రి గవర్నమెంటుది కాదు.

అంచేత.........

అక్కడ డాక్టర్లకి తెలివితేటలూ, నేర్పూ ఉన్నాయి.

నర్సులకి సేవా తత్పరత వుంది.

అక్కడి మందులు నకిలీ సరుక్కాదు.

డాక్టర్లూ, నర్సులూ, మందులూ కలిసి పని చేసేరు.

యమధర్మరాజు సింహాచలం కాలుపట్టుకొని గట్టిగా లాగేడు.

సింహాచలాన్ని డాక్టర్లు గట్టిగా పట్టుకున్నారు.

డాక్టర్లకీ, యముడికీ జరిగిన పోరాటంలో డాక్టర్లకి సింహాచలం దక్కేడు.

యముడికి ఎడమకాలు దక్కింది. (కాలు సింహాచలంది.)

నాయుడికి ఫస్టుక్లాస్ ప్రోపగాండా మెటీరియలు దొరికింది.

సింహాచలాన్ని చూడ్డానికి పోలీసులు వచ్చేరు. మేజిస్ట్రేటు వచ్చేడు. పత్రికలవాళ్ళు వచ్చేరు. ఫోటోగ్రాఫర్లు వచ్చేరు.

అతను చెప్పిందంతా పేపర్లో పడింది.

చెప్పనిదీ పడింది.

అందులో వాళ్ళకి నచ్చినది పోలీసులు రాసుకున్నారు.

ఆస్పత్రిలో అతనికి రొట్టే, పాలూ, పళ్ళూ యిచ్చేరు. వెళ్ళిపోతున్నప్పుడు కర్రకాలుకూడా యిచ్చేరు.

# 69

సింహాచలం ఆస్పత్రిలో చేరిన మర్నాడు–నాయుడుగారు ఒక పెద్ద బహిరంగసభలో "......ఓట్లు అడిగినప్పుడు డబ్బిచ్చిన వాళ్ళని చూసేం, డప్పులు వాయించిన వాళ్ళనీ చూసేం. ఉద్యోగాలు వేయిస్తాం అన్నవాళ్ళనీ, బ్రిడ్జీలు కట్టేస్తాం అన్న వాళ్ళనీ, భూములు ఇస్తాం అన్నవాళ్ళనీ, ఇలా రకరకాల వాళ్ళని చూసేం. కాని కాలు విరగ్గొట్టి ఓట్లు అడిగినవాళ్ళని ఇప్పుడే చూస్తున్నాం? ఓటు తుపాకీగుండు లాంటిది. ఒకసారి పేలినగుండు తిరిగీ పేలదు. ఒకసారి వేసిన ఓటు మరిరాదు. అంచేత మీరే ఆలోచించి..." అంటూ ఇంకా చాలా మాట్లాడేరు.

నాయుడుగారికి యెంత ఊపిరి తరగని పనివున్నప్పటికీ ప్రతి రోజూ ఆయన ఆస్పత్రిలో వున్న సింహాచలాన్ని పలకరించనిదే ఇంటికి వెళ్ళే వారు కాదు. వెళ్ళినప్పుడల్లా బుట్టలతో పళ్ళు తీసికెళ్ళడం, డాక్టర్లతో సింహాచలం పరిస్థితి గురించి సంప్రదించడం, రాజమ్మనీ, పిల్లవాడినీ పరామర్శించడం మొదలయినవి వారెన్నడూ మరిచిపోలేదు.

తర్వాత ఎలక్షన్లు ఐపోయాయి.

నాయుడుగారు నెగ్గేరు–మామూలుగా కాదు–థంపింగ్ మెజారిటీతో నెగ్గేరు. సింహాచలం కర్రకాలుతో ఇంటికొచ్చేసాడు. నాయుడుగారిచ్చిన సరుకులతోనూ, డబ్బుతోనూ సింహాచలానికి రెండు నెలలు ఓ మోస్తరుగా గడిచేయి. మరుసటి నెల యిబ్బందిగా గడిచింది. తర్వాత యింక రోజు కూడా గడవనంది.

మనిషికి కళ్ళుపోతే చూపు పోతుంది. కాళ్ళుపోతే నడక పోతుంది. గొంతుపోతే మాటపోతుంది. కాని యివన్నీ పోయినా సరే ఊపిరున్నంత వరకూ ఆకలి మాత్రం పోదు. ఆకలి పోవాలంటే మనిషి పోవాలసిందేతప్ప మరో మార్గం లేదు. అంచేత సింహాచలానికి కాలుపోయినా ఆకలి మాత్రం పోలేదు. కాని అది తీరేదారి కనుచూపు మేరలో అతనికిగాని, రాజమ్మకి గానీ కనిపించలేదు. కాని అమావాస్య కారుచీకటిలో మిణుగురు పురుగు వెలుతురంత ఆశలాంటిది ఆమెకు కలిగింది. అదేమాట సింహాచలంతో చెప్పింది. ఏమని? "కాలుపోనాది అంటూ జపం సేస్తూ కూకుంటే కడుపునిండుద్దా? ఇల్లు గడిచేటట్టు సూసుకోవాలిగాని, నా మాటిని–ఎళ్ళి నాయుడు బాబుగోరి కాళ్ళమీద పడు. పడి "బాబూ మాదారేటని"అడుగు. ఆ బాబన్నా అంత ఇశ్వాసం లేకుండా ఉంటాడా? అప్పుడా ఎలక్షన్లలో ఎల్లబట్టి కదా నీ కాలుపోనాది. పోయిన కాలు యిమ్మని ఆ బాబుని అడగంగాని కడుపు మంట తీరీ దారి సూపమను. తల్లి ముగ్గురం పస్తులుంటున్నాం. ఆన్జెప్పు. ఆ బాబు యెంతమందికి యెన్ని యిదాల సాయం జెయ్యడంలేదు? మనవొఁక లెక్కా? ఏటలా యెర్రిసూపులు జూస్తున్నావ్? ఎల్లి, ఆ బాబు కాళ్ళమీద పడి ఏదన్నా దారి సూపేవొరకూ కాళ్ళు ఒగ్గకు" అని సలహా యిచ్చింది.

సింహాచలం నాయుడుగారి దగ్గరికి వెళ్ళేడు. వెళ్ళి కాళ్ళమీద పడలేదు. కర్రకాలు ఊతగా గోడకి చేరబడి నిల్చున్నాడు. అతను వెళ్ళేసరికి నాయుడుగారు హాల్లో సోఫాలో కూర్చుని సిగార్ కాలుస్తున్నారు. ఇదివరకు ఆయన ఎప్పుడూ చుట్టలే కాల్చేవారు. ఎలక్షన్లు ఐన దగ్గర్నుంచీ కంపెనీ "సిగార్స్" అలవాటు చేసుకున్నారు. కాని వాళ్ళని చిరునవ్వుతోనూ, అయిన వాళ్ళని అట్టహాసంతోనూ పలకరించటం కూడా అలవాటు చేసుకున్నారు. జబ్బుచేసినా, చెయ్యకపోయినా "మందు" వేసుకోవడం కూడా అలవాటు చేసుకున్నారు.

ద్వారం దగ్గరే సింహాచలాన్ని చూసిన నాయుడుగారి ఆలోచనలు అతనివేపు తిరిగేయి.

"ఒస్తున్నాడోయ్ ఒంటికాలు వెధవ. ఊళ్ళోవున్న ప్రతీ అడ్డ గాడిదా యెందుకేనా మంచిదని ఓసారి నన్ను పరామర్శిం చడమే. ఆ పరామర్శ నా గెలుపుక్కాదు. వాడికేదయినా సాయం చెయ్యమని. ఎలక్షన్లలో ఏదో తప్పక, ప్రతీ వెధవ కాళ్ళూ పట్టు కోవలసి వచ్చింది. "జై" అన్న ప్రతి వెధవా తనకి నేనేదో ఋణ పడి ఉన్నాననుకుంటాడు. ప్రతివాడికీ ఏదో విధమయిన సాయం చెయ్యాలి. చెయ్యకపోతే "నాయుడు ఒట్టి అవకాశవాది. స్వార్థ పరుడు, ఏరుదాటి తెప్పతగలేసే రకం. పదవితోపాటు కళ్ళు నెత్తికెక్కేయి" అని తిడతారు. పోనీ సాయపడదామంటే యింక వొక్కొక్కడి కోరికలకీ అంతుండదు. కొడుక్కి కాలేజీలో సీటు యిప్పించమంటాడు ఒకడు. సీటు యిప్పిస్తే తర్వాత మార్కులు వేయించమంటాడు. మార్కులేయిస్తే తర్వాత ఉద్యోగం వేయించ మంటాడు. ఉద్యోగం వేయిస్తే ప్రమోషను యిప్పించమంటాడు. మరో ఏడాది ఎక్స్‌టెన్షను యిప్పించమంటాడు ఇంకో రిటైరయ్యే వాడు. అడిగిన ప్రతివాడికి అన్నీ యిస్తే యింక తన మొహం ఎవరూ చూడరు. ఇవ్వకపోయినా చూడరు. చూడకపోతే వచ్చిన నష్టం కూడా లేదు.

ఇప్పుడీ సింహాచలం వెధవ ఏదైనా సాయం చేయమని అడుగుతాడు. హైస్కూలు సైన్సు రూములో ఉన్న అస్థిపంజరానికి గుడ్డలు తొడిగినట్టు రూపూ, వీడూను. అదేం అంటే నా వల్ల వీడి కాలుపోయిందట. నేను వీడ్ని ఒళ్ళుతెలీకుండా తాగ మన్నానా? తాగి తన్నుకోమన్నానా? వెధవరిక్షా తొక్కినట్లు మను షుల్ని గూడా తొక్కేస్తే ఊరుకుంటారనుకున్నాడు. నువ్వు మను షుల్ని మన్నుకుమ్మినట్టు కుమ్మగలవు. వాళ్ళు నీ చేతులూ, కాళ్ళూ చెరుగ్గడలు విరచనట్టు విరచీగలరు. నయం, కాలు ఒక్కటే విరిచేరు. అంది ఉండదు కాని–లేకపోతే మెడ విరిచేసి ఉందురు. రానీ, చూద్దాం. వీడిని కాదన్నానంటే వీడేం చేయలేడు గాని మిగిలిన వెధవలు ఊరుకోరు. వెయ్యిమంది పొగిడితే ఏం ఒర గదు కాని ఒక వెధవ తిడితే మాత్రం మన పరువు నాలుగు రోడ్లమీదే వుంటుంది." నాయుడుగారి ఆలోచనలు పూర్తి కాకుండానే–

"దండాలు దొరా" అంటూ దండంపెట్టి గోడవారగా నిల్చు న్నాడు సింహాచలం.

"దారా, రా, ఎలా వున్నావ్? ఆ! ఏఁవిఁటి సంగతులు?"

"మమ్మల్ని మీరే కాపాడాల బాబయ్యా. తిండిలేక మాడి పోతున్నాం. తవఁరే ఏదో దారి సూపి…"

"గుడ్ మార్నింగ్ డాడీ" అంటూ స్పెషల్ ప్లేన్‌లోంచి దిగు తున్న విదేశ రాయబారిలా మేడ మెట్లమీద నుంచి చెయ్యూపుతూ వచ్చింది నాయుడు గారమ్మాయి అంజలి. వచ్చి నాయుడుగారి పక్కనే సోఫాలో కూర్చుంది. చచ్చిన బొద్దింకవేపు బల్లి చూసినట్టు సింహాచలం వేపు చూసి–

"ఎవరు డాడీ, యీ లాంగ్ జాన్ సిల్వర్?" అని అడిగింది.

నువ్వు చీరకట్టుకుంటే అది పైవాళ్లక్కూడా చీరలాగే కనిపిస్తుంది. కాని లుంగీలా కనిపించదు. నువ్వు లాల్చీ తొడు క్కుంటే అది పైవాళ్ళ క్కూడా లాల్చీలాగే కనిపిస్తుంది. కాని బనీనులా కనిపించదు. కాని అంజలి తొడుక్కున్న జాకెట్టు ఆమెకి ఎలా కనిపిస్తుందో కాని పైవాళ్ళకి మాత్రం బాడీలా కనిపిస్తుంది. ఆ అమ్మాయి కళ్ళు బావుంటాయి. ముక్కు బావుంటుంది. మూతి కూడా బాగానే వుంటుంది. కానీ అన్నీ కలిపితే అందం రాలేదు. ఆ అమ్మాయి చీరకీ జాకెట్టుకీ మధ్యదూరం కొలిస్తే కనీసం అరగజం ఉంటుంది. అరసెకండుకి అయిదుసార్లు కళ్ళరెప్పలు అల్లల్లాడించడం ఆమె అలవాటు.

"వీడా తల్లీ! వీడు పూర్వాశ్రమంలో రిక్షావాడు. ఈ మధ్య ఎలక్షన్లలో చావు తప్పి కాలు సొట్టపోయేక మామూలు సింహా చలం. ఏదైనా దారి చూపించమంటున్నాడు". కూతురికి సమా ధానం చెప్పేరు నాయుడుగారు.

"దారి చూపించడానికి నువ్వేమైనా గైడువా?" అని సింహా చలం వేపు తిరిగి "నువ్వెంత వరకూ చదువుకున్నావోయ్" అని అడిగింది.

"చదువుకోనేదండి."

"భలే గమ్మత్తుగా ఉందే! ఈ కాలంలో అమ్మాయిలే ఎమ్మేలూ, పి.హెచ్.డీలూ చదివేస్తూ వుంటే నువ్వు ఏం చదువు కోలేదంటే షేమ్. పోనీ నీ భార్య ఏం చదివింది."

"అదీ ఏం సదవనేదండి."

"వ్హాట్ నాన్సెన్స్; నువ్వూ చదువుకోక, నీ భార్యా చదువుకోక మరి చిన్నప్పుడేం చేసేరు?"

"ఏం సేస్తానండి? ఏం చెయ్యలేదండి?"

"ఛ! ఛ! దేశంలో ఇంతమంది ఇలా సోమర్లుగా ఉండబట్టే మన దేశం ఇలా తగలడుతోంది. డాడీ, నువ్వైనా శ్రద్ధ తీసుకొని ఇంక ఇటుపైన మనదేశంలో చదువూ, పనీ లేనివాళ్ళు ఉండ

కుండా చూడు. ఒకవేళ అలాటివాళ్ళు ఉంటే వరసగా నిల్చోబెట్టి, మెషిన్‌గన్ పెట్టి పేల్చేయండి. అప్పుడు గాని బుద్ధిరాదు."

"తప్పు తల్లీ, అలా అనకూడదు. అందరికీ అవకాశాలు ఉండాలిగా?"

"అవకాశాలు ఉండకేం చేస్తాయి డాడీ! మీరిలా అందర్నీ వెనకేసుకొని రాకండి. దేశంలో ఇన్ని స్కూళ్ళూ, కాలేజీలూ ఉండగా చదువు కోవడానికేం? తెగులా? పోయేకాలమా?" కాలేజీల్లో, స్కూళ్ళల్లో చేరడానికి సీట్లు కావాలంటే కావలసింది బెంచీలు కావనీ, డబ్బూ, పలుకుబడీ అనీ ఆ అమ్మాయికి తెలీదు.

"చూడమ్మా నీకు తెలీదు. నువ్వింకా చిన్నపిల్లవి. ఈ విష యాలు నేను చూసుకుంటాను. నువ్వు అలా ఫ్రెండ్సింటికి వెళ్ళిరా" అని కూతురితో అని నాయుడుగారు "దాని మాటలకేం గాని–ఒరే సింహాచలం, నువ్వెవరో తెలుసా? ఒట్టి సింహాచలం మాత్రమే కాదు, నా ప్రజల్లో ఒకడివి. మీ అందరి క్షేమం చూడ వలసిన బాధ్యత మీ ప్రతినిధిగా నా మీద ఉంది. నీకు తప్పకుండా ఏదైనా మార్గం చూపిస్తాను. చూపించడం నా బాధ్యత. నా కర్తవ్యం. కాని నువ్వేం పనిచెయ్యడానికి ఇంక పనికిరావు. అంచేత నీ భార్యని ఎక్కడైనా పన్లో పెట్టు. నాకు తెలిసిన ప్రిన్సిపాలుగారు ఈ మధ్యనే ఎవరైనా నమ్మకమైన పనిమనిషిని చూడమని చెప్పేరు. నీ భార్య నాలుగు యిళ్ళలో పనిచేస్తే ఎంతొస్తుంది? మహా అయితే నాలుగైదులు యిస్తారు. అంతకంటె ఎక్కువే ఇచ్చేట్టు చూస్తాను. పైగా ఒక యింటినే కనిపెట్టుకొని ఉండొచ్చు. ఆలోచించుకుని చెప్పు" అన్నారు.

సింహాచలం ఒద్దనలేదు.

# 70

రాజమ్మ ప్రిన్సిపాలు గారింట్లో పన్లో చేరిన్నాటికి వాళ్ళింట్లో ఆరు గదులూ, ఇద్దరు పిల్లలూ, ఇద్దరు జవాన్లూ, ఒక బొచ్చు కుక్కా ఉన్నాయి.

ప్రిన్సిపాలుగారి పేరు రంగరాజు. అతనంటే గిట్టని లెక్చరర్లు అతన్ని 'దొంగరాజ'ని అంటూ ఉంటారు. అతను స్టూడెంట్లకి మొగుడు. లెక్చరర్లకి రంకుమొగుడు. కాని ఇంట్లో మాత్రం మామూలు మొగుడులా ఉండలేకపోతున్నాడు. అలా ఉండలేక పోవడం అతని చేతకానితనం అనే కంటే–అతని భార్య చేతనైన తనం అనడమే ఉత్తమం. అతనికి ఇల్లూ, కాలేజీ తప్ప బైట ప్రపంచంతో సంబంధం లేదు. పెట్టుకోవడం అతనికిష్టం లేదు. ఊళ్ళో ఉన్నవాళ్ళకి అతను కాలేజీ ప్రిన్సిపాల్‌గా కాక విజయాస్ హజ్బెండ్‌గానే తెలుసు. అతనికి భార్యంటే ద్వేషంగాని, పరాయి స్త్రీలంటే మోజుగాని లేవు. తనకిష్టంలేని పని భార్య చేసినప్పటికీ ఆమె ఇష్టానికేనాడూ అతను అడ్డు తగల్లేదు.

అతని భార్య విజయ. ఆవిడ పాతికేళ్ళ కిందట ఫిఫ్తుఫారం చదివింది. ఆ తర్వాత చదవలేదు. ఆవిడకి ఒకే ఒక కోరిక. అదేవిఃటంటే ఆ ఊరంతటికీ తను పెద్ద ప్రామినెంట్ ఫిగర్ అయిపోవాలి. "ఆహా విజయ ఎంత అందంగా ఉంటుందీ' అని మొగాళ్ళూ, 'విజయగారు మంచి పుష్ అండ్ పుల్ వున్న ఆడది' అని ఆడా మగా అందరూ అనాలనీ ఆవిడ కోరిక. నాలుగు గోడల మధ్యా కూర్చున్న ఏ మనిషీ–ఆడగానీ, మొగగానీ పాపులర్ అవలేరు. పాపులర్ అవాలంటే పదిమందిలో పడాలి. విజయ సరిగ్గా ఆ పనే చేసింది. ఆ ఊళ్ళో ఉన్న ఆఫీసర్ల పెళ్ళా లందర్నీ కూడేసి ఒక లేడీస్ క్లబ్ పెట్టించింది. దానికావిడ సెక్రటరీ. సామాన్య గృహిణులందర్నీ సేకరించి ఒక మహిళా సంఘం స్థాపించింది. దానికి ఆవిడే ప్రెసిడెంటు. ఆగస్టు 15కీ, అక్టోబరు 2కీ, దసరాకీ, దీపావళికీ లేడీస్ క్లబ్‌లో ఫంక్షన్లు జరుగుతాయి. వంటలపోటీలు, ప్రైజ్‌లివ్వడం వగైరా లుంటాయి. అలాగే మహిళా మండలి కార్యక్రమాల్లో కూడా "ఈనాటి దేశ పరిస్థితులు–మహిళల కర్తవ్యం" "విద్యార్థులు–చదువులు" వగైరా విషయాల గురించి చర్చలు జరుగుతాయి. ఈ కార్యక్రమాల సమీక్షలు ఆకాశవాణి ఆడవాళ్ళ కార్యక్రమానికి పంపిస్తారు.

లేడీస్ క్లబ్‌లో ఉన్న అందరు మెంబర్లూ నడివయస్సు వాళ్ళే. ఎవ్వరికీ విజయతో సహా ముప్పై అయిదేళ్ళలోపు వయస్సు ఉండదు. వాళ్ళందరికీ వంటవాళ్ళూ, ఆయాలూ, నౌకర్లూ, మొగుళ్ళూ ఇంటి దగ్గరుంటారు. అంచేత వాళ్ళెవరికీ కూడా ఇంటి దగ్గరుండి మొగుడికి కాఫీ ఇవ్వవలసిన అవసరంగానీ, పసిముండకి పాలివ్వవలసిన అవసరంగాని లేవు. ఇటుపైన ఉండవు. పండుగరోజుల్లో ఒక్కొక్కసారి వీళ్ళందరూ వాళ్ళ వాళ్ళ మొగుళ్ళతో కలిసి క్లబ్‌లో హైస్టేక్స్‌తో పేకాడతారు. లేకపోతే కార్లల్లో పిక్‌నిక్‌లకి పక్క ఊళ్ళకి పోతారు–విశ్రాంతికోసం. 'అబ్బ రోజుల తరబడి ఇల్లూ, మొగుడూ, పిల్లలూ విసుగెత్తిపోతోంది బాబూ. వారానికో రోజైనా, నెలకొక పూటైనా రిలాక్స్ కాకపోతే ఎలా" అంటుంది విజయ. "ఈ కాలం చదువుల స్టాండర్డు పడి

పోయిందండీ, నేను ఫిఫ్తుఫారంలో అప్పుడు చదివిన పుస్తకాలు ఇప్పుడు ఇంకా బి.ఏ. లో చెప్తున్నారు. ఎబ్బే, అబ్బర్దు, అప్పటి చదువులే వేరు" అని కూడా అంటుంది. ఆవిడ, ఫిఫ్తుపారం ఈజ్ ఈక్వల్ టు బి.ఏ. అని అర్థం.

ఈ మధ్య క్లబ్‌లూ, మహిళామండలి కార్యక్రమాలూ కాక ఆవిడ ఇంకో కొత్త హాబీ పెట్టుకుంది. అదేవిఁటంటే రచనా వ్యాసంగం. మొదట్లో "మా శ్రీవారు-చికాకులు," "పిల్లలు - డిసిప్లిన్", "అందం-అలంకారం", "ఈ కాలం ఆడవాళ్ళు" వగైరా ఎన్నో రకాల వ్యాసాలు రాసింది. అవి పత్రికలవాళ్ళు వేసుకున్నారు.

నేటి తొండ రేపటి ఊసరవిల్లి అన్నట్టు నేటి వ్యాస రచయిత్రే రేపటి సీరియల్ రచయిత్రి. ఎల్లుండి సినిమా రచయిత్రి. అంచేత విజయ ఈ మధ్య రెండు సీరియల్స్ రాసింది. అందులో ఒక దానికి ఒక ప్రముఖ వారపత్రిక పోటీలో ప్రథమ బహుమతి ఇచ్చింది.

ఈ విజయం పురస్కరించుకొని ఆమె తన ఫ్రెండ్సందరికీ బ్రహ్మాండమైన పార్టీ ఇవ్వాలని నిశ్చయించుకుంది. ఇది వరకు ఇంట్లో పని మనుషులు సరియైనవాళ్ళు కుదరక ఆమెకు పిల్లలూ, ఇల్లూ, చాలా అడ్డువచ్చేయి. "రెచ్చెడ్ చిల్డ్రన్ రాటెన్ హౌస్" అని ఆవిడ చాలాసార్లు విసుక్కుంది. అసలావిడకి పిల్లలంటే పరమ అసహ్యం. తల్లి ప్రగతికి పిల్లలే అడ్డు అని ఆవిడ నమ్మకం! కాని ప్రిన్సిపాలుగారికి పిల్లలంటే ప్రాణం. కాలేజీలో అలసిపోయి వచ్చిన ప్రాణానికి ఇంట్లో పిల్లలుంటే కాస్త మనస్సుకి హాయి అని ఆయన విశ్వాసం. అంచేత ఆవిడకి ఎంత మాత్రం ఇష్టం లేకపోయినా అతని బలవంతంవల్ల మాత్రం ఆవిడ అతికష్టం మీద ఇద్దరు పిల్లల్ని కన్నది. అదైనా ముప్పై దాటేక. పిల్లల్ని ఆడదే కనాలి కాబట్టి ఆవిడ మొక్కుబడికింద పిల్లల్నికంది. కాని మిగిలిన పెంపకం అంతా ప్రిన్సిపాలుగారిదే. వారి పెద్ద పిల్లకు నాలుగేళ్లు. చిన్న దానికి రెండేళ్ళు. ఒక్క మగపిల్లడుంటే బాగుండునని ప్రిన్సిపాలుగారి మనసు. కాని విజయ వొప్పు కోలేదు. ఇంక ఫుల్‌స్టాప్ పెట్టేయమంది, అతను పెట్టేసేడు.

# 71

రాజమ్మ రాక విజయలో ఎలాటి మార్పు తెచ్చిందో చెప్పటం కష్టం కాని ప్రిన్సిపాలుగారిలోనూ వారి పిల్లల్లోనూ మాత్రం చెప్పుకో తగ్గ మార్పే తెచ్చింది. రాజమ్మ మొదట చేరింది పని మనిషిగా నైనా తర్వాత పసిపిల్లలకు "ఆయా" గానూ ఆ తర్వాత వంట మనిషిగానూ అయిపోయింది. రాజమ్మ వచ్చిన తర్వాత ప్రిన్సిపాలుగారికి పిల్లల బెంగ పూర్తిగా తీరిపోయింది. పిల్లలకి పొద్దున్నే నీళ్ళుపోసి, శుభ్రమైన బట్టలు తొడగడం, వేళకి పాలూ, అన్నం పెట్టడం నిద్రపుచ్చడం-అన్నీ రాజమ్మే చూసుకునేది. విజయ ఇంట్లో ఉంటే ఆవిడకీ, ప్రిన్సిపాల్‌గారికీ, ఒకవేళ విజయ లేకపోతే ప్రిన్సిపాలుగారు ఒక్కరికీ అన్నం పెట్టి, వంటిల్లుసర్ది వెళ్ళిపోయేది. ఇద్దరూ ఉన్నా, ఒంటరిగా ఉన్నా ప్రిన్సిపాలుగారు ఏనాడూ రాజమ్మతో మాట్లాడి ఎరగరు. రాజమ్మే అన్నీ అమర్చి వచ్చి పిలిస్తే వెళ్ళి భోంచేసి మాట్లాడకుండా వచ్చేసి పిల్లలతో ఆడుకునేవారు. పనంతా అయిపోయి రాత్రిపూట రాజమ్మ ఇంటి కెళ్ళేప్పుడు "ఎల్తున్నా బాబుగారూ" అన్నప్పుడు "ఊఁ" అని మాత్రం అనేవారు. అదైనా రాజమ్మకు వినీవినిపించకుండా.

ఇంక విజయకి రాజమ్మ వచ్చిన దగ్గర్నుంచీ-అసలు ఇంటి ధ్యాసే లేకుండా పోయింది. ఇదివరకున్న ఆ కొంచెం బాధ్యతలు లేకుండా పోవడంతో ఆవిడ మరీ స్వేచ్ఛగా తిరగడం ప్రారంభించింది.

సాధారణంగా ప్రొద్దున్నే కోడికంటె ముందుగా లేచి, లేచిన దగ్గర్నుంచీ మళ్ళీ రాత్రి పడుకునేవరకూ విశ్రాంతి అనేది ఎరుగని వాళ్ళకి సెక్సుమీద అట్టే ధ్యానంకాని, కోరికగాని ఉండవు. అలసి పోయిన వాళ్ళ శరీరాలూ, మనసూ విశ్రాంతినే కోరతాయిగాని వినోదాన్ని గాని, ఆనందాన్ని గాని కోరవు. "కాసేపు నడుం వాల్చాలి, లేకపోతే మళ్ళీ పొద్దున్నే లేవగలనో లేదో. వేగం నిద్రపోతాను బాబూ" అనుకుంటారు. అలాటి వాళ్ళకి ముఖ్యంగా ఆడవాళ్ళకి ఎప్పుడైతే సెక్సుమీద ఇంటరెస్టు తగ్గిపోతుందో అప్పుడు శరీరంమీద శ్రద్ధా, అలంకరణమీద మోజూ వగైరాలన్నీ వాటంతటవే తగ్గిపోతాయి. రాజమ్మ యీ కోవలోకి వస్తుంది. ఇదివరకు స్వంత ఊళ్ళో వున్నప్పుడే ఎప్పుడైనా కాస్త ఉన్నంతలో శుభ్రంగానే తయారయ్యేది. ఇప్పుడసలు ఆమెకు తన శరీరంమీద ఎటువంటి మమకారం లేకుండా పోయింది. రాత్రి అయితే ఎప్పుడు తెల్లారుతుందా? యెప్పుడు పన్లోకి వెళ్తామా అన్న ఆలోచన, పన్లోకి వెళ్తే ఎంత వేగం పని ముగించుకొని ఇంటికి పోయి మొగుడికి పిల్లడికి వండి పెట్టుకోవాలన్న ఆతృత తప్ప వేరే ఆలోచన ఉండడంలేదు. తలకూడా ఏ నాలుగు రోజులకో గాని దువ్వుకొనేది కాదు. పైగా ప్రిన్సిపాలుగారి పిల్లలిద్దరికీ

ఆవిడ దగ్గర బాగా చేరిక అయిపోవడంవల్ల వాళ్ళెప్పుడూ ఆవిడని వదిలేవారు కారు. ఒక్కోసారి రాత్రిపూట వాళ్ళు పడుకునే వరకూ ఇంటికి వెళ్ళడానికి అవకాశం ఉండేది కాదు.

రాజమ్మ ఆ పన్లో గనక చేరకపోయినట్లయితే తాము పస్తులతో చచ్చిపోయి ఉండేవాళ్ళం అన్న విషయం సింహాచలం క్రమంగా మరిచి పోయేడు. అతనికి రాజమ్మ పని అంతగా నచ్చడం మానేసింది. పెళ్ళాం సంపాదనమీద బతికే ఏ మగాడైనా ఎలా తయారౌతాడో అతనూ సరిగ్గా అలాగే తయారయ్యేడు. అతనికి రాజమ్మంటే అసూయ. కోపం, అనుమానం వగైరా అన్నీ వరుసగా పెరగడం ప్రారంభించేయి.

"ఏం ఆ యమ్మకు మొగుడూ, పిల్లలూ అని లేనప్పుడు నీకెందుకంత ఉబలాటం? ఆళ్ళని పట్టుకొని నువ్వు ఏళ్ళాడ్డం ఎందుకు? నువ్వొక్కర్తివే పనిచేస్తున్నావా? దేశంలో ఇంకెవరూ పన్లు సెయ్యడం లేదా? ఆళ్ళంతా నీలాగే మొగుడ్నీ, పిల్లల్నీ వొదిలేసి అక్కడే కాపరాలుండి పోతున్నారా? నీ పని యెంత వరకో అంతవారకే సెయ్యాలిగాని ఆళ్ళెలాపోతే నీకెందుకు. నీకసలు మొగుడన్న ఎదవ ఒడున్నాడనీ మరిసిపోనావేటి? నేకపోతే వున్నా లేనోడికిందే అనీసుకున్నావా? ఇదే సెప్తున్నాను. నాకు నీ సంగతేం నచ్చడంలేదు మరి" అంటూ చుట్ట కాలుస్తూ తుపుక్కున ఉమ్మేశాడు–ఒకరోజు.

తనమీద అనుమానపడుతున్న మొగుడితో వాదించడం అంత తెలివి తక్కువ మరోటి లేదని గ్రహించిన రాజమ్మ మాట్లాడకుండా వూరుకునేది. అతని ఆరోపణలు ఏఁవీ ఖండించకుండా ఊరుకున్న రాజమ్మని చూస్తే సింహాచలానికి పిచ్చెత్తిపోయిది. పైగా తరచూ విజయ, రాజమ్మకి ఇచ్చే చీరలూ, జాకెట్లూ, బియ్యం వగైరా అన్నీ అతని అనుమానాన్ని బలపరిచేవి.

పూర్వం రోజుల్లో రాత్రిపూట అతను రాజమ్మమీద చెయ్యివేస్తే అతన్ని తీగలా చుట్టుకొనిపోయే రాజమ్మ–ఇప్పుడు అతను యెప్పుడు చెయ్యి వేసినా నెమ్మదిగాతీసి పక్కన పెట్టి–అటు తిరిగి పడుకుంటోంది. జీవితంలో తగిలిన యెదురు దెబ్బలన్నిటితో ఆవిడ శరీరం గట్టిపడిపోయింది. ఇప్పుడావిడ శరీరం ఏ సుఖాన్నీ కోరడంలేదు. కోరే తీరికగాని తీర్చుకునే ఓపిక గాని ఆవిడకి లేవు. కాని ఆవిడ మనస్సు వీసమంతైనా తెలుసు కోలేని సింహాచలం ఆవిడ ప్రవర్తనని ఇంకో విధంగా తీసుకున్నాడు. ఫలితంగా వాళ్ల సంసారంలో పూర్వం ఉన్న శాంతీ, సుఖం లేకుండా పోయేయి.

# 72

ఆవేళే విజయ ఇంట్లో పార్టీ.

పేరు పార్టీయేగాని, పెళ్ళికంటే బ్రహ్మాండంగా జరపాలనుకుంది విజయ. తన ఫ్రెండ్సు యెవరూ ఇవ్వనంత స్టైయిలీష్‌గా, ఇవ్వలేనంత గొప్పగా చెయ్యాలని నిశ్చయించుకుంది. ప్రైమ్ మినిష్టరయినా పరిస్థితులు అనుకూలించకపోతే చేసుకున్న నిర్ణయం మార్చుకుంటాడేమోగాని, ఏ పరిస్థితుల్లోనూ విజయ తన నిర్ణయం మార్చుకోదు. అందుకే ఆవేళ ప్రిన్సిపాలుగారు ఊళ్ళో లేకపోయినప్పటికీ పార్టీని వాయిదా వెయ్యలేదు. విజయకి ప్రిన్సిపాల్‌గారు ఉన్నా ఒకటే లేకపోయినా ఒకటే.

ఆ వేళ రాజమ్మకి తెల్లవారిన దగ్గర్నుంచీ పనితోనూ, ఇల్లు శుభ్రం చెయ్యడంతోనూ క్షణం తీరికలేదు. విజయ దగ్గర పనిలో చేరిన కొన్నాళ్ళ తర్వాత రాజమ్మలో చాలా మార్పు వచ్చింది. పూర్వాశ్రమంలో రాజమ్మకి గంజి వార్చడం తప్ప ఇంకేవీఁ చేతనయ్యేదికాదు. కాఫీ అనేమాట వినడం తప్ప చెయ్యడంగానీ, తాగడంకానీ తెలీదు. చీర తప్ప జాకెట్టుగానీ, బాడీ గానీ తొడగడం ఎరగదు. ఎంత గడ్డిపరకకయినా గులాబీ పువ్వు పక్కన పెడితే ఆ పువ్వు వాసన కొంతైనా అంటుకోక మానదు. ఇప్పుడు రాజమ్మ విజయ ఇచ్చిన చీరతోపాటు జాకెట్లూ, బాడీలూ తొడుగుతోంది. పెర్కులేటరుతో కాఫీ కలపడం నేర్చుకుంది. విజయ బలవంతంమీద పొద్దున కాఫీ తాగటం నేర్చుకుంది. ప్రెషరు కుక్కరుతో వంటచేస్తోంది. కొంత నాజూకుగా మాట్లాడ్డం నేర్చుకుంది. అన్నిటికిమించి తన చుట్టూ వున్న ప్రపంచం గురించీ అందులో మనుషుల గురించీ ఆలోచించ గలుగుతోంది.

ఇప్పుడు విజయ ఇంట్లో రాజమ్మ లేకపోతే క్షణం గడవనంతగా తయారైంది. పార్టీ సన్నాహాల్లో విజయకి సహాయం అంతా రాజమ్మే చేస్తోంది.

సాయంత్రం ఐదు గంటలకి పార్టీ మొదలైంది.

విజయ ఫ్రెండ్సంతా వచ్చారు. అదిగో ఆ మొదట కూర్చున్న వాళ్ళు మిష్టర్ అండ్ మిసెస్ జగన్నాథం. జగన్నాథం ఆ కాలేజీలో ఫిజిక్సు లెక్చరరు. అతనికి కాలేజీ పార్ట్ టైముగా కనిపిస్తుంది. ఎంచేతంటే ఇంటి దగ్గర అతను అన్ని క్లాసుల వాళ్ళకీ ప్రైవేట్లు చెప్తాడు. ఆ ప్రైవేట్ల ఆదాయంతో అతడీ మధ్య రెండు మేడలు కట్టేడు. తెలీని వాళ్ళెవరికైనా అతని ఇల్లు చిన్నసైజు కాలేజీలా

కన్పిస్తుంది. మిసెస్ జగన్నాథం, విజయా ప్రాణ స్నేహితులు. ఊళ్ళో రోటరీ మీటింగు మొదలు జనసంఘం సభల వరకూ అన్నిటికీ వీళ్ళిద్దరూ హాజరౌతారు.

వాళ్ళ పక్కన కూర్చున్న మిష్టర్ వాసుదేవరావు ఆ ఊరంత టికీ బిజినెస్ మేగ్నెట్. అదేవింటోగాని అతను పట్టుకున్న చింకి కాగితంకూడా కరెన్సీనోటు అయిపోతుంది. అతను రోడ్డుమీద వెళుతున్నప్పుడు కనిపించిన చెట్లకీ, పుట్టకీ కూడా నమస్కారం పెడతాడు. అదేవంయ్యా అంటే "ఏమో ఆ చెట్టు వెనకాల ఏ నాయకుడో, ఆఫీసరో ఉండొచ్చును? అంటాడు. ఎప్పుడే అవ సరం వస్తుందోనన్న అనుమానంతో అతను అన్ని డిపార్టుమెంట్ల వాళ్ళతోనూ స్నేహంగా ఉంటాడు. అతను పెద్ద బిజినెస్ మెన్ అనే అందరికీ తెలుసు. కాని, ఏం బిజినెస్ అన్నది యెవ్వరికీ తెలీదు. అతనే పెళ్ళాన్ని వదిలేసేడని కొందరూ, అతనికి అసలు పెళ్ళేకాలేదని కొందరూ అంటారు. కాని సిసలైన సమాచారం ఎవరికీ తెలీదు. డబ్బుతో పాటు మంచి పెర్సనాలిటీ కూడా ఉండ డంవల్ల అతను సొసైటీ లేడీస్‌కి చాలా అనుకూలంగా ఉంటాడు.

వాళ్లకెదురుగా అల్లదుగో ఆ స్టీరియో రేడియోగ్రాం ట్యూన్ చేస్తున్నతను డాక్టర్ వెంకటేశం. అతని పక్కన కూర్చున్న అతని భార్య కూడా డాక్టరే. ఇద్దరూ ఒకే కాలేజీలో చదివేరు. ఒకే వయసుంటుంది. కాదు, ఆవిడే అతని కంటే పెద్దది అని కొంద రంటారు. కాని అది నిజం కాదు. ఎంచేతనంటే ఆడవాళ్ళు వేగం ముసలి అయిపోతారు. డాక్టరు వెంకటేశానికి ఆపరేష న్లంటే అసహ్యం. అతని భార్యకి పురుళ్ళంటే అసహ్యం. అంచేత వాళ్ళిద్దరూ గవర్నమెంటు డాక్టర్లే అయినా పెద్దకేసులన్నీ పట్నం కట్టేస్తారు. వీళ్ళిద్దరూ యెప్పుడూ క్లబ్బుల్లోనూ, పార్టీల్లోనూ గడుపు తారు. ఆస్పత్రి అంతా కాంపౌండర్ల చేతుల్లోనూ, నర్సుల చేతు ల్లోనూ నడుస్తోంది.

ఎక్కడా కూర్చోకుండా అందరిచుట్టూ తిరుగుతూ అందర్నీ పలకరిస్తూ నవ్విస్తున్న ఇంజనీరు విశ్వనాథంలో మంచి సెన్స్ ఆఫ్ హ్యూమరుంది. అంతకంటె మంచి అందముంది. అన్నిటికీ మించి ఏ బేంకులూ పట్టనంత డబ్బుంది. అతని భార్య సాధార ణంగా అతని దగ్గరుండదు. ఏ రెండు మూడేళ్ళకో ఒకసారి వస్తుంది. వచ్చి నెలకంటే ఎక్కువ ఉండదు. వెంటనే కడుపుతో ఉండి పురిటికని పుట్టింటికి పోతుంది. మళ్ళీ పిల్లకో, పిల్లాడికో రెండేళ్ళు నిండేకే రావడం. ఆవిడ తండ్రి చీఫ్ ఇంజనీరు చేసి రిటైరయ్యేడు. వాళ్ళకి ఒక్కతే కూతురవడం వల్ల వాళ్ళు ఆ కూతుర్ని వదల్లేదు. కూతురు మాత్రం మొగుడ్ని వదలి లక్షణంగా ఉంటుంది. విశ్వనాథం ఈ మధ్య గవర్నమెంటు వారు కట్టమన్న పెద్ద బ్రిడ్జికి డబ్బుతీసుకొని, బ్రిడ్జి భూమ్మీద కాకుండా కాగితం మీదే కట్టేడు. తమాషా ఏమిటంటే ఆ కట్టని బ్రిడ్జికి ఒకానొక ప్రముఖ నాయకుడు ప్రారంభోత్సవం చేసినట్టు పేపర్లో వార్త కూడా వచ్చింది. తర్వాతేం జరిగిందో-బహుశా వాటాలు కుద రక పోవటం వల్ల అసలుసంగతి బైటకొచ్చి విశ్వనాథాన్ని డిస్మిస్ చెయ్యబోతే, తన మావంగారి చలవతో రివర్షన్‌తో బైటపడ్డాడు అతను.

పార్టీలో ఇద్దరు కవులతో సహా నలభైమంది వరకూ ఉన్నారు. వాళ్ళలో ఏ ఇద్దరికీ అంతర్గతంగా పడదు. ఇద్దరు కవులకీ బహిరంగంగానే పడదు. అందులో కేవలం ఒకడు కథలే రాస్తాడు కాబట్టి కవే కాదంటాడు. రెండోవాడు. నీ ఆధునిక కవిత్వంలో "కవిత్వం" లేదు-"ఆధునికత" అసలే లేదంటాడు మొదటివాడు.

పార్టీకి కారణం విజయ రెండో కూతురి పుట్టినరోజు. అసలు మొదట తనకి బహుమతి వచ్చినందుకు పార్టీ ఇద్దామనుకుంది కాని యింతలో కూతురి పుట్టినరోజు వచ్చేసింది. బహుమతి పార్టీ ఆగుతుంది. అందువల్ల ఇప్పుడు పుట్టినరోజు పార్టీ ఏర్పాటు చేసింది ఆవిడ మొదటి కూతురు ప్లాస్టిక్ బొమ్మలా ఉంటే, రెండోకూతురు రబ్బరు బొమ్మలా ఉంటుంది. వాళ్ళకి పాలివ్వడం మినహా మిగతా అన్ని "అమ్మ" పనులూ రాజమ్మే చేస్తుంది. సంతోషంగానూ, ఆదరణతోనూ చేస్తుంది. అంచేత వాళ్ళు కలలో కూడా "రాజమ్మా నీళ్ళుపొయ్యి", "రాజమ్మా అన్నం పెట్టవూ," "రాజమ్మా జోళ్ళుతొడుగు" అనే అంటారు. స్కూలుకి వెళు తున్నప్పుడు విజయకు "టా టా" చెప్పడం తప్ప ఆమెతో వాళ్ళకేం సంబంధం లేదు.

పార్టీ అత్యాధునిక పద్ధతులమీదే జరుగుతోంది. పార్టీకి వచ్చిన వాళ్ళంతా ఒకర్నొకరు 'హాయ్' అనే పలకరించుకున్నారు. అందులో అమెరికా వెళ్ళదలుచుకున్న వాళ్ళు ఎవరేమన్నా 'యా' అనే అంటున్నారు.

దాగరంత కేక్ మీదున్న కొద్ది కొవ్వొత్తులూ రబ్బరుబొమ్మ అతిధుల కరతాళధ్వనుల ప్రోత్సాహంతో కష్టపడి ఊదేసింది. అందరూ చప్పట్లు కొదుతున్నారని చేతిలో ట్రే పక్కని పెట్టి రాజమ్మ కూడా చప్పట్లు కొట్టింది. అందరూ చప్పట్లు ఆపేసినా,

ఆవిడ మానడానికి కొంత టైము పట్టింది. అంచేత అందరూ ఆమెవేపు చూసేరు. ఆమె ముఖం సిగ్గుతో పువ్వు మొగ్గలయినట్లు ముడుచుకుపోయింది.

"ఎవరీమె? నాకు పరిచయం చెయ్యనేలేదేం విజయా?" అంది ఆ ఊరు కొత్తగా వచ్చినావిడ.

"మా సర్వెంట్" విజయ నవ్వుతూనే అంది.

'ఎంత అదృష్టవంతులు" అందా కొత్తావిడ.

"ప్రిన్సిపాలుగారు" అని కొంటెగా కలిపేరు ఎవరో.

పార్టీలో ఇద్దరు అతిథులు పాటలు పాడేరు. అప్పుడు తమకి పియానో అయినా లేనందుకు విజయ ఎంతో విచారించింది. ఝాన్సీ రాణీలా పరాక్రమం కలిగి ఉండమనీ, సీతలా పతివ్రత అవమనీ, "కస్తూరిబా" లా భర్త పాదాల జాడల్లో నడుచుకోమనీ, ఇంకెవరిలాగో రాజ్యం చెయ్యమనీ పద్యరూపంలో రబ్బరు బొమ్మని దీవించడంతో పార్టీ ముగిసింది. పార్టీ ముగిసే టైముకి ప్రిన్సిపాలుగారు వచ్చేరు. వచ్చి సెనెట్ సమావేశం ఒకరోజు వాయిదా పడడంవల్ల పార్టీకి అందుకోలేక పోయేనని సంజాయిషీ చెప్పుకున్నారు. అతను లేనిలోటు తాము ఎలా ఫీలయ్యేరో అతిథులంతా అబద్దాలు చెప్పేరు. అతనూ, విజయా అతిథులని తమ తమ కార్లలో పంపించేసరికి, వారి పిల్లలిద్దరూ రాజమ్మ పెట్టిన అన్నంతిని నిద్రపోయేరు.

"ది పార్టీ వజ్ ఏ గ్రాండ్ సక్సెస్" అంది విజయ మెరుస్తున్న కళ్ళతో భోజనానికి ముందు.

"నువ్వు చేసింది ఏది సక్సెస్ కాదు?" బహిరంగంగానే మెచ్చుకున్నాడతను.

## 73

నెలలు గడుస్తున్నాయి.

"మమ్మీ" అనడం కంటె "రాజమ్మా" అన్న పిలుపే ప్రిన్సిపాలుగారి పిల్లలకి బాగా అలవాటై పోయింది. ప్రిన్సిపాలుగారి క్కూడా రాజమ్మ లేక పోతే క్షణం తోచదు. ఆవిడ లేకపోతే తమ ఇల్లు స్తంభించిపోయినట్టనిపిస్తుంది అతనికి. వడ్డించటం మొదలు, అతని ఆఫీసు టేబిలుమీద గాజు కుండీలో పువ్వులు మార్చడం వరకూ ఆమే చాకచక్యంగా చూసుకుపోతోంది. ప్రిన్సిపాలుగారు ఎక్కడికి వెళ్ళినా భార్యతో "వెళ్ళొస్తా"అని చెప్పి "పిల్లలు జాగ్రత్త" అని రాజమ్మతో అనడం అలవాటు చేసుకున్నారు.

రాజమ్మకు తన ఇంట్లో యింత ఆధిక్యత పెరగటం విజయకు ఇష్టం లేకపోయినా అందువల్ల తను సుఖపడుతున్నందువల్ల అంతగా బాధపడడం లేదు. తన ఆడా, మగా స్నేహితులతో ఎప్పుడు పడితే అప్పుడు పిక్‌నిక్‌లకీ, సినిమాలకీ వెళ్ళిపోవడానికి వీలుపడుతోంది – రాజమ్మ ఉండడంవల్ల.

ఒక సాయంత్రం.

సినిమాకి వెళ్ళడానికి ముస్తాబు అవుతోంది విజయ. ప్రిన్సిపాలు గారు అంతకు అరగంట క్రిందటే బట్టలు వేసుకొని ఎక్కడికో వెళ్ళడానికి సిద్ధమై పడక్కుర్చీలో పడుకొని ఏదో పుస్తకం చదువుకుంటున్నారు.

చీరల బీరువా దగ్గరికి వెళ్ళిన విజయ "ఏ చీర కట్టుకోమంటారు? మీరు మొన్న తెచ్చిన జపాన్ జార్జెటా? తెల్ల హకోబానా? అని అడిగింది.

ప్రిన్సిపాలుగారికి ఆమె మాటలు వినిపించలేదు. అంచేత ఆమె మళ్ళీ అడిగింది.

"నీ యిష్టం."

"మీరు చెప్పకూడదూ?"

"రాజమ్మనడుగు"

"ఏఁవిటి రాజమ్మ నడిగేది?" గద్దించింది.

అప్పటికి అతనికి పూర్తిగా మెలకువ వచ్చింది.

"మీరు కట్టుకున్నది నన్నా? రాజమ్మనా?"

"రాజమ్మని కట్టుకుంటే నీ చీర గురించి ఆమెను సలహా ఇమ్మనను" తొందరపాటుతో అన్నా తర్వాత నొచ్చుకున్నాడతను.

అతనికి మాత్రం కొద్దికాలంనుండీ రాజమ్మపట్ల తన వైఖరిలో కొంతమార్పు కనిపిస్తోంది.

మొదటిసారిగా ఆమెను చూసినప్పటినుండీ తనకి అభిమానం ఉన్న మాట వాస్తవం. ఆ తర్వాత ఆమెలోని మంచితనం, పనితనం, పిల్లల మీద ప్రేమా చూసేక ఆ అభిమానం పెరగినమాటా వాస్తవమే. కాని ఈ మధ్య అభిమానంలో ఏదో చెప్పలేని మార్పు వస్తోంది. అందుకు ఆమె అందం కారణం కాదు. మొదట చూసినప్పుడే ఆమె అందం కొట్టొచ్చినట్లు

కనిపించింది అతనికి. ఆ అందానికి భయపడే మొదట్లో ఆమెతో కొంత ముభావంగా ఉండేవాడు. ఆ మధ్యవరకూ ఒక నిజాయితీ గల పని మనిషిగా మాత్రం చూడగలిగేడు. కాని ఈ మధ్య బహుశా ఒక అతి అందమైన స్త్రీగా అతనికి కనిపిస్తోందేమో కాని ఆమె దగ్గరగా ఉన్నప్పుడు మాత్రం అతని గుండెల్లో ఏదో నిండుగా, కడుపులో చల్లగా ఉన్నట్లుంటోంది. తనలో కలుగుతున్న ఈ మార్పు ఎన్నో కోణాలనుండి పరిశీలించి, దాని కారణాల కోసం వెతికేడు అతను. కాని అతనికి ఏ కారణాలూ దొరక లేదు ఆ రాత్రి వరకూ..........

తెల్ల పైజమా, తెల్ల గ్లాస్కోలాల్చీ వేసుకొని ఎత్తుకుర్చీలో బాల్కనీలో కూర్చున్నాడు అతను. చేతిలోని సిగరెట్టు పొగ నీలి వంకీలు తిరిగి లేస్తోంది. గాలి లేకపోయినా రాత్రి అతి చల్లగా వుంది.

బెడ్‌రూమ్‌లో పిల్లలు నిద్రపోతున్నారు.

అతని కాళ్ళదగ్గర వెన్నెల వెండిపువ్వుల కుప్పలా పడింది.

విజయ ఏదో ఊరు వెళ్ళింది.

తెల్లచీర కట్టుకున్న రాజమ్మ అతని ఎదురుగా వచ్చి కళ్ళు దించుకొని నిలబడి, కాలి బొటనవేలితో నేలని గీస్తూ నిలబడింది.

ఆమె చెంపకు తగిలి జారిన వెన్నెల కిరణం అతని వొడిలో పడింది.

"రాజమ్మా..." అక్షరాలు అతని గొంతులో తలకిందులయ్యేయి.

జవాబుగా ఆమె తలలో మల్లెలు సన్నగా ఊగేయి.

"వడ్డించమంటారా?" ఆమె ఒక అడుగు ముందుకు వేసింది.

"రాజమ్మా!" అతను ఆమె చెయ్యి పట్టుకున్నాడు. ఆమె విదిలించుకోలేదు. లేచి నిలబడి ఆమెను గుండెలకి హత్తుకున్నాడు. జవాబుగా "బాబూ" అని మాత్రం అనగలిగింది. ఆమెను మాట్లాడ నియ్యకుండా అతను ఆమె నోటికి చెయ్యి అడ్డుపెట్టేడు.

"బాబూ....అమ్మగారు......" అని మాత్రం అనగలిగింది.

"ఫరవాలేదు" అని అనేసరికి అతనికి నిద్రనుంచి తెలివి వచ్చింది. లేచి చూసేసరికి పక్కన విజయ నిద్రపోతోంది. తనకి వచ్చిన కలకి సిగ్గు పడి విజయమీద చెయ్యి వేసుకొని నిద్రపోయేడు.

# 74

సింహాచలానికి ఇంట్లో కూర్చుని తినడం మొదట బాగున్నా తర్వాత్తర్వాత చాలా అసహ్యంగా కనిపించింది. ప్రిన్సిపాలుగారి ధర్మమా అని రాజమ్మకి నాజూకూ, నాణ్యతా వచ్చేయి. వారిచ్చిన మంచిచీరలు కట్టుకున్నప్పుడు రాజమ్మ అతనికి తన భార్యలా కాకుండా పరాయి మనిషిలా కనిపించేది. వాళ్ళింటి పనిలో నుండి ఆమె వేగం వచ్చినా, ఆలస్యంగా వచ్చినా అతనికి అనుమానంగానే ఉండేది. ప్రిన్సిపాలుగారి అమాయకత్వం, అభిమానం గురించి ఆమె వర్ణించి చెప్తుంటే అతని గుండె అసూయతో మండిపోయేది. విజయకి భర్తమీదా, పిల్లలమీదా ప్రేమ లేదని ఉదాహరణలతో సహా రాజమ్మ వర్ణించి చెప్తూంటే సింహాచలానికి యెంచేతో విజయమీదే సానుభూతి కలిగేది.

"నేనంటే యెంత అభిమానం అనుకున్నావేటి ఆ బాబుకి."

"..............."

"నాను లేకపోతే ఆ యిల్లు ఒక్క రోజు యెల్లదు."

"ఉఁహుఁ?"

"రాజమ్మా, రాజమ్మా! అంటూ అస్తమానవూఁ పిలకపోతే ఆ బాబుకి తోచదు."

"మంచోళ్ళంతా అంతేలే" అతని మాటల్లో అణిగివున్న విషం ఆమెకు కనిపించలేదు.

"రాజమ్మా ఒడ్డించు, రాజమ్మా పక్కలు ఎయ్యి. ఆ బాబు పనులన్నీ నాసేతే సేయించుకుంటాడు."

"ఈ పొద్దు పక్క వెయ్యమన్నాడు. రేపు పక్కలోకి రమ్మంటాడు" తేలిగ్గా నవ్వుతూనే అన్నాడు సింహాచలం.

భోంచేస్తున్న రాజమ్మ చేతిలో అన్నం అలాగే ఉండిపోయింది.

"ఏటన్నావ్?" ఆమె కళ్ళల్లో ఎర్రటి నీళ్ళు తిరిగేయి.

"ఏటంటే ఏట్లే. సొట్టోడి మాటా సొట్టదే."

"ఆ బాబు ననుకుంటే పురుగులడి పోతాం."

సింహాచలానికి సర్రున కోపం వచ్చింది. "అలాటోడు అంటుకున్నా అంతే" అనేసేడు.

"సిస్సీ. నీదింత పాడుబుద్ధి అనుకోలేదు. వరదలో కొట్టుకు పోతున్న మనల్ని ఒడ్డుకు చేర్చిన బాబునే పావుఁలా కుడుతున్నావ్. వచ్చీ జనమ తలుసుకు మరీ మాటాడు" కళ్ళొత్తుకుంది.

"నీ కంటికి పావుఁలా కాకపోతే ఇంకెలా అగుపిస్తాన్లే. సింకి కోక నాడు మొగుడ్నికాని, సిలుకు కోకనాడు మొగుడ్నెలా అవు తాను. నీ తప్పేటుందిలే....."

❖ ❖ ❖

"నానీ కోక కట్టుకుంటే సూడలేనోడివి నాకో కోకెందుకు కొనియ్యవు? నువ్వు కొన్న కోకలేనాడో సిరిగిపోనాయి. ఇప్పుడా ళ్ళిచ్చినవన్నాకట్టు కెల్లాల. నేకపోతే కోకిప్పుకొనన్నా పన్లో కెల్లాల. నానేం పాపం చేసేనోకాని ముష్టి యిచ్చిన గుడ్డ కట్టుకుంటేనే మండిపడతన్నావు. ఇదినీ బుద్ధికాదు. నువ్వేటి సెయ్యమంటే అది సేస్తాను. వద్దంటే రేపొద్దున్నుంచీ పన్లోకెల్లను. కాని నీ పాడు బుద్ధి మారుసుకో, లేకపోతే పిల్లదున్నోళ్ళం బుగ్గయి పోతాం." ఈ మాటలంటున్నప్పుడు ఆమె కంఠంలో కోపంగాని, కల్మషంగాని లేవు.

"పూజలూ, పాతి వ్రొత్యాలూ డబ్బున్నోళ్ళకి. బీదోళ్ళక్కాదు. పని మానీక."

సింహాచలంలో వస్తున్న భయంకరమయిన మార్పుని రాజమ్మ మొదట్నుండీ గమనిస్తూనే ఉంది. తన రెక్కలు విరిగి పోయినందుకూ, ఆడదాని అన్నంమీద ఆధార పడవలసి వచ్చి నందుకూ అతనిలో ఈ అవాంఛనీయమైన మార్పు వచ్చిందని కూడా తెలుసు ఆమెకు. కాని అతని ఈ అనుమానం ఆమెకి చాలా బాధగా ఉంటోంది. అతనిలో పొంగుతున్న ఈ విషపు వరదకి యెలా గట్టు వెయ్యాలో ఆమెకు తెలియడం లేదు.

ఆలోచిస్తూ అన్నం పూర్తి చేసింది.

భోంచేసేక సింహాచలం కుక్కి మంచం మామూలు ప్రకారం వాకిట్లోకాక గుడిసెలోవేసింది. ఈ మధ్య సింహాచలం వాకిట్లోనే పడుకుంటున్నాడు.

"ఏటీ పొద్దు మంచం యిక్కడేసినావ్?" అడిగేడు సింహాచలం అనుమానంగా.

"ఆడదాన్నోటితో సెప్పించాలని కాబోసు."

"ఇన్నాళ్ళకి మనసైందన్నమాట."

"ఇరపన మాటకేంగాని సరకాయించు" అతని పక్కన కూర్చుంది.

"ఏటీ అత్తరు వోసన."

"పిల్లలకి రాసిన సెయ్యి కోక్కి రాసుకున్నా."

"అంతే అయ్యుంటాదిలే. ఆ బాబు రాసేదని నేనుమాత్తరం అన్నానేటి?"

ఉన్నపళాన మంచం మీంచి చివ్వున లేచిపోవాలని ఆమెకు ఎంతో అనిపించింది. కాని లేవలేదు.

# 75

కళ్ళు కాళ్ళూ ఉన్న వాళ్ళకే ఉద్యోగాలు గాని, పనులుగాని దొరకడంలేదు. అంచేత ఒక కాలులేని సింహాచలానికి పని దొరకడం దుర్లభమైంది. ఏదో ఒక పనిచేసి, రోజుకి కొన్ని అణాలయినా సంపాదించి, తనూ ఒక మొగాడినేననీ, పెళ్ళాం సంపాదనమీద బతకడంలేదనీ అనిపించుకోవాలన్న కోరిక సింహాచలానికి రోజురోజుకీ యెక్కువైపోతోంది. కాని అవిటి తనంవల్ల అతను ఆఖరికి మూటలు మొయ్యడానిక్కూడా పనికి రాడు. పల్లెటూళ్ళో ఐతే కనీసం ఏ భజనపార్టీ లీడరుగానో నాలుగు డబ్బులు సంపాదించేవాడేమోగాని, యీ పట్నంలో సినిమా పాటలుతప్ప భజన కీర్తనలు యెవరూ వినరు. ఈ పరిస్థితుల్లో వీరాచారి ఇస్తానన్న పనికి సంతోషంగా వప్పు కున్నాడు సింహాచలం.

"రెండు కాళ్ళున్నోడైతే నానిచ్చేపనికి నా అదురుష్టం బాగుంటే రెండ్రూపాయలు మాత్తరం అడుగుతాడు. ఆడి అదురుష్టం బాగుంటే రోజుకి మూడో నాలుగో ముట్టజెప్పాల. అంచేత ఈ కుంటోడికి రూపాయిస్తే ఆడికో రూపాయి, నాకో రూపాయి లాభం. అసలీపనికి కాళ్ళ క్కర్లేదు. కాని కూలీలో కుంటికాలికో రూపాయి తీసెయ్యొచ్చు. ఏటో ప్రెపంచికం" అనుకున్నాడు వీరాచారి.

వీరాచారికి యాభై ఐదేళ్ళుండొచ్చు. కాని డెభ్భై ఏళ్ళ వాడిలా కనిపిస్తాడు. అతని మొహం పాత చెప్పులా లోతు గీతలతో నిండిపోయి వుంటుంది. అతని నడుము ఎప్పుడూ కాస్త వంగే వుంటుంది. అతని భారీ శరీరానికి అతని సన్నని కాళ్ళు సరి పడవు. అతనికి కమ్మరం వుంది. పశువులకు నాళ్ళు మొదలు బండి చక్రాలవరకూ అన్ని కమ్మరం పనులూ అతను చెయ్య గలడు కాని చెయ్యడు. అతని వాచస్పత్యంలో "రేపు" అన్న మాట లేదు. ఉన్నదానికి "నిన్న" అనే అర్థం చెప్తాడు. అతను "నేడు" కే యెక్కువ ప్రాముఖ్యం ఇస్తాడు. అంటే నిజమే–కాని ఈ వేళ సారాకి డబ్బు యెలా సంపాదించడం అన్న దానికే ప్రాముఖ్యత ఇస్తాడన్నది పచ్చినిజం.

వీరాచారికి పదహారేళ్ళు వచ్చేసరికి అన్ని సుఖాల్లోకి స్త్రీ సుఖం ఎక్కువ అని తెలిసిపోయింది. ఇరవై యేళ్ళొచ్చేసరికి రమారమీ అంత ఆనందం సారా కూడా ఇవ్వగలదని తెలిసి పోయింది. పాతికేళ్ళు వచ్చే సరికి ఆడదాన్ని నమ్మకూడదన్న నిజాన్ని చాలా బాధాకరంగా–అతని మొదటి భార్య తనదగ్గరుండే పనివాడితో లేచిపోవడం మూలంగా తెలుసుకున్నాడు. ఆమె లేచిపోయిందని తెలిసినప్పుడు మొదట బాధ కలిగినా, తర్వాత అంతకంటే ఎక్కువ ఆశ్చర్యం కలిగింది. ఎందుచేతంటే, ఆమెను లేవదీసుకు పోయినవాడు కేవలం కూలీ. పైగా అతనికి కుదరని క్షయరోగం కూడా ఉంది. "అంచేత "ఆ భగవంతుడు యీ బూ వింని ఎందుకు పుట్టించేడో తెల్సుకోవచ్చునుగాని ఆడది మొగాడ్ని ఏం చూసి మొగ్గుతాదో సెప్పలేం" అని గ్రహించేడు.

అతనికి మొదటి భార్య రెండేళ్ళ కొకరు చొప్పున ఇద్దరు భార్యలు పోయేరు – లేచిపోయికాదు, చచ్చిపోయి. ముగ్గురు పెళ్ళాలను పోగొట్టుకొన్న వీరాచారికి పెళ్ళాలు అచ్చిరాలే దన్నారు మొదట్లో. ఆ తర్వాత "పెళ్ళాల పులి" అన్న పేరొచ్చింది అతనికి.

కొన్నాళ్ళకి ఆచారి తిరిగి నాలుగో పెళ్ళి చేసుకున్నాడు. ఆ పెళ్ళాం బంగారు బొమ్మ. చక్కదనాల చుక్క. మొదటి రెండేళ్ళూ ఆడదానిలో తను కోరుకున్నవన్నీ ఆచారికి ఆమెలో కనిపించేయి. మూడో యేడు రాగానే ఆమెకు తన పక్కింటి నాయుడితో సంబంధం ఉందేమోనన్న అనుమానం రాగానే అతని ఆనందం మాయమయింది. నాలుగోయేడు ఆ అనుమానం రుజువు కాగానే ఆమె మాయమయింది.

ఆమె మాయమయిన మూడోనాడు ఊరవతల చీకటి తోట లోని పాడు నూతిలో ఒక శవం తేలింది. ఆ శవం ఉబ్బి, చివికి బహు భయంకరంగానూ, అసహ్యంగానూ ఉంది.

"ఆ శవం ఆడది. నా పెళ్ళాం ఆడది. అంతకు మించి ఆ శవానికి నా పెళ్ళానికీ సంబంధంలేదు" అన్నాడు ఆచారి. అదే మాట కోర్టులో వాదించేడు. ఆ వాదన ఆచారికి నచ్చింది. కాని కోర్టువారికి నచ్చలేదు. అంచేత ఆచారికి ఇరవై యేళ్ళు జైలు శిక్ష వేసేరు. అతను నాలుగు పెళ్ళిళ్ళు చేసుకున్నా, ఖూనీ చేసినా బహు బహు బుద్ధిమంతుడు. అతని బుద్ధికీ, నడవడికీ మెచ్చి కొంత శిక్షతగ్గించేరు. అధికారులు, ఎవరిదో శత జయంతుల మూలంగా మరికొంత శిక్ష తగ్గింది. అంచేత ఆచారి మొత్తం పన్నెండేళ్లో, పదమూడేళ్ళో జైల్లో ఉన్నాడు. అతను జైల్లోంచి బైటకొచ్చేసరికి తన ఆఖరి పెళ్లాం కనిపిస్తే మళ్ళీ చంపి మరో ఇరవై యేళ్ళు జైలుకి వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నాడు. జైలుకి వెళ్ళక పూర్వం అతనికి ఆడదాని మీద పుట్టిన అసహ్యం, జైల్లో ఆడసంపర్కం లేకపోయినా పెరిగింది. జైలు నుంచి వచ్చిన అతను మరో ఖూనీ చెయ్యడానికి తప్ప ఇంకెందుకూ పనికి రానేమోనని భయపడ్డాడు. అతనికి ప్రపంచం కొత్తగా కనిపిం చింది. కాని వింతగా కనిపించలేదు. తను ఏదో పాతయుగం దెయ్యంలా ఈ ప్రపంచంలో అతుక్కోలేకపోయేడు. అతనికి మళ్ళీ తన ఊరు వెళ్ళాలనిపించలేదు. అంచేత కొన్నాళ్ళు సారా దుకాణంలోనే గడిపాడు. అది దొంగసారా దుకాణం అవడంవల్ల కొన్నాళ్ళు దాన్ని వదల్లేదు ఆచారి. సినిమా దొంగలు కేవలం సారా తాగి బతుకుతారేమోకాని, ఆచారిలాంటి వాళ్ళకు అన్నం కూడా కావాలి. ఈ రోజుల్లో అన్నం అడుక్కుతింటే పుట్టదు. కాబట్టి ఏదో పని చెయ్యాలి. అంచేత అతను ఒక ముసలి కమ్మరి దగ్గర పనికి కుదురుకొని, ఆ ముసలతను పోయేక ఆ కమ్మరానికి అధికారి అయ్యేడు.

కమ్మరికి కొలిమితిత్తి కొట్టేందుకు ఒక అసిస్టెంటు కావాలి. అసిస్టెంట్లు దొరకడం ఏమంత కష్టం కాదు, ఆచారిలాంటి వాళ్ళకి తప్ప. ఆచారి పనిచేసే పద్ధతులు ఏ అసిస్టెంటుకీ నచ్చవు. పది రూపాయలు వస్తే ఆ పది రూపాయల సారా తాగేవరకూ మళ్ళీ దుకాణం తెరవకూడదని ఆచారి నియమం. అతని అసి స్టెంట్లు ఆస్తిపరులు కారు. వాళ్ళకి లంచాలు దొరకవు. అంచేత "రోజూ దుకాణం తియ్యాలి. రోజూ కూలి కావాలి" అని వాళ్ళ కోరిక. కాబట్టి ఏ అసిస్టెంటూ అతని దగ్గర ఎక్కువ కాలం పనిచెయ్యలేదు. ఒకవేళ ఎవడైనా ఇంకేగతీ లేక అతని దగ్గర నాలుగు కాలాలపాటు పనిచేద్దామన్నా, అతను ఆడదానిమీద యిచ్చే లెక్చర్లు భరించలేకపోయేవాడు.

ఈ పరిస్థితిల్లో కుదిరేడు ఆచారి దగ్గర సింహాచలం. వాళ్ళి ద్దరికీ పొత్తు వేగంగానే కుదిరిపోయింది. తను ఆర్జించకపోతే యిల్లుగడవదన్న పరిస్థితిలేదు సింహాచలానికి. ఎంచేతో గాని ఆచారి "ఆడ లెక్చర్లు" అతనికి బాగా నచ్చేయి.

"ఆడదంటే ఎవరు? సెప్పు చూద్దారి" ప్రశ్నించేడు ఆచారి సింహాచలాన్ని.

"తెల్దు" అన్నాడు సింహాచలం.

"అలాగనేస్తే కాదు. సెప్పాల."

"అమ్మ".

"అమ్మకాదు. రంకుల బొమ్మ. రంగుల బాంబు" అని కొంత సేపు పరధ్యానంలోపడి తిరిగి ప్రారంభించేడు ఆచారి. "ఆడదంటే నీకేటి తెలుసు. ఒంటి పెళ్ళాంగోడివి. నలుగుర్ని కట్టుకున్న నన్నడుగు సెప్తా. ఆడదంటే రంగులు రాసుకున్న రాక్షసి. పువ్వులు పెట్టుకున్న పిశాచం. పాలిచ్చి పెంచనూగల్దు, పీక పిసికి సంపీ నూగల్దు. తలుసుకుంటే దానికి సేతగానిది లేదు. పాతివ్రాత్యం తప్పు. అది అమ్మయి మొగోడికి పేనం పొయ్యనూగల్దు, పెళ్లంవై తీసెయ్యనూగల్దు. దాన్ని నమ్మినోడికి నరకవేఁ గతి. నమ్మనోడికీ అంతే. నమ్మినా, నమ్మకపోయినా ఒకటే కాబట్టి మనం నమ్మ కూడదు. ఎంచేతంటే మనల్ని నమ్మించడవేఁ దాని పని గాబట్టి. నీకు తలంటి పోస్తాను కళ్ళుమూసుకో మన్జెప్పి పక్కింటోడ్ని మొండి గోడమీంచి ముద్దెట్టీసుకోగల్దు. దాన్నేదేవుఁడు పుట్టించి నాడోగాని, దానికి పురిటి మంచం కాడినుంచీ పిడికెడు బుగ్గి అయ్యావొరకూ మొగోడిమీదే ధ్యానం. ఈ పాలి బాగా సూడు – పుట్టినపిల్ల ఆడదైతే అయ్యను జూసినవ్వినట్టు అమ్మను జూసి నవ్వదు.

మన సావెఁతలు కూడా ఉట్టినే పుట్టవ్. 'ఇంతరేత్తిరై పోనాదేం' అని రంకు మొగుడడిగితే "మొగుడొగ్గినాడు గాని మాఁవఁ వొగ్గనేదు' అందట ఎనకటికి ఒకర్తె. ఆడదాని యావ అంటే అదీ.. ఎనకటికి ఏ బాబో 'మొగోడికి ఆడదానిమీద ధ్యాస పిడికెడు మెతుకులు తిన్నంత కాలం వుంటే–ఆడదానికి మొగోడిమీద పిడికెడు బుగ్గయి పొయ్యావొరకూ వుంటుంది' అన్నాడట. అన్నోడు ఎవుడోగాని ఆడదాన్జేత మంచి కండుబెల్లం తినీసుంటాడు.

అదేటోగాని కడుపునిండా వొణ్ణం తింటేగాని మొగోడికి ఆ బుద్ధి పుట్టదా! ఆడదానికి మాత్తరం ఆరు లంఖణాలు జేసినా ఆ బుద్ధిపోదు. పూటకోడు చొప్పున రోజుకి ముగ్గురు మొగుళ్ళని మార్చనూగల్దు. ఏ పూట మొగుడ్ని ఆ పూట 'నువ్వే నాజనమకి దిక్కు' అని నమ్మించేయ్యగనూ గలదు. ఆడది తలుసుకుంటే నీసేత ఏపనైనా సేయించీగల్దు. ఒక మంచి పన్జెయ్యమని గవర్న మెంటోడు ఎయ్యి పద్ధతులు పెట్టినా నువ్వు సెయ్యవు. కాని ఆడది కన్నుకొట్టో, కన్నీళ్ళు కారిసో నీ సేత ఏ పనైనా సేయించీ గల్దు. నీ సేత పొద్దుగూకులూ చాకిరీ సేయించగల్దు. నీ సేత నీకే గుండు గీయించీగల్దు. నిన్ను సన్నాసిని జేసీగల్దు. నిన్నడవికి అంపీ గల్దు. నీ సేత కూనీ సేయించీగల్దు ఏ కద సదువు, దాని ఏడవ కదే. ఏ పురాణంజూడు దాని రంకు కదే. ఇంతెం దుకు, మన భారతంసూడు. ద్రౌపది యెంతమందిరిని కట్టుకున్నాది? ఒకడా, యిద్దరా ఐదుగుర్ని కట్టుకున్నాది. ఆళ్ళకేటి తక్కువ? రాజ్జం వుంది. బుద్దుంది, బలం వుంది. కాని, ఆళ్ళకి ఆళ్ళ పెదబాబు కొడుక్కీ పేచీ ఎట్టీసింది. ఆ యమ్మేటీ సెయ్యకుండానే దుర్యోధనుడులాటోడు అలా యుద్ధానికి దిగిపోయాడంటావేటి? నేన్నమ్మను. ఆ తల్లి యే పిట్టగోడమీంచో కన్నుకొట్టుంటాది. అందుకా బాబు అలా ఎగబడిపోనాడు. తెలిసినోళ్ళు ఏమంటారో తెలుసా? ఆ బాబు సచ్చేక ఆ యమ్మ అతగోడ్ని తినీసినాదట.

మరి, రామాయణం సూడు. సీతమ్మ పెద్ద పతివ్రొతంటారు. అలాటమ్మను కట్టుకున్న రావుఁలోరు ఏటి బాగుపడినాడు? అడవికెళ్ళేడు. ఆశ్రమాలు పట్టీసినాడు. అంత మంచోడైనా అతగాడి మీదకే ఉసిగొల్పింది ఆ యమ్మ కొడుకుల్ని. సరే ఆ యమ్మని కట్టుకున్నోడి మాటలా ఒగ్గీ. కన్ను బడ్డవో దేటయ్యేడు? పది తలల్లో ఒకటన్నా మిగిల్నాదా ఆ బాబుకి? ఆ బాబు బేమ్మ దన్న మాటన్నా పట్టించుకోకుండా మొగుడొచ్చి సంపీసీ వొరకూ తలన్నా దువ్వుకోకుండా సెట్టుకింద మకాం యెట్టింది కాని వూరుకున్నాదా?

సివర్నో కత సెప్తా వినుకో. ఒక ముసిలిరాజుకి లేక లేక యిద్దరు కవలపిల్లలు పుట్టేరట. ఆళ్ళలో పెద్దెవరో మరిసి పోనాదట మతిమరుపురాణీ. ఆ ఇద్దరూ సదువుకీ, సక్కదనానికీ ఒక్క లాగుండీ వోరట. ఆళ్ళలో ఎవరికి పట్టం కట్టడవోఁ తెలక మంచం పట్టీసినాదట ఆ ముసిల్రాజు. ఇదిలాగుండగా కుర్రో ళ్ళని ఏటకి పంపేడట ఓనాడు. ఏటలో ఏదో తిరకాసొచ్చి కుర్రోళ్ళకి సాయవెఁళ్ళిన వాళ్ళలో యిద్దర్ని పెద్ద పులులు తినీసి నాయట. తిరిగొచ్చినాక ముసిల్రాజు అడిగేడట–కుర్రోళ్ళని. 'ఏదంటే మీ కెక్కువ బయం' అని.

'పులి' అన్నాడట ఒకడు.

'ఆడపులి' అన్నాడట రెండోవోడు.

'భేష్. నువ్వురా నాన్నా తెలివైనోడివి. పెపంచికం కీలకం కనిపెట్టీసినావ్" అని ముసిల్రాజు ఆ బాబుకే' పట్టం కట్టీసి నాడట.

అంచేత ఎర్రి సన్నాసీ! ఆడదాని గొప్ప మరో ఆడదానికాడ సెప్పు గాని నాలాటి పురుసులకాడ సెప్పకు" అని అడిగేడు.

ఆచారి మాటలు సింహాచలానికి నచ్చేక, అతని పనులు కూడా నచ్చడం మొదలు పెట్టేయి. రెండ్రోజులు పనిచేసి ఆచారి పన్నెండు రూపాయలు ఆర్జిస్తే సింహాచలానికి రెండిచ్చి, తను పది తీసుకునేవాడు. ముందు తనపది తనకీ, సింహాచలానికీ సారాకింద ఖర్చు పెట్టేసి తర్వాత సింహాచలం రెండూ కూడా అదే పనికి ఖర్చు పెట్టించేవాడు.

పనిలో చేరిన కొద్దికాలానికే సింహాచలానికి తాగుడు తప్పించుకోలేనంత అలవాటు అవడమేకాక, ఆడదానిమీద అసహ్యం కూడా పెరగడం ప్రారంభించింది. అంచేత అతను రాజమ్మ అనే ప్రతిమాటా శంకించడమే కాకుండా, ఆమె చేసిన ప్రతి పనికీ, చెయ్యని ప్రతి పనికీ కూడా తన్నడం ప్రారంభించేడు.

# 76

ఆవేళకు విజయ ఊరువెళ్ళి నాలుగు రోజులైంది. తన ఫ్రెండ్సుతో కలిసి ఏదో ఊరు ఎక్స్‌కర్షనుకని వెళ్ళింది. తిరిగి రావడానికి ఇంకా కనీసం నాలుగురోజులు పడుతుంది.

ఆ వేళకి సింహాచలం కడుపునిండా సారా తాగి మూడు రోజులైంది. అతనికి నాలిక యెండిపోయింది. పోనీ వీరాచారి దగ్గర రూపాయో ఆర్థో తీసుకుందామన్నా, ఇంకా యెప్పుడో చెయ్యబోయే పనికి ముందుగానే ఎడ్వాన్సు తీసుకున్నాడు. వీరాచారికే సింహాచలం పని బాకీ ఉన్నాడు కాని సింహాచలానికి వీరాచారి డబ్బు బాకీ లేదు. ఇంక డబ్బు కోసం రాజమ్మని పట్టుకోక తప్పలేదు సింహాచలానికి. ఇంత బతుకూ బతికి యింటి వెనకాల చచ్చేడని, ఇంత బతుకూ బతికి సారా నీళ్ళకి ఆడదాని డబ్బుమీద ఆధారపడడం సింహాచలంలోని మగవాడు యిష్టపడలేదు. కాని మూడు రోజులనుంచీ ఎండిపోయిన నాలికకి కావల్సినది ఎవరి డబ్బా అని కాదు, గ్లాసుడు సారా. అంచేత సింహాచలంలోని మగతనాన్ని జిహ్వ జయించింది.

ఆ రాత్రి రాజమ్మ పనిలోనుంచి వచ్చేసరికి బాగా ఆలస్యమైంది. ప్రిన్సిపాలుగారి చిన్నమ్మాయికి జ్వరంగా ఉండడంవల్ల, వళ్ళు తెలీకుండా పడుకున్న పసిదాన్ని వదిలి రావడానికి రాజమ్మ మనసు వప్పుకోలేదు. తల్లి కూడా దగ్గర్లేదు. పసిదాన్ని మొగాడు ఏం చూసుకుంటాడు అని ఆ పిల్లపడుకునేవరకూ వుండి అప్పుడు యింటికి వెళ్ళింది రాజమ్మ. వీధిలోనే నులక మంచం మీద పడుకుని నక్షత్రాలు లెక్క పెడుతున్నాడు సింహాచలం. అంత ఆలస్యంగా వచ్చినందుకు సింహాచలం ఏమీ మాట్లాడక పోవడంవల్ల నిశ్శబ్దంగా ఇంట్లోకి వెళ్ళిపోయింది.

సింహాచలానికి ఆ పరిస్థితి చాలా ఇబ్బందిగా వుంది. అతను ఆర్జించే రోజుల్లో అయితే డబ్బు దర్జాగా అడిగి పుచ్చుకో గలిగేవాడు. ఇప్పుడు దమ్మిడీ కూడా ఇంట్లో యివ్వడంలేదు. ఎప్పుడయినా పావలా, బేడా ఆర్జించినా అది అతనికి నాలిక తడుపుకోవడానికే చాలడం లేదు. ఇప్పుడు రాజమ్మని అడగాలంటే అడగొచ్చు కాని గబుక్కున ఆమె 'ఎందుకూ' అని అడిగితే? అడక్కపోతే గతిలేదు. ఇంక ఆ పూట నాలిక తడపకపోతే తెల్లారేసరికి నాలిక ఎండిపోయి రాలిపోతుంది. అంచేత......

"ఓ రూపాయుంటే యియ్యి" అన్నాడు లోపలికి వెళ్ళి రాజమ్మ వెనక నిల్చుని. ఎదురుబడితే అడగలేడు. తన శక్తి అతనికి తెలుసు. కాని తను నోరువిడిచి అడిగితే లేదనదని అతని నమ్మకం. అతని నమ్మకం అబద్ధం కాదు. ఎప్పుడు సింహాచలం ఏది అడిగినా రాజమ్మ లేదనిగాని, కాదని గాని అనదు. కాని అప్పుడు సింహాచలం డబ్బు అడగ్గానే ఆమెకు ఒక్కసారి భయం, ఆశ్చర్యం కలిగేయి! తన దగ్గర డబ్బులేదంటే తంతాడేమోనన్న భయం. ఈ మధ్య ఎన్నడూ అడగనివాడు నోరువిడిచి అడిగేడే అని ఆశ్చర్యం.

"లేదు" అంది తల దించుకొనే.

అడగ్గానే చేతిలో పెట్టేస్తుందని, పెట్టగానే వెళ్ళి నోరు తడిచేసుకోవాలన్న ఉబలాటంతో భుజం మీద తువాలు వేసుకొంటున్న సింహాచలం 'లేదు' అన్నమాట వినగానే ముందు చిన్నబోయేడు. ఒక్కక్షణం బాధపడ్డాడు. వెంటనే అతనిలోని మగతనం మేల్కొంది. ఆ మగతనం అతనిలోని కోపాన్ని లేపింది.

"ఉండదే, ఉండదు. ఎందుకుంటాది? ఉంటాదని నేను మాత్తరం అనుకున్నానేటి? నిన్ననే ఫస్టు తారీఖు. జీతం ఆళ్ళివ్వడం మానీసినారా? నేకపోతే నువ్వే వద్దనీసినావా? అయినా నీకు డబ్బెందుకులే-అన్ని సదుపాయాలు సాగిపోతుంటే. డబ్బు అవుసరం యేటి వుండాది? యెవడో నాలాటి యెదవకైతే కావాలిగాని. నీకాడ డబ్బు ఉందా నేదా అనికాదే నేను అడిగిది. ఉన్నా నేకపోయినా ఇచ్చి తీరవొలిసిందే. నేకపోతే నిన్ను ఇక్కడే ఇప్పుడే సంపేస్తాను. ఎదవ నంజా, ఏసాలు యెయ్యక వేగిరం యియ్యి. నాకు టయిము అయిపోతున్నాది" అంటూ కర్రకాలు నేలమీద గట్టిగా తన్నేడు.

ఆ క్షణాన అతను అడిగినది ఇవ్వకపోతే నిజంగా చంపే స్తాడేమో నన్నంత భయంకరంగా ఉంది అతని మొహం.

"ఆ యమ్మ ఊళ్ళో నేదు. అందుకని జీతం నిన్న ఇయ్యనేదు. ఆ యమ్మ వొచ్చాక అడిగి తెస్తాను" అంది రాజమ్మ వీలైనంత నెమ్మదిగా.

రాజమ్మకి జీతం ఎప్పుడూ విజయ ఇస్తుంది. ఊళ్ళో లేనందువల్ల రాజమ్మకి జీతం ఎవరూ ఇవ్వలేదు. ప్రిన్సిపాలు గారెప్పుడూ రాజమ్మకి డబ్బు ఇవ్వలేదు. తను ఊరికి వెళ్ళేముందే రాజమ్మకి జీతం ఇస్తే బావుంటుందనీ, తను యిచ్చే డబ్బు ఒక పూట ఆలస్యమయినా ఆ పూట రాజమ్మ ఇంట్లో పస్తుండాల్సి వస్తుందనీ విజయకి తెలీదు! తెలుసుకోవడానికి ఆవిడ ఎప్పుడూ ప్రయత్నించనూ లేదు. విజయ తిరిగి రావడానికి ఎన్నాళ్ళు పడుతుందో కూడా రాజమ్మకి తెలీదు. మరి ఇప్పుడీ అర్ధరాత్రి డబ్బు ఎవరిస్తారు? ఆ మాటే ఆమె సింహాచలంతో అన్నాది.

"డబ్బు ఎప్పుడూ ఆ యమ్మే ఇస్తాది. మరిప్పు డెవరిస్తారు? ఎవర్ని అడుగను?"

"నీ రంకు మొగుడ్ని అడిగి పట్రా. ఏం ఆ యమ్మ ఇవ్వకపోతే ఆ బాబు యివ్వడేటి? ఆ బాబుకి పని సేయించుకోవడవేఁ గాని డబ్బు యివ్వాలని తెలీదేటి? ఎవర్ని నువ్వు అడుగుతావో, డబ్బు ఎవరిస్తారో నాకు తెల్దు. డబ్బు మాత్తరం కావాలి. ఇందాక రూపాయే అడిగినాను. ఇప్పుడు మూడు కావాలి. యెళ్ళి పట్రా."

"ఈ నిశిరేతిరా?" భయపడింది రాజమ్మ.

"ఏం వొగలు పోతున్నావే వగలుమారి నంజా! నువ్వు ఇప్పుడే కదా వొచ్చినావు? రావడానికి లేని భయం పోడాని కొచ్చినాదా? పో.పో. నాసేత ఇంకా పేలించకు."

"ఇప్పుడెల్తే ఆ బాబు ఏటనుకుంటాడో?" వెళ్లకపోతే సింహాచలం తంతాడన్న భయంకంటే, వెళితే ప్రిన్సిపాలుగారు ఏం అపార్థం చేసుకుంటారోనన్న బాధే ఆమెలో ఎక్కువగా ఉంది. విజయ ఉంటే వెళ్ళినా భయం లేదు. కాని ఈ టైములో ఒంటరిగా అతనున్నప్పుడు వెళ్ళడం ఏంబావుంటుంది అన్నదే ఆమె బాధ.

"సరసాని కొచ్చినా వనుకుంటాడు. ఆడేటనుకుంటే నాకేటి? నీకు కొత్తా? ఆడికి కొత్తా? ఎళ్ళెళ్ళు" అంటూ రాజమ్మని మెడపట్టుకొని తోసేడు సింహాచలం.

ఎక్కడుందో తెలిసే లోపలే రాజమ్మ రోడ్డుమీద కొచ్చేసింది. రోడ్డుమీద నడుస్తున్నదన్న మాటేగాని, ఆమెను ఆ పరిస్థితిలో చూసిన యెవరైనా ఆమె నిద్రలో నడుస్తోందనిగాని, వంటిమీద తెలివిలేని స్థితిలో ఉందనిగాని అనుకుంటారు. ఈ టైములో వెళ్ళి డబ్బు అడిగితే ప్రిన్సిపాలు గారు ఏమనుకుంటారన్నదే ఆమె బాధ. ఎటు వెళుతోందో తెలిసే స్థితిలో ఆమె లేకపోయినా అలవాటు పడిన ఆమె కాళ్ళు ప్రిన్సిపాలుగారింటికే తీసికెళ్ళేయి.

పసిపిల్లని కనిపెట్టుకొని ఉండవలసిన కారణంగా నిద్ర రాకుండా ఉండాలని పుస్తకం చదువుకుంటున్న ప్రిన్సిపాలుగారు, తలుపు తట్టిన చప్పుడికి ఆశ్చర్యపోయేరు. ఒకవేళ విజయ తిరిగి వచ్చిందేమో అన్న ఆశ అతన్ని క్షణకాలం ఆవరించింది. కాని తలుపుతీసి యెదురుగా నిల్చున్న రాజమ్మని చూడగానే ఆయనకు నోట మాటరాలేదు.

ఈ వేళప్పుడు తనింటికి రాజమ్మ రావడమా? ఆయనకు నమ్మకం కలగడంలేదు. తనుగాని కలగనడం లేదుకదా? విజయ ఊళ్ళో లేదని తెలిసీ, ఇప్పుడు వచ్చిందా? ఎందుకు వచ్చినట్టు? ఆమె ఇప్పుడే కదా వెళ్ళింది? ఏమైనా అవుసరం ఉంటే అప్పుడే అడిగి ఉండవచ్చుగదా? ఒకవేళ రాజమ్మ కూడా అందరు పనిమనుషులలాంటిదేనా? తనే భ్రమపడి ఇన్నాళ్ళూ యెంతో అభిమానం పెంచుకున్నాడేమో? తన అంచనా తప్పేమో? ఆలోచనల నుండి తేరుకోకుండానే "ఏం రాజమ్మా, ఏం కావాలి?" అని అడిగేరు ప్రిన్సిపాలుగారు.

రావడమైతే యాంత్రికంగా వచ్చేసింది కాని, తీరా వచ్చిన తరువాత ఏం అడగాలో తోచలేదు రాజమ్మకి. అంచేత గాబరాతో 'బాబూ! అమ్మగారు యెప్పుడొస్తారు?" అంది.

ఈ ప్రశ్న అడగటానికా, ఇంతదూరం ఈవేళప్పుడు వచ్చింది! రాజమ్మ అడిగిన ప్రశ్నతో ప్రిన్సిపాలుగారి అనుమానం దృఢం కావడం ప్రారంభించింది. లేకపోతే అంత అసందర్భపు ప్రశ్న అడగడంలో అర్థం ఏఁవిఁటి? మోస్తు అబ్సర్డు. ఏ తప్పూ జరగకుండా ఈమెను తిప్పి పంపెయ్యాలి.

"ఇంకా మూడు నాలుగు రోజులకుగాని రాదు. ఏం కావాలి? పిల్లడికేమైనా వొంటో బాగులేదా? డబ్బేమైనా కావాలా?" అన్నారు ఆయన అతి శాంతంగా.

"అవును-బాబూ-జీతం" అంది మాటా మాటా కలవకుండా.

ఏఁవిఁటీ? అయితే విజయ జీతం ముందుగా ఇవ్వలేదన్న మాట. ఒక క్షణం ప్రిన్సిపాలుగారికి విజయమీద ఎప్పుడూ రానంత కోపం వచ్చింది. అడ్డమైన చాకిరీ చేయించుకోవడమే గాని అవసరానికి డబ్బు ఇవ్వని మనిషి విజయ. ఎదుటివారికి సమయానికి డబ్బు ఇవ్వకపోతే, ఆ తర్వాత లక్షలు ఇస్తే మాత్రం యెవరికి కావాలి? ఎన్ని ఊళ్ళు తిరిగి యెంత చదువు చదువు కొని, యెన్ని పార్టీలకి తిరిగితే ఏం ప్రయోజనం–తోటి ఆడదాని పరిస్థితి అర్థం చేసుకోలేకపోయేక. పాపం యెంత అవసరం లేకపోతే ఇంత రాత్రివేళ వచ్చి అడుగుతుంది? ప్రిన్సిపాలుగారికి రాజమ్మ మీద జాలీ, అభిమానం, గౌరవం ఒక్కసారి పెరిగి పోయేయి.

వెంటనే ఇంట్లోకి వెళ్ళి జేబులోనుండి యాభై రూపాయలు తీసికొచ్చి రాజమ్మ చేతిలో పెట్టేరు ఆయన. ఎంతిచ్చారో తెలి యని రాజమ్మ ఆ డబ్బు తీసుకొని గబగబా నడిచి చీకట్లో వెళుతున్నప్పుడు ప్రిన్సిపాలు గారు ఒక్క నిట్టూర్పు విడవడం తప్ప ఏం చెయ్యలేకపోయేరు.

# 77

ప్రిన్సిపాలుగా రిచ్చిన డబ్బు తీసుకున్న రాజమ్మ గబగబా ఇల్లు చేరుకుంది. చేరి వీధిలోనే నిల్చున్న సింహాచలం చేతిలో డబ్బంతా పెట్టేసి నిశ్శబ్దంగా ఇంట్లోకి వెళ్ళిపోయింది. అలా అంత రాత్రివేళ ప్రిన్సిపాలుగారింటికి వెళ్ళి డబ్బు అడగడం – సింహాచలం వేసిన నిందలూ – ఏమీ చెయ్యలేని తన అస హాయతా, ఇవన్నీ రాజమ్మ మనసుని కవ్వంతో చిలికినట్లు చిలు కుతున్నాయి. అప్పటి పరిస్థితిలో యింక ఒక్క అక్షరంగాని సింహాచలంతో మాట్లాడితే, తనను తాను నిగ్రహించుకోలేనన్నది ఆమెకు బాగా తెలుసు. నిగ్రహించు కోలేక చేసేది ఏవీఁలేదని కూడా తెలుసు. మాటకి మాట పెరగడం, మనసులు విరిగి పోవడం మినహా ఫలితం ఏం ఉండదు. అతకడం కష్టంకాని, విరిగిపోవ డానికి అరసెకండు కూడా పట్టదు. సర్దుకు పోవ డానికి సంవత్సరాలు చాలవుగాని, తెంపుకు పోవడానికి ఒక్క క్షణం చాలు.

ఆలోచించే శక్తిలేక మనసంతా తిమ్మిరెక్కినట్టయిన రాజమ్మకి వీధిలోంచి సింహాచలం వేస్తున్న పొలికేకలు మూడోసారిగాని వినిపించలేదు. వినిపించగానే ఒక్క అడుగులో వీధి గుమ్మంలోకి వచ్చి నిల్చుంది. నిల్చున్నదన్న మాటేగాని "ఎందుకు పిల్చేవు?" అని అడగడాని క్కూడా మనస్కరించలేదు ఆమెకు. మూడు పిలుపులకిగాని రాకపోవడం, వచ్చినా మట్టి బొమ్మలా నిల్చోడం చూసిన సింహాచలానికి వెర్రెత్తిపోయింది. అసలీ మధ్య అతనికి రాజమ్మలో చెడూ, అందవికారం తప్ప ఇంకేమీ కనిపించడంలేదు.

"ఏటలా మత్తుమందు తిన్నదాన్లా అలా నిలబడిపోనావు. నువ్వేం రాణీగోరి ననుకుంటున్నావా, ఏటి–ముమ్మారు పిలిస్తే గాని రాకపోవడానికి? నేకపోతే ఈడు పిలిస్తే ఎల్లడం ఎందు కనుకున్నావా, జాగ్రర్త. నా సంగతింకా తెలదేమో? ఎముక లిరి సీసి పులుసొండుకొని తాగేస్తాను. మొగుడు నండీకొడుకుని, నా మాటే ఇనకపోతే నువ్వెందుకు పనికొస్తావే! సెప్పు నీ జీతం ఎంత?"

"నలభై" అయిష్టంగానే అంది రాజమ్మ.

"నాకు తెలుసే. నలభై అని. ఇప్పుడేవైనా ఎక్కువ చేసేరేమోనని."

ఆమె దేవైనా గవర్నమెంటు ఉద్యోగమా? ఇంక్రిమెంట్లు ఇవ్వడానికి. ఆ సంగతి సింహాచలానికీ తెలుసు.

"లేదు" అతి తక్కువ మాట్లాడ దల్చుకుంది రాజమ్మ.

"ఏం నేదు. ఈ డబ్బు యాభై ఉంటే పెంచినారేమో... అనుకున్నాను. అర్ధరేత్తిరి, ఆడనంజ డబ్బు అడిగితే దేవుడన్నా సరే ఎంత అని అడక్కుండానే ఇచ్చేస్తాడు."

"నాను లెక్క పెట్టుకోనేదు."

"లెక్క పెట్టుకోడానికి నీ కసలు వొళ్ళు తెలిస్తేకదటే. ఆ బాబుని సూడగానే మైకం వచ్చీసుంటాది. పాపం నీకు లెక్క సూసుకునే తీరుబడి ఎక్కడుంటాది? అసలు నన్నింకా సంపీ కుండా ఉన్నావంటే అది నా మంచి తనవేఁగాని నీ గొప్పతనం కాదు. సీతమ్మ వోరిలా అలా నా ఎదురుగా నిలబడకు. లోపలికి పో తప్పుడు నంజా, అసలు నీకేటి తక్కువైందనే ఈ ఎదవ ఏసాలు, సిస్సీ! కాస్త సుక్కేసుకుంటే గాని యీ గుబులు పోదు. లచ్చనంగా ఉండీవోడ్ని, నువ్వే కదటే నన్నిలా సెడగొట్టేసేవ్!" అని. అరుచుకుంటూ డబ్బు తీసుకుని వెళ్ళిపోయేడు సింహాచలం.

శిలావిగ్రహంలా నిల్చుండిపోయింది రాజమ్మ. 'పాపం' అన్న మాట విందిగాని ఇంత మహాపాపం ఉంటుందని ఆమె ఎప్పుడూ అనుకోలేదు.

ఆత్మస్తుతీ పరనిందా మానవనైజం. ఎదుటివాడిలో ఎప్పుడూ చెడుమాత్రమే చూడగలిగే మనం మంచిని ఎంచేతో చూడం.

ఎదుటి వాడిలో మంచితనం లేకపోవడం అంటూ ఉండదు. ప్రతి మనిషిలోనూ మంచీ, చెడూ కలిసి జమిలిగా ఉంటాయి. నో మేన్ యీజ్ పర్‌ఫెక్ట్. తప్పులు చెయ్యనివాడు, చెయ్యలేని వాడు మనిషికాడు. ఒకటే దేవతగాని లేకపోతే దెయ్యంగాని అవాలి తప్ప. దేవతల్లో మనుషులుంటే ఉండొచ్చుగాని మను షుల్లో దేవతలుండరు. ఒకప్పుడెప్పుడో ఏ ద్వాపరయుగంలోనో, కృతయుగంలోనో ఉండేవారేగాని, ఈ కలియుగంలో లేరు, ఉండటానికి వీల్లేదు.

ఎవరైనా సరే, ఫలానావాడు "నిజంగా దేవుడనుకో" అనో లేక ఫలానా ఆవిడ "నిజంగా దేవతనుకో" అని గాని అంటే అర్థం ఆ ఫలానా ఆవిడలోనో, అతనిలోనో చెడు గుణాలకన్నా మంచి గుణాలే ఎక్కువవున్నాయి అని. కాని యీ బాపతువాళ్ళ శాతం చాలాతక్కువ. మనుషుల్లో ఉండే ఇంకొక నైజం – ఎదుటివాడు బాధపడుతున్నప్పుడు – పైకి కాకపోయినా లోప ల్లోపల సంతోషించడం. ఈ సేడిస్టిక్ మెంటాలిటీకి ఆడా మగా బేధం లేదు. సమయం దొరకాలేగాని ఎదుటివాడిని హింసించ డానికి దైహికంగా నైనా మానసికంగానైనా అది ఎంత చిన్న అవకాశమైనాసరే – ఎవరూ జార విడుచుకోరు. సర్వమానవ సమానత్వం, సర్వేజనాః సుఖినోభవంతు వగైరా, వగైరాలు పుస్త కాల్లోనూ, ఉపన్యాసాల్లోనూ తప్ప ఇంకెక్కడా లేవు. కాగడాపెట్టి వెతికినా కనపడవు.

అందరిలోనూ ఉండే యింకొక అతి సహజగుణం – తప్పు ఎదుటివాడి నెత్తిన రుద్దడం. నువ్వు తాగితే అది నీ తప్పుకాదు. బాధలు మరిచి పోవడానికి తాగుతున్నావు కాని సరదాక్కాదు. మరంచేత ఆ తప్పు నీది కాదు. నీ బాధలది కాని. "చేతనైతే ఆ బాధలని తొలగించండి సార్. మరి తాగితే మీ మీద ఒట్టు" అంటావు. కాని నీ బాధలు తీర్చుకోవలసినది నువ్వేకాని ఎదుట వాడు కాదని నీకు తెలుసు. ఎదుటి వాడికి కూడా తెలుసు. దీన్నే ఆత్మవంచన అని కూడా అంటారు. నీ పిల్లలకి చదువు బాగా రాకపోవడానికి కారణం మేష్టర్ల చేతకానితనమే కాని నీకు శ్రద్ధలేకపోవడం ఎంతమాత్రం కాదు. నీకు ప్రమోషన్ రాకపోవడానిక్కారణం నీ ఆఫీసరుకి నువ్వంటే కిట్టక పోవడమే కాని నీ యిన్ ఎఫిషెన్సీ ఎంతమాత్రం కాదు. నీ భార్య లేచి పోవడానిక్కారణం దాని వొళ్ళు కొవ్వేగాని, నీ నిరంకుశత్వం, చేతకానితనం కానేకావు.

ఈ సహజ గుణాలకి జాతి భేదం, మత భేదం, లింగ భేదం వగైరాలు ఏవీలేవు. సింహాచలం కూడా సామాన్య మాన వుడే కనుక అతనిలో కూడా మనిషిలో ఉండే బలహీనతలన్నీ ఉన్నాయి. ప్రస్తుతం అతను ఉన్న నిస్సహాయ స్థితిలో ఆ బలహీన తలు ఇంకా బలహీనంగా అయిపోతున్నాయి. ఆ బలహీనతలని జయిద్దామన్న కోరికగాని, జయించాలన్న ఆలోచనగాని అతనికి లేకపోవడంవల్ల అతను వాటికి లొంగిపోయేడు. పూర్తిగా లొంగి పోయేడు.

రాజమ్మకి అతనిలోని బలహీనతలు అన్నీ పూర్తిగా తెలుసు కాబట్టే అతన్తో ఇంకా కాపురం చెయ్యగలుగుతోంది. మరొకర్తె అయితే ఎప్పుడో 'నీకూ, నీ కాపరానికీ ఓ దణ్ణం' అని పారిపోయి ఉండేది. కాని తనూ ఆ మాట అనడానికి ఇంక ఎంతో కాలం పట్టదని ఆమెకు అనిపిస్తోంది. అలా అనడం ఆమెకు ఇష్టం లేకపోయినా, అనక తప్పని పరిస్థితి వచ్చేస్తోంది.

డబ్బు అంతా తీసుకొనిపోయిన సింహాచలం ఏం చేస్తాం టాడో ఊహించ గలిగిన రాజమ్మ ఇంక ఆలోచించ లేక పోయింది.

సింహాచలం ఏం చేస్తున్నాడు!

ఆ డబ్బులు తీసుకొని తిన్నగా వీరాచారి దగ్గరికి వెళ్ళేడు. ఇద్దరూ కలిసి సారా దుకాణానికి వెళ్దామనుకున్నారు.

దారిలో సింహాచలానికి ఒక బ్రహ్మాండమైన ఐడియా వచ్చింది. ఏఁవిఁటి? యాభై రూపాయలు ఒక్కసారి తన చేతిలో చస్తే ఉండవు. జన్మానికో శివరాత్రి. అంచేత శుభ్రంగా పెద్ద హోటలు కెళ్ళి దొరలు తాగే సరుకు పుచ్చేసుకుంటే! వెధవ నాటు సరుకు రోజూ ఉండేదే. పావలా పారేస్తే వస్తుంది. పావలా ఎప్పుడైనా ఉంటుంది. కాని యాభై రూపాయలు ఎప్పుడుం టాయి? అనుకున్నాడు. వెంటనే ఆ మాటే వీరాచారితో అన్నాడు.

వీరాచారికి మొదట సింహాచలం మాటలు నమ్మకం కలగ లేదు. మొదట హాస్యం ఆడుతున్నాడేమో అనుకున్నాడు. హాస్యం కాదని తెలిసేక చిన్న దోసుమీద ఉన్నాడేమో అనుకున్నాడు. అదీకాదని తెలిసేక అమాంతం సింహాచలాన్ని కౌగిలించు కున్నాడు. వాళ్ళిద్దరి స్నేహానికి అతని కళ్ళు చెమర్చేయి. కళ్ళు తుడిచేసుకుని, సింహాచలం చేతిని తన చేతిలోకి తీసుకుని, అతని జేబులో డబ్బుని తన జేబులో పెట్టుకుని బస్సు స్టాండులో ఉన్న "బార్"లోకి దారితీసేడు.

# 78

విజయ ఎక్స్‌కర్షన్ నుండి వచ్చిన వెంటనే ఏదో యూని వర్సిటీ మీటింగుల కోసమని ప్రిన్సిపాలుగారు ఊరు వెళ్ళేరు. అప్పటి కాయన వారం రోజులనుండీ ఊళ్ళోలేరు. అంచేత ఈ వారం రోజులూ విజయ ఇంట్లో ఉందనడంకంటే లేదంటేనే నిజం. భోజనానికి వచ్చిన్నాడు వస్తోంది–రానినాడు రావడం లేదు. రెండు రోజులు రాత్రిపూట కూడా ఆమె ఇంటికి రాలేదు. ఆమె ఇంటికి ఎప్పుడు వస్తుందో ఎప్పుడు రాదో తెలీని రాజమ్మ ప్రిన్సిపాలు గారింట్లోనే పడుకుంటోంది యీ వారం రోజులై.

ఆ ఉదయం....

ఎనిమిది గంటల ఎండ కిటికీలోంచి విజయ గదిలో పడు తోంది. కాని అప్పటికింకా విజయ లేవలేదు. అప్పటికే ప్రిన్సి పాలుగారి పిల్లలు లేచి తోటలో ఆడుకుంటున్నారు. ఆవేళ శలవు కాబట్టి వాళ్ళ స్నానాలకి తొందరలేదు.

“ఈ రాత్రికయినా బాబొచ్చేస్తే బావుణ్ను” అనుకుంటూ కూరలు తరుగుతున్న రాజమ్మ కారు హారన్ కాంపౌండులో వినిపించి గబగబా వీధిలోకి పరిగెత్తింది.

వారంరోజుల అలసటతో కారు దిగిన ప్రిన్సిపాలుగారికి పిల్లల్ని చూడగానే మూడురోజుల అలసట పోయింది. కూతుర్ని యెత్తుకుని ‘అమ్మ ఇంకా లేవలేదా” అని అడిగేరు ఆయన.

“లేదు” అన్న రాజమ్మ జవాబుకి అతను ఆశ్చర్య పోయేరు.

“పోనీ పాపం, పడుకోని, సెలవేగదా” అని సమాధాన పడి తనగది లోకి వెళ్ళిపోయేరు.

ఆయన స్నానం చేసేసరికి రాజమ్మ పేపరూ, కాఫీ యిచ్చింది!

“అమ్మగారు లేవలేదా రాజమ్మా?” జవాబుకోసం యెదురు చూడనట్టు అడిగేరు.

“లేదు”.

“రాత్రి చాలాసేపు మేలుకుందా?”

“లేదు, వేగమే నిద్రపోయేరు.”

“నీరసంగా ఉందేమో, లేపకు.”

రాజమ్మ విజయను లేపలేదు.

ప్రిన్సిపాలుగారు పేపరు చదివేసేరు. తర్వాత కొంతసేపు రేడియో విని మళ్ళీ పేపరు చదివేరు!

పదిన్నరైనా విజయ లేవలేదు–ఆశ్చర్యం.

నీడలా చప్పుడు కాకుండా విజయ గదిలోకి వెళ్ళేరు ప్రిన్సి పాలు గారు.

గదిలో టేబులుమీద గాజు కుండీలో మూడు రోజులు వాడిన పువ్వులున్నాయి. కుండీలోని నీళ్ళలో దుమ్ము తేలుతోంది. టేబిలు మీద, కుర్చీల మీద విప్పిన చీరలు బద్ధకంగా చుట్టలు చుట్టుకుని ఉన్నాయి.

విజయ మొహంమీద ఎర్రటి ఎండ కిటికీలోంచి పడు తోంది. ఆమె మొహం నీడ దిండు లేసు గలీబుమీద అందంగా పడుతోంది. ఆమె నుదుటి మీద జీరాడుతున్న వెంట్రుకలు గాలికి అల్లల్లాడుతున్నాయి. ఆమె మొహం అతి ప్రశాంతంగా ఉంది.

“ఎంత అందంగా ఉంది!” అనుకొంటూ “విజయా!” అని పిల్చేరు ప్రిన్సిపాలుగారు.

ఆమె లేవలేదు.

మరోసారి “విజయా” అని బిగ్గరగా పిల్చేరు.

ఐనా ఆమె లేవలేదు. ఆమె పరుపు అంచుమీద కూర్చుని ఆమెను మెల్లగా తట్టేరు. ఐనా ఆమె లేవలేదు.

“విజయా” అని గట్టిగా పిల్చి పక్కకి తిరిగున్న ఆమె మొహాన్ని తనవేపుకు తిప్పుకున్నారు. చైతన్యరహితంగావున్న ఆమె తల దిండుమీద వాలిపోయింది.

‘విజయా” అని నరాల్లోంచి పిలవబోయేరు అతను. కాని నాలిక నోటికి అంటుకుపోయి మాట రాలేదు.

వంటింట్లో వున్న రాజమ్మకి అతని ఏడుపు దీనంగా–అతి దీనంగా–వినిపించి విజయ గదిలోకి పరుగెత్తింది. చనిపోయిన తల్లి శవంమీద పడి ఏడుస్తున్న పిల్లడిలా ప్రిన్సిపాలుగారు కనిపించేరు. ఆ ఏడుపుకి అతనిలోని ప్రతి ఎముకా వణికి విరిగిపోతుందేమో నన్నట్టుంది. జన్మజన్మల పాపాలు కడిగే సేటటుగా కారుతున్నాయి అతని కళ్ళనీళ్ళు.

రాజమ్మకి అనుకోకుండా కళ్ళల్లో నీళ్ళు తిరిగేయి. అతను ఏమీ చెప్పకపోయినా విజయ చచ్చిపోయిందే మోనన్న అను మానం ఆమెకు కలిగింది. వెంటనే రాజమ్మ పక్కవాళ్ళకీ, డాక్టరుకీ, కాలేజీ మనుషులకీ ఫోను చేసింది.

విజయ మంచం పక్కనున్న టేబిలుమీద నిద్రమాత్రల సీసా ఖాళీగా వుంది.

# 79

విజయ చనిపోయి మూడు రోజులైంది.

విజయ పోయిన మర్నాడే ప్రిన్సిపాలుగారు ఏడుపు మానే సేరు. కాని అతన్ని చూసిన ఎవరికైనా అతనికి అతి త్వరలోనే పిచ్చి ఎక్కుతుందేమోనన్న భయం కలగకమానదు. తనని పరామర్శ చేయడానికి వచ్చిన యెవర్నీ అతను చూడలేదు. చొరవచేసుకొని వచ్చినవారి ప్రశ్నలకి అతను జవాబు చెప్పలేదు. వారి సానుభూతితో తనకి సంబంధం లేనట్టు కొన్ని గంటలు ఉండి, తర్వాత దేవుడి గదిలో రెండురోజులు కళ్ళు మూసుకొని కూర్చుండి పోయేరు. ఆ రోజుల్లో అతన్ని చూసిన పిల్లలు భయంతో గోడకి అంటుకొనిపోయేవారు. ఆ రెండు రోజులూ వారు నిద్రాహారాలుమాని దైవధ్యానం చేసేరు.

నాలుగో రోజు ఉదయం పూజామందిరం నుండి బైటకు వచ్చిన వారికి తన పిల్లలను కనిపెట్టుక్కూర్చున్న స్నేహితులు కనిపించేరు.

"రాజమ్మా" అతను పిల్లల్నీ, స్నేహితుల్నీ తప్పించుకొని పిలిచేరు.

రాజమ్మ రాలేదు.

"రాజమ్మా" అంటూ వంటింట్లోకి వెళ్ళేరు.

"పోలీసులు తీసుకు వెళ్ళేరు."

"శివ శివ" అని మాత్రం అనగలిగేరు ఆయన.

# 80

తలవంచుకొని పనిచేస్తున్న ఏ.యస్సీ. హిదయతుల్లా టేబిలు మీద ఆర్డర్లీ ప్రిన్సిపాలుగారి విజిటింగ్ కార్డు పెట్టేరు.

"రమ్మను" అంటూ రాస్తున్న పెన్ మూసి, ద్వారం వరకూ వెళ్ళి ప్రిన్సిపాలుగారి భుజం మీద చెయ్యివేసి సానుభూతితో ఆహ్వానించి కుర్చీలో కూర్చోపెట్టేడు అతను.

"మీకు ఎలా సానుభూతి తెలపాలో అర్థం కావడంలేదు. చావు పుట్టుక అనే మెట్టవేదాంతం మీకు బోధించలేను! మీరామెను ఎంత ప్రేమించారో, ఆమె కూడా మిమ్మల్ని అంతగా ప్రేమించేరని నేననుకుంటాను. ఇలాంటి సంఘటనలు చూస్తే దేవుడికి గుండె లేదేమోననిపిస్తుంది" సిగరెట్ అందిస్తూ ఆగేడు అతను.

ప్రిన్సిపాలుగారు సిగరెట్ తీసుకోలేదు. అంచేత తనే సిగరెట్ అంటించుకుంటూ మళ్ళీ అన్నాడు. "మీరే ఈ కేస్ రిజిష్టరు చెయ్యమనీ బలవంతం చేసేరట. మా యస్.ఐ. అన్నాడు. లేకపోతే పోస్టుమార్టమ్‌కి కూడా పంపేవాళ్ళం కాదు."

"విజయ చదువుకున్నది. ఆత్మహత్యే చేసుకుని ఉంటే ఆ విషయం ఉత్తరం రాసి ఉండేది. ఆమెది ఆత్మహత్య కాదని కూడా నే ననడంలేదు. కాని నా మనసుకి సంతృప్తి ఉండాలనే రిజిష్టరు చేయమన్నాను."

"మీకు చెప్పవలసిన వాడిని కాను. కాని ఇలాంటివి రచ్చకెక్కకుండా ఉంటేనే కొంత మంచిది. ఆవిడది ఆత్మహత్య కాక తప్పదు."

"కొన్ని ఆత్మహత్యలు హత్యల్లాంటివే. ఒక మనిషిని ప్రపంచము అంచులకు తరిమి అతనిచేత ఆత్మహత్య చేయిస్తే అది హత్య కాదా? కాని విజయకి ఏం తక్కువ? డబ్బు, అందం, తెలివి, హోదా, ఆస్తీ, అంతస్తూ, మంచిపిల్లలూ, గుడ్డిగా నమ్మిన నేనూ వున్నాం. నేను తెలిసి ఆమెకు ఏ కష్టం ఎప్పుడూ కలిగించ లేదు. మరి ఆవిడ ప్రాణం ఆవిడే యెందుకు తీసుకోవాలి? ఆ దారుణ పరిస్థితికి ఆవిడని తరిమింది ఎవరు?"

"ఉద్యోగిగా నేను చెయ్యగలిగిందంతా చేస్తాను?"

"మీరు ఏమీ అనుకోకపోతే...మా పనిమనిషిని దయచేసి ఇంటికి పంపిస్తారా? పిల్లలకి వేరే దిక్కు లేదు."

"ఏంవిఁటీ? ఇన్నాళ్ళూ మీ పనిమనిషిని స్టేషన్లో పెట్టుక్కూర్చున్నారా, మా వాళ్ళు యెంతకేనా తగుదురు. వెంటనే పంపించేయమని ఫోన్ చేస్తాను. ఇదిగో, మీ కేసు డైరీ తిరగెయ్యండి. ఇప్పటి వరకూ చెప్పుకోదగ్గ విషయం ఏదీ లేదనుకోండి. నిన్ననే పోస్టుమార్టం సర్టిఫికెట్ వచ్చింది. విశేషం ఏమీ లేదనుకోండి. "విసిరా ఎనాలిఫిస్"కి పంపేరట! కూర్చోండి. ఇప్పుడే వచ్చేస్తా. మా అమ్మగారికి వళ్ళు బాగులేదు" అంటూ హిదయతుల్లా తన ఇంటి భాగంలోకి వెళ్ళిపోయేడు.

చేసేదేం లేక కేసు డైరీ తిరగవేసేరు ప్రిన్సిపాలుగారు. శవం వర్ణనా....పంచాయితీ.

రిపోర్టూ ఏవో పిచ్చి కాగితాలూ...అఫిషియల్ ఫారమ్స్.

చివరిది పోస్టు మార్టం రిపోర్టు చదువుతుంటే అతనికి అకస్మాత్తుగా కళ్ళు కనిపించడం మానేసేయి. తను కూర్చున్న కుర్చీ శబ్ద రహితంగా ఏదో సిమెంటు బురదలోకి కూరుకు పోతున్నట్టూ తను అరుద్దామంటే గొంతుకలోంచి శబ్దం రానట్టూ అనిపించింది అతనికి.

కొంతసేపటికి అతనికి డాక్టరు రిపోర్టులోని అక్షరాలు గిజగిజ కొట్టుకొని సాగి విషపు పురుగులయి తన దేహంమీద పాకుతున్నట్టు అనిపించింది. తను నమ్మలేని నిజం ..... మరువ లేని సత్యం....విజయ మూడో నెల గర్భిణీ...

కేసు డైరీ టేబులుమీద పెట్టి "మీ ఆఫీసరు వస్తే మళ్ళీ వస్తానని చెప్పండి" అని అక్కడున్న గుమాస్తాతో చెప్పి వెళ్ళి పోయారు ప్రిన్సిపాలుగారు.

# 81

డాక్టరు విశ్వనాథం ఆ ఊరి ప్రైవేటు సర్జన్స్‌లో పెద్ద అతను. ప్రిన్సిపాలు రంగరాజుకి చిన్నప్పటి నుండీ స్నేహితుడు కూడా. విజయ పోయిన తర్వాత రంగరాజుని పలకరించాలని అతను వెళ్ళినప్పుడు రంగరాజు పూజామందిరంలో ధ్యానంలో ఉండడం వల్ల అతన్ని పలకరించకుండా వెళ్లిపోయేడు. శ్మశాన వైరాగ్యం, పురాణ వైరాగ్యం, ప్రసూతి వైరాగ్యం చాలా సహజమైనవైనా క్షణికాలని డాక్టరుగారికి తెలిసినా, అతని బెట్‌సైడ్ మేనర్సు ఆ విషయాలు బైటకి రానివ్వవు.

విజయ గురించి ఆ నోటా, ఈ నోటా ఇదివరకు నుండీ వింటున్న మాటలు అతన్ని ఎక్కువ కలవరపరచక పోయినా, ఆనందాన్ని మాత్రం ఇవ్వలేదు. ఎప్పటికైనా రంగరాజుకి చాలా క్రూరంగా కళ్ళు విడతాయని విశ్వనాథానికి తెలుసు.

డాక్టరు విశ్వనాథానికి జీవితం గురించి చాలా గట్టి అభి ప్రాయాలు ఉన్నాయి. డబ్బు లేకుండా బ్రతకడం ఎంతటి కష్టమో, మొగాడు లేకుండా ఆడదానికీ, ఆడది లేకుండా మొగా డికీ బతకడం అంత కష్టం. డబ్బు అందరికీ కావాలి. డబ్బున్న వాళ్ళకి ఇంకా ఎక్కువ కావాలి. అలాగే కొందరు మొగాళ్ళకి భార్య వచ్చాక ఇతర ఆడవాళ్ళ అవసరం ఎక్కువౌతుంది. ఆడవాళ్లకీ అంతే. అసలు ఒక్కొక్కప్పుడు 'ప్రేమ' అన్నది ఉందా అన్న అనుమానం కూడా వస్తుందతనికి. 'సంఘం' కట్టుబాట్లు, సంసార బాధ్యతలు లేకపోతే 'ఐదేళ్ళు కాపురం చేసిన ఏ మొగుడూ పెళ్ళాం మళ్ళీ మొహ మొహాలు చూసుకోరు" అంటుంటాడు అతను.

"నేను డాక్టర్ని" సగటు మనిషిని ప్రపంచంలో లేడు. కాని మానసిక శాస్త్రం అంతా అతనిమీదే ఆధారపడి ఉంటుంది. 'సగటు మనిషికి' బలహీనతా–శక్తీ, ప్రేమా – ద్వేషం – స్వార్థం – త్యాగం, ధైర్యం–పిరికితనం, విశ్వాసం–అవిశ్వాసం, ఆశా –నిరాశా, భక్తీ–నాస్తికతా అన్నీ తగుపాళ్లలో ఉంటాయి. ఏ గుణం ఆ పాళ్ళు మించి ఉన్నా అది పిచ్చికి మొదటిమెట్టు. భక్తి పారవశ్యంలో నిప్పులమీద నాట్యం చేసేవాడికీ, లేని నిప్పులు తన మీద పడుతున్నాయని భ్రమపడి భయపడే పిచ్చివాడికీ శాస్త్రరీత్యా ఎక్కువ తేడా లేదు. అలాగే అమిత ప్రేమల రోమియోలు....మజ్నూలు...అంటారాయన.

రోగానికో మందు ఉంటుంది. కొన్ని రోగాలకి మందు లుండవు. కాని యెక్కువ రోగాలకి పనిచేసే మందు–మందుల్లేని రోగాలకి కూడా ఒక్కొక్కప్పుడు పనిచేసేది ఒక్కటే–అది 'మందు'. ఇదీ అతని అభిప్రాయమే!

అతని అభిప్రాయాలన్నీ భూమిలోంచి వేళ్ళు తన్నుకొని వచ్చేయి. ఏవీ తను బతికే ప్రపంచాన్ని వదలి ఆకాశంలో విహ రించవు. అంచేత అతనికి జీవితంలో డిసప్పాయింట్‌మెంట్సు బహు తక్కువ.

అతని కాంపౌండులో ప్రిన్సిపాలుగారు కారు దిగడం అతనికి ఆశ్చర్యాన్ని కలిగించలేదు. 'రా' 'రా' అంటూ బైటకు వచ్చి భుజాల మీద చేతులు వేసి ఆదరణగా అతన్ని లోపలికి తీసికెళ్ళేడు.

# 82

రాజమ్మని పోలీసులు నిజం చెప్పమన్నారు! చెప్పింది. వాళ్ళు నమ్మలేదు.

అంచేత తిట్టి నిజం చెప్పమన్నారు.

చెప్పిందే చెప్పింది. వాళ్ళు అసలు నమ్మలేదు.

కొట్టి "ఈ మారైనా నిజం చెప్పు. లేకపోతే చంపేస్తాం" అన్నారు.

"మీరు చంపీసినా, పాతీసినా, నేను సెప్పేదింతే. ఆ యమ్మ మంచిదే. కాని షికార్లెక్కువ. ఆ బాబు దేఁవుఁడు లాటోడు.

బిడ్డలు రతనాలు. ఆళ్ళింట్లో కుక్కలాంటి దాన్ని. సాకిరీ చెయ్యడం తప్ప ఆళ్ళ తంటాలు నాకు తెలవ్వు" అని మొండికెత్తింది.

అప్పటికి ఆమెను స్టేషనుకి తీసుకొచ్చి రెండు రోజులయింది. స్టేషనుకి తెచ్చిన కొన్ని గంటలు ఆమెను ఎవరూ పలకరించనైనా లేదు. కాని ఎవరో కుర్రాణ్ని–పాతికేళ్ళుంటాయి–జైల్లోంచి తీసి రక్తం కక్కేవరకూ చావతన్ని మళ్ళీ జైల్లో పెట్టారు. జైల్లో ఉన్న ఇంకెవర్నో వదిలేసి మరో ఇద్దర్ని పెట్టేరు.

రాజమ్మకి అదంతా అయోమయంగా అనిపించింది. దగా, మోసం, దుర్మార్గం, దొంగతనం, అబద్ధం, అన్యాయం, రాక్ష సత్వం అన్నీ మూట గట్టుకొచ్చి పోలీసు స్టేషన్లోనే ఆ మూల పెట్టినట్టు అనిపించిందామెకు.

రాజమ్మని ఆ రెండు రోజులు జైల్లో పెట్టలేదు. వరండాలోనే ఉంచేరు. "జైల్లో ఎడితేనే బావుణ్ను. ఎప్పటికన్నా ఒగ్గేస్తారు. వరండాలో వాళ్ళనే ఎప్పటికీ ఒగ్గరు" అనుకుందామె. ఆ వరండాలో యింకెవరో ఆడది వారం రోజులై ఉందట.

రాజమ్మకి అప్రయత్నంగా తన మొగుడూ, కొడుకూ జ్ఞాపకం వచ్చేరు. ఈ జన్మలో వాళ్ళు పోలీసు స్టేషనుకి రాకూడదని ఆమె వెయ్యి దేవుళ్ళకి మొక్కుకుంది.

ఆమెను స్టేషనుకి తీసుకెళ్ళిన రాత్రి ఆ వరండాలోనే ఉన్న ఇంకొక ఆడదాన్ని ఎవరో పోతు లాంటి పోలీసు ఎక్కడికో తీసుకెళ్ళిపోయేడు.

అది చూసిన రాజమ్మ ఆకులా వణికి పోయింది. వారం రోజులుగాని తను అక్కడే ఉంటే ఆ అన్యాయం చూడలేక చచ్చిపోతానేమోనని భయపడింది ఆమె.

పోలీసువాళ్ళు అప్పుడప్పుడు విజయ కేసు గురించే మాట్లాడు కునేవారు.

మూడో రోజున ఏ.ఎస్పీగారు వదిలెయ్యమన్నారని చెప్పి వదిలేసేరు. వదలడానికి ముందు వాళ్ళలో వాళ్ళు మాట్లాడు కున్నారు. అందరికన్నా హెడ్డే యెక్కువ మాట్లాడేడు.

"మీదోళ్ళకి బుద్ధుండాల గురూ. మనం జోళ్ళరిగేటట్టు తిరిగి తిరిగీ అఫెండరు గాళ్ళని తేడం, మనం ఏదో పావుఁల్ని పట్టు కున్నట్టు ఆళ్ళు 'ఒగ్గీ ఒగ్గీ' అనడం. ఈ రోజుల్లో పోలీసు పనికన్నా పాకీపని నయ్యం. లేకపోతే ఏటి? సీపురు కట్టలాంటి ముండకి ఏ.ఎస్పీ బాబు రికమండేషనా.

ఈ కేసుకేటి తక్కువ. ఆ ప్రిన్సిపాలు బాబున్నాడు. ఆ బాబు మంచోడేకాని, పక్కలోకి పెళ్ళాం రాపోతే ఒల్లక తొంగోడానికి ఆ బాబేం మునీశ్వరుడా? ముసిలిముండాకొడుకా? ఆ యమ్మో కమో క్లబ్బులూ, కేంపులూ. మొగుడికి ముద్ద పెట్టడానికీ, కుర్ర వెధవలకి నీళ్ళు పొయ్యడానికీ తీరుబడిలేదు. ఇంతకీ నన్నడిగితే ఆడముండని గుండు గీయించి ఇంట్లో కూకోబెట్టాలంటాను. మొగుడున్న తర్వాత గుండున్నా ఫర్వాలేదులే. లేకపోతే ఆ చచ్చి నమ్మని సూడు, ఊళ్ళో ఎక్కడ ఏ మీటింగవనీ, ఏ సభ జరగనీ సన్యాసుల సభకాడ్నించి "ముగ్గురు పిల్లల మీటింగుల" వొరకూ అన్నీ ఆవిడకే కావాలి. ఆడముండ కాళ్లలో సెక్రాలుంటే ఏ మొగాడూరుకుంటాడు జెప్పు! సేతనైతే కాళ్ళిరగ్గొడతాడు. సేతకాకపోతే వల్లనైన దాన్ని తెచ్చుకుంటాడు. మన ప్రిన్సిపాలు బాబూ–అంతే చేసేడు. పని మనిషైతేనేం రబ్బరు బొమ్మ, అలాంటిబాబు ఇలాటి దానికి కక్కుర్తి పడ్డం ఏటని అలా తెల్లబోతావేటి? ఇలాటోళ్లకే అన్ని ఘరుకులూ తెలుస్తాయి. కావ లిస్తే ముందటేడు మనూర్నుండి పార్లమెంటు కెళ్ళేడు–ఆ బాబు నడుగు. పాపం దీని తప్పూ లేదనుకో. మొగుడికేమో తొడవరకూ కాలులేదు. అది మాత్తరం యేటి జేస్తాది? కాని దీని ప్లాను నాకు నచ్చులే దొరే. ఏదో గోడచాటు బతుకు బతికీవాలసింది. కాని ఆడదాన్తో అక్కడే ఉంది పేచీ, చివరిస్తే మొదలు కావాలం టాది. మొదలిస్తే వేళ్ళు కావాలంటాది. అందుచేత ఆ బాబుని పెర్మనెంటుగా సేతులో ఎట్టుకుందామని ఎత్తు ఎత్తింది. మిగిలిన కత మామ్మూలే. ఆ బాబే ఆ మాత్రలేవో దీని చేతికిచ్చి ఉడాయిం చేసినాడు. ఒక్కమాత్రన్నా మిగల్చకుండా ఏ పాలల్లోనో కలిపి ఇచ్చేసినాదీ ముండ. దీనిమాయ కానుకోలేక తాగి సచ్చిపోనాది ఆ ఎర్రిబాగుల్ది.

నా మాట అబద్ధవేఁమో నువ్వే సూడు. అసలిటాంటి సావులు పోలీసోళ్ళకి తెలీనివ్వకుండా కాల్చేస్తారు. కాని ఈ కేసు సూడు. ఆ బాబే పెద్ద పతివ్రొతలాగా రిజిష్టరు చేయించినాడు.

ఒక్క రేత్తిరి ఈ ముండని నా కప్పగించండి. తెల్లారేసరికి మళయాళపు మంత్రగోడు దెయ్యంచేత చెప్పించినట్టు దీన్నేత అంతా కక్కించి, మేస్ట్రీటు బాబుకి "కన్‌పెషన్" కూడా ఇప్పిం చేద్దును.

ఇంతకీ నీ అదురుష్టం బాగుండిపోనాది–బతికిపోనావ్. పోయే ముండా" అంటూ వీడ్కోలు చెప్పేడు.

# 83

పోలీసు స్టేషనునుంచి తిన్నగా ప్రిన్సిపాలు గారింటికి వెళ్ళింది రాజమ్మ. "తను లేకపోయినా తన కొడుకూ, సింహాచలం బ్రతకగలరు. కాని ప్రిన్సిపాలుగారి తల్లిలేని పిల్లలు బతకలేరు. ఇప్పుడున్న లంపటాలు చాలక ఏవిటో యీ కొత్త లంపటం" అనుకుంది రాజమ్మ.

రాజమ్మ వచ్చేసరికి ప్రిన్సిపాలుగారు ఇంటిదగ్గరలేరు. వీధి కిటికీలో కూర్చుని రాని తల్లికోసం ఎదురు చూస్తున్న పిల్లలిద్దరూ రాజమ్మని చూడగానే "రాజమ్మా! రాజమ్మా!" అంటూ పెంపుడు పాముల్లా కాళ్ళకి చుట్టేసేరు. దేశం నుండి బహిష్కృతులైనట్టున్న వాళ్ళకి రాజమ్మని చూడగానేచచ్చిపోయిన తల్లి తిరిగి వచ్చినట్టనిపించింది. వాళ్ళను తప్పించుకొని అడుగు ముందుకు వెయ్యలేని రాజమ్మ కళ్ళనీళ్ళు వాళ్ళమీదపడి తుళ్ళి ఎండలో మెరిసేయి.

మెల్లగా వాళ్ళని పట్టుకొని ఇంట్లోకి వచ్చిన రాజమ్మకి విజయ స్నేహితురాళ్ళిద్దరు కనిపించేరు. వాళ్ళ చూపులు పాముల్లా ఆమెను కాటువేసేయి.

"నాన్నేరమ్మా" పిల్లల నడిగింది రాజమ్మ.

"వస్తార్లే" విజయ స్నేహితురాలు జవాబిచ్చింది. ఆ మాటకు ఆమె అన్న తీరుబట్టి ఎంత భాష్యమైనా చెప్పుకోవచ్చును.

"నువ్వు వచ్చేవుగా, ఇంక మేం వెళ్తాం. అయిపోయిందేదో అయి పోయింది. పిల్లల్ని జాగ్రత్తగా మాత్రం చూడు" అంటూ వాళ్ళు వెళ్ళి పోయేరు.

ఇంటిపనులు యాంత్రికంగా చేస్తున్న రాజమ్మకి తను భోజనం చెయ్యలేదన్న విషయం కూడా గుర్తులేదు. కుర్చీలమీదా, తలుపులమీదా వేలాడుతున్న బట్టలూ-దులపని ధూళీ-తోఁవని గిన్నెలూ-వండని వంటా, పిల్లలకి నీళ్ళుపోసి, అన్నం పెట్టేసరికి రాత్రి ఏడుగంటలు దాటింది. ఏడవ లేని పిల్లలు క్షణంలో నిద్రపోయేరు. "బేగి ఇంటికెళ్ళి యిప్పుడే వచ్చేస్తాను రంగయ్యా. కాస్త పిల్లల కాదుండు. ఈ లోగా బాబొస్తే నువ్వు వెళ్ళిపో" అని జవానుకి పిల్లల్ని అప్పగించి ఇంటికి బైల్దేరింది రాజమ్మ.

తన గూడెంలో ఇళ్ళపక్కల కుళ్ళుని తప్పించుకుంటూ నడుస్తున్న రాజమ్మని చూసి వాళ్ళ వీధి కుక్క అరిచింది. కుక్క కూడా పోల్చుకోలేనంత మారిపోయేనా అనుకుని తుళ్ళిపడిన రాజమ్మ తన ఇల్లు చేరుకుంది.

ఆ చీకట్లో ఆమె గుడిసె విషపు కుప్పలా వుంది. దాని ద్వారంలో ఉన్న కిరసనాయిలు బుడ్డి ఎర్రకాంతి ఆకలి నోరులా వుంది. ఆ నోటిలో చిక్కుకుని బైటికి రాలేని వారిలా కుక్కి మంచంలో పడుకున్నారు సింహాచలం, కొడుకూ.

ఆ గుడిసెలో మూలని తుడవని పొయ్యిబుగ్గి ఆ ఇంట్లో వంట వండి చాలాకాలం అయిందని చెపుతోంది.

"మాఁవాఁ" అంటూ తలుపు తట్టింది రాజమ్మ. ఆమె పిలుపుకి చుట్టుపక్కల ఇళ్ళల్లోని ఆడవాళ్ళు బైటకు వచ్చేరు. వాళ్ళ చూపులు చీకటి పాముల విషపు బుసలా ఆమెను చుట్టుకున్నాయి.

తాగివున్న సింహాచలానికి రాజమ్మ గొంతుక వినగానే నిషా ఒక్కసారి దిగి, మళ్ళీ తలకెక్కింది. జబ్బునుండి కోలుకున్న రాక్షసుడిలా అతను మంచం మీద నుండి లేచి తలుపు తీసి రాజమ్మని లోపలికి రానివ్వకుండా ద్వారానికి అడ్డంగా నిల్చున్నాడు.

"ఆ బాబుని కూడా సంపేసినావేటి, ఇలా ఇల్లు జేరినావ్" సూటిగానే అడిగేడు.

"మావాఁ" తోకమీద నిలుచున్న తాచులా వణికింది రాజమ్మ.

"నేకపోతే ఆ బాబే పొమ్మన్నాడా? ఈ పొద్దు నా పెళ్ళాన్ని సంపేవ్ రేపు నన్నూ సంపేస్తావని?"

"మరియాదగా మాటాడు మావఁ" శపించకూడదన్న నిర్ణయం నిలబెట్టుకోలేకపోతున్న మహర్షిలా మండిపోతోంది రాజమ్మ. తను భగ్గున ఒక్కసారి మండి బుగ్గి అయిపోతోందేమో ననిపించేటట్టు ఆమె మెదడు మండింది.

"పోలీసు స్టేషను పట్టిన ఫకీరు ముండవి, నీకు గాకపోతే మరియాద ఒంటికాలోడ్ని నాకెక్కడిదే? కూటి కోసరం, కోకల కోసరం ఆ బాబు పక్కలో జేరినావల్లకున్నాను గాని, ఈ పాపం మాత్తరం నాను చెమించలేను! కాలు లోపల ఎట్టకు. నీ కాలు పడిన కొంపలు కూలిపోతాయి. నీ సూపు పడిన బతుకులు బగ్గుమని పోతాయి, పో. నా కొడుకుని అందరూ లంజ కొడుకంటే నాను ఇనిపించుకోకుండానే బతికేను. గాని, ఆడ్ని కూనీ కోరు కొడుకంటే మాత్తరం బరించి బతకలేను. నా ఒంటిసేతి ఆర్జనే చాలు మాకు. నీ యిష్టవొచ్చిన కాడకెళ్ళు."

"లోపలికి రానీ మాఁవాఁ. అంతా సెప్తాను. నాకేం తెలీదు.

నానే పాపం ఎరగను". తనలో చేర్చుకోమని భూదేవిని సీత ప్రార్థించినట్లు ప్రార్థించింది.

"నువ్వు కూడా పొమ్మంటే యెక్కడికి పోను మాఁవా? సిన్న పుట్నుండీ నీ పాదాలకాడ పెరిగినాను. తన్నిన నీ కాలే నాకుతా కుక్కలా బతికేను. నాను బతికున్నానంటే నా కోసరవాఁ మాఁవా? నీ కోసరం, నీ కొడుక్కోసరం. ఇంతవొరకూ ఏ పాపం యెరగను. ఊపిరి బిగబట్టి బతికి నాను. ఉన్నపూటా లేనిపూటా కూడా తినకుండానే బతికినాను. ఇప్పుడు గాకపోతే నాను సచ్చిన్నాడన్నా మంచిదానవ్ రాజమ్మా అంటావేమోనని బతికి నాను. నువు కాదన్నా నీ కాళ్ళు ఒగ్గలేను మాఁవాఁ. ఇన్నాళ్ళూ .... ఇన్నేళ్ళూ నువ్వే తోడై పోనావని-నువ్వు తిట్టినా, తన్నినా, నన్ను కాదనుకొని దలుపుకొని బతికినాను. ఆ పోలీసోళ్ళు నన్ను కూనీకోరు ముండా అని తిట్టినప్పుడు సచ్చిపోదారనే అనుకున్నాను. కాని నాను సస్తే మీకు నీళ్ళుండవ్, నన్ను నమ్ము కున్న నీకూ-అదుగో ఆ బొట్టుడికోసం-నా కోసం నోరు తెరుసు కుని పిలుస్తున్న ప్రెతీ నుయ్యీ తప్పించుకొని నీ గుమ్మంకాడ వాలేను. నన్ను పొమ్మనకు. ఇప్పుడు నువ్వుకాదు-నాను ఎర్రి దాన్నై పోతున్నాను.

నీ కోపంతీరా కొట్టు. లేకపోతే ఇదుగో పీక .... పిసికీసి పారీ. నువ్వేటి జేసినా సరే నీ పంచని పడుండనీ. కాని, అందరి లాగా నువ్వు కూడా రంకుముండా అని తిడితే నా నేటి జేస్తానో నాకే తెల్దు...." ఆమె ఏడిచింది కళ్ళు కరిగి పోయేలా ఏడిచింది! పేగులు పగిలిపోయేలా ప్రార్థించింది. వొంట్లో ఉన్న రక్తం అంతా నీరైపోయి కళ్ళలోంచి కారిపోతోందా అనిపించేటట్టు ఏడ్చింది. వినేవారికి గుండె ఇనపచేత్తో నొక్కినట్టుంది ఆమె ఏడుపు.

"ఈసారి కాబట్టి సరిపోనాది. నాను పొమ్మంటున్నాను. మళ్ళీ పాలొస్తే నీ కొడుకు సేతే యీడిపించేస్తాను" సింహాచలం తలుపు వేసేసేడు.

పాదాలమీద పడిన కూతుర్ని తల్లే మొహం మీద నిప్పులచేత్తో కొట్టినట్టయింది ఆమెకు. తను ప్రార్థించిన దేవుడే తనని మొసళ్ళ రంపపు నోటిలో విసిరేసినట్టయింది ఆమెకు.

పిచ్చెత్తిన సుడిగాలిలా లేచింది ఆమె. పరిస్థితులను బట్టి కన్న కొడుక్కే విషం పెట్టిన తల్లిలా సర్వానికి తెగించి లేచింది. నా కొడుకూ మొగుడూ దేముడూ ఒక్కసారే చచ్చిపోయేరన్న తెగింపులో లేచింది.

లేచి జారిపోయిన కొప్పుని తిరిగి వణకని వేళ్ళతో ముడి పెట్టుకుంది.

కసిగా కొన్ని అడుగులు ముందుకు వేసింది.

ఇంతలో గుండెల్లో ఏదో ఇనుపగేలం ముల్లు గుచ్చుకున్న ట్టయి వెనక్కి చూసింది. రాక్షస చెదపుట్టలా కనిపించింది తన గుడిసె.

కడుపులో గిరగిర తిరుగుతున్న పేగుల్ని చేత్తో పట్టుకొని వెళ్ళిపోయిందామె.

# 84

రాజమ్మ ప్రిన్సిపాలుగారి ఇల్లు చేరేసరికి వరండా స్తంభానికి ఆనుకొని కూర్చుని రంగయ్య నిద్రపోతున్నాడు. కారు షెడ్డు ఖాళీగా ఉంది. అంటే ప్రిన్సిపాలుగారు ఇంకా రాలేదన్న మాట. పిల్లలు గదిలో నిద్రపోతున్నారు.

హాలులో-వెన్నెల అద్దెకు తెచ్చినట్టుంది-ట్యూబ్‌లైటు కాంతి.

"రంగయ్యా" అని పిల్చింది రాజమ్మ. తన గొంతు తనకిలేని చెల్లెలు గొంతులా అనిపించింది ఆమెకు.

రంగయ్య కళ్ళు విప్పేడు.

భర్తను చంపిన శత్రురాజుని తుద ముట్టించిన రాణీలా కనిపించింది రాజమ్మ అతనికి.

"ఏటలాగున్నావ్?" ఆశ్చర్యపోయేడు రంగయ్య.

"బాగానే ఉన్నాను గాని ఆలీసమైపోనాది నువ్వెళ్ళిపో."

ఇంకో క్షణం ఉంటే ఆమె పీకకొరికి రక్తం తాగేస్తుందేమోనని భయపడిన వాళ్ళా వెళ్ళిపోయేడు రంగయ్య.

# 85

డాక్టరు విశ్వనాథంగారు రంగరాజుని భుజంమీద చెయ్యి వేసి, దారితప్పిన తమ్ముడ్ని తీసుకువచ్చినట్టు ఆదరంగా ఇంట్లోకి తీసికెళ్ళి సోఫాలో కూర్చోబెట్టి ఫాన్ వేసేరు. చిరుచెమటకి రంగరాజు నుదురు మెరుస్తోంది. పనిమనిషి ట్రేతో కాఫీ తెచ్చి వాళ్ళదగ్గర పెట్టింది. ఒక కప్పు రంగరాజుకి అందించి మరో కప్పు తను తీసుకున్నారు డాక్టరుగారు. అతని జుత్తు పల్చబడి నుదురు యెదిగింది. మూడు వీశల మాంసం కూరి చేసినట్టు అతని మొహం మెత్తబడి బుగ్గలు జారి అతను "బుల్ డాగ్"

లా ఉన్నా, ప్రభు భక్తి అతిగా కలిగిన మంచి బుల్‌డాగ్‌లా గౌరవంగా కనిపిస్తారు.

ఇటువంటి సమయాల్లో కొంతసేపు మాట్లాడకపోవడమే మంచిదనిపించింది అతనికి.

నోరు తెరిచి కిటికీలో కూర్చున్న కాకిపిల్ల నోటిరంగు గులాబీ రంగులా ఉన్నా బాగులేదు.

పైన ఫాన్–తప్పించుకొని బైటపడడానికి బలంగా ప్రయత్నిస్తున్న బందీలా–తిరుగుతోంది.

"నాకు మీరు వేసెక్టమీ (బర్తు కంట్రోలు) ఆపరేషను చేసేరు" అన్నాడు రంగరాజు హఠాత్తుగా.

ఏమనాలో తెలీక కనుబొమ్మలు కాస్త మీదికి లేపేరు డాక్టరుగారు.

"సంవత్సరం అయింది" మళ్ళీ రంగరాజే అన్నాడు.

"దాటింది, 3 నెలలయింది."

"ఆ ఆపరేషను సక్సెస్‌ఫుల్లేనా?"

"మీరే చెప్పాలి."

"కాదు."

"ఎప్పుడయినా ఫెయిలవవచ్చు."

"ఫెయిలవలేదు."

'ఉఁహుఁ."

"ఫెయిలయిందో, సక్సెస్ అయిందో మీరు పరీక్షచేసి చెప్పాలి."

"చెప్తాను."

"ఇప్పుడే..."

"ఇప్పుడే చెప్పలేను. చెయ్యవలసిన పరీక్షా వివరాలు మీకు తెలీవు. మీ మూడ్ బాగులేదు. ఈ పూటకి ఇక్కడే భోంచేసి పడుకోండి. తర్వాత సాయంత్రం టెస్టు చేస్తాను" రంగరాజు భోంచేసి పడుకొని మళ్ళీ లేచేడు.

సాయంత్రం ఏడు దాటింది.

డాక్టరు విశ్వనాథం గారి బాల్కనీని చుట్టుకున్న పూల తీగ పొదరిల్లులా వుంది.

బాల్కనీలో నీలిలైటుకింద గ్లాస్ టాప్‌టేబిలు మంచుబిళ్లలా మెరుస్తోంది. దానిమీద బస్ బకెట్టు, పక్క జిన్ బాటిలూ, చల్లటి సోడాలూ, కోసిన నిమ్మకాయలూ, బిస్కట్ల ప్లేటూ ఉన్నాయి. దానిచుట్టూ రబ్బరు దిళ్ళ బెత్తు, కుర్చీలు వున్నాయి.

"అలవాటు లేనివాడికి లిక్కరు నేను యెప్పుడూ పట్టను." గ్లాసులో జిన్ కోలచూస్తూ అన్నారు డాక్టరుగారు.

"..........." జవాబివ్వలేదు రంగరాజు.

"లిక్కర్ నీ కలవాటు లేదు."

"ఔను. లేదు."

"కాని నువ్వు నా పేషెంటువీ, స్నేహితుడివీను. అంచేత ఈవేళ కాదనకు."

"విషం ఇచ్చినా కాదనే పరిస్థితిలో లేను."

"పాపం! ఇప్పుడలా లేకపోతేనే ఆశ్చర్యం. బాధపడాలి."

"............"

"ప్రతి మనిషీ కొన్ని సమయాల్లో చచ్చిపోవాలను కుంటాడు."

"ఔను."

"కాని ఆ సమయాలు యెక్కువా కావు. యెక్కువసేపూ వుండవు"

"నా అభిప్రాయం వేరు."

"జవాబు పరిస్థితులనుబట్టి ఉంటుంది. ఇంతకీ చచ్చి సాధించేది ఏదీ లేదు. కాదనకుండా పుచ్చుకోండి" అంటూ గ్లాసు రంగరాజుకి అందించేరు డాక్టరుగారు.

"మోసం భరించలేం" అన్నాడు రంగరాజు రుచిచూస్తూ.

"స్వార్థాన్ని చంపుకుంటే, దేన్నైనా భరించవచ్చు."

"నాకు డబ్బు ఆశలేదు."

"స్వార్థం అంటే డబ్బు ఆశ ఒక్కటే కాదు. నాకు మంచి భార్య ఉండాలి. ఆమె పతివ్రత అయుండాలి. నా పిల్లలకి తెలివీ, ఆరోగ్యం, అందం అన్నీ ఉండాలి. నా చచ్చు కవిత్వానికి ప్రజలు చప్పట్లు కొట్టాలి. నా కొక్కిరి గీతల్ని కళాఖండాలని మెచ్చుకోవాలి. ఇవన్నీ స్వార్థాలే! సృష్టిలో మంచీ చెడ్డా ఉండక తప్పవు. అంచేత నాకున్న ఇద్దరు పిల్లల్లో ఒకడు జబ్బువాడూ, ఇడియట్ ఐతే యెందుకు ఆశ్చర్యపోవాలి? నా దగ్గర వైద్యం చేయించుకున్న వందమందిలో యాభైమంది నన్ను యముడి ఏజంటంటే నే నెందుకు నొచ్చుకోవాలి."

"అన్నీ అలా సర్దుకుపోలేం."

"కష్టమైనప్పుడే నేర్చుకోవాలి. నేనూ మామూలు మనిషినే. నాకూ కష్టాలు తప్పవు. ఒకరు నన్ను దయతో చూస్తే, మరొకరు దగా చెయ్యక తప్పదు...."

"కాని....కొంతమంది చేతుల్లో మోసానికి సిద్ధపడలేం."

"మోసానికి సిద్ధమయ్యేక మోసగాడు యెవరైతే నేమిఁటి?"

"టెస్టు రిజల్టు యెప్పుడు వస్తుంది."

"ఘడియో, క్షణమో"

"నాకు తొందరగా వుంది."

"లాబ్‌కి ఫోను చేయిస్తాను."

సీసా ఖాళీ అయింది.

"ఈ పూట కూడా భోంచెయ్యి."

రంగరాజు మనసు "సీసా" ఆట ఆడుతోంది. ఒకప్పుడు బాధల బరువుకి లొంగిపోతోంది. మరొకప్పుడు గాలిలో తేలి పోతోంది.

చప్పుడు లేకుండా మరో సీసా విప్పేరు డాక్టరుగారు.

ఇంతలో నౌకరు అతనికొక కవరు తెచ్చి ఇచ్చేడు. కవరు చించి కాగితం చదివిన డాక్టరుగారు "ఆపరేషన్ ఫెయిలు కాలేదు. నువ్వు మళ్ళీ తండ్రివి కాలేవు" అన్నారు ఇంగ్లీషులో.

"విజయ ప్రెగ్నెంట్ డాక్టర్" మెదడులో కార్కు స్క్రూలు తిరుగుతున్నట్టు తల గట్టిగా పట్టుకొని అన్నాడు రంగరాజు.

"ఇంకెప్పుడూ ఈ మాటనకు" డాక్టరు పైకి గబగబా అన్నా ఈ వార్తకు అతను సిద్ధంగాలేడు. విజయ గురించి ఏదో మిస్టరీ ఉంటుందని అతను అనుమానించినా, ఈ దారుణ వార్తకి అతను సిద్ధంగా లేడు.

"పాపం మంచిపిల్ల, అందర్నీ అభిమానించ గలిగిన అమాయకురాలు. నీళ్ళు చూస్తే ఆమెకు దిగబుద్దే పుడుతుందికాని, నాచుపట్టి కాలుజారవచ్చునన్న గడుసుతనం లేదు. తప్పు చేసిన ఆడదాన్ని నిందించడమే నేర్చుకున్నాంగాని, ఆవిడ చేసింది తప్పా! ఏ పరిస్థితిలో అలా చేసింది అని ఆలోచించే వివేకంలేదు మనకి. అలాటి వివేకమే మనకి ఉన్ననాడు విజయ యిలా చేసి ఉండకపోను. మొన్ననే ఒక గొప్పవాడి స్వీయచరిత్ర చదివేను. అది రాసిన ఆయన అన్న ప్రైవేటు మేస్టారుకి దరిద్రంతో పాటు టీ.బీ. కూడా ఉండేదట. అతన్ని కేవలం జాలివల్ల ప్రేమించిందట కుర్రాడి తల్లి. ఆవిడ చేసింది తప్పని అనగలమా? ఆవిడకి పతిభక్తి లేదని అనగలమా?" ఆలోచించకుండా మాట్లాడుతున్న అతనికి మరిమాటలు తోచక ఆగిపోయేరు.

"ఏమో మరి, అవన్నీ నాకు తెలీదు. కాని యీ జన్మలో మరి ఆడదాన్ని నమ్మలేను."

"దేముడు లేడన్న వాడికే ఒక్కోక్షణం యెక్కడలేని నమ్మకం పుట్టుకొస్తుంది. నువ్వు మాత్రం తొందరపడి విజయ గురించి తీర్పు చెప్పకు."

గ్లాసు ముందుకు చాపేడు రంగరాజు.

# 86

వీధి వరండాలో స్తంభానికి చేరబడి మేలుకోలేని మనసుతో ఆలోచిస్తూ కూర్చుంది రాజమ్మ. ఏడవలేని ఆమె కళ్ళు వాచి, ఉబ్బి ఉన్నాయి. మురికి పట్టిన ఆమె చెంపల్ని కన్నీరు కోసినట్టు ఉంది.

ఆమె కడుపులో త్రిప్పుకు ప్రతిధ్వనిలా ఉంది పిల్లల గదిలో ఫేను చప్పుడు.

సత్తువలేని ఆమె మెడ తలని పక్కకి వాల్చేసింది. కారు హారన్‌కి తుళ్ళిపడి లేచింది ఆమె. గేటులోంచి దూసుకు వచ్చిన కారు పూలకుండీకి గుద్ది ఆగిపోయింది. అందులోంచి ఒక ఖూనీ అప్పుడే చేసి మరో ఖూనీ చెయ్యడానికి సిద్ధంగా ఉన్న వాడిలా బైటకు వచ్చేడు రంగరాజుగారు.

పేంటు బెల్టువరకూ, విడిపోయిన షర్టులోంచి అతని గుండెల మీదున్న దట్టమైన వెంట్రుకలు అతనిలోని పశుత్వం అంతా బైటపడినట్లు కనిపిస్తున్నాయి. ఊగుతున్న అతని భుజం మీద కోటు నేలని జారి పడిపోయింది.

"బాబూ" అంటూ పరుగెత్తికెళ్ళి కోటు తీసింది రాజమ్మ.

నడవబోయిన రంగరాజు మెట్టు తన్నుకొని పడబోయేడు.

"ఆగండి బాబూ" అంటూ రాజమ్మ అతని చెయ్యి పట్టుకొని పడిపోకుండా ఆపింది.

బాలన్స్ నిలబెట్టుకోవడం కోసం ఆమె భుజంమీద చెయ్యి వేసేడు అతను.

భుజం మెత్తగా తగిలింది అతని పంజాకి.

మనసు మూలలో విడిన ఏదో వింతపూల వాసన – ఆడ దాని మెత్తటి వెచ్చదనం–కారు చీకట్లో వెన్నెల–విజయ మొదటి ముద్దు–వెన్నెముకని చుట్టుకున్న వెర్రికోరిక –సారాలో తేలుతున్న కాగితం పడవ–శ్మశానంలో కాలుతూ లేచిన విజయ చెయ్యి – రాసిన ప్రేమలేఖ కంపు–భగవాన్–తుళ్లేడు రంగరాజు.

అతని భారం సగం మోస్తూ గదిలోకి నడిపించి తీసుకెళ్ళింది రాజమ్మ. మధ్యలో ఆమె కాలు అతని జోడుకిందపడి నలిగి పోయింది.

లైటు ఆర్పుతూ "వద్దనకు రాజమ్మా" రంగరాజుగారు అన్నారు.

మొదటిసారి పిల్లడికిచ్చిన పాలు–అమ్మ చచ్చిపోవడం, వీపు మీద ఇనప కొరడా చెళ్ళుమంది, కలలో కనిపించిన దేముడు –తన కాళ్ళకిందే ఊబి అయిన భూమి.

వద్దనలేదు రాజమ్మ. వద్దనలేకపోయింది ఆమె. ఆమెకు – తనలో తల్లి అప్పుడే నిద్రలేచినట్టు అనిపించింది.

# 87

పగలు పిల్లల్ని చూసుకోవడం, తాగివచ్చే ప్రిన్సిపాలుని కాదనలేక పోవడంతో మూడు వారాలు గడిపిన రాజమ్మ ఇంటికి వెళ్ళలేదు.

పిల్లలకి అన్నం పెడుతున్నప్పుడు తన పిల్లడూ–రంగరాజుకి లొంగిపోయినప్పుడు పెళ్ళి అయిన కొత్తలో సింహాచలం గుర్తుకొచ్చేవారు ఆమెకు.

తనకు ఏ శిక్ష వేసినాగాని, సింహాచలాన్నీ, కొడుకునీ తిన్నగా చూడమని ప్రతిరోజూ నిద్రపోయేముందు దేవుడ్ని ప్రార్థిస్తూ వెక్కి వెక్కి ఏడ్చేది ఆమె.

ఆ సాయంత్రం....

పిల్లలని పడుకోబెట్టి, తాగడానికి వెళ్ళిన రంగరాజు కోసం ఎదురు చూస్తున్న రాజమ్మ–గేటు తీసుకొని వస్తున్న అప్పల కొండని చూసి ఆశ్చర్యపోయింది. అప్పలకొండ సింహాచలం ఇంటిపక్కనే ఉంటున్నాడు. అతను కూడా రిక్షా తొక్కుతాడు.

"రా అప్పలకొండా! నిలబడిపోనావేం?"

"రాజమ్మా! ఆశ్చర్యపోయేడు అప్పలకొండ. "రాజమ్మా ఎలా సెప్పాలో తెలడంలేదు. ఆడూ, కొడుకూ జొరంతో పడవల్లా పడిపోనారు. ఆళ్ళ కడుపులూ, వళ్ళూ ఒక్కలా కాలిపోతున్నాయి. నీకూ సింహాచలానికీ ఏటి పేచీ వొచ్చిందో తెల్దుగాని యిప్పుడు నువ్వొచ్చి సూడకపోతే జొరానికి కాకపోయినా ఆకలికి సచ్చి పోతారు వాళ్ళు. కాదనక బేగిరా. రిచ్చా తెచ్చినాను" పోర్షను వప్పగించేసిన కొత్త నటుడిలా ఆగిపోయేడు అతను. ఈ విలువైన పరిసరాల్లో అతనికి ఊపిరి ఆడడం లేదు.

కళ్ళు తుడుచుకోకుండానే గదిలోకి వెళ్ళి రంగరాజు కోటు లోంచి డబ్బు తీసుకొని, పక్కింటి జవాన్ని ఇంటికి కాపలాపెట్టి రిక్షా ఎక్కింది రాజమ్మ. రిక్షా కదిలినప్పుడు తలలోని మల్లెదండ తీసి విసిరేసింది.

తన గుడిసె చేరిన రాజమ్మకి–వాళ్ళ జ్వరాల వేడికే గుడిసెలో గాలి వేడెక్కి–పలచబడి పోయినట్టు ఎంత పీల్చినా ఊపిరి అందడంలేదు.

మంచానికి అటుకులా అంటుకుపోయిన పిల్లడ్ని చూసి నప్పుడు ఆమె కడుపులో పేగులు గిరగిర లాడేయి. పిల్లడు "అమ్మా" అన్నాడు. దెయ్యం పిల్లడి మాయమాటలా శబ్దం అతని నోటినుండి రాలేదు. నిప్పుల్లాంటి అతని ఎర్రకళ్ళలో రెండు నీటిబొట్లు ఊరి అప్పలకొండ తెచ్చిన రిక్షాలైటు ఎర్రకాంతిలో రక్తం బిందువుల్లా మెరిసేయి. పిల్లడ్ని హత్తుకున్న రాజమ్మ గుండెలు కొత్త తల్లి గుండెల్లా పొంగేయి. జలజల రాలిన ఆమె కన్నీళ్ళు మండుతున్న అతని తలమీదపడి ఎండిపోయేయి.

ఈ విజయలూ, ప్రిన్సిపాల్లూ, సింహాచలాలూ, డబ్బూ, పాపం ఏవీలేని ఏ అడవుల్లోకో పిల్లడ్ని ఎత్తుకొని పారిపోవాలని పించింది రాజమ్మకి.

"రాజమ్మా" సింహాచలం పిలుపువిన్న రాజమ్మకి ఏవో చక్రాలు వెనక్కు తిరిగి–చల్లటి నీళ్ళూ–పచ్చని పంటలూ, కాపు రానికి వెళ్ళిన తొలి రోజులూ గుర్తుకొచ్చేయి.

"మాఁవాఁ" చచ్చిపోయిన పిల్లడిమీద తల్లి వాలిపోయినట్లు సింహాచలం మీద వాలిపోయింది ఆమె.

"నాను చచ్చిపోతానేటే?" సింహాచలం అడిగేడు.

"సిస్సీ! ఏటా మాటలు? ఈపాటి ఊష్టానికే సచ్చిపోతామా?"

"ఆసుపత్రికి తీసుకుపోదామా రాజమ్మా?" అప్పలకొండ అడిగేడు.

"అంతే సేద్దాం. ఈ కుళ్ళు గుడిసెలోకి ఏ దాక్తరు వొస్తాడు?"

ఆస్పత్రిలో మందులు కొనమని డాక్టరు అడిగేవరకూ తను

రంగరాజు కోటులోంచి అంత డబ్బు తీసుకున్నానని గ్రహించ లేదు రాజమ్మ. అస్పత్రిలో చేర్చిన వాళ్ళకి ఇంకా జ్వరాలు హెచ్చిపోవడంతో వాళ్ళనే అంటిపెట్టుకున్న రాజమ్మకి మూడు రోజులు ఆకలి కూడా తెలీలేదు.

జ్వరాలు తగ్గుముఖం పట్టేసరికి మరో పదిరోజులు గడి చేయి. రాజమ్మ దగ్గర డబ్బు రమారమీ అయిపోయింది. మరో రెండు రోజులు గడిచేయి.

ఆస్పత్రి ఆరోగ్యంగా లోషన్ వాసన వేస్తోంది.

రాత్రి చచ్చిపోయిన ఇద్దర్ని వాళ్ళ బంధువులు తీసుకుని పోయేరు.

పెద్ద డాక్టరుగారు ఆ ఉదయం రౌండ్సు చేస్తున్నారు.

కొత్త యూనిఫారాలతో–కాగితాల చప్పుడు చేస్తూ – డాక్టరుగారి వెనక ఇద్దరు నర్సులు నడుస్తున్నారు. నర్సుల వెనక చిన్న డాక్టర్లు ఉన్నారు.

డాక్టరుగారిని చూసి క్రీనీడలా నిశ్శబ్దంగా గోడవారగా వెళ్ళి పోయింది రాజమ్మ. డాక్టరుగారు సింహాచలాన్నీ, అతని కేస్ షీటునీ చూసి "నువ్వు ఇంటికి వెళ్ళిపోవచ్చు" అన్నారు సింహా చలంతో.

"నీ అమ్మ కడుపు సల్లగా..." మనసులో దీవించింది రాజమ్మ.

రాజమ్మ కొడుకు బెడ్ దగ్గరకు వచ్చి అతన్నీ, అతని కేస షీటునీ పరీక్ష చేసేడు డాక్టరుగారు. కుర్రాడి ఎక్స్‌రే ఫోటో ఇచ్చింది నర్సు. కిటికీ వెలుతురుకి అడ్డంగా ఫోటో పెట్టి పరీక్ష చేసి చిన్న డాక్టరుకి అందించేరు పెద్ద డాక్టరుగారు.

"ఈ అబ్బాయి తాలూకు...."

రాజమ్మ ముందుకు వచ్చింది.

"ఈ అబ్బాయిని తీసుకు వెళ్ళొచ్చు ఈ వేళ. కాని వైద్యం కొన్ని నెలలు చేయించాలి. పిల్లడికి పాలూ, వెన్నా, గుడ్లూ, పళ్ళూ జాస్తీగా ఇయ్యి."

డాక్టరుగారు హాస్యం ఆడుతున్నారేమో ననుకుంది రాజమ్మ.

కాని డాక్టరుగారు అతి సీరియస్‌గా మళ్ళీ అన్నారు. "అబ్బా యికి టీ.బీ. అంటే క్షయ, రెండు రోజులకు ఒక ఇంజెక్షను చొప్పున కొన్ని నెలలు యిక్కడ రాసిన ఇంజెక్షన్లు ఇప్పించు. మాత్రలు కూడా రాసేను. పూటకి ఒకటి చొప్పున రోజుకి మూడు ఇవ్వండి. అశ్రద్ధ వద్దు" అంటూ రోగిని డిశ్చార్జి చెయ్య మని చెప్పేరు డాక్టరుగారు.

"బాబూ, పుస్తె అమ్ముకున్న దాన్ని....." అనబోయింది రాజమ్మ. కాని, నాలిక కదలలేదు.

ఆస్పత్రి వదిలేలోగా ఎవరో రాజమ్మతో చెప్పేరు–ఆమె కొడుక్కి యివ్వవలసిన మాత్రలు ఒక్కొక్కటి పావలా అనీ, ఇంజె క్షనులు ఒక్కొక్కటి రెండు రూపాయలనీ–అదైనా బ్లాక్ మార్కెట్‌లో కాకపోతే.

సత్తుకాళ్ళతో ఇల్లుచేరిన రాజమ్మకి గుండె బరువుతో మాట రాలేదు. ఈ విషపు వరదలో నుండి తనని ఒడ్డుకి చేర్చగలిగింది ప్రిన్సిపాలుగారు ఒక్కరే. తన కష్టాల మడతల్లో నలిగిపోయిన ఆమె–ఆ బాబూ పిల్లలూ ఏమైపోయేరో కూడా ఆలోచించలేక పోయింది. తనలో విశ్వాసం అంత తక్కువా? ఎండిన గొంతు కలో నీరుపోసిన చేతిని తను మరచిపోయిందా?

కిందటేడు పోయిన కొడుకు సమాధి దగ్గరకు వెళుతున్న తల్లిలా ఆమె కుంగిపోయే గుండెతో, కూరుకుపోయే కాళ్ళతో నడిచివెళ్ళి ప్రిన్సిపాలుగారి ఇంటికి చేరుకుంది.

గేటు కొత్త రంగుల్తో ఆహ్వాన పూర్వకంగా మెరుస్తోంది. గేటు నుండి ఇంటి వరకూ ఉన్న తోవ ఇరువైపులా రాలిన పూలతో పూల బాటలా వుంది.

గేటుదాటి లోపలికి వెళ్ళిన రాజమ్మకి ఎండలో బంగారు తాళంలా మెరిసే ఆ ఇంటికి వేసి ఉన్న ఇత్తడి తాళం చూసేసరికి తను ప్రవేశించిన అపరిచిత గృహద్వారం ఎవరో బండరాతితో మూసేసినట్టయింది.

ప్రిన్సిపాలుగారు పిల్లలతో వారం కిందట యెక్కడికో వెళ్ళిపోయేరుట.

పోయేముందు నన్ను దొంగననుకున్నారేమో! కడుపు పట్టని దుఃఖం పైకి రాకుండా నోట్లో చీరెచెంగు కుక్కుకుంది రాజమ్మ.

## 88

వారం రోజులు భారంగా గడిచేయి.

ఆ రాత్రి ఇంటి ముందు చీకట్లో కూర్చుంది రాజమ్మ. గదిలో దగ్గలేని పిల్లడు ఒత్తిగిలి పడుకున్నాడు. అతనికి మూడు

ఇంజెక్షనులు అయేయి. సింహాచలం తాగుడు మొదలు పెట్టి మూడు రోజులయింది. మొదటి రెండు రోజులూ ఎవరో ఇప్పిస్తే తాగేడు. ఈ వేళ కొడుకు మందుకని దాచిన మూడు రూపా యల్లో–ఒక రూపాయి రాజమ్మని బతిమాలి పట్టుకొని పోయేడు. ఆ రూపాయి సింహాచలం పట్టుకెళ్ళకపోయినా రెండో ఇంజక్షన్‌కి డబ్బులేదు.

మిణుగురు పురుగుల వెల్తురులో చీకటిబాట ప్రయాణం ఆమె బ్రతుకు.

ప్రయత్నిస్తే ఆమెకు పని దొరక్క పోదు. కాని నెలకు దొరికే పది రూపాయల్తో చావులాంటి యీ బతుకుని ఎంతకాలం పొడిగించగలదు?

పళ్ళు–రూపాయలు–మందులు–బంగారం–

మూసుకున్న ఆమె కళ్ళకి దేవుడు కనిపించేడు. చేసుకున్న నిర్ణయాన్ని అతను దీవించినట్టయింది.

ఒక్కసారి గుండెలనిండా ఊపిరి పీల్చుకుంది రాజమ్మ.

తలకి రక్తం ఎక్కి కణతల్లో రక్తపోటు సుత్తి దెబ్బలా వుంది.

"నానూ ఒక అమ్మకన్న పిల్లనే."

దూరంగా ఒక నక్షత్రం రాలిపోయింది..

"నానూ ఒక అయ్యనీడని బతుకుదామనుకున్న దాన్నే."

వీధికుక్క చీకట్లో ఏడిచింది.

"నాను చేసిన పాపవేవిఁటి?"

ఇంట్లో దీపం, దెయ్యం పాము రక్తపు నాలికలా అటూ యిటూ కదిలింది.

చీకట్లో చీర మార్చుకుంది రాజమ్మ.

తర్వాత ఇంటి పక్కనున్న అప్పలకొండని తీసుకొని బయలు దేరింది.

# 89

నరసు "అప్పల నరసమ్మ" దశలో ఒక చిన్నపట్నంలో పుట్టింది. కొంచెం పెరిగేక బుద్ధిగా బడికి వెళ్ళింది. గురువులు మెచ్చుకునేటట్టు ఐదో క్లాసు వరకూ చదివింది. తర్వాత బంతి పువ్వులాంటి అప్పల నర్సమ్మకి మేనమామ కొడుకునిచ్చి పెళ్ళి చేసేరు. అంతవరకూ ఆమె జీవితం ఒక మంచి కథ. ఒక తరగని పాట.

కాని పెళ్లి అయిన వెంటనే పాట ఆగిపోయింది. మొగుడు ఆమెతో మూడు రాత్రులే ఉన్నాడు. ఆ ఫలితం అనుభవించ డానికి ఆమెకు పది రోజులు పట్టలేదు. అంతవరకూ ఆమె అటువంటి విషయాల గురించి వినలేదు కూడా.

మొగుడు కొడితే మాదాకబళంవాడూ కొడతాట్ట. నరసుని మొగుడు కొట్టేడు. మాదాకబళం వాడి పాత్ర ఆడపడుచులు తీసుకున్నారు. ఆమెకు లేని రంకులు కట్టి చీకటి కొట్లో పెట్టి తాళం వెయ్యడం, మొగుడు రాగానే తాళంతీసి తన్నించి, మళ్ళీ తాళం వెయ్యడం, వాళ్ళ డ్యూటీ. "పాలు తాగి నమ్మ పాతివ్రత్యం చెడ్డాది" సామెతలో వాళ్ళకి నమ్మకం యెక్కువ. అంచేత నరసు చావకుండా ఉండడానికి సరిపోయేంత తిండి మాత్రం వాళ్ళు పెట్టేవారు.

నరసుకీ, మొగుడికీ పొత్తు లేకపోవడంవల్లా, అత నామెకు అంటించిన జబ్బులవల్లా, పదేళ్ళు కాపురం చేసినా ఆమెకు పిల్లలు పుట్టలేదు.

"నలుగురు నడిచేచోట గడ్డి మొలవదు" అని వ్యంగ్యంగా అనడం ఆరంభించిన అత్తగారూ, ఆడ పడుచులూ, తర్వాత డైరెక్టుగానే అనడం ప్రారంభించేరు.

నరసుకి పాతికేళ్ళు వచ్చేయి. పాతికేళ్ళ కోరికలూ పుట్టేయి. కోరికల మంట వివేకాన్ని తగులబెట్టేసేటట్టు ఉంది. ఒకనాడామె పెరట్లో పని చేసుకుంటూ పనివాడితో ఏదో అంది. పనివాడు కనకయ్య నవ్వేడు. ఆ సాక్ష్యంతో ఆడబడుచులు వాళ్ళిద్దరికి రంకుకట్టి, మొగుడుచేత తొడలమీద వాతలు వేయించేరు.

గడ్డిపోచకి–ఒంటె నడుం విరిగిపోయింది.

వాతలకి నరసు సహనం కాలిపోయింది.

ఆ రాత్రి నరసు చాలా ఆలోచించింది. తన పుచ్చు మొగుడు ఇంక బాగుపడడు. పడినా లాభం లేదు. ఇంక తను కాపరం ఆడపడుచులతో చెయ్యాలిసిందే. కనకయ్య యౌవనం పాతికేళ్ళ కండలతో పిటపిటలాడుతోంది. తనక్కావలసిన మొగ జంతువు అతనిలో ఉంది. చర్మం అడుగున అంతా ఒక్కటే. సాంఘిక విలువలు పడగ్గదిలో పాటించక్కర్లేదు. కనకయ్యకేం తక్కువ? తక్కువవాడు కాబట్టి పడేసే కూటికి విశ్వాసం చూపిస్తాడు. పైగా తెలివైనవాడు కూడా. అంచేత కనకయ్యను నరసు నాలుగు రోజుల్లో లొంగ దీసుకుంది. మరో నాలుగు రోజుల్లో సకల ఆభరణాల తోనూ, చేతికి చిక్కిన డబ్బుతోనూ అతనితో సిటీకి ఉడాయించేసింది.

సిటీ చేరిన కొద్దిరోజులు గుండెల్లో గాభరాగా ఉండేది ఆమెకు. కాని తెలివైనదీ చురుకైనదీ కాబట్టి నెలలోనే తన భవిష్యత్తు గురించి ఆలోచించగలిగింది. మొదట్లో కనకయ్యచేత సిగరెట్ల దుకాణం పెట్టించింది. రెండో నెలలో దానికి పత్రికలు చేర్చింది. తర్వాత బూతు పత్రికలు చేర్చింది. తర్వాత నాలుగు సైకిల్ రిక్షాలూ, సైకిలు షాపూ, సైకిలు రిక్షా గేరేజి పెట్టించింది.

ఈలోగా నరసుకీ, కనకయ్యకీ సివిలిజేషన్ అంటుకుంది. కనకయ్య చేతికి రాళ్ళ ఉంగరాలతో, గ్లాస్కో పంచ, సిల్కు చొక్కా కళ్ళద్దాలతో తాగుడు నేర్చుకుని, ఒక చవకబారు స్త్రీని చేరదీసి కంట్రాక్టులు మొదలు పెట్టేడు.

మొదట్లో నరసు చుట్టుపక్కల చోటా ఆఫీసర్లతో గోడమీద సరసం మాత్రం చెయ్యగలిగింది. కాని కనకయ్య మరో ఆడదాన్ని మరిగేడని తెలిసేక, ఇష్టం లేకపోయినప్పటికీ, కసికొద్దీ వొక హెడ్ కానిస్టేబులుకి లొంగిపోయింది. ఆ హెడ్ కానిస్టేబులు ఆమెచేత లైసెన్సు బ్రాందీషాపులు పెట్టించేడు. ఒక సిటీ సర్వీసు బస్సు కొనిపించేడు. ముండల కంపెనీలు పెట్టించేడు తను చచ్చేలోగా.

నరసు అన్ని వ్యాపారాలకీ మేనేజర్లు ఉన్నారు. అంచేత ఆమె ఏ వ్యాపారమూ స్వయంగా చూసుకోదు. ఒక్క కంపెనీలు తప్ప. ఆమెకు ప్రస్తుతం మూడుచోట్ల కంపెనీలు ఉన్నాయి. ఒకటి హైక్లాస్‌కీ, ఒకటి మిడిల్ క్లాస్‌కీ, మూడోది "లో" క్లాస్‌కీ. కంపెనీలో పనిచేసే అమ్మాయిలకి ఒక క్లాసు నుండి మరో క్లాసుకి ప్రమోషను లుంటాయి. వారి ఆరోగ్యం, ఆహారం నరసు బాధ్యతలు. వాళ్ళ ఆర్జన, ఖర్చులు రాయడానికి గుమాస్తాలున్నారు.

"కంపెనీల్లో పనిచెయ్యడానికి పిల్లలు ఎక్కడ దొరుకుతారు నీకు?" అని యెవరైనా అడిగితే "చీకటి పడేవరకూ ఆగు. ఎంతమంది మొగుళ్ళు పెళ్ళాలని తీసికొచ్చి అప్పగిస్తారో" అని నవ్వేస్తుంది ఆమె. అయినప్పటికీ ఆమెకు ముడిసరుకు కోర్టుల్లోనూ, ఆస్పత్రుల్లోనూ, రైల్వే స్టేషన్లలోనూ దొరుకుతుంది అంటారు కొంతమంది.

నరసుకి పిల్లల్ని కొనడంలో నమ్మకం లేదు. ఇది పువ్వుల బతుకు. రంగులున్నన్నాళ్ళే. అంచేత యిష్టపడి వచ్చినవాళ్ళనే ఆమె చేరదీస్తుంది. ఇంకెక్కడా దిక్కులేని వాళ్ళు కంపెనీల్లోనే ఉండిపోవచ్చు. సంసారాలు ఉన్నవాళ్ళు తీరిక సమయాల్లో ఇళ్ళకి వెళ్ళవచ్చు. ఆమె దగ్గర పనిచేసే అమ్మాయిలు ఎప్పుడుపడితే అప్పుడు ఆమెను వదలి వెళ్ళిపోవచ్చును. వాళ్ళ ఎకౌంట్లు అణా పైసలతో క్షణాలమీద సెటిల్‌చేసి ఎవరికి రావలసింది వాళ్ళకి ఇచ్చేస్తారు.

"నా దగ్గర పనిచేసే అమ్మాయిలు మరీ ముసలి వాళ్ళైపోతే ఇక్కడే నౌకర్లుగా ఉండిపోతారు" అంటుంది ఆమె సగర్వంగా. కాని ముసిలి అయ్యే వరకూ వాళ్ళల్లో చాలా మంది బతకరు.

ఆమె తన దగ్గరున్న అమ్మాయిల్ని వ్యక్తిగతంగా ఎంత దయతో చూస్తుందో, వ్యాపార విషయాల్లో అంత నిర్దయగా చూస్తుంది. అందరిచేత మనస్ఫూర్తిగా "అమ్మా" అని ఎంత ప్రేమగా పిలిపించుకుంటుందో, "ఈ వేళ యింకా ... నాలుగో రోజు..." అని ఎవరైనా సణుగుతే "నెలకి వారం రోజులు వల్లక తొంగుందుకి ఎవర్నేనా పెళ్లాడలేక పోయావ్?" అని అమానుషంగా నోరు మూయించగలదు.

ఆవిడ ప్రతి సాయంత్రం తన కంపెనీలకు స్వయంగా వెళుతుంది. పనిచేసే వాళ్ళందరిచేతా సాయంత్రం పళ్ళూ వళ్ళూ తోమించడం దగ్గర్నుండి ప్రతి పనీ స్వయంగా చూసుకుంటుంది. అవతలవాడు యెంతో గొప్పవాడయితే తప్ప, ఏ అమ్మాయినీ కంపెనీ ఆవరణదాటి బయటికి పంపదు.

ఆవిడ దగ్గరకు చెడిపోయినవాళ్ళూ, చెడిపోదల్చుకున్న వాళ్ళూ అన్ని వేళలా వస్తారు. వాళ్ళు ఒంటరిగానైనా వస్తారు. ఏ రిక్షావాడో, టాక్సీవాడో సహాయంతోనైనా వస్తారు.

మొగాళ్ళు తన కంపెనీలకి రాకపోతే తప్ప, ఆవిడకి ప్రపంచంలో యింక ఏ యితర విషయం ఆశ్చర్యం కలిగించదు.

అంచేత అంత రాత్రివేళ రాజమ్మ రాక ఆవిడకు ఆశ్చర్యం కలిగించలేదు.

# 90

సముద్రపు ఒడ్డున ఇసుకలో వెల్లకిలా పడుకున్నాడు జే.జే.

అస్తమిస్తున్న సూర్యకాంతిలో సముద్రం, మండుతున్న పెట్రోలు సముద్రంలా వుంది. ఆ మంటల నాలికల్లా ఉన్నాయి దాని కెరటాలు.

ఆ మంటలకి కాలి బొగ్గు అయిపోయిన శవాల్లా ఉన్నారు. తెప్పల మీద తేలుతున్న నల్ల జాలరివాళ్ళు.

జనసమూహానికి ఎంతో దూరంగా పడుకున్నాడు జే.జే.

తన బ్రతుకు నడిసముద్రంలో కాగితం పడవ. ఏ క్షణాన్నైనా మునిగిపోవచ్చు. ఈదురు గాలిలో గమ్యం లేకుండా కొట్టుకు పోవడంకన్న మునిగిపోవడం మేలు. తన దేశానికి దూరమై – గంజాయి మత్తులో, తన దేవుడికి దూరమై–సారా నిషాలో తన పాపానికి ప్రతిరూపాల్లా తనను చుట్టుకునే యీ అరచేతుల మెత్తదనంతో ఎన్నాళ్ళీ విషపు బ్రతుకు!

క్షణం మత్తు వదిలితే మనసు ముళ్ళమీద పడిన రబ్బరు బంతిలా అయి తనకి పిచ్చెత్తి పోతుందేమో అనిపిస్తుంది.

ఒక్కొక్కప్పుడు....ఆడ గుండెల్లో ఆడుకుంటున్నప్పుడు స్వామీజీ మెరిసే పాదాలు గుర్తుకొచ్చి.....తను కొనుక్కున్న ఆనందం పొందలేక, వదల్లేక...తన చుట్టూ ఇనుప ఈటెల కటకటాలు పెరిగీ....తనను చుట్టే ఆడ చెయ్యి ఉంగరంలో రాయి తన పాపాల పాము తలమీద మణిలా మెరిసి నప్పుడు ....తన పక్కనున్న ఆడదాని పీక నులిపేద్దామన్న కోరిక ఎన్నాళ్ళో జయించలేదన్న ఆధైర్యంతో ఎన్నాళ్ళీ పిచ్చి బ్రతుకు?

పక్కనున్న యిసుకని గుట్టగా చేసేడు జే.జే.

ఇప్పుడు మార్గరెట్ వచ్చి తన పక్క నిలబడితే! తన తమ్ముడూ, రిచర్డూ, డబ్బూ, డాలర్లూ, స్వామీజీలూలేని ఏ కొండ గుహలోకో పారిపోయి ఆమెతో శేష జీవితం గడిపేస్తే? కోరికల గుర్రాలకి కళ్ళేలు బిగించేడు అతను.

చుట్టూ చీకట్లు–గరళపు పొరల్లా మీద పడుతున్నాయి.

రిచర్డు ఊరునుంచి ఎప్పుడొస్తాడో?

నిన్న వచ్చిన పిల్ల కంటె పసిపిల్ల నయం!

డ్రైవర్ థాంప్సన్ రోజుకో అమ్మాయిని తెస్తున్నాడు.

"ఫర్ ఎ ఛేంజ్, చవకబారు ఆడవాళ్లని ట్రైచెయ్యి" అన్న రిచర్డు సలహా పూర్తిగా తప్పుకాదు.

(దీజ్ ఆన్ యిన్‌హిబిటెడ్ బిచెస్ నో ది ట్రిక్స్!)

సరుకులు తెలుసు వాళ్ళకి. వాళ్ళలో మొగాడికి కావలసిన పశుత్వం ఉంది.

రోజుకొకర్ని మార్చేస్తేనే బాగుంది. ఎవరి స్నేహం ఒక రోజు దాటి భరించే స్థితిలో లేడు తను. సాయంత్రం తాగిన 'రమ్' యింకా దిగలేదు.

నిన్నరాత్రి పిల్లలాంటి చిన్నపిల్లల్ని తీసుకురావద్దని థాంప్సన్‌తో చెప్పి ఉండాల్సింది. తనకి నాలుగు పదులు వెళ్ళి పోయాయి. రాత్రి పిల్ల బెదురు కళ్ళు తననింకా వేటాడుతూనే ఉన్నాయి. ఆ కళ్ళలో భయం–ఆ గుండెల్లో రూపాయల ఆశ–కోరిక విప్పని శరీరం–భాషరాని మొగాడితో కేవలం సెక్స్ సంజ్ఞల సంభాషణ–ఆ పిల్లని తాకాలనిపించలేదు. జేబులోంచి చేతికి వచ్చిన నోట్లుతీసి ఆమె చేతిలో పెట్టి పిడికిలి మూసేసేడు తను. విప్పిన రవిక తీసుకోకుండా ఆ పిల్ల పాదాలకు చుట్టు కుంది. ఆమె కన్నీళ్ళు అతని కాలికున్న జోళ్ళమీద చారికలు కట్టేయి.

"నన్ను తీసుకో" అన్నట్టు లేచి నిలబడి చీర కుచ్చిళ్ళు విప్ప బోయిన ఆమెను అడ్డుకున్నాడు. నోట్లు లాక్కుంటాడేమోనన్న ఆమె భయం–పాపం ఆ పిల్లకి జబ్బు పిల్లడో, తాగుబోతు తండ్రో ఎవరున్నారో–భగవాన్! ఇంత దరిద్రపు పరిస్థితులు ఏ దేశంలోనూ ఉండకూడదు. నువ్వొద్దన్నాడు. అయిష్టంగానే నోట్లు తిరిగి ఇవ్వబోయింది. పావలా ఆడదాని, వాణిజ్యపు నీతి–తను పుచ్చుకోలేదు. కుర్చీకింద పడిన జాకెట్ తీసి ఆమెకు తొడిగేడు. నుదుటిమీద ముద్దు పెట్టుకొని చీకట్లో వదిలి గేటు వేసేసేడు. నాలుగడుగులు నడిచి మళ్ళీ రమ్మంటాడేమోనని తిరిగి చూసింది. చెయ్యి ముద్దు పెట్టుకొని ముద్దుని గాలిలోకి వదిలేడు. నోట్లు చేత్తో కళ్ళు తుడుచుకొని నిలబడిపోయింది. తను పరిగెత్తికెళ్ళి పక్కకు లాగకపోతే లారీకిందపడి రక్తంతో తడిసి ఉండేది. భయంతో తన చెయ్యి పట్టుకుంది.

పోనీ ఈమెను పెంచుకుంటే!

చెయ్యి విదిలించుకున్నాడు.

ఈ జన్మలో ఆడదాని మొహం రెండురోజులు చూడదల్చు కోలేదు! పాము కాటుకి పాము విషాన్నే ఉపయోగించవచ్చు. కాని ఒకే పాము గరళం ఉపయోగించ నక్కర్లేదు.

ఈ రాత్రి ఎవరొస్తారో? గంజాయితాగి రెండు రోజులయింది.

పాపం మార్గరెట్!

మార్గరెట్ దెయ్యమై తనవేపు వస్తున్నట్టు చూసేడు...చీకట్లో తన వేపు వస్తున్న మనిషివేపు.

ఆ వ్యక్తి ఇక్కడ సంభవమా?

జిన్‌లో కలిపిన సోడా బుడగలు తన మెదడులో ఒక్కటొక్కటే బద్ధలౌతున్నాయి.?

ఆ వ్యక్తి దగ్గరకొచ్చి నిల్చున్నాడు.

బీచ్‌రోడ్డు ట్యూబ్‌లైట్లు గుప్పుమని వెలిగేయి.

"స్వామీ?" పాపం చేస్తూ దేవుడికి దొరికిపోయిన వాడిలా లేచి నిలబడ్డాడు జే.జే.

స్వామి అతని భుజంమీద ఆప్యాయంగా చెయ్యి వేసేరు.

తన ఊపిరి సారా వాసనకి జే.జే. సిగ్గుపడ్డాడు. తన కాళ్ళ దగ్గరున్న విస్కీఫ్లాస్క్ స్వామికి కనిపించకుండా నిల్చున్నాడు అతను.

"రేపు ఆశ్రమానికి వచ్చెయ్" అతి శాంతంగా అన్నారు స్వామి.

"నేనా?"

"నువ్వే" అన్నట్టు చూసేరు స్వామి.

"రాలేను" దేవుడితో అబద్ధం ఆడదల్చుకోలేదు.

"ఫర్వాలేదు."

"మీకు తెలియదు."

"నాకు తెలుసు."

తన పాపాల పాడుజాబితా స్వామి దగ్గర ఉండే ఉంటుంది. అందించిన చెయ్యి కాదని క్షణికోద్రేకాల సుళ్ళలో ఆపుకోలేని అసహాయతతో గిర్రున తిరిగే తనకు మళ్ళీ మళ్ళీ అదే చెయ్యి అందిస్తే–ఆతృతగా పట్టుకునేటంతటి నీచుడుకాడు తను. ఈ పాపాల పాలకుడికి విషపు లోతులకు కూరుకుపోయినా, తనకి ఆత్మాభిమానం పోయినా–సిగ్గుమాత్రం పోలేదు.

"రేపురా, అన్నీ చక్కబడతాయి." అని తెగేవరకూ లాగడం ఇష్టంలేని స్వామి చీకట్లోకి నడిచి మాయమైపోయేరు.

ఔను.

రేపటికి అన్నీ చక్కబడతాయి.

ఈ కాళరాత్రి అంతమై రేపటి గులాబీ వెలుగులో తన పాపాల పుస్తకం ఆఖరి పేజీ చిరిగిపోతుంది. ఈ ఒక్కరాత్రి మాత్రం యాతన....మరణవేదన తను అనుభవించాలి. ఇప్పటి సజీవ సమాధి బ్రతుకుకంటే ఈ రాత్రి పడవలసిన బాధ ఏమంత దుర్భరమయినది కాదు. ఒక్కరాత్రి – ఒక్క క్షణం...అంతా శాంతి, రేపు గులాబీ ఆకాశంలో చమ్కీ నక్షత్రాలు తనకోసమే మెరుస్తాయి. రేపు కదిలే ప్రతిచెట్టూ తనకే పువ్వుల పూజ చేస్తుంది.

ఫ్లాస్కు విప్పి రెండు గుక్కలు తాగేడు జే.జే. గొంతుక మండింది. ఒక మంట చల్లబడాలంటే అంతకంటే పెద్దమంట – మరినాలుగు గుక్కలు సారా పరిగిడుతున్న నరాల మత్తు. అడుగులు యిసకలో పడుతున్నాయి. ఆ రాత్రి గడిచిపోతే–తను పూజించే దేవుడి దగ్గరకు తాను....తూలుతూ ఇల్లు చేరేడు.

ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. సర్వెంట్సు అందరూ వెళ్ళి పోయుంటారు.

డ్రైవరు ఘడియో, క్షణమో రావాలి. అంతవరకూ ఈ ఆఖరు పాడు రాత్రి–మూత తీసిన బ్రాందీసీసా ఆవిరిలోంచి అందాల బొమ్మ. రేపు తను తాగడు. అంచేత ఈ ఒక్కరాత్రీ...మనస్సులో బ్రాందీ ఆవిరి ఊదొత్తుల పారిజాత పరిమళాల ఆడదాని వాసన.

గేటులోంచి కారు వచ్చిన చప్పుడు...ఆడదాని తేలిక పాదాల సవ్వడి–టైమెంత? పన్నెండా? ఏమో? నిద్రకీ, జాగ్రదవస్థకీ చావుకీ, బతుక్కీ అందకుండా ఉన్న తనకు ఎంత టైమైతేనేం?

తలుపుకొట్టిన చప్పుడు....

తను రమ్మనలేదు.

చీలిన తలుపులు....తలుపు ఖాళీలోంచి, పూకేసరాల్లాంటి వేళ్ళు.

తన మనస్సులో నిశ్చయం బిగుసుకు పోతున్నది.

మెత్తగా కదిలే తలుపు అవతల పాపాల అందం అంతా కలిసి చేసిన ఆడది–స్వర్గంనుండి నరకానికీ, నరకంనుండి స్వర్గానికీ తీసుకువెళ్ళగల స్త్రీ.

తన నిర్ణయం ఇనుము అయింది.

గదిలో కుడికాలు పెట్టింది రాజమ్మ.

చీర నల్లటి అంచుకింద వింత పళ్ళలాంటి పాదాల వేళ్ళు – చీరలో మెరిసే బంగారు తొడ – గదిలో వెన్నెల వాన – మనసులో పువ్వుల గల గలలు.

లోపలికి వచ్చింది రాజమ్మ.

క్షణం–కదలలేదు జే.జే.

తప్పుచేస్తూ కొడుక్కి దొరికిపోయిన దానిలా రాజమ్మ కళ్ళు వాలిపోయేయి.

జే.జే. లేచి రాజమ్మ వేపు నడిచేడు. చర్మంలేని మాంసం ముద్దలా ఉంది అతని మొహం.

వెయ్యికాళ్ళ పాము తనవేపు వస్తున్నట్టు వణికిపోయింది రాజమ్మ.

అతను ఆమె భుజంమీద చెయ్యి వేసేడు.

అతని సారా ఊపిరికి ఆమె తల తిరిగింది.

ఆమెను కుర్చీలో కూర్చోపెట్టి టేబులు దగ్గరకు వెళ్ళి దాని అరలు తెరిచేడు.

పచ్చడాలర్లూ-ట్రాన్సిస్టర్లూ-కెమేరా-పెన్నులూ-గరగరలాడే రూపాయల నోట్లూ-అన్నీ తీసుకొచ్చి రాజమ్మ ఒళ్ళో పడేసేడు జే.జే.

ఏం చెయ్యాలో తెలియని రాజమ్మ నిలబడలేకపోయింది. అతనే ఆమె భుజాలు పట్టుకొని లేవదీసి గేటుదాకా నడిపించి ఆమె గేటు దాటేక గేటు వేసేడు.

రెండడుగులు ముందుకువేసి వెనక్కు తిరిగింది రాజమ్మ. రాని నవ్వుతో 'నమస్తే' అని, వెనక్కి తిరిగి లోపలికి వెళ్లిపోయేడు జే.జే.

# 91

తాగి తందనాలాడి ఎక్కడో పడుకొని నిద్రలేచి తెలతెల వారుతుండగా ఇంటికి చేరిన సింహాచలానికి పిల్లడి పక్కలో నిద్రపోతున్న బొమ్మలా రాజమ్మ కనిపించింది. అప్పటికప్పుడే నిద్రలేచిన కోడిపుంజు ఇంటి పక్కనున్న పెంట కుప్పని పురుగుల కోసం కాళ్ళతో కెలుకుతోంది. మాంసపు ముద్దనే కిరీటంగా పెట్టుకొని అందుకు సంతోషిస్తున్నట్టు ఆ పుంజు ఆ కిరీటాన్ని అటూ ఇటూ కదుపుతోంది.

చలివల్లా, జబ్బువల్లా కదలలేని కుష్టుకుక్క రొమ్ముని దాని పిల్లలు పీక్కు తింటున్నాయి.

నిన్న రాత్రి "కోరినముక్క" ఆటలో గెలిచిన డబ్బులో మిగిలిన అర్ధరూపాయి యింకా సింహాచలం జేబులో ఉంది. అతను రాత్రి కావలసినంతసేపు పేకాట ఆడగలిగాడు. కావలసినంత తాగగలిగేడు. అంచేత అతనికి యీ ఉదయం రాజమ్మ మీదా, పిల్లడి మీదా అపారమైన ప్రేమా, దేవుఁడిమీద కావలసినంత భక్తి కలిగేయి.

"తొంగున్న తల్లిని లెగ్గొట్టడం పాపం" అనుకున్నాడు అతను. "ఇది నెగిసేలోపల టీ తాగి రావొచ్చు' అనుకుని బయల్దేరిన అతను చాలా సేపు తిరిగి రాలేదు.

నిద్రపోతున్న రాజమ్మకు కలలో దెయ్యం తన కొమ్ము చేతుల్తో పీక పిసికినట్టయి పెద్దకేకవేసి కళ్ళు విప్పింది. అకస్మాత్తుగా విడిన వింత పువ్వుల్లా వున్న ఆమె కళ్ళు ఎర్రబారి వెంటనే మూసుకుపోయేయి.

తన మెత్తని గుండెలమీద గోళ్ళు గుచ్చుతూ నిలబడిన ఆ వెర్రి మృగం ఏమిటి? ఇది కలకాదు. సుమారు ఎనిమిది గంటల పొద్దులో-తెల్లకోరల మధ్య రక్తం త్రాగిన పిశాచం నాలికలా వేలాడుతున్న నాలిక అబద్ధం కాదు. ఆ కోరల వెనక కసిగా, క్రూరంగా సగం మూసుకున్న ఆ వెర్రి కళ్ళు అసత్యం కావు. తన గుండెలో క్షణం క్షణం లోతుగా గుచ్చుకుంటున్న ఇనపగోళ్ళు మోసం చెయ్యని నిజం. ఆ మృగం ఒగురుస్తూ తన మొహంమీద చల్లని విషంలా కారుస్తున్న దొంగ తనని దగా చెయ్యటం లేదు. ఆ జంతువు శ్వాస అలిసిపోయిన ముసలి పాము బుసలా జోరుగా భయంకరంగా ఉంది.

తను కళ్ళువిప్పిన తృటికాలంలో మంచంచుట్టూ వున్న తోలు ముఖాల మనుషులు ఎవరు? యమదూతలా? తను చచ్చిపోయిందా? తనని గుండెల మీద కాలుపెట్టి కుమ్ముతున్న పశువు యముని ఎనుపోతా? భగవాన్ ఏఁవిఁటీ పీడకల?

"లెగు లంజా" తన గుండెలమీద వున్న వింత జంతువు భయంకరంగా పిలిచింది.

మళ్ళీ ఆ దయ్యం మృగాన్ని చూసే ధైర్యం లేకా, దాన్ని తప్పించుకునే శక్తిలేకా ఇంకా గట్టిగా కళ్ళు మూసుకుంది రాజమ్మ.

"ఆపద్బాంధవా! అనాథరక్షకా, ఏమిటీ ఎంతకీ ముగియని వింత పరీక్ష. నీక్కావాలంటే ఒక్కసారి యీ వెర్రిగొడ్డుచేత నా పీక కొరికించి చంపీ. అంతేకాని మింగక, వదలకవున్న ఈ కొండ చిలువ చుట్టలోంచి నన్ను రక్షించు మహాప్రభో...."

పక్కలో ఇనుప యీటె గుచ్చుకున్నట్టయి అప్రయత్నంగా కళ్ళు తెరిచింది రాజమ్మ. తన చుట్టూ ఎంతో మంది తోలు బెల్టులూ, తోలు గుడ్డలూ తొడుక్కొని తోలు ముఖాల మనుషులు నిలబడి వున్నారు. ఒక్క నల్లని ఇనుపజోడు ఆమెని పక్కలో తన్నింది.

"రేతిరల్లా రంకు మొగుళ్ళ దగ్గర తొంగున్నది చాలదేటి? లెగు లెగు" కొవ్వు కరగని మొహం మనిషి ఎవరో అరిచేడు. ఇంకెవరో ఆమెని బలవంతాన మంచం మీంచి లాగి నిలబెట్టేరు.

అంతవరకూ ఆమె మీద ఎక్కిన కుక్క మరో కుక్కతో కలిసి గుడిసె అంతా తిరుగుతోంది.

అప్పటికి రాజమ్మకి పరిస్థితి అర్థమైంది. తన చుట్టూ ఉన్నది పోలీసులు.

పోలీసు కుక్క గుడిసెలో బోర్లించి ఉన్న బుట్టని కాళ్ళతో తిరగేసింది.

బుట్టకింద పచ్చదాలర్లు–కెమేరా–ట్రాన్సిస్టరు–పార్కరు పెన్ను....కరకరలాడే రూపాయలనోట్లు.

"హమ్మ ముండా, ఎంత దయిర్యవేఁ! సొమ్మంతా పక్కలోనే ఎట్టుకున్నావ్ కదే!"

"ఏటి బాబూ నువ్వంటున్నది?"

"ఏట్లేదులే నంగనాచీ, మావాడు దొంగతనంచేసి సొమ్ము నీ బుట్టకింద దాచినాడు అంటున్నాను, అంతే."

"అది దొంగ సొమ్ము కాదు." మాటలు పెగలని కంఠంతో గొణిగింది రాజమ్మ.

"అది దొంగ సొమ్మూకాదు. నాను పోలీసోణ్నీ కాను. ఇది కలికాలవూఁకాదు. పదమ్మా" లాఠీతో వీపుమీద పొడచేడు ఒక పోలీసు కవి.

తుళ్ళిన రాజమ్మ ఎదుటి పోలీసుని పట్టుకుని నిలబడ గలిగింది.

"పరగడుపున ఏటీ ఈ పరాశికం." అంటూ అతను ఆమెను వెనక్కి తోసేడు! వెనక్కి పడిపోయిన ఆమె తలజుమ్మంది. కళ్ళు చీకట్లు కమ్మేయి.

"అమ్మా!" గొంతుక చిరిగిపోయేలా ఏడ్చేడు రాజమ్మ కొడుకు.

చచ్చిపోయిన పిల్లడు సమాధిలో ఏడిచినట్లు అతని ఏడుపు అతి నీరసంగా వినిపించింది. మూతపడిన కళ్ళు బరువెక్కి ఆమె విప్పడానికి ప్రయత్నిస్తే రెప్పల చివర పొడుగాటి వెంట్రుకలు మాత్రం కదిలేయి. బాధ ఆమె నుదిటిమీద లేత గీతల్ని లోతు చేసింది.

"ఈ లంజ ఏసాలు, లాకప్పులో ఏద్దువుగాని నడు నడు."

ఈలోగా ఎవరో పోలీసు ఆఫీసర్లు గుడిసెలోకి వచ్చేరు, "మనిషి దొరికిందా" అంటూ.

"మనిషీ దొరికింది, మాలూ దొరికింది" ఒక సాయిబు హేడ్డు జవాబు చెప్పేడు.

"కంగ్రాచ్యులేషన్స్ రాజా. కంగ్రాట్స్ రాణీ" అని ఆఫీసర్లు పోలీసు కుక్కల్ని బుజ్జగించేరు.

"నేనే పట్టుకున్నాను" అంటున్నట్టు రాజా రాజమ్మ చీర పట్టుకుంది.

"గుడ్‌బాయ్" అన్నాడు ఆఫీసరు.

ఒక ఆఫీసరు దొరికిన వస్తువులన్నీ పరీక్షచేసి "ఇలాంటి ముండల వల్లే అంతర్జాతీయ మైత్రి దెబ్బతింటుంది" అని ఇంగ్లీషులో అనడంవల్ల రాజమ్మకి తన ప్రాముఖ్యత అర్థం కాలేదు.

"పదండి. పంచనామా స్టేషనులో రాసుకుందాం."

పోలీసులు రాజమ్మని గుడిసె బైటకు మూగిన గూడెం వాళ్ళు కళ్ళతో రాజమ్మ బట్టలు విప్పేసేరు.

"హమ్మముండ ఎంత పన్జేసింది."

"పీక్కోసీసిందట."

"మామూలోడిది కాదు."

"దొరది."

"పీక్కోసీసింది సాలక సామానంతా ఎత్తుకొచ్చీసి నాదట."

"ఎత్తుకొచ్చి గుడిసెలోనే దాసిందట. ఏం దయిర్యం.!"

"ఇలాంటి ముండ యింట్లో ఉంటే ఈదీ, ఈదులోకొస్తే ఊరూ సెడిపోతాయి."

"మళ్ళీ అలాటిలాటోడ్ని కట్టుకుందా? రాములోరుకదూ మన సివంచలం అంటే?"

పదిమంది మొగాళ్ళమధ్య తన చీర తన చేతుల్లోనే విప్పుకోవలసి వచ్చినట్టు బాధపడింది రాజమ్మ. కాని భయంవల్లో మరెంచేతోగాని ఆమెకు ఏడుపు రాలేదు.

"పోలీసోళ్ళు కరిగిస్తార్లే దీని కొవ్వు."

"ఎర్రి కుక్కని బాదినట్టు బాదుతారులే."

రాజమ్మ చేతులకి బేడీలు వేసేరు. "నడు జీపుకాడికి" అన్నాడు పక్కనున్న పోలీసు.

అడుగడుగునా భూమిలోకి కూరుకుపోవాలని ప్రార్థిస్తూ రాజమ్మ సత్తు అడుగులు భారంగా వేసింది.

"వగలొలక పొయ్యడానికి యిక్కడెవరూ దొరలులేరు. అడుగు బేగెయ్యి."

వెన్నంటుతున్న మాటల ఈటెలు రాజమ్మని తరిమేయి. ఆమె అడుగు జోరుచేసింది.

"అమ్మా, ఒలే" ఏం చెయ్యాలో తెలియని అమాయకపు కొడుకు నోట్లోకి కారిన కన్నీటిని ఉమ్మి-పిలిచేడు.

రాజమ్మ కడుపులో తల్లిపేగు కదిలింది. ఆమె రొమ్ములు మళ్ళీ పాలుపట్టినట్టు చల్లబడ్డాయి. "నన్ను కాకపోతే ఆ పిల్ల డినేనా సంపీ బాబూ ఒక తల్లి ప్రార్థించ గలిగినంత పవిత్రంగా గాఢంగా ప్రార్థించింది.

ఆ ఉదయం దేవుడు నిద్ర లేవలేదు.

"బాబూ" ఎత్తినకాలు దించకుండా వెనక్కి చూసింది రాజమ్మ.

ఆమె నీరసం కంటికి తన కొడుకు-ఎంతో దూరంగా అర్భకంగా విరిగిన బొమ్మలా కనిపించేడు.

"ఇక్కడేటి సినిమా తీస్తున్నారనుకున్నావేటి? ప్రొద్దుట్లేచి యింకా మొహాలు కడుగలేదు, మాఁవుఁనద్దుడు."

నడిచింది రాజమ్మ. నడిచి దూరంగా ఆగిన వ్యాన్‌లో తన శరీరాన్ని కుదపడేసింది. కదుల్తున్న వ్యాన్‌లోంచి పరుగెతు _కొస్తున్న తన కొడుకు కనిపించేడు ఆమెకు. ఇదే ఆఖరి సూపా బాబూ!' దేముడ్ని అడిగిందామె.

ఆమెను ఆ ఉదయం లాకప్పులో ఉంచేరు పోలీసులు.

ప్రొద్దున్న పది అయినా లాకప్పునేల చావులా చల్లగా ఉంది. దాని కటకటాల తలుపుల ఇనుప గజాలు మంచులా ఇంకా చల్లగా ఉన్నాయి. దాని రాతిగోడలు దొలచిన గుహ గోడల్లా ఉన్నాయి.

లాకప్పులో ఉన్న రాజమ్మకి ఏం జరుగుతున్నదో తెలియడం లేదు. అంతవరకూ జరిగినది పీడకలలా అని పించింది. తన నమ్మకం పరీక్షించడానికేమో వున్నట్టు ఆమె తలుపు ఇనుప గజం పట్టుకుంది. అది చురుక్కు మన్నంత చల్లగా ఉండి - ఆమె వెంటనే వదిలేసింది.

తన నెందుకు జైల్లో పెట్టినట్లు? అడవిలో పాము కరిచిన వాడు యెవర్ని ప్రశ్నించగలడు? తన చుట్టూ ఉన్న మనుషులు మనుషులు కారు. వన్యమృగాలు. తాను ఉన్నది జైలుకాదు, కొండగుహ. తను ఉన్నది ఊరు కాదు, అడవి.

ప్రక్కగదిలో బెల్టుతో ఎవరో యెవర్నో నాలుగుసార్లు కొట్టిన చప్పుడు.

"నీ ప్రాణాలు ఇప్పుడే తీసేస్తాను."

సమాధానంగా-ఒక లేతగొంతు ఏడవలేక పోతున్నది.

రాజమ్మ కాళ్ళు కొవ్వుతో చేసినట్లు మెత్తపడి ఆమె బరువును ఆపలేకపోతున్నాయి. ఆ పిల్లడి తర్వాత నన్ను కూడా అలాగే కొడతారా? అన్నది ఆమె భయంకాదు. లేతగొంతు కుఱ్ఱాడు దెబ్బలు తిని తిని ఏడవ లేక చచ్చిపోతాడేమో నన్నదే ఆమె భయం.

అంతవరకూ దించినతల యెత్తింది. ఆమె ఆవరణలో చెట్టుకింద తన కొడుకు ముణుకులమీద తల పెట్టుకొని ఏడుస్తూ కనిపించేడు. దట్టమైన చెట్ల ఆకుల్లోంచి అక్కడా అక్కడా దూరిన ఎండ పచ్చగా మచ్చల్లా ఆ పిల్లడి మీదపడి తల్లిలేని ఒక్క పూట లోనూ అతనికి చర్మవ్యాధి ముంచేసినట్టు కనిపింపచేస్తున్నది.

పిల్లడ్ని రమ్మని చేత్తో సైగచేసింది రాజమ్మ. ముణుకుల మీద తల పెట్టుకున్న అతను ఆమె సైగ చూడలేదు.

"బాబూ దాహం, మంచినీళ్ళు" బెల్టు దెబ్బల చప్పుడు మధ్య పక్క గది పిల్లడు. "ఇది మానవ కంఠమా? మృగం అరుపా?" అని సందేహం వచ్చేటంత పిడచకట్టుకు పోయిన గొంతుకతో ప్రార్థించేడు.

తన గుండెల్లో పాలు ఉంటే వెంటనే ఆ అబ్బాయికిచ్చి "నా పాపాలు కడుక్కునీదాన్ని" అనుకుంది రాజమ్మ.

పక్కగదిలో దెబ్బలు ఆగిపోయేయి. ఇంత చలిలోనూ చెమటకి తడిసిన బనియనుతో ఒక కాకీ నిక్కరు వ్యక్తి గదిలోంచి బైటపడ్డాడు. గదిలో కుఱ్ఱాడు వేసంగిలో కుక్కలా 'దాహం' అంటూ వాపోతున్నాడు. రాజమ్మకి తన కడుపులో తడి అంతా ఒక్కసారి ఎండిపోయినట్టు ఐంది.

తడిసిన బనియన్ వాడు చెట్టుకిందవున్న రాజమ్మ కొడుకు దగ్గరకు వెళ్ళి కుడిచేత్తో అతని తల యెత్తి ఎడంచేత్తో అతని చెంపమీద కొట్టేడు. లాకప్పు పునాదులు కదిలిపోయేలా తలుపు గజాలు పట్టుకుని గుంజింది రాజమ్మ.

"ఏటా కాఁవఁరం. రేత్తిరికి నాట్ నాట్ సెవెన్ గోదు నీ మదం కరిగిస్తాదులే. వల్లకుండు" ఒక పోలీసు సలహా ఇచ్చేడు.

తడిసిన బనియన్ వాడు రాజమ్మ కొడుకుని రోడ్డుమీదికి జుత్తు పటుకొని ఈడ్చుకుపోయేడు.

ఈనలేని పులిలా రాజమ్మ లాకప్పులో అటూ యిటూ తిరిగింది.

# 92

ఆ రాత్రే ఆమెను ఊరి చివర దెయ్యాల మేడలోకి మార్చేరు పోలీసులు. ఆమె "దొర"ని ఎందుకు చంపిందో చెప్పమన్నారు. చంపేవా, లేదా అన్న మాటే అడగలేదు. అతన్ని ఆమె కేవలం డబ్బుకోసం చంపలేదన్నారు. ఆ తర్వాత అతన్ని చంపమని ఆమెను ఎవరు ప్రోత్సహించేరో చెప్పమన్నారు. బుజ్జగించేరు, కవ్వించేరు, లాలించేరు, తన్నేరు, బాదేరు, చివరికి చిత్రహింస పెట్టేరు.

ఆమెను ఆ రాత్రీ, ఆ తర్వాత కొన్నాళ్ళూ పోలీసులు పెట్టిన అన్ని బాధల గురించీ వివరంగా అసహ్యంగా రాసి మృదువైన మనసులు ఉన్న పాఠక మహాశయులని బాధించడం ఈ చరిత్రకారిణి అభిమతం కాదు.

ఆమెను పట్టుకున్న ఆరోనాడు ఆమెకు మంచినీళ్ళూ, తిండీ ఇవ్వడం మానేసేరు. ఏడోనాడు కూడా మానేసేరు.

తన కన్నీళ్ళైనా తాగి దాహం తీర్చుకుందామంటే ఆమె కళ్ళు మండుతున్న బొగ్గుల్లా ఉన్నాయి. ఆమె గుండెల్లో నిప్పు రగులుకుంటున్నట్టుంది. ఆమె కళ్ళు వేడికి ఏ క్షణాన్నైనా పేలిపోయే గాజు గుడ్డలా ఉన్నాయి. ఆమె బతికుండగానే తల ఒక్కటే కాలుస్తున్నట్టుంది.

రాత్రి అయింది. అంతవరకూ కాపలా ఉన్న గార్డు వెళ్ళి కొత్తాయన వచ్చేడు.

"బాబూ.....మంచినీళ్ళు .....గ్లాసుడు యివ్వండి. మీక్కా వలసింది ఒప్పేసుకుంటా."

కొత్తవాడు దయామయుడు.

"ఏటే! నీకు నీళ్లు యివ్వలేదూ రాజమ్మా! వణ్ణం కూడా ఎట్టనేదా? ఛీ! ఛీ! మా పోలీసోళ్ళకి ఎలాటి ఎదవ బతుకులు వస్తాయో? ఈ దిక్కుమాలిన కొంపలో నీళ్ళులేవు. నువ్వేం అనుకోకపోతే సారా ఉంది. తాగు. పలావు ఉంది, తిను."

రాజమ్మ సారా కాదుకదా, మరిగించిన సీసం, మండుతున్న లావాఅయినా సరే తాగేసే స్థితిలో ఉంది. అతను ఇచ్చిన సారా కడుపునిండా తాగింది. పలావు తిన్నాది. ఈలోగా "దయా మయుడు" వెళ్ళి పాత 'దగుల్బాజీ' వచ్చేడు.

రాజమ్మకి సారామత్తు కళ్ళకి ఎక్కింది. అన్నం మత్తు నెత్తికి ఎక్కింది.

సగం నిద్దర్లో చెయ్యి కదుక్కుంటున్న రాజమ్మ చెయ్యి అతను పట్టుకున్నాడు. తూలిపోతున్న రాజమ్మని తనని ఖూనీ చెయ్య డానికి ప్రోత్సహించిన వాళ్ళెవరో చెప్పేవరకూ నిద్రపోనివ్వనని తెల్లవార్లూ ఏడిపించేడు. అధమం ఎందుకు చంపిందో చెప్ప మన్నాడు. కనీసం చంపేనని ఒప్పుకోమన్నాడు.

కూరుకుపోతున్న కళ్ళతో, కూలిపోతున్న కాళ్ళతో బూతులు తిడుతూ కొంతసేపూ, చైతన్యం లేకుండా కొంతసేపూ రాజమ్మ నడిచింది.

ఆ దెయ్యాలమేడ చీకటి గదిలో ఎన్నాళ్ళుందో రాజమ్మకి తెలీదు.

# 93

చీకటి మేడలోంచి రాజమ్మను పోలీసువాళ్ళు ఎవరో అధి కారి దగ్గరికి తీసుకువెళ్ళేరు. అక్కడ ఆ అధికారి ఎవరో పది మంది నీతిపోయి, జాతిలేని ఆడవాళ్ళని తెప్పించి ఒక వరసలో నిలబెట్టేడు. తర్వాత రాజమ్మని తన ఇష్టం వచ్చినచోట వాళ్ళ మధ్య నిలబడమన్నాడు. సిగ్గు రాజమ్మని వాళ్ళ చివరికి నడి పించింది.

ఆ తర్వాత ఆ అధికారి దగ్గరికి రిక్షా తొక్కలేని ఒక రిక్షావాడు వచ్చేడు. వరసలో నిల్చున్న అందరు ఆడవాళ్ళలో చివరనున్న రాజమ్మని వేలుతో చూపించేడు. అతని తర్వాత నరుసు, మరో ముగ్గురు ఒకరితరవాత ఒకరు రాజమ్మని చూపించేరు.

ఇది జరిగిన తర్వాత రాజమ్మని ఒక కొత్త జైల్లో పెట్టేరు.

ఈ జైల్లో రాజమ్మ బాధ జాస్తీ అయింది.. అంతవరకూ చీకటి మేడలో పాడుగదిలో తన దుర్దశతోపాటు ఒంటరితనమే ఆవిడ అనుభవించింది. కాని యీ జైల్లో తనని మనుషులు కాని మనుషుల మధ్యకి తోసినట్టు అయింది.

ఇక్కడ ఖైదీలు ఊళ్ళలో కాకుండా అడవుల్లో పెరిగిన మనుషుల్లా ఉన్నారు.

వాళ్ళ మాటలు పలుకులు నేర్చిన పశువుల కబుర్లలా ఉన్నాయి.

వాళ్ళ ఏడుపులు శరీరాల్లేని ఆత్మల ఆక్రందనల్లా ఉన్నాయి.

వాళ్ల నవ్వులు పిశాచాల పరాశికాల్లా, వాళ్ళ ఏడుపులకంటే భయంకరంగా ఉన్నాయి.

వాళ్ళ ఆటలు బంతిలేని దెయ్యం పిల్లల ఆటల్లా ఉన్నాయి.

అంతవరకూ రాజమ్మ తన భర్త గురించిగాని, బిడ్డ గురించి గాని ఎవరినీ అడగలేకపోయింది. తనని పోలీసులు తీసుకెళ్ళే నాటికి తన ఇంట్లో చీమలు తీసికెళ్ళ గలిగినన్ని గింజలు మాత్రం ఉన్నాయి. పాపం సింహాచలం, కొడుకూ ఎన్ని పస్తులున్నారో? పెళ్ళాన్ని తప్ప ఇంకెవరినీ ముష్టి అడుగలేని అవిటివాడు సింహాచలం. వాళ్ళు గుర్తుకు రాగానే గుండెలేచి గొంతుకలోకి వచ్చినట్టయింది రాజమ్మకి.

ఇంతలో ఆమె గదివైపు ఇద్దరు పోలీసులు వచ్చేరు.

ధైర్యం చేసింది రాజమ్మ. కటకటాల్లోనుంచి చెయ్యి బైటకు పెట్టి అదుక్కునేదాన్లా "బాబూ" అని పిల్చింది.

వెళ్ళిపోతున్న పోలీసులు వెనక్కి తిరిగేరు.

"ఏటి కావాల్తల్లీ!" అడిగేడు ఒకడు.

రాజమ్మకి సిగ్గు కంఠంలోకి పొంగింది. సాంప్రదాయాలకు సమయం కాదిది. అంచేత తెగించి అడిగింది "నా మొగుడు...."

"ఏ మొగుడు?" వేదాంతిలా నిర్లిప్తంగా అడిగేడు ఒక పోలీసు. రెండోవాడు ఆ హాస్యాన్ని అమితంగా మెచ్చుకున్నాడు. తన కటకటాల తలుపు గజం పీకి ఆ ఇద్దరు పోలీసుల గుండెల్లోనూ ఒక్కసారి పొడి చెయ్యాలనిపించింది రాజమ్మకి. కాని మండేగుండెని ఆశ లేతగా చుట్టుకుంది–అది భగ్గుమనేలోగా.

"బాబూ! సివంచలానికో కబురు..."

"ఉత్తరం రాస్తాది కాబోలు. ఓ కార్డివ్వరా."

"ముండలకీ, మొగుళ్ళకీ ఉత్తరాలు మొయ్యడానికే మాఁవుఁ, పోలీసోళ్ళం ఉన్నావఁనుకుంటున్నావా? పోస్టుమేన్లనుకుంటున్నావా?"

పోస్టుమాన్లు కాని పోలీసోళ్ళు వెళ్ళిపోయేరు.

రాజమ్మ పిడికిలి బిగించి రాతిగోడని బలంగా గుద్దింది. రాయి కందింది. పిడికిలి పగిలింది.

సాయంత్రం సూర్యుడు జోరుగా దిగిపోతుంటే విషపు పొరలా నీడలు ప్రాకుతూ ప్రపంచాన్ని చుదుతున్నాయి.

రాజమ్మనీ, ఇతర ఖైదీలనీ పోలీసులు భోజనానికి బైటకు తీసుకువచ్చేరు.

కాళ్ళూ చేతులూ కడుక్కుని గంజిగిన్నె తీసుకుంది రాజమ్మ. జైల్లో చీకటిగా ఉన్నా హాలుబైట ఎంతో వెల్తురు వుంది.

గిన్నెలో చెయ్యి పెట్టేముందు గంజిలోకి చూసింది రాజమ్మ.

గంజిలో, తనే చచ్చి దెయ్యమైనట్లు తన మొహం కనిపించింది ఆమెకు. కొద్దిరోజుల్లో ఎంత మార్పు?

గిన్నె నుండి చూపు తప్పించి దూరంగా చూసింది రాజమ్మ.

దూరంగా గేటు దగ్గర పోలీసులకు లంచం ఇస్తున్న తన గూడెం మనిషి మాణిక్యం కనిపించింది ఆమెకు.

చచ్చిపోయిన అమ్మా, అత్తా కలిసి ఒక్కసారి ప్రత్యక్షం అయినట్టనిపించింది రాజమ్మకి.

"మాణిక్కెం" అంటూ గేటు దగ్గరికి పరిగెత్తింది రాజమ్మ. ముసలి మాణిక్యానికి చూపు ఆనదు. అంచేత ఆమె "ఎలాగున్నావ్ మాణిక్యెం" అంటూ తనని కౌగిలించుకున్న రాజమ్మని పోల్చుకోలేకపోయింది ఎన్నేళ్ళ క్రిందటో తప్పిపోయి దొరికిన కూతుర్ని కౌగిలించుకున్నట్టు రాజమ్మ మాణిక్యాన్ని నలిపేసింది.

"ఎవరమ్మా నువ్వు?"

"నేనే రాజమ్మని."

"నువ్వా రాజమ్మా, ఏటా.... గొంతుకేటి, అలా ముసిలి గొంతుక అయిపోనాది. నాను పోల్చుకోలేక పోనాను."

"మనసే ముసిల్దయిపోనాది" అనలేదు రాజమ్మ.

"మాణిక్కెం....."

"..............."

"మాణిక్కెం"

"............."

"మా మాఁవా! .... మాఁవా, బొట్టుడూ ఎలా గున్నారు? ఆళ్ళు రాలేదేం? నన్నిక్కడికి తీసుకొచ్చినారని ఆళ్ళకి తెల్దా?"

"................."

"రేపు ఒక్కసారి అంపు. ఆళ్ళనొక్కసారి జూస్తే నాను పడ్డ కష్టాలన్నీ కనబడవ్. మళ్ళీ బతుకుమీద ఆశ పుదుద్ది......"

"..........."

"పోనీ ఇప్పుడు నువ్వెల్లగానే అంపుతావా మానిక్కెం? ఇప్పటికెన్నాళ్ళయినాదో తెల్దు. ఆళ్ళు తిన్లేదేమో నన్న బయం తప్ప, నాను తిన్లేదన్న యిచారం నాకులేదు. కాళ్ళులేని మొగుడు – కాళ్ళున్నా యీ దురుమారగపు ప్రెపంచికంలో నడవలేని

కొడుకు–సెయ్యని కూనీ....ఎనక జనమలో ఏ తల్లినీ పిల్లనీ యిడదీసేనో...ఏ మొగుడూ పెళ్ళాలకి యిసంపెట్టి సంపేసి నానో....తెల్దు మాణిక్యం .... గాని ఈ జనమలో... కొడుకుని పెట్టుకోవల్సిన కడుపులో దుక్కవేఁ దాచుకున్నాను. నాను సేసిన తప్పేంటో తెల్దు. మోకాళ్ళమీద బతకాల్సినదాన్ని పాదాలమీద నడిచేను. అదే నేరమని తెలవదు. నూరేళ్ళూ బతుకుదా మను కున్నా.... ఈ ప్రెపంచకంలో. అదే తప్పని తేలిలేదు. దేవుడిచ్చిన వొళ్ళు వంచి బతకడం తప్పని తెలలేదు. మాణిక్యం! తెలనేదు. వొండుకున్న అన్నం తినడం తప్పనుకోలేదు. ఈ ప్రెపంచకంలో బీదదాన్నవడం తప్పేకాదు. పాపం కూడా....ఈ గోరాలు సూస్తున్న సూరుడు – ఒక్కపాలి ఈ పెపంచకాన్ని ఎందుకు భగ్గుమనిపించీండో...తల్లి గోదారి ఎందుకు ముంచీదో, తల్లి బూదేవి తిరిగి మనందర్నీ ఒక్కపాలి తనలో ఎందుకు కలు పీసుకోదో–" ఆవేశంతో ఊపిరి ఆడక ఒక్కసారి ఆగిపోయింది రాజమ్మ. తెలియకుండానే కళ్ళనుండి కారిపోతున్న కన్నీళ్ళు ఆ సూర్యాస్తమయవేళ ఎఱ్ఱవెలుగులో రక్తపుచారల్లా ఉన్నాయి.

"సెప్పు మాణిక్యం....నా మొగుడూ, పిల్లడూ ఎలాగున్నారో సెప్పు...ఆళ్లు బాగుంటే బుగ్గి అయిపోయిన నా బతుకు–"

"ఎలా సెప్పేదే నా తల్లీ" తన కూతురి మొగుడూ, కొడుకూ ఒక్కసారే పోయేరని కూతురుతోనే చెప్పవలసివచ్చిన తల్లిలా కుమిలి పోతోంది మాణిక్యం.

"సెప్పు ఆళ్ళు బాగున్నారా–బతికున్నారా–బతికుంటే సాలు ఎలాగున్నా పరవాలేదు. సెప్పు" మాణిక్యం రెండు జబ్బలూ గట్టిగా పట్టుకుని కుదిపేసింది రాజమ్మ. ఆమె లోహపు పట్టుకి ముసలి ఎముకలు పటపట లాడేయి.

"ఎలా సెప్పేదే నా తల్లీ–కొంపపోయిన కూతురితో, కుంకం కూడా పోనాదని–

"సచ్చిపోయేరా?" మాణిక్యం చేతులు నిర్జీవంగా వదిలేసింది రాజమ్మ.

"లేదు. సచ్చిపోలేదు."

"ఎక్కడున్నారు?"

"తెల్దు."

"ఊళ్ళో ఉన్నారా?"

"నిన్నట్టు గెల్చిన పొద్దే నువ్వు దొరని సంపేసినావని నీ మొగుడ్ని గూడెం వాళ్లు గెద్దల్లా పొడిసీసినారు...ఆ రేత్తిరే ఆడు బొట్టుడ్ని తీసుకొని కుంటుకుంటూ ఎలిపోనాడు....ఏ వూరెల్లి పోనాడో తెల్దు...."

ఒక్కసారి తన పేగుల్ని తీసి తన ముందే ఎవరో కాలుస్తు న్నట్టు అనిపించింది రాజమ్మకి. వెంటనే తనలోంచి తనకి ఎంతో పరిచయమున్న ఎవరో విడివడి తన కళ్ళముందే నడిచి వెళ్ళి పోతున్నట్టనిపించింది. తను ఒక్కసారి గేటుదాటి పారిపోబోతే, పక్కనున్న పోలీసు తుపాకీతో పేల్చేస్తాడు. తనకు ఆ క్షణంలో చావే తల్లి. చావు వొడిలో పెట్టుకుని వెక్కి వెక్కి ఏడిచి కళ్ళు మూసుకోవాలన్న కోరికను ఆమె జయించలేక పోయింది.

అంతలో ఎక్కడనుంచో వచ్చిన పోలీసు ఆమె చెయ్యి పట్టుకున్నాడు. "నీ కోసమెవరో దొరొచ్చేడు పద" అని ఆమెను జైలు ఆఫీసుకు తీసుకువెళ్ళాడు.

# 94

ఆఫీసు ట్యూబ్‌లైటు చచ్చిన పామును తిరగేసి సాగదీసి నట్టుంది.

ఆగని పాము బుసలా ఉంది ఫ్యాన్ చప్పుడు.

ప్రాణాలులేని మనుషుల్లా ఉన్నారు, ఎటెన్షన్‌లో నిలబడ్డ పోలీసులు.

చర్మంలేని మనిషిలా వున్నాడు దొర. పొరలో ఉన్న పాములా వున్నాడు తెల్ల టెర్లిన్ పాంటూ, షర్టూ వేసుకొన్న అతని దుబాసీ.

"మిసిజ్ రాజమ్మా హౌ డు యు డూ" అంటూ దొరే పలక రించేడు. తను ఒక పత్రికా ప్రతినిధినని పరిచయం చేసు కున్నాడు. అతను చెప్పేదు రాజమ్మతో. చంపివేయబడిన జే.జే. తన దేశపు ప్రముఖుల్లో ఒకడని.

ఆ తర్వాత కేసు గురించి చాలా విషయాలు అతను ఆమెతో మాట్లాడేడు.

"నీకు ఏదైనా రాజకీయపార్టీ బలం ఉందా" అని అడిగేడు.

"అంటే ఏటి బాబూ!"

తర్వాత తన పత్రిక తరఫున ఆమెకు ఒక ప్రతిపాదన చేసేడు. ఆమె తన జీవిత విశేషాలు చెప్పి తమ పత్రికలో ప్రచురించనిస్తే పదివేల రూపాయలు ఇస్తానన్నాడు. ఇదివరలో అనేకమంది తన దేశపు నేరస్తుల జీవితాలు ఇవే షరతులమీద ప్రచురించినా,

భారతదేశంలో ఇటువంటి ప్రతిపాదన ఇదివరకు ఎవ్వరికీ చెయ్య లేదనీ, ఆ ప్రాముఖ్యత రాజమ్మకే దక్కుతుందనీ ఆమెను కొని యాడేడు. తన పత్రిక ఇచ్చిన డబ్బులో సగం డబ్బుతో పెద్ద ప్లీడరుని పెట్టుకొని కేసు కొట్టించేసుకోవచ్చుననీ, మిగిలిన డబ్బుతో హాయిగా బతకవచ్చునీ హామీ ఇచ్చేడు. తన మాట కాదంటే రాజమ్మకి బహుశా ఉరికూడా పడవచ్చని బెదిరించేడు. అతను చెప్పినదంతా శాంతంగా వింది రాజమ్మ.

విని ఆఖరున "కాని బాబూ నాదో సిన్నమాట."

"ఏఁవిఁటది?" రాజమ్మ దారికి వస్తున్నందుకు అతను సంతోషంగా అడిగేడు.

"మీ డబ్బూ వద్దు, మీ బ్రతుకూ వద్దు. సేతనైతే సెప్పి ఉరే యించి పెట్టు బాబూ" అంటూ గిర్రున తిరిగి చీకటి వరండాలోకి నడిచి వెళ్ళిపోయింది.

చీకటి ఆమెను తల్లిలా కౌగలించుకుంది.

## ఆఖరిమాట

రాజమ్మ ఏమైంది? ఆమెకు ఉరిశిక్ష పడలేదా? కోర్టుల్లో న్యాయం దొరుకుతుందా? రాజమ్మ 'పేట్' తేల్చకుండా వది లేసేరేం? ఇలా నన్ను కొంతమంది అడుగుతూనే ఉన్నారు.

రాజమ్మ నాకు తెలీదు, ఆమెను నేను ఎప్పుడూ చూడలేదు. కాని ఆమెకంటే-నిర్భాగ్యులూ, దరిద్రులూ నాకు తెలిసిన మేరకే చాలామంది ఉన్నారు. ఆమె బతుకులో ఒకప్పుడైనా వెన్నెల జల్లులూ, పూల వర్షాలూ ఉన్నాయి. బతుకంతా చీకటి గతుకుల్లో గడుపుతూ, ఒక పచ్చని జ్ఞాపకం కూడా లేకుండా-చీకట్లో తలకిందులుగా గబ్బిలాల్లా బతుకులు బతుకుతున్న వాళ్ళకంటే ఆమె నయం, చాలా నయం. "డబ్బే దేముడు, డబ్బే దెయ్యం, డబ్బే మోక్షం" అనుకొని బతికే సంఘానికి వచ్చే పెద్దజబ్బుకు ఆమె కేవలం ముందు మచ్చ మాత్రమే.

విప్లవానికి ముఖ్యంగా కావలసిన మూడింటిని చెప్పమంటే ఒక ప్రఖ్యాత విప్లవ నాయకుడు "మొదటిది తుపాకులు, రెండోది తుపాకులు, మూడవది తుపాకులు" అన్నాట్ట.

ఈవేళ ఈ దేశంలో బతకాలంటే ముఖ్యంగా కావలసినవి మూడు. "మొదటిది డబ్బు. రెండోది డబ్బు, మూడోది డబ్బు." పసిపిల్ల పుట్టినప్పుడు మంత్రసానికి డబ్బు అక్కర్లేదు అని ఎవరేనా అనొచ్చు. ఆ మాట మంత్రసాని దగ్గర అనమనండి. పసిగుడ్డుకు రాసే మొదటి చెంచా ఆముదం దగ్గర నుంచీ, చచ్చేక కాల్చే ఆఖరి కర్రవరకూ ఏదీ డబ్బులేందే రాదు.

అన్ని దేశాల్లోనూ, అన్ని యుగాల్లోనూ డబ్బు ఉందని సమా ధానపడిపోయే వాళ్ళకి ఒకటే మాట. ప్రపంచంలో ఏ దేశం లోనూ, ఏ యుగంలోనూ డబ్బుకి ఇప్పుడు మన దేశంలో ఉన్న విలువ లేదు. డబ్బులేక ఇప్పుడు మనదేశంలో ఆకలి పశువుల్లా బతుకుతున్నంత మంది ప్రజ ఏ చోటా ఏ కాలం లోనూ లేరు. దేశం తిండి విషయంలో స్వయం పోషకమైంది అంటారు. మరైతే అంతమందికి తిండి దొరకదేమనేదే నా ప్రశ్న. ఉన్న తిండి అంతమందికి దక్కాలనేది గొంతెమ్మ కోరిక కాదు.

ఉన్నది అంతమందికి చెందాలంటే ప్రస్తుత వ్యవస్థ మారాలి. పూర్తిగా మారిపోవాలి. ఈనాటి పరిస్థితుల్లో బీదవాడు దౌర్భా గ్యుడు అయిపోతున్నాడు. దౌర్భాగ్యుడు దరిద్రుడు అయి పోతున్నాడు. దరిద్రుడు ఆకలితో చస్తున్నాడు.

కాబట్టి ఈ వ్యవస్థ మారాలి. ఇప్పుడున్న పరిస్థితులు పోవాలి. మన మనసుల్ని చుట్టుకున్న నమ్మకాల బూజులు తెగిపోవాలి.

ఆకలి కవులుపాడే మరో ప్రపంచం వస్తుందా? మనుషులు తమకు తామే తగిలించుకున్న నమ్మకాల ఇనుప గొలుసుల్ని వదులు కోగలరా? నీరు కారిపోతున్న దైర్భాగ్యపు జాతి ఇంకా కనిపించని పాతాళ లోతులకు దిగజారిపోతుందా? ఇలాంటి నిరాశ నాకు ఎప్పుడూ రాదు. తూర్పు ఎర్రబడింది. యువతరం మనసుల్లోంచి నెత్తురు ప్రవేశించింది.

మనది "పుణ్యభూమి." సీతలూ, సావిత్రులూ పుట్టేరని "పుణ్య భూమి" అని అనడం లేదు. ఈ దేశం ఏ కొత్త "దేముడు" వచ్చినా గుండె విప్పి అందులో ప్రతిష్ఠ చేసుకుంది. ఏ కొత్త మతం వచ్చినా చేతులు చాచి ఆహ్వానించింది. కాబట్టి కొత్త సిద్ధాంతాన్ని ఆమోదిస్తుంది. కొత్త కలలు కంటుంది. కొత్త మలుపులు తిరుగు తుంది. కళ్ళు తెరుస్తుంది.

జైహింద్

– బీనాదేవి

**(1980)**